

# అనంత యాత్ర
## ద్వితీయ భాగం

**పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్, కస్తూరీ బహెన్‌ల**

**ఉత్తర ప్రత్యుత్తరాలు**

**9 ఏప్రియల్ 1952 నుంచి 31 అక్టోబర్ 1953 వరకు**

**ఉత్తరం సంఖ్య 206 నుంచి 350 వరకు**

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - **9440652774**

కె. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# అనంత యాత్ర - ద్వితీయ భాగం
## ఉత్తరం సంఖ్య - 206

లఖీంపుర్,
09.04.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక వందనం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందని ఆశిస్తున్నాను. ఇక్కడ అంతా కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. చాలా రోజులుగా తమ నుంచి ఉత్తరం ఏమీ రాకపోవటం వలన అప్పుడప్పుడు కొంత దిగులుగా ఉంటుంది. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి నిర్వహణలో 13వ తారీఖున వారి ఇంటివద్ద మన మిషన్ ఉత్సవం జరుగుతుంది. తమరు కూడా విచ్చేయగలరని అందరూ ఆశిస్తున్నారు. అది విని నాకు ఆనందం కలిగింది. దయచేసి 'తమరు' వస్తున్నట్లయితే, మాయా, ఛాయలకు పరీక్షలు ఏమీ లేకుండా ఉన్నట్లయితే వారిని కూడా వెంటబెట్టుకుని రాగలరు. సోదరుడు మరియు ఉమేష్‌ను కూడా వెంట తీసుకురాగలరు. పెద్దవాడైన దద్దా తమకు తోడుగా ఉంటారు కనుక తమకు కష్టం ఏమీ అనిపించదు. అమ్మగారిని (బాబూజీగారి ధర్మపత్ని), బిట్టో మరియు ప్రతిభను కూడా వెంట తీసుకురండి. ఇక్కడ ప్రదర్శన ఏర్పాటై ఉంది; అందరితో పాటుగానే నేను కూడా వెళ్తాను. పూజ్య బాబూజీ, తమకు కష్టము అని అనిపించకుండా, ఎలా సౌకర్యంగా ఉంటుంది అనుకుంటే అదే విధంగా తమరు ఆచరించండి. 'మాలిక్' దయతో నాలో అనుభవమైన ఆధ్యాత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, నాకు సుషుప్తి అవస్థలో మనస్సును ఎప్పుడూ నిద్ర ఆవరించి ఉన్నట్లు అనిపిస్తోంది; 'తమ్'లో కూరుకుపోయి తనను కోల్పోయినట్లుగాను అనిపిస్తోంది. మరొక రకంగా చెప్పాలంటే, నన్ను విడిచి నేను ఎక్కడో, నాకు తెలియనిచోట ఎప్పుడూ బయటనే ఉంటున్నట్లు అనిపిస్తోంది. అయితే ఈ సుషుప్తి లేదా తమ్ స్థితిలో ఎంతో కొంత చైతన్యం ఉంటున్నట్లుగానే అనిపిస్తోంది. దాని మూలంగా శరీరం పూర్తిగా అచేతనం కాకుండా ఉంటున్నది. అలా జరగకపోతే శరీరం ఎప్పుడో అచేతనమై ఉండిపోయేది. నేను తమ్ అవస్థలోనే ఎప్పుడు నిద్రిస్తున్నట్లుగానే ఉంది. సుషుప్తి స్థితిలోని అచైతన్యం మూలంగానే దశ యొక్క అనుభవం కలుగుతోంది. ఇది ఎంత స్వాభావికంగా అయిపోయింది అంటే, అది ఒక రోజువారి అలవాటుగా తలపిస్తోంది. ఇప్పుడు నాకు ఈ దశ తెలియకుండా పోయింది. ఎప్పుడైనా ఈ చైతన్యం మూలంగా జ్ఞాపకం వచ్చినప్పుడే, ఈ దశ సంగతి తెలుస్తోంది. ఇప్పుడైతే దీని జ్ఞాపకం కూడా చాలా అరుదుగానే వస్తోంది. అలా కాకుంటే దీనిని పూర్తిగా మరచిపోయేదానను.

పూజ్య శ్రీ బాబూజీ, తమ ఉత్తరం ఒకటి ఇప్పుడే చేరింది, దానిని చదివి చాలా ఆనందించాను. "నేను ఏమరుపాటుగా ఉన్నాను" అని తమరు నా విషయమై చెప్పారు (అనగా బాబూజీ ఆమెను గురించి పట్టించుకోనట్లుగా తాము ఉన్నట్లు చెప్పటం). అయితే నేను ఏమి చెబుతాను అంటే, తమ కృపవల్లనే అడుగడుగునా నాలో వెలుగు నింపారు, అలాగే సదా నింపుతూ ఉంటారు. దీనిలో సందేహం లేదు. నాలో ఎటువంటి అల్పమైన ఆత్మిక దశ అయినాగాని ఆరంభమైంది అంటే దాని మూలంగానే, అది తమ యొక్క అపారకృప మూలంగానే. సూర్యకిరణాలు సోకటం ద్వారా ఇసుక రేణువులు కూడా స్వచ్ఛమైన ముత్యాలులాగా మెరుస్తూ ఉంటాయని చెబుతూ ఉంటారు. నా విషయంలో కూడా అటువంటిదేకాని ఇంకేమీ కాదు. అయితే బాబూజీ, నా దృష్టి మాత్రం ఆ సూర్యునిలోనే తదేకమై పూర్తిగా లీనమైపోయింది. నాకయితే 'దాని' (సూర్యుడు)తోనే పని ఉంది, ఉంటుంది కూడా. కొన్ని రోజులుగా తమ ఆరోగ్యం బాగుండలేదేమో అని నాకు అనిపిస్తోంది. అందుచేత ఉత్తరం కోసం ఆతృతగా ఎదురుచూస్తూ ఉన్నాను, ఏదైనా సమాచారం తెలుస్తుందేమో అని. కారణమైతే తెలియదు; నా ప్రార్థన మరియు సేవ తమకు ఎటువంటి ఫలితం చేకూర్చలేకపోతాయా? నన్ను ఏదైనా ఆదేశించండి, దానిని చేయటానికి నేను సంసిద్ధంగా ఉన్నాను. ఈ

పరిస్థితి ఉంటే 'తమరు' ప్రయాణం చేయవద్దు. ఆరోగ్యవంతులయ్యాక, జూన్‌లో తప్పకుండా రాగలరు. 'తమరు' ఒకసారి, గ్రుడ్లుతో ప్రయోజనం ఉంటుంది అని చెప్పి ఉన్నారు. అందుచేత వాటిని సేవించండి, వాటిని ఎక్కువగా వాడినట్లయితే, అశక్తి తొలగిపోతుంది. మరైతే నేను కూడా గ్రుడ్లతో మంచి సూప్ తయారు చేయటం నేర్చుకుంటాను. దైవం 'తమరి'ని త్వరగా ఆరోగ్యకరంగా చేయాలి. పూజ్యులు తావూజీ కొరకు 'తమరు' ఏమైతే వ్రాశారో దానిని నాకు సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 207

షాజహాన్‌పుర్,

11.04.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం చేరింది. దానితో ఓదార్పు చెందాను. నాకు ఉన్న తపన అంతా జనులు వీలైనంత ఎక్కువ ప్రయోజనం పొందాలి అని. **ఎప్పుడైనా నాకు ఇంకొక ఆలోచన ఏమి కలుగుతుంది అంటె, నాకు ఉన్న జ్ఞానం, శక్తి అంతటినీ పంచిపెట్టకుండా నా ఒడిలోనే దాచుకుని ఈ ప్రపంచాన్ని వీడిపోకూడదు అని. కొంతమంది పిరికిపందల ఆలోచన ఎలా ఉంది అంటే, నేను ఎప్పుడు తలిస్తే అప్పుడు ఒక్క నిమిషంలో ఏమైనా చేసివేయగలను అని. నా ప్రార్థన మూలంగాను, నా గురుమహరాజ్ ఆశీస్సుల మూలంగాను నేను ఒక్క నిమిషకాలంలో అలా చేసినట్లయితే, అభ్యాసీ ఒక ఉన్నత స్థాయికి చెందిన సెయింట్ కాగల్గటం మినహా ఇంక దానికిమించి ప్రయోజనం ఏమీ ఉండదు. ఆ విధంగా అత్యంత శక్తిని ప్రయోగించినట్లయితే ఆ ఫలితం దక్కవచ్చును కాని, ఆ సందర్భంలో మృత్యువు అనివార్యం అవుతుంది. అభ్యాసీ ఎప్పుడైతే ఆ మార్గాన్ని, దాని మిట్టపల్లాలను తన స్వంత పరిశ్రమ (కృషి)తో చూడలేకపోతాడో ఎప్పటివరకైతే ప్రతిస్థితి యొక్క ఆధిపత్యాన్ని పొందలేకపోతాడో, అప్పుడు ఏదైనా ముఖ్యస్థితిని ఇతరులలో కల్పించవలసి వచ్చినప్పుడు అతడు సాహసించలేక పోతాడు. ఏ స్థితినైనాసరే, ఎవ్వరికైనా సరే ప్రసాదించటానికి నాకు సంపూర్ణ ఆధికారాన్ని నా గురుమహరాజ్ నాకు ప్రదానం చేశారు. అది 'వారి' ఘనత. 'వారి' కృపతో నేను దానిని పొందగలిగాను. దాని ఫలితంగా నాకు ప్రతిస్థితి యొక్క పరిజ్ఞానం ఉండటం వలన ఆ స్థితులను ఎవ్వరిలోనైనా కల్పించ బడుతుంది. వాస్తవం చెప్పాలంటే, ఈ విద్యను గ్రహించటానికి సరియైన జిజ్ఞాసులు దొరకటం లేదు. కృషి, ప్రేమ మరియు భక్తి, అంకితభావంతో ఎవ్వరైనా సాధనచేసి ఉంటే దాని మహత్తుని చవి చూసేవారు.** మిషన్ అభివృద్ధి చెందటం తథ్యమే కాని దానిని నా జీవితకాలంలో చూడాలని ఉంది. అభ్యాసుల్లో ఆ స్థితులను కల్పించే ప్రయత్నం చేయగలిగేవాడిని, కాని ఇప్పుడది అంత శీఘ్రంగా సమీప భవిష్యత్తులో సాధ్యపడదు.

నీ ఉత్తరం చదివిన తర్వాత నీకు కలిగిన స్థితులన్నీ తెలిసాయి. ఈ 'అంధకార స్థితి' ఇంతకుపూర్వమే ఏర్పడి ఉంటుంది కాని నా తొందరపాటు వలన నీకు అది అనుభవం కాలేదు. ఇది ఈ స్థితి యొక్క ఒక మసకబారిన రూపం, చాలా సూక్ష్మమైనది కూడా. ఇప్పుడు ఈ స్థితి ఇంకను అభివృద్ధి చెందుతుంది. ఇంకా అసలైన సత్యత్వం దూరంగానే ఉంది. నాలో ఇటువంటి స్థితి కలిగినట్లు నాకు జ్ఞాపకం ఉంది. కాని ఈ ఉత్తరం వ్రాయించే సందర్భంలో ఆ స్థితి మళ్ళీ నా కళ్ళెదుట కనిపిస్తోంది. ఒక చక్రం మీద ఒక స్థితి కలిగినపుడు అది సూక్ష్మరూపం చెంది, ప్రతిచక్రంలోను అనుభమవుతూ ఉంటుంది. షట్చక్రాలను గురించి మనం వినే ఉంటాం. లయావస్థ, లయావస్థ

యొక్క లయ మరియు బకా (శాశ్వతత్వం) కూడా నీకు ఆ సర్వేశ్వరుని కొలువు నుండి ఎప్పుడో అనుగ్రహించబడ్డాయి. ఇప్పుడు ఆ బకా స్థితి యొక్క లయ–అవస్థ కలుగుతోంది. ఇంకను ఇటువంటి బక స్థితులు, వాటి లయ–అవస్థలు ఎన్ని కలగనున్నాయో వాటికి అంతులేదు. నిజమైన సాధకులకు ఇంకను పొందవలసిన స్థితి అంటూ ఏదీ లేనప్పుడు మాత్రమే శాంతి సమకూరుతుంది. ఒకవేళ నేను, పదహారు వలయాలు, సప్తవలయాలు దాటిన తరువాత శాంతి చేకురుతుంది అని చెప్పినట్లయితే, ఆ శాంతి ఏ స్థితిలో కూడా శాంతిని సమకూర్చలేదు. ఈ అపూర్వ ఆవిష్కరణ, జీవించి ఉండియే సాధించగలిగి నందుకు, ఆధ్యాత్మిక చరిత్ర మన లాలాజీని అభినందించవలసి ఉంటుంది. నేను జనులందరూ ఈ స్థితులను దాటి పోగలగాలని కోరుకుంటాను కాని అది అంతటితో సరిపోదు. ఇది ఈశ్వర కృపవలన, 'అతడు' ఎవ్వరికి ఇవ్వదలిస్తే వారికి ప్రాప్తమవుతుంది.

నీ సోదర సోదరీలకు శుభాశీస్సులు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 208

షాజహాన్‌పుర్,

13.04.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం అందింది, చదివి సంతోషించాను. దానిలో అన్ని విషయాలకు సమాధానం స్వయంగా నీవే ఇచ్చావు. నీ ఉత్తరంలో, "ఆ సూర్యుడు (మాలిక్)ను నిరంతరం వీక్షించటంలోనే నా దృష్టి లీనమై పోయింది" అని వ్రాశావు. దానిని నీవు 'సుషుప్తి' అని అన్నావు. అయితే అది 'సుషుప్తి' కాదు కాని 'మరుపు స్థితి' అవుతుంది. **ప్రతిస్థితిలోను ఒక లయావస్థ కలుగుతుంది.** అప్పుడు దానిలో అంతర్లీనమవ్వటం మూలంగా ఆ మండలంపై నీకు పూర్ణ అధిపత్యం దక్కుతుంది. ఇప్పుడు నీకు కలిగింది అదే స్థితి. **మానవుని ముందుగతిలో (ప్రస్థానంలో) సుషుప్తి అనేది ఎక్కడైనా ఉంటుంది కాని మన పురోగమనంలో అది సూక్ష్మాతి సూక్ష్మంగా అవుతూ ఉంటుంది. అది ఉన్నత స్థాయికి చేరినపుడు దానిని 'తురీయ' అని అనవలసి ఉంటుంది.** నా ఆలోచనలో ఉన్నటువంటి ఉన్నత స్థితులు గురించి నేను ఇప్పుడు స్వయంగా వ్రాయలేకపోతున్నాను.

అమ్మగార్కి ప్రణామాలు, పిన్నలకు ఆశీస్సులను అందజేయి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 209

లఖీంపుర్,

16.04.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరాలలో ఒకటి నిన్న, మరొకటి ఈ రోజు చేరాయి, వాటిని చదివి చాలా ఆనందించాను. తమ యొక్క దయ గురించిన ధన్యవాదాలు తెలపడం ఎలా? వాస్తవానికి, హృదయపూర్వకంగా తమకు ధన్యవాదాలు అర్పించటం ఎవ్వరికైనా అరుదుగా అనిపించినప్పటికీ, **ఎవ్వరికైతే తనపైన 'మాలిక్' యొక్క దయ వర్షిస్తుందో అలాంటి వారికి అది కష్టమనిపించదు. శ్రీ బాబూజీ, నిజం చెప్పాలంటే,**

**'శిక్షకుడు', 'శిక్షణ పొందేవారు'గా లాలాజీ మరియు మీ వంటి జోడీని మీ విషయంలోనే చూశాను, అది సాటిలేనిది. ఆధ్యాత్మిక విద్యను అభ్యసించ దలచినవారికి ఇప్పుడు ఉన్న ఇటువంటి సదవకాశం మళ్ళీ రాదు. బాబూజీ, కోటాను కోట్ల దేవుళ్ళు కూడా ఇటువంటి 'మాస్టర్' ముందు తీసికట్టే / దిగదుడుపే.**

నిన్న జరిగిన ఉత్సవం, పూజ్య మాస్టర్ సాహెబ్ ఇంటివద్ద మిషన్ యొక్క స్థాపకదినోత్సవాన్ని గురించి ఏమని వర్ణించగలను! అంతా 'మాలిక్' యొక్క కృపయే. నేడు తమ స్వహస్తంతో వ్రాసిన హిందీ ఉత్తరం చదివి చాలా ఆనందించాను. హిందీలో కూడా తమరు బాగానే వ్రాస్తున్నారు, కాని ఈ విషయం నాకు తెలియదు. మాంసం, చేపలు తినడం పాపమనిపించదు అని తమరు బాగానే వ్రాశారు, అయితే అది పాపం ఎప్పుడు అవుతుంది? 'మాలిక్' (భగవంతుడు) మినహా మనం దానిని పాపం అనుకుని చేస్తే పాపమవుతుంది. పూజ్య శ్రీ బాబూజీ, ఉపన్యాసాలలోనయితే "తనను గుర్తించటమే జ్ఞానం" అని చెప్పబడుతుంది. కాని పరిశీలించి చూసినట్లయితే ప్రతి మనిషిలోను ఇటువంటి జ్ఞానం ఉండవచ్చు. అయితే **నా ఉద్దేశ్యంలో మాత్రం అజ్ఞానిగా ఉండటమే అన్నింటికీ మించిన యదార్థ జ్ఞానమని భావిస్తాను. 'మాలిక్'ను తెలుసుకొనగలగటమే అసలైన జ్ఞానం.** పైన చెప్పబడిన జ్ఞానం నాకు ఎంతమాత్రమూ మంచిదని అనిపించటం లేదు. ఎందుకంటే, అజ్ఞానిగా కాకుండా అసలైన జ్ఞానం కలగనేరదు. నాకైతే ఇదే నచ్చుతుంది, అటుపైన తమకే ఎరుక. మిషన్‌లో, ఎవ్వరైనా స్వచ్ఛమైన అభ్యాసి అయి ఉంటే, తమవద్ద బ్రహ్మవిద్య ప్రారంభిస్తూనే తన భారాన్ని తొలగించుకుంటూ పోతాడు. తమరు నన్ను "నీవు నాకు చెబుతున్నావు కాని నీవు మాత్రం పాపంలో భాగస్వామ్యం వహించటం లేదా?" అని ప్రశ్నించారు. అయితే నేను ఇప్పుడు దీనిని లక్ష్యపెట్టటం లేదు. పాప పుణ్యాలు, శుభాశుభాలు, మంచి చెడులు వంటి వాటిని, ఏరోజు అయితే 'మాలిక్' నాకు ఇష్టమనిపించారో ఆనాటి నుంచి వదిలిపెట్టాను. శ్రీ బాబూజీ, నిజం చెప్పాలంటే, అప్పటి నుంచి నేను నిత్యకృత్యాలు నెరవేర్చానా, లేదా అనిగాని, నిద్రించానా లేదా మేల్కొన్నానా అనిగాని, శ్వాస జరుగుతున్నదా లేదా అనిగాని, జీవించి ఉన్నానా లేదా మరణించానా అనిగాని ఏమీ జ్ఞాపకం లేకుండాపోయాయి. అటువంటప్పుడు ఇంక పాపపుణ్యాల ప్రస్తావన ఎలా వస్తుంది? ఒకవేళ నేను పాపినే అయి ఉంటే, **నా కొరకు కోట్లాది నరకాలు ప్రత్యేకంగా దండన కొరకు సృష్టించ బడినప్పటికీ, 'మాలిక్' దయతో, 'మాలిక్' యొక్క ముఖారవిందం నా కన్నులలో నిలిచి ఉన్నట్లయితే, సందేహం లేకుండా తప్పనిసరిగా నిలిచి ఉంటుంది కూడా, సమస్త కష్టాలు భరించటంలో నోటి నుంచి 'హా' అను శబ్దం కూడా వెలువడదని హామీ ఇస్తున్నాను. పూజ్య బాబూజీ, ఎవ్వరికైతే స్వర్గంమీద కోరిక ఉంటుందో అటువంటి వారికి నరకం భయంకరంగా అనిపిస్తుంది. 'మాలిక్' దయతో తమరు నన్ను తక్కువగా అంచనా వేయవద్దు. 'మాలిక్' పని కోసం ఒకవేళ శరీరం యొక్క తునకలు (ముక్కలు) అవసరమైతే, ఒక్క సంకేతంతో, నా స్వహస్తాలతో నా శరీరాన్ని తునాతునకలుగా చేసి అర్పించుకోగలను. వాస్తవంగా, పాపపుణ్యాలు, సుఖదుఃఖాలు, శుభాశుభాలు ఇవన్నీ కూడా కేవలం చెప్పుకోవటానికేగాని, యదార్థంకాదని మాత్రమే నాకు తెలుసు. కేవలం 'మాలిక్'యే రియాలిటీ (సత్యత్వం); 'అతడు' ఆ విధంగానే ఉంటాడు. సేవకుని దృష్టిలోకి స్వామి (మాలిక్) కాకుండా మరేదైనా వచ్చినట్లయితే నిజానికి అతడు సేవకుడే కానేరడు.** పూజ్య శ్రీ బాబూజీ, నేను ఏమేమి వ్రాశానో తెలియకుండా ఉన్నాను. అది మంచియో, చెడో తెలియదు. నాలో ఇటువంటివి ఏమైనా ఉన్నాయో లేదో, నాకు తెలియదు, తెలుసుకోవలసిన అవుసరం కూడా లేదనిపిస్తుంది. అది ఏమిటో 'మాలిక్'కు మాత్రమే తెలుసు, 'అతని' నిర్వాకానికి తెలుసు. నాకు ఎవరితో సంబంధం ఉండాలో 'అతని'తో మాత్రమే ఉంది. ఒకవేళ ఈశ్వరుడు కనుక నీ 'మాలిక్'లో ఈ గుణాలు లేవు కనుక నేను (దైవం) నీకు ఇస్తున్నాను అంటె అది నాకు ఎంతమాత్రమూ అంగీకారం కాదు అని చెప్పటం ఖాయం. శ్రీ బాబూజీ, 'అతని' అవ్యాజ ప్రేమయే నన్ను కొన్నందువల్లనే కాని మరే కారణమూ కాదు. తమరు ఇంతకుపూర్వం ఉత్తరంలో "ఒకటి సాధించినట్లయితే అన్నీ సాధ్యపడినట్లే" అని వ్రాసిన మాటలు నాకు సహాయం, శాంతి కలిగిస్తున్నాయి.

ఇప్పుడు 5,6 రోజుల నుండి స్థితిలో స్పష్టత రాకపోవటం వలన, ఆ స్థితి ఏమిటో తెలియటం లేదు. ఇంకొక విషయం ఏమిటంటే, శరీరంలో ఒక విధమైన మృత్యుస్థితి లేదా స్పృహ లేకపోవటం వంటి స్థితి కలుగుతూ ఉంది. వెనుకభాగంలో అనగా వీపుమీద వేలాదిగా కీటకాలు ప్రాకుతున్నట్లు ఎడతెరపిలేకుండా అప్పుడప్పుడు అనుభవమవుతోంది. అలా కాకుంటే, ఒక విధమైన చక్కలిగింతలాగానో లేదా అదరటంలాగానో నిరంతరం ఉంటోంది. ఇది వెన్నులోనే కాకుండా, అక్కడక్కడ ప్రక్కటెముకల్లో కూడా అనుభవమవు తోంది. అప్పుడప్పుడు లెక్కలేనన్ని శక్తులు నా ఎదుట కనిపిస్తూ ఉన్నాయి, నా లోపల కూడా అనుభవమవుతున్నాయి. అయితే వాటిని, నేను లెక్క చేయటం లేదు, సినిమా రీలులాగా వస్తూ పోతున్నాయి. 'తమ'కు మంచిదనిపిస్తే, దయచేసి ఈ ఉత్తరాన్ని మరెవ్వరికీ చూపవద్దు. ఆ తర్వాత తమ ఇష్టం. ఎలా తోస్తే అలా చేయండి. పూజ్య శ్రీ బాబూజీ, ప్రస్తుతం తమరు దయ ఉంచి నా పనిని గమనిస్తూ ఉంటే మంచిదని ప్రార్థిస్తున్నాను. ఎందుకంటే, ఇప్పుడు నాలో తామసీ అవస్థ కలిగినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు కర్తవ్యం, కర్తవ్యం లేకుండా ఉండటం గురించి కూడా శ్రద్ధ పెట్టలేకపోతున్నాను. తలవని తలంపుగానే అన్ని పనులు అప్రయత్నం గానే జరిగిపోతున్నాయి. నాలోని (Instincts) వృత్తులు, (Aspirations) చేష్టలు కూడా నిద్రాణమై పోయినట్లు అనిపిస్తోంది. ఇంకా స్థితి పరిశుద్ధంగా అనిపించటం లేదు. పూజ్య తావూజీకి చెందిన ఉత్తరంలో, సమర్థ మహాత్మా శ్రీ లాలాజీ సాహెబ్ సందేశం తమరు ఉదహరించిన దానినిబట్టి 'వారు' మన మొరాలకించకపోతే మరెవ్వరు ఆలకిస్తారు. లాలాజీ గార్కి లక్షలాదిగా ధన్యవాదాలు అర్పిస్తున్నాను. 'వారి'కి ఈ దీనురాలి నివేదన ఏమిటంటే, దయ ఉంచి 'వారు' తమ ఆరోగ్యాన్ని సంరక్షించాలి అని.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 210

లఖీంపుర్,
23.04.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది. తమ ఆరోగ్యానికి కొంత ఉపశమనం కలిగిందని తెలిసి చాలా సంతోషం కలిగింది. నా ఆరోగ్యం కూడా క్రమంగా బాగుపడుతోంది, దాని గురించి చింతించాల్సిన పనిలేదు. ఒక డాక్టర్ దానిని దగ్గు మూలంగా అని చెప్పగా, మరొక డాక్టర్ దానిని తీవ్రమైన ఉపిరితిత్తుల జబ్బు (బ్రాంకైటిస్) అని చెప్పారు. అయితే 2,3 గంటల్లోనే దాని నుంచి విశ్రాంతి కలిగింది. ఇప్పుడు శ్వాస పరిస్థితి దాదాపు బాగుపడింది కనుక విచారించాల్సిన పనిలేదు. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను నాకు అవగాహనకు వచ్చినంతలో వ్రాస్తున్నాను.

బాబూజీ, అదేమిటో తెలియదు కాని, నేను ఏ స్థితిలో ఉన్నానో లేక ఉంటున్నానో, దానికిమించి ఉన్నతమైన స్థితియే నా దృష్టికి వస్తున్నట్లు ఉంది. రెండు, మూడు రోజుల నుంచి స్థితి చాలా స్వచ్ఛంగా ఉన్నట్లు అనిపిస్తోంది. శరీరం యొక్క సర్వ అవయవాలు, అన్ని ఇంద్రియాలు శాంతించి దేనిలోనో విలీనమైపోయినట్లు అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు నాలో ఏమి లేనట్లుగానే నాకు అనిపిస్తోంది. అది ఎంత అమాయకమైనది, సరళమైనది అంటే అది చెప్పనలవి కాదు. నేను ఏమి ఎరుగనట్లుగాను, నాకు అర్థమైనది ఏమి లేనట్లుగాను అనిపిస్తోంది. మరింక నేను వాటి భారం వహించి చేయవలసింది ఏమి ఉంది. ఎందుకంటే, సమయానుకూలంగా 'మాలిక్' దయతో అన్నీ జరిగిపోతున్నాయి. పూజ్యశ్రీ బాబూజీ, ప్రతిదాని విషయంలోను, ప్రతిస్థితి విషయంలోను అది ముగింపుకు వచ్చిందా అన్నంతగా తలపిస్తోంది. మరోరకంగా చెప్పాలంటే, అన్నీ దేనిలోనో, నా ఎదుటనే విలీనమైపోతున్నాయా అన్నట్లు

అనిపిస్తోంది. నా దృష్టి అయితే రెప్పపాటు లేకుండా దేనినో నిరీక్షిస్తూనే ఉండిపోతోంది. ఆ దృష్టిలో కూడా కాంతి లేకపోయినప్పటికీ, నేత్రాల ఉనికి కూడా తెలియకపోయినప్పటికీ, ఆ దృష్టి యొక్క స్థితి అలాగే ఉంటోంది. ఆ దృష్టి యొక్క జ్ఞానం కూడా లేకపోయింది. బాబూజీ, ఇప్పుడు మరపుస్థితి కూడా ఎక్కడో లయమై పోతున్నట్లుగా తెలుస్తోంది.

ఏవైతే పూజ్య సమర్థ శ్రీ లాలాజీ సాహెబ్, వ్యాప్తి చెందటం గురించి, కొన్ని స్థితుల గురించి చివరి ఉత్తరంలో వివరించారో అవి సాటిలేనటువంటివి. వాటిలో ఏ స్థితులైతే 'మాలిక్' కృపతో నాకు చెందిపోయాయో అవి నాకు ప్రత్యక్షమవుతున్నాయి, అందుచేత నాకు కూడా కొంత అవగాహన కలుగుతోంది. పూజ్య శ్రీ బాబూజీ, అయితే 'వారు' (అనగా సమర్థ సద్గురవు శ్రీ లాలాజీ సాహెబ్) ఒక క్లిష్టమైన ప్రశ్నను నిన్న ఈ చిన్నపిల్లకు కూడా పరిష్కరించమని సంధించారు. ఎలాగైనా సరే, నేను నా 'మాలిక్' దయతో నాకు ఏదైతే గ్రహింపుకు వస్తుందో దానినే నివేదిస్తాను, తర్వాత ఏమి చేయాలో తమకు తెలుసు. ఇది జరగటానికి ముందుగా, నా 'మాలిక్' దయతో 'అతని' పవిత్ర పాదాల ముందు నివేదించే ప్రార్థన ఏమిటంటే, ఎలాగైతే 'అతని'వైపు నుంచి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని వితరణ చేయటానికి హద్దులేనట్లుగా ఉందో, నేను నావైపు నుంచి నేర్చుకోవటానికి ఎటువంటి పరిమితి లేకుండా చేస్తాను. నా జీవితాశయం, సారాంశం ఇదే. నాకు అర్థంకాని విషయం ఏమిటంటే, **'మాలిక్' కాకుండా జీవితంలోనే కాదు, ప్రపంచంలోనే ఆనందం, పరమానందం అని చెప్పదగినది ఇంకేమైనా ఉంటుందా** అని. ఇప్పుడు ఆ విషయానికి వస్తున్నాను. బాబూజీ, నాకయితే శాస్త్రజ్ఞానం లేదు, వేదాలను ఎప్పుడూ విని ఉండలేదు, నాకు తెలిసిందంతా 'అతని' గురించి మాత్రమే. నాకు వేదాలు, శాస్త్రాలు కూడా 'అతడే'. ఇప్పుడు నాలో నడుస్తున్న స్థితి ఎటువంటిది అంటే, నేను ఎప్పుడైనా 'అతని'తో క్షణమైనా వేరుపడి ఉన్నానా అను విషయం కూడా నాకు జ్ఞాపకం లేకుండాపోయింది. అయితే నేను, పూర్తిగా దివ్యజ్ఞానం నేర్చుకోవటానికి అంకితమైపోవటం గురించి ఏదైతే వ్రాశానో, దానిని ఎలాగైనా కానియ్యండి, నేర్చుకొని తీరతాను. ఇప్పుడు అసలు విషయానికి వస్తున్నాను.

పరమ పూజ్యులు, సమర్థ సద్గురవు శ్రీ లాలాజీ సాహెబ్‌కు సవినయ ప్రణామం చేస్తూ ఈ విషయం నివేదించుకుంటున్నాను. మొదటి విషయం: తమరు (లాలాజీ) బాబూజీతో "చౌబేజీకి నీవు ఏది ఇచ్చినప్పటికి అది నా (Obligation) దయార్ద్రతగా ఉంటుంది'' అని చెప్పినట్లు తమ లేఖలో వ్రాశారు. దీని అర్థం ఎలా అన్వయించుకోవచ్చును అంటే, తమరు వారికి అనగా బాబూజీ గార్కి విశేషించి ఏమీ ఆదేశం 'ఫలానా' ఇవ్వమని పురమాయించినట్లుగా లేదు. దీనినిబట్టి తమరు శ్రీ బాబూజీకి కొంత అధికారం కల్పించి వారి అభీష్టానికి వదిలిపెట్టినట్లుగా అర్థమవుతుంది. ఇక రెండవది: "ఇతని హృదయం (చౌబేజీకి) ఇంత పరిమాణంలో (స్థాయిలో) ఇవ్వాలి అనుకోవటంలేదు" అని తమరు బాబూజీకి వ్రాశారు. ఇవ్వటమైతే ఇవ్వవచ్చును కాని, ఇంతగా (ఈ స్థాయిలో) కాదు అని దానినిబట్టి అర్థమవుతుంది. ఇంక మూడవది: ఆ సమయంలో తమ యొక్క అభీష్టం ఆ విధంగా న్నమాట యదార్థం. అయితే అది త్వరితంగా వచ్చి ఉండకపోవచ్చు, ఆ స్థాయి (పరిమాణం)కి చేరి ఉండకపోవచ్చు, ఆ ఆదేశం యొక్క స్వరూపంలో మార్పు ఫలితంగా. దాని మూలంగా శ్రీ బాబూజీకి ఆ విధంగా చేయటం అనగా చౌబేజికి ఆ స్థితిని కల్పించడం తప్పనిసరి అయి ఉంటుంది. తమ (లాలాజీ సాహెబ్) యొక్క తీవ్రమైన ఆకాంక్ష 'వారి'ని (శ్రీ బాబూజీని) ఎప్పుడు కూడా ప్రశాంతంగా, నిదానించి ఉండనివ్వకపోవటం కూడా ఒక కారణం. ఎందుకంటే, ఒక ఉత్తరంలో శ్రీ బాబూజీ– "బిటియా! నేను నా స్వాధీనంలో ఉన్నట్లయితే, నేను ఏదైనా నా మాటగా చెప్పగలను" అని వ్రాశారు. పూజ్య సమర్థ లాలాజీ మహరాజ్, ఇప్పుడింక చర్చించవలసింది ఏమిటంటే, 'తమరు' శిక్షను గురించి అడిగిన మాట. దానిని గురించి చెప్పాలంటే, శిక్షకు వాస్తవంగా ఎవరు బాధ్యులు అంటే, ఎవ్వరైతే తమ తప్పును గుర్తించారో వారు, అలాగే ఎవ్వరైతే తమ తప్పును అంగీకరించారో వారు దండనలో భాగస్వాములవుతారు. అయితే, ఎవ్వరైతే తప్పు ఒప్పుల మధ్య తేడా తెలియనివారో, ఎవ్వరైతే తమ స్వాధీనంలో లేకపోయారో వారిని గురించి ఏమని చెప్పాల్సి ఉంటుంది. ఎవ్వరైతే శిక్షను, బహుమానాన్ని సరిసమానంగా విలువకట్టారో, అటువంటివారికి శిక్ష

విధించబడినప్పటికీ దానికి ఎంత విలువ ఇవ్వబడుతుంది అంటే, మనం చక్కెర లేదా దానికి బదులు మిఠాయి తిన్నట్లుగా ఉంటుంది. పూజ్య లాలాజీ మహరాజ్, ఈ స్థితులన్నీ ఎవరికి అనిగాని, ఎప్పటివరకు అనిగాని అంటే, తమరు వ్రాసినట్లుగా, మనమంతా 'ఎవ్వరికో' సమర్పితమై అంకితమైపోనంతవరకే. **అగ్ని, కీటకాలను భస్మం చేయగలదైనప్పటికీ, ఆ కీటకాలు అగ్నిని వదలి పెట్టకుండా దాని చుట్టూ తిరుగుతూ ఉంటాయి. మనమంతా ఆ కీటకాలవలె కాలేకపోతున్నాం. అందువల్లనే మనకు (ఆ దైవంలో తపించి పోకుండా) ఆటంకం కలుగుతోంది.** తావూజీకి బహుమతిగా పురోగతి లభించే సమయంలో ఇటువంటిదే వారికి ఆటంకం కలిగించి ఉండవచ్చు. నిజం చెప్పాలంటే, పూజ్య శ్రీ బాబూజీయే కనుక 'తమ' (లాలాజీ) యొక్క శిక్షకు పాత్రుడై ఉన్నట్లయితే (శిక్షింపబడి ఉన్నట్లయితే), ఈ ప్రశ్న ఇప్పటివరకు పరిష్కరించబడటానికి మాకు అవకాశం ఇవ్వబడి ఉండేది కాదు. 'మాలిక్' దయతో నా మనస్సుకు ఏది తోచిందో దానిని వ్రాశాను. ఇప్పుడు 'తమరే' దీనిని సవ్యంగా పరిష్కరించగలరు. నా స్థితి ఎలా ఉంది అంటే, ఒక పిల్లవాడు తల్లి పోషణలో మునిగి ఉండి నిశ్చింతగా ఉన్నట్లు ఉంది. ఇంక, నేను నా 'మాలిక్'ను పరిపూర్ణంగా పొందగలుగునట్లు, నా నేత్రాలు అటువైపుకే మరలి ఉండాలి అని ఈ దీనురాలి ప్రార్థన. నా 'శ్రీ బాబూజీ'కి శ్వాస బాధ ఎంతమాత్రం ఉండకూడదని, వారి శరీరం బలహీనపడకుండా ఉండాలన్నదే నా ఈ ప్రార్థన.

పూజ్య శ్రీ బాబూజీ, నా ఈ స్థితి ఏ విధంగా అనిపిస్తున్నది అంటే, 'తమరు' తమ ఇంగ్లీషు పుస్తకంలో (Identity) అస్తిత్వం గురించి వ్రాసిన విధంగా ఉంది. నాకు ఏ విధంగా అనిపిస్తోంది అంటే, నా సర్వస్వమూ ఆ (Forgetful state) మరుపుస్థితిలోనో, మరెక్కడో లయమైపోయినట్లు అనిపిస్తోంది. (Expansion) వ్యాపకం యొక్క పరిస్థితి కూడా ఇలాగే ఉంది. నా మరుపుస్థితి కూడా ఇలాగే లయమైపోయింది అని చెప్తే తప్పుకాదని అనుకుంటాను. (Innocent) అమాయకత్వ స్థితి కూడా ఈ విధంగా అయిపోతూ ఉంది. ప్రశాంత సముద్రంలో ఒక ఆలోచన ఈదుతూ ఉన్నట్లు ఉంది. బహుశా దీనినే (Identity) అస్తిత్వం అని చెప్పవచ్చు. కేసర్ నుంచి ఆమె పరీక్షలన్నీ బాగా వ్రాసినట్లు ఉత్తరం వచ్చింది. ఆంగ్ల సాహిత్యం గురించిన పేపర్లు ఒక మాదిరిగా వ్రాసినట్లుగాను, 'తమకు' ప్రణామం తెలియజేయమని వ్రాసింది. చిన్న సోదరుడు, మరియు బిట్టో కూడా తమ పరీక్షలు బాగానే వ్రాస్తున్నారు. మాయ, ఛాయల పరీక్షలు ఎలా జరిగాయి?

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

**గమనిక:** ఈ లేఖలో కస్తూరీ బెహెన్‌గారి (Argument and conclusion) వాదన, ముగింపు, ఎవ్వరినీ నొప్పించకుండా ఎంత సునిశితంగా ఉన్నాయో గమనించగలం.

## ఉత్తరం సంఖ్య – 211

లఖీంపుర్,

30.04.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు అంది ఉంటుందని అనుకుంటున్నాను. తమకు ఇప్పుడు ఇంజక్షన్ల మూలంగా ఆరోగ్యం బాగానే ఉండి ఉంటుంది. నాకు ఇప్పుడు కొంత బలహీనంగా ఉన్నప్పటికీ ఆరోగ్యంగానే ఉన్నాను. అమ్మ, పెద్ద సోదరుడు, మరియు కేసర్ 4వ తేదీకి ఇక్కడకు వచ్చేస్తారు. ఇద్దరూ పరీక్షలు బాగానే వ్రాసారు. దేవుని కృపతో ఇద్దరూ ప్యాసవుతారు. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు నా స్థితి, శరీరంతో నాకు సంబంధం తెగిపోయినట్లు ఉంది. బహుశా నేను ఇంతకు పూర్వమే వ్రాసి ఉంటాను. అంతేకాదు ఈ శరీరం యొక్క ధాతువులతో కూడా నాకు సంబంధం లేకుండా అయిపోయినట్లు ఉంది.

బహుశా ఈ విషయం కూడా నేను ఇంతకుముందు వ్రాసి ఉంటాను. ఇప్పుడు నేను నిద్రిస్తూ ఉన్నా, మేల్కొని ఉన్నా, విశ్రాంతంగా ఉన్నా లేక కష్టపడుతూ ఉన్నా అనగా ఏ స్థితిలో కూడా ఈ సంబంధం ఉన్నట్లనిపించటం లేదు. అంతేకాదు, నా ఈ స్థితిలో నేను ఎక్కడ ఉన్నాగాని, ఏ స్థితిలో ఉన్నాగాని వాటిలో ఆ 'నేను' యొక్క జ్ఞాపకం మరచిపోయి ఉంటున్నాను. ఇంకొక రకంగా చెప్పాలంటే, (State of Forgetfulness) మరుపుస్థితిలో ఎల్లప్పుడూ ఉంటున్నాని చెప్పవచ్చు. ఈ స్థితిలో, అదేమిటో తెలియదు కాని, అప్పుడప్పుడు ఏదైనా ముఖ్య విషయం గురించిగాని, ఆ మరచిపోయిన జ్ఞాపకం అనగా 'నేను' అను దానిని గురించిగాని ఏదైనా కొంత గాలి వీచినప్పటికీ, అది కూడా కొద్ది క్షణాలపాటు మాత్రమే నిలిచి ఉంటోంది. అది కూడా ఎంత అల్పంగానంటే, ఒకవేళ దానిమీద నేను శ్రద్ధ నిలపకపోయినట్లయితే (ఇది తరచుగా జరుగుతున్నదే), నా యొక్క ఈ కొద్దిపాటి చైతన్యాన్ని (అనగా నేను, నాది అను భావం) కూడా గుర్తించలేక పోతున్నాను. పూజ్య శ్రీ బాబూజీ, ఏమైందో ఏమో కాని, రెండు మూడు రోజులనుండి ఆ మరపుస్థితి కూడా అంతుబట్టకుండా పోయింది. ఇది మంచి స్థితిగా అనిపించటం లేదు. ఒకవేళ పురోగతి ఏమీ ఆగిపోలేదు కదా! అయితే అలా జరగటానికి అవకాశం లేదు. ఎందుకంటే, 'మాలిక్' కృపతో నేను పురోగమిస్తూనే ఉన్నాను కదా అని నేను సంభాళించు కుంటున్నాను. ఇప్పుడైతే స్థితి మార్పు చెందుతున్నట్లు అనిపిస్తోంది. నేను ఇప్పుడు దీని మీద ధ్యాస నిలిపినట్లయితే హృదయంలో ఏదో స్వల్ప స్పందన కలుగుతున్నట్లు అనిపిస్తుంది. లేదంటే, దీనితోపాటుగా ఎక్కువగా మరపుస్థితి కూడా ఉన్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఉన్న స్థితి ఎలా ఉంది అంటే, నాకు ఇది మంచిది అనిగాని, చెడ్డది అనిగాని అనిపించటం లేదు. ఇది నావరకే కాదు, అసలు ప్రపంచంలోనే మంచి, చెడుల జ్ఞానం నాకు కలగటం లేదు. ఇంకా చెప్పాలంటే, ఒక నునుపైన మట్టి కుండ లేదా వజ్ర కవచంలాగ అవ్వడం వలన మీదపడ్డ నీటి చుక్క కూడా పూర్తిగా జారిపోయేలాగా, ఎవ్వరి మాటలు నాకు ఆ కవచం మూలంగా ఏమీ సోకనట్లు అయిపోయి నాలో ఎటువంటి ప్రతిచర్య లేదా ప్రతిస్పందన కలగటం లేదు. పూజ్య శ్రీ బాబూజీ, 'మాలిక్'ను నేను ఎంతగా జ్ఞాపకం ఉంచుకోవాలి అని కోరుకుంటున్నానో అంతగా పొందలేకపోతున్నాను, అదేమిటో నాకు అర్థం కావటంలేదు. అందుచేత తపన లేదా తృష్ణ ఇంకా ఎక్కువైపోతున్నట్లు అనుభవం చెందుతున్నాను. 'మాలిక్' కృపతో, నాలోపల ఒక పీల్చివేసే స్వభావం ఏర్పడి, దానితో అన్ని విషయాలు, ఆఖరికి అన్ని స్థితులూ పీల్చి వేయబడుతున్నట్లు అనగా లోపల అన్నీ జీర్ణమైపోయినట్లు అనిపిస్తోంది. అయితే అలా జీర్ణించుకుపోకుండా ఉన్నది ఒక తృష్ణ మాత్రమే. దానికి ఆంతరికంగా కొంత తీవ్రత / ఉద్వేగం కల్పించ బడుతూ ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. దయచేసి మిగిలిన ఉత్తరాలు కూడా తమరు పరిశీలించండి. వాటిలో ఒకటి అమ్మగారికి (బాబూజీ ధర్మపత్ని), రెండవది ఇంద్రకు, దానిని ఆమెకు పంపించగలరు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 212

షాజహాన్‌పుర్,
04.05.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు ఏప్రియల్ 23 మరియు 30వ తేదీలలో వ్రాసిన ఉత్తరాలు అందాయి. ఏప్రియల్‌లో నీవు వ్రాసిన ఉత్తరంలో ఇచ్చిన జవాబు పూర్తిగా సరైనది. ఒకవేళ నేను నిన్ను అడిగిన ప్రశ్నకు జవాబు నేను వ్రాయవలసి వచ్చినా అదే విషయాన్ని మరొక రకంగా వ్రాయవలసి ఉండేది. నేను 'C' పాయింట్ వద్దకు నిన్ను చేర్చినట్లు నేను మాస్టర్ సాహెబ్‌కు ఒక ఉత్తరంలో వ్రాశాను. ఈ రెండు ఉత్తరాలలోని విషయం ఆ స్థానం యొక్క స్థితినే తెలుపుతున్నాయి.

ఇంకా ఎంత ముందుకు పోగలుగుతావో అంతగా దాని పరిజ్ఞానం కలుగుతుంది, కాని దానిని వ్యక్తపరచటానికి మాటలు దొరకటం దుర్లభమవుతుంది. ఇదే స్థితిలో నీవు ఉండి నేను ఆశించినట్లుగా అంకితభావంతో ఉత్సాహం మరియు ప్రేమను దైవంపట్ల పెంచుకుంటే నిన్ను ఆ కేంద్రానికి (భూమా) చేర్చాలనే అభిప్రాయం కలిగినపుడు నాలో కలవరం కలుగుతుంది. ఆ విధంగా ధృవానికి చేర్చటం లాలాజీ సాహెబ్‌కి అయితే ఒక్క క్షణకాలంలో జరిగే పని. కాని దానిలో ఉన్న ఇబ్బంది ఏమిటంటే, ప్రతిస్థితి మీద ఆధిపత్యం కలిగే సాహసం ఉండదు. కాని **నేను చాలా మందిని తొందరపాటుతో ఉన్నత దశలకు చేర్చి, వారి యాత్ర పూర్తి చేయించినప్పటికీ, వారు ప్రతి దశలోను లయ-అవస్థను పొందలేకపోయిన కారణంగా వారు ప్రయోజకులుగా నిరూపించుకోలేకపోయారు. వారు నిరంతర స్మరణను అలవర్చు కోకపోవటమే అందుకు కారణం. నిరంతరస్మరణ అనేది చాలా సాఫల్యం సమకూర్చుతుంది.** నా దృష్టిలో దానిని నెలకొల్పడానికి పది లేక పన్నెండు రోజులకంటె ఎక్కువ వ్యవధిపట్టదు. కాని దానికి ఎవ్వరూ సిద్ధంగాలేరు. **ఎవరికైతే ఉద్దేశ్యం లేదా సంకల్పం ఉందో వారే స్వయంగా ఇస్తారు కదా!** మనం ఎందుకు శ్రమపడాలి **అని వారు భావిస్తున్నారు. ఒకరైతే నన్ను ప్రశంసా వాక్యాలతో మభ్యపెట్టి నా అభిమానం చూరగొనాలని తలపెట్టారు. మరొకరైతే తన బాహ్య కార్య కలాపాల్లో వినయ విధేయతలు ప్రదర్శించి నా యొక్క అత్యంత ఆజ్ఞానువర్తిగా ప్రవర్తించారు. ఈ కపటాలను వారి ఈ స్వార్థ ప్రవర్తనలను నేను గ్రహించక పోలేదు. నా కోరిక యొక్క ప్రభావం ఎలా ఉన్నదంటే, అభ్యాసీ ముందుకు పోలేకపోతున్నపుడు నేను అతన్ని త్వరగా ముందుకు తీసుకొని వెళ్ళాను. అభ్యాసీ ముందుకు పోవటానికి తొందరపడితే ఎప్పుడైనాసరే నేను వేగవంతం చేస్తాను. ఏ అభ్యాసియైనా స్వయంగా పురోగతి కొరకు ప్రయత్నించకపోయి నట్లయితే అట్టివారిని నేను ముందుకు తరలించుకు పోవటమనే తప్పు ఇంక భవిష్యత్తులో జరగబోదు.** చౌబేజీ విషయంలో నాకు ఆయనపట్ల ఉన్న అధికమైన జాలి మూలంగా నేను ఆ విధంగా త్వరితం చేశాను. ఎందుకంటే, ఆయన వాస్తవికత లేదా సత్పదార్థాన్ని పొందటానికి చాలా ప్రయత్నం చేశాడు. దానితోపాటు వాస్తవికత / సత్పదార్థాన్ని తెలుసు కోవటానికి ప్రయత్నించలేక పోయాడు. నా పరిచయం కాక పూర్వమే ఆయనకు మార్గం చూపేవారు ఎవరైనా దొరికి ఉంటే ఆ ప్రయత్నం సఫలమయ్యేది. నేను ప్రకాష్ (బాబూజీ పెద్ద కుమారుడు) వివాహ సమయంలో అతడిని ఒక చెట్టు క్రింద కూర్చుండబెట్టి సిట్టింగ్ ఇచ్చాను. దానిలో అతడు ముఖ్యకేంద్రానికి (సెంట్రల్ రీజియన్) చేరేటట్లు ప్రాణాహుతి ప్రసారం చేశాను. అతను భూమాలోకి ప్రవేశించేటట్లు కూడా మార్గం చూపాను. అదే సమయంలో నేను అతని ధ్యానాన్ని (దృష్టిని) నిరంతర స్మరణలో మగ్నమయ్యేటట్లు చేశాను.

నేను ఇంతకుముందు, "నేను నిన్ను 'ధృవం'కు (సెంట్రల్ రీజియన్‌కి) చేర్చాలనుకుంటున్నానని, కాని సందిగ్ధంలో పడుతున్నాను" అని చెప్పిన మాటకు అర్థం ఏమిటంటే, నీవు ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది అనీ, దానికితోడు మరొక ఆలోచన ఏమిటంటే, సమయం ఎక్కువ పట్టినందువలన నీకు పరిజ్ఞానం కలుగుతుంది అనీ, అలాగే చేరటం జరుగుతుందనీ నేను భావించాను. ప్రతి వ్యక్తీ కేంద్రానికి (ధృవం) చేరుకోవాలని, అందుకు తగిన ప్రయత్నానికి సిద్ధం కావాలని తరచుగా నేను ఆలోచన చేస్తూ ఉంటాను. అయితే ఎవ్వరూ నా నుంచి ప్రయోజనం పొందటానికి వాంఛించరు. నేను ఎంత అస్వస్థతగా ఉన్నప్పటికీ చింతించవలసిన అవసరం లేదు, ఎందుకంటే నాకు ఇంకను ఆ సమయం రావటానికి చాలా కాలం పట్టుతుంది.

నేను ఇంకొక విషయం వ్రాయటం మరచాను. అది ఏమిటంటే, నేను నీకు రాత్రి సిట్టింగ్‌లో 'C' స్థానంలో ప్రయాణింప చేశాను. ఇంతకు ముందు నేను ఒక పనిలో నిమగ్నమై ఉన్నందువల్లనూ, మనస్సు (మైండ్) కూడా అలసిపోయి పనిచేయలేక పోతున్న కారణంగాను, నేను ఇంతకు ముందు ఆ సిట్టింగ్ ఇవ్వలేక పోయాను. నేను ముఖ్యమైన స్థానాలనే ఎంపిక చేస్తున్నాను. ఎందుకంటే, ముఖ్యకేంద్రాలకు చెందిన చిన్న చిన్న మజిలీలను కూడా ఎంచుకుంటే ఈ ప్రయాణం పూర్తి చేయటానికి పదివేల సంవత్సరాల జీవితం కూడా సరిపోదు. అయినప్పటికీ ముఖ్యకేంద్రాలు అన్నింటిలోను పయనింపజేస్తాను. నేను నీకు త్వరగా పురోగతిని ఇవ్వాలనుకుంటున్నాను కనుక

అన్ని స్థితులలోను నీ ప్రయాణం గురించి వ్రాస్తూ ఉండాలి. ఈ మకాంలో ప్రయాణం పూర్తయిన వెంటనే ఏడు, ఎనిమిది రోజుల వ్యవధిలో తదుపరి మకాముల యొక్క స్థితులు అనుభవమతూ ఉంటాయి. ఇప్పుడు ఈ వేగవంతమైన ప్రయాణంలోనే అన్ని పాయింట్లలోను లయ–అవస్థను పొందవలసిన బాధ్యత నీ మీద ఉంది. నేను శ్రీ రామేశ్వర ప్రసాద్ (బాబూజీ గురుభాయి)ను ఈ పాయింట్ల మీద ప్రయాణింపజేసినపుడు 'K' వరకు లెక్కించాను, ఆ తర్వాత లెక్కంచటం మానివేశాను.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 213

లఖీంపుర్,
04.05.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారికి తమరు వ్రాసిన పోస్టుకార్డ్‌లోని విషయాలను తెలుసుకొని సంతోషించాను. తమరు నన్ను 'C' పాయింట్ మీదకి తీసుకొని వెళ్ళినందుకు, తమ కృపకు చాలా ధన్యవాదాలు అర్పిస్తున్నాను. నిన్న నేను, తావూజీ పూజలో కూర్చున్నప్పుడు, తావూజీకి మంచి స్థితి కలిగినట్లుగా ఉన్న దానిని తమకు వ్రాస్తున్నాను, అది అవునో కాదో తమకే తెలియాలి. వారిలో నాకు సామ్యావస్థ యొక్క స్వరూపం కనిపించింది. వారిలో భగవద్గీతలో వివరించిన చాలా స్థితులతో నిండి ఉన్నట్లు తలపించింది. నాలో బీజదగ్ధ స్థితి కలిగినట్లు తమరు ఒకసారి వ్రాసినటువంటిది, వారిలో అప్పుడప్పుడు ఏర్పడి, వారి ఆంతరికం కరిగి పోతున్నట్లు అనిపించింది. ఇంక మిగిలిన విషయాలు తమకే తెలియాలి. తమరు నాకు వ్రాసిన విధంగా, వారి స్థితి యొక్క అస్పష్ట రూపాన్ని, భారీతనాన్ని సరిచేయటానికి లేదా శుభ్రపరచటానికి నేను, తావూజీ 3,4 రోజుల నుంచి ఇక్కడ ఉదయం, సాయంత్రం కూర్చుంటున్నాము. 'మాలిక్' కృపతో ఇప్పుడు వారి స్థితి శుభ్రపడినట్లు తెలుస్తోంది. 'మాలిక్' కృప కనుక ఇదే విధంగా ఉండినట్లయితే ఇటువంటి పరిణామం మళ్ళీ తలెత్తకపోవచ్చు. ఇప్పుడు 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మికదశను, నాకు అనుభవానికి వచ్చిన దానిని వ్రాస్తున్నాను.

కారణం ఏమిటో తెలియదు కాని, ఇప్పుడు రోజులు గడుస్తున్నకొద్దీ నాలో సోమరితనం (Inactivity) పెరిగినట్లు అనుభవానికి వస్తోంది. హృదయం అప్పుడప్పుడు విసుగు చెందిపోతున్నది. ఎక్కడ కూడా ఏ పనిలోనూ మనస్సు లగ్నం కావటంలేదు. అప్పుడప్పుడు హృదయంలో ఇల్లు విడిచి పారిపోదామా అన్నంతగా అశాంతి నెలకొని ఉంటోంది. అయితే నేను ఎక్కడికి పోయినా కూడా లాభం ఉండదు అని నాకు తెలియనిది కాదు. ఎంతసేపూ హృదయం (Inactiveness) సోమరితత్వ స్థితిలోనే ఉంటోంది. జ్ఞాపకం మూలంగా కలుగుతున్న వ్యతిరేక ఫలితం ఎలా ఉంది అంటే, అది ఒక్క నిమిషమే కలిగినప్పటికీ, ఆ క్షణం కొంచెం క్రిందికి దిగివచ్చినట్లుగాను, అది చెడుగాను అనుభవమవుతోంది. ఈ స్థితిలో హృదయం చికాకుపడుతున్నట్లు అప్పుడప్పుడు అనిపిస్తోంది, అనగా ఈ స్థితితోనే చికాకు కలుగుతోంది. ఆ విధంగా కాకపోయి నట్లయితే, స్థితిలో ఎక్కువగా శూన్యత్వం వ్యాపించి ఉంటోంది. పూజ్య శ్రీ బాబూజీ, నాది ఒక వింతైన తామసిక స్థితిగా అయిపోయింది. ఈ తామసిక స్థితియే నా స్వభావంగా అయిపోయింది.

అప్పుడప్పుడు ఒక్క పెట్టున నిద్రాస్థితిలోనే ఎప్పుడూ ఉండిపోవాలని హృదయం కోరుకుంటోంది. ఏమీ చేయవద్దని, కాళ్ళూ చేతులు కూడా కదిలించవద్దు అన్నట్లు మనస్సు ఉబలాటపడుతూ ఉంది. హృదయం, మరేమైనాగాని, లోన బయట కూడా చురుకుదనాలన్నీ ఎక్కడో మూగపోయి నట్లుగాను, దేనిలోనో విలీనమైపోయినట్లుగాను అనిపిస్తోంది. ఇప్పుడు స్థితిలో చైతన్యం లేకుండా ఉంటోంది. అయితే, మనస్సులో ఏదో తెలియనటువంటి పునశ్చరణ (మళ్ళీ మళ్ళీ

జ్ఞాపకం చేసుకునేటటువంటిది) ఏదైతే స్థిరంగా ఉండిపోయిందో, దాని ఆశ్రయం మరియు 'మాలిక్' కృప యొక్క భరోసా నన్నంటి ఉండి, అవే నన్ను లక్ష్యానికి చేర్చుతాయి. నా స్థితి ఈ విధంగా అయిపోయినప్పటికీ, నా విశ్వాసం, ప్రేమ మరియు భరోసా వంటివి కూడా ఎక్కడ లయమైపోయి ముగిసిపోయాయో తెలియకుండా ఉంది. నాకు ఏమైపోయిందో తెలియటంలేదు, బాబూజీ. ఇప్పుడు ఈ విధంగా ఎందుకు అయ్యిందో తెలియదు కాని, నా ఎదుట కూర్చున్నవారి మనస్సులో ఏయే ఆలోచనలు కలుగుతున్నాయో, వారు నాకు చెప్పకుండానే నేను వాటిని చెప్పగలగటం తరచుగా జరుగుతోంది. నా ధ్యాస అంతా ఏమైపోయిందో నాకు స్వయంగా తెలియటంలేదు, అదంతా 'మాలిక్'కే తెలియాలి. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 214

లఖీంపుర్,

07.05.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉంటుంది. తమ ఆరోగ్యం బాగుందని ఆశిస్తున్నాను. ఈశ్వరుని దయతో నాలో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎటువంటి దశ కలుగుతూ ఉన్నది అంటే, దీనిలో (Inactiveness) అకర్మణ్యత్వాన్ని (ఏమి చేయటానికి సంకల్పం లేకపోవటం వంటిది) కూడా మరచి ఉంటున్నాను. ఈ అకర్మణ్యత్వం కూడా ఎక్కడో లయమైపోతున్నదేమోనని అనిపిస్తోంది. అది ఎప్పుడైన తలంపుకు వస్తుంది కాని మళ్ళీ మరచిపోతున్నాను, అంతేకాదు, మరచిపోతున్నాను అను సంగతి కూడా తెలియటం లేదు. నేను ఏమి మరచిపోతున్నానో, ఆ మరపు ఏమిటో కూడా తెలియకుండా పోయింది. ఈ మరపుస్థితి యొక్క అంతం కూడా జరిగిపోతున్నది. బాబూజీ, నా స్థితి ఎలా ఉన్నదంటే, మనస్సు చాలా లోతుగా ధ్యానంలో లీనమై ఉన్నప్పటికీ, నాలో క్రోధం కాని, నవ్వుగాని, సంతోషంగాని అన్నీ బాహ్యంగా మాత్రమే ఉంటున్నాయి; అవి కూడా అనాలోచితంగానే జరిగిపోతున్నాయి. మనస్సు యొక్క స్థితిలో ఎటువంటి మార్పు ఉండటం లేదు. అది ఎలాగైతే ఉంచబడిందో అలాగే ఉంటోంది. దానికి ఈశ్వరునితో సంబంధం లేకపోవటం వలన, దానికింక ప్రేమ ఎక్కడ నుండి వస్తుంది. దానికి పూజతో మాత్రం ఏం పని ఉంటుంది? ఎందుకంటే, దానిపై ఎటువంటి ప్రభావం లేదు కనుక. దాని ప్రాపంచిక సంబంధం కూడా ఇదే విధంగా ఉంది. ఇంకా విశేషం ఏమిటంటే, దాని గంభీర విలీనావస్థ గురించి కూడా నాకు ఏమీ తెలియకుండా పోయింది. ఒకవేళ ఎప్పుడైనా దానిమీద ధ్యాస నిలిపినట్లయితే, దానికి (మనస్సుకు) అక్కడ ఇదే స్థితి అనగా పైన చెప్పినటువంటి స్థితి ఉన్నట్లు గ్రహిస్తున్నాను. అక్కడ ఉదాసీనతగాని, ఇంకేమీగాని తెలియటంలేదు. అది ఎలా అయితే ఏర్పాటు గావించబడిందో అలాగే దృఢంగా ఉంది. ఇంకొక మాటలో చెప్పాలంటే, ఎక్కడైతే అన్నీ మరియు అన్ని స్థితుల యొక్క అంతం అవుతూ ఉంటుందో, అక్కడే దానికి కూడా అంతమయ్యే స్థితి కలుగుతుంది. ఒకవేళ దీనిని సామ్యావస్థ అని చెబుదామా అంటే, దానిని గుర్తించటం కూడా కష్టంగానే అయిపోయింది. అది కూడా దాదాపు ఎక్కడో మునిగిపోయి ఉంటుంది, లేదంటే నాలోపల పీల్చుకుపోవటంలోనే అది కూడా పీల్చుకుపోయి ఉంటుంది. ఇప్పుడు ఒక శుద్ధమైన స్థితిగా దర్శనమవుతోంది. అందులో ఏదైనా రంగుకాని, మరేమైన కాని కనిపించటం లేదు. దానిని పరిశుద్ధమైన స్థితిగానే చెప్పవచ్చు. అయితే బాబూజీ, అదేమిటోగాని, మనస్సుపై ఎటువంటి ప్రభావం లేకుండానే ముఖం మీద బాధలు, ఆనందం, దుఃఖం, సంతోషం, వాటితోపాటు అప్పుడప్పుడు గాఢమైన అవస్థలో మునిగి ఉన్న భావం ఎందుకు అనుభవమవుతున్నాయని

అంటారు? దీనినిబట్టి తెలియకుండా దేని ప్రభావమో తప్పక పడుతూ ఉంటుందను అభిప్రాయానికి రావలసి ఉంటుంది; అదేదో తమకే తెలియాలి. అయితే, ఇంకొక విషయం ఏమిటంటే, మానసిక దశలో ఎటువంటి మార్పులేనట్లు అనిపిస్తుంది. బహుశా వాతావరణం యొక్క ప్రతిబింబం మనస్సు మీద పడుతూ ఉండవచ్చు అనుకుంటాను. అదేదో తమకే తెలియాలి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. కేసరి మే నెల ఆఖరిలో వస్తుంది. ఆమె పంటి చిగుళ్ళకు చికిత్స జరుగుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 215

షాజహాన్‌పూర్,

08.05.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలమగుగాక! నీ ఉత్తరాలు 4.5.1952వ తేదీతో ఉన్నది పోస్టుద్వారాను, 7.5.1952వ తేదీతో ఉన్నది మాతాజీ (తల్లిగారి) ద్వారాను అందాయి. తావూజీ దశను గురించి నీవు వ్రాసిన దానిలో కొంతభాగం సరైనదే.వారిలో సంస్కారాలు ఏర్పడటం దాదాపుగా ముగిసిపోయింది. నీవు వ్రాసిన సామ్యావస్థ (సమతుల్య స్థితి) పలువిధాలుగా ఉంటుంది. అతిదిగువ రకమైన 'సామ్యావస్థ' వారిలో కలిగి ఉన్నట్లు నాకు తలపిస్తోంది. ఎందుకంటే, దానికి తగిన విధంగానే నేను వారికి ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) నిచ్చాను.

నీవు నీ యొక్క (Inactive Condition) క్రియావిహీనస్థితిని గురించి ఏదైతే వ్రాశావో అది మన విధానంలో మొదటి రోజు నుంచే ప్రారంభమవు తుంది. అనగా ఏ స్థితికి చేరవలసి ఉందో దానికి సంబంధించిన బీజం మొట్టమొదటనే నాటబడుతుంది. ఎంతెంతగా ఉన్నతి కలుగుతూ ఉంటుందో అంతంతగా ఇది (క్రియావిహీనస్థితి) గ్రహింపుకు వస్తూ ఉంటుంది. ఈ సందర్భంలో ఏదైనా విషయం జ్ఞాపకం వచ్చినపుడు, దాని కారణంగా ప్రస్తుతం కలిగిన స్థితిలో ఏకాగ్రతకు కొంతమేర భంగం వాటిల్లుతుంది. "నాలో అలసత్వం కలిగి దాని మూలంగా అప్పుడప్పుడు నిద్రపోవాలని అనిపించటం, మరొకప్పుడు కాళ్ళు చేతులు కూడా కదపకూడదని అనిపించటం జరుగు తున్నది" అని నీవు వ్రాశావు. దానిని నిస్త్రాణస్థితి (తామసం) అని వ్యవహరించ కూడదు. ఎందుకంటే, ఇంద్రియాలు (అవయవాలు) ఎంతో కొంత లయా వస్థను పొందాయని అనటానికి ఇదొక నిదర్శనంగా ఉంటుంది. ఇంకను "ఇతరుల హృదయంలో ఏదైతే ఉందో, దానిని నేను చెప్తూ ఉన్నాను" అని వ్రాశావు. ఇది పరిశుద్ధ హృదయానికి తార్కాణంగా ఉంటుంది. నాలో ఇటువంటి స్థితి ఒకానొకప్పుడు చాలా తీవ్రంగా ఉండేది కాని ఇప్పుడు ఏమైందో తెలియదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ స్థితి లాలాజీ సాహెబ్‌లో జీవితాంతం ఉండేది కాని, ఇప్పుడు నా విషయంలో అది తెలియటం లేదు. నీవు మే నెల 7వ తేదీన వ్రాసిన ఉత్తరంలో ఏ అలసత్వ స్థితి కనుమరుగై పోయినట్లుగా వ్రాశావో అది చాలా ఉత్తమస్థితి. ఆ ఉత్తరంలోని మిగతా విషయాలన్నింటిని గురించి చెప్పాలంటే, ఉద్దేశించిన లక్ష్యాన్ని (అనగా అది ఎక్కడ నుంచి వచ్చిందో అక్కడికి) చేరనంతవరకు, మనస్సు యొక్క తపన (లక్ష్యంలో లీనం కావటానికి) ఎంతో కొంతగా గ్రహింపుకు వస్తూ ఉంటుంది.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 216

లఖీంపుర్,

09.05.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి అమ్మ తమకు ఇచ్చి ఉంటారు. ఇక్కడ అంతా కుశలమే. తమరందరు కూడా కుశలమేనని ఆశిస్తున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను తమకు వ్రాస్తున్నాను.

అదేమిటో దైవానికే తెలియాలి, శరీరంలో అలసత్వం మితిమీరిపోయి ఉంది, పగలంతా నిద్ర పోవటం లేదు కాని, నిద్రావస్థలోనే ఉండాలని శరీరం కోరుకుంటోంది, తరచుగా అలాగే ఉంటున్నాను. కాళ్ళు, చేతులు కదపటం చెడుగా అనిపిస్తోంది. అందుచేత లేవవలసి వచ్చినప్పుడు కాని, నాతో ఎవ్వరైనా మాట్లాడుతున్నప్పుడుగాని, చాలా నిరుత్సాహంగా ఉంటుంది. ఈ స్థితి ఎలా ఉన్నది అంటే, మనస్సు అసలు ఈ అలసత్వంలో లయమై పోయిందా అని అనిపిస్తోంది. ఏమి చేయాలో, ఎలా చేయాలో తెలియకుండా ఉంది. అది ఎంతగా నంటే, ఎవ్వరైనా 'తమరు వచ్చారు' అని చెప్పినప్పటికీ, మనస్సుకు 'వస్తే రానీయండి' అన్నట్లు ప్రత్యేకత ఏమీ అనిపించటం లేదు. మర్యాదగా లేచి నిలబడాలనే తలంపు కూడా కలగటం లేదు. నాలో ఈ విధంగా పేరుకుపోయినంత అలసత్వం నేను ఇప్పటివరకు విని ఉండలేదు. ఇది హద్దుమీరి పోకుండా ఉండటానికని మనస్సును నిరర్థకమైన విషయాలవైపు మరలించటానికి ప్రయత్నిస్తున్నాను. ప్రస్తుతం నా స్థితి, 'సూరదాస్ కాలీ కామర్ పర్ చఢె న దూజే రంగ్" అనగా నల్ల కంబళి మీద మరి ఏ ఇతర రంగు కనిపించదు అని సూరదాసు చెప్పినట్లుుంది. అప్పుడప్పుడు ఆ హద్దులేనిదాని హద్దును అతిక్రమించిపోతున్నట్లు అనిపిస్తుంది. పూజ మరియు పని వంటివి, నాకు అలవికాకపోతే తప్ప వాటంతట అవే జరిగిపోతున్నాయి. నిరంతర స్మరణ అనేది నా స్వాధీనంలో లేకుండా పోయింది. ఇంతకుపూర్వం ఈ స్థితి అప్పుడప్పుడు ఒకటి రెండు రోజులు ఉంటూ ఉండేది. కాని ఇప్పుడు అది నిరంతరమూ, అధికమోతాదులో ఉంటూ ఉంది. అయితే మధ్య మధ్యలో రెండు మూడు రోజులు హద్దులేకుండా పోతోంది. అది నా స్వాధీనంలో లేకపోవటం వలన పగలంతా మౌనంగా ఉండిపోతున్నాను. ఇది గమనించిన వారు, ఆరోగ్యం బాగా పాడయి పోయిందని, మళ్ళీ వైద్యం చేయించుకోమని చెప్తున్నారు. అప్పుడప్పుడు నాకు కూడా అలాగే అనిపిస్తోంది కాని దాని మీద అంత శ్రద్ధ పెట్టటంలేదు. ఇప్పుడైతే 4,5 రోజుల నుండి స్థితి మరొక విధంగా ఉంటున్నది. హృదయం మృతస్థితి లాంటి దానిలో విలీనమైపోతున్నదా అని అనిపిస్తోంది. ఉత్తరం వ్రాయటానికిగాని, స్థితిని తెలియపర్చటానికిగాని హృదయానికి ఇష్టం ఉండటం లేదు. దానిని నివారించుకుంటూ వస్తున్నాను, కాని ఇప్పుడు కూర్చుని వ్రాయడం ప్రారంభించాను. బాబూజీ, ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందంటే, నాలో స్పృహ లేకపోవటం వలన, (ఫనాయియత్) లయావస్థ కూడా మోసపోయి ఎక్కడో లయమైపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు మృత్యుస్థితి వంటిది కూడా మృత్యువాతపడినట్లు అర్థం చేసుకోవచ్చు. ఇంతకు క్రితమైతే అకర్మణ్యత్వం (Inactiveness) ఉండేది, ఇప్పుడు దాని స్థానంలో మరేదో అనుభవమవుతోంది. అది ఇప్పుడు లేకుండాపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు బాహ్యాంతర జ్ఞానాలు ఎక్కడో లయమైపోతూ ఉన్నట్లు అనిపిస్తోంది. అయితే 'మాలిక్' కృపాదృష్టి యొక్క ఆ రెండు నేత్రాలు ఇంకను కొంత జ్ఞానాన్ని నిలుపుతున్నాయి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 217

లఖీంపుర్,

11.05.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన రెండు ఉత్తరాలు అమ్మగారి ద్వారా అందాయి, సమాచారం తెలిసింది. పూజ్య తావూజీ, ఇక్కడ బాగా శ్రమిస్తూ బాగా 'అతడి'ని జ్ఞాపకం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు ఈశ్వరుడే 'మాలిక్' అన్నట్లు వారు ప్రయత్నం చేస్తున్నారు. తమరు ఇంతకు పూర్వం ఉత్తరంలో వ్రాసిన విధంగా, నేను మరియు వారు కూడా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూజలో కూర్చునే ఉంటున్నాము.

"ఒకవేళ నీ యొక్క అభిరుచి (దీక్ష) మరియు స్థితి ఇలాగే ఉన్నట్లయితే నిన్ను (ధుర్) కేంద్రం వద్దకు చేర్చవలసి ఉంటుంది" అని తమరు వ్రాసి ఉన్నారు. బాబూజీ, అభిరుచి మరియు ప్రేమ అయితే నేను పెంచుకుంటు న్నానో లేదో నాకు తెలియవు కాని, రోజులు గడుస్తున్నట్లుగానే, వ్యాకులత కూడా దినదినాభివృద్ధి చెందుతున్నట్లు అనిపిస్తోంది. దానికి కారణం ఏమిటో ఆ దైవానికే తెలియాలి. బహుశా తమరు వేగంగా ప్రయాణింపజేయ దలచుకున్న కారణంగా ఇది కూడా వేగవంతంగా ఉందనుకుంటాను. "ఈ పని శీఘ్రంగా జరగటమంటే, అది నీ వంతు పనిగానే ఉంటుంది. దీనిలో లయ అవస్థ పొందుతూ వెళ్ళు" అని తమరు వ్రాసి ఉన్నారు. బాబూజీ, తమరు నా ద్వారా పని ఎలా జరగాలి అనుకుంటే, అదే విధంగా జరుగుతూ ఉంటుంది.

బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, నా దృష్టి అంతా విలీనమైపోయింది, ప్రకాశం కొరవడి పోతోంది. అయితే, 'మాలిక్' యొక్క కృపాదృష్టి, 'అతని' దృష్టి యొక్క ప్రకాశమే నాకు అడుగడుగునా వెలుగు నింపుతూ ముందుకు నడిపించుకుపోతూ ఉంది. అంధుని చేతిలో కర్రలాగా నాకు దాని ఊతమే లభిస్తోంది. అది పూర్తిగా నన్ను ముందుకు నడిపించుకుంటూ పోతోంది అని నేను భావిస్తున్నాను. ఇప్పుడు రెండు రోజుల నుంచి స్థితిలో కొంత మార్పు ఉన్నట్లు అనిపిస్తోంది. అన్ని విషయాలు ఎక్కడో లయమైపోతున్నట్లు నాకు అనిపిస్తోంది అని గతంలో నేను వ్రాసినట్లుగానే ఇప్పుడూ తలపిస్తోంది. ఇప్పుడు ఆ స్థితి కూడా అంతు చిక్కకుండా పోయినట్లు అనిపిస్తోంది. మృతుని శరీరంలో ఏదో క్రొత్త ప్రాణం ఆవహించిందని అనిపిస్తోంది. రెండు మూడు రోజుల నుండి, నాభిలో ఏవో ప్రకంపనలు ఉన్నట్లుగాను, తరచుగా కొంత బాధ ఉన్నట్లుగాను అనుభవమవుతోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 218

షాజహాన్‌పూర్,

16.05.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు అందాయి. వాటికి జవాబు వ్రాయవల్సిన అవసరం ఏమీలేకపోయినప్పటికీ ఎంతోకొంత వ్రాస్తున్నాను. ఒకరు ప్రాపంచిక వ్యవహారాలను గురించి మధనపడుతూ ఉంటే, మరొకరు ఇతర అనవసర విషయాలలో మునిగి తేలుతున్నారు. ఇదే నా దిగులు. నీ స్థితులను నేను పరిశీలిస్తున్నపుడు, ముందురానున్న పాయింట్లలో నిన్ను ఎంతకాలం నిలపాలని ఆలోచిస్తున్నాను. అది ఎందుకంటే, ఇంకా ముందు రాబోయే పాయింట్లలో కొన్ని చాలా

లాభదాయకమైనవి కనిపిస్తున్నాయి. నా దృష్టిలో, నేను నా చిన్నతనంలోను, యవ్వన దశలోను గురుకృపతో ఏవిధంగానైతే పనికి హత్తుకుపోయానో, అదే విధంగా ఎవ్వరైతే పురోగమించటానికి సాహసిస్తున్నారో అట్టివారి పని కూడా శీఘ్రంగా జరిపించాలని ఆశిస్తున్నాను. ఇప్పుడు చెప్పాలంటే, మాస్టర్ సాహెబ్‌కు చెందిన పని చాలా శీఘ్రంగా నిర్వహించబడింది. దానివలన కలిగిన లాభం ఏమిటంటే, నేను వారికి ఎక్కువ సిట్టింగ్‌లు ఇవ్వనవసరం లేకుండా పోతోంది. అప్పుడప్పుడు, వారికి కొంత సహాయపడుతూ ఉండటమో లేక వారి స్థితిని మెరుగుపర్చడమో చేస్తూ ఉన్నాను.

నేను నీ ‘C‘ పాయింట్ మీద తరచుగా ఎక్కువ దృష్టి పెడుతున్నాను. యాత్రాస్థితి ఇంకా ప్రారంభం కాలేదు కాని ఇప్పుడు కాబోతున్నది. నేను 7,8 రోజులు ఆ స్థితిలో నిలుపుతానని నీకు ఇంతకుముందే వ్రాశాను. ‘C‘ పాయింట్ తర్వాత దానికి ముందు ఉన్న స్థితిలోకి రాబట్టుతాను. కాని నేను బాగా పరిశీలిస్తున్నమీదట రానున్న పాయింట్‌లో ఇంకా వ్యాపక దృశ్యం ఉన్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు నేను ఏమి చేయాలో అర్థం కావటం లేదు. ఇటువంటి సందర్భంలో లాలాజీ సాహెబ్ నన్ను ఈ పాయింట్ మీద నుంచి ఎలా దాటించారో నిర్దేశించమని వారిని కోరతాను. నీ సోదర సోదరీలకు నా ఆశీస్సులు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 219

లఖీంపుర్,

16.05.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ క్షేమంగానే ఉన్నాము. అక్కడ తమరు అందరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. ‘మాలిక్’ కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు స్థితి చాలా శూన్యంగా అయిపోయింది, స్థితి అంతా మారిపోయింది. స్థితిలో ఉన్న రంగు (స్వభావం) మారిపోతూ, కరిగిపోతున్నట్లు అనిపిస్తోంది. ప్రస్తుతం 2,3 రోజుల నుండి స్థితి ఎలా ఉంది అంటే, రోజంతా గుండెను బాదుకున్నప్పటికీ, శాంతి చేకూరటం లేదు, అదేమిటో దైవానికే తెలియాలి. రాత్రింబవళ్ళు మదిలో హాఁ హాఁ అని ఆక్రందన చేస్తూ ఉన్నాను. ఇంతకు పూర్వమైతే అనుక్షణం ‘మాలిక్’లోనే రమించి ఉన్నటువంటి స్థితి కూడా ముగిసిపోయింది. బహుశా దీనివల్లనే హృదయం తపిస్తూ ఉన్నదేమో అని భావిస్తున్నాను. చేపను నీటిలో నుంచి బయటకు తీసిన తరువాత కొంతసేపు తన్నుకులాడి (విలవిల లాడి) తర్వాత కదలకుండా ఉండిపోతుంది (మరణిస్తుంది). అయితే నా విషయంలో ఆ విధంగా కూడా ఉండకపోతున్నది. ఇప్పుడు నా స్థితి గతంలో కంటె చాలా భిన్నంగా ఉంటోంది. ఈ స్థితిలో ఇంకా ఎలా ఉంది అంటే, ఒక క్షణకాలం కూడా అసలు నాలో ప్రాణం ఉందా లేదా అనే భావన కూడా కలగటం లేదు. బాబూజీ, నా కయితే అసలు నేను బ్రతికి ఉన్నానా, మరణించానా లేదా ఇంకేమైనా అయ్యిందా అని కూడా తెలియకుండా ఉన్నాను. ఇది ఏమిటో తెలుసుకోవాలని కూడా హృదయానికి అనిపించటం లేదు. ప్రస్తుతం, ఇల్లు విడిచి ఎక్కడికైనా పారిపోవాలి అని మాటి మాటికీ హృదయానికి వేదన కలిగిస్తోంది. అప్పుడప్పుడు అక్కడికి (అనగా తమ వద్దకు) రావాలని హృదయం వ్యాకులపడుతోంది. ఈ విషయం ఎవరికైనా చెప్పాలంటే, ఏమని చెప్పాల్సి ఉంటుంది? ఎలా చెప్పాల్సి ఉంటుంది? అయితే ఒక మాట, ‘అతడు’ ఎలా ఉంచితే, అలానే ఉండాల్సి ఉంటుంది. ఇప్పుడు ఉన్న స్థితి ఎటువంటిది అంటే, తపన పెరిగిపోతున్నది, ఆ సమయంలో నాకు ఏమీ తట్టదు, ఏమీ అర్థం కాదు. మరొకప్పుడు అది తగ్గిపోతుంది. ఇప్పటి ఈ స్థితిలో నాకు

'మాలిక్' గురించిన అనుభూతి కూడా లేకుండా పోతుంది. పూజ్య శ్రీ బాబూజీ, నేను 'మాలిక్'కు దూరమై పోవటంగాని, 'మాలిక్'తో వేరుపడిపోవటంగాని జరగలేదు కదా, మరైతే ఈ స్థితి ఏమై ఉంటుంది! హృదయంలో దాని జాడయే (రంగు) లేకుండాపోయింది. ఉదాసీన స్థితియే నలుదిక్కులా ఆవరించి ఉంది.

అమ్మగారు వచ్చిన తర్వాత, బిట్టో స్థితి ఎలా ఉందో తెలియటం లేదు. దయచేసి ఆ పరిస్థితి గురించి వ్రాయగలరు. మాతాజీ 'అతడి'ని ఎప్పుడూ సేమ్యా లేదా కారపూస తిననివ్వకూడదు అని అమ్మగారు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. అమ్మగారు తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు.

**17.05.1952:** దద్దా ద్వారా తమరు పంపించిన ఉత్తరం ఇప్పుడే అందింది. నన్ను గురించి తమరు ఆలోచిస్తున్నందుకు అనేక ధన్యవాదాలు. **విద్యార్థి అయినవారు బోధకునకు (టీచర్) సంతృప్తి కలిగించలేక పోయినట్లయితే అటువంటివారు వ్యర్థం అని, అలాగే ఏ మనిషి అయినాగాని, తన జీవితకాలంలో 'మాలిక్'కు తనను సమర్పించుకొనలేకపోయినట్లయితే అతని జీవితం వ్యర్థమని నా అభిప్రాయంగా భావిస్తున్నాను.** ఏమైనాగానీయండి, నాకు ఎవరి అవసరం ఉందో వారే కావాలి. నా 'మాలిక్' నాకు ఇంతకు మించి మరేమీ నేర్పలేదు. ఆరోగ్యం 10-12 రోజుల నుంచి బాగుండలేదు. నీరసం చాలా ఎక్కువగా ఉంటోంది. దీనిని గురించి చింతించాల్సిన పనిలేదు. క్రమంగా బాగుపడుతుంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 220

లఖీంపుర్,
22.05.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా పంపిన ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మికదశను నేను వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నేను ఎంతగా ప్రయత్నించినప్పటికీ, స్థితి బాగుపడటం లేదు. ఇప్పుడు నేను మునిగి ఉండటానికి బదులు పైకి తేలుతున్నాను. 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకోవటానికి ఎంతగా ప్రయత్నించి నప్పటికి కూడా, స్థితి ఎంత చెడ్డదిగా ఉంది అంటే, 'మాలిక్'ను నావారుగా భావించుకోవటంలో, దాగి ఉన్న మధుర స్మృతి యొక్క ఆనందం కూడా లభ్యం కాకపోయినప్పుడు, ఆ జ్ఞాపకంతో కలిగే లాభం ఏముంటుంది. ఏమైతేనేమి, ఇది కూడా 'అతని' అభీష్టమే అయి ఉండవచ్చు. ఆ జ్ఞాపకంతో నాకు సంతోషంగాని, మరేమైనాగాని కలగకపోవటమేగాక, మనస్సు కుమిలిపోతోంది. దానివలన నాకు శాంతి చేకూరి ఉండక పోవచ్చునేమో కాని, ఆ లోపల ఉన్న తపన అను అగ్ని, ఇప్పుడు ఆ జ్ఞాపకాన్ని దహింప జేస్తున్నట్లు అనిపిస్తోంది. ఒక సారంలేని, నిస్సారమైన జ్ఞాపకంతో లేదా ప్రయత్నంతో కలిగే ప్రయోజనం ఏముంటుంది! పూజ్య శ్రీ బాబూజీ, నా స్థితిలో ఏమైనా బలహీనత ఉందేమో, దయచేసి గమనించి, కనికరించండి. దయచేసి, నా స్థితి మెరుగవుతున్నదో లేక నీరసించిపోతున్నదో మరియు నేనేమీ చేయాలో తెలియజేయండి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 221

లఖీంపుర్,

27.05.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. D.F.O. నుంచి పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి తావూజీ వ్రాసిన ఉత్తరం ద్వారా తమ ఆరోగ్యం ఇప్పుడు బాగున్నదని తెలిసి సంతోషమైంది. నా ఆరోగ్య విషయంలో చెప్పదగినంత సత్ఫలితం ఏమీ కలగలేదు. ఇప్పటికీ బలహీనత కొనసాగుతూ ఉండటం వలన, ఉత్తరం వ్రాయటానికి ఒకటి, రెండు రోజులు ఆలస్యం అవుతోంది. ఏమైతేనేం, ఈశ్వరుని కృపతో అంతా బాగానే ఉంటుంది. దైవ అనుగ్రహంతో నాలో కలిగిన ఆత్మికదశను తమకు నివేదిస్తున్నాను.

ఇప్పుడు స్థితి మారిపోయింది; అది శుద్ధం మరియు సరళంగా అయిపోయింది. ఇప్పుడు ఈ స్థితి ఇంతకు క్రితంలాగానే ఉంది; ఇవి నాలో కలిగాయో లేదో అన్నట్లు ఇప్పటివరకు కలిగిన స్థితులన్నీ మరుగు పడిపోయాయి. ఈ విధంగా చూడటం నేను మాత్రమే కాదు, తమరు చూసినా కూడా ఇటువంటి దశను మాత్రమే చూడగలరు. నేను మైమరచి ఉన్నానేమో కూడా నాకు తెలియకుండా ఉంది. ఇప్పటి స్థితి ఎలా ఉంది అంటే, నేను బాగా ధ్యాస నిలిపి చూసినప్పటికీ, నేను ఇప్పుడు కాని, ఇదివరలో కాని, మైమరచి ఉన్నానేమో అనే విషయం కూడా తెలియటం లేదు. ఇప్పుడు 'అతడి'ని (అనగా దైవాన్ని) జ్ఞాపకం చేసుకోవాలని హృదయం కోరుకుంటున్నదో లేదో తెలియటం లేదు. ఒకవేళ అందుకు ప్రయత్నించి నప్పటికి కూడా 'అతని' జ్ఞాపకంతో ఆనందం కలుగుతుందో లేదో కూడా నాకు తెలియటం లేదు. అయితే ఒక్కటి మాత్రం ఖాయం, ఈ స్థితి ఎలా ఉంది అంటే, అది మనస్సుకు నచ్చినట్లు అనిపిస్తోంది. పూజ్య బాబూజీ, ఇప్పుడు ఈ స్థితి ఏమనిపిస్తోంది అంటే, ఇప్పుడు జీవనంగాని, మృత్యువుగాని ఏదైనా అసలు ఉందా? అని. ఈ స్థితి మంచిదా లేక చెడ్డదా అనేది తెలియటం లేదు. స్థితిలో వెచ్చదనంగాని, చల్లదనంగాని లేకుండా పోయాయి. నేను ఇప్పుడు నా నివాసంలో ఉన్నానా లేక నా నివాసం కానిచోట ఎక్కడైనా ఉన్నానో కూడా తెలియటం లేదు. ఇది అంతా ఏమిటో, ఏమైపోయిందో తెలియక తికమకగా ఉంటున్నది. ఇప్పుడు రోజులో మనస్సు కొంతసేపు నిద్రించటం, కొంతసేపు మేల్కొనటం అలాగే తిరిగి నిద్రించటం, మేల్కొనటం కొన్నిరోజులుగా జరుగుతూ ఉంది. దీనిని సోమరితనం అని చెప్పటానికీ వీలుకాదు. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు మానసానికి ఎలా అయిపోయింది అంటే, దానికి పూజగాని, 'అతని' జ్ఞాపకంగాని చేసుకోవటంలో ఎటువంటి ఉత్సాహంగాని, ఆనందంగాని లేకుండాపోయాయి. మానసం నిద్రపోతోంది లేదా ఎంత నిస్సారంగా ఉంటోంది అంటే, దాని మూలంగా శరీరం కూడా అచేతనమైపోయింది. ఇంతకు చెప్పాల్సింది ఏమిటంటే, దీనిని నిద్రావస్థ అని చెప్పటానికి అవకాశం లేకపోయినప్పటికి, ఊహా మాత్రంగా చెప్పటం జరిగింది. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు ఇది ఒక వింతైన సహజ అవస్థ వంటిదిగా అర్థమవుతోంది. దీని పర్యవసానంగా నాలో ఎటువంటి దశగాని, మరేమైనాగాని అనుభవానికి రావటం లేదు. బహుశా అన్నీ కూడా ఆ అవస్థలోనే లయమైపోయి ఉండవచ్చు.

పెద్ద సోదరుని పరీక్షా ఫలితలు ఒకటి రెండు రోజుల్లో ప్రకటితం కావచ్చు. అందుచేత కొంచెం ఉత్కంఠతో ఉన్నాడు. తమరు కకురా నుంచి ఇక్కడకు ఏ తారీఖున వస్తున్నారో తెలియదు. బిట్టో ఆరోగ్యం ఎలా ఉన్నదో దయచేసి వ్రాయండి. పూజ్య మాస్టర్ సాహెబ్‌కు నా ప్రణామం తెలియ జేయండి. అందరి అంతరాత్మలోను నేను ఉన్నట్లుగాను లేదా నా ఆత్మయే అందరి యొక్క అంతరాత్మగాను నాకు అప్పుడప్పుడు అనిపిస్తోంది. బాబూజీ, అసలు నేను ఎవరనిగాని, ఇతరులు ఎవరనిగాని నాకు తెలియకుండా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 222

లఖీంపుర్,
17.05.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు సుఖంగా చేరి ఉంటారని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ బాగానే ఉన్నారు. అక్కడ కూడా అందరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మికదశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు దశ సరళం కంటె సరళమైనదిగాను, స్వచ్ఛత కంటె స్వచ్ఛమైనదిగాను ఉంది. ఆధ్యాత్మికత అంటే ఏమిటో అసలు నాకు తెలియనట్లు అనిపిస్తోంది. ఇంకొకరకంగా చెప్పాలి అంటే, ఆధ్యాత్మికత, మొదలైనవాటి జ్ఞానాల బంధనం నుంచి కూడా 'మాలిక్' నాకు విముక్తి కలిగించినట్లు గాను, లేదా తేలికదనం, సరళత్వం మరియు ఆధ్యాత్మికతల పరిణామ ఫలితమే నేను అన్నట్లుగాను అనిపిస్తోంది. అటుపైన దైవానికి తెలియాలి.

రోజులు గడుస్తున్నకొద్దీ, నాకేమీ లేకపోయినట్లుగాను, పేదరాలునై పోయినట్లుగాను అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు ఈ మనస్సు మరియు దృష్టి దేనిలోనో లీనమైపోయినట్లు ఉంది. వాటికి 'అతడు' తప్ప మరేవి ఆకర్షించలేక పోతున్నాయి. నేను ఇప్పుడు 'అతని' ప్రేమలోనే కూరుకు పోయాను. నాకు ఇంకేమీ అవసరం లేదు. దీనిని నేను కూరుకుపోయానని చెప్పాలా లేక ఆ కూరుకుపోవటమే నాలో జీర్ణించుకుపోయిందో నాకు అర్థం కావటం లేదు. ఇప్పుడు నేను ఎప్పటిలాగానే అయిపోయాను. అయితే ఒక్క కాంక్ష మాత్రం నాలో ఉంది. అప్పుడప్పుడు శిరస్సులో విశేషమైన చల్లని బిందువులు పడుతున్నట్లు అనుభవమవుతోంది. వెన్నులో ఒక రకమైన గిలిగింత అనుభవమవుతూ ఉంది. శ్రీ బాబూజీ, అది ఏమిటో తెలియదు కాని, నా సంబంధం ఒక అద్భుతమైన స్థితితో కలిసి ఉన్నట్లు అనిపిస్తోంది. తమరు ఇక్కడ ఉన్నంతవరకు, నేను చెప్పాల్సింది ఏమీలేదుగాని, నేను మాత్రం వేర్పాటు తనాన్ని గురించి పూర్తిగా మర్చిపోయి ఉన్నాను. బహుశా అలాగే ఒకటిగానే ఉంటూ ఉంటూ, ఆ ఏకత్వం కూడా అదే స్థితికి చేరినట్లు అనిపిస్తోంది.

శ్రీ బాబూజీ, పరిపూర్ణ తేలికదనం, మరియు పవిత్రతతో నిండి ఉన్న మాలిక్' యొక్క విశాల హృదయంలో నేను ఈదుకుంటూ పోతున్నట్లు నేను చూస్తూ అనుభూతి చెందుతున్నాను. ఒక వర్ణనాతీతమైన మైదానంలో నిశ్చింతగా ఈదుకుంటూపోతున్నాను. అలా రోజులకొద్దీ ఆ స్థితితో నేను హత్తుకుపోయి ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. పూజ్య శ్రీ బాబూజీ, నాకు కనిపిస్తున్న ఈ దశ యొక్క దృశ్యం, మాటల్తో చెప్పనలవి కానిది. అది మూగవాని నోట బెల్లం అన్నట్లు ఉంది. అది తమ మహత్తుతో కల్పించబడిన దృశ్యం ఏమైనా కాదు గదా! అది 'మాలిక్' యొక్క అపార కృపతో, 'అతని'తోనే అనుగ్రహించబడిన దివ్యదృష్టితో ఒక దృశ్యం నా కళ్ళకు కట్టింది. అది ఏమిటో తమరు దయచేసి నాకు తప్పకుండా వ్రాయండి. ఆ దృశ్యం నా కళ్ళెదుట కనిపిస్తోంది. 'మాలిక్' నాకు తమ దయతో కల్పించిన మరొక విశేషం ఏమిటంటే, ఆ విశాల హృదయం లేదా ఒక అలౌకిక దశలో నేను ఈదుకుంటూ పోతున్నానా, లేక నా ఆలోచన వంటిది ఏదైనా ఈదుకుంటూ పోతున్నదా అని తలపిస్తోంది. బాబూజీ, నా గత స్థితులన్నింటి తోను నేను తృప్తి చెందినట్లుగాను, అవి అన్నీ కాలగర్భంలో మరుగైపోయి నట్లుగాను నాకు అనిపిస్తోంది. ఇప్పుడు, ఇంక దానిలోనే ఈదుకుంటూ పోవాలని, ఈదుకుంటూ పోతున్నానని, అలాగే ఈదుకుంటూ పోతానని, దానికి అంతం అంటూ లేదు అని అనిపిస్తోంది.

పూజ్య బాబూజీ, నాకు ఇసుమంతైనా ముక్తి కాంక్ష లేదు, లక్ష్యం యొక్క జ్ఞాపకం లేదు, ఉన్నదల్లా 'అతని' కృపతో 'అతని' ధ్యాస మాత్రమే. 'అతని'కి ఇష్టం వచ్చినట్లు ఎక్కడికైనా తీసుకు పోనివ్వండి. ఎక్కడికి, ఎలా తీసుకు పోతున్నారనేది నాకు తెలియదు. అయితే ఇప్పుడు పైన చెప్పబడిన దశయే నా అభ్యాసానికి (ధ్యానానికి) కేంద్రంగా ఉంది.

నేను ఎంత దీనురాలుగా (పేదరాలు) ఏమీలేనిదానిగా అయిపోయాను అంటే, నాలో ఇంక ఏమైనా ఉన్నాయేమో అనే అనుమానానికి కూడా అవకాశం లేకుండాపోయింది. ఒక 4,5 సంవత్సరాల బాలుడు తల్లి ఒడిలో ఒదిగి నిశ్చింతగా గడుపు తున్నట్లు గానే, తల్లి ప్రేమ రసంలో మునిగి తేలుతున్నట్లుగానే నేను కూడా నిశ్చింతగా ఉన్నాను. బహుశా నాది కూడా అటువంటి అజ్ఞాన దశయే అన్నట్లు ఉంది. బాబూజీ, నాకు ఇప్పుడు, నా ప్రేమను గురించి కూడా తెలియకుండా పోయింది, కాని 'మాలిక్' నాపై వర్షింపజేస్తున్న అపార కృపారసంలో తడిసి ముద్దవుతున్నాను. ఇప్పుడింక ఈ బాలిక (అనగా నేను) ఏమీ తెలియని దానివలె, తల్లి (అనగా 'మాలిక్') మీదనే భారంమోపి ఉంది. దానితో నేను ప్రేమించబడవచ్చు లేదా 'అతని' అభీష్టంమేరకు ఏమైనా కావచ్చు. (Activity) కార్యకలాపాలు మళ్ళీ ఆరంభమై కొంత తగ్గుముఖం పట్టున్నాయి.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడైతే ఒకటి రెండు రోజుల నుండి శూన్యంగా అనిపిస్తోంది. అప్పుడప్పుడు పూజ్య మాస్టర్ సాహెబ్ ఇంటివద్ద తమరు భోజనం చేసి బయలుదేరిన దృశ్యం జ్ఞాపకం వస్తోంది.

'ఈశ్వరు'ని కృపతో కేసర్ రెండవ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. నారాయణ దద్దా కూడా మూడవ శ్రేణిలో ప్యాసయ్యాడు. మా అందరి తరఫున తామందరికీ అనేకానేక అభివందనలు తెలుపుతున్నాము. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు. బిట్టో ఆరోగ్యం గురించి దయచేసి ఉత్తరం వ్రాయండి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 223

లఖీంపుర్,

23.06.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. ఇక్కడ అంతా కుశలమే. 'తమరు' కూడా కుశలమేనని భావిస్తున్నాను. భగవంతుని కృపతో బహుశా తమ శ్వాసక్రియకు మరియు మెదడుకు మత్తుమందు ప్రభావంతో కొంత లాభం చేకూరి ఉండవచ్చు. నాకు అప్పుడప్పుడు తమ జ్ఞాపకం బాగా వస్తోంది. 'మాలిక్' దయతో నాలో నడుస్తున్న ఆత్మికదశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఈ స్థితిలో, జనులందరు బ్రతికి ఉన్నవారు, మరణించి ఉన్నవారు అందరూ ఒకే విధంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఎవ్వరైనాగాని జీవించి ఉన్నారా లేక మరణించి ఉన్నారా చెప్పనలవి కాకుండా ఉంది. ఈ దశ ఎలా ఉంది అంటే నేను, ఇతరులు అనే భావం అనగా ద్వైతభావం లేకుండా పోయింది. ఎవ్వరైనా జన్మిస్తున్నారనిగాని, మరణిస్తున్నారని గాని అనేది తెలియకుండా ఉంది. అది ఏమిటో దైవానికే తెలియాలి. నాలోను, అంతటా ఒక సహజ దశ మాత్రమే వ్యాపించి ఉన్నట్లు అనిపిస్తోంది. దానిని నేను కేవలం దశగానే భావిస్తున్నాను. ఇప్పుడు అంతటా ఒకే అద్దం పరచబడి ఉన్నట్లుగాను, దానిలో ఒకే ఒక దశ ప్రతిబింబిస్తున్నట్లు గాను, అదితప్ప ఇంకేమీ లేనట్లుగాను అనిపిస్తోంది. కాదు, కాదు, దానిని ప్రతిబింబం అనటానికి వీల్లేదు, మరైతే

దానిని ఏమని అనాలో నేను సరిగా వ్రాయలేకపోతున్నాను.

ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, మిఠాయి తింటున్నట్లయితే మిఠాయి అయిపోతుంది కాని మనం దృష్టి పెట్టినట్లయితే తియ్యదనం ఎంతో కొంత మిగిలి ఉంటుంది. నాకు మాత్రం మిఠాయి తీపి వగైరా ఏమీ తెలియవు. శ్రీ బాబూజీ, ఎవరి సంకేతం లోనయితే నటనమాడుతున్నానో, అదే విధంగా నర్తిస్తున్నాను. ఇప్పుడు నా స్వభావమే సహజసిద్ధంగా లేదా సహజస్థితిగా అయిపోయింది. అన్నింటిలోను సహజత్వమే తొణికిసలాడుతోంది. ఎందుకంటే, అన్నింటి యొక్క ప్రాముఖ్యత తొలగిపోయింది. బహుశా ఇప్పుడు దశ నిరంతరం ప్రకృతితో అనుసంధానమై ఉంటోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఇంకొక విషయం ఏమిటంటే, ఎవ్వరైనా నన్ను ఏదైనా ఒక దశ గురించి అడిగినట్లయితే, నేను దాని గురించి చెబుతున్నప్పుడు, అదేమిటో తెలియదుగాని, నేను చెబుతూ ఉండగానే అదే స్థితి బాహ్యంగా విస్తరిస్తున్నట్లు కనిపిస్తోంది. బాబూజీ, ఏ స్థితి అయితే నా ఎదుట నిలిచి ఉంటుందో, అది తరచుగా నా స్థితిగానే ఉంటుంది. కాని ఇప్పుడు అలాకాకుండా, ఆ స్థితి ఉన్నప్పటికీ దానిని చెప్పనలవికానంతగా ఉంటోంది. ఇప్పుడు లోపల ఉన్న స్థితి లేదా ఆనందం చెప్పతరం కాకుండా ఉంది. అప్పుడప్పుడు మనస్సులో ఆ స్థితి లేక ఆనందాన్ని చూసి ఆహా! ఆహా! అనిపిస్తోంది. ఆ ఆనందం ఎంత అంటే చెప్పలేనంతగా ఉంది. దీనికి సరితూగేది మరేదీ లేదన్నట్లు ఉంటోంది. అయితే నా దృష్టి ఎదుట ఏమీ నిలబడలేక పోతున్నాయి. నా దృష్టి ఎక్కడ విలీనమైపోయిందో నాకు తెలియటం లేదు. తమరు ఇక్కడ ఉన్నంతవరకు స్థితి కొంత ఆగి ఉంది, కాని నాకు మాత్రం అది అలా ఆగి ఉండటానికి ఇష్టం లేదు. నిన్నటి నుంచి స్థితిలో కొంత మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు అర్థమవుతున్నది ఏమిటంటే, ఇప్పటివరకు ఉన్నటువంటి దశ, లోపలనే కూరుకుపోయినట్లుగాను లేదా కలిసిపోయినట్లుగాను అనిపిస్తోంది. బాబూజీ, తమకు తెలియనిది ఏముంది, నా సమస్తమూ 'మాలిక్'కు నివేదించబడి ఉంది. ఇంకొక విషయం ఏమిటంటే, నాకు ఎంత అల్పంగా కోపం వచ్చినప్పటికీ అది నాకు సహించరానిదిగా ఉంటోంది. ఇది నాకు నచ్చటం లేదు. 'మాలిక్' కృపతో అంతా సవ్యంగా అయిపోతుంది. అయితే 'మాలిక్' కృపతో, అలా వస్తున్న కోపం కూడా చాలా అల్పమైనదిగానే ఉంటున్నది. బహుశా ఇప్పుడు అది కూడా రాకపోవచ్చు. ఇంకా ముఖ్యమైన సంగతులు ఏమీ లేవు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 224

షాజహాన్‌పూర్,

29.06.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు అందాయి. నీవు జూన్ 17వ తేదీతో వ్రాసిన ఉత్తరానికి చెందిన కేవలం రెండు విషయాలకే జవాబు వ్రాస్తున్నాను. శిరస్సులో సన్న సన్న నీటితుంపరలు రాలుతున్న అనుభూతి చెందావంటే దానికి కారణం నీవు మాస్టర్ సాహెబ్‌వద్ద సిట్టింగ్ తీసుకుంటున్నప్పుడు శిరస్సులో కొంత వేడిగా ఉన్నట్లని పించిందని వ్రాశావు. అందుచేత ఆ వేడిమి నుంచి ఉపశమనం కలగటానికి నేను చల్లని నీటి తుంపరలు కురిపించాను. ఇప్పుడు నీలో ప్రేమ కారణంగా ఆకర్షణశక్తి పెరగటంతో పాటుగా గ్రహణశక్తి (గ్రహించేశక్తి) యొక్క యోగ్యత కూడా వృద్ధి చెందింది. అందువలన ఇది స్థిరపడింది. ఆలోచనలో జీవం ఉంటుంది. అదే కనుక మాయతో సంబంధంలేనిదిగా ఉన్నట్లయితే దానిలో దివ్యశక్తి వృద్ధి చెందుతూ ఉంటుంది. దీనినిబట్టి మాయ యొక్క ప్రభావం లేకుండుటమనేది అనివార్యమే. కాని నీలో ఆ దివ్యశక్తిని స్థిరంగా నిలుపుకునే సామర్థ్యం ఉండటం వలన దాని ప్రభావం లేకుండా

పోయింది. నీవు అదే ఉత్తరంలో, ఒక వింతైన మైమరపించే మైదానంలో స్వేచ్ఛగా (నిశ్చంతగా) విహరిస్తూన్నట్లు అనుభవం కలిగిందని, దానిని వివరించటానికి మాటలు సరిరావని వ్రాశావు. ఇది నిజంగా చాలా శ్రేష్ఠమైన స్థితి. లాలాజీ సాహెబ్ ఒకానొక సందర్భంలో "ఆధ్యాత్మిక ఉన్నతి అంటే ఏమిటి?" అనే దానిని వివరించారు. అది ఒక ఎడారివంటి సువిశాల మైదానంలాగా ఉంటుంది, దానిలో పయనిస్తూ ఉండాలి, అయినప్పటికీ ఢిల్లీ ఇంకా దూరంగానే ఉంది (అనగా గమ్యం / లక్ష్యం ఇంకా బహుదూరంగా ఉంది). ప్రత్యక్షంగా ఉన్న ఆ సువిశాల మైదానంలో ఈదుకుంటూ పోవాలి. ఇప్పుడు మార్గం సుగమమైంది (తెరచుకుంది), ఆధ్యాత్మికత యొక్క ఆరంభం బాగా జరిగింది. ఇప్పుడు ఇంక దీనిలో కలిగే పురోగతి అంతా ఆ ఆధ్యాత్మికతకు సంబంధించినదిగానే ఉంటుంది.

**లాలాజీ సాహెబ్ సందేశం:** "ఏమైనప్పటికీ ఏ ఒక్క స్థితిని కూడా సరిపోయింది అని భావించరాదు. 'రామచంద్ర' పైన వివరించిన మాట ఢిల్లీ ఇంకా దూరంగా ఉంది అనేది సహేతుకమే. ఇప్పటివరకు నీవు చూసింది ఏమాత్రం! చూడాల్సిన అసలైన స్థితులు ఇప్పుడు రాబోతున్నాయి. వీటిని అనుభూతి చెందాలంటే, విశాల హృదయం, మంచి గ్రహణశక్తి మరియు తెలివితేటలు అవసరం. మన విధానంలో ఈ స్థితులు అందరిలోను కలుగుతాయి కాని అభ్యాసులకు వాటిని పసిగట్టే సామర్థ్యం లేనందు వలన ఆ ఆనందానుభూతి అందకుండా పోతోంది. ఇంక మిగిలిన ఉత్తరం జూన్ 23వ తేదీతో ఉన్న దానిలోని సమస్యలకు సమాధానం అవసరం లేదు. దానిలో ఒక స్థితి యొక్క వర్ణన ఉంది. నేను ఇంక ముగింపు చేస్తున్నాను, సంతోషంగా ఉండు. రామచంద్ర తగిన విధంగా జవాబు ఇస్తారు."

నిన్నటిరోజున అనగా 28వ తేదీ శనివారం నాడు నీలో ఆలోచనల కారణంగా కొంత అలసిపోయినట్లు అనిపించింది, కాని ఆ పరిస్థితి ఈ రోజు లేదు. బాగా వేగంగా పురోగమించటం మూలంగా ఈ విధంగా జరిగి, కొంచెం అలసిపోయినట్లు అనిపించింది. ఆ సమయంలో శక్తి వృద్ధి గావించ బడుతుంది. నాకు కూడా విశిష్టస్థితులు దాటేటప్పుడు ఈ విధంగానే అనుభవమయ్యింది కాని దాని వలన నష్టం ఏమీ ఉండదు. ఇప్పుడు 'D' స్థానంలో నిన్ను ఎప్పటి వరకు నిలపాలి అనేది నాకు తోచటం లేదు, కాని ఒకటి రెండు రోజుల్లో నిర్ణయిం తీసుకుంటాను. అప్పుడు నాకు తోచిన దానినిబట్టి పని చేస్తాను.

ఇప్పుడు జూన్ 24వ తేదీతో ఉన్న ఉత్తరంలో వ్రాసిన స్థితి చాలా మంచిది. నేను కూడా ఇటువంటి స్థితికొరకే తపిస్తాను. **ఇంత శ్రేష్ఠమైన స్థితిని చూశాక, నావద్ద వేయి సామ్రాజ్యాలు ఉండి ఉంటే, ఈ స్థితి కొరకు త్యాగంచేసి ఉండేవాడినని అనిపించింది.** అయితే ఇదే అంతంగా, ఇంక చేయవలసినది ఏమీ లేనట్లుగా భావించవద్దు.

**"కులాసాకబుర్లతో సునాయాసంగా ప్రియుడు దక్కడు**
**ఆవేదనతో రగిలినవారే ప్రియుని దక్కించుకున్నారు**
**కులాసాకబుర్లతో ప్రియుడు దక్కడమే జరిగితే**
**అభాగిని లేదా శుష్కప్రియాలతో మిగిలేది ఎవ్వరు?"**

(అనగా సునాయాసంగా భగవంతుని పొందటమే జరిగితే ఇంక ఆ ఫలితం దక్కని అభాగ్యులు ఎవరు ఉంటారు అని అర్థం)

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 225

లఖీంపుర్,
29.06.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను నారాయణ దద్దా ద్వారా పంపిన ఉత్తరం చేరి ఉంటుదని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ క్షేమమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మికదశను వివరిస్తున్నాను.

ఇప్పుడు ఎలా ఉన్నదంటే, లోపల దశ లేదా ఆనందం ఏదైతే ఉన్నదో అదంతా కూడా పూర్తిగా కరిగిపోయి ఒక సమానస్థాయిలో ప్రవహిస్తూ పోతున్నది. వెన్నెముకలో మళ్ళీ అదే రకమైన జర జర ప్రాకులాటవంటిది ఉంటోంది. ఇప్పుడు ఈ స్థితి మంచిదిగా అనిపించటం లేదు. ఎప్పుడైతే స్థితి మారుతుందో, అప్పుడు ఒక్కసారిగా ఒక విధమైన స్థూలత్వం పైకి ఉబికి వచ్చినట్లు అనిపిస్తుంది. అది మళ్ళీ ఒకటి రెండు రోజుల్లోనే నిర్మలమైన విశుద్ధ దశగా ఏర్పడుతుంది. ఇప్పుడు ఇంతకుపూర్వం ఏ దశనైతే నేను చాలా శ్రేష్ఠమైనదిగా తెలిపానో, అది ఇప్పుడు దాని నామరూపాలు లేకుండాపోయింది.

నిన్న ఉదయం నుంచి దశలో కొంత మార్పు వచ్చింది. బాబూజీ, ఇప్పుడు లోపల ఎంత చల్లదనం ఉంటుంది అంటే, అది ఎంతైనా కావచ్చు, ఎటువంటిదైనా కావచ్చు కాని అది వేడిమితో కూడా వేడెక్కనిదిగా ఉంటున్నది. ప్రస్తుతం నా స్థితి ఎలా ఉంది అంటే, నా జీవితంలో 'మాలిక్' జ్ఞాపకం లేకుండా ఒక్క క్షణమైనా లేదనిపిస్తోంది. పగలు, రాత్రి వస్తున్నాయి, పోతున్నాయి; ఋతువులు వస్తున్నాయి, మారిపోతున్నాయి కాని, 'మాలిక్' దయతో నాపై వాటి ప్రభావం ఎంతమాత్రమూ ఉండటం లేదు. నాకు ఎవరితోనూ, దేనితోనూ సంబంధం ఉన్నట్లు అనిపించటం లేదు. అన్ని బంధనాల నుంచి నేను విముక్తి పొందినట్లు అనిపిస్తోంది. నా లోపల, బయట, అలాగే నరనరాలు అన్నీ 'మాలిక్'గానే అయిపోయినట్లు కనిపిస్తోంది. అయితే నా దశ ఎలా ఉందంటే, నాలో నా 'మాలిక్'యే ఉన్నారు అన్నట్లు ఉంది. అది కూడా ఎంత సహజంగా నంటే, నాలో 'అతని' జ్ఞాపకమంటూ ఏదీ లేకుండాపోయింది. ఒకవేళ నేను దృష్టి పెట్టినప్పటికీ, లోన, బయట, రోమ రోమంలోను, కణ కణంలోను 'అతడు' వ్యాపించి ఉన్నట్లు కనిపిస్తోంది. బాబూజీ, ఇంకొక రకంగా చెప్పాలంటే, "సర్వత్రా వ్యాపించి ఉన్న నా పేరు నిరంజనుడు (దైవం)" అని వ్యక్తమవుతున్నట్లు నా దశ తలపిస్తోంది. ఇప్పుడు నేను మరియు 'మాలిక్' వేరుకానటువంటి ఒక చిత్రమైన శీతల దశ సర్వత్ర వ్యాపించి ఉన్నట్లు తెలుస్తోంది. నేను ఎప్పుడైతే వెనుదిరిగి చూస్తానో అప్పుడు ఆ శీతల స్థితిలోనే నేను కలగలిసిపోయినట్లు గ్రహిస్తున్నాను. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నేను నా సమస్తమూ నా వెనుకకు నెట్టివేసి నా 'మాలిక్' వెంటబడి ఎక్కడకు వెళ్తున్నానో, ఇంకా ఎంత దూరం వెళ్ళాలో కూడా తెలియటం లేదు. అయితే నన్ను అలా నడిపించుకుపోయేవాడు, నాకు ఎంత ఇష్టంగా ఉన్నాడు అంటే, 'అతని' వెంట నడుస్తూ ఉంటే, ఆ నడకలో అలుపు అంటూ లేకపోగా పురోగమనమే జరుగుతోంది. ఇంకా ఏమిటంటే, 'అతని' వెంట నడవకుండా ఒక్క క్షణమైనా నిలిచి ఉండటం జరిగితే సహించ లేకపోతున్నాను. ఈ ఆధ్యాత్మిక మార్గంలోని అన్ని స్థితుల మాధుర్యాన్ని చవిచూపిస్తూ, తన స్వంత బిడ్డలాగా ప్రేమాభిమానలతో నా యోగ క్షేమాలు చూస్తూ 'అతడు' నన్ను వెంటబెట్టుకొని తీసుకుపోతున్నాడు. పూజ్య శ్రీ బాబూజీ, ప్రపంచంలో ఇటువంటివారు ఎవరు ఉన్నారు? **ప్రపంచానికి ఇటువంటి అమోఘమైన 'దివ్య విభూతి', 'పరమనిధి' (డివైన్ పర్సనాలిటీ)ని అనుగ్రహించి, మనల్ని కృతార్థులు గావించి నందుకు నేను నా 'సమర్థ లాలాజీ మహరాజ్'కు కోటి ధన్యవాదాలు అర్పించుకుంటున్నాను.** 'మాలిక్' దయతో నాకు పైన చెప్పిన దశలన్నీ కనిపిస్తూ ఉన్నందుకుగాను 'అతని'కి, నా హృదయం నుంచి 'ఆహా! ఆహా!' (ఆహాకారాలు) అను శబ్దాలే మారుమ్రోగుతూ

ఉన్నాయి. బాబూజీ, నాకయితే నా హృదయమే సర్వత్ర వ్యాపించి ఉన్నట్లుగాను, సమస్త బ్రహ్మాండంలోను వ్యాపించి ఉన్నట్లుగాను, ఇంకా చెప్పాలంటే, నా హృదయం 'అతని' హృదయంలోనే కలిసిపోతున్నట్లుగాను అనిపిస్తోంది. ఇంకా ఏమి అనిపిస్తున్నది అంటే, ఇప్పటివరకు కలిగిన దశలన్నీ కూడా ప్రళయమై పోయినట్లు అనగా విలీనమైపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఒక వింత పోకడ, వింత రంగు కనిపిస్తున్నాయి. అలా ఎందుకోగాని నన్ను 'అతడు', నన్ను నేను ప్రేమించుకుంటున్న దానికంటే కూడా అధికంగా ప్రేమిస్తున్నాడు. పూజ్య శ్రీ బాబూజీ, రెండు మూడు రోజుల నుండి కేసర్ ధ్యానం చేస్తున్నప్పుడు ఆమె మెదడు పైకి లాగబడుతున్నట్లు అనుభూతి చెందుతోంది. ఆమెకు తలనొప్పి కూడా కలిగింది కాని ఇప్పుడు తగ్గిపోయింది. ఈ విషయంలో నా తప్పు ఏమీలేదు కదా! ఎందుకంటే, ఆమె ధ్యానంలో ఎప్పుడూ లోతుగా వెళ్ళుతుంది. అయినా కూడా కేసర్ మనస్సు విచిత్రంగా అనిపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 226

లఖీంపుర్,

02.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది, చదివి చాలా ఆనందించాను. కేసర్ దశ గురించి చదివిన తర్వాత నాకు అపారమైన ఆనందం కలిగింది. అందుకు కారణం ఆమె నాకు చెందినది కావటం కాకుండా ఆమె కూడా 'మాలిక్' కృపకు చెందినదిగా కాబోతున్నందుకు. ఆమె 'మాలిక్'కు చెందినదిగా కావాలని కోరుకుంటున్నాను కనుక దానికి సంబంధించిన విషయంతోనే నేను సంబంధం కలిగి ఉన్నాను. తమరు తావూజీకి వ్రాసిన ఉత్తరంలో ఈశ్వరీయ ధార యొక్క వర్షం ధారాపాతంగా వర్షిస్తూనే ఉంది అని వ్రాసినది చాలా బాగున్నది. ఎవ్వరైనా ఆ వర్షాన్ని చూసినట్లయితే ఎట్లా ఉంటుందో! కేవలం చూడటమే కాకుండా, నేనయితే కబీరుదాసు వర్ణించిన విధంగా చెబుతాను – '

**"వా దిస్వా బాదర్ న ఉభరే। రిమ్ ఝిమ్ బవసత్ మోహ్ రె।**
**చౌబారె నా బైఠ్ రహై, జా భీం జౌ నిందేహ్ రె॥"**

అనగా ఆ దేశంలో (దివ్యదేశం) మేఘాలు ఆవరించకపోయినప్పటికీ, ధారాపాతంగా వర్షం పడుతూనే ఉంది. ఇంటిలో కూర్చుండిపోకుండా, నీ శరీరాన్ని, ఆత్మను పూర్తిగా తడుపుకో. అప్పుడే నీ జీవితం సార్థకమవుతుంది, అని భావం.

పూజ్య సమర్థజీ మహరాజ్ (లాలాజీ మహరాజ్)కు నా ప్రణామం. వారు ఈ విధంగా వ్రాశారు: "ఇప్పటివరకు నీవు చూసినది ఏమాత్రం! చూడదగిన స్థితులు ముందు కలగబోతున్నాయి. వాటి అనుభూతి చెందటానికి విశాల హృదయం ఉన్నవారు, బాగా గ్రహించుకోగలిగినవారు మరియు వివేకవంతులు కావాలి." పూజ్య బాబూజీ, నాకయితే, ఇప్పటివరకు జరిగింది ఏముంది? ఇప్పటివరకు నిర్మలీకరణ మాత్రమే జరిగింది. అది ఇంకా జరుగుతూనే ఉందని అనిపిస్తోంది. అటువంటప్పుడు నేను ఏ స్థితిని మాత్రం తగినంతగా అర్థం చేసుకోగలను! మొదట అయితే, అది అర్థమయ్యిందే కాదు, అదే కనుక నాలో కొంతగానైనా అనుభూతి కలిగి ఉంటే, దాని మొత్తం అంచనా వేసుకోవటం జరిగి ఉండేది. ఇప్పుడు తెలుసుకొనగలిగింది కొద్దిగా గాని, ఎక్కువగా గాని, ఏదైనా కూడా అది 'మాలిక్' నిధియే. ఎవ్వరైతే దానికి కారకులో (దానిని తయారు చేశారో) వారుతప్ప ఇంకెవ్వరు దాని అంచనా వేయగలరు! బాబూజీ,

ఇందుకుగాను పెద్ద హృదయం, మంచి అవగాహన (తెలివితేటలు), మంచి జ్ఞానం (బుద్ధి) అవుసరమై ఉండగా, నేను ఎలా తెలుసుకోగలను. ఇవన్నీ ఎవరికి చెంది ఉన్నాయో, వారు మాత్రమే అర్థం చేసుకొనగలరు. నిజం చెప్పాలంటే, నేను ఇప్పటివరకు 'ఎవ్వరి'నైతే ఎరిగి ఉన్నానో 'వారి'ని మాత్రమే ఎరుగుదును, అందుకోసమే ఇంకా బాగా ప్రయత్నం చేస్తూ ఉంటాను కూడా. నాకు ఎంత పరిజ్ఞానం కలిగించాలో అది 'అతని' చేతుల్లోనే ఉంది. నా మానసిక గ్లాని (Mental fatigue) తొలగించినందుకు తమకు అనేకానేక ధన్యవాదాలు. తమరు అమ్మను 'అమ్మ' అని పలుకుతున్నందుకు ఆమె ఎంతగానో సంతోషపడుతోంది.

ఇప్పుడు 'మాలిక్' కృపతో నాలో కలిగినటువంటి ఆధ్యాత్మిక దశను గురించి వివరిస్తున్నాను. వీపు భాగంలోను, మధ్యలో ఎడమవైపున, వెన్నెముకకు దాదాపుగా ఆనుకుని ఒక విధమైన శంక కలుగుతున్నది. చెమట పట్టిన తర్వాత గాలి వీచినప్పుడు ఎటువంటి హాయిగొల్పుతుందో, అదే విధంగా వీపు భాగంలో ఏదో కంపనం అనుభవమవుతోంది. మనస్సు పూర్తిగా తెరుచుకుని స్వచ్ఛంగా ఉన్నట్లనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు ఉన్న దశ ఎలా ఉంది అంటే, తమకు గతంలో ఒకసారి వ్రాసినటువంటి దశయే ఉంది. దానిని ఇతరులు ఎవరైనా మంచిదిగానే అనుకుంటున్నప్పటికి నాకు మాత్రం దానిని పునరుద్ధాటించాలని అనిపించటం లేదు. అందుచేత దానిని పునఃస్మరణ గావించుకోవటమనే ప్రశ్నయే లేదు. దానిని చదవాలనుకుంటే, మళ్ళీ వెనుదిరిగి చూసినట్లు ఉంటుంది, అయితే నా దృష్టి అందుకు వివశురాలైపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఏ దశ అయితే నా అనుభవానికి రావటం జరిగి దానిని కొద్దిసేపటి తర్వాత వ్రాయటానికని ఆలోచన చేస్తున్నప్పుడు, అది ఒక స్వప్న స్థితిలాగ ఆలోచించుకుని వ్రాస్తున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడైతే, సమస్త బ్రహ్మాండం, వగైరా నా దృష్టి ఎదుట నుండి తొలగిపోయినట్లుగాను, కేవలం ఒక స్వచ్ఛమైన, సరళమైన మైదానం మాత్రమే నిలిచి ఉన్నట్లుగాను అనిపిస్తోంది. దీనిని గురించి తమకు ఇదివరకే వ్రాసి ఉన్నాను. దానికి తమరు సమాధానం వ్రాశారు కూడా. అది ఏమిటో దైవానికే తెలియాలి. నాలో అశాంతి మరియు తపన రోజురోజుకూ అధికమై పోతున్నాయి. నిజానికి ఆ విధంగా కావలసియే ఉంది. అదే నాకు శాంతిని ఇస్తుంది కూడ.

అమ్మ 'తమకు' ఆశీస్సులు తెలుపుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. బిట్టో మరియు చిన్న సోదరుడు తమకు ప్రణామం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 227

లఖీంపుర్,

04.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నారాయణ్ దద్దా ద్వారా తమకు ఇంకా శ్వాస ఇబ్బంది కొనసాగుతున్నట్లు తెలిసింది. బిట్టో స్థితి గురించి, జ్వరం ఇంకా 102 డిగ్రీలు ఉంటున్నదని తెలిసి అందరికీ బాధగా ఉంది. పాపం, ఆమె త్వరగా కోలుకోవాలి. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ! ఇప్పుడు అసలైన దశ ఎలా ఉంది అంటే, సహజమైన నిరుపేద స్థితిగా ఉంది. ఒక విధంగా చెప్పాలంటే, 'మాలిక్' నన్ను సంపన్న స్థితి, దీనస్థితి రెండింటి నుంచి కూడా విముక్తి కలిగించారు. దీనత్వం అనేది నామరూపాలు లేకుండా పోయింది. బాబూజీ ఇప్పుడు దశను గురించి ఏమని చెప్పను, పుష్ప సుగంధం కంటే

కూడా చాలా తేలికైనదిగాను, సహజమైనదిగాను దశ ఉందని చెప్పాలి. ద్వైతమూ లేదు, అద్వైతమూ లేదు. ఈ రెండింటికి భేదమైన మరో దశలాగ ఉంది. ఇప్పుడు అది ఎలా ఉందో అలాగే ఉంది. ఇప్పుడు అన్ని దిక్కుల్లోను అదే దశ దర్శనమవుతోంది. ఇప్పుడు నాకు దాని గురించిన జ్ఞానం కాని, దాని ఉనికి యొక్క భారంగాని లేవు. ఎందుకంటే, నేను మాత్రం 'మాలిక్' వెంటబడి ముందుగా సాగిపోతున్నట్లు అనిపిస్తోంది. ఈ దశ ఎలా ఉందంటే, నేను ఇప్పుడు నా స్వస్థలంతో బాగా పరిచితురాలైనట్లుగాను, ఇప్పుడు ఆ దశ కూడా నాలో క్రమక్రమంగా పూర్తిగా లయమైపోతున్నట్లుగాను అనిపిస్తోంది. నా స్వస్థానం యొక్క వాతావరణంతో, అక్కడి నివాసమే నా నివాసంగా అయిపోయినట్లు అనిపిస్తోంది. పూజ్య బాబూజీ! కబీరుదాస్ వ్రాసిన విధంగానే నా ఈ దశ నిలిచిపోయినట్లు అనిపిస్తోంది.

**"సుఖియా సబ్ సంసార్ హై, ఖావైం ఔర్ సోవై।**

**దుఖియా దాస్ కబీర్ హై, జాగైం ఔర్ రోవైం॥"**

అనగా సమస్త ప్రపంచమూ సుఖంగా ఉంది, భుజిస్తూ, నిద్రిస్తూ ఉంది; కబీరుదాసు దుఃఖితుడై ఉన్నాడు, మేల్కొని విలపిస్తూ ఉన్నాడు. ఇటువంటి స్థితియే నాదిగా ఉంది. అదే నాకు శాంతియుతంగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 228

లఖీంపుర్,

07.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరాలు తమకు అందాయని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ క్షేమమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో నాలో కలిగినటువంటి ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఈ స్థితిలో నేను గ్రహించగల్గుతున్నది ఏమిటంటే, మనస్సు ఎంతమాత్రం చలించనటువంటిదిగా ఉంటున్నది. అది ఎంతగా నంటే, అసలు మనస్సు అనేది పేరుకు కూడా నాలో లేనట్లు అనిపిస్తున్నది. ఏదో ఒక స్థానంలో పూర్తిగా పాతుకుపోయినట్లుగాను, పూర్తిగా స్థిరపడిపోయినట్లుగాను అనిపిస్తోంది. ఏ విధంగా దానిని చలింపజేయాలని తలపెట్టినా కూడా చలించటం లేదు. ఏ విధమైన కోరిక కూడా కలగటం లేదు. ఈ దశ ఎటువంటిది అంటే, దానిలో 'శాంతి' కూడా శాంతించి పోయినట్లు ఉంది. ఒక విధంగా చెప్పాలంటే, శాంతి మరియు ఆనందం, నా మనస్సుకు అవి దాని నిజరూపమే అయిపోయినట్లు ఉండటంతో ఇప్పుడు ఆ మనస్సుకు శాంతి చేకూరాలను అవసరమే లేకపోయినట్లు ఉంది. ఇప్పుడింక దానిలో శాంతి లేక ఆనందం కొరకు స్థానమే లేకుండా పోయింది. ఇప్పుడు శాంతి, మొదలైన వాటికన్నింటికి ప్రత్యేకతలు ఏమీ లేకుండా పోయాయి. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఇప్పుడు నేను అసలు వాటిని గుర్తించలేకపోతున్నాను. అయితే నాకు ఒకటి మాత్రం కనిపిస్తోంది, ఏమిటంటే, నేను వేగంగా పురోగమనం చేస్తూ పోతూనే ఉన్నాను. 'అతని' కోసం (అనగా 'మాలిక్'ను కలవటం కోసం) నా తపన కూడా నా వెన్నంటియే ఉంటోంది. అయితే ఇప్పుడు మనస్సుతో నాకు సంబంధం లేదు. దాని స్వస్వరూపం దానికి లభించిపోయినట్లు (అనగా స్థితి రూపమే దాని స్వరూపం అయిపోయినట్లు) నాకు అనిపిస్తోంది. బహుశా అది వెనకబడిపోయింది అనుకుంటాను. ఎందుకంటే, బహుశా దానికి ఇంక ముందుకుపోయే అవకాశం లేదనిపిస్తోంది. అయితే తపన మాత్రం, అది కూడా నా రూపమేనేమో అన్నట్లు నన్ను అంటిపెట్టుకునే ఉంది.

అందుచేత అది ముందుకు సాగిపోతోంది. 'మాలిక్'ను గురించి మరియు ఉన్నతిని గురించిన ఆలోచనయేతప్ప, ఆ తపన గురించిన జ్ఞానం కూడా నాకు కలగటం లేదన్నట్లు అనిపిస్తోంది.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడయితే మనస్సుకు సహజమైన పూజ, సహజమైన జీవనమే ఇష్టంగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, అది (మనస్సు) ఇప్పుడు స్వాభావిక దశలోనే లీనమై ఉంటున్నది. అందుచేత దానిని తప్పించుకుని నేను వెళ్ళినట్లయితే హృదయం భీతి చెందుతోంది. అయితే 'మాలిక్' దయతో దానికి (హృదయానికి) కూడా అదే దశ ప్రాప్తమయ్యింది. ఇప్పుడు అది (హృదయం) ఆ దశ నుంచి తొలగటమే లేదు. ఇంతకూ అసలు ఆ స్వాభావిక దశ అంటే ఏమిటి? అది పైన వ్రాసినటువంటి దశయే (అనగా శాంతి రూపం దాల్చినటువంటి దశ) అయి ఉండవచ్చు. దానిలో ఏ విధమైన ఉత్సాహంగాని, ఆవేశంగాని, ఉరకలు వేయటంకాని, కోర్కెగాని, వైరాగ్యంగాని, అనురక్తిగాని, శాంతి అశాంతులు గాని, సమత్వ అసమత్వాలుగాని ఏమీలేవు. ఏ విధమైన ఉరకలు పరుగులు కాని, క్రియ ప్రతిక్రియలుగాని లేకుండా అన్నీ ఒకచోట పేరుకు పోయి నిలకడగా ఉన్న స్థితిలాగ అనిపిస్తోంది. అంతా శాంతించిపోయి మహాప్రళయం జరిగిపోయినట్లు ఉంది. అయితే ఒక తేడా మాత్రం స్పష్టంగా ఉంది. అది ఏమిటంటే, ఆ ప్రళయకాలంలో శ్రీకృష్ణుడు వటపత్రం మీద ఏకాంతంగా పవ్వళించి ఉన్నాడు. నా విషయంలోనయితే, ఉన్నతి పొందాలనే తపన లేదా 'మాలిక్'ను చేరుకోవాలనే కోరిక ఏదో ఒక రూపంలో నా ఈ క్షోభలో నిశ్చయంగా పరుచుకుని ఉన్నాయి. శ్రీ బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, ప్రతి విషయంలోను, ప్రతి స్థానంలోను నాకు సంతోషానుభవం కలుగుతోంది. నాకు అన్నింటిలో సంతృప్తి కలుగుతోంది. అయితే లోపల ఉన్న తపన విషయంలో మాత్రం కాదు, అది ఏమిటో, ఎందుకో దాని జాడ తెలియటం లేదు. అంతేకాదు ఆ సంతోషం యొక్క జాడ కూడా తెలియకుండా ఉంది. ఆ తృప్తికి కూడా తృప్తి కలిగినట్లు నాకు తెలియకపోయింది. నేను ఇప్పుడు ఒక దీనమైన అసహాయురాలుగా అయిపోయి, పూజా విషయం కూడా తెలియకుండా ఉండిపోయాను. ఇప్పుడింక 'మాలిక్' ఇష్టప్రకారమే జరుగుతుంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. అమ్మగారు తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు. కేసర్, బిట్టో ప్రణామం చెబుతున్నారు. అమ్మగారు ఈ రోజు రాత్రికి కాన్పూర్ వెళ్ళబోతున్నారు. ఆమె చాలా బలహీనంగా ఉన్నారు. ఆమె తన ఆరోగ్యం కుదుటపడ్డాక తిరిగి వస్తారు. పూజ్య మాస్టర్ సాహెబ్ గార్కి నేను, కేసర్ ప్రణామాలు తెలిపినట్లుగాను, అమ్మగారు ఆశీస్సులు తెలిపినట్లుగాను తెలియజేయగలరు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 229

లఖీంపుర్,

14.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. సంగతులు తెలిశాయి. నాకు 'మాలిక్' దయతో జూలై 4వ తేదీన తమకు ఉత్తరం వ్రాయకపూర్వమే తమరు, నన్ను పాయింట్ 'E' వద్దకు చేర్చినట్లు తెలిసింది. కాని ఉత్తరం వ్రాసే సందర్భంలో దానిని తెలియజేయటం మర్చిపోయాను. ఆ పాయింట్‌వద్దకు చేర్చినందుకు, తమకు అనేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఇప్పుడు 7,8 రోజుల నుండి నాకు దగ్గు తీవ్రంగా ఉండటం వలన శ్వాస కూడా ఇబ్బందికరంగా అయిపోయింది. అయితే మొన్నటినుంచి రెండూ కూడా నెమ్మదించాయి. ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నాను, చింతించాల్సిన పనిలేదు, ఎందుకంటే దగ్గువలన ఇబ్బంది ఏమి కలగటం లేదు.

ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. నేను గతంలో తమకు అనేకసార్లు మనస్సు యొక్క స్వాభావిక దశను గురించి, మనస్సు యొక్క ప్రళయం మరియు స్వాభావికత్వం గురించి చెప్తూ, అటువంటి పూజయే నాకు ఇష్టంగా అనిపిస్తోంది అని వ్రాసి ఉన్నాను. అయితే మరి ఇప్పుడు ఏమైంది అంటే, నాకు ఆ స్వాభావికత్వమే జ్ఞాపకం రావటం లేదు సరికదా దానిని చదివినా కూడా జ్ఞాపకం రావటం లేదు. ఇప్పుడు ఆ తపన గురించి కూడా జ్ఞాపకం ఏమీ రావటం లేదు. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నాలో పీల్చుకుపోవటం (Absorbance) ఎంతగా ఉంది అంటే, అది సహజత్వం మరియు స్వాభావికత యొక్క దశను కూడా హరించి వేసింది. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంది అంటే, ఏ దశ అయితే కలుగుతుందో అది జీర్ణించుకుపోతోంది. నేను మాత్రం ఎలా ఉన్నానో అలాగే ఉండిపోతున్నాను. ఏమైనాగాని, ప్రస్తుతం స్థితి అంత బాగా నడవటం లేదు. అందువలన దానికోసం ప్రయత్నమైతే చేస్తూనే ఉన్నాను. దాని ఫలితంగా ఈరోజు 'మాలిక్' దయతో దశ కొంత మెరుగైంది.

అమ్మగారు బహుశా 4,5 రోజుల్లో వస్తారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. పరమ పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గార్కి నా ప్రణామం తెలియజేయండి. నా వీపుభాగంలో దాదాపు వెన్నెముక ఆనుకుని, ఎడమవైపు ఏదో కంపనం కలుగుతున్నట్లు నాకు అనుభవమవుతున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 230

షాజహాన్‌పూర్,
17.07.1952

**పరమపూజ్య శ్రీ లాలాజీ సాహెబ్ సందేశం:**

భాగ్యవంతురాలైన కుమార్తె కస్తూరీ,

సంతోషంగా ఉండు. రామచంద్రుని ద్వారా కొంతమంది రామచంద్రునిలాగ తయారైతే బాగుంటుందనేది నా సంకల్పంగా ఉండేది, కాని అది నిరాశగానే ఉండిపోయింది. ఇప్పటికైనా కొంతమంది తయారు కావాలని ఆశిస్తున్నాను కాని రామచంద్రుని శారీరక బలహీనతను దృష్టిలో పెట్టుకొని, ఈ భారాన్ని ఆయన ఆరోగ్యం ఎలా భరించగలదనే ఆలోచన కలుగుతోంది. ఆధ్యాత్మికతకు సంబంధించి **ఆతడు యువకుడే కాదు, యువకుడుగానే నిలబడి ఉంటాడు.** కాని శ్రమ అనేది శారీరక ఆరోగ్యంపైన ఆధారపడి ఉంటుంది. **ప్రజానీకం ఏమనుకుంటారంటే, ఆధ్యాత్మికత అనేది నోటిలో ఒక ముద్ద వంటిదని, ఎప్పుడు కావాలనుకుంటె అప్పుడు దానిని నోటిలో పెట్టుకోవచ్చునని భావిస్తారు. శ్రమించటం ఎవరికీ తెలియదు. ఆత్మ వికాసం గురించి ఎవ్వరూ చదవలేదు. ఉన్నత దశలను గురించి మాత్రం విని, పుస్తక పఠనంచేసి అధికాధికంగా మనం ఇక్కడకు చేరితే చాలు అని అర్థం చేసుకున్నారు. భౌతిక ప్రపంచాన్ని పరిత్యజించటానికి బదులు 'మాలిక్' (దైవం)ను పరిత్యజిస్తున్నారు. ఇతడు (రామచంద్ర) ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు, విడమర్చి చెప్పాడు, అయినప్పటికి ప్రయోజనం లేకపోయింది. దైవేచ్ఛ ఈ విధంగా ఉంది కాబోలు అని చెప్పటం తప్ప ఇంకేమి ఉంటుంది! అభ్యాసులు ఎక్కువ ఉన్నారా లేక తక్కువ ఉన్నారా అనేది కాదు, దానికంటె ఎక్కువమంది నుండి తక్కువమంది అయినా (రామచంద్రునిలాగ) తయారైతే బాగుంటుంది. దీనినిబట్టి ఎక్కువ మందికి ప్రవేశం కల్పించకూడదని అర్థం చేసుకోకూడదు. అయితే అందరికీ ద్వారం తెరిచి ఉంచబడింది.** ఒక విధంగా నీమీద ఆశపెట్టుకుందామనుకుంటే, నీ ఆరోగ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంది. అయితే 'మాలిక్' (దైవం) కొరకు నీ తపన, ప్రేమ ఊహకందనంతగా అద్భుతాలు సాధించగలవు. నీ ఉన్నతిని ఆశిస్తున్నాను. ఇక్కడ ఉన్నతిని సాధించినది పురుషుడా, స్త్రీనా అనేది సమస్య కానేకాదు. దీనికి స్త్రీ పురుషుల మధ్య తారతమ్యం లేదు కాని

సమాజం ఆ విధంగా వేర్పాటు చేసింది. అవి ఒకే అవయవానికి చెందిన రెండు అస్థికలుకాగా, అవి రెండూ ఒకే మూలం నుంచి ఆవిర్భవించాయి కనుక పెద్దగా భేదం ఏమీ లేదు. **మిషన్ అభివృద్ధి చెందుతూ ఉండే విధంగా కృషి జరగాలి.** జనం వేలెత్తి చూపే అవకాశం లేకుండా ఉండాలి. అతడు అవసరానికి తగినట్లు కొద్దిమందిని తయారుచేశాడు కాని ముఖ్యంగా వారి నుండి పని తీసుకోవటానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఒకవేళ ముందుకువచ్చినా అతడు తనతో స్థూలత్వాన్ని వెంటబెట్టుకుని వస్తున్నాడు. ఒకవేళ ఇటువంటి (శిక్షణను ఇచ్చే) వారిలోనుంచైనా నేను ఎంపిక చేయవలసివస్తే ఒక్క మాస్టర్ సాహెబ్ (ఈశ్వర్ సహాయ్‌గారు) మాత్రమే తగినవారుగాను, ఆశపెట్టుకోదగినవారుగాను ఉన్నారు. అయితే ప్రతి ఒక్కరు, ప్రతి పనిలోను నైపుణ్యం కలిగి ఉండలేరు. ఏ పని చేసేవారు ఆ పనిలోనే నిపుణులు కాగలుగుతారు. **ఒకే వ్యక్తికి అన్ని పనులను అప్పగించినట్లయితే అతడు ఏ పనినీ సక్రమంగా నిర్వర్తించలేడు.**

**స్వామి వివేకానందుని సందేశం: "ప్రత్యేకించి ఒక పనికి ప్రత్యేకమైన వ్యక్తులు నియమించబడాలి."**

ఇక్కడ ఉన్న పరిస్థితి ఎటువంటిది అంటే, వ్రాయటానికీ, సహాయపడటానికీ ఒకే వ్యక్తి. ఉత్సవాలు జరపాలన్నా, వాటికి ఏర్పాట్లు చేయాలన్నా కూడా ఒకే వ్యక్తిగాను, హృదయ పూర్వకంగా చేసేవారైఉన్నారు. ఇతరులు వారికి సహకరించక నిర్లక్ష్యంగా ఉన్నారు. చౌబేజీకి కూడా ఈ విషయంలో ఆసక్తి ఉన్న మాట వాస్తవం. అలాగే రామచంద్రకు కూడా వారిపట్ల ఉన్న అభిమానం ఏమీ తక్కువ కాదు. చౌబేజీ తాను ఉన్నతి చెందుతూనే మిషన్ యొక్క ఔన్నత్యానికి కూడా దృష్టి సారిస్తున్నారు. నా ఉద్దేశ్యంలో సదా ఒకే గుమ్మానికి (అనగా 'మాస్టర్'ని) హత్తుకుని ఉండేవాడు బాగా గౌరవించబడతాడు. అటువంటివారు అనగా రామచంద్రవంటి వారు అంటే ఇష్టం. ఎందుకంటే, అటువంటివారు మెడమీద కత్తిపెట్టి భయపెట్టి నప్పటికి నిజం పలకటానికి వెనుదీయరు. ఎవ్వరైనా వ్యతిరేకించినా, చెడుగా తలంచినా కూడా లక్ష్యపెట్టరు. అంతేకాదు అటువంటి దుష్టత్వాన్ని జనం ఎవ్వరూ వ్యతిరేకించకపోయినప్పటికీ అందుకు బాధపడరు. ఇప్పుడు చెప్పు, నీ ఉన్నతిని అభినందించమంటావేమో, ఎందుకంటే అది నీకు ఆనందాన్ని కలిగిస్తుంది. నేను నీపట్ల సంతోషంగా ఉన్నానని చెప్పటమే నేను నిన్ను పొగడినట్లుగా భావిస్తున్నాను. ఈరోజు ఉదయం రామచంద్రునిలో అంతులేని దప్పిక (తపన) కలిగింది; అది ఎందుకో తెలుసా! పని చేయటానికి అతడు ఏయే పద్ధతులు అవలంబించాలి అని ఆలోచిస్తున్నాడు. ఎక్కడో ఒక ఆలోచన, తన సంకల్పబలంతో ఎవరో ఒకరిని పనిచేయటానికి తయారుచేయాలని ఏర్పడింది. దానితోపాటుగా, ఇతర విధానాలు, ఆధారాలు ఎంచుకుని ఎవరో ఒకరి ద్వారా మిషన్‌కొరకు సేవలు పొందాలని, అతన్ని జీవితాంతం ఆ పనిలో నిమగ్నం చేయాలనే యోచనలో ఉన్నాడు. మరి ఈ పనికి స్వయంగా ముందుకువచ్చేవారు ఎవరు ఉన్నారు? అలా ముందుకు వచ్చేవారు వారిలో ఎవరికి ఎటువంటి పనిలో మంచి సమర్థత ఉందో ఆలోచించుకొని వ్రాయాలి. దానినిబట్టి వారికి ఆ పని పురమాయించ బడుతుంది. ఈ విషయంలో నా రెండు నేత్రాలు సమానమే, అనగా పురుషులు లేదా స్త్రీలు ఎవ్వరైనా కావచ్చు. స్త్రీల కయితే కొన్ని నిబంధనలు తప్పక ఉంటాయి. పురుషులు స్వేచ్ఛగా పని చేయవచ్చు. నేను వారికి కర్తవ్యం బోధిస్తాను.

ఈ సందర్భంలో ఒక ద్విపద యొక్క అర్థం ఇది.

**నేనొక చీమను, మనష్యులు నన్ను పాదంతో తొక్కిపెట్టవచ్చు.**

**నేనొక కుట్టే కీటకాన్ని కాదు, మనుష్యులు నావల్ల బాధ పడకూడదు.**

**నీ శ్రేయోభిలాషి,**

**సమర్థ శ్రీ రామచంద్రజీ మహారాజ్**

౯

# ఉత్తరం సంఖ్య - 231

లఖీంపుర్,
18.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. సమర్థ శ్రీ లాలాజీ సాహెబ్ కృపతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు అందుకుని చాలా సంతోషించాను. 'వారి' శుభాశీస్సులు సదా నన్ను వెన్నంటి ఉన్నాయి. పెద్దల సంతోషం మరియు 'వారి' ఆశీస్సులు పిల్లల జీవన మార్గంలో వెలుగు నింపుతాయి (పుష్పాలు వెదజల్లుతాయి). 'వారి'కి నా ప్రణామం మరియు అనేక ధన్యవాదాలు. 'వారు' పని మరియు సేవ (Service) గురించి అందరినీ ఏమైతే అడిగారో దానికి నా తరఫున చెప్పవలసింది ఏమిటంటే, బాబూజీ, నాలో ఏ విషయమై ఎంత యోగ్యత మరియు సామర్థ్యం ఉన్నాయో, నా ఆలోచన కూడా హరించబడిపోయిన నా వంటి అమాయకురాలు ఏమి సమాధానం చెప్పగలదు? కాని, కేవలం ఏ 'మాలిక్' కయితే నా హృదయం అర్పించబడిందో 'ఆతని'కి పూర్తిగా తెలుసు. నా వంతుగానైతే నేను చెప్పగలిగింది ఇదే – "రాము'ని తోటిదే జీవనం. నీవు 'రాము'నిలోనే జీవించు, 'రాము'ని సేవలో నీ తల యొగ్గి జీవించు" – మాత్రమే. ఈ విషయంలో కూడా నా దశ ఎలా ఉందంటే, "దివ్య వైభవం చూడటానికైతే నేను వెళ్ళాను, కాని నేనే ఆ వైభవంగా అయిపోయాను" అన్నట్లు ఉంది. ఇంకొక విషయం ఏమిటంటే, స్త్రీ – పురుషుడు, బాలుడు – బాలిక అను బంధం కూడా ఎప్పుడో హరించిపోయి ఇప్పుడు ఒక స్వతంత్రమైన ఆత్మగా ఉండిపోయాను. ఇప్పుడు 'మాలిక్' నన్ను ఏ విధంగానైనా పిలవవచ్చు. 'అతడు' ఇప్పుడు నన్ను బాలుడు అంటే బాలుడుగా, బాలిక అంటే బాలికగా, మనిషి అంటే మనిషిగా, పశువు అంటే పశువుగా పరిగణించబడతాను. అంతేకాదు, దానికి తగిన భావనయే నాలో పని చేస్తుంది. ఇది అంతా కేవలం నా 'మాలిక్' యొక్క మహిమ మాత్రమే. బాబూజీ, ఈ ప్రపంచానికి తమ దయాదృష్టితో అనుగ్రహించబడిన చిరు కానుకయే ఇది. 'శ్రీ బాబూజీ' యొక్క ఆరోగ్యం కొరకు నేను ఎటువంటి సేవ చేయాలి అను ప్రార్థన మాత్రం ముఖ్యమైనదిగా ఉంది. నావరకు నేను దాని కోసం ఏమి చేయాలో, ఎంతవరకు ప్రయత్నించాలో అంతవరకు చేస్తూనే ఉన్నాను.

ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగినటువంటి ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. నాలో కొన్ని రోజుల నుంచి అలసత్వం పేరుకుపోయింది. ఏ విషయంలోను మనస్సు లగ్నం కావటం లేదు. కనీసం ఎవ్వరితోనైనా పూజ చేయించాలన్నా కూడా హృదయం ఇష్టపడటం లేదు. అప్పుడప్పుడు అది ఇంకా తీవ్రంగా ఉంటోంది. మొన్న అయితే పరిస్థితి ఎలా ఉందంటే, లేచి నిలబడి నడవాలనుకుంటే కాళ్ళు బలవంతంగా ఈడ్చాల్సి వచ్చింది. చేతులు ఎత్తినప్పుడు, నిస్సత్తువుగా క్రిందికి వాలిపోతున్నాయి. కన్నులు వాటంతట అవే మూసుకుపోతున్నాయి. తరచుగా ఈ విధంగా జరుగుతున్నప్పటికీ, వాటి తీవ్రతలో భేదం అనుభవమవుతూనే ఉంది. కాని నా దృష్టిని మరేదైనా విషయం మీదకు మరల్చినట్లయితే, అది లాభదాయకంగానే ఉంటోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నాకు ఎటువంటి అనుభూతి కలుగుతూ ఉంది అంటే, ఏదైనా స్థితి మారినప్పుడు, మరపుస్థితిలో మార్పు వచ్చినట్లు గాను, అంతకుపూర్వపు స్థితి మరియు ప్రస్తుత స్థితి, నాలో స్వయంగా కరిగిపోయినట్లుగాను, అలాగే ఇంకా కరిగిపోతూ ఉన్నట్లుగాను అనిపిస్తోంది. ఆ మరపుస్థితి యొక్క స్థితి కూడా దాదాపు ఇదే విధంగా ఉంటున్నది. నేను దానికి అనగా ఆ నిరామయ మైదానానికి అలవాటుపడిపోయిన కారణంగా, లేదా నా నివాసమైపోయినట్లు కావటంచేత దానిని చూస్తూ ఉంటే, క్రమంగా అది కూడా కనుమరుగైపోతున్నట్లు అనిపిస్తోంది. దాని ధ్యాస లేకుండాపోతూ చివరకి దాని ఉనికి కూడా లేదన్నట్లు అనిపిస్తోంది. నేను మరపుస్థితిలో ఉన్నానో లేక స్పృహ కలిగి ఉన్న స్థితిలో ఉన్నానో ఏదీ తెలియనిదిగా నా ఈ స్థితి ఉంది. ఇప్పుడు ఏ స్థితిలో ఉన్నానో అదే స్థితితో ఉన్నాను. నేను ఎలా ఉంటున్నానో ఆ 'మాలిక్'కే తెలియాలి. ఎందుకంటే, నాకయితే 'మాలిక్' నివాసంలోనే నివాసం ఉంటున్నట్లు మాత్రమే తెలుసు. ఇప్పుడు ఉన్న దశలో

శరీరానికి ఆత్మకు ఏమీ భేదం లేకుండా ఉంది. ఇది అంతా ఎందుకు జరిగిందో నాకు తెలియదు.

కేసర్, బిట్టో తమకు ప్రణామం తెలుపుతున్నారు. పూజ్య మాస్టర్ సాహెబ్‌కు నా ప్రణామం తెలియజేయండి. చిన్నవారైన సోదర సోదరీలకు నా ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 232

లఖీంపూర్,

23.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్యులు తావూజీ ద్వారా పంపిన నా ఉత్తరం చేరిందని భావిస్తున్నాను. ఇప్పుడు 'మాలిక్' దయతో ఏర్పడిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు రెండు రోజుల నుండి సోమరితనం మళ్ళీ పెరిగిపోయింది. కొంతసేపు దశ స్వచ్ఛంగా ఉన్నట్లు అనిపిస్తుంది, కాని అది తరచుగా మాత్రం కాదు. ఈ దశ ఎందుకు స్వచ్ఛంగా ఉండటం లేదు అనే ఆలోచన నాకు కలుగుతోంది. ఈ సోమరితనం శరీర బలహీనతవల్లనేమో అనే సందేహం కూడా కలుగుతోంది. అయితే అది దానంతట అదే బాగుపడుతోంది అని కూడా గ్రహిస్తున్నాను. నా మనస్సు ఇప్పుడు దాని సోమరితనం నుంచి బయటపడుతున్నట్లు లేక చైతన్యవంతమవుతున్నట్లు అనిపిస్తోంది.

పూజ్య బాబూజీ, అదేమిటో తెలియదుగాని, నాలో దీక్ష మరియు అభిరుచి తగ్గిపోయాయని అనిపిస్తోంది. ఇదివరకు గాయం కలిగి అది మానిపోయినప్పటికీ, దాని ప్రక్కన ఉన్న చర్మాన్ని నొక్కినట్లయితే ఎంతో కొంత నొప్పి ఉన్నట్లు అనిపించిన విధంగానే గతంలో ఉన్న తపన తగ్గినప్పటికీ దాని వేదన ఇంకా కొంచెం ఉన్నట్లు ఉంది. నేను గతంలో వేగంగా పురోగమించినట్లు ఇప్పుడు అంత వేగంగా పోలేకపోతున్నానేమో అని అనిపిస్తోంది. నా మనస్సులో ఉత్సాహమైతే ఉంది కాని అది ఉరకలు వేయకుండా మందకొడిగా సాగుతోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు నా ప్రేమానురాగాలు. పూజ్య మాస్టర్ సాహెబ్‌కు నా ప్రణామం తెలియజేయండి. అమ్మగారు మొన్ననే తిరిగి వచ్చారు. బిట్టో ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడింది. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 233

షాజహాన్‌పూర్,

24.07.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం అందింది. నేను ఈ రోజునే నిన్ను 'E' పాయింట్ నుంచి తొలగించి 'F' పాయింట్‌కు చేర్చాను. ఇప్పుడు నీకు కలిగే అనుభవాన్ని తెలియజేయి. నిన్ను ఈ పాయింట్‌లో ఎక్కువ సమయం నిలపకూడదని అనుకుంటున్నాను. ఒకవేళ ఎక్కడైనా అవసరమైతే తప్పనిసరి అవుతుంది. **మన సత్సంగంలో ఈ పాయింట్లకు ప్రాధాన్యత లేదు. మన మిషన్‌లోని అభ్యాసులు ఆఖరికి మొదటి పాయింట్ నుంచి కూడా కదలటానికి ఇష్టపడరు. ఆరంభం నుంచే శాంతిని అనుభవించాలనుకునేవారు మొదటి లేదా రెండవ సిట్టింగ్‌లోనే దాని అనుభవం కలగకపోయి**

**నట్లయితే నన్ను అప్రయోజకునిగాను, అయోగ్యునిగాను భావించే అవకాశం కూడా ఉంది. అందుచేత మొదటి సిట్టింగ్‌లోనే వారికి ఎంతోకొంత శాంతి లభించేటట్లు ప్రయత్నిస్తున్నాను. గత్యంతరంలేక లాలాజీ సాహెబ్ కృప, ఆశీస్సులు వారి మీద వర్షించటం ప్రారంభమవుతుంది.** నన్ను ఒక మహాత్మునిగా భావించి నావద్దకు వచ్చినట్లుగాను, అందుకుగాను శాంతి నావల్లనే లభించినట్లుగాను అనుకుంటున్న కొంత మంది నాకు తెలుసు. సుఖదేవానంద్, నారదానంద్ వంటి కీర్తిప్రతిష్టలను అందుకుంటున్న మహాత్ములవద్దకు చేరి నెలల తరబడి కాలం గడుపుతున్నవారు నాకు తెలుసు. మరి అక్కడ శాంతి యొక్క ప్రశ్న ఎందుకు తలెత్తడంలేదో తెలియదు. దీనికి కారణం ఏమై ఉంటుందని నీవు అనుకుంటున్నావు. కేవలం ఒకటి, రెండు సిట్టింగ్‌ల్లోనే శాంతి యొక్క అనుభూతి చెందటం చాలా కష్టం. ఇది అభ్యాసం చేయవల్సిన విషయం. ఈ శాంతి అనుభూతమయ్యేటటువంటి పరిస్థితులను కల్పించటమే నా విధిగా భావిస్తున్నాను. నన్ను అసమర్థునిగాను, అనర్హుడుగాను జనం దృష్టిలో పడకుండా చేయటానికి లాలాజీ సాహెబ్ అటువంటివారికి శాంతి అనుభవ మయ్యేటట్లు చేస్తున్నారు. ఈ విషయంలో 'వారి'కి సహస్ర ధన్యవాదాలు తెలుపుతున్నాను. **నా సాధనాకాలంలో 22 సంవత్సరాలు 'అశాంతి'లోనే గడిపాను. దానిలో ఉన్న ఆనందం, ప్రశాంతి అందరూ అనుకుంటున్న 'శాంతి'లో లేదు.**

నీవు ఒక ఉత్తరంలో ఏదో ఒక విషయం గురించి తెలుసుకోవాలను కున్నావు కాని దానిని మర్చిపోయాను. ఇప్పుడు దానిని ప్రస్తావిస్తున్నాను. "ఇప్పుడు క్లోరోఫారం (మత్తుమందు) యొక్క ప్రభావం ఉండదా?" అని ప్రశ్నించావు. దాని తీవ్రత యొక్క ప్రభావం తప్పనిసరిగా తగ్గి ఉండవచ్చుని, దానిని నీవు గ్రహించలేకపోయావని నేను భావిస్తున్నాను. నీకు ఒక ప్రయోగ పద్ధతిని వివరిస్తున్నాను. **నీవు ఏదైనా పని చేస్తున్నపుడు ఎప్పుడైనాసరే దానిని నా ఇచ్ఛాశక్తితో చేస్తున్నట్లు భావించుకోవాలి.** ఆధ్యాత్మిక ప్రగతి సమకూరే విషయంలోను, దైవకార్యం విషయంలోను ఈ పద్ధతిని అనుసరించినట్లయితే తలపెట్టిన ఫలితం శీఘ్రంగా కలుగుతుంది. ఈశ్వరకృపతో, 16 వలయాలు దాటిన తర్వాత అభ్యాసీ లేదా ఏ మానవుడైనా తన గురువులో లయ-అవస్థను పొందగలిగితే అటువంటివారికి ఈ పద్ధతి యొక్క అవసరం లేదు. దీనికి ముందుగా **ఎవ్వరికైనా సిట్టింగ్ ఇవ్వబోయేముందు తన గురువే ఇస్తున్నట్లు భావించుకోవాలి. దీనివలన మంచి ప్రభావం కలుగుతుంది. ఈ విషయాన్ని ప్రతి ప్రశిక్షకుడు (ప్రిసెప్టర్) గ్రహించుకోవాలి. ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) ఇచ్చే సమయంలో ప్రశిక్షకుడు ఎప్పుడు కూడా తాను కాకుండా తన గురువే ప్రాణాహుతిని ఇస్తున్నట్లు భావించుకోవాలి. క్లుప్తంగా చెప్పాలంటే, ఆ సందర్భంలో తనను తన గురువు రూపంగా భావించుకోవాలి. అంటే, నేను సిట్టింగ్ ఇస్తున్నట్లయితే, నా శరీరం, హృదయం, మనస్సు లాంటివి అన్నీ కూడా 'లాలాజీ' కి చెందినవిగానే నేను భావించుకుని అప్పుడు సిట్టింగ్ ఇవ్వవలసి ఉంటుంది.**

నీ ఉత్తరం 23.07.1952వ తేదీది కూడా చేరింది. నీవు నీ సోమరితనం / నిర్లిప్తత గురించి ఫిర్యాదు చేశావు. ఇది ఆత్మ యొక్క ఉపరితల ఆవరణం. మనం దానిని సమీపించినపుడు దాని నిర్లిప్తత అనుభవానికి వస్తుంది. అది మన బాహ్య వ్యవహారాలు లేదా ప్రవర్తన మీద ప్రభావం చూపిస్తుంది.

అమ్మగారికి నా ప్రణామాలు అందజేయి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 234

లఖీంపుర్,

26.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే, తామందరూ కూడా కుశలమేనని భావిస్తున్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్ బహుశా రేపు రావచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నిన్నటి నుండి దశలో మార్పు వచ్చింది. దశలో స్వచ్ఛత వచ్చింది. ఇంకొక రకంగా చెప్పాలంటే, దానిని నేను స్వచ్ఛతగా భావిస్తున్నాను. బాబూజీ, ఇంపైన దశలో వైభవం పోయి, వాడిపోతున్నట్లు ఇప్పుడు అనిపిస్తోంది. అన్నివైపులకు చెందిన అన్ని రంగుల దశలు ముగిసిపోయినట్లు ఉంది. ఇది నా దశకి చెందినదో కాదో తెలియటం లేదు. ఉన్నట్లుండి ఈ దశలో వాడిపోవటం (నీరసపడిపోవటం) ఎందుకు కలిగిందో అర్థం కావటం లేదు. ఇప్పుడు అలసత్వం – క్రియాశీలతగాని, ఉత్సాహం – ఆవేశంగాని, అనురాగం – విరక్తిగాని ఏమీ లేనటువంటి ఒక వింతైన దశగా ఉంది. పచ్చ పచ్చని ఉద్యానవనం మాడిపోయిన దానిలాగా మారిపోయింది. అన్నిదిశలా మొక్కలు ఎండిపోయాయి. కాని నేను ఎందుకు, ఎలా జీవిస్తున్నానో తెలియటం లేదు.

**పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు 'మాలిక్'లో చెప్పనలవి కానంతగా ఆకర్షణ శక్తి ఉన్నట్లు నాకు అనిపిస్తోంది. ఆ ఆకర్షణ శక్తి సమస్త ప్రపంచాన్ని తనవైపు గుంజుకుంటోంది. అయితే ఈ జగత్తులో నిర్లక్ష్యం ఎంతగా ఆవహించి ఉందంటే, దాని కారణంగా చాలా కొద్దిమంది మాత్రమే ఇటువైపు వస్తున్నారు. అలా వచ్చిన వారు కూడా చైతన్యవంతం చెందాలని కోరుకోవటంకాని, అందుకు ప్రయత్నించటం కాని చేయటం లేదు. అలా కాకుండా ఉంటే ఎంత బాగుండేదో. ఈ ఆకర్షణ శక్తి కారణంగా ఎవ్వరికైతే విశ్వాసం కలిగిందో, వారు సాధన చేసినా చేయకపోయినా కూడా అటువంటి వారి ఆత్మ ఈ మిషన్‌ను ఎన్నటికీ విడిచిపెట్టిపోలేదు.**

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. అమ్మగారు తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 235

లఖీంపుర్,

27.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. దానిని చదివి నేను చాలా ఆనందించాను. తమరు జలుబు, దగ్గుతో బాధపడుతున్నట్లు మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తెలిసింది. మందులు తప్పనిసరిగా వాడుతూ ఉండండి. నా ఆరోగ్యం కూడా ఇటీవల అంతగా బాగుండ లేదు కాని త్వరలోనే స్వస్థత చేకూరుతుంది. నా దశలో కలిగిన మార్పు గురించి జాబు వ్రాశాను. బహుశా అది తమకు రేపు అందవచ్చు. తమరు నన్ను పాయింట్ 'E' నుంచి పాయింట్ 'F'కు చేర్చారు, అందుకు అనేక ధన్యవాదాలు. నిజంగా తమ కృప చాలా అద్భుతమైనదిగా ఉంది.

**"ప్రజలు మహాత్ములు చుట్టూరా నెలల తరబడి ప్రదక్షణలు చేస్తున్నప్పటికీ శాంతి ఎందుకు లభించటం లేదు?" అని తమరు ప్రశ్నించారు. జనం మహాత్ముల చెంతకు శాంతికొరకు వెళ్ళటం లేదని, ఆ మహాత్మతనంతో వారికి బహుమతిగా నిలిచిన పెద్ద పెద్ద భవనాలు, ఆశ్రమాలు దర్శించటానికే వెళ్తున్నట్లుగాను, ఒకవేళ నిజంగా ఎవ్వరైనా శాంతికొరకే అక్కడికి వెళ్ళినప్పటికీ, ఆశ్రమాల్లో ఆ మహాత్ములవద్ద పొందవలసింది ఏమీలేదని నాకు అర్థమవు తోంది. నేను ఇంకేమి చెబుతాను అంటే, అటువంటి నిజమైన శాంతి కోరుకునేవారు కేవలం 'తమ' ఇంటి ముందు నుంచి ప్రయాణించి నంతనే ఆ భేదం గ్రహించగలుగుతారు. అంతేకాకుండా వారికి తమవద్ద కూర్చునే అదృష్టమే కనుక దక్కినట్లయితే వారు ధన్యులవుతారు.** తమరిని గురించి ఏమి వ్రాయాలో నాకు అర్థం కావటం లేదు. తమరు మాత్రం "ఏమై ఉన్నారో, అలాగే ఉన్నారు."

తమరు వ్రాసిన పని విధానం సాటిలేనిదిగా ఉంది. నేను అదే విధంగా సంపూర్ణంగా ప్రయత్నిస్తాను. బిట్టో కొరకు ప్రార్థన చేస్తున్నాను. ఈశ్వరేచ్ఛ ఉంటే సత్వరమే కోలుకోవచ్చు. ప్రస్తుతం అలసత్వం ఏమాత్రం లేదు. తమరు పంపిన నేరేడుపళ్ళ రసం అందింది. నిన్న నేను, తావూజీ రుచి చూశాము కూడా.

ఇప్పుడింక జన్మాష్టమి దగ్గరపడుతోంది. ప్రతి ఒక్కరూ కాకపోయినప్పటికీ కనీసం కొంతమందైనా తప్పక హాజరవుతారు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. అమ్మగారు వచ్చేశారు. పెద్దక్క ఆరోగ్యం బాగుపడింది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 236

లఖీంపుర్,

27.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమ జవాబు మరియు తావూజీ ఉత్తరం యొక్క నకలు అందాయి. తావూజీ ఉత్తరం చదివిన తర్వాత మాకు చాలా బాధ కలిగింది. దానిలో వారి నిర్లక్ష్యం యొక్క చిహ్నాలే ఎక్కువగా ఉన్నాయి. అదేమిటో నా 'మాలిక్'కే తెలియాలిగాని, వారి దృష్టి నుంచి నా శరీరం స్వయంగా తొలగినట్లు నాకు అనిపిస్తోంది, దానికి కారణం ఏమిటో నాకు తెలియటం లేదు. ఇప్పుడు అది అర్థమవు తోంది. ఎప్పుడైతే అమ్మగారు తమతో పుత్ర సంబంధం నెలకొల్పు కున్నారో, అప్పటినుంచి నా దృష్టిలో ఆమె అంతస్థు ఎంత ఉన్నతి పొందారో నేను స్వయంగా గ్రహించలేకపోయాను.

ఏ రోజునైతే 'శ్రీ సమర్థగురు లాలాజీ మహరాజ్' గారి ఉత్తరం వచ్చిందో, దాని సారాంశం విన్నంతనే తావూజీ మానసిక స్థితి దిగజారి పోయింది. అప్పుడు వెంటనే నేను కేసర్‌తో దీనిలో తప్పుపట్టాల్సింది ఏమీ లేదు, కాని తావూజీ దీనిని చెడుగా భావించి ఎందుకు చింతిస్తున్నారో అర్థం కావటం లేదు, అని చెప్పాను. **'పెద్దలు' ఏది చెప్పినా అది మన మంచికొరకు మరియు మన మీద దయ చూపటానికేగాని మరేమీ కాదు.** దానిని మనం తప్పుగా అర్థం చేసుకోవటం, మనల్ని మనం కించపరచుకోవటమే అవుతుంది. పూజ్య బాబూజీ, నేనైతే మన అణువణువు 'అతని'కి చెందినదేనని, 'అతని'కే చెందుతుందని కూడా చెప్తున్నాను. ఇంక సేవ గురించి చెప్పవలసివస్తే, **తమరు స్వయంగా తమ యొక్క ఒక్క చూపుతో ఒక రాతిముక్కను పర్వతంగాను, పర్వతాన్ని రాతిముక్కగాను చేయగల సమర్థులు.** తమరు కేవలం తమ గొప్పతనంలోను, తమ లీలల్లోను సహకరించునట్టి అవకాశం కల్పించి మమ్మల్ని కృతార్థులుగా చేస్తూ ఉంటారు. కనుక ఈ పేదరాలు యొక్క అణువణువు తమదే, దాని ద్వారా తమకు కావల్సిన

సేవలు పొందండి.మిషన్ మాత్రం తప్పక వృద్ధి చెందుతుంది. మేము మాత్రం సర్వదా సత్యత్వానికి కట్టుబడి ఉంటాం. ఎందుకంటే, నేను తమ నుంచి సత్యత్వం మరియు పవిత్రత గురించిన పాఠాలనే చదువుకుంటున్నాను కనుక.

పూజ్య బాబూజీ, తావూజీ ఇంత అసంబద్ధంగా (దారుణంగా) వ్రాసినందుకు వారిని గూర్చి ఏమి చెప్పాల్సి ఉంటుంది! తమకు ఎంత కష్టం కలిగిందో చెప్పనలవికాదు. తమరు మరియు శ్రీ లాలాజీ సాహెబ్ ఎప్పుడూ కూడా వారి అపరాధాలను క్షమించియే ఉన్నారు. వారి యొక్క ఈ అపరాధంతో తమకు కలిగిన కష్టాన్ని వారికి యధాశక్తితో వివరించి ప్రేమ మరియు చెలిమితో దానిని నివారించుకొనవలసిందిగా చెబుతాను.

పూజ్య శ్రీ బాబూజీ, ఈ అపరాధానికిగాను అమ్మగారు మరియు మేమందరం కూడా తమకు మరియు శ్రీ లాలాజీ సాహెబ్ పాదాలకు కోటి క్షమాపణలు నివేదించుకుంటున్నాము. వారి యొక్క ఈ అపరాధం కారణంగా, వారికి మాకు, అందరికీ శారీరక ఆహారం దక్కకపోయినా ఫర్వాలేదు కాని, దయచేసి వారికి (తావూజీ) ఆధ్యాత్మిక ఆర్తికొరకు దయను అనుగ్రహించి ఆశీర్వదించండి. వారి అపచారం మూలంగా కలిగిన ఈ కష్టానికి, మన శ్రీ లాలాజీ సాహెబ్ సమక్షంలో మేమంతా కొంగుచాచి మళ్ళీ మళ్ళీ క్షమాపణ లర్థిస్తున్నట్లు అమ్మగారు మరీ మరీ చెప్తున్నారు. అమ్మగారు ఏమి చెబుతున్నారు అంటే, మనకు క్షమాపణ అనుగ్రహించబడదా? తప్పక అనుగ్రహించ బడుతుంది. ఎందుకంటే, మన ఈ కొలువు దయాపూర్వకమైనది. ఇదేదో కోపంతో వ్రాశారుగాని, దానిని మనస్సులో నిలుపుకోరు అని అమ్మగారు చెప్తున్నారు. తమరు మళ్ళీ దయచూపి, వారికి (తావూజీ) ఆధ్యాత్మిక సత్తువ మళ్ళీ చేకూరేటట్లుగా చేయండి. అలా అనుగ్రహించకపోయినట్లయితే వారికి ఇంక ఎక్కడా స్థానం ఉండదు. మేమంతా వారికి నచ్చచెపుతాము. క్షమించటంలో అగ్రగణ్యులైన తమరిరువురు (అనగా శ్రీ లాలాజీ సాహెబ్, మరియు శ్రీ బాబూజీలు) వారి యొక్క ఈ అపరాధాన్ని తప్పక మన్నించుదరు గాక! సమర్థ లాలాజీ మహరాజ్‌గారిని కూడా వారి ఈ అపరాధానికి క్షమించమని కోరుకుంటాను అని అమ్మగారు చెప్తున్నారు. తమకు కష్టం కలిగించిన కారణంగా పొందవలసిన మేలు పొందకపోవటమే వారికి కఠిన శిక్షగా అయిపోయింది. కనుక ఇప్పుడింక క్షమాపణ మరియు మేలు (లబ్ధి) చేకూరాలని ప్రార్థిస్తున్నాం.

అమ్మగారు తమకు ఆశీస్సులు అందిస్తున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 237

లఖీంపూర్,
30.07.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం మరియు తావూజీ ఉత్తరం చేరి ఉంటాయని అనుకుంటున్నాను. ఇక్కడంతా కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఉన్న ఈ దశలో మంచి స్థితులు మరియు అస్తవ్యస్త స్థితులన్నీ కూడా నాలో జీర్ణించుకుపోయాయి. ఇప్పుడు దశ ఆహ్లాదకరంగా గాని, నిరాశాజనకంగా గానీ లేకుండా అంతా ఒకటిగా అనుభమవుతున్న దశలాగా ఉంది. ఇప్పుడు ఆ నిరామయమైన మైదానం కూడా నాలో హరించుకుపోతున్నట్లు అనిపిస్తోంది. ఇంకా ఎటువంటి స్థితి అంటే, నేనే ఆ నిరామయమైన మైదానంగా అయిపోయినట్లు అనిపిస్తోంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఇప్పుడు ఆ మైదానం, వగైరా కనిపించినా దృష్టి లేకుండా అంతరించిపోయింది.

ఇప్పుడు నేను ఒక మట్టి కుండ యొక్క నునుపైన ఉపరితలంలాగా అయిపోయాను. దానివలన రోదనలుగాని మరియు గానం యొక్క ప్రభావంగాని నాపై లేకుండా పోయాయి. ఇప్పుడింక ఆ సున్నితత్వం యొక్క భావం కూడా లేకుండాపోయింది. నేను ఇదివరకటిలాగే స్వచ్ఛంగా ఉన్నట్లు అనిపిస్తోంది. శరీరంలో ఒక నిశ్చలస్థితి ఏర్పడిపోయింది. ఇప్పుడు స్థూలత్వం యొక్క భావనగాని, తేలికదనం యొక్క భావనగాని, మరెటువంటి భారంగాని లేకుండా అయిపోయింది. ఇప్పుడు ఎటువంటి దశ యొక్క అనుభూతి లేకుండా, నా దృష్టి అంతా అకస్మాత్తుగా 'మాలిక్'వైపుకే మరలిపోయినట్లు గాను, మళ్ళీ దాని నుంచే పోషింపబడుతూ క్రమంగా అంతర్థానమయి పోతున్నట్లుగాను అనిపిస్తోంది. అనగా 'మాలిక్' దృష్టి లేదా 'అతని' కృపాదృష్టి ఏదైతే నావైపుగా ఉన్నదో అది 'అతని'లోనే లయమైపోతున్నట్లుగాను, 'అతని' ద్వారానే శక్తిని పొందుతున్నట్లుగాను అనిపిస్తోంది. అది క్రమక్రమంగా అంతరించిపోతోంది. ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే నేను 'అతని' దృష్టిలో ఉంటూనే నేను ఎటువంటి దృష్టి లేనట్లు అయిపోతున్నాను. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నా ఆలోచన, దృష్టి 'అతని' సంకల్పంతోనే పోషించబడుతూ ఉన్న కారణంగా దానికింక మరి ఏ దృష్టి రుచించనంత నాజూకుగా అయిపోయింది. అది ఎంతగానంటే, నాకు అనుభవమైన దశను వ్రాయటానికి, జ్ఞాపకం ఉంచుకోవటానికి ప్రయత్నించినప్పటికీ అది నాకు ఇష్టంలేకపోగా భారంగా కూడా అనిపిస్తోంది. కాని నేను దానిని వ్రాసిన తర్వాత, అది ఇంక పూర్తిగా స్వతంత్రమైపోతుంది. అది ఎంతగానంటే, అది 'అతని' సంకల్పబలంతో ఎంతగా నిమగ్నమైపోతుంది అంటే, అది మరిదేనితోనూ సంబంధం కల్పించుకోవటంగాని, ఆలోచించటం, జ్ఞాపకం ఉంచుకోవటం వంటి వాటికిగాని అవకాశం లేనంత అసహనంగా ఉంటుంది. అందువల్లనే నేను వెనువెంటనే వ్రాసివేస్తాను. అలాకాకపోయినట్లయితే, దానిని జ్ఞాపకం చేసుకుంటూ మర్చిపోవటం జరుగుతుంది. ఇప్పుడు ఎలా ఉంది అంటే, 'మాలిక్' నన్ను అన్నింటి నుంచి సర్వస్వతంత్రం చేశాడు. ఇదంతా 'మాలిక్' కృప మరియు నా ఆలోచనా దృష్టికి దక్కిన అదృష్టంగా భావిస్తాను.

తమరు చెప్పిన పని విధానాన్ని పూర్తిగా ఆచరించటానికి ప్రయత్నిస్తున్నాను. అందులో కష్టం ఏమీ కలగటం లేదు. ఇది ఆత్మోన్నతికి మంచి విధానం కూడా. దీనిని ఎవరైనా అంగీకరించాలేకాని అది జరుగుతుందని అనటంలో విశేషం ఏమీ లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. బిట్టో కొరకు అందరూ ప్రార్థన చేస్తున్నారు. ఈశ్వరుని కృపతో జ్వరం నిదానించుగాక!

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 238

షాజహాన్‌పూర్,

31.07.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. 26.07.1952వ తేదీతో ఉన్న నీ ఉత్తరం అందింది. ఇది 'E' పాయింట్ యొక్క స్థితి. ఏమీ లేనటువంటి స్థితి. ఇది చాలా మంచిది. దీనిని 'స్థితిలేని స్థితి' అంటారు. అనగా ఎటువంటి స్థితి యొక్క అనుభవం ఉండదు. ఈ స్థితి పరిపూర్ణస్థాయిలో కలగటమంటే అదొక అద్భుతమే. 'మాలిక్'లో ఆకర్షణ శక్తి ఉన్నట్లు తోచిందని వ్రాశావు. దానిని బాగా గమనించి, అనుభూతి చెంది మళ్ళీ తెలియజేయి. నీవు ఆ విషయం, ఆకర్షణ శక్తి గురించి వ్రాసినపుడు నేను దానిని నిశితంగా పరిశీలించగా నాకు కూడా అలాగే అనిపించింది. ఇది శ్రీకృష్ణుని కాలంలో బాగా ఉండేది.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు అందజేయి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య -239

షాజహాన్‌పూర్,

04.08.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం జూలై 30వ తేదీది అందింది. నీవు 'F' పాయింట్‌వద్ద నిలిచావని నేను ఇంతకుముందే వ్రాసి ఉన్నాను. కాని ఆ పాయింట్‌వద్ద నీ యాత్ర కొనసాగించటానికి నా ప్రాణాహుతి పనిచేయటం లేదు. ఎందుకంటే, ఆ పాయింట్ ఇంకా పూర్తిగా, సక్రమంగా తెరుచుకోవటం లేదు. అందుకు కారణం తెలియటం లేదు. ఇప్పటిదశలో పచ్చదనంగాని, ఎండిపోవటంగాని గ్రహింపుకు రావటం లేదు అని నీవు వ్రాశావు. దాని అర్థం ఏమిటంటే, నీవు ఆత్మను సమీపించావు. కాని నీ దృష్టిలో ఇంకా తాజాదనం, వాడిపోవటం యొక్క అనుభవం కలుగుతోంది అని వ్రాశావు. కాని ఆ భావం కూడా ఉండకూడదు. నీవు ఈ స్థితిలోనే నిమగ్నమై ఉంటే దైవం నీకు ఈ స్థితిని కూడా తప్పక అనుగ్రహిస్తాడు. "నిరామయమైన విశాలమైన మైదానం కూడా బహుశా నాలో లయమైపోతున్నట్లు నాకు అనిపిస్తోంది" అని నీవు వ్రాశావు. ఈ స్థితి ఎటువంటిదంటే, ఎవ్వరిదైనా నివాసం లేదా ఇల్లు ఆ విశాల మైదానమే అయిపోయినపుడు, అక్కడే కొనసాగటం వలన వారికి ఆ ప్రదేశం తనకు చెందినదే అని అనిపిస్తుంది కాని తర్వాత దాని ధ్యాస ఉండదు. ఆ విశాల మైదానం నీలో విలీనమై పోతున్నట్లు ఉంది అని నీవు వ్రాసిన దానిలో నీకు కలిగిన అనుభవం ఏమిటి? దాని గురించి నాకు వ్రాయి. ఒకవేళ దాని భావం "బిందువులో సింధువు లయమైపోవటం" లాంటిది అయితే, అది చాలా మంచి స్థితి అవుతుంది.

ఇప్పుడు, నీ దృష్టి అకస్మాత్తుగా 'మాలిక్' దృష్టిలోకి చొరబడిపోయింది అని నీవు వ్రాసిన దానిని కూడా మంచి స్థితిగానే చెప్పాలి. అనగా ఎప్పుడైతే నీ శరీరం యొక్క భావన లేకుండాపోయి, ఆలోచన కూడా 'మాలిక్'నే అంటిపెట్టుకున్నపుడు, ఈ విధంగా అనుభవమవుతుంది. ఇది ఆరంభమే కాని స్థితి యొక్క అంతం కాదు. (స్థితి యొక్క పరిపూర్ణత సిద్ధించినట్లు కాదు). అది దైవాధీనమై ఉండి, 'అతని' అభీష్టంమేరకు అనుగ్రహించ బడుతుంది, కాని అది నా స్వాధీనంలో ఉండదు. **"నా ఆలోచనగా భావించి నీవు పనిచేస్తూ ఉండు, అని చెప్పటంలోని ఆంతర్యం ఏమిటంటే, అప్పుడు నా ఆలోచన మాత్రమే పనిచేస్తూ ఉంటుంది కాని నీది కాదు" అని నీకు వ్రాశాను.** ఆ సందర్భంగా, "ఆధ్యాత్మిక ఉన్నతికి ఇది శ్రేష్టమైన చిట్కా" అని నీవు వ్రాసినది నాకు బోధపడలేదు. దానిని గురించి నాకు వివరించు. **ఆత్మోన్నతికి హానికరమైనది ఒకటి ఉంది, అదే 'అహం' లేదా 'అహంకారం'. ప్రశిక్షకుడు కనుక తన జ్ఞానం మరియు ప్రజ్ఞపట్ల అహంకారం కలిగి ఉంటే అది ఇంకా చెడ్డదవుతుంది. జనానికి అహంకారం ఉన్నట్లు అనిపించక పోయినప్పటికి అది తెలియకుండానే చలామణి అవుతూ ఉంటుంది. ఇంతకంటె ప్రమాదకరమైనటువంటిది మరొకటి ఉంది, అదే 'అసూయ'. స్వామి వివేకానంద కూడా ఎవ్వరైతే, ఎవ్వరిపట్ల అసూయలేనివారుగా ఉంటారో వారిని శ్రేష్టవ్యక్తిగా అభివర్ణించారు. ఈ రెండు అవలక్షణాల (హానికారకాల)ను ఎవ్వరైతే విడిచిపెట్టరో వారి పతనం ఎప్పటికైనా తథ్యం. ఆ అధమస్థితి నుంచి మళ్ళీ తలెత్తుకోవటం కూడా గగనమే. ఎవ్వరికైనా ఈశ్వరానుగ్రహం కలిగిందంటే అది చూసి మనం హర్షించాలి.** కాని ఇక్కడ దానికి విరుద్ధమైన వాతావరణం ఉంది. ఇటువంటి బలహీనతలు ఉన్నవారు ఎవ్వరినైనా నేను ఉద్దేశించి, సరిదిద్దుకోమని నేను సూచించినట్లయితే దానిని అతడు చెడుగా భావించి, నా ముఖం చూడటానికి కూడా విముఖుడవుతాడు. ప్రత్యేకించి ఏ వ్యక్తి / అభ్యాసిలోనైనా ఈ బలహీనతను గుర్తించినపుడు, నా

ఆధ్యాత్మిక బలంతో దానిని, అతనికి తెలియకుండానే నివారించవచ్చును కాని నేను ఈ వయస్సులో అంత శ్రమ తీసుకోలేను. అందువలన దానిని వారికి చెప్పకపోవటం నా బలహీనతగానే భావిస్తున్నాను. నీ సోదర సోదరీలకు శుభాశీస్సులు తెలియజేయి.

ఇంతకీ సిద్ధాంతం ఏమిటంటే, **శిక్షకుని ద్వారా శిక్షణ పొందుతున్నటు వంటివారు, ముఖ్యంగా వారి ద్వారా దీక్ష తీసుకున్నటువంటివారు, వయస్సులో పెద్దవారైనాసరే, సదరు శిక్షకుని యొక్క ఆధ్యాత్మిక బిడ్డలే అయినప్పటికి నేను ఈ విషయాలను ఖాతరుచేయకుండా, వయస్సుకు, పెద్ద వయస్కులకు ప్రాధాన్యత ఇచ్చాను.** నన్ను ఎవరు ఏమని అనుకున్నా నేను కలత చెందను. అనగా ఎవ్వరైనా తిట్టినా, కొట్టినా అది నన్ను ప్రభావితం చేయదు. **నా మాటమీద ఎవ్వరికైనా నమ్మకం లేకపోతే ప్రయోగంచేసి నిరూపించుకోవచ్చు.** నేను కూడా మానవుడినే కనుక, ఒక నిముషమో లేక రెండు నిముషాలో బాధపడవచ్చును కాని, ఆ తర్వాత మళ్ళీ నాకు నేనుగా అయిపోతాను.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 240

లఖీంపుర్,

5.08.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది, సంగతులు తెలిశాయి. నిన్న చిన్నాన్నగారిని సోమవారంగాని, బుధవారంగాని న్యాయాధిపతి (Judge)గా అధికారం చేపట్టవలసినట్లుగా ఉత్తరం వచ్చిందని వ్రాశారు. అందుకని వారు తావూజీగారిని కూడా రమ్మని ఆహ్వానించారు. తావూజీ ఈ రోజు అలహాబాద్ వెళ్ళారు. బహుశా ఆదివారం తిరిగి వస్తారు. పూజ్య శ్రీ బాబూజీ, వాస్తవం చెప్పాలంటే, 'తమరి' దయ అంతులేనిది. 'తమ'కి తమరే సాటియని నేను ఎలుగెత్తి చాటగలను. **శ్రీ సమర్థ మహరాజ్ (లాలాజీ సాహెబ్), తమ ప్రకాశంతో సమస్త ప్రపంచం కాంతులీనేటట్లు చేయగల తమవంటి రత్నాన్ని ప్రసాదించారు. 'వారి'కి పోల్చదగినవారెవ్వరూ ఇంతకుపూర్వం రాలేదు, మరి మున్ముందుకాలంలో వచ్చే అవకాశం కూడా లేదు. కళ్ళు తెరచి చూడగలవారికి ఎవ్వరికైనా ఇది కనపడుతుంది. బాబూజీ, తమరిని తయారుచేసిన ఆ సమర్థ లాలాజీని గురించి ఎవ్వరు చెప్పగలుగుతారు! 'వారి'ని కీర్తించాలంటే – "తమ కృపాకటాక్షాలతో వెలిగించిన ఈ జ్యోతి ఆధ్యాత్మికతను ఆకాంక్షించే వారందరికీ దివ్యకాంతిని ప్రకాశింప జేస్తుంది" – అను మాటలు చెప్పదగినవిగా ఉంటాయి.**

పూజ్య శ్రీ బాబూజీ, తమ లేఖలో అనుభవంపొంది వ్రాయవలసిందిగా నన్ను ఆదేశించారు. అందుచేత సాహసించి ఈ కొన్ని మాటలు మాత్రమే వ్రాస్తున్నాను. 'మాలిక్' యొక్క ఆకర్షణ శక్తి గురించి నా అనుభవాన్ని వ్రాస్తున్నాను. యదార్థ విషయాలను మాత్రమే వ్రాస్తాను. నా మనస్సులో పూర్వీకులపట్ల ఎటువంటి కించపరిచే ఆలోచన రానేరాదు. తమరు అనుభవంతోనే వ్రాయమన్నారు కనుక నేను యదార్థమే వ్రాస్తున్నాను. నేను వ్రాయటంలో సముచిత శబ్ద ప్రయోగం లేకపోయినాగాని, ఏవైనా దోషాలు దొర్లినా గాని క్షమించగోర్తాను.

'తమరు' శ్రీకృష్ణ భగవానుడిలో ఆకర్షణాశక్తి గురించి వ్రాశారు, అది యదార్థం. అయితే నేను 'మాలిక్' కృపతో యదార్థమైనది ఒక్కటి మాత్రం చెబుతున్నాను. అది ఏమిటంటే, 'మాలిక్' యొక్క ఆకర్షణశక్తితో పోలిస్తే శ్రీ కృష్ణ భగవానుని యొక్క ఆకర్షణ శక్తి కంటే ఏ విధంగా చూసినా అధికమేనని అనిపిస్తోంది. ఈ ఆధిక్యతను నేను గుర్తించగలుగుతున్నాను. తమ విశిష్టతను ఎవ్వరూ కూడా బాగా గుర్తించలేకపోవటమే అందుకు కారణంగా నేను భావిస్తున్నాను. శ్రీకృష్ణ భగవానుని ఆకర్షణ శక్తితో జనులు బాగా ప్రభావితమయ్యారు. ఎందుకంటే, నేటి 'మాలిక్'

(బాబూజీ) యొక్క ఆకర్షణ శక్తి అపారమైనది మరియు సూక్ష్మత్వం చెందినదిగా ఉండటమే కారణమనిపిస్తుంది. ఎవ్వరైనాసరే తన అంచనాను తక్కువగా తలపెట్టి మళ్ళీ ప్రయత్నించి చూడవచ్చు. నేను ఏమి చెబుతానంటే, అందరూ చూస్తారు, కాని ఈ ప్రపంచానికి అనగా జనావళికి అంధత్వమే మంచిగా కనిపిస్తుంది. బాబూజీ, అందరం చూస్తాం కాని, మనం మన దృష్టితోగాక, 'అతని' దృష్టితో చూసినట్లయితే సులభమవుతుంది. ఏదైనా 'మాలిక్' దయతోనే జరుగుతుంది. అయితే ఇంత యోగ్యతను సాధించగల శక్తి ఎవ్వరికి ఉంది! 'మాలిక్' దయతో కలిగిన ఈ కొద్దిపాటి అనుభవాన్ని వ్రాయగలిగాను. ఆపైన తమకే తెలుసు. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, నేను 'మాలిక్' యొక్క నీడగా అయిపోవటం వలన లోపల, బయట ఏమీ భేదంలేనట్లుగా ఉంది. అంతా ఒకే స్థితిలో ఉంది. అది ఎలా ఉందో, అలాగే ఉంది, బయట లోపల ఒకటిగానే ఉంది, ఇంక అదేమిటో నాకు అంతుబట్టకుండా ఉంది. ఇప్పుడు నా నుంచి వేరైన పవిత్రతా స్థితి కూడా ఏమీ కనిపించటం లేదు. బాబూజీ, ఒక విధంగా చెప్పాలంటే, ఆ పవిత్రతా స్థితి కూడా నాలో ప్రవేశించి లయమైపోతున్నట్లు అనిపిస్తోంది. ఇలా గమనిస్తూ ఉన్నట్లయితే నిరంతరం ఏదో ఆనంద స్థితి ఉన్నట్లుగాను, అలా ప్రత్యేకంగా గమనించకపోయినట్లయితే నిరంతరం ఒక విధంగా ఆలోచనా రహిత స్థితిలో ఉన్నట్లుగాను అనిపిస్తోంది. అమ్మగారు తనకు తన స్వశక్తి భావన తొలగిపోవటంలేదని, ఏమి చేయాలా అని అనిపిస్తున్నట్లు తెలియజేస్తున్నారు. ఏమి చేయాలో అర్థం కాకుండా ఉంది, తావూజీ ఇంకా తిరిగి రాకపోవటం వలన జన్మాష్టమికి మేమందరం షాజహాన్‌పూర్ రావటం అసంభవమని అనిపిస్తోంది.

పూజ్య శ్రీ బాబూజీ, నా ఈ అనుభవాన్ని, హరిదద్దా మాత్రమే సమస్త సత్సంగ సోదర సోదరీలకు, వారికి కూడా మేలు కలిగేందుకు వివరించమని చెప్పగలరు. నేను నా పేరు చెప్పకుండా, ఇక్కడి సత్సంగీయులు అందరికీ తెలియజేస్తాను. బహుశా వారికి కూడా ప్రయోజనం చేకూరవచ్చు. నిజాన్ని కప్పి ఉంచటం ఎందుకు? తమకు ఏది మంచిదని తోస్తే అలా చేయండి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు. బిట్టో ఆరోగ్యం ఇప్పుడు ఎలా ఉంది? అమ్మ తమకు ఆశీస్సులు అందిస్తున్నారు. కేసర్ మరియు బిట్టో ప్రణామం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 241

లఖీంపూర్,

10.08.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. తమరు తమ ఆరోగ్య విషయంలో జలుబు, దగ్గు నుంచి విముక్తమయ్యారో లేదో వ్రాయలేదు. మేము షాజహాన్‌పూర్ వస్తున్నట్లయితే, రేపు సాయంత్రానికి చేరుకుంటాము. బాబూజీ, మా ప్రయాణం కష్టమవుతోంది, అయినా 'మాలిక్' దయతో చేరుకుంటాము, అంతా 'అతని' ఇష్టం. తావూజీ అలహాబాద్ నుంచి తిరిగిరాలేదు. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఆలోచనారహిత స్థితి కూడా అనుభవానికి రావటం లేదు. ఇప్పుడు నాకు స్థితిని గురించి, అదేమిటో, ఎలా ఉంటుందో కూడా తెలియటం లేదు. ప్రపంచంలో ఒక సామాన్య మానవుడు తన దైనందిన జీవితాన్ని ఎలా గడుపుతాడో, అలాగే నా పరిస్థితి ఉంది. ఇప్పుడు నా స్థితి ఏమిటో స్వయంగా నాకు తెలియకుండా

ఉంది, అది 'మాలిక్'కే తెలియాలి. 'అతడు' నన్ను ఎలా ఉంచాడో అలాగే ఉన్నాను. ఇంతకూ ఉన్న భేదం ఏమిటంటే, మనస్సులో ఒక ఆవేదన, తపన వంటివి ఉన్నాయి. వాస్తవానికి ఇదే నా శాంతి దశగా ఉంది. అలాకాకుండా ఏదైనా స్థితి నాలో ఉన్నదో, లేదో కూడా నాకు తెలియటం లేదు. నా ఆంతరిక దృష్టి ఏమైపోయిందో తెలియదు. ఇంక నన్ను 'తమ'రే ఆదుకోవాలి.

పూజ్య శ్రీ బాబూజీ, 'మాలిక్' కృపతో ఇప్పుడైతే స్థితి అనుభవం అవుతున్నది కాని దానిని సవివరంగా చెప్పలేకపోతున్నాను. బాబూజీ ఇప్పుడు అన్ని రకాల దృష్టి తొలగిపోయింది. దృష్టి దృష్టిలో అంతర్లీనమైపోగా ఏమి మిగుల్తుందో అదే నా స్థితిగా ఉంది. నా హృదయంలో కొంత విసుగుదల, కొంత భారం వంటివి ఉన్నప్పటికీ 'మాలిక్' కృపతో వీటికి విరుద్ధంగా దైవం కొరకు కొంత తపన ఉన్నట్లు ఉంది. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నాలో శక్తిగాని, ఆలోచనగాని ఏమీ లేకుండాపోయాయి. అయినా గాని, దేనితోనో పనులన్నీ జరిగిపోతున్నాయి. అయితే 'మాలిక్' కృపతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు వగైరా నాకు తెలియకుండానే యథాప్రకారం జరిగిపోతూ ఉన్నాయి. ఇదంతా ఎలా జరుగుతోందో, ఏమిటో నాకైతే ఏమీ తెలియదు. అయితే నాలో ఒక చెడు చోటుచేసుకుంది. అది నా వశంలో లేకుండా ఉంది. అది ఏమిటంటే, 'మాలిక్' కృప ఇంతగా నామీద ఉన్నప్పటికీ, నాలో కనీసం 'అతని' జ్ఞాపకం కూడా కలగకుండా ఉంటున్నది. అది ఎందుకో తమకే తెలియాలి. నేనైతే ఏమై ఉన్నానో, అలాగే 'తమ' ఎదుట ఉన్నాను. ఇది ఎందుకు జరుగుతూ ఉన్నదో తమరే గ్రహించాలి. ఎందుకంటే, నేను నా వశంలో లేనట్లు అయిపోయాను. నన్ను నేను మంచిగా భావించుకోలేక పోతున్నాను. ఎందుకంటే, నాకు 'మాలిక్' జ్ఞాపకంగాని, అతనిపట్ల ఒక్కింత ప్రేమగాని లేకుండాపోయాయి.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 242

లఖీంపుర్,
12.08.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరాన్ని నిన్న సాయంత్రం 8.00 గంటలకు పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు చదివి వినిపించారు. అది విని నాకు అత్యంత ఆనందం కలిగింది. వాస్తవానికి **తమ ఉత్తరంలోని ప్రతిమాట స్వర్ణాక్షరాలతో లిఖించతగ్గదిగా ఉంది. ప్రతి పంక్తి కూడా అభ్యాసయోగ్యంగా ఉంది. 'మాలిక్' కొరకే మరణించటమన్నది నా కోరిక మరియు ప్రయత్నంగా ఉంది.** అంతా 'మాలిక్' చేతుల్లోనే ఉంది. 'అతని' దయపైనే ఆధారపడి ఉంది.

పూజ్య బాబూజీ, అమ్మగారు, మేమందరం తమకు అధికాధికంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. మాపట్ల తమ దయకు హద్దు లేకుండా ఉంది. అమ్మగారు మరియు మేమందరం, పూజ్యులు 'సమర్థ శ్రీ లాలాజీ' మరియు 'శ్రీ స్వామీజీ'కి శతాధికంగా ధన్యవాదాలర్పిస్తున్నాం. ఇదంతా తమ ఖ్యాతియే.

నా అనుభవానికి వచ్చిన ఒక విషయం వ్రాయటం మర్చిపోయాను. అది ఏమిటంటే, **మా యొక్క ఆలోచన (సంకల్పం) తమ యొక్క ఆలోచన (సంకల్పం)గా భావించినట్లయితే అభ్యాసీ యొక్క సంబంధం ఆ ఉన్నత ప్రపంచంతో సంధానించబడుతుంది.**

తమ దయతో ఈ రోజు నా దశలో కొంత మార్పు కలిగినట్లు ఉంది. ఆ మార్పు అనేది కొంచెం తేలికదనంగా అర్థం చేసుకోండి.

తావూజీ ఇంకను రాలేదు. అమ్మగారు తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు. కేసర్ మరియు బిట్టో ప్రణామం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 243

షాజహాన్‌పూర్,

13.08.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలమగు గాక! నీ ఉత్తరాలు అన్నీ అందాయి. నీవు నిరాలోచనాస్థితిని అనుభూతి చెందుతున్నట్లు వ్రాశావు. ఈ స్థితి చాలా మంచిదే, కాని ఇప్పటికీ నీవు నిరాలోచన యొక్క జ్ఞానాన్ని కలిగి ఉన్నావు అంటే ఆలోచన మరియు నిరాలోచన రెంటినీ నీవు గుర్తించటం ఇంకా మిగిలి ఉంది. ఇది కూడా లేకుండాపోయినపుడు వాస్తవికత యొక్క ప్రారంభంగా (Beginning of Originality) తెలుసుకోవాలి. సాహసించాలే గాని దైవం దీనిని కూడా అనుగ్రహిస్తాడు. ఇది చాలా సూక్ష్మమైన విషయం, ప్రతి ఒక్కరూ దీనిని గురించి తెలుసుకోగలిగి ఉండరు. దాని రుచి చూసేవారికి దాని మజా తెలుస్తుంది. ఈ స్థితి కలుగునట్లు భగవంతుడు నిన్ను అనుగ్రహించుగాక! నీ ఉత్తరంలో సంబంధంలేని విషయం ఒక దానిని గ్రహించాను, అయినప్పటికి దానిని గురించి కూడా వ్రాస్తున్నాను. నీకు శ్యామ్‌పతికి మధ్య జరిగిన సంభాషణ గురించి నారాయణ నాకు వివరించాడు. నీవు అక్కడి వాతావరణం (స్థితి) గురించి తెలియజేయటం శ్యామ్‌పతికి ఆశ్చర్యం కలిగించినట్లు చెప్పాడు. నీవు ఒక విషయాన్ని పరిశోధించు. నేనయితే పరిశోధించ లేదు కాని, నేను కూడా చూస్తాను. ఇది ఒక క్రొత్త ఆలోచనగా ఉంది. నేను మర్చిపోయే అవకాశం ఉంది కనుక నీవు దానిని జ్ఞాపకం ఉంచుకో. ఏదైనా ఒక విషయం ఉంది అంటే వాతావరణం మీద దాని ప్రభావం ఉంటుంది. ఒక పురుషుడు కాని, స్త్రీ కాని నీ ఎదుటకు వచ్చినప్పుడు, వారి ఆలోచనలు ఎటువంటివైనా కావచ్చు, దానికి తగినట్లు అక్కడి వాతావరణం మీద ప్రభావం పడుతుంది. అందుచేత నీవు ఈ విషయాన్ని బాగా పరిశీలించు. అది ఏమిటంటే, ఒక మనిషికి నాలుగు దిశలా ఎటువంటి వాతావరణం ఉంటుందో దానికి అనుగుణంగానే అతనిలో ఆలోచనలు కలుగుతూ ఉంటాయి. ఈ క్రొత్త ఆలోచన నా దృష్టికి వచ్చింది కనుక వ్రాశాను, కాని దాని గురించి నేను పరిశోధించ లేదు.

"ప్రపంచంలో ఒక సాధారణ మానవుడు తన దినసరి కార్యక్రమంతో జీవించునట్లు"గానే నీ స్థితి ఉంది అని వ్రాశావు. నీకు కలిగిన అనుభవాన్ని వ్రాశావు కాని దానిని బాగా అభివర్ణించలేకపోయావు. ఈ విషయంలో స్పష్టత కొరవడింది. దీని యొక్క అసలైనస్థితి ఇంకా బహుదూరంగా ఉంది. అది ఒక దైవ రహస్యం. ఆ రహస్యాన్ని లాలాజీ సాహెబ్ చాలా నిగూఢంగా ఉంచి నాకు వ్రాసిన ఒక ఉత్తరంలో బహిర్గతంచేసి, దానిని ఎవ్వరికీ చెప్పవద్దని ఆదేశించారు. కబీరుదాసు తన సమర్థుడైన శిష్యుడు ధర్మదాసుతో ఇలా చెప్పాడు:

**"'ఓ ధర్మదాసు! ఈ దైవ రహస్యం బయటకు పొక్కనీయవద్దని ఒక లక్షసార్లు విన్నపాలు చేస్తున్నాను"**

నా దశ లాలాజీ సాహెబ్ కృపతో పరిపూర్ణస్థాయికి చేరినపుడు నేను ఈ ద్విపద వచనాన్నే వారికి వ్రాశాను. దానితోపాటుగానే పర్వతం గడ్డిపోచ చాటున ఉన్నట్లు అనిపించింది అని వ్రాశాను. ఈ ద్విపద యొక్క అర్థం, ఆధ్యాత్మిక విద్యను స్వచ్ఛంగా ఎవరికీ అందజేయవద్దని చెప్పటం కాదు, అయితే **అసలు రహస్యాన్ని మాటల్తో చెప్పకుండా అభ్యాసీ స్వయంగా దాని యొక్క అనుభవం పొందేవరకు ఆ రహస్యం చెప్పకూడదని మాత్రమే వారించటమైనది.** ఒకవేళ ఈ విషయం ఎవ్వరికైనా తెలిసిపోయినట్లయితే అతడు ఆ దైవ మహత్యాన్ని లేదా ప్రాముఖ్యతను

చులకనగా తీసుకుని, దీనిని త్వరగా అంగీకరించకపోవచ్చు. లాలాజీ సాహెబ్ నాకు వ్రాసిన ఒక ఉత్తరంలో ఈ విధంగా ప్రయోగం చేయమని సలహా ఇచ్చారు– "నీవు ఒక మంచి ఏకాంత ప్రదేశంలోకి వెళ్ళి, నిన్ను బాగా ఒక పతితుడుగాను, దీనావస్థగల దరిద్రుడిగాను అనుభవిస్తున్న స్థితిలో ఉన్నట్లుగా భావించుకొని, తర్వాత నెమ్మది నెమ్మదిగా పురోగతిని సాధిస్తూ, చక్రాల స్థితిని గుర్తిస్తూ మళ్ళీ నీ పూర్వ స్థితికి చేరుకోవాలి. నీవు ఆ విధంగా ఎంతకాలం పతితుడిగా ఉండి, దాని తర్వాత ప్రశిక్షకుని స్థాయికి ఎదగలేవో అప్పటివరకు అభ్యాసులకు శిక్షణ ఇచ్చే భాధ్యతను నేను స్వీకరిస్తాను." 'వారు' నన్ను ఈ ప్రయోగం చేయమని కోరుతున్నారు కాని నేను ఆ పని చేయటానికి సమయం ఉంటుందో ఉండదో చెప్పలేను. అంతేగాకుండా అది ఏ కొండమీదనో లేక కీకారణ్యంలోనో చేయాల్సి ఉండవచ్చు. **నేను చాలా దైవ రహస్యాలను వెల్లడిచేశాను.** వాటిని పుస్తకాలలోను, ఉత్తరాలలోను వ్రాశాను కూడా. అయితే కొన్ని అతిముఖ్య రహస్యాలను మాత్రం చెప్పి ఉండకపోవచ్చు. కాని ఇప్పుడు ఉన్న ఆజ్ఞ ప్రకారం నేను వాటిని నా హృదయంలోనే పదిలం చేసుకొని ఈ భౌతికదేహం వదలిపోకూడదు అని. గ్రంథస్తం చేసేవారు లేకపోతే ఇంకా చాలా విషయాలు విపులీకరించలేకపోవటం జరగవచ్చు. ఒకవేళ వాటిని వ్రాయగలిగినవారు ఎవ్వరైనా ఉన్నప్పటికీ అటువంటివారు నన్ను నీడలాగా అంటిపెట్టుకుని ఉండాలి. అలా జరిగినప్పుడు నాలో ఎప్పటికప్పుడు కలిగిన ఆలోచనలను గ్రంథస్థం చేసే అవకాశం ఉంటుంది. నీవు నీ తపన గురించి వ్రాసిన సందర్భంలో నాకు కలిగిన తపన యొక్క జ్ఞాపకం నెమరువేసు కున్నాను. అప్పుడు నా తపనలో కలిగిన ఆనందం, అశాంతి కనుక శాంతికొరకు అన్వేషించే వారు ఎవ్వరికైనా కలిగినట్లయితే దానిని వారు తిరస్కరిస్తారు. ఇప్పుడు నేను ఈ విషయాలు అన్నింటి నుంచి విముక్తుడనయ్యాను. ఇప్పుడు ఆ బాధ, వ్యధ ఏవీలేవు. వీటిని అనుకరించటానికి ఎవ్వరూ ప్రయత్నించకూడదు. ఎందుకంటే, అవి సమయోచితంగా వాటంతట అవే కలుగుతాయి. కబీరుదాసు యొక్క ఆ ద్విపద వచనాలను గురించి నీవు శ్యామ్‌పతిగారిని వివరించమని కోరితే ఆయన బాగా అర్థం చెబుతారు. ఎందుకంటే ఆయన మంచి పండితుడు. ఆ తర్వాత నేను తెలుసుకున్న భావం కూడా వారికి తెలియజేయి. అప్పుడు అసలు విషయం స్పష్టమవుతుంది, దానిని నాకు వ్రాయాలి. కేసర్ వ్రాసిన ఉత్తరం అందింది. ఆమెకు కలిగిన తపనకు అభినందిస్తున్నాను. ఈ రకమైన తపన అతికష్టంమీద అనుభూతమవుతుంది. ఇది ఋషుల సత్సంగంతోను, అభ్యాసీ యొక్క లక్ష్యాన్వేషణలోను దీని అనుభవం పొందాలి. దీనినే సూఫీలు (యోగులు) వ్యధిత హృదయం (దర్ద్ దిల్) అని వర్ణించారు. దీనికి కూడా అనేకమైన అంచెలు (దశలు) ఉన్నాయి. ఈ తపన ఎంత ఉన్నతస్థాయికి చెందినదై ఉంటుందో దానికి తగినట్లుగానే అంత ఉన్నతస్థాయికి అభ్యాసీ ఎదుగుతాడు. **బిటియా! నిజం చెప్పాలంటే ఎంతోకొంత పని జరగాలని అభ్యాసులను నేను ఎగతోస్తూ పోతున్నాను. అసలు నిజమైన తపన ఎవ్వరిలోను కనపడటం లేదు.** లాలాజీ సాహెబ్ సత్సంగంలో చాలామంది మంచి అభ్యాసులు ఉండేవారు కాని వారిలో కూడా ఈ తపన తరుగుగానే ఉండేది. **నిజం చెప్పాలంటే, 'వారు' ఎంతో ఉదార హృదయంతో వాతావరణంలో ఆధ్యాత్మిక రత్నాలను వెదజల్లుకుంటూ పోయారు. అయినప్పటికీ జనం కళ్ళు తెరచి 'వారి' విశిష్టతను గుర్తించలేకపోయారు.** ఎన్నో క్లిష్టమైన విషయాలు 'వారి' ద్వారా పరిష్కరించుకోవచ్చని నేను కూడా అర్థం చేసుకోలేకపోయాను. 'వారి' కృపతో నాకు ఈ స్థాయిని కల్పించారు. అమ్మగార్కి నా ప్రణామాలు తెలియజేయి.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 244

లఖీంపుర్,

22.08.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు సుఖప్రదంగా చేరి ఉంటారని భావిస్తున్నాను. తమరు ఇక్కడకు రాకపూర్వం రెండు రోజులు ముందు తమ ఉత్తరం చేరింది. **మానవుని చుట్టూరా ఎటువంటి వాతావరణమైతే ఉంటుందో, దాని ననుసరించియే అతని ఆలోచనాసరళి ఉండవచ్చు అనే విషయం గురించి నన్ను పరిశీలించాల్సిందిగా తమరు ఆదేశించారు. ఈ విషయమై తమ యొక్క అభిప్రాయం పూర్తిగా సబబైనదే. 'మాలిక్' దయతో దానిని పరిశోధించాను కూడా.** ఒక ద్విపద యొక్క అర్థం గురించి శ్యామ్‌పతిని అడగమని వ్రాశారు. ఒకటి, రెండు రోజుల్లో నేను అక్కడికి వెళ్ళినప్పుడు అడుగుతాను. ఇప్పుడు 'మాలిక్' కృపతో నాకు కలిగిన ఆత్మికదశను గురించి వ్రాస్తున్నాను.

'మాలిక్' నన్ను ఆలోచనాపూరకం మరియు ఆలోచనారహితం అనే రెండింటి స్థితి నుంచి నన్ను విముక్తం గావించాడు అను విషయం తమకు బహుశా నేను తెలిపానని అనుకుంటాను. ఇప్పుడైతే నాకు ప్రతిదీ స్పష్టమవుతున్నట్లుగానే అనగా నేను ఏ దశలో ఉన్నప్పటికీ అది స్పష్టమవుతూ జరుగుతున్నట్లుగానే తలపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, తమరు ఇక్కడ ఒక రోజున పరమ పూజ్యులు పాపాజీ యొక్క ప్రేమను గురించి, తమరు తమ డైరీలో వ్రాసుకున్న విషయాల గురించి ప్రస్తావించారు. అప్పటి నుండి ఒకటి రెండు రోజులు నాకు ఏమైందో ఆ దైవానికే తెలియాలిగాని, హృదయం హాः హాः అని స్పందిస్తున్నట్లు అనిపిస్తోంది. నా పరిస్థితి ఎలా ఉంది అంటే, నేను ఏదైనా చెప్పాలనిగాని, ఏదైనా మాట్లాడాలి అనిగాని నాకు అనిపించటం లేదు. నా హృదయాన్ని నొక్కి పట్టుకుని, పడుకోవాలనిపిస్తోంది. అది ఒక్కొక్కసారి నాకు భరించరానిదిగా ఉంటున్నప్పటికీ నాకు ఆ స్థితిలోనే కొనసాగాలని అనిపిస్తోంది. ఈ రోజు నుంచి ఈ స్థితి యొక్క తీవ్రత కొంచెం తక్కువగానే ఉంది. అదంతా దైవేచ్ఛ. ఇప్పుడు ఉన్న స్థితి ఎలా ఉందంటే,

**"సురత్ సుహాగిన్ హై పనిహారిన్**

**తాఢి భరై బినడోర్ రె"**

అనగా **ధ్యానం అనే తాడుతో దైవం అనే బావి నుంచి ప్రాణాహుతిని నిరంతరం తోడి నింపుతున్నట్లు ఉంది.**

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. అమ్మగారు తమకు ఆశీస్సులు అందిస్తున్నారు. కేసర్, బిట్టో తమకు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 245

లఖీంపుర్,

26.08.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ఆరోగ్యం ఇటీవల బాగుండలేదు; బలహీనత, జలుబు, దగ్గుకు లోనయ్యారు. అయినప్పటికీ విచారించనవసరం లేదు. క్రమక్రమంగా ఆరోగ్యవంతులవుతున్నారు. 'మాలిక్' కృపతో నాకు కలిగిన ఆత్మికదశను వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఉన్న పరిస్థితి ఎలా ఉంది అంటే, అప్పుడప్పుడు హృదయం ఎంతగా చల్లబడిపోతుంది అంటే దానిని చెప్పతరం కాదు. లోపల అంతా కూడా ఏదో చిత్రించబడినట్లుగా హత్తుకుపోయినట్లు అనిపిస్తోంది. లోన అంతా చల్లని దశగా అయిపోయినట్లు ఉంది. అప్పుడప్పుడు ఈ శీతల దశయే అన్ని దిక్కుల్లోను అనుభవమవుతోంది. దీని మూలంగా నాకు ధ్యానం, మొదలైనవి ఏమీ ఇష్టం ఉండటం లేదు. ఎదుట ఏమీ నిలబడటం లేదు. పూజ్య బాబూజీ, ఇప్పుడు ఈ స్థితిలో ఎలా ఉన్నాను అంటే, సాధారణంగా మాటలు కొంచెం ఉచ్ఛస్వరంలో మాట్లాడినా గాని, కొంచెం ఉద్వేగంగా మాట్లాడినాగాని అసహనీయంగా ఉంటోంది. బహుశా ఇది ఆ శీతల స్థితికి అంతరాయం కలిగించటం మూలంగా అయి ఉండవచ్చు. అవి నా మైండ్‌కు, హృదయానికి బాధాకరంగా ఉంటున్నాయి. వాటికి ఆ అంతరాయాన్ని భరించే శక్తి లేకపోయి ఉండవచ్చు. కొంచెం బిగ్గరగానో, వేగంగానో మాట్లాడితేనే ఈ శీతల ప్రశాంత స్థితికి అసహనంగా ఉంటే ఇంక కోపం గురించి ఏం చెప్పమంటారు! నా హృదయానికి ఇవన్నీ నచ్చటం లేదు. నేను 'మాలిక్' మనస్సులోనే జీవిస్తున్నట్లు అనిపిస్తోంది.

పూజ్య బాబూజీ, ఇప్పుడు హృదయం కుంచించుకుపోయినట్లుగాను, ఉదాసీనంగాను ఉండిపోయి నిరుత్సాహంగా ఎందుకు ఉంటున్నదో అర్థం కావటం లేదు. ఏదైనా బలహీనత ఏర్పడిందో ఏమో, దయచేసి దానిని తమరే పరిష్కరించండి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 246

షాజహాన్‌పూర్,

02.09.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీవు ఆగష్టు 22 మరియు 26వ తేదీలతో వ్రాసిన ఉత్తరాలు చేరాయి. ఈశ్వరుని కృపవలన మంచి స్థితి నడుస్తోంది. ఇతరులు బిగ్గరగా మాట్లాడటం నీకు అప్రియంగా ఉంటోంది అని వ్రాశావు. దాని అర్థం నీలో ఏకాగ్రత వృద్ధి చెందుతోంది. ఆగష్టు 31వ తేదీ రాత్రి షుమారు 12.30 సమయంలో నీకు 'F' పాయింట్‌వద్ద సిట్టింగ్ ఇస్తూ ఉండగా ఒక్క పెట్టున 'F' పాయింట్ యొక్క ఒక ఆచ్ఛాదనం బ్రద్దలై దాని నుంచి ఒక నిప్పు సెగ వంటిది వెలువడినట్లు నాకు అనిపించింది. అది కొంచెం పొడిగాను, కొంచెం చంద్రకాంతితో ఉన్నట్లు తోచింది. కాని అది ఏమిటో నాకు అర్థం కాలేదు. దానికి ముందుగా నేను 'F' పాయింట్ యొక్క ఆంతరిక భాగం మీద ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) ఇస్తూ దానిని వృద్ధి చెందిస్తున్నాను కాని అది వృద్ధికావటం లేదు. అయితే దాని ప్రభావంతో దానిలో తగినంత శక్తి సమకూరింది. ఇప్పుడు అది సరిపడినంతగా పూర్ణస్థితిలో ఉన్నట్లు నాకు అనిపించింది. అయినప్పటికీ దాని అంతర్‌భాగం మీద నా ఇచ్ఛాశక్తి యొక్క కేంద్రీకరణ ఇంకా తీవ్రంగానే ఉన్నట్లు అనిపిస్తోంది. బహుశా అవి ఇంకా వృద్ధి చెందవచ్చు. నాలో ఉన్న లోపం - తొందరపాటు చర్య యొక్క అలవాటు మూలంగా నేను సమతుల్యాన్ని కోల్పోయాను. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం నుంచి ఇప్పటివరకు నీకు కలిగిన అనుభూతులను వీలైనంత త్వరగా వ్రాయి.

అమ్మగార్కి ప్రణామాలు అందజేయి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 247

లఖీంపుర్,

02.09.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఉత్తరం వ్రాసి పోస్టు చేశాను. బహుశా అది తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం 7,8 రోజుల నుంచి బాగుండని కారణంగా ఉత్తరం వ్రాయటంలో ఆలస్యమవుతోంది. నా దృష్టిలో అంతగా చింతించాల్సిన అవుసరం లేదనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో ఇది కూడా ఒకందుకు మంచిదే కావచ్చు. క్రమక్రమంగా కోలుకుంటాను. 'మాలిక్' కృపతో కలిగిన నా ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, నేను ఈ రోజునే కాదు, నేను ఎప్పుడైనా సాధన చేసి ఉన్నానా, లేదా ఇప్పుడు సాధన చేస్తున్నానా అనే జ్ఞానం నుంచి కూడా 'మాలిక్' నన్ను విముక్తి చేశారు. ఇంతేకాదు, ఈ సాధన ద్వారా ఏదైనా ఫలితం కలిగిందా, కలుగుతున్నదా, లేక కలగనున్నదా అనేది కూడా తెలియకుండా ఉంది. బాబూజీ ఈ పరిస్థితి గురించి ఏమని చెప్పమంటారు, సాధనవలన ఏమి దక్కింది, దేని మూలంగా శాంతి లేకుండా పోయిందో కూడా తెలియకుండా ఉంది. ఈ విధమైన దృష్టి లేకపోవటమే కాకుండా, నేను సత్సంగ్‌లో కూర్చున్నప్పుడు, నాకు ఏమీ తెలియదని, అసలు నావద్ద ఏమీ లేదని అనిపిస్తోంది. నాకు శాంతి లేదు అని ఎవరితో చెప్పమంటారు? నాకయితే 'మాలిక్'తోనే సంబంధం ఉంది, నేను 'అతని'కే చెంది ఉన్నప్పుడు అదేమిటో 'అతని'కే తెలియాలి. ఇంతకుముందు, అనుక్షణం 'మాలిక్'తో ఏకత్వం నెలకొని ఉండేది కాని ఇప్పుడు ఆ ధ్యాస కూడా లేకుండా ఉంటోంది. 'మాలిక్' దయతో నా స్థితి సత్వ, రజ, తమో గుణాలకు అతీతంగా ఎక్కడకు పోయిందో తెలియకపోగా దానిని పట్టించుకోనట్లు అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నాకు ఏమైందో తెలియడం లేదు, (Initiation) దీక్షను గురించిన అనుభూతి కూడా కలగటం లేదు. అయినాగాని తాడు లేకుండా పడతి నీటిని తోడి నింపినట్లు నా స్థితి ఉంటున్నది. సిట్టింగ్ ఇస్తున్నప్పుడు నేను ఇవ్వగలుగుతున్నానో లేదో తెలియడం లేదు. 'పని' విషయంలో కూడా ఇదే విధంగా ఉంటోంది. 'పని' చేస్తున్నప్పటికీ, అది సక్రమంగా ఉన్నదా లేదా అనిగాని, ఏదైనా లోపం ఉన్నదా అనిగాని తెలియకుండా ఉంది. అంతా 'మాలిక్' ఇష్టప్రకారమే జరుగుతుంది. బాబూజీ, తమరు సర్వజ్ఞులు, తమకు తెలియనిది ఏముంది!

పూజ్య శ్రీ బాబూజీ, ఇంతకుపూర్వమైతే నేను వేగంగా పురోగతి చెందుతున్నట్లు తెలుస్తూ ఉండేది కాని, ఇప్పుడు దశ మారుతున్నప్పటికీ ఎందుకోగాని ఏమీ తెలియటం లేదు. నాలో ఏదైనా లోపంగాని, నా పురోగతిలో మందగమనంగాని ఏమైనా ఉన్నాయేమో తమరే చెప్పండి. ఇంకా ఏమిటంటే, ప్రస్తుతం నాలో ఎటువంటి దశ లేకపోయినప్పటికీ సత్సంగ్‌లో ఏదైనా దశ గురించి ప్రస్తావన వచ్చినప్పుడు, దాని గురించి నేను ఏమి వ్యాఖ్యానం చేయదలుస్తానో అది, 'మాలిక్' దయతో వాతావరణంలో ఆ దశ వ్యాపించి, ప్రతి అభ్యాసీకి దాని అనుభవం కలుగుతున్నదని అనిపిస్తోంది. అయితే నా దశ మాత్రం అప్పుడు ఎలా ఉందో అలాగే ఉంటున్నది. దీనికితోడు కొంచెం ఆధ్యాత్మిక ఆనందంగాని, లేదా తమరు ఏది భావిస్తే అదిగాని ఉంటోంది. నడుముకు మధ్యభాగంలో, వెన్నెముక వెనుక ఏదో ప్రకంపనం ఉంటోంది. అప్పుడప్పుడు అది ఏవో కీటకాలు ప్రాకుతున్నట్లు జరజరమంటుంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 248

లఖీంపుర్,

03.09.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు అందింది, దానిని చదివి చాలా సంతోషించాను. తమరు ఆగష్టు 31వ తేదీ రాత్రి సమయంలో ఒక పరదా విచ్చినమై దాని నుంచి కొంచెం ఎరుపు మరియు చంద్రుని వెలుగులాగ మంటలు ఎగసిపడినట్లు ఉందని వ్రాసి ఉన్నారు. 'మాలిక్' దయతో, సమయమైతే జ్ఞాపకం లేదుకాని, అదే రోజు రాత్రి నాకు స్వప్నంలో అదే విధమైన వెలుగు కనిపించినట్లు జ్ఞాపకం ఉన్నది. అయితే అంతకుమించి నాకేమీ తెలియదు. దయచేసి అదేమిటో తమరు వివరించినట్లయితే దానిని గురించి నేను కూడా తెలుసుకోగలుగుతాను. నిన్నటి నుంచి స్థితిలో ఏదో మార్పు ఉన్నట్లు తలపిస్తోంది. ఆ మార్పు ఏమిటో, నేను సరిగ్గా తెలుసుకోలేకపోతున్నాను. నిన్నటి నుంచి ఆరోగ్యం కూడా కొంత బాగుపడినట్లుగాను, శక్తి కూడా బాగా ఉన్నట్లుగాను అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, అదేమిటోగాని, **'మాలిక్' స్మరణ కలిగినంతనే అనారోగ్యం, బలహీనత వంటివి తొలగిపోతున్నాయి.** ఇంకొక విషయం ఏమిటంటే, ఆ విధంగా వ్యాపించిన మంటల మూలంగా తమకు ఏమీ కష్టం కలగలేదు కదా!

అవునుగాని బాబూజీ, నాకు ఇప్పుడు "బిందువులో సింధువు ఇమిడిపోయింది" అనునటువంటి దశ స్పష్టంగా కనిపించటమేకాక, అనుభవానికి కూడా వస్తున్నది. తలవని తలంపుగానే ఒక నిరవధిక ప్రాణాహుతి ధారా ప్రవాహం ప్రారంభమైనట్లు అనిపిస్తోంది. ఆ నిరవధిక ప్రాణాహుతి ధార చాలా దూరంగా, ఎక్కడి నుంచి ప్రవహిస్తున్నదో తెలియకుండా ఉంది. దానిలో ఎవ్వరి ప్రమేయం ఉన్నట్లు అనిపించటం లేదు, దానిలో అందరూ సమానమే అన్నట్లు ఉంది. అమ్మగారు తమకు ఆశీస్సులు అందిస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 249

షాజహాన్‌పూర్,

06.09.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ రెండు ఉత్తరాలు చేరాయి. నీకు కలిగిన అనుభూతి గురించి తెలిసి నాకు చాలా ఆనందం కలిగింది. ఈశ్వరుడు నిన్ను అభినందించుగాక! నీవు ఆరోగ్యంగా ఉండటం చాలా అవసరం; ఎందుకంటే నీతో నాకు ఇంకా చాలా పని ఉంది. నీవు ప్రతిరోజు 15 నిమిషాలు నీ ఆరోగ్యంపట్ల ధ్యాస నిలిపితే నీ ఆరోగ్యం కుదుటపడుతుంది. అందుకు తగిన విధానాలు నీకు ఎప్పుడో తెలియజేశాను. వాటిని ఆచరించలేకపోతే **కనీసం 15 నిమిషాలు నీ సంకల్పం నిలిపి, బ్రహ్మాండం నుంచి ఆరోగ్య ప్రదాయకమైన శక్తి ప్రవేశిస్తున్నట్లుగాను, దానితో రుగ్మతలు అన్నీ తొలగిపోతూ ఆరోగ్యం వృద్ధి చెందుతున్నట్లుగాను భావించుకోవాలి.** నీవు నా సలహాను అంగీకరిస్తావనే ఆశాభావంతో ఉన్నాను. కేసర్‌లో లయ-అవస్థ (ఫనాయియత్) పెరుగుతోంది. అది చాలా మంచి విషయం. అమ్మగార్కి ప్రణామం తెలియజేయి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

అమ్మ నన్ను మంచి ఆహారం తీసుకోమని సలహా ఇచ్చింది. అది బాగానే ఉంది కాని ఇప్పటి ఆర్థిక పరిస్థితి ఎలా ఉందంటే "వస్త్రం నిడివినిబట్టి కాళ్ళు చాపుకో" లేదా "గంతకుతగ్గ బొంత" అన్నట్లు ఉంది. అయినప్పటికీ సలహా మంచిదే కాని, ఈశ్వరానుగ్రహం కలిగినపుడు నేను దానిని దృష్టిలో పెట్టుకుంటాను. నేనయితే అందరికీ మంచి భోజనం సమకూరితే సంతోషిస్తాను. ఇది ఎప్పుడు సంభవమవుతుందో తెలియదు. సంభవించాల్సి ఉంది. పాలు, నెయ్యి ప్రవహించాల్సి ఉంది కాని సమయం పట్టుంది.

## ఉత్తరం సంఖ్య - 250

లఖీంపుర్,

08.09.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది, దానికి జవాబు కూడా వ్రాశాను. అది తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. ఉత్సవంలో పాల్గొనటానికి, శెలవులు కూడా ఉన్నందువలన మేమందరం తమను మరీ మరీ ఆహ్వానిస్తున్నాం. ఆరోగ్యం అనుకూలిస్తే ఇక్కడకు విచ్చేయటానికి తప్పక శ్రమ తీసుకోండి. ఏమి చేద్దాం, ఆహ్వానించకుండా ఉండలేకపోతున్నాం. నా ఆరోగ్యం ఇంతకుపూర్వం కంటె ఇప్పుడు బాగుంది. ఏ విధంగాను విచారించాల్సిన పనిలేదు. అమ్మగార్కి షుమారు 6,7 రోజుల నుండి జలుబు, దగ్గు మరియు 100 డిగ్రీలు జ్వరం ఉంది కాని, ఈశ్వరుని కృపతో నిదానంగా ఆరోగ్యం చేకూరుతున్నది. ఇటీవల తావూజీ యొక్క నరాల వ్యవస్థ బాగాలేదు. ఇలా ఉండగా నేను అక్కడకు ఎప్పటికి రాగలనో ఆలోచించండి. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మికదశను వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇదివరకే వ్రాసినట్లుగా ఆ నిరంతర ప్రాణాహుతి ప్రవాహం అంతటా సమానంగానే ఉన్నట్లు అనిపిస్తోంది. నాకయితే ఆ స్థానం గౌరవ మర్యాదలకు అన్నింటికీ ముగింపుగాను, అక్కడ అందరూ ఎవరికివారే అన్నట్లుగాను అనిపిస్తోంది. ఇంకొక స్పష్టమైన విషయం ఏమిటంటే, 'మాలిక్' దయతో గౌరవ మర్యాదలు వంటి వాటిలో ఎటువంటి లోపమూ ఉండదుగాని, అది ఆలోచనాపరంగా ఉండదు. రాత్రి సమయాల్లో నేను కలలో నిరవధికంగా గతనాలుగు అయిదు రోజులుగా 'మాలిక్'తోనే జీవించాను. నేను 'మాలిక్'కు అతిసమీపంగా చేరువయినట్లుగాను లేదా 'అతడే' హత్తుకుపోయినట్లుగాను అనిపిస్తోంది. నా లోలోపల అప్పుడప్పుడు ఏదో సంతోషం వ్యాపించి ఉన్నట్లు అనిపించటానికి బహుశా ఇదే కారణమై ఉంటుంది. స్థితి మాత్రం పూర్తిగా శుద్ధంగా కొనసాగుతోంది. అప్పుడప్పుడు మనస్సు చాలా విప్పారి ఉన్నట్లు అనిపిస్తుంది. అదేమిటో తెలియదు కాని తల మధ్యభాగంలో తరచుగా టక్ టక్‌మను శబ్దం కలుగుతూ ఉంటుంది. ఏదో వస్తువు కొట్టుతున్నట్లు ఉంటుంది, కాని అదేమిటో నాకు తెలియదు. బహుశా పైన తెలిపిన ఆంతరిక ఆనందం మూలంగానే నా శరీరమంతా ఆంతరికంగా తృప్తిచెందినట్లు అనిపిస్తోంది. ఇటీవల, జ్ఞానం లేదా అవగాహన కూడా పూర్తిగా వికసించి శుద్ధంగా ఉన్నట్లు అనిపిస్తోంది. మనస్సు, జ్ఞానం లేక బుద్ధిని ఆవహించి ఉన్న పలుచని పొర కూడా తొలగిపోయి అవి స్వచ్ఛంగా అయిపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, "గోవిందుడు (శ్రీకృష్ణ భగవానుడు) నన్ను కొనివేశాడు" అన్నట్లు ఉంది. ఇంకా ఎలా ఉంది అంటే, ఇప్పుడు నాకు ఎవ్వరూ భక్తుడు అనిగాని, భక్తుడు కానివాడుగా గాని అనిపించటం లేదు. అదే విధంగా ఎవ్వరు కూడా నాకు సోమరిగా గాని, క్రియాశీలంగా గాని ఉన్నట్లనిపించటం లేదు. ఎవ్వరు కూడా నాకు దొంగగా గాని, బందిపోటులాగా గాని అనిపించటం లేదు. ప్రతి ఒక్కరు కూడా వారు పుట్టినప్పుడు ఎలా ఉన్నారో అలానే ఉన్నట్లు అనిపిస్తోంది. వారు ఎక్కడినుండి వచ్చారో అక్కడే ఉన్నట్లు అనిపిస్తోంది. స్థితి ఎంత సహజంగా ఉంది అంటే, ఎవ్వరి విషయంలోను ప్రత్యేకత లేనట్లు ఉంది. ప్రకృతిలో అంతా సహజత్వమే ఇమిడి ఉన్నట్లుగాను, మరిదేనిలోను

ప్రత్యేకత అనేది లేనట్లుగాను అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఏదో ఒక శక్తి ఉండి అదే ప్రకృతితో అంతా చేయిస్తున్నట్లు కనిపిస్తోంది. నాకయితే 'మాలిక్' యొక్క ఆధిపత్యమే అంతటా చెలాయించబడుతూ ఉన్నట్లుగాను లేదా ఒకే స్థానం నుంచి 'ఎవరో ఒకరు' తన ఇష్టప్రకారంగా నడపబడుతూ ఉన్నట్లుగాను ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. శెలవుల్లో తమరు తప్పకుండా వస్తారని ఆశిస్తున్నాను. అమ్మగారు తమకు శుభాశీస్సులు తెలుపుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 251

లఖీంపూర్,

04.10.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు సుఖంగా చేరి ఉంటారని ఆశిస్తున్నాను. ఈశ్వరుని దయవలన తమ శ్వాసకు సంబంధించిన ఇబ్బంది తగ్గిపోగలదని భావిస్తున్నాను. ఈ రోజు తమకు ఉత్తరం పోస్టుచేస్తూ ఉండగానే దద్దా చేరుకున్నారు. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

పుష్ప సుగంధం మెల్లమెల్లగా వ్యాపించినట్లుగానే నా అచేతనా స్థితి కూడా ఉన్నట్లు, ప్రస్తుతం కొనసాగుతూ ఉంది. ఎప్పుడైనా అచేతన స్థితి గురించి ఎవ్వరైనా మాట్లాడినప్పుడు దాని మందగతి అవగాహనకు వస్తోంది. దాని మూలంగా నా అచేతనా స్థితినుంచి కూడా స్పృహలేనిదానిగా అయిపోయాను. ఇంతకు క్రితమైతే నాకు ట్రాన్స్‌మిషన్ వస్తున్నట్లు అనుభూతి కలిగేది, నేను 'మాలిక్'తోనే సంబంధం కలిగి ఉన్నట్లు అనిపించేది కాని ఇప్పుడు ఆ విధంగా అనిపించటం లేదు. ఇప్పుడు ఎలా ఉంది అంటే, నా లోలోపలే స్వయంగా ఏదో ఉత్పన్నమవుతున్నట్లుగాను, అంతర్గతంగా ఏదో జరుగుతున్నట్లుగాను అనిపిస్తోంది, అదేమిటో నాకు తెలియకున్నది.

పూజ్య శ్రీ బాబూజీ, అలా ఎందుకో నాకు తెలియదుగాని, ఇప్పుడు స్థితి ఎలా ఉంది అంటే, నాకు 'మాలిక్' స్మరణ కలిగినంతనే, తరచుగా గుండె పట్టుకుని హాఁ అనుకుంటూ ఉండిపోతున్నాను. ఇదే స్థితి తరచుగా ఉంటున్నది. ఇంకా ఎలా ఉంటున్నది అంటే, తమరు వస్తున్నారు అంటె నాలో అదే ధ్యాస, ఆనందం కలుగుతూ ఉండేవి, కాని ఎప్పుడైతే తమరు ఇక్కడినుంచి వెళ్ళిపోతారో, అప్పుడు కూడా నా హృదయం తమవైపు ఆకర్షించబడుతూ ఉంటుంది. దాని మూలంగా నా గుండె ఇంకా దీనస్థితికి చేరుకుంటుంది. అప్పుడప్పుడు ఆ దీనస్థితిని శాంతింపజేయటానికి ప్రయత్నమైతే చేస్తాను కాని దానివలన ఆనందం కలగకపోగా ఎక్కువగా విచారమే కలుగుతోంది. ఇప్పటి స్థితి ఎటువంటిది అంటే, ఎప్పుడైతే శాంతి నా వశమవుతుందో అప్పుడు నా హృదయం శాంతిని ఉల్లంఘించి నిట్టూర్పు స్థితికి చేరుకుని, మరింక శాంతివంక చూడటానికి కూడా ఇష్టపడటం లేదు.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు ఎలా ఉంది అంటే, ఆంతరికంగా ఎక్కడ చూసినా కూడా అంతటా స్థిరత్వమే నెలకొని ఉన్నట్లు అనిపిస్తోంది. ప్రతిదీ దాని స్థానంలో స్థిరంగానే ఉన్నట్లు అనిపిస్తోంది. నా హృదయం మాత్రం రేయింబవలు నా వశంలో లేకుండా ఉంటోంది, అయితే ఇటువంటి ఈ స్థితియే నాకు ఆనందం కలిగిస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 252

లఖీంపుర్,

09.10.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. తావూజీ ఈరోజు కాన్పూరు వెళ్ళారు. బావగారు ఖార్ఖానాకు సంబంధించిన విషయాల్లో సలహా కొరకు పిలిపించుకున్నారు. ఆదివారం తిరిగివస్తారు. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ప్రస్తుతం నా స్థితి ఎలా ఉంది అంటే, నా హృదయం విలపిస్తున్నా లేదా బాధపడుతున్నా కూడా దాని దశను గురించి ఏ ఒక్కరితోనూ ఒక్క మాట కూడా చెప్పాలని నాకు అనిపించటం లేదు. చెప్పటానికి మాత్రం ఏముంది, ఉన్నది ఏదో ఉంది, హృదయం లోలోపలనే కరిగిపోతూ (తరుక్కుపోతూ) ఉంది. నేను ఎలా ఉన్నానో అలానే నా 'మాలిక్' ఎదుట ఉంటున్నాను. వెన్నెముకకు మధ్యభాగంలో ఎడమవైపున ఎల్లప్పుడూ గిలిగింత మరియు అదరటం వంటివి ఉంటున్నాయి. అప్పుడప్పుడు ఏదో ప్రాకుతున్నట్లు అనిపిస్తోంది. బాబూజీ, నాకయితే నా శరీరం యొక్క అణువణువును నేను మర్చిపోయినట్లు ఉంది. అసలు ఈ శరీరం ఏమిటో, అది ఎలా ఉందో కూడా నేను పూర్తిగా మర్చిపోయాను. ఒక్క క్షణం కూడా దాని జాడ తెలియకుండా ఉంది. ఇప్పుడైతే నా ఆంతరికమే నా శరీరం అన్నట్లుగాను, దాని నుంచే నా ఉన్నతి కలుగుతున్నట్లుగాను అనిపిస్తోంది. నా దృష్టి కూడా లోపలనే సారించబడి, దానిని కోల్పోయినట్లు ఉంటున్నది. ఈ దశయే నిరంతరం నాకు ప్రత్యక్షంగా ఉంటూ, దానితోపాటుగా బొత్తిగా 'మాలిక్' కూడా నా దృష్టికి రావటం లేదు. కాని 'అతని' ధ్యాస నుంచి నేను ఒక్క క్షణం కూడా వేరుపడి ఉండలేకపోతున్నాను. శరీరం వెనుక భాగంలో వెన్నెముకలో కొసనుంచి తల వెనుకవరకు, పొడవునా అదరటం మరియు ఏదో ప్రాకుతున్నట్లు నిరంతరం అనుభవమవుతూనే ఉన్నాయి. ఇప్పుడు, నాడీ మండలం పూర్తిగా నిటారుగా సాగదీసినట్లు తరచుగా అనిపిస్తోంది.

ఈ రోజు పూజ్య మాస్టర్ సాహెబ్ ద్వారా, జ్ఞానానికి చెందిన తమ యొక్క వ్యాసం విన్నాను. తమరు దానిలో తప్పులు ఉన్నాయా అని అడిగారు, కాని దానిలోని ప్రతిశబ్దం, విషయం క్రమానుసారంగా ఉండే విధంగా ప్రయోగించబడ్డాయని, ఎక్కడా కూడా రవ్వంతైనా తప్పులు ఉన్నాయని ఆక్షేపించటానికి అవకాశం లేదని నేను చెప్తుతున్నాను. పూజ్య శ్రీ బాబూజీ, లోకులకు నవ్వులాట పట్టించటం పరిపాటియే. కాని ఈ విషయం ఎలా ఉంది అంటె, అది జ్ఞానులను కళ్ళు తెరిపించేటట్లుగాను, వారికి నిర్మలమైన సన్మార్గం చూపించేదిగాను ఉంది. దానిని ప్రత్యేక కరపత్రంగా ముద్రింప జేయాలనేది మాస్టర్ సాహెబ్‌గారి అభిప్రాయం మరియు నా అభిప్రాయంగా ఉంది. నేను దానిలోని ప్రతి శబ్దం శ్రద్ధగా విన్న తర్వాతనే తమకు ఈ విషయం వ్రాశాను. మాస్టర్ సాహెబ్ దీపావళికి అక్కడకు వచ్చినప్పుడు, తమరు ఆ వ్యాసాన్ని పూర్తి చేయించండి, నేను అప్పుడు దానిని హిందీలోకి అనువాదం చేస్తాను.

పూజ్య శ్రీ బాబూజీ, ప్రస్తుతం నేను పూర్వం కంటె కూడా సరళమైన మైదానంలో ఉన్నాను, దానినిబట్టి సున్నితమైన దశ నడుస్తున్నట్లు అనిపిస్తోంది. ఆ దశను నేను పవిత్రమైనదిగా చెప్పలేను. ఎందుకంటే, పవిత్రత అనేది నాకు ఏదో భారమైనదిగా అనిపిస్తోంది. కనుక దానిని నేను సామాన్యత అని చెప్పగలుగుతాను. నాకయితే "బిందువులో సింధువు మిళితమై పోతున్నట్లు" అనిపిస్తోంది. ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, 'మాలిక్' యొక్క జ్ఞాపకం కలుగుతూనే గుండె పట్టుకుని కూర్చుండిపోతున్నాను. ఇప్పుడు ఈ దశ ఈ విధంగా ఉంది:

**"కాహ్ కరూం, కుచ్ బస్ నహి మేరొ, పంఖ్ నహి ఉడ్ జావూం।**
**మీరా కె ప్రభు గిరిధర్ నాగర్, బార్- బార్ బలి జావూం॥"**

అనగా "నేను నిస్సహాయురాలను, ఎగరడానికి నాకు రెక్కలు లేవు. నా ప్రభువైన గిరిధారి శ్రీకృష్ణుని ముందు సాగిలపడి మరల మరల అర్పితమైపోతాను" అని పరమ భక్తురాలు 'మీరా' చెప్పినట్లు నేను మళ్ళీ మళ్ళీ నా 'మాలిక్'కే అర్పితమైపోతాను. అంతకుమించి నాకు గత్యంతరం లేదు. నా దృష్టి, హృదయం పిచ్చెక్కిపోయాయి– 'అతని'పట్ల ప్రేమతో. ఆ పారవశ్యం దిగిపోయినప్పుడు నా వెర్రితనం నా దృష్టికి వస్తుంది. ఆ ప్రేమ మత్తులో ఎటువంటి స్థితి ఉంటుందో ఆ మత్తు వదిలాకనే తెలుస్తుంది, దానినే నేను వ్రాశాను. 'మాలిక్' ఎవ్వరికైనా ఏమైనా ఇస్తూ ఉండవచ్చును కాని నాకు మాత్రం ఒక నిట్టూర్పు, ఒక బాధ, ఒక పిచ్చి (వెర్రితనం) మాత్రమే ఇచ్చాడు. 'అతడు' ఇచ్చిన కానుక ఇదే. ఈ కానుక మీదనే ఆధారపడి నా జీవితం నడుస్తోంది. అంతుకుమించి నాకేమీ తెలియదు. అవును, 'మాలిక్' కృపతో ఏ స్థితి కలిగిందో దానిని వ్రాసాను.

అమ్మగారు తమకు శుభాశీర్వాదాలు తెలుపుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 253

లఖీంపూర్,

16.10.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి నుద్దేశించి తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. దానిలో తమ బలహీనత గురించి చదివి చాలా బాధ కలిగింది. నేను దైవాన్ని ప్రార్థిస్తున్నాను, తమ ఆరోగ్యం బాగుపడాలి అని. ఈ విధమైన బలహీనతను చూసి అప్పుడప్పుడు చాలా విచారం కలుగుతుంది. అయితే ఇందులో ఏముందో, ఏమిటో తెలియకుండా ఉంది. దీని వలన తరచుగా ఏదైనా శెలవులకు తమను ఆహ్వానించటానికి వెనుకాడాల్సి వస్తోంది. తావూజీకి జలుబు చేసింది. 'మాలిక్' దయతో కలిగినటువంటి ఆత్మిక దశను వివరిస్తున్నాను.

లోన, బయట కూడా ఒకే రకమైన స్థితి ఉంటున్నది. ఇప్పుడు ఉన్న దశ ఏ విధంగా ఉన్నదంటే, ఏదైనా విషయంలో కోపం వచ్చి ఎక్కువసేపు నిలిచి ఉన్నట్లయితే, మళ్ళీ ఆ దశ కలగనంతవరకు, భరింపశక్యం కాకుండా ఉంటోంది. అందుచేత 'మాలిక్' కృపతో ఏదైనా కలిగినప్పటికీ అది నిలవటానికి ఆస్కారం లేకుండా పోతోంది. అయితే బాబూజీ, హృదయం నా వశంలో లేకపోవటం వలన నా స్థితి ఎంత దూరంలో, ఎక్కడ ఉందో తెలియటం లేదు. అది వేరే మైదానంలో ఉండటం వలన అక్కడి నా స్థితి తెలియటం లేదు. ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, నేను ఏదైనా మంచి భవంతిలో ఒంటరిగా కూర్చున్నాగాని, లేదా అందరి స్త్రీలమధ్య కూర్చుని ఉన్నాగాని, దీవానా (ప్రేమపిచ్చి), ఫకీర్ (బైరాగి), భావన (ఆలోచన) శబ్దాలు కనీసం ఏదైనా సినిమా పాటలలో వింటున్నప్పుడుగాని, బాధతో నా మనస్సు వెనువెంటనే లోపలికిపోయి హృదయం పట్టుకుని ఒత్తుకోవాలని అనిపిస్తుంది. అయితే ఆ సందర్భంలో అశ్రువులు ఎప్పుడూ స్రవించవు. నా హృదయం పూర్తిగా వాటితో విరక్తి చెంది, ఏ లోకంలోనయితే అవిశ్రాంతంగా, దిగులుతో ఉంటుందో అక్కడికి ఎగిరిపోవాలని అనిపిస్తుంది. ఇప్పుడు నాకు ఏమీ ఇష్టం ఉండటం లేదు. ఏ దశ కూడా నాకు బాగున్నదని అనిపించటం లేదు. బాబూజీ, నాకు ఇప్పుడు ప్రపంచం కనిపించటంగాని, అనుభూతికి రావటంగాని లేదన్నట్లు నా స్థితి ఉంది. ఈ ప్రపంచపు పరిస్థితి కూడా నా కోసం ఇదే స్థితిని కలిగి ఉంటుందనుకుంటాను. ఏదైనాగాని అంతా 'అతని' అభీష్టం. పూజ్య శ్రీ బాబూజీ, ఈ శరీరం కూడా నాదా లేక ఎవరిదన్నానా అన్నట్లు నా స్థితి ఉంది. నా జన్మ వేరొక సాటిలేని ప్రపంచంలో జరిగి పోయింది. అక్కడ నేను, నా 'మాలిక్' కృప యొక్క ప్రకాశంలో జీవిస్తున్నాను, పురోగమన మార్గం కూడా పొందుతున్నాను. నేను నా 'మాలిక్'

యొక్క దృష్టిలోనే ఉంటున్నట్లు నాకు అనిపిస్తోంది. అక్కడ నిరంతరం 'అతని' కృప మరియు ప్రకాశమే ఉంటున్నాయి. ఇప్పుడు ఇంకా ఎలా ఉందంటే, అది పూర్తిగా చీకటి రాత్రియే కావచ్చు, మరేదైనా కావచ్చును కాని నాకు మాత్రం భయం కలగటం లేదు. ఎందుకంటే, నేను ఒక్క క్షణం కూడా ఒంటరిగా లేను, 'అతడే' కనిపిస్తున్నాడు కనుక ఇంక భయం ఎందుకు కలుగుతుంది!

అయితే నిన్నటి నుంచి ఎందుకో తెలియదు కాని, నేను ఎక్కువగా మగతలోనే ఉంటున్నాను. దాని మూలంగా పూర్వపు స్థితి తక్కువగా అనుభవమవుతోంది. కాని ఎప్పుడైతే దానిని నేను కావాలనుకుంటానో అప్పుడు అది నాకు ప్రత్యక్షమవుతుంది. ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, నేను స్నానం చేశానో లేదో, ఆహారం తీసుకున్నానో లేదో కూడా గుర్తించలేని మరపుస్థితిలో లేదా మగతలో ఉంటున్నాను. ఆ భగవంతునికే తెలియాలి నేను ఎంత మరపుస్థితిలో ఉన్నానంటే, నేను నిరంతరం దానిలో మునిగి ఉంటున్నాను. నేను టాయిలెట్‌కు వెళ్ళి వచ్చానా లేదా అనేది గుర్తుకువచ్చి మళ్ళీ మర్చిపోతున్నాను. నాకు స్పృహ కలిగినప్పుడు, బహుశా నాకు కలలో ఆ టాయ్‌లెట్ జ్ఞాపకం కలిగిందా అన్నట్లు అనిపిస్తుంది.

దయచేసి లక్నోలోని మాతాజీ చిరునామా వ్రాయగలరు. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ మరియు బిట్టో ప్రణామం తెలుపుతున్నారు. పూజ్య శ్రీ బాబూజీ, నేను నిజంగా 'మాలిక్'పట్ల హృదయ పూర్వకమైన ప్రేమను కలిగి ఉన్నానా? అందుకు ఏమి చేయాలి అని నా హృదయం తల్లడిల్లుతోంది. నేను నిరంతరం రోదిస్తూ చలిస్తున్నా కూడా తనివితీరడం లేదు, నన్ను ఏం చేయమంటారు?

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 254

లఖీంపూర్,

1.11.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు ఈ రోజు షాజహాన్‌పూర్ చేరి ఉంటారని అనుకుంటున్నాను. తమరు ఇంతగా మాపట్ల దయచూపినందుకు ఇది మా అందరి అదృష్టంగా భావించుకుంటున్నాము. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మికదశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా పరిస్థితి ఎలా ఉంది అంటే, 'అతని' జ్ఞాపకంతో నాకు సంబంధం లేకుండాపోయింది. ఆఖరికి 'నిరంతర స్మరణ' గురించి కూడా ఏమీ పట్టనట్లు ఉంది. 'అతని' జ్ఞాపకం కలిగినా కలగక పోయినా, నాకు 'మాలిక్'తోనేగాని, మరిదేని గురించీ లెక్కచేయనట్లు ఉంది. పూజ జరిగినా, జరగకపోయినా అంతా 'అతని' ఇష్టప్రకారమే జరుగుతుంది. పూజ్య శ్రీ బాబూజీ, గతరెండురోజుల నుంచి ఏమైపోయిందో ఏమోగాని స్థితి చెల్లాచెదరైపోయినట్లు అనిపిస్తోంది. అయితే ఈ రోజు 'మాలిక్' కృపతో కొంత సర్దుబాటు అయి బహుశా మార్పుచెందినట్లు అనిపిస్తోంది. అప్పుడప్పుడు హృదయంలో బాణం గుచ్చుకున్నట్లు జ్ఞాపకం కలుగుతోంది. బాబూజీ ఈ స్థితి ఎలా ఉంది అంటే–

**సద్గురు సాంచా సూర్‌మా, నఖ శిఖ్ మారా పూరి,**

**బాహర్ ఘావ్ న దీసయీా, భీతర్ చకనా చూర్.**

అనగా సద్గురువు ఎంతటి స్వచ్ఛమైన వీరుడు అంటే, 'అతడు' నామీద దాడిచేసి నా శరీరం మీద ఒక్క గాయం కూడా లేకుండానే ఆంతరికాన్ని అంతటినీ ముక్కలుగా చేసివేశాడు.

ఇప్పుడు రెండు మూడు రోజులనుండి, స్థితి చాలా నిర్లిప్తంగా ఉన్నట్లు అనిపిస్తోంది. అది మంచుకు ముద్దయిపోయిందా లేక వేడికి ఎండి పోయిందా అన్నట్లు ఉంది. అహం విజృంభించే అవకాశం లేదు కనుక అది పెరగలేదు. చాలా కాలంగా నిద్ర మాత్రం కలత చెందుతోంది, అదేమిటో దయచేసి తమరే గ్రహించాలి. ఇప్పుడు స్థితి ఎలా ఉంది అంటే, ఒక్క నిమిషం లేచి కూర్చున్నప్పటికి, కళ్ళు మాత్రమే కాదు, శరీరం అంతా కూడా అసలు నేను నిద్రించానా అనిగాని, నిద్ర చిహ్నాలు ఉన్నాయా అనిగాని అనిపించటం లేదు. పూజ చేయాలని కూడా అనిపించదు. ఎప్పుడైనాగాని టాయ్‌లెట్‌కు వెళ్ళినప్పుడు మాత్రం నిద్ర పూర్తిగా చైతన్యస్థితికి వస్తుంది. నాకు మగతవలన ఇబ్బంది ఏమీ కలగటం లేదు. నిద్ర అయితే అల్పంగానే ఉంటుంది. నిద్ర నుంచి కళ్ళు పూర్తిగా తెరవకముందే నిద్ర మాయమై పోతుంది. 'అతని' దయతో చింతించాల్సిన అవుసరం లేకుండా ఉంది. నా స్థితిలో ఏమైనా బాగా మాంద్యం ఉందేమో తమరు దయచేసి గమనించండి. అమ్మ, తమ ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోమని చెప్తూ తమకు ఆశీర్వాదాలు తెలియజేస్తోంది. నేడో, రేపో పూజ్య మాస్టర్ సాహెబ్, తదితరులు తిరిగివస్తారు కనుక సమాచారం తెలుస్తుంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 255

లఖీంపుర్,

9.11.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు ఆరోగ్యంగా ఉన్నారని ఆశిస్తున్నాను. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు నిలిచి ఉన్న దశ పూర్తయిపోయినట్లు అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు ఎలా అనిపిస్తున్నదంటే లేదా ఎలా ఉన్నదంటే, భక్తుని యొక్క విచారం స్వయంగా భగవంతుని యొక్క విచారం కంటే మించి పోతుందా అన్నట్లుగాను, అది భగవంతుని వశంలో కూడా ఉండదన్నట్లుగాను ఉన్నది. ఇంకా ఏమి అనిపిస్తోంది అంటే, ఎవ్వరైనా సరే తమకు కావలసిన దానిని ఈశ్వరుడి నుంచి దానిని పొందవచ్చును అన్నట్లు అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఆ శక్తి స్వయంగా కావాలనుకున్న విధంగా పనిచేస్తూ ఉంటుంది. ఇదంతా ఏమిటో తమరికే తెలియాలి. 'మాలిక్' దయతో ఉన్న స్థితి ఎటువంటిదంటే, నిజంగా నాకు ఒక్క 'మాలిక్' తప్ప, ఏదీ కూడా లెక్కలేదన్నట్లు ఉంది.

**బాబూజీ, ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, 'మాలిక్' నాలోనే మునిగిపోయినట్లుగాను, నేను 'అతని'ని వెదకిపట్టుకునే ప్రయత్నంలో మునకలు వేస్తున్నట్లుగాను అనిపిస్తోంది.** 'అతని'కి ఒక్కొక్కప్పుడు అతిసమీపంగాను, మరొకప్పుడు దూరంగాను ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. బాబూజీ, దీని వలన నాకు పూర్తిగా విశ్రాంతి లేకుండాపోయింది. నేను ఆంతరికంగానే మునిగి ఉంటున్నాను కాని, బయటపడటానికి నాకు సమయమే లేకపోగా ఆ ఆలోచన కూడా రావటం లేదు, బయట ఏమి ఉంటుంది కనుక. వాస్తవం ఏమిటంటే, నాకు మాత్రం ఆంతరికమే నాదన్నట్లు ఉంది. లేదు, లేదు, ఇప్పుడు ఆ ఆంతరికం కూడా దాదాపు సమాప్తమైపోయి ఒక మైదానంలాగా అయిపోయినట్లు ఉంది. నేను 'అతని' కోసం పరుగుతీస్తున్నట్లుగాను, నా దృష్టి 'అతని' నుంచి ఒక్క క్షణం కూడా వెనక్కి మరలనట్లుగాను, కనీసం రెప్పపాటు కూడా లేనట్లుగాను అనిపిస్తోంది. ఇంకా ఎలా ఉంది అంటే, 'అతని' వెదుకులాటలో నేను స్వయంగా ఓడిపోతున్నాను, ఆ తర్వాత ఏమవుతుందో ఏమో. ఇప్పుడు పందెం మొదలైంది. అయితే నేను ఓటమిని చవిచూడటంగాని, ఆశక్తురాలనవ్వటంగాని, నేను కలలో కూడా ఎన్నడూ చూసి ఉండలేదు. ఇది 'మాలిక్' దయతో మాత్రమే సాధ్యపడింది. నా దృష్టిలో ఓటమి అంటే మరేమీ కాదు, అది స్వయంగా వ్యక్తి

యొక్క బలహీనతనే ఈ పేరుతో పిలుస్తారు. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు ఈ మైదానం ఎంత మృదువుగాను, పరిశుద్ధంగాను ఉన్నది అంటే దానిని వర్ణించటం నాకు దుర్లభంగా ఉంది.

తమ ఉత్తరంలోని సంగతులు ఈ రోజు మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా విన్నాను. లేఖ చివరలో తమరు తమ దివ్య స్థితిని గూర్చి వ్రాసిన విషయంతో నా హృదయం ఎంతగానో పరవశించింది. వాస్తవానికి 'మాలిక్' కృపతో నా 'మాలిక్' గురించినదే నాకు కనిపించటమేగాక నా అనుభవానికి వస్తున్నది. అంతేగాదు 'అతడే' నాకు సాక్షాత్కరిస్తున్నాడు.

నిన్నటి నుంచి తావూజీ వ్రత మాచరిస్తున్నట్లు అమ్మ తెలియజేస్తూ ఉంది. 'మాలిక్' అభీష్టం ఎలా ఉందో ఆ 'మాలిక్'కే తెలియాలి.

తమరు నా యొక్క స్థితి నిలిచి ఉన్నది అని చెప్పినట్లుగానే నేను కూడా అలాగే అనుభూతి చెందుతున్నాను, కాని అది నా వశంలో లేదన్నట్లు అనిపిస్తోంది. 'తమ' లాంటి వారిని నాకు 'నిధి'గా సమకూర్చినందుకు శ్రీ సమర్థ సద్గురువుకు నేను మరొక్కసారి కృతజ్ఞతలు అర్పించుకుంటున్నాను. 'మాలిక్' కృప మరియు పెద్దల ఆశీస్సులు కనుక నాకు ఎల్లప్పుడూ ఇదే విధంగా ఉన్నట్లయితే 'అతడి' నిధినే నేను పొంది ఉంటాను. పూజ్య శ్రీ బాబూజీ, శ్రమ అయితే శిక్షణ నిచ్చేవానికే చెంది ఉంటుంది. అదేమిటో, 'అతని'కే తెలుసునుగాని 'అతని' మూలంగా శిక్షణ పొందేవానికి మాత్రం ఆ వాస్తవిక జీవితం యొక్క ఆనందం సమకూరుతుంది. తమరు చూపుతున్న దయకు ధన్యవాదాలర్పిస్తున్నాను, అంతకుమించి ఇంకేమి చెప్పగలను. 'గీత'ను గురించిన వ్యాసం మహోన్నతంగా ఉంది, దాని గురించి విశ్లేషించటం తమవంటి వారికే చెల్లుబాటవుతుంది. ఎందుకో తెలియదు కాని, అప్పుడప్పుడు నాలో ఏదో భారంగా ఉన్నట్లనిపిస్తుంది. అది అంతగా బాధాకరమైనది కాదు, గతంలో అనుభవానికి వచ్చిన భారంలాగా కూడా అనిపించటం లేదు. అమ్మ తమకు శుభాశీస్సులు, కేసర్ ప్రణామం తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 256

షాజహాన్‌పూర్,
11.11.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

కుశలమగుగాక! నీ ఉత్తరాలన్నీ చేరాయి. నీ స్థితిని బాగా పరిశీలించాను. **దివ్యమార్గంలో మన అనుభవానికి వచ్చే విషయాలు అన్నీ మన మంచి కొరకే. దారిలో ఏవైనా అడ్డంకులు / అవరోధాలు ఉన్నట్లయితే, మాలిక్ (దైవం) వాటిని తొలగించటం కోసం తన దృష్టిని మనపై నిలపాల్సి ఉంటుందన్న మాట. ఈ విధంగా దైవం దృష్టిలో మనం ఉన్నామంటే అంతకంటే మనకు కావల్సింది ఏమి ఉంటుంది? ఈ పూజలు, ధ్యానం అన్నీ దైవం దృష్టి ఏదో విధంగా మనవైపు మరల్చబడటానికే అని అర్థం చేసుకోవాలి. దైవాన్వేషణలో మనకు గడ్డుపరిస్థితులు ఏర్పడినపుడు మాత్రమే దైవదృష్టి మన మీదకు మరల్తుంది. సూరదాసు అంధుడైన కారణంగా, శ్రీకృష్ణునిపట్ల ప్రేమతో తారట్లాడుతూ తన చేతికర్రతో నూతిని గుర్తించలేక దానిలో పడిపోయాడు. ఆఖరికి శ్రీకృష్ణుడు తన చేయూతతో అతడిని బయటకు చేర్చాడు. శ్రీకృష్ణుని ఆపన్నహస్తం అతని శరీరాన్ని తాకడం ఎంత మహద్భాగ్యమో కదా! అంతేకాదు, బావిలో పడటం మూలంగా అతని పవిత్రత ఇంకా మెరుగైంది కూడా.** దైవం తలిస్తే ఈ ఉత్తరం నీ చేతికి అందుతూనే నీ స్థితి మారుతుంది. ఇప్పుడు రాత్రి 10.55కి నీలో కొంత మార్పు కలిగి ఉండాలి. ఇప్పుడు నీ ప్రయాణం 'H' పాయింట్‌వద్దకు సాగుతుంది.

అమ్మగార్కి వందనం.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 257

లఖీంపుర్,
14.11.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్ననే చేరింది. దానిని చదివి చాలా ఆనందించాను. నేను 'తమ' దయ, కృప కొరకే నిరీక్షిస్తున్నాను. అంతేకాదు, ఆ 'మాలిక్'కే చెందిపోవటానికి పిచ్చిదానిలాగ అయిపోవటానికి ప్రయత్నిస్తున్నాను, ఆ తర్వాత ఏమవుతుందో 'మాలిక్'కే తెలియాలి. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు రెండు రోజుల నుంచి దశలో మార్పు కలుగుతున్నట్లు అనిపిస్తోంది. ఈ దశలో ఎలా ఉంది అంటే, హృదయం, మనస్సు, ఇంద్రియాలు మొదలైన వాటిలో ఒక విధమైన అచైతన్యం ఆవహించినట్లు అనిపిస్తోంది, అయితే అది ఉదాసీనత స్థితి వంటిది మాత్రం కాదు. అన్నివైపుల నుంచి, అన్ని విధాలైన అభిరుచులు, సంతృప్తులు కూడా హృదయం మరియు మనస్సు నుంచి తొలగిపోయినట్లు అనిపిస్తోంది. అయితే ఉదాసీన స్థితి కూడా అనుభవానికి రావటం లేదు. అదేమిటో దైవానికే తెలియాలి. ఇప్పుడు తపన యొక్క తీవ్రత లేకుండా పోయింది. నేను ఇదివరలో తమకు వ్రాసినట్లు 'మాలిక్' నాలో మాయమైపోవటం వంటిదిగాని, నేను 'అతని' అన్వేషణలో పరుగుపెట్టున్నట్లు ఉందనిగాని, ఇప్పుడు అనిపించటం లేదు. బహుశా ఇప్పుడు అలా ఉరకలేయటం కూడా తగ్గిందనుకుంటాను, అయితే, 'అతడు' ఇప్పుడు ఇంకా ఎక్కువగా నావాడైపోయాడు లేక నేను 'అతని'లో ఇంకా ఎక్కువగా కరిగిపోయాను. పూజ్య శ్రీ బాబూజీ, ఇంకా చెప్పాలంటే, 'అతని' దర్శనం లేకుండా నేను ఒక క్షణమైనా ఉండలేను. బాబూజీ, ఇంకా ఏమిటంటే, **ఈ స్థితిలో ప్రతిచోట, ప్రతిసారీ నేను 'అతడి'నే దర్శించుకుంటు న్నాను. ఎందుకంటే, దర్శించతగినవాడు, వందన మాచరించదగినవాడు 'అతడే' కనుక. ఈ స్థితి ఎలా ఉందంటే, అడుగడుగునా పుణ్యక్షేత్రమే, ప్రతి పనీ సేవాపరమే అన్నట్లు ఉంది.** అయితే ఇప్పుడు మాత్రం తీర్థయాత్ర గురించిగాని, సేవ గురించిగాని, వందనం చేయాలనిగాని ఎటువంటి భావం లేకుండా పోవటమే కాకుండా, వాటి అవసరం కూడా లేదనిపిస్తోంది. ఇప్పుడు 'అతడు' నా హృదయానికి హత్తుకుపోయి ఉంటున్నాడు లేదా నేను 'అతని'లో లయమైపోతూ ఉన్నాను. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడైతే తపన యొక్క తీవ్రతలో పరిశుద్ధత కనిపించటం లేదు. అలా లయమైపోవటంలోనే ఆనందానుభూతి కలుగుతోంది. బాబూజీ, అదంతా ఆ 'మాలిక్'కే తెలియాలి, నాకయితే ఈ స్థితి గురించి చెప్పాలనిగాని, వ్రాయాలనిగాని అనిపించటం లేదు. తరచుగా నా మదిలో రేయింబవళ్ళు ఆలోచనలు అధికంగా ఎందుకు వస్తున్నాయో తెలియకుండా ఉంది. దాని మూలంగా మెదడు కూడా అలసిపోతోంది. అయితే హృదయం 'మాలిక్' కృపతో ఏమీ పట్టనట్లు ఉంటోంది. ఈ దశ ఏమిటో, ఎటువంటిదో నాకయితే తెలియదు. అది తమకే తెలిసి ఉంటుంది.

అమ్మగారు తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 258

లఖీంపుర్,
20.11.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందని ఆశిస్తున్నాను. తమ ఆరోగ్యం ఎలా ఉంది? ఆహారంతోపాటు ఏదైనా శక్తిదాయకమైన పదార్థాలుగాని, పానీయాలుగాని అందుబాటులో ఉంచుకుని సేవించమని అమ్మగారు చెబుతున్నారు. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మికదశను వ్రాస్తున్నాను. ఇంతకుపూర్వం నేను –"ప్రతిచోట, ప్రతి సమయంలోను నేను దర్శనంలోనే నిమగ్నమై ఉంటున్నాను" అని వ్రాశాను. దాని అర్థం నేను 'అతడి'నే చూస్తూ ఉండిపోయాను అని కాదు కాని, ఒక విధమైన అత్యంత తేలిక దశ, నేను నాలోను, సర్వత్రాను వ్యాపించి ఉండటం గమనిస్తున్నాను. ఇప్పుడు ఏమైందో నాకు తెలియదు; బిందువుగాని, సింధువుగాని, మైదానంగాని ఏమీ లేకుండా పోయాయి. ఇప్పుడు అన్ని దిక్కులా పొగమంచు వంటిది ముసురుకుని ఉన్నట్లుగానే అనిపిస్తోంది. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి. నాకయితే, 'మాలిక్' మాత్రమే ఉన్నాడు. 'అతడు' చాలా ఉత్తముడు. బాబూజీ, అలా ఎందుకంటే 'అతడు' అంటే 'అతడే'. ఎలా అంటే,

**"దృపద్–సుతా నిర్బల్ భయీ తా దిన్, ఆయే తజి నిజ ధామ్।**
**దుఃశాసన్ కీ భుజా థకిత్ భాయీ, వసన్ రూప్ భయె శ్యామ్॥"**

అనగా దృపదమహారాజు పుత్రిక ద్రౌపది, కౌరవ సభలో నిస్సహాయరాలుగా అయిపోయినప్పుడు, ఆమె మాన సంరక్షణకోసం శ్రీకృష్ణుడు తన నివాసం వదలివచ్చాడు. ఆమె దుస్తుల రూపంలో ఉన్న శ్రీకృష్ణుని గుంజటంలో దుశ్శాసనుని చేతులు అలసిపోయాయి.

అయితే నా కొరకు, ఆధ్యాత్మికత కొరకు అయితే ఇది దానికంటే ఇంకా మంచి సమయం. కాని బాబూజీ, నాలో అటువంటి (ద్రౌపదికి ఉన్న) ఆక్రందన జనించటం లేదు. ఈ హృదయం ప్రేమవశంతో పగిలి ముక్కచెక్కలు కావటం లేదు. ఇప్పుడు ఎలా ఉందంటే, నా కోరికతో స్వయంగా నాలో నేను మోసపోతున్నాను, ఏమని అంటే నేను అసలు ఇటువైపే (అనగా 'మాలిక్'లోనే) ఉన్నానా లేదా అని. నేను ఎక్కువగా ప్రాపంచిక దృష్టి లేకుండా ఉన్నందుకు నాకు ఆశ్చర్యం కలుగుతోంది. అయితే సత్సంగ్ జరిగినప్పుడు మాత్రం, 'మాలిక్' కృపతో 'అతని'పట్ల అభిరుచి కలిగి ఉన్నట్లు ఖచ్చితంగా తెలుస్తుంది. అయితే ఆ తర్వాత మళ్ళీ మామూలైపోతోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఇటీవల ఈ స్థితులనుబట్టి నేను 'మాలిక్'కు దూరంగా ఉన్నానేమోనని అనిపిస్తుంది. అందుకు కారణం ఏమిటో తెలియటం లేదు. పూజ్య శ్రీ బాబూజీ, ప్రస్తుతం నా నిజమైన స్థితి ఎలా ఉందంటే, నాలో భక్తిశ్రద్ధలు, విశ్వాసం, ప్రేమ ఏమీ లేనట్లు అనిపిస్తోంది. బహుశా నేను ప్రాపంచిక దృష్టితో ఉంటున్నానేమో! **నిజం చెప్పాలంటే, పైన చెప్పినవేమీ నాలో లేవు. అయితే నా దృష్టి మాత్రం వెర్రిగా 'అతని'వైపే ఉంది.** నేను అశక్తురాలను, అజ్ఞానురాలను. ఆ 'మాలిక్'యే ఈ దీనురాలిని ఆదుకోవాలి. ఆ పాయింట్ యొక్క యాత్ర ఇంకా ప్రారంభం కాలేదు. పూజ్య శ్రీ బాబూజీ, ఆ స్థితి నిలకడగా ఉన్నప్పుడు కొంతసేపు దృష్టి తమవైపు నిలపాలని ఉంటున్నప్పటికీ, వెంటనే ఆ దృష్టి ఎక్కడ ఉన్నదో అక్కడ, ఎలా ఉందో అలా ఉండిపోతోంది. కాని 'మాలిక్' మాత్రం, ఒక్క పెట్టున ఉన్నతి కలిగించారు. అదేమిటో, ఆ దైవానికే తెలియాలి. అమ్మగారు తమకు ఆశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టో ప్రణామాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 259

షాజహాన్‌పూర్,

23.11.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు అన్నీ అందాయి. నేను ఈ మధ్య ఒకటి రెండు పనుల్లో బాగా ఇరుక్కుపోయాను. అందువలన నీకు అధిక సమయం కేటాయించలేకపోయాను. ఇంకా ఎనిమిది రోజులు వేరే పనిలో నిమగ్నమై ఉంటాను. దైవానుగ్రహంతో నీకు ఈ ఉత్తరం చేరేసరికి 'H' పాయింట్‌కు నీ యాత్ర ప్రారంభమై ఉంటుంది. "ఇప్పుడు మైదానం, బిందువు, సింధువు ఏవీ లేవు" అని నీవు వ్రాశావు. ఇది చాలా మంచి స్థితి. దీని అర్థం ఏమిటంటే, నీ **లయ-అవస్థ ప్రభావం మూలంగా ఆ బిందువు, సింధువు, మైదానం వంటివి తమ హద్దుల్ని నిన్ను తాకనివ్వలేకపోతున్నాయి.** అనగా నీ ఆలోచనా పరిధి నుంచి అవి తొలగిపోయాయి. అంటే వాటితో సంబంధం లేకుండా పోయింది, విముక్తి కలిగింది. ఇంకా చెప్పాలంటే, ఇప్పుడు నీ దృష్టిలో / ఆలోచనలో ఇవి లేకపోయిన కారణంగా నీవు ఇంకా తేలికయ్యావు. నీ ఉత్తరానికి సంబంధించి విశేషమైన సమాధానం ఏమిటంటే, **అభ్యాసీ యొక్క స్థితి ఈ విధంగా ఉండాలి అని చెప్పటమే. అనగా వాతావరణ పరిస్థితులు, ఋతువుల ప్రభావం అన్నింటికీ అతీతంగా ఉండటమే. తుమ్మచెట్టు అన్ని కాలాల్లో ఎలా ఉంటుందో అందుకు తార్కాణంగా అభ్యాసీ ఉండాలి.**

అమ్మకు ప్రణామం.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 260

లఖీంపుర్,

23.11.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరంలోని సంగతులు నేడు విని, 'మాలిక్' ప్రేమ పొందటం కోసం హృదయం తల్లడిల్లింది. శ్రీ బాబూజీ, అయితే నేను 'అతని'లో (మాలిక్‌లో) లయమై పోగలనా! ఎంతగానైతే అంతగా నేను 'అతడి' కోసం మరణించగలనా! **వాస్తవం ఏమిటంటే, నేను 'అతడి'ని ప్రేమించటం కంటే అధికంగా 'అతని' కొరకు మరణించాలని అనుకుంటున్నాను.** 'మాలిక్' కృపతో ఈ దీనురాలు సఫలీకృతం కాగలదని నాకు ధృడ విశ్వాసం ఉంది. "అభ్యాసీ నాతో ఎటువంటి అద్భుతం అయినా సాధింపచేయగలడు" అని తమరు వ్రాశారు. ప్రతిక్షణం అలా జరుగుతుందని, జరుగుతూ ఉన్నదని నేను కూడా చెబుతున్నాను. తమరు నా కొరకు, మాస్టర్ సాహెబ్ కొరకు ఏదైతే వ్రాశారో అది సరైన చిట్కానే! నేను ఏమి చెప్పినప్పటికి అది పొగడబడకూడదు. పూజ్య శ్రీ బాబూజీ, అయితే ఆ స్థితి అటువంటిదైనప్పుడు అనగా కుడి చెయ్యి ఎడమచెయ్యికి తెలియకుండా ఉంటున్నట్లు, ఇంకొక రకంగా చెప్పాలంటే, ఒక పొగడ్త పొగడ్తగా అనిపించినప్పుడు, మృదువైన (నునుపైన) మట్టికుండ మీద ఏదీ నిలవనట్లుగానే, ఎవ్వరు ఏది చెప్పినా అది చెప్పవచ్చు. అది "మురళిని కీర్తించుదునా! లేక మురళీధరుని (శ్రీకృష్ణుడు) గానాన్ని కీర్తించుదునా!" అన్నట్లు ఉంటుంది. ఇలా ఉండగా, 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

'ఆత్మ సమర్పణ' అనే దానిని నేను మర్చిపోయాను. ఎందుకోగాని, అది దైవానికే తెలియాలి. అది ఎలా చేయాలో జ్ఞాపకం రావటం లేదు. నాకు 'అతడు' తప్ప మరేదీ రుచించటం లేదు. నా స్థితి ఎలా ఉంది అంటే, నాలో

ఏదైనా లోటుపాటుగాని, దోషంగాని ఉన్నట్లు తోచినట్లయితే, వాటిని గురించి ఆలోచించటమే కష్టమనిపించగా, మరి వాటిని నివారించే ప్రయత్నం ఏముంటుంది? హృదయానికి కావాల్సింది 'మాలిక్' మాత్రమే కనుక అది 'అతని' కోసం తల్లడిల్లుతోంది. అంతేగాకుండా, ఏదైనా పుస్తకంగాని, వార్తాపత్రికగాని చేతిలోకి తీసుకున్నప్పుడు వాటిలోని అక్షరాలు చూడకుండా దేనివంక చూస్తున్నానో, ఏమి ఆలోచిస్తున్నానో కూడా తెలియటం లేదు. నా స్థితి ఎలా ఉంది అంటే, నాకు ఎవ్వరి గురించైన సరే మంచిగాని, చెడుగాని తెలియడం లేదు. అయినా కూడా దశ ఇంకా పూర్ణరూపం దాల్చలేదని పిస్తోంది. ఎందుకంటే, పురోగమనం ఇంకా వేగం పుంజుకోలేదు కనుక. ఆత్మ గురించిగాని, పరమాత్ముని గురించిగాని ఎన్నడూ తెలియనట్లు, ఈశ్వరుడుగాని, పూజగాని, అలాగే విశ్వాసం, ప్రేమగాని ఎన్నడూ నా దరికి జేరనట్లు ఉన్న అమాయక స్థితి నాదిగా అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పటి నా స్థితి అమాయకత్వంతో కూడుకుని, వినడానికి కూడా తగనిదిగా ఉన్నప్పటికీ కూడా నేను 'మాలిక్'ను పరిపూర్ణంగా పొంది తీరతాను అని చెప్పగలను. నేను ఎక్కువగా బాల్యస్థితిలో ఉన్నట్లుగానే అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఈ స్థితి ఎటువంటిదో ఏమోకాని, 'మాలిక్'ను అధికంగా ప్రేమిస్తున్న వారి నెవ్వరినైనా చూసినప్పటికీ, వారు ఎవ్వరైనా సరే, నేను ఎవ్వరినో, ఎలా ఉన్నానో అతడు కూడా అలాగే ఉన్నట్లు అనిపిస్తోంది. అదేమిటోగాని, అతని (అభ్యాసీ) యొక్క జ్ఞాపకం తరచుగా నా జ్ఞాపకంలాగానే ఉంటోంది. ఎక్కడా అడ్డుతెరలు అనేవి లేకుండా, అందరూ ఒకే విధంగా, ఒకే రకంగా ఉన్నట్లు నాకు స్పష్టంగా అనిపిస్తోంది. ఇప్పుడు ఈ స్థితి ఎలా ఉంది అంటే, నా ప్రియుని రూపం హృదయమనే అద్దంలో ఉంది. మెడను కొంచెం వంచినపుడు నేను అతడ్ని చూస్తాను. ఇప్పుడింక మెడ వంచి చూడాల్సిన అవుసరం కూడా లేదు. అయినప్పటికీ నా దశ నేను పైన వ్రాసినట్లు అమాయకంగాను, అసహనీయంగాను ఉంది. కనుక తమరే దయతో దానిని సరిచేయండి.

అమ్మగారు తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు. 'తమరు' నా దశను చూసే ఉంటారు కనుక, నేనేమి చేయాలో తెలియజేయండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 261

లఖీంపుర్,

26.11.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం మరియు కేసర్ వ్రాసిన ఉత్తరాలు తమకు చేరి ఉంటాయని భావిస్తున్నాను. ఇక్కడంతా కుశలమే. అక్కడ తమరు కూడా ఆరోగ్యంగానే ఉన్నారని తలుస్తున్నాను. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ముందుగా నేను నిన్న రాత్రి కాంచిన కలను గురించి వ్రాస్తున్నాను. అది ఏమిటంటే, నేను కారులో చాలా వేగంగా కీకారణ్యాల గుండా ప్రయాణిస్తున్నాను. బహుశా అక్కడ మాస్టర్ సాహెబ్‌గారి ఇల్లు ఉందనుకుంటాను. అక్కడ నుండి తమరు, మాస్టర్ సాహెబ్ మరియు నేను కారులో ఎక్కడికో వెళ్ళాము. కాని మాస్టర్ సాహెబ్ ఎక్కడకు వెళ్ళారో తెలియదు. ఆ కారడవిలో కూడా సూర్యకాంతిలాగానే చాలా వెలుగుగా ఉంది. ఆ తర్వాత నేను ఒంటరిగా ఉండగా, నా ముందు వస్త్రాలతో చుట్టబడిన ఒక చిన్న ఆకారం వంటిది నా ముందు పడి ఉన్నట్లు చూసాను. నేను దానిని లేవనెత్తగా, దాని ఆకారం తమదిలాగానే అయిపోయింది. అది సచేతనమై, దానిలో ప్రాణం పోసుకొనసాగింది.

ఆ విధంగా జరుగుతూనే ఒకటి రెండు సెకన్లలో అది 'తమ' యొక్క చిన్న రూపంగా అయిపోయింది. ఆ విధంగా అయిపోతూనే నా శిరస్సు మీద ప్రేమతో చేతితో నిమిరి, తర్వాత హృదయం మీద నిమిరింది. అప్పుడింక చూద్దును గదా, అన్ని వైపులా జలం నిండుగా ఉంది, నేను మాత్రం 'తమ'వద్ద నిలబడి ఉన్నాను. అప్పుడు తమరు ఏమన్నారంటే, "నీ శరీరం కనుక బాగుపడినట్లయితే వేగంగా పురోగమిస్తావు అని నీవు అంటున్నావు కనుక, ఇప్పుడు ఈ నీటిలో పూర్తిగా మునిగిపో" అన్నారు. అలాగే అని చెప్పి, నేను 'మాలిక్' కృపతో, ఆ నీటివద్ద నిలిచి, నలుదిశలా వ్యాపించి ఉన్న ఆ అపార జలరాశిలో కరిగిపోయాను, అదేమిటో ఆ దైవానికే తెలియాలి. నేను ఆ జలంలో పూర్తిగా కరిగిపోయానా లేదా అని తెలుసుకోవటానికి ప్రయత్నించినట్లు నాకు బాగా జ్ఞాపకం ఉంది. అప్పుడు ఆ నీటి అంతటిలోను, దాని అణువణువులోను నేను నిజంగా ఉన్నట్లు అనిపించింది.

బాబూజీ, ఇప్పుడు ఎలా అనిపిస్తోంది అంటే, నా ఆలోచన ఎల్లప్పుడు 'అతని' ఆలోచనలోనే నిమగ్నమై ఉన్నట్లు ఉంది. ఎందుకంటే, 'అతని' ఆలోచన అంటూ కలుగుతూనే 'అతని' (మాలిక్) ఆలోచనలోనే నన్ను నేను పొందగలుగుతున్నాను; అనగా 'అతని' దృష్టి, ఆలోచన నావైపు ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. ఇంకా ఎలా అంటే, అతడే లేదా అతడి ఆలోచనయే నా ఇల్లుగా అయిపోయింది అన్నట్లు ఉంది. ఇప్పుడు ఎలా ఉంది అంటే, 'తమ' యొక్క దృష్టి లేదా 'తమరు' అనుక్షణం, ప్రతిచోట మరియు సమస్త బ్రహ్మాండంలోను వ్యాపించి ఉన్నట్లుగాను, ప్రత్యక్ష మవుతున్నట్లుగాను, అందులోనే నేను మిళితమైపోయి, సర్వత్రా నేను ఉన్నట్లుగాను నా దృష్టికి గోచరిస్తోంది. ప్రస్తుతం నా దశ ఈ విధంగా ఉండగా, నేను 'మాలిక్'ను దృష్టిలో పెట్టుకోవాలని అనుకుంటూ ఉంటే, 'అతని'లోనే నేను ఉన్నట్లు తలపిస్తోంది.

అదేమిటో తెలియదుకాని, ఎల్లప్పుడూ, ప్రతిచోటా నాకు బదులుగా చాలా తేలికైనది, సూక్ష్మమైనది అయిన ఛాయ (నీడ) కనిపిస్తోంది. నేను దానిని దీక్షగా చూస్తున్నట్లయితే, తమ యొక్క స్వరూపంగా నాకు దర్శనమవుతున్నది. శ్రీ బాబూజీ, ఇప్పుడు నా హృదయ పరిధి అతిక్రమించి పోయిందని అనిపిస్తోంది. అన్ని దిశల్లోను నా హృదయమే వ్యాపించి ఉన్నట్లుగా ఉండి, అది ఎంత తేలికగా ఉందో చెప్పనలవి కాదు. ఏమైతే జరుగుతూ ఉందో దానిలోనే జరుగుతున్నట్లుగాను, బ్రహ్మాండం సమస్తం దానిలోనే ఇమిడి ఉన్నట్లుగాను అనిపిస్తోంది. స్వర్గ నరకాలు, ముల్లోకాలు వగైరా అన్నీ ఈ హృదయంలోనే ఇమిడి ఉన్నట్లు అనిపిస్తోంది. అంతేగాకుండా, అన్నీ కూడా దాని ఆధీనంలో ఉండిపోయాయి అని అనిపిస్తోంది. సమస్త అగ్ని, పృథ్వి, వాయువు మరియు నీరు వగైరాలు కూడా ఈ హృదయంలోనే ఇమిడి ఉన్నట్లు తలపిస్తోంది. ఇవన్నీ దాని ఆధీనమైపోయినట్లు కనిపిస్తోంది. ఇది ఇలా ఉంటే, నేను ఎక్కడికి వెళ్ళిపోయానో, నా జాడ ఏమిటో తెలియకుండా ఉంది. అయితే 'మాలిక్' దృష్టి ఏదైతే నావైపుగా ఉందో నా జాడ అందులోనే ఉన్నట్లు అనిపిస్తోంది. **ఇప్పుడు నా స్థితి ఏమిటంటే, బ్రహ్మాండం, విశ్వం, చరాచర జగత్తు సమస్తం నా హృదయంలోనే ఉన్నట్లు అనిపిస్తోంది. అన్నీ నాలో ఉన్నట్లుగానే నేనూ అన్నింటిలోను ఉన్నాను.** అయితే బాబూజీ, వీటన్నింటినీ అలా ఉంచి ఇంకా ఉన్నతంగా నా 'మాలిక్' యొక్క జగత్తు మరేదో ఉన్నట్లుగాను, అది సర్వదా నన్ను వెన్నంటి ఉన్నట్లుగాను, నేను 'అతని' (మాలిక్) దృష్టిలో ఉన్నట్లుగాను అనిపిస్తోంది. శ్రీ బాబూజీ, 'తమరు' సమస్త జగత్తుకు 'మాలిక్' అయి ఉన్నారు, ఇది ప్రతి ఒక్కరికీ అనుభవమవుతోంది. ఇదంతా 'అతని' సృష్టియేనని, 'తన'పై ఉన్న ప్రేమలాగానే సమస్త జడ చేతనములపట్ల కూడా అలాంటి ప్రేమయే ఉన్నట్లు అనిపిస్తోంది. అయితే ఇంకా ఏమిటంటే, అలా ఎందుకో నాకు తెలియదుగాని, 'అతడు' తనకు తాను 'మాలిక్' అని అనుకోకుండా అందరికంటె అల్పమైనవానిగా భావిస్తున్నాడు అని అనుభవమవుతోంది. 'మాలిక్' కృపతో ఈ అద్భుత దృశ్యాన్ని తిలకిస్తున్నాను. ఇప్పుడు స్వప్నంలో కూడా, నాలో చేతనావస్థ వంటి దానిని పొందుతూ ఉన్నాను.

పూజ్య శ్రీ బాబూజీ! తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఇప్పుడే చేతికందగా దానిని చదివి చాలా ఆనందించాను. 'తమరు' పని వత్తిడిలో ఉండటం వలన నాకు అధికంగా సమయం కేటాయించ లేకపోతున్నట్లు 'తమరు' వ్రాశారు. మరి నేనయితే ఏమంటాను అంటే, 'తమరి' సమయం నాదే, నేను సాధ్యపడినంతవరకు దానిని తీసుకుంటూనే ఉంటాను. తమరు ఏదైనా చెప్పండి, కాని నేను అలా భావించలేను. ఎందుకంటే, 'మాలిక్' యొక్క కృప నాకు ఆ విధంగా చెప్పాల్సిన అవకాశమే కల్పించలేదు. **అభ్యాసీ యొక్క దశ, ఏ ఋతువులోను మార్పు చెందకుండా అన్ని ఋతువుల్లోను ఒకే విధంగా, పచ్చగా ఉండే తుమ్మ చెట్టులాగా ఉండాలి అని చెప్పినట్లుగానే 'మాలిక్' కృప కూడా అదే విధంగా ఉంటుందని భావిస్తాను.** అందులో సందేహం లేదు. నేను తరచుగా చాలా ఎక్కువగా 'మాలిక్' దయతో ఈ దశను పొందుతున్నాను. ఎందుకంటే, ఇంకా ఎక్కువగా అనుభూతి చెందటానికి ఇంకా ఎక్కువ సమయం కావలసి ఉంటుంది. నాలో దాని కొరకు ఏ కోరిక లేనపుడు ఇంకా ఆధ్యాత్మికత గురించి ఏమి వ్రాయాలి. 'మాలిక్' సంకల్పం చేసినట్లయితే పైన చెప్పిన దశ కూడా కలగవచ్చు. నాకేమి తెలుస్తుంది. 'తమరి' దయతో రెండు మూడు రోజులనుండి ఈ స్థితి బాగా అనుభవమైంది. పూజ్య బాబూజీ, అప్పుడప్పుడు ఒకటి, రెండు రోజులు, ఏ దశ కలుగుతుంది అంటే, నాకు తెలియకుండానే మనస్సు ఏదో మాట్లాడుతున్నట్లు ఉంటుంది. దానిని నేను ఏమి అనుకుంటున్నాను అంటే, అది మాట్లాడేది తమరితోనే అని. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. పూలోం జిజ్జీ జాడ మాకు తెలిసినట్లయితే దానిని 'తమకు' తెలియజేస్తామని చెబుతున్నారు.

ఇప్పుడు ఉన్న దశ ఎలా ఉంది అంటే, నా సంబంధం ఆత్మిక దశలతో కూడా బంధం త్రెంచుకున్నట్లుగాను, గుణ అవగుణాలతోను సంబంధం లేకపోయినట్లుగాను అనిపిస్తోంది. పూర్తిగా స్వతంత్రురాలనై పోయినట్లు అనిపిస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ.

## ఉత్తరం సంఖ్య – 262

షాజహాన్‌పూర్,

30.11.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం 23.11.1952వ తేదీగలది చేరింది. మానవునిలో అహం నిలిచి ఉన్నంతవరకు తనను గురించిన పొగడ్తలతో పొంగిపోవటం, ఎవ్వరైనా విమర్శించినప్పుడు కలత చెందటం జరుగుతుంది. ఆ అహంయొక్క హద్దు ఎంతమేరకు అనేది అంతుపట్టని విషయం, అది తొలగిపోవటానికి చాలాకాలం పట్టుంది. దీనినే పరిశుద్ధ 'మాయ', పరిశుద్ధ 'అహంకారం' అని చెప్పవచ్చు. ఈ రెండూ ఎంత శక్తివంతమైనవంటే వీటి మూలంగా యోగులుసైతం ఎక్కువగా పతనం చెందుతారు. సర్వశక్తివంతుడైన ఈశ్వరుడే తన దయను అనుగ్రహించాలి.

నేను నీకు చెప్పదలుచుకున్న మరొక విషయం ఏమిటంటే, మానావమానాలు రెండింటితోనూ మనం సంబంధం కల్పించుకోకూడదు. అవమానం చాలా శీఘ్రంగా తొలగిపోతుంది కాని మానం అనగా పొగడ్తను విస్మరించటం దైవాధీనంగానే ఉంటుంది. మనపైన ఈశ్వరుని దయ కలిగినప్పుడు మాత్రమే అది తొలగిపోతుంది కాని దేహం ఉన్నంతవరకు అది ఎంతో కొంత శేషించియే ఉంటుంది. ఇప్పుడు నా బలహీనత ఏమిటో వ్రాస్తున్నాను. నన్ను ఎవ్వరైనా ప్రశంసించినపుడు, నా మనస్సు కూడా కొంత ప్రసన్నమవుతుంది. అయితే మొదట కొంచెంగా మనస్సు ప్రభావితం అయినప్పటికీ ఆ ప్రశంస ఎవరికి సంబంధించినదో, ఎవరు దానిని హర్షిస్తున్నారో అనే విషయం నాకు అనుభవం కాదు. నీవు వ్రాసిన ఉత్తరంలో, "నేను ఎంతగా మాలిక్‌కు సమర్పణమైపోవాలనుకుంటున్నానో అంతగా సమర్పితం కాలేకపోతున్నాను" అని వ్రాశావు. దాని అర్థం ఏమిటంటే, ఒక వ్యక్తి ఏదైనా స్థానంమీద తన

బాణం ఎక్కుపెట్టినప్పుడు, దానిని ఛేదించాలని దృఢనిశ్చయంతో సంకల్పించినపుడు, ఆ స్థానాన్ని అది (బాణం) తప్పనిసరిగా తాకుతుంది (అనగా ఒక లక్ష్యంమీద గురిపెట్టుకుని దానికి అర్పణమైపోతే అది తప్పక సిద్ధిస్తుంది అని భావం).

నీవు, "ఆత్మ సమర్పణ నన్ను మర్చిపోయింది" అని వ్రాశావు. ఈ స్థితి ఖచ్చితంగా ఆత్మ సమర్పణకు చెందినదే. **ఆత్మ సమర్పణ అంటే మరేదో కాదు, అది కేవలం తనను తాను 'దైవం'కు అర్పించుకుని 'అతడి' ఇచ్ఛకు వదిలివేయటమే.** నీవు స్థితిని గురించిన 'అజ్ఞానం' అని వ్రాసిన విషయాన్నిబట్టి అది చాలా ఉన్నత స్థితిగానే భావించాలి. కాని అది ఇంకా ప్రారంభంకాలేదు, ఇంకా చాలా దూరంలో ఉంది. అయితే 'మాలిక్' యొక్క సంపూర్ణ దయ అతిదగ్గరగానే ఉంది కాబట్టి 'అతడు' ఏమైనా చేయగలడు. ఇంక 'అజ్ఞానం' గురించిన ప్రశ్న ఏమి ఉంటుంది. ప్రతి ఒక్కరూ 'అతడి'ని దూరంగానే ఉంచాలని అనుకుంటారు. నా విషయంలోనే చూడు, విద్యావంతులు కూడా నాతో మాట్లాడటానికి సమయం వృథాగా భావింపవచ్చు. "స్థితి అంతగా బాగుండలేదు" అని నీవు వ్రాసిన విషయం నాకు సంతోషం కలిగించలేదు. మన విధానం (సిస్టమ్)లో స్థితులు అన్నీ మంచివిగానే ఉంటాయి. ఒకవేళ ఏదైనా చెడ్డస్థితి అనుభవంలోకి వచ్చినట్లయితే అది మంచి స్థితి కలగడానికి నాంది అవుతుంది లేదా తెరచుకోవటానికి తాళం చెవిలాంటిది అవుతుంది. నీవు ఎవ్వరిలోనైనా దైవంపట్ల ప్రేమను గుర్తించినపుడు, దానిని నీ ప్రేమ వంటిదిగానే తలపించటమనేది చాలా మంచి విషయం. దానికి నేను ఒక ఉదాహరణగా ఉన్నాను. అసలు, నాలో నేను ఉండను. అయినప్పటికి నేను దాని నుంచి చెదిరిపోయినప్పుడు, ఆధ్యాత్మిక విద్యలో ఇతరులు ఎవ్వరైనా నాకంటె ఎక్కువగా ఉన్నతి చెందినట్లు అనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే, అతడే నాకు ఆధ్యాత్మిక విద్యను బోధించినట్లుగాను, నా ప్రస్తుతస్థితి ఏదైతే ఉందో దానిని అతడే ప్రదానం చేసినట్లుగాను నాకు అనిపిస్తుంది. దీనిని విడమర్చి చెప్పాలంటే, ప్రతి వస్తువుకు ఆ 'అసలు' అనగా ఆ 'సత్యత్వం' మాత్రమే మూలమైనది, అన్నీ దాని నుంచి బహిర్గతమైనవే. కొందరు దానికి బాగా హత్తుకుపోగా మరి కొందరు దానిని నిర్లక్ష్యం చేస్తున్నారు.

బిటియా! నేను నీ మొదటి ఉత్తరానికి జవాబు వ్రాసేసరికి నవంబరు 26వ తేదీతో నీ ఉత్తరం అందింది. నీకు కలలో కనిపించినదానికి నేను వివరణ ఇస్తున్నాను. నీవు చూసిన నీరు, సాక్షాత్కారపు నదికి చెందింది. దానిలో నీవు ప్రవేశమైపోయావు. అనగా సత్యత్వం (రియాలిటి) ప్రారంభమై పోయింది, కనుక నా పని పూర్తి అయినట్లే. ఇంకా ముందుకు వెళ్ళి ఏమి ఉందో చూడు. భగవంతుని అనుగ్రహంతో నేను చేయవలసినది అంతా చేయగలిగినట్లు విశ్వసిస్తున్నాను. ఈ దశలు అన్నీ కూడా 'H' పాయింట్‌కు సంబంధించినవే. "నా హృదయంలోనే బ్రహ్మాండమంతా ఇమిడి ఉంది" అని నీవు వ్రాసినది బ్రహ్మగతి అని చెప్పాల్సి ఉంటుంది. దీని తర్వాత హిరణ్యగర్భస్థితి ఉండి దానిమీదట పవిత్ర బ్రహ్మస్థితి ప్రారంభమవుతుంది. "హృదయ బంధం తెగిపోయింది" అని నీవు వ్రాసిన విషయం వాస్తవమే. అయితే నేను ఇంకా హృదయాన్ని తెరవలేదు. ఇప్పుడే అది నా దృష్టికి వచ్చింది. అది దైవేచ్ఛమీద ఆధారపడి ఉంది. 'అతను' సంకల్పించినపుడు నేను దానిని తెరవగలుగుతాను. "అనుక్షణం, పవిత్ర ప్రదేశంలోను నాకు బదులుగా ఒక నీడ వంటిది, తేలికైనటువంటిది, సూక్ష్మమైనటువంటిది ఏదో ఉన్నట్లుగాను, దానిని శ్రద్ధగా పరిశీలించినపుడు మీ స్వరూపంగాను కనిపిస్తోంది" అని నీవు వ్రాశావు. విషయం చాలా గోప్యంగా ఉండటంతో పాటు, భావం స్పష్టంగా కూడా లేదు. దానిని గురించి సవివరంగా వ్రాస్తే జవాబు వ్రాస్తాను. "భూమి, నీరు అన్నీ నా హృదయంలోనే ఇమిడి ఉన్నాయి, కాని నేను మాత్రం ఎక్కడికో వెళ్ళిపోయాను" అని వ్రాశావు. దాని అర్థం నిన్ను నీవు తగినంతగా కోల్పోయావు అన్నమాట. ప్రతి ఒక్కరికి ఈ స్థితిని భగవంతుడు అనుగ్రహించుగాక! అయితే నాకంటె ఆధ్యాత్మిక ఉన్నతస్థితిని ఇంక ఎవ్వరిలోనైనా నేను గమనించగలిగినప్పుడు నాకు బాగా సంతోషం కలుగుతుంది. **సముద్రం పొర్లిపోదు, కాని చెరువు కొద్ది నీటితోనే పొర్లిపోతుంది. అభ్యాసి వేలకొలది చెరువుల సాక్షాత్కారపు నీటిని త్రాగినప్పటికీ తృప్తిచెందక నోటితో 'ఇంకా కావాలి' అనునట్లుగా ఉండాలి.** భగవంతుని దయతో నీ ఆధ్యాత్మిక దశ చాలా బాగుంది. భగవంతుడు నిన్ను ఇంకా ముందుకు నడిపించుగాక! తథాస్తు. తథాస్తు.

జనానికి ఈ దశకు చేరాలను కోరిక కూడా కలగటం లేదు. భగవంతునికి పరిమితి అంటూ ఏమీలేదు. నా గురుమహరాజ్ నన్ను మాత్రం గమ్యానికి చేర్చాడు. 'వారి'కి వేయివేలసార్లు ధన్యవాదాలు అర్పిస్తున్నాను. అయినప్పటికి నా మకాం ఎక్కడో నాకు ఇప్పటికీ తెలియదు. అందుకు కారణం నేను ఇప్పటికీ అనంతంలో ఈదుతూనే ఉన్నాను. జనం స్వల్పమైన దానిని పొంది అపారంగా పొందినట్లు ఎలా భావిస్తారో అర్థం కావటం లేదు. అమ్మగార్కి ప్రణామాలు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 263

లఖీంపుర్,

07.12.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది, దానిని చదివి చాలా ఆనందించాను. 'మాలిక్'కు అనేకానేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. తన అపారకృపను వర్షింపజేసిన 'మాలిక్'కు ధన్యవాదాలు కాకుండా ఇంకా ఏమేమి, ఎలా చెప్పాలి. ఒక్క విషయం – తమరు ఉత్తరం వ్రాసేటపుడు, ఏమి చెప్పాలనుకుంటారో ఆ శబ్దాన్ని ఉర్దూలోనయినా సరే, యధాతథంగా వ్రాయండి. ఎందుకంటే, అలాకాకపోతే దాని భావస్వారస్యం తగ్గిపోతుంది, ఇది నా ప్రార్థన. గత ఉత్తరంలో తమరు మాస్టర్ సాహెబ్‌తో, ఎవ్వరైనా గాని మిషన్ అభివృద్ధి కొరకు తమ ఇచ్ఛాశక్తిని ఉపయోగించవలసి ఉంటుందని వ్రాశారు. ఆ విషయంలో తమరు, నిశ్చింతగా ఉండండి. 'మాలిక్' దయతో నేను ఆ పని చేయసాగాను.

"మానావమానాలు రెండింటిని గురించి మనం సంబంధం కల్పించుకొనరాదు" అని తమరు వ్రాశారు. 'మాలిక్' నా విషయంలో మానావమానాలకుగాని, నిరర్థక సంబంధాలకుగాని స్థానం లేకుండా చేశారు. నాకు లక్ష్యం తప్ప మరేదీ కనిపించటం లేదు. నాకయితే విల్లు, బాణం, హస్తం కూడా కనిపించటం లేదు. అది ఎంతగానంటే, తరచుగా నేను ఉన్న స్థితిలో నా మరుపుస్థితిలో కూడా, నా దృష్టి అటువైపే ఉంటోంది, చివరకు నా లక్ష్యం ఏమిటో కూడా స్పృహలేనట్లు ఉంటోంది. బహుశా హృదయంలోని తేలికపాటి స్పందనగాని, దానిలోని ఉష్ణంగాని ఆ లక్ష్యాన్ని గురించి పట్టించుకుంటున్నాయని అనుకుంటాను.

"నీ ఉత్తరంలో ఒక విషయం అనగా స్థితి చెడ్డగా నడుస్తోంది అను విషయం నాకు బాగా అర్థం కాలేదు" అని తమరు వ్రాశారు. పూజ్య బాబూజీ, అది కేవలం ఆ సమయంలో ఉన్న దశను వ్యక్తం చేయటానికి మాత్రమే వ్రాసాను కాని, మనస్సులో మరే భావనా లేదు. అన్య భావన ఇంతవరకు లేదు. ఇక మీదట కూడా ఉండబోదు. "ఒక్క ఉత్తరం నేను మాస్టర్ సాహెబ్‌కు వ్రాసిన దానిలో కొన్ని ప్రశ్నలు వేసి వాటికి సమాధానాలు కోరాను" అని తమరు వ్రాశారు. కాని ఆ విషయం నాకు తెలియదు. నేను వారిని అడిగించినప్పుడు, తమరు వారిని (మాస్టర్ సాహెబ్‌కు), తావూజీని కొన్ని ప్రశ్నలు అడిగినట్లుగాను, వాటి సమాధానాలు తమకు చేరినట్లుగాను తెలియవచ్చింది. "నాకు బదులు ఒక అల్పమైనది, సూక్ష్మమైనది అయిన ఛాయ (నీడ) కనిపిస్తున్నది, దానిని నిశితంగా పరిశీలించినప్పుడు దానిని తమ యొక్క స్వరూపంగా గ్రహిస్తున్నాను" అని తమకు ఏదైతే వ్రాసానో దాని సారాంశం– నా శరీరం, నా స్పృహకు బదులుగా ఆ విధంగా కనిపిస్తోంది అని మాత్రమే.

నా 'మాలిక్' నాకు అధిక ఉన్నతి బాగా జరిగేటట్లు అనుగ్రహించిన ఆశీర్వాదం నా శిరస్సుపై నిలిచి ఉంది. 'అతని' కృప మూలంగానే 'అతని' ప్రపంచంలో అనగా 'అతని' వాస్తవిక ప్రపంచంలో నా జననం జరిగింది. 'అతని' పరమకృపా రూపమైన అమృత దృష్టితో నా పోషణ జరుగుతోంది, నేను పెరుగుతున్నాను, అలా పెరుగుతూ

ఉంటాను అనటంలో సందేహం లేదు. నాలో తృష్ణ పెరుగుతూ ఉంది, 'మాలిక్' కృపతో అది ఇంకా వృద్ధి చెందుతూనే ఉంటుంది. ఇప్పుడింక 'మాలిక్' కృపతో కలిగినటువంటి ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, నా పరిస్థితి ఎలా ఉంది అంటే, తమరు వచ్చారు అని ఎవరైనా అబద్ధం చెప్పినట్లయితే, వెంటనే నా నోటి నుంచి 'తమరు' అసలు ఎక్కడకు వెళ్ళారు అని వెలువడుతుంది. నిశితంగా గమనించినట్లయితే, నా శ్వాస కూడా 'అతని' శ్వాసతోనే సమ్మిళితమై ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. ఎలాగంటే, నా ఆలోచనలో 'అతడు', 'అతడి' ఆలోచనలో నేను మునిగి ఉన్నట్లు ఉంటున్నది. దీనిని నేను గట్టిగా పరిశీలించి చూసినా, చూడకపోయినా కూడా ఇదే దశ ఉంటోంది. ఈ 'ఆలోచన' శబ్దం ఈ దశలో ఎందుకు భారం అయిపోయిందో నాకు తెలియటం లేదు. ఆంతరికంగా ఎటువంటి స్థితి ఉంటున్నదంటే, నేను ఎంతగా నవ్వుతూ ఉల్లాసంగా ఉన్నా, లేదా ఎంత ఉదాసీనంగా ఉన్నా కూడా, నా ఆంతరికం మాత్రం ఈ రెండింటికీ పట్టనట్లుగానే ఉంటోంది. అయినప్పటికి కూడా, దాని (ఆంతరికం) మీద విభూతి వంటిది అద్దుకుని ఉన్నట్లుగా మాత్రం అనుభవమవుతోంది. అది అలా ఉండగా, శ్రీ బాబూజీ, హృదయం ఏదో విచిత్రంగా ఉన్నట్లు అనిపిస్తోంది. అదేమిటో నాకు తెలియదు. సంతోషంకాని, విచారగ్రస్తంగా కాని ఉండటం లేదు. తరచుగా హృదయం అశ్రువులు స్రవించకుండానే విలపిస్తూ ఉన్నట్లు అనుభవమవుతోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతూ, **వజ్రం తయారుచేయగల నేర్పు తమలో మాత్రమే ఉంది అంటున్నారు. ఎవ్వరైతే బురదలో నుంచి లాగి నేరుగా శుచియైన మార్గంలోకి తీసుకురాగలరో 'అట్టివారు' మాత్రమే వజ్రాలను కూడా తయారుచేయగలరు.**

ఇప్పుడు ఉత్సవం రాబోతున్నది, దానికి మేమందరం కూడా తప్పక వస్తాము. అప్పటికి తమ ఆరోగ్యం బాగుపడితే చాలా బాగుంటుంది. ఇక్కడ 4,5 రోజుల నుండి ఎలా ఉంటున్నది అంటే, అందరూ దినమంతా స్కూలులో ఉంటున్న సందర్భంలో కాని లేదా నేను ఒంటరిగా ఉంటున్నప్పుడుగాని, హృదయం కొంత ఉదాసీనం వంటిది ఆవహించి ఉన్నట్లు నా స్థితి ఉంటోంది. అశ్రువులు స్రవించకుండా వెక్కివెక్కి ఏడ్పులు వస్తున్నట్లు ఉంటోంది. అయితే ఎవ్వరైన జనం ఉన్నప్పుడు మాత్రం హృదయంలో దాని జాడ లేకుండా మార్పు వస్తోంది, అటుపైన తమకే తెలియాలి. కేసర్, బిట్టో ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 264

లఖీంపుర్,

16.12.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. నా ఆరోగ్యం కొంత దెబ్బతింది కాని ఇప్పుడు నేను పూర్తిగా బాగుపడ్డాను. చింతించవలసినది లేశమాత్రమైనా లేదు. తమకు బైరాగి వైద్యం లభించినదని భావిస్తున్నాను. చిన్న సోదరునికి ఇటీవల కొంచెం కష్టం కలిగింది. ప్రక్కటెముకలు రెండు బహుశా నిన్న ఒకటి, ఈరోజు మరొకటి విరిగాయి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఎటువంటి దశ అనుభవానికి వస్తున్నదంటే, 'మాలిక్' యొక్క పుష్పంలోని మృదువైన సువాసన నాలో నిండ ప్రారంభ మైనట్లుగాను, మరి నేను దానిని 'మాలిక్' యొక్క కానుకగా చూస్తూనే ఉన్నాను కాని, ఈ శరీరం ఆ సుగంధం వెదజల్లేవానిలోగాని, ఆ సుగంధంలోనే గాని కలిసిపోతున్నదా అన్నట్లు ఉంది. ఏదైనాగాని ఈ దేహం ఆ సుగంధంలోనే ఉండిపోయింది అన్నట్లు అనుభవమవుతోంది. ఇప్పుడు నా స్థితి ఏమిటంటే, 'మాలిక్' నన్ను ఆ

సుగంధంలో స్థిరపర్చాడు కాని, నాకు 'అతడే' ఇష్టంగా ఉన్నందువలన, నేను ఆ సుగంధంలో స్థిరపడిపోయి ఉండి కూడా ఈ హృదయం ఎక్కడో ఉంటున్నట్లు అనుభూతి చెందుతున్నాను. "కళ్ళు తెరచి ఆనందంగా ఆస్వాదిస్తున్నాను" అన్నట్లు ఇప్పుడు నా స్థితి ఉంది.

పూజ్య బాబూజీ, ఇప్పుడు ఒక విషయం ఏమిటంటే, ఎవ్వరిలో నయితే మాలిక్'పట్ల ప్రేమ వృద్ధి చెందుతూ ఉంటుందో, అటువంటి వారమందరమూ ఒకే 'తల్లి' యొక్క బిడ్డలం అన్నట్లు ఉంది. అలాకానేకాదు, అయితే మన అందరమూ ఒకే ఒక్కటే, అంతేగాని అక్కడ ద్వైతానికి తావులేదు. నేను ఇలా ఎందుకు వ్రాశాను అంటే, నాలో ఒక జ్ఞాపకం (స్మృతి) స్థిరంగా ఉండిపోయింది. దాని ముందు మరి ఏ ఇతరమైనదాని జ్ఞాపకం నిలబడలేకపోతోంది. బహుశా ఇది మనలో సర్వసహోదర భావం (సౌభ్రాతృత్వం) ఉండటంవల్లనే కావచ్చు. ఇప్పుడు స్థితి ఎలా ఉన్నది అంటే, అల (లేదా తరంగం) అయితే ఉంది కాని అది ఉప్పొంగటం లేదు. 'మాలిక్' యొక్క జ్ఞాపకం నాకు అంతగా రావటం లేదు. అదేమిటో నాకు తెలియటం లేదు. అయినప్పటికి కూడా నేను 'అతడి' నుండి ఒక్క క్షణమైనా వేరుపడి ఉండటం లేదు. నేను 'అతని'లోనే అల్లుకుపోయి ఉంటున్నాను, అలాగే 'అతడు' కూడా. నాకు ఎలా అనిపిస్తోంది అంటే, 'అతడు' ఒక ఆకర్షణగాను, నన్ను అనుక్షణం తనవైపు ఆకర్షిస్తూ ఉన్నట్లుగాను ఉంది. అమ్మ తమకు ఆశీర్వాదాలు చెప్తున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 265

షాజహాన్‌పూర్,
20.12.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం అందుకుని చాలా ఆనందించాను. నీవు ఏ విధంగానైతే నా ఉత్తరం కొరకు ఎదురుచూస్తూ ఉంటావో అలాగే నేను కూడా నీ జాబు కొరకు ఎదురుచూస్తూ ఉంటాను. అనగా ఈశ్వరానుగ్రహం వలన నీ స్థితి ఎలా తయారైపోయింది అంటే నీవు ఏ విధంగా ఈశ్వరుణ్ణి చేరటానికి తహతహలాడుతున్నావో అదే విధంగా దైవం కూడా ఆరాట పడుతున్నాడు. నేను కనుక ఈ సందర్భంలో ఈశ్వరుడు అని ప్రయోగిస్తే అది కొంచెం తప్పుగా ఉంటుంది. ఎందుకంటే, 'అతడు' తనకు సాధ్యపడినంత వరకు నిన్ను తీసుకొనివెళ్ళి, నీవు ఇంకను చేరవలసిన గమ్యాన్ని నిర్దేశించాడు. భగవత్ సాక్షాత్కారం అయితే జరిగిపోయింది కాని ఇప్పుడు 'భూమా'కు సంబంధించినది ప్రారంభమవుతుంది. దీనినే నేను నా గత ఉత్తరంలో వాస్తవికత (రియాలిటీ) ఇప్పుడు ప్రారంభమవుతుంది అని తెలియజేశాను. దీనిని విడమర్చి చెప్పాలంటే, అది భూమా యొక్క ప్రతిబింబంగాను లేదా దాని ప్రతిబింబం యొక్క ప్రతిబింబంగాను భావించుకోవాలి. వాస్తవికత (రియాలిటి) అంతమైన తర్వాత దానిని అంటిపెట్టుకొని భూమా ప్రారంభమవుతుంది కనుక దానిని గురించి చింతించాల్సిన అవసరం లేదు. అది మాటల్లో వర్ణించినంత గొప్పది ఏమీ కాదు. ఈ స్థితిని కల్పించినవారే అక్కడికి చేర్చటానికి సహాయపడుతారు. **మన 'లాలాజీ' యొక్క శక్తిమీద ఎల్లప్పుడూ విశ్వాసం నిలుపుకోవాలి. 'వారు' తలపెట్టినది ఏదైనా సాధించగలరు. మన మిషన్‌కు ఉన్నవన్నీ 'వారి' ఆశీస్సులే, 'వారి' శక్తియే మనకు అండగా పని చేస్తోంది.** మానావమానాల నిరర్థక సంబంధాలతో నీవు విముక్తమైనట్లు వ్రాసింది చదివిన తర్వాత నాకు చాలా ఆనందం కలిగింది. నేను అడిగినమీదట "నాకు బదులుగా ఒక అల్పమైన ఛాయ (నీడ) కనిపిస్తోందనీ, దానిని బాగా పరిశీలించగా అది తమ స్వరూపంలాగానే ఉంది" అని వ్రాశావు. ఇది చాలా మంచి విషయం. దీనికి ముందు రానున్న స్థితిని నేనుగా వ్రాయను కాని అది లయ అవస్థకు చెందిన మంచి

స్థితిగా ఉంటుంది. అంతేగాకుండా, దాని తర్వాత కూడా మరో దశ ఉండవచ్చు. దప్పిక పెరుగుతోంది అని చెప్పటంలో అర్థం ఏమిటంటే, అసలుతత్వం అనగా సత్‌పదార్థం (రియాలిటీ) తనవైపు మనల్ని గుంజుకోవాలనుకోవటం అయి ఉండవచ్చు. ఈ దాహాన్ని దానంతట అదే తీరిపోయేటంతవరకు నిలుపుకోవాలి. దీని తర్వాత నీవు ఇంకా వ్రాసిన విషయాలు లయావస్థ మరియు ప్రేమకు చెందిన స్థితులు. నీ ప్రస్తుత స్థితి కంటె తక్కువ స్థితికి చేరినటువంటివారు, ఎవ్వరైనా శిక్షణను ఇవ్వటానికి వేదిక మీదకు వచ్చినట్లయితే అది వారి అపరాధమవుతుంది. ఈ స్థితి (దైవ సాక్షాత్కారం) వరకు చేర్చటం గురువు యొక్క గురుతర బాధ్యత. అప్పుడు అభ్యాసులకు ఆ స్థాయికి చేరటం మూలంగా తృప్తి కలుగుతుంది.

కొన్ని రోజుల తర్వాత అనగా 4,5 రోజుల్లో నిన్ను దీనికి ముందు రానున్న పాయింట్ మీదకు చేర్చుతాను. దానిని 'I' పాయింట్‌గా నిర్దేశించాను. ప్రస్తుతం నీవు ఉన్నది 'H' పాయింట్ వద్ద. అమ్మగార్కి వందనాలు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 266

లఖీంపుర్,

22.12.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది. దానిని చదివాక చాలా ఆనందం కలిగింది. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. నా 'మాలిక్' యొక్క కృపకు ధన్యవాదాలు ఎలా తెలపాలో నాకు అర్థం కావటం లేదు. అయినాగాని, నా దగ్గర ఇవ్వటానికి ఏముంది కనుక. అవును, ఏది ఏమైనాగాని, నేను ఎలా ఉన్నాగాని, నా 'మాలిక్'కు అర్పితమైపోతాను. దానిలో సందేహం లేదు. పూజ్య శ్రీ బాబూజీ, నాకు ఈశ్వరునితో పనిలేదు, భూమా గురించి పట్టదు. నాకు ఏదైతే కావాలో అది 'తమరు' మాత్రమే. 'అతని'లో నేను ఎంతగా కరిగిపోతూ ఉంటానో అదే నా ఉన్నతి, అంతకుమించి ఇంకా ఏదైనా ఉన్నా కూడా అది నాకు తెలియదు. "మనం భయపడాల్సిన పని లేదు" అని తమరు వ్రాశారు, అయితే 'మాలిక్' నాకు అలా భయపడటానికి జన్మనివ్వలేదు. 'అతడి' పరమకృపతో, సర్వదా 'తమ' యొక్క ఈ పాద సేవకురాలిలో ఇటువంటి ప్రస్తావన ఎన్నడూ రాలేదు, రాబోదు కూడ. పూజ్య శ్రీ బాబూజీ, ఏ విషయానికైనా ఒకచోట స్థానం ఉండాలి, అది ఎక్కడ నుండి వస్తుందో నాకు తెలియదు. చూస్తుంటే, నాలో అటువంటి స్థానం ఏమీ లేదని అనిపిస్తోంది. అది ఒక గడ్డిపోచకే కాదు, ఆఖరికి నా ఉనికికి కూడా ఆ స్థానం అంటూ లేకపోయింది. ఇప్పుడు ఏమిటంటే, ఆ 'మాలిక్'కు తప్ప నాకు కూడా స్థానం లేనటువంటి పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక స్థితిని వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ "సఖీ, దివ్య కృపారసం (ప్రేమ సుధారసం) వర్షిస్తున్నది, నేను దానిలో తడుస్తాను" అన్నట్లు ఉంది. అది నిరంతరం వర్షిస్తూనే ఉంది, కాని ఎక్కడ? అది, అంతరంగంలో నిరంతరం ఒకే తీరున నిశ్చలంగా వర్షిస్తోంది. అది ఇప్పుడు తారుమారైంది. ఇంతకుపూర్వం దప్పిక నాదై ఉండగా ఇప్పుడు 'అతడి' దప్పికలో నేను మునిగి ఉంటున్నాను. ఇప్పుడు ఆ దప్పిక కోసం నా దావా (అప్పీలు) లేకపోయింది. ఆ దప్పిక నాదిగా ఉన్నట్లయితే, అప్పుడు ఏదైనా ఘటన సంభవించే అవకాశం ఉండి ఉండేదేమో కాని ఇప్పుడు అది లేదు. ఇప్పుడు ఆ ప్రేమసుధ ఒకేరీతిలో ప్రవహిస్తూ వృద్ధి చెందుతుంది. నా పూజ్య బాబూజీ, ఇప్పుడు నేను ఏమి చూస్తున్నాను అంటే, ఇప్పటివరకైతే నేను నా శరీరం మీద స్వాధీనం కోల్పోయాను కాని, ఇప్పుడు నా అంతఃస్థలం మీద (అంతరంగం)

కూడా నా ఆధీనం కోల్పోయాను. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఇంతకుపూర్వమైతే స్వయంగా నా నుండియే ఆ దివ్యరసం ఉత్పన్నమవుతూ ఉండేది, కాని ఇప్పుడు అది వర్షిస్తూ ఉంటే, నేను దానిలో తడుస్తూ ఉండటమే నా పనిగా ఉంది.

పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ఆరోగ్యం కుదుటపడింది. పూజ్య శ్రీ బాబూజీ, మేము 14,15 తారీఖులకు అక్కడకు రావటానికి ఆలోచన చేస్తున్నాము. అటుపైన దైవేచ్ఛ. అమ్మగారు తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ మరియు బిట్టో ప్రణామం తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 267

లఖీంపుర్,

24.12.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి చేరిందని అనుకుంటు న్నాను. మళ్ళీ ఈరోజు మనసుపడింది. పెద్దగా విశేషమైనది ఏమీ లేకపోయిన్పటికి, ప్రస్తుతం ఉన్న దశ గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, నేను బాహ్యాముఖంగా గాని, అంతర్ముఖంగా గాని లేనేమోనని అనిపిస్తోంది. నా దృష్టి ఎటువైపూ లేదు. నేను ఎలా ఉన్నానో అలాగే ఉన్నాను అన్నమాట. ఇప్పుడు ఎలా ఉంది అంటే, 'మాలిక్'యే స్వయంగా నావంక చూస్తున్నట్లు ఉంది. నేను రేయింబవళ్ళు 'అతని' ఆకర్షణలో ఎటువైపో గుంజుకుపోతున్నాను అంటే, బహుశా అదే కారణం కావచ్చు. తమకు గత ఉత్తరంలో వ్రాసినట్లు, "నాకు బదులు ఒక నీడ వంటిది చూస్తున్నట్లుగాను, దానిని నిశితంగా పరిశిలించిన మీదట, అది 'తమ' రూపంగానే అనిపిస్తోంది" అన్నటువంటి దశ కూడా ఇప్పుడు లేదు. ఈ దశతో కూడా ఇప్పుడు బంధ విముక్తి కలిగినట్లు అనిపిస్తోంది. మరి నేను ఎలా ఉన్నానో అలానే తమ ఎదుట ఉన్నాను. పూజ్య శ్రీ బాబూజీ, 'అతడు' నన్ను తనవైపుకు ఆకర్షించి లాగుతున్నాడు. 'అతని' దయతో నేను దానిని నిరోధించలేకపోతున్నాను. 'మాలిక్'పట్ల నా కోరిక మంచిది కాకపోయినప్పటికీ ఆ ఆకర్షణ నన్ను చుట్టుముట్టి ఉంటోంది. ఇప్పుడు దశ ఎలా ఉంది అంటే, "రాత్రి నిద్రపోను, పగలు మేల్కొనను, ఎటువంటి అలసత్వం లేదు. మనస్సులో శాంతి అశాంతులు కలగటం లేదు, కనుక నేను ఎందుకు ఆ స్థావరాన్ని (మాస్టర్ ఉనికిని) కోల్పోవాలి?" అన్నట్లు ఉంది. బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, మనస్సులో 'మాలిక్' దయతో ఎటువంటి విజయం కొరకు కోరికగాని, పరాజయం సంభవిస్తుందేమోనన్న భావనగాని ఏమీ లేకుండాపోయాయి. అటుపైన ఇంకేమిటో తమకే తెలియాలి.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు అరటిపండ్లు సరైన సమయంలో బాగా పక్వానికి వచ్చాయి. ఇది నాకు చాలా సంతోషంగా ఉంది. సీతాఫలాలు కూడా పండాయి. పోషణలేక చిన్న చిన్నవిగా ఉన్నాయి. అయితే ఇవేమీ తమకు ఇష్టం ఉండవు. తమరు ఇంకా వేరేవాటికి ఇష్టపడతారు. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు. అమ్మ మా అందరినీ జ్ఞాపకం ఉంచుకొనమని చెప్తూ, తమరు అన్నీ నెరవేరుస్తున్నారని, నెరవేర్చుతారని భావిస్తూనే, ఇంకొక పని నెరవేర్చినట్లయితే, మిగిలి ఉన్న ఈ చిన్న చింత కూడా తీరిపోతుంది అని అంటున్నారు. నేను పజిల్ పట్టీని పూరించి పంపాను. అది చేరవలసిన ఆఖరి తేది 7 జనవరి 1953. నా ఈ ప్రార్థన కనుక సఫలీకృతమైతే, ఆర్థికపరమైన బాధల నుంచి మాకు విముక్తి కలుగుతుంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 268

షాజహాన్‌పూర్,
01.01.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలము. నీ ఉత్తరాలు అన్నీ చేరాయి. డిశంబరు 24వ తేదీతో ఉన్న ఉత్తరానికి ఇది జవాబు. మనం ధ్యానం ప్రారంభించాము అంటే మన దృష్టి 'మాలిక్' (దైవం) మీద కేంద్రీకరించటం మూలంగా మనం ఒక భక్తునిగా సంబంధం ఏర్పడుతుంది. ఈ సంబంధం యొక్క బంధనాన్ని ఎవరో 'తన'ను తలుస్తున్నారని అనిపించునంతగా 'మాలిక్'ను మనం తాకునట్లు చేయగలిగినపుడు, 'అతడు' మనవైపు దృష్టి సారిస్తాడు; అలా దృష్టి నిలపడం జరుగుతూనే 'అతని' వద్ద ఏవైతే ఉన్నాయో అవి మనకు సంక్రమించసాగుతాయి. 'అతడి' వద్ద ఏమి ఉన్నాయి? ముఖ్యంగా ఏమీ పట్టనట్లుగానే, ఏ మూలవస్తువు కారణంగా 'అతడు' 'మాలిక్' కాగలిగాడో, ఇప్పుడు అదే వస్తువు నీలో కూడా ఏర్పడసాగుతుంది. అనగా నీ సామర్థ్యం కూడా ఎంతో కొంత ఆ విధంగా తయారవుతుంది. అనగా కొంచెం తక్కువ స్థాయిలో నీలో కూడా ఆకర్షణశక్తి ఏర్పడసాగుతుంది. ఫలితంగా 'అతడి' ఆనవాళ్ళు నీలో కూడా ప్రతిబింబిస్తాయి. ఇప్పుడు నీవు ఒక భక్తురాలుగా సంబంధం కల్పించుకుని 'అతడి'ని జ్ఞాపకం చేసుకుంటూ ఉన్నావు. అనగా తలుస్తున్నావు కనుక ఇప్పుడు నీ విషయం కూడా 'అతడి'కి చేరుతుంది. ఇప్పుడు నీ విషయం చేరటం అంటే, చేరేది ఏమిటి? అదే బాంధవ్యం (సంబంధం), భక్తి భావన కొనసాగుతూనే ఉంటాయి; అది ఏ స్థాయికి అంటే నిన్ను నీవు మరచిపోయేటంతగా. నీవు ఈ స్థితిని గుర్తించగలిగినపుడు అనగా సంబంధం, భక్తి 'అతడి'ని చేరుకున్నాయి అని నీ దృష్టికి రాగానే 'అతడు' ఇప్పుడు స్వయంగా నీ దృష్టిలో నిలిచిపోయినట్లు నీ గ్రహింపుకు వస్తుంది. ఇదే విధంగా అంతర్ముఖం కావటం లాంటి అనేక దశలు అనుభవానికి వస్తాయి. అవి అన్నీ 'అతడి'వైపు నుంచే వస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విధంగా భక్తికి చెందిన ఒక నూతన అంకం సాధ్యమవుతుంది.

31 డిశంబర్ 1952వ తేదీన నిన్ను 'J' స్థానానికి చేర్చాను. ఈశ్వరానుగ్రహం ఉంటే నీకు ఈ ఉత్తరం చేరేసరికి దానిలో నీ ప్రయాణం కూడా ప్రారంభమవుతుంది. నేను దీనిని వేగంగా నిర్వహించాలని అనుకుంటున్నాను. దానితోపాటు ఈ ప్రయాణం యొక్క అనుభవం కూడా నీకు తెలుస్తూ ఉండాలని కోరుకుంటున్నాను.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 269

లఖీంపుర్,
2.01.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారని ఆశిస్తున్నాను. అదేమిటో తెలియదుగాని, నిన్నటి రోజున 'అతని'ని కలవాలనే తపన బాగా తీవ్రమయ్యింది. ఇప్పుడు ఉన్న స్థితి ఎలా ఉంది అంటె, 'మాలిక్' యొక్క నరనరాల్లోను, అణువణువులోను నా ఉనికిని అనుభూతి చెందు తున్నాను. ఇంతకుపూర్వం జ్ఞాపకం వచ్చినపుడు, గుండె పట్టుకుని ఉంటే కొంత విశ్రాంతి కలుగుతూ ఉండేది. కాని ఇప్పుడు ఆ జ్ఞాపకం నా హృదయాన్ని చీల్చుకుని మరీ దాటిపోతోంది, కనుక ఇప్పుడు గుండెను అదిమిపట్టుకున్నా కూడా ఫలితం ఉండటం లేదు. లోలోపల ఏమి జరుగు తున్నదో తెలియదు కాని, ఇప్పుడు ఆ ఉప్పొంగటం ఉండటం లేదు. అందుచేత ఆంతరికంగా జరుగుతున్న దానికి హృదయం భీతి చెందక పోవటమేకాక, అది నా ఆధ్యాత్మిక పురోగమనానికి తోడ్పడుతోంది.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు 'అతడు' నాలో ఉన్నట్లుగాని, నేను అసలు 'అతని'లో ఉన్నానా లేదా అనిగాని తెలియటం లేదు. అదేమిటోగాని, నాకు ఇప్పుడు 'అతని' జ్ఞాపకం రావటం లేదు, అయితే నేను ఉన్న స్థితిలో నాకు ఆనందంగా ఉంది.

'మాలిక్'పట్ల భక్తి విశ్వాసాలు, ప్రేమ యొక్క పరిశుద్ధరూపం ఏర్పడుతున్నట్లు నేను అనుభూతి చెందుతున్నాను. బహుశా అది ప్రారంభమైపోయి ఉండవచ్చును కాని అవేమీ నాకు తెలియకపోతున్నాయి. నేను ఇప్పుడు ఎంత శూన్యంగా అయిపోయాను అంటే, నాలో ఏమీలేనట్లుగాను, ఈ జగతిలోని సాధారణ జనంలాగానే నేనూ ఉన్నట్లుగాను అనిపిస్తోంది. నాకు, 'అతని'కి ఉన్న భేదం ఏమిటంటే, 'అతని' హృదయం మీద కొంత భారం వహించి ఉంటుంది కాని నా విషయంలో అటువంటి భారానికి అవకాశమే లేదు. నేను ఏమి కోరుకుంటున్నానో, ఏమి చేస్తున్నానో, ఎక్కడ ఉంటున్నానో కూడా తెలియటం లేదు. అంతా ఆ 'మాలిక్'కే తెలియాలి.

ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, ప్రపంచంలోని సాధారణ ప్రజానీకం మధ్య నేను ఒక సాధరణ వ్యక్తిగాను, సత్సంగీయుల మధ్య నేనూ ఒక సత్సంగీయురాలుగాను అనుభూతి చెందుతున్నానుగాని, నేను ఒంటరిగా ఉన్నట్లు లేదు. మరి నేను ఏమవుతానో ఏమో నాకు తెలియదు. అమ్మగారు తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 270

లఖీంపుర్,

4.01.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం మరియు పుస్తకం పుత్తీబాబు ద్వారా అందాయి. ఉత్తరం చదివి చాలా ఆనందించాను. ఈరోజు తావూజీ కూడా 3 గంటలకు వచ్చారు. వారి ద్వారా తమ ఆరోగ్యం గురించి మరియు అక్కడి విషయాలన్నింటిని విన్న తర్వాత చాలా సంతోష మయ్యింది. తమరు పంపించిన టానిక్ సీసా అందింది. పుత్తీబాబు నుంచి చుకందర్ కూడా అందింది. బసంత పంచమి సమయానికి తమరు సంతోషపడేటంతగా నేను ఆరోగ్యవంతురాలనుగా అవ్వటానికి ప్రయత్నిస్తూ ఉన్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్ అనారోగ్యం గురించి తెలిసి విచారం కలుగుతోంది.

శ్రీ బాబూజీ, ఇప్పుడు నా ఆధ్యాత్మిక ప్రగతి కొంత వేగం పుంజు కుంటున్నట్లు అనిపిస్తోంది. కాని పగ్గాలుపట్టి లాగుతున్నట్లుగా ఉంది. నా ఉద్దేశ్యంలో ఈ విధంగా పగ్గాలుపట్టి నియంత్రించకపోతే అభ్యాసీకి చాలా త్వరగా అలసట వచ్చేస్తుంది. రాముని ఉచ్చు మెడకు తగిలించుకుంటే అతడు ఎటు ఈడ్చుకుపోతే అటు వెళ్ళటమే మంచిదని నాకు అనిపిస్తోంది. (అనగా దైవం ఎలా నిర్దేశిస్తే అలాగే ఆచరించటం మంచిదనిపిస్తోంది.) నా దశ ఎలా ఉన్నది అంటె, ఆరిపోతున్న దీపంలో అప్పుడప్పుడు కాంతి పెరుగు తున్నట్లు అనగా మిణుకు మిణుకు మంటున్నట్లు ఉంది. ఇతరుల్లో ప్రేమను చూసినప్పుడు అదే విధంగా ప్రేమకోసం హృదయం ఉప్పొంగుతుంది కాని, నూనె అయిపోతే దీపం ఎంతోసేపు వెలగదనిపిస్తుంది. హృదయానికి తన యొక్కగాని, ఐక్యత యొక్క గాని స్పృహయే లేకపోయినప్పుడు, అది ఇంక ఏమవుతుంది. కనుక నా ఈ దశకు అర్థం లేదనిపిస్తోంది. ఇప్పుడింక నేను ఎటువెళ్ళినప్పటికీ, అది ఒక ఎడారి ప్రదేశంలాగాను, మిట్టపల్లాలతో కూడిన మైదానంలాగాను ఉంటోంది. అయితే నా పాదాలు ఎక్కడైనా ఆనుకుంటు న్నాయా లేక పాదాలు ఎత్తబడుతున్నాయా అనే స్పృహ కూడా లేకుండా పోయింది. అదేమిటో దైవానికే తెలియాలి. నేను స్పృహ కోల్పోయినట్లు నాకు తెలియదు. ఒకవేళ స్పృహ కోల్పోయి ఉంటే, అది నాకు తెలిసి ఉండేది. ఇదంతా ఏమిటో ఆ దైవానికే తెలియాలి. ఒక విధంగా చెప్పాలంటే, దీనిని ఒక అనాధ శవం ఎడారి ప్రదేశంలో పడి ఉన్నట్లు

చెప్పవచ్చు. హృదయం చలించినప్పుడల్లా ఇదే అనుభూతి కలుగుతోంది. ఇంతేకాదు, నాకయితే ప్రతి వస్తువు అనగా జడ చైతన్యాలన్నీ కూడా ఏ కారణం లేకుండానే మృతస్థితిలో ఉన్నట్లు అనిపిస్తోంది. ఎప్పుడైతే కారణం లేకపోతుందో అప్పుడన్నీ అర్థరహితం, అనాలోచితం అవుతాయి. నా బాబూజీ, ఈ జ్ఞాపకం రాకపోవటమే నా జ్ఞాపకం యొక్క స్థితిగా ఇప్పుడు ఉంది. ఎందుకంటే, ఈ స్థితిలో మృతునికి (అనగా నాకు) ఆ జ్ఞాపకం యొక్క పేరు నిరర్థకం, నిరుపయోగంగా ఉంటాయి. ఇంతకుక్రితం నేను వ్రాసినట్లు, ఎవ్వరైనా 'మాలిక్' పేరు తలచినట్లయితే గుండె నదిమిపట్టుకుని ఉండేదానను అని, అయితే ఇప్పుడు అలా లేదు. ఇప్పుడు స్థితి ఎలా ఉంది అంటే, శవం మీద మట్టిగడ్డలు విసిరినా లేక పుష్పాలు విరజిమ్మినా కూడా అవి నాకు నిరర్థకాలే. స్వయంగా నాకు ఏ అర్థమూ లేదు, ఏ ప్రయోజనం లేదు. అదేమిటో ఆ దైవానికే తెలియాలి. నలుదిక్కులా నిర్మానుష్యం, శూన్యతయే కనిపిస్తున్నాయి.

నా పూజ్య బాబూజీ, నన్ను తమరు వ్యాసాలు వ్రాయమన్నారు. నాకు అంతగా జ్ఞానం లేకపోయినప్పుడు నేను ఏమి వ్రాయాలి? తమరు నాకు ఏదైతే చెప్పారో అది మాత్రమే నాకు తెలుస్తుంది కాని అంతకుమించి నాకేమి తెలుసు? అందుచేత నన్ను క్షమించండి. శ్రీ బాబూజీ, తమరు ఏది వ్రాసినా అది ప్రపంచ కళ్యాణానికే చెందినదవుతుంది.

శ్రీ బాబూజీ, ఇంతకూ వాస్తవం ఏమిటంటే, దాని అర్థం నిరుపయోగమైన దశ, అందుచేత దానిని మృతప్రాయం అన్నాను. అలా కాకుండా మరేమని చెప్పాలో ఆ దైవానికే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, మాస్టర్ సాహెబ్‌కు శుభాశీస్సులు తెలియజేస్తున్నారు. బిట్టో, చిన్న సోదరులు, లల్లూ అందరూ తమకు, మాస్టర్ సాహెబ్‌కు వందనాలు అర్పిస్తున్నారు. మాస్టర్ సాహెబ్‌గార్కి నా నమస్కారాలు కూడా తెలియజేయగోర్తాను.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 271

లఖీంపుర్,

7.01.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తావూజీ ద్వారా తమరు దయతో పంపించిన ఉత్తరం అందింది. చదివి చాలా సంతోషించాను. తమరు చౌబేజీపట్ల చూపిన కృపను చూసి అమ్మ అనేకానేక ధన్యవాదాలు తెలుపుతున్నది. తమవారి మేలుకోరి ప్రత్యేకంగా తరుణోపాయాలను సృష్టించినట్లుగానే అందరిపట్ల సమభావంతో ఎటువంటి నూతన తలంపులు చేస్తున్నారో కదా! నా ఉత్తరం చేరి ఉంటుందనుకుంటాను. నేను, కేసర్ 14వ తేదీ రాత్రి తావూజీతో కలిసి అక్కడకు చేరుకుంటాము. అమ్మ తదితరలు 17వ తేదీకి వస్తారు. తమరివద్దకు చేరుకోవటానికి కొద్దిరోజులు మాత్రమే ఉన్నాయి.

నా మనస్సు మాలిక్‌తో మమైక్యమైపోవటం వలన తమరు ఏమి వ్రాసినా, చెప్పినా నేను స్పష్టంగా గ్రహిస్తున్నాను, బాబూజీ. జ్ఞానానికి సంబంధించిన పుస్తకం గురించి తమరు ఇప్పుడే వ్రాసి పంపిన విషయం చాలా ఉన్నతంగాను, అద్వితీయమైనదిగాను ఉంది. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతోంది, ఫూలోం జిజ్జీ, కేసర్, బిట్టో తమకు ప్రణామాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 272

లఖీంపుర్,

24.01.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

తమరు వివాహానికి హజరై రేపటికి తిరిగి రాగలరని ఆశిస్తూ, ఈ రోజు ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. పెద్ద సోదరుని జ్వరం ఈ రోజంతా 99 డిగ్రీలుగా ఉంది. గొంతులో బాధలేదు. ఈశ్వరుని కృపతో 2,3 రోజుల్లో పూర్తిగా కోలుకుంటాడు, కనుక విచారించాల్సింది ఏమీలేదు. ఇప్పుడు మాలిక్ కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా పరిస్థితి ఎలా ఉంది అంటే, నా హృదయం అతిగా శూన్యమై పోయి, స్వయంగా ఒక ఎడారిలాగ అయిపోయినట్లు ఉంది. ఈ శూన్య హృదయాన్ని మాలిక్ ఏదో విధంగా ఆక్రమించుకోవాలని నేను తపిస్తున్నాను. ఇప్పటివరకు నాలో కలిగిన దశలు అన్నీ జీర్ణించుకుపోయి, అవి మాలిక్‌లో లయమైపోయినట్లు అనుభవమవుతున్న దశగా ఇది ఉంది. దీనినిబట్టి, నా ఆంతరికం మాలిక్‌లో లయమైపోవటానికి పూర్తిగా శూన్యమైపోయిందేమోనని అనిపిస్తుంది. నేను మాలిక్‌లోకి వేగంగా చొచ్చుకుపోవటానికి అవసరమైనంత తేలికగా అయిపోయినట్లు అనిపిస్తోంది. నేను మాలిక్‌లోకి చొచ్చుకుపోతూ ఉంటే, మాలిక్ కూడా నాలో లయమైపోతూ ఉన్నారు. నాలో ఇప్పటివరకు కలిగిన దశల యొక్క భారం లేదా అనుభూతుల నుంచి మాలిక్ నన్ను విముక్తం చేశారు. పూజ్యశ్రీ నా బాబూజీ, ఇప్పుడైతే నా మాలిక్ యొక్క అపార కృపతో, అదృశ్యంగా ఉన్నది (భగవంతుడ్ని) కూడా చూస్తున్నాను. నాలోని ఆంతరిక దశ ఇప్పుడు సమస్థాయిలో ఉన్నట్లుగాను, 'మాలిక్' దయతో రాబోతున్న దశ కూడా స్ఫురిస్తున్నట్లుగాను, అయినప్పటికీ ఆంతరికం సమస్థాయిలోనే ఉన్నట్లుగాను అనిపిస్తోంది. కృంగుబాటు అనిపించటంగాని, క్రితంలాగా ఉప్పొంగటంగాని అనిపించకపోయినప్పటికీ, హృదయంతా రాళంలో 'అతని' కోసం తపన మాత్రం ఉంటూనే ఉంది.

ఓ 'మాలిక్', ఇప్పుడైతే నాది అంధకారంకాని, ప్రకాశంగాని లేనటువంటి స్థితి. ఈ అంధకారం (చీకటి) గురించి చెప్పాల్సివస్తే, అది కళ్ళు మూసుకున్నప్పటి స్థితిలాగా ఉంటుందని చెప్పాలి. ప్రస్తుతం నా దశ ఇటువంటిదిగానే ఉంది. ఇప్పుడు నా ఆంతరికం ఎల్లప్పుడూ ఏదో ఒక స్థితిలో విలీనమై ఉంటున్నట్లు అనిపిస్తోంది. నా దశ ఎలా ఉందంటే, ఒక వ్యక్తి నియంత్రణ కోల్పోయి నిరంతరం విశ్రాంతి లేకుండా ఉంటున్నట్లు ఉంది. తమ దగ్గర నుండి తిరిగివచ్చాక ఇది ఇంకా ఎక్కువ అవుతోంది. అందుకు 'తమకు' అనేక ధన్యవాదాలు **శ్రీ బాబూజీ! దినదినాభివృద్ధి చెందుతున్న తమ కృపామయ ఆశీర్వాద హస్తం నా శిరస్సుపై నిలిచి ఉండాలని నేను సదా ప్రార్థిస్తూ ఉంటాను.** ఇప్పుడు నా ఈ స్థితిలో, నా హృదయం ఎటువంటి అనిశ్చితికి గురైపోతున్నదంటే, ఎటువంటి విషయంకాని, మాటగాని దాగకుండా బయటకు వస్తున్నాయి. ఇదివరకటిలాగా నేను 'మాలిక్'కే పూర్తిగా అర్పితమైపోయి ఉన్నానన్న భావన నాలో ఇప్పుడు కలగటం లేదు. అయినా అటువంటి భావన ఉన్నాగాని, లేకపోయినాగాని ఎవ్వరైనా నా నరనరమూ చీల్చి చూస్తే 'అతని' ఉనికి లేదా ప్రకాశమే కనిపిస్తుందని నేను ఘంటాపథంగా చెప్పగలను. ఒక విధంగా చెప్పాలంటే, ఈ దశ యొక్క అనుభూతి భారం నుంచి 'మాలిక్' నాకు విముక్తి కల్పించాడనుకుంటాను. అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపు తున్నారు; పూలో జిజ్జీ తమకు ప్రణామం చేస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 273

లఖీంపుర్,
27.01.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరిందని అనుకుంటున్నాను. ఉత్సవం నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఫులో జిజ్జీ కాన్పూర్‌కు నిన్న వెళ్ళింది. ఆమె ఒకరోజు ప్రార్థనలో చాలా తీవ్రమైన అగాధంతోపాటు తమ 'దర్శనం' పొంది ఆశ్చర్యపడింది. ఈ విషయం మరియు పూజలో తాను బాగా నిమగ్నమై ఉండాలని తమకు ఉత్తరం వ్రాయమని ఆదేశించింది. ఇప్పుడింక 'మాలిక్' దయ ఎలా ఉంటుందో మరి. పెద్దసోదరునికి జ్వరం తగ్గిపోయింది. అయితే కొంత నీరసపడి పోయారు. కొంచెం దగ్గు కూడా ఉంది. దైవానుగ్రహం వలన 3,4 రోజుల్లో క్రమంగా కోలుకుంటారు. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశ గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడైతే హృదయానికి చెందిన బంధనాలన్నీ తెగిపోయినట్లు అనిపిస్తోంది. నా 'మాలిక్' సంపూర్ణంగా నాలో వ్యాపించి పోవటానికే అన్నట్లు ఒక నిర్మల మైదానంలాగా పరుచుకున్న నా హృదయంలో వ్యాపించిపోతూ ఉన్నారు. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, **నేను నా 'మాలిక్' హృదయంలోనే ఆడుకుంటున్నట్లుగాను, అక్కడే వారి దివ్య వైభవాన్ని చూస్తూ, వారి సంరక్షణతోనే 'వారి'లోనే లయమైనట్లు అనిపిస్తోంది.** ఇంకా ఏమిటంటే, భక్తి, ప్రేమ, సమర్పణ నాకు తెలిసినా తెలియకపోయినా, అర్థం చేసుకున్నా చేసుకోలేకపోయినా, 'మాలిక్' కృపతో నేను నా మాలిక్‌లో పూర్తిగా లయమైపోయిన సంగతి వాస్తవమన్నట్లు అనిపిస్తోంది. అదేకాదు, నా 'మాలిక్' స్వయంగా తానే నాలో పూర్తిగా లయమైపోయినట్లు కూడా అనిపిస్తుంది. ఇప్పుడు ఉన్న స్థితి వాస్తవంగా చెప్పాలంటే, 'మాలిక్' తన ఉనికిని తెలుసుకోవటానికిగాని, తెలియకుండా ఉండటానికిగాని 'వారే' స్వంత బాధ్యతను తీసుకున్నారు. నిజం చెప్పాలంటే, నేను ఇప్పుడు ఈ విషయాలమీద కాకుండా **నా సర్వస్వం అయిన నా 'మాలిక్' మీదనే మరణిస్తాను.** నా బాబూజీ, నాకు తమరు ఒకప్పుడు "బిటియా! **మనం ప్రేమ, భక్తితో ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తాము"** అని వ్రాసిన మాటలు జ్ఞాపకం వచ్చినప్పుడు, నేను వాటిని నిశితంగా పరిశీలించినట్లయితే ఎందుకోగాని అవి నాలో కనిపించటం లేదని అనిపిస్తోంది. అది ఎలా ఉన్నాగాని, అప్పుడప్పుడు నాకు ఏమనిపిస్తుందంటే, అవి నీటిలాగా కరిగిపోయి నా యొక్క అంగాంగల్లాగా తయారైపోవటమో లేక చొచ్చుకుపోవటమో జరిగింది, అని. నేను ఇప్పుడు వాటిని ఎక్కడని వెదకాలి, ఎక్కడ దక్కించుకోవాలి, ఎందుకు వెదకాలి అనేది కూడా అర్థంకావటం లేదు. అయినా కూడా అవి నాకు కావాలి. **బాబూజీ, నేను ఏమైతే చూశానో, ఏమైతే పొందానో అవి అన్నీ నా 'మాలిక్' హృదయం నుంచి మరియు 'అతని' ప్రేమమయ ఒడి నుంచే.** పూజ్యశ్రీ బాబూజీ, వాటన్నింటి పుట్టుక మరియు ముగింపు 'మాలిక్'లోనే ఉన్నాయని నాకు అనిపిస్తుంది. అది ఎంతవరకు అంటే, నేను స్వయంగా 'అతని' దానిగానే అయిపోయాను. అది తప్పు కాదనుకుంటాను. అయినప్పటికి నేనింకా 'అతని'లోనే కలిసిపోవాలని, 'అతని'లోనే కరిగిపోవాలని నాకు అనిపిస్తూ ఉంటుంది. 'మాలిక్' కృపతో నేను ఈ విషయంలో తప్పకుండా సఫలీకృతురాలవుతాను. నేను 'అతడి'ని పూర్తిగా నాలో లయం చేసుకోవాలని, నాలోనే నిలుపుకోవాలనీ, అందుకొరకే మరణించాలని నేను 'మాలిక్'ను వేడుకుంటున్నాను, కోరుకుంటున్నాను. నాకైతే ఏది కావలసి ఉందో అది అక్కడ నుండే, 'అతని' నుండే లభిస్తుంది, ఎందుకంటే, నేను అన్ని హద్దులు దాటి వారి హద్దుకు చేరిపోవటంవల్లనే. బాబూజీ, ఇప్పుడు నా హృదయం యొక్క పరిస్థితి ఎలా ఉందంటే, దానిని నేను వేరుగా ఉంది అని చెప్పలేకుండా, అది తెరచుకొని, విస్తరించి నాలో ఒకటిగా అయిపోయింది. ఇది చూస్తే తెలిసేదే కాని, చెప్పితే తెలిసేది కాదు. అదేమిటో మాలిక్‌కే తెలుస్తుంది. నా హృదయం ఎంత లోతుగా అయిపోయింది అంటే, దాని లోతు చెప్పరానంతగా అయిపోయింది. పూజ్యశ్రీ బాబూజీ, ఈ స్థితి ఏమిటోగాని, దీనిలో నాకు బదులుగా ఒక అనంత మైదానం ఉన్నట్లుగాను, దానిలో ప్రేమ, భక్తి, మరేమీ లేనట్లు ఉంది. ఒక్కొక్కసారి అయితే ప్రతిదాని యొక్క

ఆవిర్భావం, అంతం లేదా ఉత్పత్తి మరియు నశింపు 'మాలిక్' యొక్క ఈ సేవకురాలి ద్వారానే జరుగుతున్నట్లు అనిపిస్తుంది. అదేమిటో తమకే తెలియాలి. నాకు మాత్రం నా మాలిక్‌తోనే పని ఉంది. మిగిలిన విషయం 'తమకే' తెలియాలి. దానిని తమ అభీష్టానికే విడిచి పెట్టున్నాను.

పూజ్యశ్రీ బాబూజీ! తరచుగా నాకు దాహం ఎంతగా పెరిగిపోతుంది అంటే, ఏది దొరికితే అది త్రాగివేయాలని అనిపిస్తుంది. దాని మూలంగా తరచుగా నాకు ఏమనిపిస్తుంది అంటే, విశాల మైదానాన్ని కూడా సముద్రాన్ని త్రాగినట్లుగానే నేను త్రాగేస్తున్నానేమోనని అనిపిస్తుంది. ఎప్పుడైతే కొంత అలసట అనుభవమవుతుందో అప్పుడు దాహార్తి కూడా కొంత మందగిస్తుంది, అలసట తొలగినంతనే మళ్ళీ అంతులేని దాహార్తి కలుగుతుంది. ప్రస్తుతం హృదయం యొక్క పరిస్థితి ఏమిటో ఆ దైవానికి తెలియాలి, ఎందుకంటే, ప్రతిక్షణం నాకు విలపించాలనిపిస్తుంది, అరవాలనిపిస్తుంది. అది ఏమిటో తమకే తెలియాలి.

అమ్మగారు తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 274

లఖీంపుర్,

30.01.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న హరి తాతగారు వచ్చారు, వారి ద్వారా తమ సమాచారం తెలుసుకొని సంతోషించాను. తమరు 'స్వాగత్' రూపంలో పంపిన 5 రూపాయలు అందాయి. గురు సందేశంగా తమరు పంపిన కరపత్రం కూడా అందింది. ముద్రణలో కొన్ని తప్పులు దొర్లాయి, వాటిని సవరించినట్లయితే, ఆ విషయం మాకేకాదు సమస్త మానవాళికి ఒక అమూల్యమైనదిగా ఉంటుంది. అది చదవటానికి, అర్థం చేసుకొనటానికి సులభంగా ఉండటమే కాకుండా చాలా ఉత్తమంగా ఉంది.

శ్రీ బాబూజీ! ఏ 'ఫకీరు' ఏది ఇచ్చినా దానిని తిరిగి ఇవ్వకూడదు. ఎందుకంటే, అందులో విషయమే కాకుండా ఇంకా ఏదో మిళితమై ఉంటుంది అని తమరు వ్రాశారు. నా బాబూజీ! దానిలో అదనంగా ఏదైతే ఉందో దానిని నేను గ్రహించాను. 'ఫకీర్' యొక్క వస్తువు అనగా కానుక, ఆశీస్సుల రూపంలో ఉన్నది నా శిరస్సుపై సర్వదా ఉంటూనే ఉన్నది. ఎందుకంటే, నా ఆధ్యాత్మిక ఉన్నతికి, ఆ ఆశీస్సులు ఏవైతే ఉన్నాయో, ఏవైతే 'వారి'విగా ఉన్నాయో అవి 'వారి' అపార కృపకు కారణంగా ఉన్నాయి. ఓ నా 'మాలిక్', నేను తమరు అందించిన వస్తువును నా శిరస్సున దాల్చుకున్నాను. అమ్మగారు చెప్తున్నారు – ఎంతో కాలంగా ఇటువంటి ముత్యాలే సమీకరించబడ్డాయి, వాటిని కూర్చి 'తమకు' కూడా ఇవ్వటం జరిగింది. అందులో విశేషం ఏముంది. నాకైతే తమరు నావారే. వాటిని ఇంకెవ్వరికైనా ఇచ్చి ఉంటే, అది ఎలా ఉండేది. **కుటుంబంలో వస్తువులు ధనరూపంలో ఇవ్వబడవు, ప్రేమతో మాత్రమే ఇవ్వబడతాయి. వాటిని ప్రేమయే వితరణ చేస్తుంది, ప్రేమయే స్వీకరిస్తుంది. కనుక ఇంక డబ్బు ప్రస్తావనే లేదు**– అని.

నా లేఖలు తమకు చేరి ఉంటాయనుకుంటాను. తమరు చెప్పిన విధంగా క్రమక్రమంగా వ్రాయనారంభిస్తాను. "ఇందులో అమ్మాయిల డబ్బేమీ ఖర్చు కాలేదు, అదంతా నాది. కనుక నాకు కూడా దానిమీద హక్కు ఉంది" అని అమ్మగారు అంటున్నారు. 'మాలిక్' దయతో ఏర్పడిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, గతంలో నేను తమకు "ఇప్పుడు అదృశ్యంగా ఉన్నది (భగవంతుడ్ని) కూడా చూస్తున్నాను" అని వ్రాశాను. అయితే 'మాలిక్' కృపతో ఇప్పుడు ఉన్న స్థితిలో స్వయంగా నేను కూడా సర్వాంతర్యామి (Omnipresent)గా అయిపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఆ సర్వ ఉనికియే (Omnipresence) నా నివాసంగా అయి పోయింది. "నాకు బదులుగా అనంత మైదానమే ఉన్నట్లు అనిపిస్తోంది" అని నేను గతంలో తమకు తెలియజేసాను. అదేమిటో ఆ దైవానికే తెలియాలి కాని ఇప్పుడైతే ఆ అనంత మైదానం కూడా కనబడకుండా ఉంది. ఇప్పుడది ఇంక ఎక్కడా లేకుండా అది నాలోనే విలీనమైపోయినట్లు అనిపిస్తోంది. ఇంకా చెప్పాలంటే, అది కూడా నాలాగానే ఆ సర్వాంతర్యామి (Omnipresent) అయి నాలో అదృశ్యమైపోయినట్లు ఉంది.

**నా బాబూజీ! అది ఏమిటో తెలియదు కాని, నాలోని ఆంతరికమైన బాధ, తపన ఎంతగా ఉంది అంటే, అందుకు బాహ్య చికిత్సలు నిరుపయోగం అన్నట్లు అనిపిస్తోంది. దానిని నివారించటానికి ప్రేమ కూడా పనిచేయనట్లు ఉంది. నీళ్ళు త్రాగినా కూడా ఆ దప్పిక తీరదని అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడైతే ఆ అదృశ్యమైనదానిలోనే నేను కూడా కలిసిపోయి ఆ (Omnipresent) సర్వాంతర్యామిలో అదృశ్యమైపోయినట్లు అనిపిస్తుంది.**

**తేదీ 2.02.1953:** నా పరమ పూజ్యులు బాబూజీ, ఈరోజు నాలో కలిగిన స్థితి గురించి కూడా వ్రాస్తున్నాను.

నా సూక్ష్మ శరీరం కూడా కరిగిపోయి ఆ అనంత మైదానంలాగానే అయిపోయినట్లు అనిపిస్తుంది. అది ఏమిటో నాకు తెలియదు. దాని ఉనికి లేకపోవటమే కాకుండా, దాని అణువణువూ కరిగిపోయి 'మాలిక్'లో మిళితమైపోయి, తను కూడా వానిలో ఒకటిగా అయిపోయినట్లు ఉంది. ఇప్పుడు నా దృష్టి ఎలా ఉంది అంటే, అది ఆ సర్వాంతర్యామి (Omnipresent) భగవంతుడ్ని కూడా ఛేదించుకుని దానికిమించి ఉన్న దానిని దర్శించటానికి ప్రయత్నిస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 275

షాజహాన్‌పూర్,

04.02.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు 27, 30 జనవరి మరియు 2 ఫిబ్రవరి 1953వ తేదీలతో వ్రాసినవి చేరాయి. నీవు బసంత్‌పంచమి ఉత్సవ సందర్భంగా ఇక్కడికి వచ్చినపుడు, 18 జనవరి ఉదయం నేను నిన్ను 'K' స్థానానికి చేర్చాను. ఈ స్థితులు అన్నీ దానికి చెందినవే. నీవు వ్రాసినటువంటి స్థితులు అన్నీ లయ-అవస్థ యొక్క ఉన్నతిని గురించి తెలుపుతున్నాయి. ఇంకా పురోగతి చెందాలనే ఆతృత ఎప్పుడూ నీకు ఉంటున్నందుకు నాకు సంతోషాన్ని కలిగిస్తోంది, మరైతే ఈ ఉన్నతిని పొందటానికి నీవే బాధ్యురాలవు. చెప్పటానికి అయితే ఈ ఉన్నతి నా వల్లనే అని చెప్పవచ్చును కాని ఆ విధంగా **ముందుకు కదంతొక్కడానికిగల సామర్థ్యం, సాహసం నీదే.** దానిని నా సామర్థ్యంగా భావించినట్లయితే, దానితో ఇప్పటికి సోదర అభ్యాసులందరూ ఉన్నతి యొక్క శిఖరాగ్రానికి చేరి ఉండేవారు. ఈ విధంగా పురోగమించటానికి నేను కొద్దిగా సహాయం అందిస్తాను కాని దీనిని నా యోగ్యత లేదా సామర్థ్యంగా చెప్పటం తగదు. ఎందుకంటే, **నీ సామర్థ్యం, యోగ్యత, నీవు పురోగమనం సాధించటానికి నన్ను వత్తిడి చేస్తున్నాయి.** ఈ విధంగా ముందుకు నడిపించటానికి దోహదం చేయటం కూడా నా మూలంగానే అని నీవు భావించినట్లయితే అది కూడా సమంజసం కాదు. ఎందుకంటే, ఇప్పుడు నేను నేనుగా కాకుండా ఎవ్వరో 'వారే' (లాలాజీ సాహెబ్) నిన్ను గమ్యం చేరటానికి తోడ్పడుతున్నారు.

నీవు తరచుగా "శరీరం క్రమంగా కరిగి ప్రవహిస్తోంది" అని వ్రాశావు. ఒక విషయం చెబుతాను, బహుశా అది దానికి సమాధానంగా సరితూగవచ్చు. అది ఏమిటో చూడు! **మనం హృదయపూర్వకంగాను, ప్రేమతోను అభ్యాసం చేస్తూ ఉంటే, గత ఆలోచనల యొక్క ప్రభావం ఏదైతే ఉందో, అది అంతా తొలగిపోతూ ఉండటంతోపాటు, పాత అణువులు రాలిపోతూ వాటి స్థానంలో పవిత్ర అణువులు ఏర్పడుతూ ఉంటాయి. ప్రతి భౌతికదేహధారి యొక్క అణువులు అతని ఆలోచనలను అనుసరించి పరివర్తనం చెందుతూ ఉంటాయి. ఎవ్వరైతే ఈశ్వరునివైపుగా ప్రేమపూర్వకంగా ముందుకు సాగుతారో అతనిలో ఆ విధమైన అనగా అటువంటి లక్షణాలు కలిగిన అణువులు ఏర్పడతాయి.**

**అసలైన ప్రేమ ఏమిటంటే, దైవాన్ని ప్రేమిస్తూ ప్రేమిస్తూ చివరకు ప్రేమ అనే విషయాన్నే మరచిపోవటం అవుతుంది. ఇటువంటి స్థితి కలిగినపుడు అభ్యాసీ ఆ అసలు అనగా సత్యత్వం (రియాలిటీ) లోకి ప్రవేశించటం ప్రారంభమవుతూ వినమ్రభావం ఏర్పడుతూ ఉంటుంది. ఇటువంటి స్థితిలోకాని, ఇంకా ఉన్నతస్థితిలోకాని ప్రవేశించిన భక్తులు –"బినా భక్తి తారో, తబ్ తారిబొ తిహారో హై" అనగా నా హృదయంలో భక్తి లేకుండానే నాకు ముక్తి కలిగించిట్లయితే అప్పుడు నీవు కీర్తించదగిన వాడవుతావు, అని పలుకుతారు.**

నీవు ఒకచోట "ప్రతిదీ 'మాలిక్' యొక్క సేవకురాలు నుంచే ఉత్పన్నమవుతూ, అంతమవుతూ ఉంది" అని వ్రాశావు. దాని అర్థం ఏమిటంటే, ఏ ప్రదేశం నుంచి అయితే సమస్తం ఉత్పన్నమవుతూ ఉందో ఆ ప్రదేశంలో నీవు అడుగుపెట్టావన్న మాట. నేను ఏదో ఒక సందర్భంలో నీవు హిరణ్యగర్భస్థితిలో ఉన్నావు అని కాని లేదా అది కలగబోతున్నది అనికాని వ్రాశాను, అయితే అది జ్ఞాపకం లేదు. నా అంచనా ప్రకారం ఆ స్థితి ప్రారంభమైంది కాని ఇంకా పరిపూర్ణస్థితిలోకి రాలేదు. దీనిని మరొక విధంగా చెప్పాలంటే నీవు ఆ హిరణ్యగర్భస్థితిలో ఒక పాదం మోపావు అని అనవచ్చు. నేను ఇప్పుడు ఈ స్థితిలో నిన్ను లయం చేస్తాను లేదా నిన్ను 'K' స్థానం నుంచి 'L' స్థానానికి చేర్చుతాను. నీ స్థితిని నిశితంగా పరిశీలన చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటాను. ఈ రెండింటిని గురించి ఇంకా ఆలోచన చేయలేదు. బహుశా 'L' పాయింట్‌కు చేర్చటమే సంభవించవచ్చు. అది ఎప్పుడు? ప్రస్తుత స్థావరంలో నీ ప్రయాణం ముగిసినట్లు నేను చూసిన తర్వాతనే నీ ప్రయాణం త్వరత్వరగా కొనసాగేటట్లు చేస్తాను. నిస్సందేహంగా నేను నీ యాత్రకు సహాయం చేస్తుంటాను.

'గురు సందేశం'ను ('Voice Real' లో నా మాస్టర్ సందేశంకు సంబంధించినది) సరిదిద్దే సందర్భంగా ఎటువంటి తప్పు చేయకుండా జాగ్రత్త వహించాలి. ప్రతి విషయంలోను నా తొందరపాటు వలన పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. నా 'అలవాటు' మాత్రం తొలగిపోవటం లేదు. సవరించిన ప్రతి ఒక్క దానిని శ్యామ్‌పతిగార్కి పంపించగోరతాను. అమ్మగార్కి ప్రణామం.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 276

లఖీంపుర్,

8.02.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్న మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా అందింది. చదివి చాలా సంతోషించాను. పెద్దసోదరునికి నిన్న జ్వరం బాగా పెరిగి వారి ఆరోగ్యం చాలా వ్యాకులపరచింది. 4,5 రోజులు ఛాతీమీద, వీపుమీద బొబ్బలు లేచాయి. భగవంతుని దయవలన జ్వరం 99 డిగ్రీలకు తగ్గటం వలన

విచారించాల్సిన అవుసరం లేదు. మాస్టర్ సాహెబ్ ఉత్తరంలోని విషయాలను విని నాకు కొంత విచారం కలిగింది. నిజానికి ఇటువంటి 'మాలిక్'ను పొంది మేమంతా ఆనందంలో పరవశమై స్పృహ కోల్పోయాము. **చెప్పటానికి అందరూ "బాబూజీ అన్నీ సరిచేస్తారు" అని అంటారు కాని మేము ఆ మాటలను మా చేతల్లోనూ, వ్యవహారంలోనూ నిజంగా పాటించినట్లయితే ఇంకా ఎంతో బాగుంటుంది కదా! వాస్తవం ఏమిటంటే, తమరు చెప్పినట్లుగా అభ్యాసులమైన మేము మీతో పూర్తిగా సహకరించలేకపోతున్నాము.**

పూజ్య శ్రీ బాబూజీ, తమరు "మీ ఉన్నతికి మీరే బాధ్యులు" అని వ్రాశారు. అది వాస్తవమే కావచ్చు, ఎందుకంటే తమరు నాపట్ల కలిగి ఉన్న ప్రేమను నేను కూడా కలిగి ఉన్నట్లయితే ఎంతో బాగుంటుంది అని నేను చెప్పగలను. తమరు చెప్పేదంతా బాగానే ఉంది. నేనయితే మాలిక్ యొక్క ప్రేమ, వారి అత్యంత ఆకర్షణ నన్ను అప్రయత్నంగా వారివైపుకే గుంజుకుపోతున్నాయి. ఇది ఎవ్వరి యోగ్యతో తమరే నిర్ణయించాలి. వాస్తవం ఏమిటంటే, తమరు ఇటువంటి వాటిని వ్రాసి నాకు శిక్షణ నిస్తున్నారు. "నాదేమీ లేదు, ఇంకెవ్వరైతే ఉన్నారో (అనగా లాలాజీ సాహెబ్) వారే నిన్ను పురోగమింపజేస్తున్నారు" అన్న మీ మాటల్లో ఎన్ని ముత్యాలు కూర్చబడ్డాయో కదా! మాలిక్ దయతో ఈ ఉపదేశ ఫలితాన్ని నేను ఎన్నటికైనా పొందగలనా? ఏదైనా కానివ్వండి, నేను మాత్రం 'అతని'కే అర్పితమైపోయాను. ఏదైనా 'అతని' ఇష్టానుసారమే జరుగుతుంది. నేను మాత్రం 'అతడి'నే కోరతాను, నాకు 'అతని'తోనే పని. నా బాబూజీ, నా హృదయం ఏమి చెబుతోంది అంటే, ఎవ్వరైతే (అనగా శ్రీ లాలాజీ మహరాజ్) ఈ జగతికి ఇటువంటి అమూల్య రత్నాన్ని ప్రసాదించారో వారే (లాలాజీ మహరాజ్) మాకు ఆ 'మాలిక్'ను దర్శించుకుని ప్రేమించునటువంటి దృష్టిని సమకూర్చుతారు, అని. **ప్రాపంచిక వ్యామోహంతో పూర్తిగా మసకబారిన దృష్టితో ఉన్న జనుల యొక్క కళ్ళు శుభ్రపడి 'మాలిక్'ను చూడగలిగే రోజు తప్పక వస్తుంది. అటువంటి రోజు ఇంక ఎంతో దూరం లేదు.**

'గురు సందేశ్'ను సవరించటానికి నేను శక్తివంచన లేకుండా ప్రయత్నించాను. **దయచేసి నన్ను వేగిరపరచే అలవాటును తమరు విడనాడకండి. తమరు వేగవంతంచేసే ఈ స్వభావం ఎటువంటి అద్భుతాలు సృష్టిస్తుందో, ఎటువంటి వరాలు ఇస్తుందో, మానవాళిని ఎలా పరివర్తనం చేస్తుందో ఆ భగవంతునికే తెలియాలి.** నేను రేపుగాని, ఎల్లుండిగాని దీని ప్రతిని (ప్రూఫ్‌ని) తప్పకుండా రామ్‌ప్రసాద్‌గారికి పంపిస్తాను. "ఇది బ్రహ్మగతి దశ, దీని తర్వాత హిరణ్యగర్భ దశ" అని తమరు ముందుగా వ్రాశారు. ఇప్పుడు నేను నా ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎటువంటిది అంటే, నా దృష్టి (Omnipresent) సర్వవ్యాపకమైన దానిని కూడా ఛేదించుకుని ఆవల ఉన్నదానిని చూడటానికి ప్రయత్నిస్తోంది. ఈ స్థితిలో నీటి ఉపరితలంలాగా కనిపిస్తోంది. ఏ సమయంలోనైనా దృష్టి తీవ్రమైనా లేదా ఒక విధమైన అసహ్యంగా అనిపించినా, అప్పుడు అసహనంగా ఉంటుంది. కాని ఎవరైతే కేవలం 'మాలిక్' కొరకేనని జీవిస్తుంటారో, అటువంటి వానికి ఇంకెవరితో మాత్రం ఏమి పని ఉంటుంది. నేను 'మాలిక్' నుంచి దీనినే తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాను. ఆపైన తమకే తెలియాలి. అయితే ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించినంతవరకు వేగంతో పనిలేదు. బాబూజీ! ఇప్పుడు తమ కృపతో గడ్డిపోచ చాటునుంచి పర్వతం కనిపిస్తోంది. ఇప్పుడు నా ఆంతరికంలో ఎటువంటి ఆనందం అనుభవిస్తున్నాను అంటే, దానిలో దాని యొక్క భారం ఎంతమాత్రం లేదు. బహుశా ఆ ఆనందం స్వయంగా నాలో ఉండటమే కారణమై ఉండవచ్చు.

ఇప్పుడు ఎలా ఉంది అంటే, నేను తలచినప్పుడు నాకు బదులుగా మాలిక్ మాత్రమే అనుభవమవుతున్నాడు. 'అతడు' మాత్రమే నా అనుభూతిలో నిలిచిపోతున్నాడు. నా పరమప్రియ బాబూజీ, నేను ఇంతకుపూర్వం ప్రతిపనీ దానంతట అదే జరిగిపోతున్నది అని వ్రాస్తూ ఉండేదానిని, కాని ఇప్పుడైతే అది ఏమిటో దైవానికే తెలియాలి కాని ఏమీ చెప్పలేకపోతున్నాను. ఎందుకంటే, అసలు ఏ పనితోను నాకు సంబంధం లేదు అని అనుకోవటంవల్లనేమో.

దీనిని గురించి నాకు ఏమీ తెలియనట్లు ఉంది. నా దృష్టి నుంచి, ఇదంతా ఎందుకు కనుమరుగైపోయిందో తెలియటం లేదు. ఇప్పుడింక ఉన్నది ఏమిటో ఆ దైవానికే తెలియాలి. నా స్థితి ఎలా ఉంది అంటే, ఏదైనా వస్తువును పోగొట్టుకున్నట్లయితే, కొన్ని రోజులు తర్వాత కూడా దాని జ్ఞాపకం రానట్లు ఉంది. "మాలిక్ గురించి చింతనయే నా నివాసంగా అయిపోయిందని, ఇంకా చెప్పాలంటే, నేను మాలిక్ గురించి తలచుకున్నప్పుడు అందులోనే నేను ఉన్నట్లు అనిపించినప్పటికీ, ఇప్పుడు అలా అనిపించటం లేదని, అయినా కాని ఎక్కడో అక్కడ అతని గురించిన దృష్టి ఉంటోంది" అని గతంలో నేను వ్రాస్తూ ఉండే దానిని. బాబూజీ, ఇప్పుడైతే ఆ దశగాని, దాని దృష్టిగాని అకస్మాత్తుగా ఎలా మాయమైపోయాయో అర్థం కావటం లేదు. నన్ను ఇప్పుడు ఆ బంధనాలతో ఎంత మాత్రం సంబంధం లేకుండా దైవం నన్ను విముక్తం చేసి ఉంటాడని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో అదంతా కరిగిపోయి, సమసిపోయినట్లు అనిపిస్తోంది. నేను చెప్పనలవికానంతగా ఎందుకు వినమ్రురాలనైపోయానో తెలియటం లేదు, కాని ఈ స్థితిలో పవిత్రతయే పూర్తిగా నెలకొని ఉంది. నా 'మాలిక్' గురించి చెప్పాలంటే, 'అతడు' సూక్ష్మంగాను, తేలికగాను అయిపోయి కళ్ళలోనే ఒక చిత్రం గీసినట్లు నిలిచిపోయారు. ఇప్పుడైతే నేను పూజచేస్తూ ఉన్నాను, కాని పూజ చేస్తున్న మనిషిగా నేను కనిపించటం లేదు. ఈ స్థితి నేను ఇదివరకు వ్రాసినట్లు ఉంది. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 277

లఖీంపుర్,

14.02.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉంటుందని ఆశిస్తున్నాను. తమకు పోస్టుకార్డ్‌లో వ్రాసిన దాని ప్రకారం నన్ను 'L' పాయింట్ వద్దకు తమరు చేర్చినట్లు అర్థం చేసుకున్నాను. అందుకుగాను, అనేకానేక ధన్యవాదాలు. అలాగే మాస్టర్ సాహెబ్‌కు కూడా కలిగిన స్థితికి 'మాలిక్'కు హృదయపూర్వక ధన్యవాదాలు అర్పిస్తున్నాను. నిన్న వారి ఇంట అందుకు ధన్యవాదపూర్వకంగా ప్రసాదం కూడా నివేదించబడింది. అయితే, బాబూజీ నన్ను ఇన్ని పాయింట్లు దాటించారు కదా! అయినా కాని నాకు ఆ విషయమే తట్టలేదు. ఒకవేళ అది దృష్టికి వచ్చినా కూడా అమ్మ మరియు పెదనాన్నగార్లకు భారం పడకూడదని వారితో చెప్పను కూడా చెప్పలేదు. ఇంకొక విషయం ఏమిటంటే, నేను మాలిక్‌కు సర్వదా నా శక్తివంచన లేకుండా నా హృదయం అనే ప్రసాదాన్ని మాలిక్‌కు నివేదించించటంలోనే నిమగ్నమై ఉంటున్నాను కనుక ఈ విషయంమీద ఎక్కువగా దృష్టిపెట్టి ఉండకపోవచ్చు. నేను విన్న దానినిబట్టి, **ప్రసాదం ఏది నివేదించినా, అందులోని ప్రేమ మాధుర్యం ఎంతగా ఉంటుందో అదే నా మాలిక్‌కు ఇష్టమవుతుంది.** ఇంకా నాకు తెలిసింది ఏమిటంటే, మన సత్సంగీయుల ప్రేమ మాధుర్యం మాత్రమే మాలిక్‌కు ఇష్టప్రదమని కూడ. ఇందులో ఏది సరైనదో తమకే తెలియాలి.

పూజ్యశ్రీ బాబూజీ, నేను కూడా నా గుడెసె (నివాసం)ను కూల్చుకునే ప్రయత్నంలోనే ఉన్నాను. ఎందుకంటే, వేసవిలో ఎడతెగకుండా కురిసే తుషారమే హాయిగొల్పుతుంది కనుక. (అనగా నేను ఎల్లప్పుడూ నా అహం యొక్క బంధనాన్ని తెంచుకోవటానికే ప్రయత్నిస్తాను. ఎందుకంటే, నిదానంగా నయినా నిరంతరం ప్రవహించే ప్రాణాహుతియే నాకు ఇష్టం కనుక.) ఏమైనాగాని 'మాలిక్' అభీష్టంమేరకే జరుగుతుంది.

'మాలిక్' దయతో ఇప్పుడు నా దశ ఎలా ఉంది అంటే, నేను గతంలో వ్రాసినట్లు 'అతడు' సూక్ష్మమై ఉండి నా కన్నులలో ఒక స్వాభావిక చిత్రపటంలాగా చిత్రమైపోయి ఉంటున్నట్లు అనిపిస్తుంది. అయితే ఇప్పుడు ఆ దృష్టి అంతరించిపోయినట్లు అనిపిస్తోంది. బాబూజీ, ఇంక ఇప్పుడు మిగిలి ఉన్నది ఏమిటో తమకే తెలియాలి.

"నేను ప్రేమకు తనఖా పెట్టబడతాను" అని తమరు తమ పోస్టుకార్డ్‌లో వ్రాసినది, ఆ తర్వాత ఇంకా "నేను అమ్ముడైపోతాను" అని వ్రాసినది అప్పుడప్పుడు తమరు నాకు రాత్రిపూట కలలో చెప్తున్నట్లు అనిపిస్తోంది. ఇది తరచుగా అనుభవమవుతోంది. ఇటీవల నేను చాలా సోమరిగా ఉంటున్నానేమోనని అనిపిస్తోంది. అది ఏమిటో మాలిక్‌కే తెలియాలి. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 278

షాజహాన్‌పూర్,

22.02.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. 8 మరియ 14 ఫిబ్రవరి 1953వ తేదీలతో ఉన్న నీ ఉత్తరాలు చేరాయి. ఈ సూక్ష్మస్థితుల గురించి జవాబు వ్రాయటం కష్టతరమే. నీకు కలిగిన స్థితికి ధన్యవాదాలు తెలపటంతప్ప ఇంక వ్రాయాల్సింది ఏమి ఉంటుంది! 'ప్రసాదం' నివేదించటం తప్పనిసరి కాదు కాని, ఎవ్వరైనా కావాలనుకుంటే నాకు అభ్యంతరం కాదు. **నిజమైన జిజ్ఞాస కలిగిన అభ్యాసులు ఎవ్వరూ దొరకటం లేదు. అలా సంభవించి ఉంటే నేను అమితానందం పొందేవాడిని. జనం శ్రమించి ఇటువంటి స్థితులు సాధించాలని అనుకోరు. వారు తలిస్తే ఎంతోకొంత పొందగలుగుతారు. చాలా విషయాలు (ఆధ్యాత్మిక రహస్యాలు) నాతోనే పోతాయని నాకు అనిపిస్తోంది. అయినప్పటికీ అభ్యాసులకు ఎంతోకొంత బలవంతంగా కూర్చుతున్నాను. సాధకునిలో ఏదో ఒక స్థితి యొక్క అనుభవం కలిగినపుడు, అతడు దానిని ఇతరులకు ఉన్నతి కలిగించటానికి ప్రయోగించే అవకాశం ఉంటుంది. ఇటువంటి ప్రతిష్ఠాత్మకమైన స్థితులు ఎన్నో నా ఆలోచనలో ఉన్నాయి. ఎన్నో పాయింట్లు (స్థానాలు) నా దృష్టిలో ఉండటమే కాకుండా ముమ్ముందు ఇంకా పరిశోధన జరుగుతూనే ఉంటుంది. వాటిలో కనీసం ఒకటి-అర పాయింట్లను సాధించటానికి కూడా ఎవ్వరికీ సామర్థ్యం లేకుండా పోతోంది. ప్రతి అభ్యాసీ, ప్రతి పాయింట్ యొక్క స్థితిని అనుభూతి చెందాలని నేను కోరుకుంటాను. ఇంకొక విషయం ఏమిటంటే, నేను బ్రహ్మవిద్యను పూర్తిగా ఇవ్వడానికి ఆరాటపడుతూ ఉంటాను. అభ్యాసీ తనకు ఇవ్వబడిన ఈ విద్యను కొంతలో కొంతగానైనా జీర్ణించుకుంటే అది ఇతరులకు అందించబడుతుంది. "ఈమేరకు అభ్యసించేవారు చాలా అరుదుగా కనపడతారు" అని లాలాజీ సాహెబ్ కూడా నాతో చెప్పారు. ఏది ఏమైనా అలాంటి ఆసక్తి ఉన్న అభ్యాసీ దొరికితే బాగుంటుంది. సాధారణంగా అభ్యాసులు తాము ఆంతరికంగా ఏమీ అనుభూతి చెందలేకపోతున్నామని అంటారు. అటువంటి వారిని "మీరు ఎప్పుడైనా అనుభూతి చెందటానికి ప్రయత్నించారా, మీకు కలిగిన స్థితిలోకి ఎప్పుడైనా బాగా లోతుగా వెళ్ళారా?" అని ప్రశ్నించండి. దానికి వారు ఇచ్చే సమాధానం, తమకు అంత సామర్థ్యం లేకపోయింది, అని. ఇది చాలా తప్పుగా భావిస్తాను. ఈ సామర్థ్యం ప్రతి ఒక్కరిలోను ఉంది. ఎందుకంటే, బ్రహ్మవిద్యలో మేధస్సు వికసిస్తూ ఉంటుంది. కాని దానిని మరోవైపుగా మరలిస్తే ఫలితం ఏమి ఉంటుంది. దీనిని బాగా యోచిస్తే అర్థమయ్యింది ఏమిటంటే, ఆలోచన మరియు అనుభూతి చెందటానికి కలిగిన సమర్థతను అభ్యాసులు ప్రాపంచిక విషయాలవైపు మరలించుతారు. దాని ఫలితం ఏమిటంటే, ప్రాపంచిక విషయాలపట్ల వైరాగ్యం చెందవలసిందిపోయి, దానిపట్ల అనురాగం ఏర్పడుతుంది. నేను ఈ జవాబు వ్రాయిస్తున్న సమయంలో ఇప్పుడే నాకు ఈ లోపం స్ఫురించింది, ఇది వాస్తవం కూడా. ఈ వైరాగ్యస్థితిని జిజ్ఞాసువు అనగా అభ్యాసీ తనలో అలవర్చుకున్న తర్వాతనే ఈ అమూల్యరత్నాన్ని ప్రసాదించాలని, మహాత్ములు వెలువరించిన అభిప్రాయం చాలా విలువైంది. జనం వీటిని విడిచిపెట్టాలని అనుకోకుండా, కేవలం నేను చెప్పేది వినడానికి వచ్చి నావద్ద అభ్యాసం ప్రారంభిస్తారు. నాకు ఇది తెలియకపోలేదు, అయినా ఎంతో కొంత ప్రయోజనం ఉండకపోతుందా అని**

**వారికోసం శ్రమచేయటం నా కర్తవ్యంగా భావిస్తాను. అంతేకాదు, నాకు ఇవ్వబడిన ఆజ్ఞ కూడా ఇదే.**

**అభ్యాసులు తమ దృష్టిని పూర్తిగా దైవంవైపు సారిస్తే వైరాగ్యం సహజసిద్ధంగాను, సునాయాసంగాను సిద్ధిస్తుంది. నేనయితే వారి దృష్టిని ఈశ్వరునివైపు మళ్ళించటానికి, దృష్టిని నిలకడగా ఉంచటానికి తప్పక కృషిచేస్తాను. అలా జరుగుతుంది కూడ. కాని ఆ దీక్షను వారి భౌతిక విషయాలవైపు మరలించటం మూలంగా ఫలితం దక్కదు. ఒకసారి నేను పైకి అనగా ఈశ్వరునిపైపు మరల్చిన అభ్యాసీ మనస్సు క్రిందికి (భౌతికంగా) మరలకుండా ఉంటుందని నా గురుమహరాజ్ (లాలాజీ సాహెబ్) కృపతో నాకు ఉన్న విశ్వాసం. ప్రాపంచిక విషయాలలో బాగా మునిగి తేలేవారికి, వారి మనస్సు పైకి నిలపాలని కోరుకుంటున్నప్పటికీ అది క్రిందికే మొగ్గటం 'వారి'కి బాధ కలిగిస్తుంది.**

**స్వామి వివేకానందుని సందేశం:** "ఇది చాలా విలువైన ఉత్తరం. నీవు వ్రాసినది అక్షరాలా నిజం, మానవులు దీనిని గురించి ఆలోచించాల్సి ఉంది. వైరాగ్యస్థితి ముందుగానే కలగాలి. వాస్తవానికి దీనిని పొందటం అభ్యాసీ యొక్క కర్తవ్యం."

నేను అస్థిత్వభావనా రహితస్థితిని (Negation) అభిమానిస్తాను. దీని ప్రత్యేకతను, వైశిష్ట్యాన్ని గురించి 'లేదు'కు బదులు 'ఉంది' అనడమే ఈ స్థితి అని చెప్పక తప్పదు. అటువంటి (Negation) అస్థిత్వభావనా రహితస్థితిని పొందిన వారు ఎవ్వరూ నా దృష్టికి రాలేదు. నా ఈ మాటను జనం అంగీకరించరు. ఎందుకంటే, నన్ను నేనే గుర్తించలేక పోయినపుడు ఇతరులు ఎలా గుర్తించగలరు అని. ఏది ఏమైనప్పటికి ఈ స్థితిని అనుభవింప జేయటంలో లాలాజీసాహెబ్ మాత్రమే తగినవారు. లాలాజీ సాహెబ్‌కి పూర్వం అటువంటి మహోన్నత శక్తిమంతులు నాకు తెలిసి ఇంక ఎవ్వరూ లేరు. మీకు విడమర్చి చెప్పాలంటే, ఇది పిట్ట కొంచెం కూత ఘనంలాగా అనిపిస్తుంది. గతంలో ఉన్న వారిని గురించి చెప్పాలంటే, ఉదాహరణకు కబీరు ఉన్నారు. ఆయన కూడా ఆ నెగేషన్ స్థితిని అనుభవించలేదు. ఆయనవద్ద మహిమాన్విత శక్తులు ఉన్నాయని మనం అంగీకరించటమేకాక ఆయన సమకాలీనకాలంలో ఆయనకు సాటివారు లేకపోయారు. తాను ఒక మహానుభావుడిగా ప్రభవించాడు. ఈ స్థితిని ఆస్వాదించటానికి అభ్యాసులు ఎవరైనా సిద్ధపడాలని అభిలాష చెందుతానుగాని వారు **అభ్యాసం ఆరంభించిననాటి నుంచే చాలా ఆలోచనలు వస్తున్నాయి అని ఫిర్యాదు చేయటంతోపాటు, వారు ఒంటరిగా (అనగా బాబూజీ ఎదుట లేకుండా) కూర్చున్నపుడు మనస్సు లగ్నం కావటంలేదని చెబుతుంటారు. వారిని ఎవ్వరైనా ఈ తప్పు ఎవరిది అని ప్రశ్నించినట్లయితే తప్పువారిదేనని అంటారు. దానికి నేను ఎలా బాధ్యుడనవుతాను. ఒకవేళ సిస్టమ్‌లో లోపం ఉన్నట్లయితే అది నా తప్పిదమవుతుంది. వారిలోని ఆలోచనలు అనే విషాన్ని హరించటానికి నేను ప్రయత్నిస్తూనే ఉంటాను. అది ఎలాగంటే, ఆలోచనలు వారిని ఇబ్బంది పెట్టకుండా ఉండాలని. మరైతే అటువంటి వారి ఆలోచనలు అనే విషాన్ని, వారిని గురించిన జ్ఞాపకమే నాకు కలగనపుడు నేను ఎలా తొలగించగలను. వారు నా సత్సంగ్‌లో ఉన్నవారై ఉంటే దానిని నా తప్పిదంగా ఆమోదించి వారికి సహాయపడటం నా విధిగా భావిస్తాను.**

ఈశ్వరానుగ్రహం వలన నీ ఇచ్ఛాశక్తి చాలా దృఢమైనదిగా ఉంది. ఈ విధమైన దృఢ విశ్వాసం బాలురులో ఉండదు. అవసరమనిపించితే నేను దానిని ఇంకా అభివృద్ధి చేస్తాను. నీ ఆధ్యాత్మిక ప్రగతితోపాటు నీ ఇచ్ఛాశక్తి కూడా దానంతట అదే వృద్ధి చెందుతోంది. పాయింట్ 'L' స్థితిని నేను ఇంకా పెంపొందిస్తాను. దాని యొక్క అనుభవం నీకు పూర్తిగా కలిగినట్లయితే నిన్ను ముందుకు నడిపిస్తాను. నీవు త్వరత్వరగా అనుభూతి చెందటానికి ప్రయత్నిస్తూ ఉంటే, నేను త్వరత్వరగా నిన్ను ముందుకు నడిపిస్తాను. ఇప్పుడు నిన్ను త్వరితంగా ముందుకు నడిపించలేకున్నందుకు దిగులుపడుతున్నాను. అమ్మకు ప్రణామం.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 279

లఖీంపుర్,

22.02.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కృపతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు చేరింది. దానిని చదివి నా తనువు మురిసిపోయింది. శరీరంలో తమ పని ఏదైనా చేయటానికి ఎంత శక్తి వచ్చింది అంటే, నేను చేయలేనిది ఏముంటుంది అన్నంతగా వచ్చింది. లాలాజీ సాహెబ్ యొక్క సందేశం (డిక్టేట్) నాలో ధైర్య సాహసాలను నింపింది. వారికి వేలకువేలుగా నా ధన్యవాదాలర్పిస్తున్నాను. "ఈ స్థితి యొక్క అనుభవాన్ని ఆనందిచటంలో శ్రీ లాలాజీగారిదే ప్రముఖపాత్రగా ఉంది. ఇంతకుపూర్వం ఇటువంటి నైపుణ్యం కలిగి ఉన్న వారెవ్వరూ లేరు" అని తమరు వ్రాసినది వాస్తవంగానే ఉంది. నేను కూడా ఈ స్థితి యొక్క ఆనందాన్ని అనుభవించగలిగిన ఇటువంటి నైపుణ్యం కలిగినవారు ఎవ్వరూ లేకపోయారు అని ఘంటాపథంగా చెబుతాను. పూజ్యశ్రీ బాబూజీ, నేను ఈ మాటలు కేవలం స్తుతిపూర్వకంగా కాకుండా అంతరాత్మ ప్రబోధంతోనే, అటువంటి మహానుభావుడు 'వీరే' అని చెబుతున్నాను. వాస్తవం చెప్పాలంటే, తమ యొక్క ప్రతిమాట, నా పురోగతికి ఒక్కొక్క మెట్టు ఎక్కటానికి బలాన్ని చేకూర్చుతున్నట్లు ఉంది. నాకు ఉన్న స్వల్పజ్ఞాన పరిధిలో ఈ ప్రపంచానికి చెందిన ప్రతిదానిలోనూ వైరాగ్యం అంటే వైరాగ్యమే నెలకొని ఉందని అనిపిస్తోంది. అది ఎప్పుడు? 'మాలిక్' యొక్క సౌందర్య రూపం అభ్యాసీ యొక్క కళ్ళలో స్థిరమైనప్పుడు లేదా 'అతని' మోహనరూపం అభ్యాసీ యొక్క దృష్టిని దోచుకున్నప్పుడు. నేను ఏం చేయను బాబూజీ! నాకు 'మాలిక్' కృపవల్లనే ప్రతి ఒక్క విషయం అవగాహనకు వస్తున్నాయి.

బాబూజీ, తమరు నన్ను ఎంత త్వరత్వరగా పురోగమింపచేస్తే నేను కూడా అంత వేగంగా పురోగమిస్తాను. తమరు తమ ఇష్టం వచ్చినట్లు చేయండి. నాకయితే 'అతడు' కావాలి. తపన, అవిశ్రాంతత నాలో ఉన్నాయో లేదో అని ఆలోచించేటంత తీరిక నాకు లేదు. ఎందుకంటే, గాయం లేకుండానే హృదయం బాధతో నిండిపోయిందని అనిపిస్తోంది. వాస్తవానికి అది బాధ వంటి బాధ కాదు. ఒక్కొక్కసారి ఏమనిపిస్తుంది అంటే, ఇది 'మాలిక్' యొక్క దశ మాత్రమే అని, అది నాలోని బాధల యొక్క ప్రతిబింబమే అని తెలుస్తోంది. నేను పూర్తిగా దీనిలో నిమగ్నమై ఉంటున్నాను. పూజ్య శ్రీ బాబూజీ, దశ అయితే ప్రతి పాయింట్ యొక్క అనుభూతితో స్పష్టంగానే ఉంటున్నది, కాని నేను తక్కువ విద్యావంతురాలను కావటం మూలంగానేమో కాని, నేను పూర్తిగా అనుభవంలో ఉన్న విషయాన్ని కూడా విశదంగా వివరించటంలో ఆలశ్యం జరుగుతోంది. అయితే నేను కూడా నా ఆధ్యాత్మిక యాత్ర కోసం త్వరపడుతున్నాను. నేను సంతృప్తి చెందలేకపోతున్నాను. ఇప్పుడు 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు నమ్రత అనేది నా శరీరంలో ఒక భాగంగాను, నేను దానిలోనే లయమైపోతున్నట్లుగాను అనిపిస్తోంది. బాబూజీ, నిజం చెప్పాలంటే అదే నన్ను లయం చేసుకుంటున్నదేమోనని అనిపిస్తోంది. అదేమిటోగాని ఒక విధమైన చల్లని ఉత్సాహమైన మబ్బులతో క్రమ్మి, నన్ను వినయంగా ఉంచుతోంది.

నా బాబూజీ, ఇప్పుడైతే దృష్టిపై ఉన్న పరదా పూర్తిగా తొలగిపోయి అంతా స్వచ్ఛంగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఏదో ఒక దశ నా దృష్టిలో ఎల్లప్పుడూ ఉంటున్నట్లుగాను, దానిని నేను ఎంత నిశితంగా పరిశీలిస్తే, అంతా స్పష్టంగా రూపుదిద్దుకుంటున్నట్లుగాను అనిపించటమే కాకుండా నేను అంతగా మాలిక్‌కు సామీప్యత చెందుతున్నాను. ఇప్పుడు ఈ స్థితిలో ఎలా అనుభవం అవుతున్నదంటే, నేను మామూలుగా గాని, కలలోనైనా గాని ఏదీ కోరుకోవటం లేదు. స్థితిలో సంచలనమైతే ఉంటుంది, అది బహుశా 'మాలిక్' కోసం కావచ్చు. హృదయం మాత్రం నీటి

ఉపరితలంలాగ నిశ్శబ్దంగా, నిశ్చలంగా ఉన్నట్లు ఉంటుంది. ఇది ఇలా ఉంటూ ఉండగానే స్థితి మాత్రం పురోగతి చెందుతుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఇంతకు పూర్వం చెప్పిన స్థితిలోకి నాకు నేనుగా నాకు తెలియకుండానే లయమై పోతున్నట్లు అనిపిస్తుంది. బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, 'అతని' కోసం అన్వేషిస్తూ అన్వేషిస్తూ నా హృదయాన్నే పోగొట్టుకోవటం వలన నాలోని కల్లోలాన్ని, అశాంతిని ఎక్కడ దాచాలో నాకు తెలియని పరిస్థితిగా ఉన్నది. ఇప్పుడైతే మాలిక్ యొక్క అవిశ్రాంతతే నాకు విశ్రాంతి చెందనివ్వటంలేదని, దాని మూలంగా నాకు నివసించటానికి సూది మొనంతైనా స్థలం లేకుండా పోయిందని అనిపిస్తోంది. అది ఎంతవరకు అంటే, ఏ ఆలోచన గురించి అయితే నేను వ్రాస్తూ ఉన్నానో, అది నాకు బదులుగా, నా ఆలోచనగా మాత్రమే ఉన్నటువంటిది ఇప్పుడు అంతర్ధానమై పోయింది. నా స్థితి ఏమిటో తమకే తెలియాలి. ఇప్పుడు నేను ఎక్కడి నుండి వచ్చానో అక్కడ నా అస్థిత్వం (ఉనికి) లయమైపోయినట్లుగాను, 'మాలిక్' నన్ను ముందడుగు వేయిస్తున్నట్లుగాను అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు నా గుడిసె (ఇల్లు), హుక్కా యొక్క నిప్పుతో కాలిపోయింది, హుక్కా ఘాటువాసనయే నాకు అనుభవమవుతోంది. అనగా నేను తమ యొక్క స్మరణలోనే మునిగిపోయాను, ఆ స్మరణతప్ప మరేమీ తెలియటంలేదు అని. ఇంకా ఏమిటో తమకే తెలియాలి.

బిట్టోకు 4 రోజుల నుంచి జ్వరం తీవ్రంగా ఉంది, చింతించాల్సిన పనిలేదు, 2,3 రోజుల్లో తగ్గిపోతుంది. కేసర్, చిన్నసోదరునికి కూడా జలుబు, దగ్గు ఉన్నాయి. అన్నీ ఒకటి రెండు రోజుల్లో సద్దుకుంటాయి.

నా బాబూజీ, నేను మాలిక్‌ను పొందిన తర్వాతనే విశ్రాంతినిగాని, తృప్తినిగాని పదహారు అణాలుగా గాని, పదిహేడు ఆణాలుగా గాని (అనగా నూటికి నూరు శాతం లేదా నూటికి నూట ఒక్క శాతం) అనుభవిస్తాను. నాకు 'ఇచ్చేవాడు' అనగా ఈశ్వరుడు వేయ్యేళ్ళు వర్థిల్లాలి. ఈ సృష్టి ఏర్పడిన తర్వాత ఆధ్యాత్మికతకు ఇదే యుగం, ఇదే కాలం ఉత్తమోత్తమం అని నేను చెప్పగలను. 'మాలిక్' దయతో ప్రస్తుత దశకుపైనున్న దశను తరచుగా స్పృశించగలుగుతున్నాను కాని, ఇంకా చేరుకోలేదని నాకు తెలుస్తోంది. నా ఇచ్ఛాశక్తి అభివృద్ధి చెందుతున్నట్లు తమరు వ్రాశారు. నేను కూడా 'అతడి' శక్తిపై సంపూర్ణ విశ్వాసం దృఢమవుతున్నట్లు అనుభూతి చెందుతున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 280

లఖీంపుర్,

26.02.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. తమకు కలిగిన శ్వాసకు సంబంధించిన ఇబ్బంది తొలగిపోయిందని భావిస్తున్నాను. బిట్టోకు జ్వరం తగ్గిపోయింది. మశూచి కూడా నివారణ అయ్యింది కాని, పుండ్లపై కొద్దిగా పెచ్చులున్నాయి, అవి కూడా 2,3 రోజుల్లో మానిపోతాయి. పెద్దసోదరుణ్ని, ఢిల్లీ నుంచి రోహన్ సాహెబ్‌గారు పిలిపించారు. ఇప్పుడింక 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ముందుకు కదిలే సాహసం బాగా ఎక్కువగా వచ్చింది. అదంతా కేవలం నా 'మాలిక్' దయ, 'వారి' అనుగ్రహంతోనే. 'మాలిక్' నన్ను దాదాపుగా అన్ని ప్రాపంచిక అనుభూతుల నుంచి తొలగించారని భావిస్తున్నాను. ఇంకా ఏమైనా ఉన్నాయి అంటే అందుకు కారణం నా శరీరం ఈ ప్రపంచంలో ఉండటంవల్లనే అనుకుంటాను. ఆ సంగతి ఏమిటో ఆ మాలిక్‌కే తెలియాలి. నేను వారి కృపతోనే ఈ విషయం చెప్పగలుగుతున్నాను. అది ఏమిటంటే, 'మాలిక్' నా యొక్క అన్ని రకాల కోరికలనుంచి విముక్తి కలిగించారు. అది ఎంతగానంటే, ఇంకా

ఏమైనా కోరిక నాలో మిగిలి ఉందేమో తెలియనంతగా, అవి నా గ్రహింపుకు అందనంతగా. నాలో ఇప్పుడు ఏమీలేవు, అది ఎందుకో 'అతని'కే తెలియాలి. 'అతని' ఇష్టానుసారం ఏమి చేయాలో అదే చేస్తాడు. ఒక మత్తుపదార్థం సేవించిన వానికి ఉన్న ప్రాపంచిక స్పృహ కంటే కూడా తక్కువగా ఇప్పుడు నాలో స్పృహ ఉన్నది. కాదు కాదు, 'అతడు' నాలో ఎంత స్పృహ ఉంచాలో అంతే స్పృహ బలవంతంగానైనా ఉంచాడని భావిస్తున్నాను. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, 'మాలిక్' నన్ను తన దివ్యదేశానికి తీసుకువెళ్ళుతూ మార్గంలో ఉన్న ప్రదేశాల్లోని స్థితులన్నింటినీ అనుభవింపజేస్తూ, త్వరత్వరగా తీసుకుని వెళ్తున్నారని అనిపిస్తోంది. ఇప్పుడు నా స్థితి, "మీ సంగతులు అన్నీ మీకు తెలుసు, నేను మాత్రం నా ప్రియుని దేశం వెళ్తున్నాను" అన్నట్లు ఉంది.

నా బాబూజీ, మాలిక్‌కు నా సంగతి అంతా తెలిసిపోయిందని అనిపిస్తోంది. అనగా నేను పూర్తిగా వారికి స్వాధీనమైపోయానని అనిపిస్తోంది. ఇప్పుడు నా ప్రవృత్తులన్నీ జాడ లేకుండాపోయినట్లు అనిపిస్తోంది. ప్రతిదీ నన్ను విడిచిపోయినట్లుగాను, అన్నీ మౌనం దాల్చినట్లుగాను అనిపిస్తోంది. బ్రహ్మాండం సమస్తం నాపట్ల మౌనంగా ఉన్నట్లు భావన కలుగుతోంది. అన్ని దిక్కులకూ నా కళ్ళు మూతపడ్డాయి. అన్నీ అన్నివైపులా నిశ్శబ్దంగా అయిపోయాయి. నేను 'అతని' దేశం వెళ్ళుతున్నట్లు చూసి దుఃఖభారంతో అన్ని పనులూ కట్టిపెట్టి మౌనంగా నిలబడ్డారా అన్నట్లు ఉంది. చాలా దూరం నన్ను కన్నులారా చూస్తూ ఉండగానే నేను కనుమరుగైపోయాను. మార్గమధ్యంలోని దేశాలన్నింటినీ (స్థితులు) చూసి వాటిల్లో విహరించి నేనిప్పుడు 'మాలిక్' దేశం (దివ్యదేశం) యొక్క సరిహద్దుకు చేరుకున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఇదే నా స్వంత గృహమని అనిపిస్తోంది. నాకు ఇంక ఎవ్వరితోనూ సంబంధం లేదు, బాబూజీ. ఇప్పుడిక్కడ నా స్థితి మూగవాని నోటిలో బెల్లంలాగా ఉంది. దానివలన అన్ని దిశలా అన్నీ మౌనంగా ఉన్నట్లు ఉంది. ఇప్పటి నా స్థితి ఇదే.

నా బాబూజీ, నా అంతరంగంలో లేదా ఆత్మలో తరచుగా ఎంత తేలికగా, సూక్ష్మంగా మరియు అమితమైన ఆనందం ఉంటుంది అంటే దానిని మాటలలో వివరించలేను. నేను మాత్రం 'అతని'కి ఇంకా సామీప్యత చెందిపోయాను. 'మాలిక్' కృపతో కనుక ఆ ఆనందం బ్రద్దలైనట్లయితే నా హృదయం పగిలిపోవచ్చు, నేను దానిలో కొట్టుకుపోవచ్చు. అయితే నా 'మాలిక్' యొక్క కృపా విషయం గురించి నాకు పూర్తిగా తెలుసు. 'అతడు' అలా జరగనివ్వకుండా, నన్ను తనలోకే ప్రవహించేటట్లు చేస్తాడు, నేను కూడా అతనిలోనికే తప్పకుండా ప్రవహించిపోతాను. అందువల్లనే 'అతడు' కట్టడిచేసి హృదయం పగలనివ్వడు సరికదా నేను కూడా అందుకే 'వారి'కే బంధించుకుని ఉండిపోయాను. నా హృదయమైతే 'అతని'లో లయం చేయటానికి బ్రద్దలు కావటానికే తపిస్తోంది. అలా ఎప్పుడు సంభవిస్తుందా అని నా మనస్సు వ్యాకులపడుతోంది. దృష్టి అంతరించిపోయింది, బుద్ధి మందగించిపోయింది. ఇంక ఉన్నది ఏమీలేదు; బాబూజీ, ఇంక ఉన్నది ఏదో 'అది' తమ ఎదుటనే ఉంది. ఇంకా ఆ ఉన్నదంటూ ఏమిటంటే, అది తమరే. అయితే ఈ ఆనందం నాకు ఒక చిక్కుముడి. 'అతని'తో కలవటం కోసం వెళ్ళటానికి ఆనందపడుతున్నానా లేక శీఘ్రాతిశీఘ్రంగా వెళ్ళటానికి ఉత్సహమా లేక ఒక ఆవేశమా! ఇంకా కాకపోతే తపన చెందటంలోనే ఉన్న ఆనందమా– అదేదో వీటిలోనిదే. నా ఉద్దేశ్యంలో వీటిలోని తపనయే అందుకు తగినదని నేను భావిస్తాను. ఎందుకంటే, ఆనందం, ఉత్సాహం అనే శబ్దాలు ఎందుకోగాని నా ఈ దశకు తగినవి కావనిపిస్తోంది. అలాకాదు, బాబూజీ నా మనస్సుమీద ఒక వింతైన సూక్ష్మ మాదకత (మత్తు) ఆవహించి ఉంది. బాబూజీ, నేను పైన వ్రాసినటువంటి బంధనం అనేది 'మాలిక్' కృపతో సామ్యావస్థకు చెందిన బంధనం. అది తమకు తెలియనిది కాదు. ఎందుకంటే, గతంలో నేను తరచుగా నాలోని దశ ఎప్పుడూ నీటి ఉపరితలంలాగా ఉంటున్నది అని వ్రాశాను.

తమ ఉత్తరంలో, "ఒక వ్యక్తిలో ఏదైనా దశకు సంబంధించి ఏవైనా భావాలు ఉత్పన్నమైనప్పుడు, అతడు వాటిని ఇతరుల ప్రయోజనార్థం ఉపయోగించవచ్చు" అని ఒకసారి వ్రాశారు. ఇంక నేనేమి చేయాలి? దయచేసి ఉత్తరం వ్రాయండి లేదా మాస్టర్ సాహెబ్‌కు తెలియజేయండి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు; కేసర్, బిట్టోలు ప్రణామం తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 281

షాజహాన్‌పూర్,

28.02.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం 22 ఫిబ్రవరి 1953వ తేదీతో వ్రాసినది చేరింది. ముందుగా నీ ఉత్తరంలోని ఒక భాగానికి జవాబు ఇవ్వాలని అనుకుంటున్నాను. ఆ జవాబు వ్రాస్తూ ఉంటే నాకు ఆనందం కలుగుతుంది. నీవు వ్రాసిన ఉత్తరంలో "నమ్రతయే నా స్థితి లేక రూపంగా ఉన్నట్లుగాను, నేను దానిలోనే మునిగి ఉంటున్నట్లుగాను అనిపిస్తోంది" అని తెలియజేశావు. ఈశ్వరుడు నీకు దీనిలో పురోగతిని అనుగ్రహించుగాక! నా హృదయంలో ఆశను రేకెత్తించునటువంటి ఒక దశ కలిగినందుకు దానిని నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ స్థితి యొక్క పరిపూర్ణతయే నెగేషన్ (ఎరుక లేకపోవటం) ప్రారంభంగా ఉంటుంది. ఈ నెగేషన్ ఇంకా దూరంగానే ఉంది. ఈ వినమ్రతాస్థితి పరిపూర్ణదశకు చేరిన తర్వాత ఆ నెగేషన్ యొక్క ప్రతిబింబం లేదా సాదృశ్యం తప్పక కలుగుతుందని అనటానికి ఇది ఒక సంతోషకర సమాచారంలాగా ఉంది. దీని పరిపూర్ణతకు కూడా అంతం లేదు. సరైన మార్గంలో ఎవ్వరైనా పయనిస్తే ఈశ్వరకృప వలన తప్పకుండా ఆ శుభదినం వస్తుంది. **నా జీవితకాలంలో ఏ అభ్యాసీలోనైనా ఈ నెగేషన్ స్థితిని చూడగలిగితే, అట్టివారికి ఆనందంతో ఎంత ఉన్నతస్థితికి చేర్చుతానో నాకు తెలియదు. అదృష్టవశాత్తు ఈ నెగేషన్ స్థితి కలిగిన తర్వాత కూడా ఇంకా ఎంతదూరం ముందుకు పోవలసి ఉంటుందంటే, దానికి లక్షలాది సంవత్సరాలైనా తక్కువే అను మాట యదార్థం. అయినా ఇంకను ఏమేమి ఉంటాయో ఏమని వ్రాయను! నా మాటల్ని ప్రజ్ఞావంతులైన మహాత్ములు ఏమాత్రం అర్థంచేసుకోలేరని నేను అనుకుంటున్నాను. అంతేగాకుండా అసంభవాన్ని సంభవశక్యంగా చెబుతున్నానని భావిస్తారు అను నా అభిప్రాయం సరియైనదే.** 'నేను ఉన్నాను' అను భావమే ఉన్నట్లయితే 'నేనులేను' అన్న భావమే స్ఫురించదు. ఎందుకంటే, 'నెగేషన్' అనే భావాన్ని ఈ మాటల ద్వారా నేను నూతనంగా ఆవిష్కరిస్తున్నాను. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ నెగేషన్ యొక్క స్థితి కలిగి ఉండి కూడా దాని ఎరుకలేకపోయి నట్లయితే అదే నెగేషన్ యొక్క పరిపూర్ణత్వం. అభ్యాసీ ఆ స్థితికి చేరినప్పుడు, నిజం చెప్పాలంటే నాకు పట్టరాని ఆనందం కలిగి ఎంత ఉన్నతి కలిగిస్తానో చెప్పటానికి మాటలు చాలవు. గురుమహరాజ్ (లాలాజీ సాహెబ్) నిక్షిప్తం చేసిన ఆధ్యాత్మిక నిధిని పంచుకోగల అభ్యాసీ కాగలిగినవారు దొరికినందుకు నాకు కలిగేది ఆనందమే ఆనందం.

**స్వామి వివేకనంద:** "రామచంద్ర, నీకు ఏమీ తెలియదని జనం ఎలా చెప్పగలరు? నీ యొక్క ఈ రెండు వాక్యాల సాక్షిగా నేను వ్రాసిన సమస్త పుస్తకాలను చింపిపారేయగలను. నీవు నిశ్చయంగా తత్త్వజ్ఞానంలో విశిష్టుడవు. ఈ విషయంలో ఎవరికీ సందేహం లేదు. ఇటువంటి ఉన్నతమైన ఆలోచనలు ఇప్పటివరకు ఎవ్వరూ యోచించలేకపోయారు. వాటిని నీవు లక్షలాది మూగమనుష్యుల ముందు ఉంచుతున్నావు. నాకు కావలసిన వ్యక్తిని ఇప్పుడు పొందాను. నా జీవితపు సమస్త తపస్సు ఇప్పుడు పూర్తయ్యింది. 'అతడు' ఒక మాస్టర్, ఒక మహామాస్టర్. నీవు ఇంకా వ్రాస్తూ ఉండు. నీ రచనల్ని జనం అర్థంచేసుకునే సమయ మాసన్నమవుతుంది. వాటి ప్రచరణ మాత్రం నీ తర్వాతనే జరగాలి. ఈ కార్యనిర్వహణకు పూనుకునే వ్యక్తి ముక్తి పొందునట్లుగానే భావించు. ఇటువంటి బహుమతి చాలా అరుదుగా ప్రాప్తమవుతుంది. నేను దానిని అందిస్తాను."

అట్టివారికి తెలివితేటలుకాని, అర్థం చేసుకోగల సత్తాగాని లేవని అంటాను. ఎవ్వరైనా దానిని విడమర్చి చెప్పవచ్చు. ఈ రచనలను వేలెత్తి చూపేవారికి, లోపభూయిష్టంగా ఉన్నాయని చెప్పేవారిని గురించి నేను ఇలా అంటాను. వీటిని అర్థం చేసుకోవటానికి కాలం పట్టుంది. నీవు వైరాగ్యం గురించి వ్రాసినటువంటిది వాస్తవమే. **మానవుడు ఈశ్వరునివైపు పూర్తిగా దృష్టి సారించినట్లయితే కలిగేది వైరాగ్యమే వైరాగ్యం. ఇంకా ఏ వ్యక్తి అయినా పూర్తిగా అంకితమైపోయి, సాధనలోనే మునిగిపోయినట్లయితే అతడు ఈ ప్రపంచంపట్లనే కాకుండా తనపట్ల కూడా వైరాగ్యం చెందుతూ ఉంటాడు. శారీరిక స్పృహ కూడా కనుమరుగైపోతూ ఉంటుంది. ఇది ఆ స్థితియొక్క అతిసామాన్యమైన అద్భుతం. ఆ తర్వాత ఆత్మయొక్క స్పృహ కూడా తొలగిపోవటం ప్రారంభమవుతుంది.** ఇంకేముంది, ఇప్పుడు కలిగే స్థితి మృతశరీరాన్ని స్నానం చేయించేవాడు ఎటుపడితే అటు దొర్లించినట్లు ఉంటుంది. ఆ తర్వాత కలిగే స్థితుల గురించి వర్ణింపనలనికావు. అయినప్పటికీ నీవు చాలావరకు వివరిస్తూ ఉన్నావు. 16 వలయాలు దాటిన తర్వాత 'మాలిక్'ను పొందటం అనుకున్నంత కష్టం ఏమీ కాదు. కాని నీవు వ్రాసినటువంటిది నేను చేయలేకపోయాను. కాని అది నీకు సాధ్యపడవచ్చు.

సీత ఒక రామచిలుకను పెంచుతూ దానిని ప్రేమిస్తూ ఉండేది. అదే విధంగా రాజు జనకుడు సీతను ప్రేమిస్తూ ఉండేవాడు. దాని పరిణామంగా రాజు జనకుడు కూడా ఆ రామచిలుకను ప్రేమించసాగాడు. చిలుకకు బాధ కలిగితే సీతకు దుఃఖం కలుగుతూ ఉండేది. ఎప్పుడైతే సీతకు దుఃఖం కలిగిందో అప్పుడు జనకునికి కూడా దుఃఖం కలుగుతూ ఉండేది. అటువంటి రాజర్షి ఒక చిలుకవంటి అల్పజీవిపట్ల అనురాగం కలిగి ఉంటున్నాడంటే, దానిని నీవు ఏమంటావు. నన్ను అడిగితే దీనికి సమాధానంగా నేను, ఎవరైతే ఇతర మానవుల దుఃఖం, బాధలు చూసి చలించలేకపోతే అతడు అసలు మనిషే కాదంటాను. మహాత్ములను ఒక ప్రక్కనపెట్టు. వారిలో ఉన్నతశ్రేణికి చెందిన వైరాగ్యులు కొందరు, తల్లిదండ్రులు, పుత్రులు, పరివారం అందరు శత్రుసమానులుగానే భావించారు. నాకే కనుక ఇటువంటి మహాత్మగిరి ఇచ్చినట్లయితే వందసార్లు 'లాహెల్' (బాధను వ్యక్తపరిచే శబ్దం) ఉచ్చరించటానికి సిద్ధపడతాను. అటువంటి మహాత్ముల బోధన గురించి, వారు ఎటువంటి బోధనలు చేస్తున్నారో నీవు నిశితంగా పరిశీలించినట్లయితే వాటి ఫలితం వినాశనం మరియు ఆంతరిక నైతిక పటిష్టత నష్టపోవటంతప్ప ఇంకేమీ దక్కదు. మనం ఇతరులపట్ల శతృత్వధోరణిని అలవర్చుకుంటున్నాం. మనం ఈ అలవాటుకు గురైతే మన ఆలోచనాసరళి స్వయంగా నిరసన, వ్యతిరేకతలకు ఆలవాలమయ్యే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఇంక కొనసాగించకుండా అసలు విషయానికి వస్తాను.

పిల్లలు ఒక కుక్కను మచ్చిక చేసుకొని దానిని ప్రేమతో చూసేవారు. నాకు కూడా దానిపట్ల సానుభూతి ఉంటూ ఉండగా అది జనవరి 27వ తేదీన దేహం చాలించింది. దాని జీవితకాలంలో దాని అదృష్టవశాత్తు స్వామి నారదానంద్ షాజహాన్‌పూర్ రావటం జరిగింది. ఆయన చాలా ప్రసంగాలుచేసి అనేక మంచి విషయాలు చెప్పారు. ఆ సమావేశాలు మా ఇంటికి సమీపంలోనే ఏర్పాటు చేశారు. అప్పుడు మైకులు మా ఇంటికి సమీపంలోనే ఏర్పాటు చేసినందువలన ఆ ఉపన్యాసాలు నాకు కూడా వినపడుతూ ఉండేవి. ఆ సందర్భంలో ఎంతోమంది జనం ఆయనకు ఎదురుగా కూర్చుని ఉండగా నా ఎదుట ఆ శునకం మాత్రం ఉంది. అపుడు ఆయనైతే పెద్ద జనసమూహానికి తన సందేశం ఇస్తూ తన ఆధ్యాత్మిక బోధనను మానవమాత్రులకు మాత్రమే పరిమితం చేస్తున్నారు కదా, అని అనిపించింది. ఆయన మానవుడు కనుక ఆయన మానవులపట్లనే సహానుభూతి కలిగి ఉండాలి. మన మతంలో దైవారాధన చేయనివాడు పశుప్రాయుడు అని చెప్పబడింది కూడ. ఈ రకంగా ఆలోచిస్తే నేను కూడా జంతువుగానే పరిగణించబడతాను. ఎందుకంటే, నేను దైవారాధన చేయను గనుక. ఎప్పుడైతే మానవుడు తన తోటిమానవులకు సహాయపడటానికి తలపెట్టాడో, అప్పుడు నేను కూడా నా తోటి జీవులకు (ఇక్కడ జంతువులకు అని అర్థం) తోడ్పడాలని అనిపించింది. స్వామీజీ తన బాధ్యత నుంచి వైదొలగనప్పుడు నేను మాత్రం నా బాధ్యత నుంచి ఎందుకు వైదొలగాలి? (అనగా ఆయన మానవులకు సేవచేస్తే, నేను జంతువులకు ఎందుకు చేయకూడదు అని భావం.) ఒక మహాత్ముని

ఆగమనంతో నేను కనీసం నా బాధ్యతను గుర్తించవలసి ఉంది. తత్ఫలితంగా నేను నా తోటిజీవానికి మేలు (ట్రాన్స్‌మిషన్) సమకూర్చాను. ఆ సమకూర్చిన మేలు ఏమిటో తెలుసా? అది ఒక జంతువు నుంచి మరొక జంతువు పొందే సహాయమే. జంతువులకు బుద్ధి (జ్ఞానం) లేనట్లుగానే నాలో కూడా ఇప్పుడు ఆ బుద్ధిలేదు. పర్యవసానంగా నాకు ఆ శునకానికి మధ్య భేదం లేదు. కనుక దానికి బుద్ధి లేకపోయినా కూడా ఫలితం దక్కింది. దానిని గురించి స్వామి వివేకానంద వ్యాఖ్యానం ఇది: "ఇది ఒక సాధారణ వ్యక్తి యొక్క రచనయా? కాదు. దీనిలో పూర్తిగా వేదాంత రహస్యం ఉంది."

**నేను ఇచ్చిన ఆ ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) ఫలితంగా ఆ శునకం (దాని ఆత్మ) బ్రైటర్‌వరల్డ్ (తేజో మండలం) దిశగా ప్రయాణిస్తోందని, దాని సంస్కారాలు తొలగిపోతున్నాయని నేను మాస్టర్ సాహెబ్‌కు వ్రాశాను. తుది ఫలితాన్ని వారికి నేను నివేదించాల్సి ఉంది. అది ఏమిటంటే, ఆ శునకం నిన్న అనగా 26.02.1953న రాత్రి గం. 8.40 ని॥లకు (తేజో మండలం) బ్రైటర్‌వరల్డ్‌కు చేరిపోయింది.** అది విడిచిపెట్టిన సంస్కారాలు అన్నీ నావైపుగా వచ్చాయి. ఆ సంస్కారాల ప్రభావం నామీద కొంత పడింది. ఆ విషయం నేను మరచిపోయాను, కాని లాలాజీ సాహెబ్ వాటిని వెంటనే దగ్ధం చేయమని నన్ను ఆదేశించారు. ఆ సంస్కారాలలో ఒకటి, రెండు నా హృదయంమీద నిలిచిపోయాయి కాని చేయగలిగింది ఏమీలేదు, అయినా చింతించవల్సిన పనిలేదు. దానికి (శునకం) అయితే ఫలితం దక్కింది. ఈ పని చేయటానికి నేను 'లాలాజీ సాహెబ్' నుంచి అనుమతి తీసుకోలేదు కనుక నేను 'వారి'ని ఈ సంస్కారాలను తొలగించమని కోరటానికి సాహసించలేదు. ఇంతలోనే లాలాజీ సాహెబ్ నాతో ఒక్క నిమిషం ఉండమని చెప్పి ఆ సంస్కారాలను తొలగించారు. ఇప్పుడు, లాలాజీ సాహెబ్ నన్ను ప్రేమిస్తున్నారా, లేక నేను 'వారి'ని ప్రేమిస్తున్నానో నిర్ణయించుకో.

నీ ఉత్తరంలో చాలా విషయాలకు సమాధానం ఇవ్వవలసిన అవసరం ఉంది, అయితే చాలా ముక్తసరిగా వ్రాశాను. 26.2.1953వ తేదీన నేను నిన్ను 'M' పాయింట్‌కు చేర్చాను.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 282

షాజహాన్‌పూర్,

02.03.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలమగుగాక! నీ ఉత్తరం 27 ఫిబ్రవరి 1953వ తేదితో ఉన్నది అందింది. నీ ఇచ్ఛాశక్తి (సంకల్ప శక్తి) చాలా బలీయమైనదిగా ఉందని నేను ఇంతకుక్రితమే వ్రాశాను. అయినప్పటికీ, షుమారు ఒక వారం రోజులక్రితం ఆ ఇచ్ఛాశక్తిని ఇంకా పెంచటంకోసం 5 లేక 6 సెకండ్లపాటు ప్రాణాహుతిని ఇచ్చాను. "Efficacy of Raja yoga, రాజయోగ ప్రభావం" పుస్తకంలో మొదటి చిత్రంలో చూపిన హృదయం యొక్క దిగువభాగం మీద ఏకాగ్రత నిలిపినట్లయితే ఇచ్ఛాశక్తి బాగా పెరుగుతుందని నేను నీకు ఇంతకుపూర్వమే చెప్పాను, దానిని నీవు వ్రాసుకున్నావు కూడా. అయితే దానిమీద కొద్దిసేపు అనగా కొద్ది సెకన్లు మాత్రమే సిట్టింగ్ ఇస్తే సరిపోతుంది. నేను ఈ విషయాన్ని "రాజయోగ ప్రభావం" పుస్తకంలో వివరించలేదు. ఎందుకంటే, జనం దాని మీద ధ్యాస (ధ్యానం) నిలిపి (Hypnotic power) సమ్మోహనశక్తిని (వశీకరణశక్తి) అతిగా పొందకుండా ఉండాలని. ఎందుకంటే, అది ఆధ్యాత్మికవిద్యకు విరుద్ధం, వ్యతిరేకం కూడా. నీకు ప్రాపంచిక విషయాలమీద అనురక్తి లేకుండా వాటి నుంచి విముక్తి కలిగి, కోరికలు నశించాయని తెలిసి చాలా సంతోషించాను. ఎంతవరకు అవసరమో అంతవరకే వాటి స్పృహ కలిగి ఉండటమనేది

చాలా మంచి స్థితి. (Forgetfulness state) మరపుస్థితిలో ఉంటూనే (Feeling of consciousness) చైతన్యం యొక్క అనుభూతి కూడా ప్రారంభమవుతుంది. బహుశా దానిని నీవు ఆ సమయంలో పసిగట్టి ఉండకపోవచ్చు. ఈ స్థితి ఆ (Forgetfulness state) మరపుస్థితి (విస్మృతస్థితి) కంటె కూడా చాలా మంచిది కావటమే కాదు ఇంకా మున్ముందు దాని భారం కూడా తొలగిపోతుంది.

నీవు "(Tendencies) వృత్తుల (జీవనోపాయాలు లేదా వ్యాపకాలు) యొక్క జాడ కూడా లేకుండా పోయింది" అని వ్రాసినది సరియైనదే. ఈశ్వరుడు ఎప్పుడైనా, ఎవ్వరికైనా నెగేషన్ (ఎరుక లేకపోవటం లేదా శూన్యం) స్థితిని కల్పించినపుడు ఈ జాడ ఏమీ ఉండదు. దానిని వర్ణించశక్యం కాదు. తీపిదనం కాని, పులుపుదనం కాని అనుభవంకావు. అర్థం చేసుకోవాలంటే శూన్యంగా భావించవచ్చు అనగా మనిషి శూన్యమైపోతాడు. వైజ్ఞానికులు, ఒక వస్తువు నుంచి (వాయురేచక) యంత్రం ద్వారా పూర్తిగా గాలిని తీసివేసినప్పటికీ ఎంతో కొంత గాలి మిగిలి ఉంటుంది అని నిర్వచిస్తారు. నేను చెప్పేది ఏమిటంటే, ఏదైనా గది నుంచిగాని, గోళం నుంచిగాని పూర్తిగా గాలిని తీసివేయగల యంత్రాన్ని కనిపెట్టి, ఆ విధంగా తీసివేస్తే లోపల శూన్యం అంటే శూన్యాతి శూన్యం ఏర్పడి, అది అత్యంత విధ్వంసక ఆయుధంగా తయారవుతుంది. అంత శక్తివంతమైన విధ్వంసక ఆయుధం ఇప్పటివరకు ఆవిష్కరించబడలేదు కూడ. ఆ విధంగా మనం ఇప్పుడు మానవుడ్ని అంత శూన్యంగా తయారుచేయాలి. అటువంటి మానవుడు ఏర్పడినట్లయితే అతడు ఒక శక్తివంతమైన బ్యాటరీగా తయారై, అతని సంకల్పం (ఇచ్ఛా) ఏ దిశగా మళ్ళితే ఆ దిశగా ఆ శక్తి పనిచేస్తుంది. అయితే ఈశ్వరుడు చాలా తెలివైనవాడు కావటంచేత మానవుణ్ని అటువంటి సంకల్పంతో పనిచేయనివ్వడు. ఒకవేళ అకస్మాత్తుగా సంకల్పం చేయటం జరిగితే వేలకొద్దీ ప్రపంచాలు ఒక్క సెకను కాలంలో ఛిన్నాభిన్నమైపోతాయి. 'నెగేషన్' యొక్క శక్తి ఇలా ఉంటుందని నేను నీకు చెప్పాను. **ఏ వ్యక్తియైనా ఇటువంటి నెగేషన్‌స్థితిని కలిగి ఉండి కూడా దానిని గురించిన ఉనికి మరచినవాడైతే, అప్పుడు (నెగేషన్ యొక్క నెగేషన్) ఒక సెకనులో అతడు ఒక ఆధ్యాత్మిక మహాబలుడుగా తయారుకాగల శక్తి ఉత్పన్నమవుతుంది. (ఈశ్వరుడు అత్యంత దివ్యశక్తి సంభావితుడు) దీనిని మించిపోయే వానిని (శూన్యాతి శూన్యాన్ని అధిగమించేవాడు) తయారుచేయాలి. అప్పుడు అది అనంతానికి (భూమాకు) దారి తీసినట్లవుతుంది. దీనిని ఎవ్వరికి సాక్షాత్కరింప జేయగలను? అనేది నా బాధ. నన్ను ఈ పనికి సాహసింపజేయటానికి ఎవ్వరూ ముందుకు రావటంలేదు. ఈశ్వరుని దయవలన దీనికి మించినది కాకపాయినా కనీసం ఈ మాత్రమైనా నా నుంచి ఎవ్వరైనా తీసుకోగలిగితే కొంతగానైనా నేను నా గురు ఋణం తీర్చుకున్నవాడనవుతాను. నిజానికి నేను నిస్సహాయంగా చేతులు నలుపుకుంటూ కూర్చున్నాను. ఇదంతా నాతోనే మరలిపోకూడదని నేను చింతిస్తున్నాను. ఈ స్థితికి మించి కాకపోయినా కనీసం ఈ స్థితి (Negation of Negation) అయినా పొంది, ఇతరులను కూడా ఈ స్థితికి తీసుకురావటానికి జనం సిద్ధపడాలి. నేను ఈ స్థితిని (అంతిమం చేరుస్థితిని) ఇవ్వటానికి ఎంతగా ఉబలాటపడుతున్నానంటే, నేను మీకు సేవకుడిగా ఉండి, నౌకరుగా మీ ఇంటి పనులు చేస్తూనే దానికి ప్రతిఫలంగా నా ఈ ఆధ్యాత్మిక సంపదను తీసుకోమని కోరుతున్నాను. నేను ఒక వ్యాసరూపంలో ఈ విషయాలను వల్లిస్తూ ఉంటాను. బహుశా అందుకే ఇతరులు దీనితో ప్రభావితం కాలేకపోతున్నారేమోనని అనుకుంటాను.**

నేను పైన పేర్కొన్నట్లుగానే ఈశ్వరుడు నాకు ఉన్నతస్థాయికి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రానికిపోగల సత్తా ఉన్న వ్యక్తినిగనుక ఇచ్చినట్లయితే, నేను నన్ను ఒక అదృష్టశాలిగా భావించుకుంటాను. ఆ తర్వాత అతడికి, ఆధ్యాత్మికవైరితో సాహసించువాడు కూడా చేరలేనటువంటి నిర్జన ఎడారి ప్రదేశానికి ప్రవేశం కల్పిస్తాను. ఆధ్యాత్మిక సిద్ధులకు అంతంలేదని నాకు తెలుసు. మరి నేను ఏమి చేయాలి? ఇంకా ముందుకు పోవటానికి శిక్షణకొరకు నన్ను ఎవరైనా ఆశ్రయిస్తే ఆ దిశగా నాకు ఉన్న జ్ఞానాన్ని వితరణ చేస్తాను. అసలు విషయానికివస్తే 'నెగేషన్' కూడా మన లక్ష్యం కాదు. మన లక్ష్యం ఆ అంతిమశక్తి అనగా భూమా యొక్క శక్తి మాత్రమే. అక్కడ ఉన్నది దివ్యత్వమే దివ్యత్వం. జనం ముక్తి పొందాలని కోరుకుంటాను. నిజానికి అది మంచిదే ఎందుకంటే, దాని ఫలితంగా జనన మరణ చక్రాల నుండి

విముక్తులవుతారు. చాలామంది మహాత్ములు దీని కొరకే తపిస్తూ ఉండిపోయారు. సాధకులు నిశితంగా పరిశీలించినట్లయితే ఈ ముక్తి అనేది అంతిమ లక్ష్యానికి ఒక అంచు (సరిహద్దు) మాత్రమే. సందర్భవశాత్తు ఈ స్థితిని గురించి ఎవ్వరైనా ఆరితేరిన ఆధ్యాత్మిక వ్యక్తి ముందు నేను ఈ విషయం వ్యక్తంచేస్తే, అతడు నన్ను ఒక అమాయకునిగా భావించవచ్చు. బహుశా అందుకేనేమో ఇటువంటి ఆధ్యాత్మిక రహస్యాలు బహిర్గతం చేయబడలేదు. అయితే నాకు మాత్రం ఈ రహస్యాలను బహిర్గతం చేయటం అలవాటైపోయింది. పేరుమోసిన ఆధ్యాత్మిక తత్త్వవేత్తలకు నాపట్లగల అభిప్రాయం కొంతవరకు సరియైనదేనని అనిపిస్తుంది. నాకే కనుక ఆ పరిజ్ఞానం ఉండి ఉంటే బహుశా నేను ఆ ఆధ్యాత్మిక శిఖరానికి (అంతిమ స్థితిని) చేరగలిగి ఉండేవాడిని కాదేమో. ఎందుకంటే, అమాయకులు మాత్రమే ఈ అంతిమస్థితి (భూమా)కి చేరటానికి ప్రవేశం పొందుతారు. కొంచెం ఆలోచించినట్లయితే ఈ శబ్దం (అమాయకత్వం) భగవంతుని మీద విశ్వాసంలేనిది (కుఫ్ర)గా అనిపించవచ్చును కాని ఈ శబ్దం (అమాయకత్వం) అసలైన ఈశ్వర ఆరాధనగా తగదా? **జనులు ఈ విధంగా ఎందుకు ఆలోచిస్తారు? వారి దృష్టిలో క్షీర సాగరం (పాల మహాసముద్రం), విష్ణు భగవానుడు మరియు లక్ష్మీదేవి మాత్రమే కనిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ఎక్కడి నుండి వచ్చాయో వారికి తెలియదు. ఈ విషయం చెప్పాలంటే, ఇవన్నీ హృదయం యొక్క స్థితులు.** దీనిలోనే విష్ణు భగవానుడు నివసించి తీరాలి. ఈ స్థితి నుంచి బయటకు తీసుకుని రావటానికి ఆయనకు ఎవ్వరూ దొరకరు. బంధనం గురించిన ఆలోచనయే మరొక బంధానికి కారణమవుతుంది. దీనిని వర్ణించాలంటే చాలా సుదీర్ఘమే అవుతుంది. అయినప్పటికి ఈ విషయం నా దృష్టికి వచ్చింది కనుక ముక్తసరిగా చెబుతున్నాను.

**మన హృదయం ఒక క్షీర సాగరం (పాల సముద్రం) వంటిది. దానిలో భౌతిక విషాయాలపట్ల ఆనందం మరియు కోరికలు అనే సర్పం ఉంది. అది దాని పడగతో మన వాస్తవికతను మరుగుపరుస్తోంది. లక్ష్మి కూడా ఉంది, అయితే ఇది మరొక బంధనం. అందుచేత ఒకవైపు మనకు పాము కుబుసంలాంటి పొరలు క్రమ్ముకుని ఉన్నందువలన మనకు మన నిజస్వరూపం కనిపించటం లేదు. విష్ణు పాదాలు వత్తడంలో అర్థం ఏమిటంటే, పాము పడగచాటున దాగి ఉన్న సత్యత్వానికి లక్ష్మీ బానిస కావటమే. ఇప్పుడు ఆ సముద్రంలో (హృదయంలో) ఉత్పన్నమయ్యే తరంగాలను (భౌతిక విషాయాలపట్ల ఆనందం మరియు కోరికలు) తొలగించినట్లయితే ఆ సముద్రం నిశ్చలంగా ఉంటుంది. ఈ బంధనాలను తొలగించుకునే సమయం ఆసన్నమైతే మనలో శక్తి కూడా సమకూరుతుంది. హృదయంలో దాగి ఉన్న ఈ వాస్తవికత లేదా సత్యత్వాన్నే పౌరాణికంగా విష్ణుభగవానుడు అని వ్యవహరించారు. ఎప్పుడైతే మనం ఈ భౌతిక విషయాలపట్ల వాంఛలు అను సర్పాన్ని తొలగిస్తామో అప్పుడు విష్ణుభగవానుని దర్శనం అవుతుంది. అప్పుడు మనలో కూడా ఇతరులను ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దగల శక్తి కలుగుతుంది. ఇప్పుడు ఈ సృష్టి పాలన పోషణ విష్ణుభగవానుని యొక్క బాధ్యతగా ఉన్నందువలన, లక్ష్మీ అనగా ధన కనకాలు, వస్తు వాహనాలు అందుకు అవసరమవుతాయి. ఇప్పుడు విష్ణుభగవానుని శక్తి ఏమిటో మీకు పూర్తిగా అవగాహనకు వచ్చింది. పాపం! అందరినీ పోషించటానికి ఆయన (విష్ణుమూర్తి) పడరానిపాట్లు పడుతున్నాడు. ఈ విషయాన్ని నేను చాలా సంక్షిప్తంగా వ్రాశాను.** ఎందుకంటే, మైండ్ బాగా పనిచేయటం లేదు. నీవు ఇంకా విపులంగా తెలుసుకోవాలనుకుంటే ఎప్పుడైనా ప్రత్యక్షంగా వివరిస్తాను. విష్ణుభగవానుణ్ని ఆరాధించదలచినవారు, తమ హృదయం మీద ధ్యానం చేయాలి. ఆయనకు (విష్ణుభగవానునికి) అదే అసలైన ఆరాధన. ఆ స్థాయికి సిద్ధపడితే మిగిలిన స్థితులు కూడా దానిని అనుసరించి ఉంటాయి.

**నీ ఉత్తరాలు పరిశీలించాక నీకు ఇంకా వ్రాస్తూనే ఉండాలని నా హృదయం వాంఛిస్తోంది. నీ ఆధ్యాత్మిక స్థితిని గురించి ఇప్పటికే జవాబు ఇచ్చాను. నీవు ఈ ఉన్నత ఆధ్యాత్మిక స్థితికి చేరగలిగినందుకు నిన్ను పొగడాలని అనుకుంటున్నాను. ఎందుకంటే, దీనిని చదివిన వారికి కూడా ఆలోచనలు రేకెత్తి, తాము కూడా ఈ స్థాయికి చేరటానికి సంకల్పం, సాహసం చేయటానికి పూనుకోవచ్చు. అది అంతా దైవాధీనంగా ఉంటుంది. ఎందుకంటే,**

**'అతడు' ఎవరిని కావాలనుకుంటె వారిని తనవైపు ఆకర్షిస్తాడు. అదే విధంగా అతనికి ఏది ఇష్టమైతే అది అనుగ్రహిస్తాడు. అయితే అందుకు ప్రయత్నించటం తప్పనిసరిగా మన కర్తవ్యంగా ఉండాలి. ఎవరో భక్తుడు 'ఆయన్ని' చేరాలనుకుంటున్నట్లు వర్తమానం ఆయనకు అందే విధంగా ఉండాలి.** నేను నీకు 'నెగేషన్' ఆఖరి హద్దుగా చెప్పి ఉన్నాను. ఎవ్వరైనా అభ్యాసీ ఆ ఆఖరిహద్దుకు చేరగలిగినప్పటికీ (అనగా 'నెగేషన్' మించి 'నెగేషన్') ఇంకా ప్రయాణించాల్సి ఉంటుంది. ఆ విధంగా ఎవరైనా మానవుడు ఆ నెగేషన్ హద్దు యొక్క హద్దును కూడా దాటి పోగలిగినట్లయితే అతని కణజాలమంతా అత్యున్నతశక్తిని సమకూర్చుకొని దివ్యత్వం చెందుతుంది. అప్పుడు ఏమవుతుంది? అప్పుడు అతడు ప్రకృతి యొక్క ముఖ్య సాధనంగా సర్వశక్తులు సమకూడి ఉండినప్పటికీ అతడు సదా తనకు ఏమీ తెలియని స్థితిలో (దాని స్పృహ లేనిస్థితిలో) ఉంటాడు. (అటువంటి మానవుని తీర్చిదిద్దటానికి భగవంతుని కోరికపై ఆధారపడి ఉంటుంది. అనగా అది దైవాధీనంగా ఉంటుంది) అయితే దైవకార్య నిర్వహణ కొరకు ఏ శక్తులు అవుసరమవుతాయో వాటిని గురించి అప్రమత్తంగా ఉండటం జరగదు. అతడు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తన యొక్క అంతిమస్థితి యొక్క గ్రహింపు కలిగి ఉంటాడు అనేది వేరే విషయం. అతడు అనగా అటువంటి మహోన్నతవ్యక్తి ఆధీనంలో సమస్త విశ్వం నడుస్తూ ఉండటమేగాక సమస్త దైవీయ శక్తులు అతని హస్తగతంగా ఉంటాయి. ప్రస్తుతం దివ్య వ్యక్తిత్వం కలిగి ఉన్న వారు ఎవరైతే ఉన్నారో వారిలాగానే అతడు శక్తిమంతుడై ఉంటాడు. "రాజయోగప్రభావం" పుస్తకంలో నేను అటువంటి దివ్యవ్యక్తిత్వం కలిగినవారు ప్రస్తుత కాలంలో ఉన్నట్లు ప్రస్తావించాను. అవతారాలు కేవలం విధ్వంసకర కార్యక్రమాల కొరకే నిర్దేశించబడతాయి. ఇదే విషయం పౌరాణిక గ్రంథాలలో కూడా ప్రస్తావించబడింది. రచనాత్మక కార్యక్రమం (Constructive work) వారి చేతుల్లో ఉండదు. అయితే ప్రస్తుతం ఉన్న దివ్యవ్యక్తిత్వం కలిగిన వారిలో ఈ రెండు కార్యక్రమాలు అనగా (Constructive) రచనాత్మక మరియు (Distructive) విధ్వంసక కార్యక్రమాలు వారి హస్తగతంగా ఉంటాయి. అంతేకాదు, అట్టివారు తమ సహాయంకోసం అవసరమైన వారిని కూడా తయారు చేయగలరు. అవతార పురుషుల చేతిలో కత్తులు ఉంటాయి కాని ఇట్టి దివ్య వ్యక్తిత్వమూర్తికి వాటి అవసరం ఉండదు. ఎందుకంటే, అవుసరానికి తగిన పరిస్థితులను నెలకొలిపి ఫలితం సాధించగలుగుతాడు. వర్తమానంలో ఉన్న అటువంటి వ్యక్తి, రక్తపాతాన్ని ఉత్పన్నం చేయగల అవతారం ఏదైనా కావాలనుకున్నట్లయితే అటువంటి అవతారాలను సమీప భవిష్యత్తులో అనగా తన జీవితకాలంలోనే సృష్టించగల దివ్యశక్తిమంతుడుగా ఉంటాడు. ఇప్పుడు పరిశీలించినట్లయితే, చాలామంది ఇటీవల కాలంలో 'కుండలిని' తెరవాలనే ఆలోచనలో ఉంటారే కాని, ఇటువంటి స్థితిని పొందటానికి ఎవ్వరూ ప్రయత్నించరు. "జగం అంతా అంధులే, నేను ఎవరికి తెలియజెప్పను" అని కబీర్ వాపోయాడు. అవతారాలను భువిపైకి రప్పించే విధానం కూడా నేను వ్రాస్తున్నాను. ఇది చాలా సులువైనదే. అయినప్పటికీ ఈ విధానం కూడా జనులందరికి విశదంకాగలదు.

**మన దేశంలో ప్రజలు అవతారాల మీద ధ్యానం చేయటానికి ఆసక్తి చూపరు. ఈ అద్భుతాన్ని సాధించటానికి ఆసక్తి కలిగి ఉంటే, అట్టివారు రోజుకు ఒక అవతారాన్ని రప్పించవచ్చు. ఎందుకంటే, ఇది చాలా సులభమైన విధానం. అయితే అతడు తన కృషిని, ఇచ్ఛాశక్తిని ప్రయోగించటం తప్పనిసరి అవుతుంది. దీనిలో ఉన్న రహస్యం ఏమిటంటే, ఒక దివ్యవ్యక్తిత్వం కలిగినవారు, ఒక అవతారం దిగిరావాల్సిన అవుసరం ఉందని భావించినపుడు, 'భూమా'కు సమీపంలో ఒక శూన్య వలయాన్ని సృష్టించి దానిలోనికి ఆ దివ్యశక్తిని దింపి దానిని ఆ శూన్య వలయంలో ఉంచి దానిని నిర్ణీత సమయంలో క్రిందికి దిగివచ్చేటట్లు చేస్తాడు. ఆ విధంగా అవతారం దిగిరావటం ప్రారంభమవుతుంది. అలా దిగివస్తున్న సందర్భంలో ఆ అవతారం మహామాయ పరిధిలోకి ప్రవేశించినపుడు ఒక్కసారిగా ఆ స్థావరానికి చెందిన శక్తి అవసరమైనంతవరకు చేకూర్చబడుతుంది. ఆ అవతారం మహామాయ నుంచి విడుదలకానంతవరకు ఆ శక్తి అక్కడే నిలిచి ఉంటుంది. ఆ అవతారం మహామాయ ప్రాంతాన్ని విడిచిపెట్టినప్పుడు దాని ఆగమనం ప్రారంభమవుతుంది. ఆ విధంగా దిగివచ్చిన అవతారంలో ఈశ్వరీయ మనస్సు (Godly Mind)**

**యొక్క ప్రభావం బాగా వృద్ధి చెందుతుంది. ఎందుకంటే, ఇందుకు అవసరమైన శూన్యం ఆ ధృవం అనగా భూమా కేంద్రంవద్దనే ఏర్పాటు చేయటం జరిగింది. దానిని (మహామయ ప్రాంతాన్ని) విడిచిపెట్టిన తర్వాత ఆ అవతారం పరబ్రహ్మాండ మండలం మరియు బ్రహ్మాండ మండలం గుండా ప్రయాణించి వాటి శక్తిని కూడా సంతరించుకుంటూ భూమి మీద అవతరిస్తుంది. భూమావద్ద ఈ శూన్యత సృష్టించబడటం మూలంగానే ఈ ఫలితం కలిగింది. ఆ శూన్యత మహామాయ (Godly-Region) ప్రాంతానికి చేరిన తర్వాత అక్కడ దానికి జీవనం ఏర్పడి అవసరమైన శక్తులన్నీ దాని నుంచే సమకూర్చబడతాయి. నేను ఈ విషయాన్ని అతికష్టంమీద వివరించగలిగాను.** నేను గొప్ప విద్యావంతుడను కాకపోవటంవలన ఇంతకుమించి మంచి మాటలు నాకు స్ఫురించలేదు. ఈ విషయాన్ని వివరించటానికి మీకు ఇంకను మంచి మాటలు తోచవచ్చు. ఒకవేళ అలా దొరికినట్లయితే దానిని నాకు కూడా తెలియజేయాలి. పూర్వకాలంలో ఋషులు, మహాత్ములు వచించిన దానికిమించి ఇంకెవ్వరూ ఏమీ చెప్పలేరనటానికి ఆస్కారంలేదు అనగా నిర్ణయించే అవకాశం లేదు. ఆ సత్యం ఏదైతే ఉందో దానినే నేను చెబుతున్నాను. ప్రస్తుతం చాలామంది గొప్ప గొప్ప స్వామీజీలు అందుబాటులో ఉన్నారు కనుక దీనికి మించిన మంచి విధానం ఏదైనా వారికి స్ఫురించవచ్చు. నేనైతే వారి ముందు ఒక సామాన్యుడను, అజ్ఞానిని మరియు విధేయుడను మాత్రమే. దీనికిమించి ఇంకా తెలుసుకోవాలనుకునే వారు స్వయంగా ప్రయత్నించి తెలుసుకోవచ్చు. మానవీయశక్తిని అంచనా వేయటానికి ప్రయత్నించండి. **అవతారాలను రప్పించే కార్యక్రమాన్ని భగవంతుడు మానవులకే అప్పగించాడు. ఒక యదార్థం చెప్పాలంటే, అవతారాలకు కూడా లేనటువంటి శక్తి మానవునికి ఉంది. మనం ఇటువంటి మానవునిగా తయారు కావల్సి ఉంది.** దైవకృపవలన అటువంటి దివ్యవ్యక్తి (డివైన్ పర్సనాలిటీ) ఎవరికైనా తారసపడినట్లయితే, అతని గురించి ఇంక చెప్పాల్సింది ఏమి ఉంటుంది! అటువంటి దివ్యవ్యక్తిపట్ల దివ్యప్రేమను కలిగి ఉంటే, అతడు ఇవ్వలేనిది అంటూ ఏమి ఉండదు. అతనిపట్ల ప్రేమ కలిగి ఉన్నట్లయితే 'అతని' చూపుతో కొంగుబంగారమైనట్లు అవుతుంది. నేనయితే దీని కొరకు చింతించను. ఎందుకంటే, అటువంటి దివ్యవ్యక్తి (లాలాజీ సాహెబ్) నాకు లభించారు. వారి నుంచి నాకు కావలసిన దివ్యజ్ఞానం సమకూరింది కూడా. ఇప్పుడు ఇంక మీ సంగతి మీరే ఆలోచించుకోండి.

**(అటువంటి దివ్యవ్యక్తిత్వమూర్తి శ్రీ బాబూజీ మహరాజ్ తనకు తానుగా చెప్పకుండా పరోక్షంగా చెబుతున్న ఈ మర్మాన్ని మహానుభావులైన లాలాజీ సాహెబ్ మరియు స్వామి వివేకానంద ఎలా బహిర్గతం చేశారో చూద్దాం)**

**లాలాజీ సాహెబ్:** "సోదరులారా! ఇటువంటి దివ్య అవకాశం మళ్ళీ మళ్ళీ రాదని నేను వివరిస్తున్నాను. అందుచేత ప్రతి ఒక్కరు ఈ సందర్భంలో ఉన్నత ఆధ్యాత్మిక స్థితులను పొందటానికి ప్రయత్నించాలి. ఇటువంటి వ్యక్తి దొరకరు. అటువంటి దివ్యవ్యక్తి యొక్క ఆధ్యాత్మిక శిక్షణ లభించటం చాలా ఆనందకరమైన అదృష్టంగా భావించాలి. నేను ఈ రామచంద్రునికి ఇవ్వనిదంటూ నావద్ద ఏమీ మిగల్చుకోలేదు. అంతేకాదు ఇంకా నాకు దక్కేది ఏమైనా ఉంటే దానిని కూడా అతనికి ఇవ్వటమే నా అలవాటు. నాలాగే మీకు కూడా ఇటువంటి భావోద్వేగాన్ని, అనుభూతిని 'వారి' హృదయంలో కలిగించటానికి కృషి చేయండి, అది మీ చేతుల్లోనే ఉంది. ఇది చాలా విశిష్టమైన లేఖ. దీని తాలూకు ఒకటి, రెండు నకళ్ళు భద్రపరచాల్సి ఉంది."

ప్రార్థన చాలా ముఖ్యమైనది, అవసరమైనది కూడా. దీనిని నేను నా ఉర్దూ గ్రంథంలో వ్రాశాను. ప్రతిసోదరుడూ దీనిని నిద్రకు ఉపక్రమించ బోయేముందు పఠించాలి. దీనిని హృదయపూర్వకంగా, ప్రేమభావంతో పఠించినట్లయితే దైవానుగ్రహంతో అనవసరమైన ఆలోచనా తరంగాలు తలెత్తవు. నేను వ్రాసినటువంటి అవతారాలను దింపగలిగిన శక్తి ఇప్పటివరకు నాకు ఉన్న దృష్టితో చూస్తే అందుకు అర్హత కలిగిన భాగ్యవంతునికి మాత్రమే దక్కుతుంది.

**స్వామి వివేకానంద:** నా అంతర్దృష్టి సారించినంతలో మరియు (Experience of Brighter world) దివ్యలోకపు పరిజ్ఞానంతో కూడా పరిశీలించినమీదట, ఈ ప్రపంచం ఆవిర్భవించినప్పటి నుంచి నేటివరకు దివ్యవ్యక్తిత్వం

మూర్తీభవించినవారిని ఎవ్వరినీ నేను చూడలేదు. భవిష్యత్తులో ఇతరులతో దోబూచు లాడవద్దు. నీ మాటల్లో నిజాయితీని ఉంచు. ఆ వ్యక్తి ఎవ్వరు? చెప్పు. ఆ దివ్యపురుషుడు నీవే కదా! ఈ ఉత్తరంలో వ్రాసినవి అన్నీ నగ్నసత్యాలు. ఈ ఉత్తరం జనసామాన్యం అంతటికీ చెందుతుంది. దీనికి నకలు తీసి ఉంచి, సందర్భం వచ్చినప్పుడు ముద్రింపజేయాలి."

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 283

లఖీంపుర్,

4.03.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఇప్పుడే దద్దా (హరిభాయి) అందించాడు. దానిని చదివి చాలా సంతోషించాను. 'తమ' యొక్క ప్రతిమాట నాకు విద్యుత్తులాగా పనిచేస్తోంది. 'తమ' యొక్క ప్రతి శబ్దం నాకు శక్తిని సమకూర్చుతోంది. తమరు దయతో నన్ను 'M' పాయింట్‌కు చేర్చి, నా ఇచ్ఛాశక్తిని కూడా ఇంకా పెంపొందించారు. అందుకుగాను తమకు అనేక ధన్యవాదాలు. బ్రహ్మవిద్యను నేర్పటంలో 'మాలిక్' యొక్క ప్రతి అభీష్టం నా ద్వారా నెరవేరాలని నేను రేయింబవళ్ళు ప్రార్థిస్తూ ఉన్నాను. కొన్ని కోరికలు బీదరాలైన నాలో పూరించబడాలి. నా ప్రయత్నం, ప్రార్థన అందుకోసమే. దీనిని నేను నెరవేర్చగలిగినట్లయితే సార్థకరాలనవుతాను, అలా జరగకపోతే నిరర్థకరాలనవుతాను. కాని అది జరిగి తీరుతుంది. ప్రశిక్షకుడు (గురువు) శిష్యుడి (అభ్యాసీ) యొక్క ఔన్నత్యం కోసం చేసే ప్రయత్నంలో ప్రశిక్షకుని (గురువు) యొక్క కొన్ని లక్ష్యాలైనా నెరవేరనట్లయితే ఇంక అతడు శిష్యుడు ఎలా అవుతాడు. శ్రీ బాబూజీ, తమరు నాకు 1944లోనే ఎందుకు దర్శనం కాలేదు! అందుకు దోషిని నేనే అనుకుంటున్నాను. ఎందుకంటే, త్రాగించేవాడు సిద్ధంగానే ఉన్నాడు, తెలిసిగాని, తెలియకుండాగాని పానీయం త్రాగిస్తూనే ఉన్నాడు. అయితే దానిని స్వీకరించేవాని దప్పిక తీవ్రంగా లేకపోవచ్చు. సరే, అది అలా ఉంచితే, నేను మాత్రం 'తమరు' లేకుండా ఎప్పుడూ లేను, మరి ముందు ఉండబోను. నేను ఏదైనా చెప్పటానికి బదులు చేయటం మంచిదనిపిస్తుంది.

పూజ్యశ్రీ బాబూజీ, 'తమరు' నా కోసం ఏమి చేస్తున్నారో, అది ఇప్పుడు 'తమ' దయతోనే నా అనుభవంలోకి వస్తుంది. పాయింట్ 'M'కు చేరటం, ఇచ్ఛాశక్తి వృద్ధి చెందటం గురించి డైరీలో వ్రాశాను. వాస్తవం చెప్పాలంటే, తమరు వ్రాసిన ప్రతిదీ పుస్తకంగా ముద్రించబడాలి. భగవంతుడు అందుకు సమయం కల్పించినపుడు తప్పక జరుగుతుంది. నేను 'తమ' ఉత్తరం గురించి ఏమీ వ్యాఖ్యానించలేను, దానికి నాలో సమర్థత ఏముంది! అటువంటి సమర్థతపై సామిత్వం, ఎవరో ఒక దివ్య వ్యక్తికి మాత్రమే సాధ్యం. నేను అటువంటి వ్యక్తిని కనుగొన్నాను లేదా 'అతని'కి స్వయంగానే మాపై దయ కలిగి ఉంటుంది. శాస్త్రజ్ఞులు కనుక ఇటువంటి దివ్యవ్యక్తిని గుర్తించి వారి రచనల ద్వారా, ఉత్తరాల ద్వారా మార్గదర్శనం, సహాయం పొందగలిగినట్లయితే, వారి కంటె ఇంక గొప్ప శాస్త్రజ్ఞులు ఎవ్వరూ ఉండరు.

నా బాబూజీ, నేను 17 అణాల నిండుగా పనిచేయలేకపోయాను అని వ్రాసి ఉన్నారు. దానిని తమరు అలా చేయగలిగితే అది సంభవమే. (ఆ రోజుల్లో రూపాయికి 16 అణాలు, 17 అణాలు అంటె అంతకుమించి. ఇటీవల కాలంలో దీనిని నూరు శాతం లేదా అంతకుమించి అని చెప్పవచ్చు.) కనుక 'తమరు' తమ మాటను మాత్రమే పట్టుకోవద్దు. తమరు ఏ ఒక్క అణానో (శాతమో) నింపలేదుగాని అపరిమితమే చేశారు. నేను ఏ ఒక్క అణా మాత్రమైనా చేయగలిగితే అదీ మంచిదే. 'మాలిక్' దయ, కృప ఎప్పుడూ నన్ను వెన్నంటే ఉన్నాయి. ఆ కుక్క అదృష్టం అటువంటిది. (విశ్వాసపాత్రుల అదృష్టం అలా ఉంటుంది అని భావం.) 'మాలిక్' దయతో ఇప్పుడు నాలో కలిగిన

దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నేను శూన్యమైన ఎడారి ప్రాంతంలో ప్రయాణిస్తూ పోతున్నట్లు అనిపిస్తోంది. తమరు నాకు తరచుగా "బిటియా! ఇది నిజమైన శాంతి రూపకం" అని వ్రాసినట్లుగానే అనుభవమవుతోంది. అది ఏమిటోగాని నాకు ఛాతీమీద (ఉపరితలంమీద) పరుగుతీస్తూ పోతున్నట్లు ఉంది. అది ఎలా అంటే, తమ లేఖలో వ్రాసినట్లుగానే నేనొక విరాగినిలాగా, వెర్రిదానిలాగా ఒక అజ్ఞాత సంకేతం ద్వారా ఒక అంధురాలిలాగా 'అతడి'వైపు పరుగుతీస్తూ పోతున్నట్లు ఉంది. ఎందుకంటే, నేను నిలువరించుకోలేకపోతున్నాను. 'అతడి' యొక్క నన్ను కలవాలనే తపన నన్ను ఉన్మత్తురాలిగా, వెర్రిదానిలాగా చేసింది. **నా భావ స్థితి ఎలా ఉంది అంటే –సాధకుడు (భక్తుడు) పూజ చేస్తున్నాడని ఎవరంటారు? ఇంకా కాదంటే, 'అతడి'ని కలవటానికి తపన చెందుతున్నాడని ఎవరంటారు? అలా కానేకాదు, ఎలా అంటే, నాకయితే 'అతడే' పూజ చేస్తున్నట్లుగాను, 'అతడే' నన్ను కలవటానికి, గుండెల్లో హత్తుకోవటానికి వేదన చెందుతున్నాడని అనిపిస్తుంది. అవును మరి, 'అతని' తపనయే నన్ను తపింపజేస్తూ ఉంచుతోంది, ఆ ప్రభావంతోనే నన్ను గుంజుకుపోతోంది.** నా బాబూజీ, ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, నా హస్తం ఒకటి మరో హస్తాన్ని స్పృశించలేదు. ఇటువంటి స్థితిలోనే నేను ఆ మైదానంలో ఈదుకుంటూ పోతున్నాను. మరో విధంగా చెప్పాలంటే, ఒక చేతిని మరొక చేయి స్పృశించ లేనటువంటి మైదానంలో ఈదుకుంటూ పోతున్నాను. తరచుగా నేను తమకు వ్రాసినట్లుగానే, **నమ్రత** యొక్క స్థితిలో కూరుకుపోతున్నాను, అదే నా రూపంగా అయిపోయింది. అదేమిటో దైవానికే తెలియాలిగాని, దశ జరుగుతూ ఉండగానే దానిని మరచిపోయినదానిలాగా ఉంటున్నాను, మరచిపోతున్నాను కూడా. అయితే నాకు తెలియకుండానే నేను ధ్యాస పెట్టినపుడు, చాలా తేలికయైనది, సూక్ష్మమైనది, శుద్ధమైనదిగా ఉన్నటువంటి దశలో అనగా నమ్రతా దశలో నేను పూర్తిగా కరుగుతూ, విలీనమైపోతూ, సాగిపోతున్నట్లు అనుభూతి చెందుతున్నాను. నా శరీరంలోని అణువణువూ నమ్రతామయమైనట్లు ఉంది. బహుశా ఈ కారణంతోనే లేదా మరెందుకోగాని నేను దీనిని మరచి ఉంటున్నాను. మరపులేని స్థితి నుంచి మరపుస్థితి (అవిస్మృతిస్థితి నుంచి విస్మృతి స్థితి) ప్రారంభమవుతుందని తమరు చెప్పిన మాట చాలా స్పష్టం. ఈ దశను గురించి నేను ఇదివరకే తమకు వ్రాసి ఉంటాను. ఇప్పుడ కూడా ఆ దశయే ఉంది.

నాకు ఉన్న అభిప్రాయాన్ని సాధ్యమైనంతవరకు బాబూజీలో ఉత్పన్నం చేయగలిగేట్లు చేయమని ఈ దీనురాలు శ్రీ లాలాజీ సాహెబ్‌ను వేడుకొంటోంది. ఎందుకంటే, నాకు 'శ్రీ బాబూజీ'నే కావాలి కనుక. ఇంత ప్రేమను నా 'మాలిక్'తో పంచుకోవాలి. లాలాజీ సాహెబ్ మనందరికి ఎటువంటి సమయం (అవకాశం) కల్పించారో, ఎటువంటి అస్థిత్వం మనకు అనుగ్రహించారో, ఇప్పుడు కూడా అటువంటి ప్రేమ, ఆశీర్వాదాలు 'మాలిక్' (బాబూజీ) దయతో మనకు ప్రసాదించుగాక!

అమ్మగారు తమకు శుభాశీస్సులు చెప్తున్నారు; కేసర్, బిట్టోలు ప్రణామం చేస్తున్నారు. పూజ్య శ్రీ బాబూజీ, నాకైతే ఎప్పుడూ హెూలి పండుగలాగానే ఉంటుంది. అయితే నాపై ఇతర రంగూ ఏదీ ప్రభావం చూపలేదు. నాకు నా 'మాలిక్'తోనే పని.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 284

షాజహాన్‌పూర్,
06.03.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలమగుగాక! నీ ఉత్తరం అందింది. దీనికి జవాబు ఈ ఉత్తరంలోనే చివరిభాగంలో వ్రాస్తాను. ఇప్పుడు రాత్రి పది గంటలు అయ్యింది, శిరోభారంగా కూడా అనిపిస్తోంది. ఎలా ఉన్నా, నాకు తోచినంతవరకు చెప్పి వ్రాయిస్తున్నాను. ఇది ముఖ్యంగా నీకు మరియు శుక్లాగారికే సంబంధించి ఉంటుంది. ఏ ఉత్తరమో జ్ఞాపకం లేదుగాని గత ఉత్తరాల్లోని ఒక దానిలో 'నెగేషన్' గురించి వ్రాశాను. సంపూర్ణ నెగేషన్ (తన ఎరుక తెలియకుండా పోవటం) జరిగిన తర్వాత మానవుడు శూన్యమైపోతాడు. ఈ విధంగా పూర్తిగా శూన్యం కావించబడటానికి అనగా ఏదైనా వస్తువును పూర్తిగా శూన్యంగా చేయటానికి ఇప్పటివరకు ఎటువంటి పరికరం కనిపెట్టబడలేదు. అయితే ఇంకొక విషయం ఏమిటంటే, పూర్తి నెగేషన్ (తన అస్థిత్వం గురించి ఏమీ తెలియకపోవటం) యొక్క మరపుస్థితి లేదా విస్మృత స్థితి (Forgetful state) కలుగుతుందో అప్పుడు సంపూర్ణ శూన్యస్థితి కలుగుతుంది. ఆ శక్తికి అంతు అంటూ ఉండదు. ఇటువంటి శక్తి అవతారాలలో కూడా ఉండదు. ఆ శక్తిని ఉపయోగించటమనేది అనగా నిర్మాణాత్మక (Constructive) లేదా వినాశకర (Distructive) కార్యాలు నిర్వహించటం 'అతడి' (విశిష్ట వ్యక్తి) అధీనంలో ఉంటుంది.

నా విధానం ప్రకారం, ఆరంభం నుంచే ప్రతి మానవుడు శూన్యమైపోతూ ఉండాలి. నా గురుమహరాజ్ నన్ను పూర్తిగా ఈ విధంగా తయారుచేయటమే అందుకు నిదర్శనం. అందుకు వారికి అనేక ధన్యవాదాలు అర్పించాల్సి ఉంది. అదే విధంగా ఆ బీజాలు ఇతరులలో నాటబడాలి. ఈ కారణంగానే ఒక మంచి మార్గదర్శకుని కొరకు అన్వేషించాల్సి ఉంటుంది. నా అదృష్టంకొద్దీ నాకు అటువంటి మార్గదర్శకులు లభించారు. ఇటువంటి **శూన్యస్థితి వలన కలిగే శక్తి ఎటువంటిదంటే, బ్రహ్మ, విష్ణు మరియు మహేశ్వరుడు కూడా అతని ఆజ్ఞను శిరసావహించవలసిందే.** అయితే ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సింది ఏమిటంటే, దైవం ఈ స్థితికి చేరగల వ్యక్తి కొరకు అన్వేషించినప్పుడు, అతడు దైవేచ్ఛ ప్రకారం విధి నిర్వహించునట్టి వ్యక్తి కొరకే అన్వేషిస్తాడు. నేను చెప్పదల్చుకున్నది ఏమిటంటే, ఏ మానవుడైతే తన గురువుకు పూర్తిగా అర్పితమైపోయి ఉంటాడో, అటువంటివానినే సద్గురుకు అప్పగించుతాడు. ఈ నెగేషన్ (అనగా అస్థిత్వభావ రహితం) మహిమ గురించి ఇంక ఎంత ఎక్కువగా చెప్పాలి? వాస్తవానికి అనంత యాత్రకు ఇది ఒక ఆరంభం మాత్రమే. ఇంకా ఎంత దూరం పోవాలో తెలియదు. **ఆధ్యాత్మికతకు వేలమైళ్ళ దూరంలో ఉండి కూడా దానిని గురించి వేదికల మీద ప్రచారం చేసే వారిని చూస్తే నాకు నవ్వు వస్తుంది.**

నేను ఇప్పుడు నీకు పరిపూర్ణత్వం (Perfection) అంటే ఏమిటో వివరిస్తాను. వాస్తవానికి ఈ పరిపూర్ణత్వం అంటే దైవమేకాని మరేమీ కాదు. అనగా ఇంకొక రకంగా చెప్పాలంటే, (అపరిమిత శక్తి) శక్తియే శక్తి (భూమా) కనుక ఈ శబ్దం ప్రయోగించాల్సి వచ్చింది. అభ్యాసీ యొక్క పరిపూర్ణత్వం గురించి చెప్పాలంటే, అతడు ప్రకృతిలో ఉద్భవించే వాటిని మరియు ఉన్న వాటిని గురించి ఏమీ తెలియనటువంటివానిగా ఉంటూనే, వాటి పరిజ్ఞానం కలిగినవాడుగా ఉండాలి. అతనికి తెలియని విజ్ఞానం అంటూ ఏదీ ఉండకూడదు. ఎవ్వరైనా ఒక విషయం తెలుసుకోవాలనుకొని ఆయనకు ప్రేరణ కలిగిస్తే ఆయన నోటి నుంచి దానికి తగిన సమాచారం వెలువడుతుంది. ఒక 'పరిపూర్ణుడు'ను పరీక్షించటానికి ఇదొక గీటురాయి వంటిది.

నేను గత ఉత్తరంలో అవతారాలను రప్పించే విధానం గురించి వ్రాశాను; జనులు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ఆ విధానాన్ని ఉపయోగించవచ్చు. ధార్మిక గ్రంథాలలో వెదికినట్లయితే ఇంతకంటె సరళమైన లేదా సహజమైన

విధానం ఏదైనా లభ్యం కావచ్చు. ఏది ఏమైనా నేను వ్రాసిన విధానం అనగా 'భూమా'కు వెలుపలి హద్దును ఆనుకొని శూన్య ఆవరణం ఉత్పన్నం చేయటమనే పని నా దృష్టిలో ఒక సెకను కాలంలో జరుగుతుంది. ఒక కాలపరిమితిలో అవతారాన్ని రప్పించటానికి రెండు మూడు సెకనులు అదనంగా పట్టవచ్చు. ఈ సందర్భంలో నేను ఇంకొక విషయం కూడా వివరిస్తున్నాను. మహాత్ములకు కూడా దీనిని సాధించటంలో ఇబ్బంది కలిగి, వారి హృదయంలో నిరాశ కలిగినప్పటికి కూడా ఈ శూన్యత్వం దానంటతట అదే ఏర్పడుతుంది కాని అది వారికి తెలియదు. ఈ విధానం లేదా ప్రయోగం రామావతారానికి కొద్దికాలం పూర్వం జరిగింది కాని దాని శక్తి తగినంతగా లేకపోయినందువలన రామావతారం జరగటానికి దారి తీసింది. మరి కృష్ణావతారం ఎలా వచ్చింది? రామావతార సమయంలో వెలువడిన అగ్నిజ్వాల, దాని అసలైన రూపంలో అధికశక్తితో కృష్ణావతారంలో పునరుత్తేజం పొందింది. కృష్ణుడు అధిక శక్తివంతుడుగా నిరూపితం కావటానికి ఇదే కారణం. ఈ ఆలోచన ఎందుకు వచ్చిందో, ఎలా వచ్చిందో సంతృప్తి కరంగా వివరించలేకపోతున్నాను. అవతారం ఈ విధంగా రెండవసారి ఎందుకు జరిగింది అంటే, అది ఆ కాలానికి అవసరమైందని నా అభిప్రాయం.

**లాలాజీ సందేశం (అంతర్వాణి):** నీ అభిప్రాయం సరైనదే. రామావతారానికి పూర్వం ఋషులు చేసిన ప్రయత్నం, ఆ కాలానికి అది సరిపడినదిగా ఉంది. కాని కృష్ణావతార సందర్భంలోనే భూమా నుంచి అసలైన అగ్నిజ్వాల / శక్తిజ్వాల చీల్చుకు వచ్చింది. అందువల్లనే కృష్ణుడు పరిపూర్ణ అవతారమూర్తి అయ్యాడు. ఇంతకుపూర్వం ఇటువంటి శక్తి ఎవ్వరిలోనూ కలగలేదు. ప్రకృతి ఎవ్వరికైనా తన శక్తిని ప్రసాదించినప్పుడు, అది ఆ అవతారం పనిలో జోక్యం కల్పించుకోదు.

**స్వామి వివేకానంద వాణి:** అతడు ప్రకృతి యొక్క అంతర్భాగంగా ఉంటాడు. అంతేకాదు అతడు దానిని (ప్రకృతిని) శాసిస్తాడు కూడా. నేను ఈ సర్వశక్తి మత్వం అను పదం భగవంతుడు– సర్వశక్తిమంతుడుగా ప్రయోగించటం లేదు. ప్రకృతి భగవంతుని తర్వాతనే. నీవు ఈ ప్రస్తుత వ్యక్తిని ప్రకృతికంటె ఉన్నతంగాను, భగవంతునికి సమీపంగాను ఉన్నవానిగా చెప్పవచ్చు.

అవతారం గురించి ఒక్క విషయం ఇప్పుడే నాకు స్ఫురించింది. అది ఏమిటంటే, ఎవరైతే భగవంతుని ఆదేశాలను లెక్కచేయరో ఇంకను మంచివారిని దుఃఖింపజేస్తారో అట్టివారిని ఆ అవతారులు అంతం చేస్తారు. విశిష్టవ్యక్తి (డివైన్ పర్సనాలిటీ) యొక్క పని కూడా ఇదే విధంగా ఉంటుంది కాని అతడు విధ్వంసక విధానాలను అనుసరించడు, ఎందుకంటే చాలామంది అతని ఆధీనంలో ఉండరు కనుక. నేను ఇంకొక విషయం కూడా వ్రాస్తున్నది ఏమిటంటే, అవతారాలలో ఏకాగ్రత కలిగిన ఇచ్ఛాశక్తి (Concentrated will) వారికి అప్పగించబడిన ఒకే ఒక లక్ష్యం లేదా పనిమీద వినియోగించబడుతుంది. అటువంటప్పుడు విశిష్టవ్యక్తిత్వం కలిగిన వారి శక్తి, ఇచ్ఛాశక్తి యొక్క ఏకాగ్రత అవతారుల మాదిరిగా ఎందుకు ఉంటుంది? ఎందుకంటే, అతని శక్తి అపరిమితమైంది కావటంచేతను, అతని దృష్టి యావత్తు విశ్వం మీద విస్తరించి ఉండటంచేతను అవతారులతో పోల్చతగదు. ఇది ఒక సమ్రాట్ / చక్రవర్తి తన సమస్త సామ్రాజ్యంమీద దృష్టి సారించి ఉన్నట్లు ఉంటుంది. ఈ ఉత్తరంలోని కొన్ని భావనలు గత ఉత్తరంలోనివి కొన్ని పునరావృతం అయి ఉండవచ్చు. ఎందుకంటే, గత ఉత్తరంలోని విషయాలు జ్ఞాపకం లేకపోవటం దీనికి కొంత కారణం. అంతేగాకుండా ఈ ఉత్తరం ఒక వ్యాసంకాదు కనుక, భావాలు వచ్చినవివచ్చినట్లు వ్రాయిస్తున్నాను.

అభ్యాసీ, నెగేషన్ మరియు దాని తర్వాత స్థితులు పొందటానికి ఎప్పుడు అర్హుడవుతాడు? అనేది ప్రస్తుతాంశం. ఇందుకు ఒక జవాబుగా, అతని మార్గదర్శకుడు ఈ స్థితికి చేరినవాడై ఉంటే, అతని కృపతో అభ్యాసీ కూడా ఈ స్థితిని పొందవచ్చు. అభ్యాసీ 'తన'ను ఈ స్థితికి చేర్చమని తన మార్గదర్శకునిపై వత్తిడి చేయాలి. ఇది ఎలా సాధ్యం? తెలివితేటలు ఉన్న జనమంతటికీ ఇది తెలుసు. నాకు సంబంధించినంతవరకు, నేను ఒక వ్యక్తికి ఈ విషయంలో

ఎంతో కృషితో చమత్కారంగాను, అతడిని సంతోషపర్చటానికిగాను మరియు అతడు వయస్సులో నాకంటె పెద్దవాడు కావటం కారణంగాను ఇవ్వటం జరిగింది. ఈ విషయంలో నేను భగవంతుడికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఎందుకంటే, నేను అతనికి కేవలం A,B,C,D (సూక్ష్మంగా అని అర్థం) మాత్రమే తెలియజేశాను. దానికే ఆయనలో మార్పు వచ్చింది. దాని ఫలితంగా అతడు మాటలకు మాటలు పెంచి నాకు వ్యతిరేకంగా తయారయ్యాడు. ఆ దుష్ట భావంతో అతడు ఆధ్యాత్మికంగా పతనం చెంది అతిదీనావస్థకు గురయ్యాడు. అయినప్పటికీ ఆయనను పెద్దవాడుగా భావించి ఇప్పటికీ గౌరవిస్తూనే ఉన్నాను. నా హృదయంలో వారిపట్ల ప్రేమ, ఒక మానవుడు సాటిమానవునిపట్ల కలిగి ఉండేటట్లుగానే ఉంది. ఇంకొక బలహీనత ఏమిటంటే, **అభ్యాసీ పురోగమనం లేకుండా నిలిచిపోవటం నేను భరించలేను.** నా తొందరపాటు స్వభావాన్ని ఆసరాగా తీసుకుని కూడా అభ్యాసులు లబ్ధి పొందుతున్నారు. **మరొక విషయంగా నెగేషన్, దాని తర్వాత స్థితిని పొందాలంటే, అభ్యాసీకి నిజమైన తపన, అవిశ్రాంతత, భక్తి మరియు ప్రేమ కలిగి ఉండాల్సిందే.** ఇప్పుడు నీ సత్సంగ్‌లోని అభ్యాసుల్లో ఈశ్వరునిపట్ల నిజమైన ప్రేమ కలిగినవారు ఎవరో నీవు గమనించవచ్చు.

ఎవ్వరైనా ఒక వంతు ప్రేమ, మరొకరు అర్థభాగం, మరొకరు పావుభాగం మాత్రమే కలిగి ఉన్నారని అనుకొందాం. ఈ విధంగా వెనుకబడి ఉండటంవలన వారికి నచ్చజెప్పటానికి గట్టిగా ప్రయత్నిస్తే వారు మిషన్‌ను విడిచిపెట్టిపోయే అవకాశం మరియు ఆగ్రహం చెందే అవకాశం ఏర్పడు తుంది. అనగా వారు తమ 'అహం'ను విడిచిపెట్టడానికి బదులుగా దానిని ఇంకా బలపరచుకుంటారు. బహుశా జనం దానిని నా కర్తవ్యంగా భావించవచ్చు, ఆ పని నేను చేస్తున్నాను కనుక. అది కొంతవరకు సబబే కాని, వారు ఎంతవరకు యోగ్యత కలిగి ఉంటారో అంతవరకే నా బాధ్యతగా వారే ఆలోచించుకోవాలి. నాకు అందరిపట్ల ప్రేమ ఉంది, కాని అది ఎంతవరకు నా బాధ్యతయో అంతవరకే. నేను ప్రతి ఒక్కరినీ శరణాగతి పొందమని చెబుతూ ఉంటాను. అయితే బాధాకరమైన విషయం ఏమిటంటే, ఆ విధంగా శరణాగతి పొందటానికి కనీసం అవసరమైన ప్రాధమిక విషయాలను కూడా జనం లక్ష్యపెట్టరు. నేను కూడా ఎంతో కొంత సంతృప్తిపరచి పని నెట్టుకు వస్తున్నాను. ఎవ్వరూ తప్పుగా అర్థం చేసుకోకుండా ఉండాలని నేను వ్రాసే ఉత్తరాలలో మాటలు ఆచి తూచి ప్రయోగిస్తున్నాను.

అన్ని ఆధ్యాత్మిక స్థితులను ముఖ్యంగా నెగేషన్‌ను అనుగ్రహించేది భగవంతుడే అని అందరూ అంగీకరిస్తారు. అయితే నాకు లభించింది, ప్రాప్తించింది నా గురుమహరాజ్ నుంచి మాత్రమే. ఏమైనాగాని, నేను అటువంటి గొప్ప మహాత్మునివైపు ఆకర్షితుడను కావటానికి తోడ్పడిన భగవంతునికి నేను చాలా ధన్యవాదాలు అర్పించవలసి ఉంది. మనం దేనినైన పొందటానికి గురువును ఎలా ప్రసన్నం చేసుకుంటామో, భగవంతుడు నుంచి పొందటానికి కూడా ఆ విధంగా ప్రయత్నించాలి. ఈ విధంగా చేసినట్లయితే మనం భగవంతుడిని నేరుగా ప్రేమించగలుగుతాము, అది చాలా మంచిది కూడ. దీనికి మించినది మరొక మంచి పద్ధతి లేకపోయినప్పటికీ దీనిని ఆచరించేవారు చాలా తక్కువుగానే ఉన్నారు. అభ్యాసీ ఆ విధంగా దీక్షను పెంచుకుంటూ పోవాలి. ఒకవేళ అంతగా సాధ్యపడకపోయినట్లయితే కనీసం తన గురువుకు, విద్యార్థులు విద్యాలయంలో తమ అధ్యాపకునికి అంకితమైపోయినట్లు నివేదించుకోబడాలి. ఇది బాధ్యత కూడ. దీని వలన గురువు లేదా మార్గదర్శకునికి దక్కే లాభం ఏమీ ఉండదు కాని, అభ్యాసీకి మాత్రం అర్హత కలిగి పొందదగినది పొందగలుగుతాడు. సత్యవంతమైన మార్గదర్శకుడు, గౌరవ మర్యాదలను, కీర్తి ప్రతిష్టలను ఆశించడు. ఇటువంటివారు చాలా అరుదుగా ఉంటారు. ఆ విధంగా ఆచరించిన ఫకీర్లు (బైరాగులు) కొంతమంది ఆదర్శంగా నిలిచారు. దానితో వారు జనసామాన్యం నుంచి గౌరవం పొందలేకపోయారు. ఇంకా చెప్పాలంటే, కొద్దిమంది శిష్యులు మాత్రమే మిగిలి, మిగిలినవారు తొలగిపోవటం జరిగింది. దీనికి కబీర్ మహాశయుడు ఒక ఉదాహరణ. ఆయన ఒకానొక సమయంలో ఈ విధంగానే ఆచరించాడు.

సోదరా శుక్లాజీ! నేను, నాకు అత్యంత ప్రీతిపాత్రమైన స్థితిని నీలో కల్పించటానికి అనువుగా సిద్ధపడు. ఒకవేళ అది సాధ్యపడకపోయినట్లయితే, కనీసం నా జీవితకాలంలోనే సంపూర్ణ నెగేషన్ స్థితిని పొందునట్టి అవకాశం కల్పించుకో. దీనినే నేను అందరికీ కూడా చెబుతున్నాను. మన గురుమహరాజ్ సంస్థ చాలా చాలా చిన్నదే కావచ్చునేమో కాని ఇటువంటి ఆధ్యాత్మిక విద్యపైన ఆధిపత్యం మరెటువంటి ఇతర సంస్థల్లో లేదని నేను ఘంటాపదంగా చాటుతున్నాను. ప్రతి యుగంలోను ఇటువంటి జ్ఞాన సంపన్నులుగాని, దానిని తెలుసుకోవాలనుకునేవారుగాని చాలా కొద్దిమంది మాత్రమే ఉంటారనేది వాస్తవం.

**ఈ సంస్థలో చేరినవారు నిజమైన భక్తితో 'ముక్తి'ని పొందాలనుకొనే వారే. ఇటీవల కాలంలో చాలా మంది ముక్తి కావాలని కోరుకోవటమేలేదు, ఎందుకంటే ఆ ముక్తి గురించిగాని, దాని స్థితులను గురించిగాని వారికి ఏమీ తెలియదు, తెలుసుకోవటానికి కూడా ప్రయత్నించరు. వారు ముక్తి కంటే వాహనాలు, భవనాలు, అవసరాలకు తగినంత ధనానికే ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఇటువంటివి అన్నీ దక్కకుండాపోయినపుడు వారికి ఏమి జరుగుతుందో తెలియడం లేదు.** ఇటీవలికాలంలో చాలామంది ధనవంతులు నిద్రలేమి బాధతోను, ఇతర రుగ్మతలతోను బాధపడుతన్న వారిని చూస్తున్నాం. వారు జీవితాంతం పప్పు ధాన్యాలు, రొట్టె, సొరకాయ, బీరకాయ వంటి వాటితోనే ఆహారంగా సరిపెట్టుకుంటున్నారు.

మన భారతదేశంలో స్వామీజీలు ముఖ్యంగా సన్యాసులు మనకు అపకారం కలిగేలా చాలా అపచారం చేశారు, ఇప్పటికీ చేస్తున్నారు కూడా. వారివలన కలుగుతున్న నష్టం ఎంతగానంటే, ముస్లింల కత్తులు కూడా అంతగా గాయపరచలేవు. దానివలన మన మేధస్సు కూడా మొద్దుబారి పోయింది. మంచి చెడుల విచక్షణా జ్ఞానం కూడా లేకుండాపోయింది. మన ఆలోచనలు దూషించడం, అపకారం చేయటం వంటివి గ్రహింపుకు వచ్చేలా రంగు వస్త్రాలు మనల్ని వశపరచుకుంటున్నాయి. యోగ్యులైన సన్యాసులు, పనికిరాని వారికి కూడా సన్యాసం కల్పించినందుకు నేను వ్యతిరేకిస్తున్నాను. దీని మూలంగా వారు (యోగ్యతలేనివారు) తమకుతాము గురువులుగాను, జ్ఞానులుగాను పరిగణించుకుంటున్నారు. అటువంటివారిలో చదువుకున్న వారు వేదికలమీద ఉపన్యాసాలు ఇస్తున్నారు. వారు స్వయంగా అనుభవశూన్యులు. వారిలో కొంతమంది సమర్థులు ఉన్నారు. అటువంటివారు క్షయ వ్యాధికి చికిత్స చేయడంలో తమ సమర్థతను చూపారు.

ఎవరైనా వ్యక్తి రమణీయంగా విగ్రహారాధన నిర్వర్తిస్తున్నట్లయితే అతడు మంచి ప్రశంసలు అందుకుంటాడు. అతడు స్వయంగా చెప్పగలిగేది ఏమంటే వ్యర్థమైన విగ్రాహారాధాన చేయమని మాత్రమే. దానికి కారణం ఏమిటి? అతడు తనను అనుసరించు ఒక సమూహాన్ని ఏర్పాటు చేసుకోవటానికేనని నేను చెప్తాను. నేను నా అల్పమైన ఆలోచన ప్రకారం, ఏ సంస్థలోనయితే అసలైన ఆధ్యాత్మిక విద్య అభ్యసింపబడదో అది ఒక సంఘం మాత్రమే. వారు ఆ సామాజికులకు చెప్పే విధానాలన్నీ పరమాత్మ సన్నిధికి చేర్చటానికి బదులు ఇంకా దూరం చేస్తాయి. అనగా వారు కొయ్య కీలుబొమ్మలుగా తయారవుతారు. ఇలా కాకుండా దాని కంటె మంచి పని ఏమిటంటే, అతడు వారిని మలచకుండా అలాగే ఉంచితే పచ్చని చెట్టుగా ఉండి అవసరమైన విధంగా మలచడానికి వీలవుతుంది. ఇప్పుడు సన్యాసుల పని ఎలా ఉందంటే, రాతియుగాన్ని పునరుద్ధరించినట్లు ఉంది. మరి ప్రజలకు కూడా ఇదే నచ్చుతోంది. ఇటువంటి మనుష్యులనే ప్రజలు మహాత్ములుగా భావించి వారికి దాసులవుతున్నారు. ఇది కలరా, ప్లేగ్ వంటి అంటువ్యాధి. దీనిని కబీరు చాలా ముచ్చటగా చెప్పాడు: "బ్రహ్మాన్ని వదిలి, జనం రాళ్ళను పూజిస్తున్నారు" అని. **విగ్రహారాధాన అనేది చాలా స్థూలమైన పూజ. ఎందుకంటే, జపం మొదలైనవి శుద్ధంగా చెప్పబడకపోవటంవలన జనం ఇంకా పతనం చెందుతారు. ఈ స్థూల పూజలవలన కలిగే అరిష్టాన్ని నేను ఇంకేరకంగా వివరించాలి. అభ్యాసుల మంచికోసం నేను దీనిని సూక్ష్మంగా వివరించాను. నాకు సన్నిహితులైన వారి కోసం నేను ఇలా చెప్పాల్సి**

**ఉంది కూడా.** ఈ సన్యాసులకు, వారి అనుచరులకు (శిష్యులకు) నేను ఈ విషయాలు చెప్పితే వారు నాపట్ల కోపగించుకోవచ్చు. అందుచేత ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోతున్నాను. ప్రకృతి ఈ పరిణామాన్ని చాలా తీవ్రంగా గమనిస్తోందని, దాని ఫలితం ఏమవుతుందోనని గట్టిగా హెచ్చరించగలను. కాని ప్రకృతి నాకు అప్పగించిన పనిలో ఎటువంటి జోక్యం కల్పించుకోకుండా ఉండటం దాని దయా విశేషం వల్లనే. నా అంతట నేనుగాను, ప్రకృతి కూడా నన్ను నా గురుమహరాజ్ చేతుల్లో ఉంచటం మూలంగాను నేను ఒక విధేయునిగా ఆజ్ఞకోసం వేచి ఉన్నాను.

ఇప్పుడు ఉన్న ఇబ్బంది ఇంకొకటి ఏమంటే, మీరు నా సమయాన్ని ఎక్కువుగా వినియోగించుకుంటూ ఉన్నందువలన, నాకు దైవీయ కార్యాలు నిర్వహించటానికి సమయం దొరకటం లేదు. ఈ విధంగా సమయం ఎవరివలన వృథా అవుతున్నదంటే, ఆధ్యాత్మిక విద్యను (బ్రహ్మ విద్యను) నిజంగా అర్థం చేసుకోవాలను సంకల్పం వారికి లేకపోవటంవల్లనే. ఆ విధంగా వారు శరణాగతిని పొందినట్లయితే నా సమయం వృథా కాకుండా ఉంటుంది. జనం కష్టపడకుండా ప్రతిదీ ఉచితంగా చేకూరాలని వాంఛిస్తూ ఉంటారు. ఇందుకు నాకు అభ్యంతరంకాని, నిరసనకాని లేదు. ఎందుకంటే, నేను దీనికొరకే రప్పించబడ్డాను. ఈ సేవలు అందించినందుకుగాను జనం నా మీద గౌరవం ఉంచి, నేను ఇతర దైవీయ కార్యాలు నిర్వహించు అవకాశం కల్పించాలి. అభ్యాసులు కనుక వారు ఉండాల్సిని రీతిలో వారే స్వయంగా తయారైతే, వారు నా నుంచి పొందవలసినది (ప్రాణాహుతి) సూటిగా పొందుతూనే ఉంటారు. జనం అనేక విధానాలను ఆశ్రయించటం విడిచిపెట్టి, ఒకే ఒక విధానం మీద శ్రద్ధపెట్టి, ఈ విషయాలను గ్రహించి, వారిలో బ్రహ్మవిద్యను అభ్యసించాలను తపన, అభిరుచిని పెంచుకోవటానికి ఉపయోగపడాలను ఉద్దేశ్యంతో, నేను ఈ ఉత్తరంలోను, గత ఉత్తరంలోను ఈ విషయాలు ప్రస్తావించాను. ఈశ్వరుడు ఈ విధంగా అనుగ్రహించుగాక!

ప్రియ పుత్రీ మరియు సోదరుడు శుక్లాజీ! నేను ఈ సుదీర్ఘమైన ఉత్తరాలు వ్రాసి మీ సమయాన్ని చాలా నష్టపర్చాను. ఈ సుదీర్ఘ లేఖలు వ్రాయటానికి సమయం వెచ్చించకుండా, అంత సమయాన్ని మీకు ప్రాణాహుతిని ఇవ్వటానికి ఉపయోగించి ఉన్నా, అలాగే మీరు అంత ఎక్కువ సమయం ధ్యానం చేయటానికి అవకాశం కలిగి ఉన్నా, ఎక్కువ ఫలితం కలిగి ఉండేదని మీ హృదయంలో భావన కలిగి ఉంటుందేమోనని నేను అనుకుంటున్నాను. **మీరు నా ఉత్తరాన్ని చదివినట్లయితే, మీ సమయం వృథా కాలేదని గ్రహించగలుగుతారు. 'మాలిక్' (లాలాజీ సాహెబ్) దయవలన నా యొక్క ప్రతి ఉత్తరంలోను మీకు ఈ దివ్య ప్రాణాహుతి చేకూరుతూనే ఉంటుంది.**

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 285

లఖీంపుర్,

6.03.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం అందిందని భావిస్తున్నాను. కేసర్ ఆరోగ్యం బాగైందిగాని దగ్గు, జలుబు ఇంకా ఉన్నాయి. 'మాలిక్' దయతో పెద్దసోదరుని (తులసీదాస్)కి ఢిల్లీలోని రైల్వే ఎగ్జిబిషన్‌లో ఉద్యోగం దొరికింది. 'మాలిక్' దయతో ఇప్పుడు కలిగిన స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఇప్పటివరకు కలిగిన దశలన్నీ నాలో లయమైపోయినట్లుగాను, సమాప్తమైపోయినట్లుగాను నాకు ఇప్పుడు అనుభవమవుతోంది. ఏ దశ గురించి అయితే నేను తరచుగా తమకు ఇంతకుముందు వ్రాశానో అనగా ఏదో ఒక చిత్రం నా కళ్ళల్లో స్వతస్సిద్ధంగా గీయబడిందనే దానిని కూడా నేను మరచిపోయినట్లు అనిపిస్తుంది. ఇంకొక మాటలో చెప్పాలంటే, నా 'మాలిక్' దాని అనుభూతి నుంచి నాకు విముక్తి కలిగించారనుకుంటాను. అది ఏమిటో నా

మాలిక్‌కే తెలియాలి. పూజ్య శ్రీ బాబూజీ, అదేమిటోగాని వ్యవహారిక రూపంలో (Practicalగా) చీకటి, కాంతుల అనుభవం కూడా లేకుండా పోయింది. అప్పుడప్పుడు నేను చీకట్లో, చీకటిగా ఉందని భావించినప్పటికీ అది చీకటి అనిపించటం లేదు. కాంతి (ప్రకాశం) విషయంలో కూడా అటువంటి అనుభవమే కలుగుతోంది. ఇప్పుడు ఒకవేళ అవసరం కల్పించుకున్నట్లయితే, అనగా చీకట్లో వెలుతురు ఉన్నదనిగాని, వెలుతురులో చీకటి ఉన్నదనిగాని, జ్ఞానం కల్పించుకోవాలన్నా కూడా దాని అవుసరం నాకు ఉండటం లేదు. నిజం చెప్పాలంటే, నాకు వీటి విచక్షణ కూడా లేకుండాపోయింది. నేను అన్ని వస్తువుల స్వభావాన్ని కూడా పూర్తిగా మరచిపోయాను. నేను ఎక్కడ ఉన్నా, నా మాలిక్‌పైకే నా దృష్టి, దానిని నేను తపనగా చెప్పినప్పటికీ అది సరైనదే. బాబూజీ, నాలోనే నేను అదృశ్యమైపోయానని అనిపిస్తోంది. పైన వ్రాసిన తపన అను దానిని నేనుగానే భావించండి. అదేమిటోగాని పైన చెప్పినవన్నీ నా నుంచి మాయమైపోయాయా లేక నేనే మాయమైపోయానో తెలియదు. ఇప్పుడు నమ్రత, నమ్రతలేమి స్థితులను కూడా నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. ఆ నమ్రత దశలో నేను వ్యాపించిపోయినట్లుగాను, ఆ దశయే వ్యాప్తిచెంది అన్నివైపులకు సమానంగా విస్తరించిపోతున్నట్లుగాను అనిపిస్తోంది. ఇప్పుడు నా వ్యాప్తి అనేది ఏమీ తెలియటం లేదు, అది ఎప్పుడో ముగిసిపోయింది, కాని ఇప్పుడు దశయే వ్యాపిస్తున్నదని అనిపిస్తోంది. బహుశా నేను దానిలో మిళితమైపోయి ఉంటున్నానేమో తెలియదు. బాబూజీ, ఇప్పుడు దశ ఎంత సహజరూపం దాల్చిందంటే, స్వాభావికతయే ఒక దశ అన్నట్లు ఉంది. ఎలాంటి సూక్ష్మమైన బంధనం యొక్క భారం నా స్థితిని స్పృశించటం లేదు. ఇప్పుడు నా స్థితి స్వచ్ఛం, పవిత్రం. దశ ఇప్పుడు శుద్ధరూపం దాల్చినట్లు అనిపిస్తోంది. ఆ స్థితియే నాకు అనుభవమవుతూ ఉంది. అది అన్నివైపులా అన్ని దిక్కుల్లోను అలాగే ఉన్నట్లు ఉంది. నేను ఇప్పుడు మాలిక్‌కు పూర్తిగా అర్పితమైపోయినట్లు అనిపిస్తోంది. నేను ఎప్పుడూ నగ్నంగానే ఉంటున్నట్లు లేదా నగ్నంగా అయిపోయినట్లు అనిపిస్తోంది. నా బాబూజీ, ఇప్పుడు దశ ఏమిటి అంటే, అది పూర్తిగా గాజులాగా (అద్దంలాగ) అయ్యింది. తమరు, "నీవు త్వరత్వరగా అనుభూతి చెందు" అని నాకు వ్రాశారు. నేను అందుకు త్వరపడుతున్నాను. అంతా 'మాలిక్'కు తెలియాలి. 'అతని' సంకల్పం ఏమిటోగాని, నా దశ ఇప్పుడు పూర్తిగా నగ్నంగా అయిపోయింది. అమ్మ తమకు శుభ ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెప్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 286

షాజహాన్‌పూర్,

8.03.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. ఈ వీరగాథ (అల్హా)ను ఇంతగా వివరించిన తర్వాత నీ ఉత్తరం 4.03.1953వ తేదీతో ఉన్నదానికి సమాధానం వ్రాయించటానికి అవకాశం లభించింది. ఒక వీరునిగాథ (అల్హా) విన్నంతసేపు జనంలో ఆవేశం, సాహసం కలుగుతాయి కనుక నేను ఇక్కడ అల్హా (వీరునిగాథ) అని ప్రయోగించాను. అదే విధంగా నా ఉత్తరాలు విన్నప్పుడు, కొంతసేపు తమ హృదయం, మనస్సును ఉత్తేజపరచుకుంటారు. అందుచేత దానిని 'అల్హా ' (వీరగాథ) అని మాత్రమే చెప్పాల్సి ఉంటుంది. ఎప్పుడైతే అభ్యాసులు రాముని పొందనంతవరకు తపనతో శాంతించనివారుగా ఉంటారో, అప్పుడు అది 'రామకథ'గా మారుతుంది.

నీ ధైర్య సాహసాలకు, విశ్వాసానికి నేను ఉప్పొంగిపోతున్నాను. అయితే విశ్వాసానికి కూడా ఉన్నత స్థాయి ఉంది, అది నాకు ఒకసారి అనుభూతమయ్యింది. నీవు ఆ స్థితికి చేరినప్పుడు తెలియజేస్తాను. ఆ స్థితి ఇంకా చాలా దూరంలో ఉంది. అది నీ ప్రస్తుత స్థితిలాగానే ఉత్పన్నం అవుతుంది. నీ యొక్క స్థితిని చూసి నేను చాలా

సంబరపడిపోతాను. **అంతేకాదు, ఈ సహజమార్గం అనుసరిస్తూ ఉన్న వారందరితోను నీ గురించి ప్రశంసలు కురిపిస్తాను.** అయితే నా దృష్టిని ఎలా సారించను? ఉన్నతి యొక్క సాగరంలో నాకు ఒక్క బుడగ మాత్రమే కనిపిస్తోంది. బిటియా! నీ ప్రేమ, పరిశ్రమ కేవలం ఒక బుడగ పరిమాణంలోనే ఉన్నతిని తెలిపాయని ఎక్కడా, ఎవ్వరితోనూ చెప్పకు. ఇంతగా పరిశ్రమించినప్పటికీ నీవు నాకు ఒక బుడగలాగానే కనిపిస్తుంటే, మరి దానిని నేను ఏమని చెప్పను. ఇది నా దృష్టి లోపం మాత్రం కాదు.

నీవే కనుక ఆశించినంతగా తపన పెంచుకొన్నట్లయితే, భగవంతుడు తలచుకుంటే, నీవు ఆ ఉన్నత శ్రేణికి చెందిన పరమానందాన్ని పొందగల సూచనలు బాగా కనిపిస్తున్నాయి. నా వెర్రితనం యొక్క జ్వాలాణువులు నీ మీద మంచి ప్రభావం చూపినట్లు నీ ఉత్తరం తెలియజేస్తోంది. ఇదే విధంగా అభ్యాసుల్లో కూడా ప్రభావం కలిగించగలిగితే వారిలో మంచి మార్పు కలుగుతుంది. నీవు ఆరంభంలో ప్రేమికుడుగా భావన చేసుకొన్నావు. దాని ఫలితంగా అభ్యాసీ ప్రియతముడుగా అవుతాడు. కాని నీవు ఇంకను పరిపూర్ణ ప్రేమికునిగా తయారుకాలేకపోయావు. ఏదో ఒక సందర్భంలో ఈ విధంగా తయారయ్యే అవకాశం ఉంటుంది. అయితే నీ అహం ఇంకా పూర్తిగా నశించలేదని నేను గట్టిగా చెప్పగలను. ఇంకా కొంచెం ఉన్నత స్థితికి చేరాక దైవం అనుగ్రహిస్తాడు కాని అది కూడా కొంతమేరకే.

వాస్తవానికి ఎవరిదైనా 'అహం' అనేది సంపూర్ణ నెగేషన్‌లోనే నశిస్తుంది. అది నా దృష్టి ప్రకారం ఉండవలసిన అసలైన మహత్తరస్థాయి దాని తర్వాతనే ఆరంభమవుతుంది. ఇది ఎవరికి తెలుసు? నాకు అప్పుడప్పుడు జనం ఈ స్థాయికి ఎదగాలని తపన కలుగుతూ ఉంటుంది. నీవు వ్రాసిన ఇంకొక విషయం –"నమ్రత స్థితిలో నేను లయమైపోతున్నాను" అని. దాని తర్వాత మరొక విషయం వ్రాశావు – "అదే నా రూపంగా మారిపోయింది, ఇంకను ఆ దశను కలిగి ఉండి కూడా దానిని తెలియని దానిలాగ ఉంటున్నాను"– అని. ఇంకా "దానిలో లయావస్థ కొనసాగుతూనే ఉంది" అని కూడా వ్రాశావు. ఇది చాలా మంచి స్థితి. దీనినిబట్టి నీవు ఆ లయావస్థ ఒడ్డుకు (దరికి) చేరినట్లు అర్థమవుతుంది. నీవు స్వయంకృషితో ఎంతవరకు సాధించగలవోనని నేను పరిశీలిస్తున్నాను. నేనయితే నిన్ను పైకి తీసుకుని వెళ్ళుతూనే ఉన్నాను. దాని ప్రభావంతోనే దీనిలో లయ అవస్థ కలుగుతుంది. మరి నాకు అకస్మాత్తుగా తలంపు కలిగినట్లయితే అది నావలన జరగని పని కాదు, అప్పుడు నిన్ను దానిలో లయమవునట్లయినా చేస్తాను లేదా దానిలో లయం కాగలిగిన శక్తినైనా కల్పిస్తాను. అది 'మాలిక్' ఇష్టానుసారం జరుగుతుంది. నిన్ను దిగువస్థాయిలో ఉంచటానికి ఇష్టపడను. నేను ఈ ఉత్తరం వ్రాయిస్తూ ఉంటూనే ఇప్పుడు నిన్ను 'N' స్థానంలోకి చేర్చాను. దైవేచ్ఛ ఉండాలేగాని, మూడు లేదా నాలుగు రోజుల్లోనే దానిలో యాత్ర ప్రారంభమవుతుంది. ఇప్పుడు సమయం రాత్రి గం. 9.50 ని॥లు. ఈ సమయంలోనే నిన్ను 'N' స్థానానికి చేర్చాను. అమ్మగార్కి నా ప్రణామం.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 287

లఖీంపుర్,

9.03.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. చిన్నసోదరుడు మరియు మంజూల వ్యాధులు కూడా నయమైపోయాయి. వీలైతే సాయంత్రం పార్క్‌కు తీసుకుని వెళ్దామని అనుకుంటున్నాము, కనుక చింతించాల్సిన పనిలేదు. 'మాలిక్' దయతో ఏర్పడినటువంటి దశను గురించి వ్రాస్తున్నాను. 7,8 తేదీలలో ఒక దశ ఏర్పడింది. అది ఎటువంటిది అంటే, ఒక స్థితికి దాని తర్వాత రాబోయే స్థితికి మధ్య ఉన్నటువంటి దశ అయినందున

అన్నిరకాల అలసత్వం ఏర్పడింది. అయితే 'మాలిక్' కృపతో 8వ తేదీ సాయంత్రం 6 లేదా 7 గంటల నుంచి దశలో మార్పు వచ్చింది. ఇప్పుడు ఏమనిపిస్తూ ఉంది అంటే, ఏ దశ కూడా ఎంత మాత్రం లేదనిపిస్తోంది. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, నా ఆలోచనలో లేదా దృష్టిలో 'మాలిక్' గురించిన దృష్టి, అది చెడ్డదే అయినాగాని అసలు ఉన్నదా లేదా అని. అది ఉందో లేదో సంగతి అటుంచి, అసలు ఆలోచనగాని, నిరాలోచనగాని నాలో లేకపోయినప్పుడు ఆ ప్రస్తావన ఎందుకు? ఇప్పుడు దశ ఇంకా గాంభీర్యం అనగా గాఢంగా ఉన్నట్లు నాకు తెలుస్తోంది. నిన్న సాయంత్రం తమరు నన్ను దయతో 'N' పాయింట్‌కు చేర్చారనిపిస్తోంది. యాత్ర ముందుకు సాగిపోతున్నది, అందుకు ధన్యవాదాలు. ఆలోచన, నిరాలోచన లేదా దృష్టి, దృష్టిలేమి స్థానంలో ఒక నిశ్శబ్దమైన ఎడారి ప్రాంతం కనపడుతూ ఉంది. పూజ్య శ్రీ బాబూజీ, ఆలోచనమీద భారం పడటంవలన దానిని 'అనుభూతి' అని చెప్పటానికి వీలుకాదు. నిరాలోచన లేదా దృష్టిలేమి అని చెప్పటానికి వీల్లేదు. ఎందుకంటే, ఆ స్థితి ఎప్పుడో అంతర్థానమై పోయింది. ఇంకా ఎప్పుడైనాగాని ఆ నిరాలోచన దశ గురించి స్ఫృహకు వచ్చినట్లయితే, ఏదో అయిష్టమైన దశకు చేరుకున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఏమి చెప్పాల్సి ఉందంటే, ఉన్నదేదో ఉంది, ఎలా ఉండాలో అలా ఉంది. అదేదో 'మాలిక్'కు బాగా తెలుసు. ఇప్పుడు నా దృష్టి, కాదు కాదు నా మానసం లేదా దశ కూడా అద్దంలాగా అయిపోయింది. దశ రెండు పాయింట్ల మధ్యస్థమైనదిగా ఉన్నప్పుడు దృష్టి లేదా ఆలోచన అస్తవ్యస్తంగా ఉంటుంది. ఎప్పుడైతే 'మాలిక్' నన్ను పైన ఉన్న పాయింట్‌కు చేర్చారో అప్పుడు ఆ దశకు మళ్ళీ దృఢత్వం, ప్రయాణించటానికి మార్గం ఏర్పడ్డాయి. ఎప్పుడైతే ముందుకు పురోగమించే మార్గం తెరవబడిందో అప్పుడు దానిలో నడక వేగవంతం అయ్యింది. బహుశా 'మాలిక్' కూడా అనుభవాన్ని శీఘ్రతరం చేయనారంభించాడని అనుకుంటాను. ఆలోచన లేదా దశ ఎంతెంతగానైతే గాంభీర్యమో లేదా ధృడత్వం చేకూరుతాయో అంతగానూ అది చిన్నాభిన్నంగా ఉంటుంది. ఇప్పుడు దశ అద్దంలాగా అయిపోయినట్లు ఉంది. ఇక్కడ చాలా దూరం నుంచి కూడా కొన్ని సంగతులు దృష్టికి వచ్చాయి కాని 'మాలిక్' ఆ అద్దాన్ని దూరంగా ఉంచారు. అందువలన 'మాలిక్' ఇచ్చిన ఆ అద్దం పరిశుభ్రంగానే ఉంటుంది. 'వారు' తయారుచేసిన అద్దం మీద 'వారి' కృపవల్లనే మరే దృశ్యమూ ప్రతిబింబించదు. అందుచేత అది యధాతథంగా ఉంటుంది. 'వారి' దయతో అది (అద్దం) ఇంకా శుభ్రపడుతూనే ఉంటుంది. ఆధ్యాత్మిక దశల యొక్క ప్రతిబింబం ఆ అద్దాన్ని ఇంకా ఉజ్వలంగా ఉంచుతుంది. అదేమిటో 'మాలిక్'కు మాత్రమే తెలుసు. 'వారి' కృపతో అది ఇంకా పరిశుభ్రమవుతూ ఉంటుంది. ఇప్పుడు హృదయం యొక్క స్థితి ఏమిటంటే, దానిలో ఏ వస్తువుగాని, ఏ విషయంగాని లేనేలేవు. అది కూడా అద్దంలాగే తయారయ్యింది. ఇప్పుడు ఒక విషయం ఏమిటంటే, నాకు ఇదివరకటిలాగా 'అతడు' నా కోసం తపించటం లేదనిపిస్తోంది. అయినప్పటికీ నేను నిరాటంకంగా వారివైపుగా దూసుకుపోతున్నాను. నేను 'వారి'లోనే హరించుకుపోతున్నట్లు అనిపిస్తోంది. ఉత్తరం చాలా త్వరత్వరగా వ్రాస్తున్నాను. ఎందుకంటే, మాస్టర్ సాహెబ్ ఇక్కడే కూర్చుని ఉన్నారు. దీనిని చదవటం మీకు కష్టమని కూడా అనిపించవచ్చు కనుక క్షమించమని వేడుకుంటున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 288

లఖీంపుర్,

12.03.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు నా ఉత్తరం చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఈ రోజు బహుశా దద్దా కూడా చేరి ఉండవచ్చు. పెదనాన్నగారు (తావూజీ) ఈరోజు కేసర్‌ని కాన్పూర్ చేర్చటానికి తీసుకుని వెళ్ళారు.

చిన్నసోదరుడు మరియు మంజూ యొక్క మశూచి మొన్నటినుంచి తగ్గిపోయింది, కిచిడీ వగైరాలు తింటున్నారు. 18వ తేదీ నుంచి పరీక్షలు ఉన్నాయి. ఈశ్వరుని దయతో అప్పటికి అంతా బాగానే ఉంటుందని అనుకుంటాను. తమ ఆరోగ్యం కూడా బాగుపడిందని ఆశిస్తాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నా స్థితి కబీర్‌దాస్ మాటల్లో చెప్పినటువంటి "దాస్ కబీరా జుగతి సోం ఓఢీ జ్యూం కే త్యూం ధరి దీన్హీ రె" అన్నట్లు ఉంది. అనగా కబీర్‌దాస్ ఈ జగతిని ఉన్నది ఉన్నట్లు తనపై ధరించి, ఆ తర్వాత సురక్షితంగా ఎలా ఉందో అలా ఉంచాడు" అని. ఇదివరకైతే తనకు తానుగానే 'మాలిక్' నా దృష్టిలో నిలిచి ఉండేవారు, కాని ఇప్పుడు నేను వారి దృష్టి నుంచి అదృశ్యమైపోయినట్లు ఉంది. అది ఎందుకో దైవానికే తెలియాలి. ఇంకోమాటలో చెప్పాలంటే, తనకు తానుగానే అనేది దానంతట అదే తొలగిపోయింది. ఎవరైతే ఎల్లప్పుడు సహజంగానే నా దృష్టిలో ఉంటూ ఉండేవాడో, 'అతడి'ని ఆలోచన మాత్రంగానైనా గ్రహించటానికి ఇప్పుడు ఇష్టం ఉండటం లేదు. ఇప్పుడు ఎటువంటి దశ ఉంది, ఎటువంటి ఆలోచనలో ఉన్నాను అనేది దైవానికే తెలియాలి. అలాకాదు, ఏదైతే అది, 'మాలిక్' కృపతో అనుగ్రహించబడింది. అంతకుమించి నాకేమీ తెలియదు.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నా మనస్సు, హృదయానికి ముందుకు పురోగమించటంలో కలిగే దశలు స్వచ్ఛంగా, సరళంగా కనిపిస్తున్నాయి. అందుచేత అవి ఎప్పుడూ అక్కడే ఉండటానికి ఇష్టపడుతున్నాయి. ఇప్పుడు ఒక అద్దంలాంటి స్థితి నా అన్నివైపులా ఉందనిపిస్తుంది. ఇంకొక మాటలో చెప్పాలంటే, ఇటువంటి మైదానం లేదా దశలోనే నేను ఈదుకుంటూ పోతున్నాను. కాని ఇప్పుడు ఈ దశను నేను మరచిపోయి ఉంటున్నట్లు అనిపిస్తోంది. ఏదీ గుర్తుకు రావటం లేదు. ఒకవేళ అది నా దృష్టికి వచ్చినప్పటికీ అద్దంలాగా ఉండి నేను గతంలో వ్రాసిన పరిశుభ్రమైన అద్దంలాగ ఈ అద్దం అనిపించటం లేదు. కాని చాలా తేలికగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఆ దశ లేదా మైదానం కూడా తేలికగాను, మసకగాను అయిపోయింది. ఆ విధంగా మసకబారిపోతూ క్రమక్రమంగా కనుమరుగై పోతున్నట్లు ఉంది. అది నా జ్ఞాపకానికి అంతుచిక్కనిదిగా ఉంది.

జియా ఉత్తరం ద్వారా బిట్టో జ్వరం ఇప్పుడు తగ్గిపోయిందని తెలిసింది. ఇంతకుపూర్వం కంటే బాగుంది కాని ఇంకా ప్లాస్టర్ అలానే ఉంది. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతుండగా, కేసర్ ప్రణామం చెప్పి వెళ్ళింది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 289

షాజహాన్‌పూర్,

14.03.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

భగవదాశీస్సులు కలుగుగాక! నీ ఉత్తరం 9.03.1953వ తేదీతో వ్రాసినది అందింది. నీవు దాటిన పాయింట్లను (స్థానాలను) నేను A,B,C,D.....గా నామకరణం చేసినట్లు నీకు తెలిసిన విషయమే. నా దృష్టి సారించినంతలో 'A' నుంచి 'Z' వరకు పాయింట్లు లెక్కించటం ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. ఈ స్థానాలను లెక్కించే ప్రయోగం చేస్తున్నాను. ఈ విధంగా లెక్కించుకుంటూ పోవటం ఎంతకాలం పడుతుందో అని నాలో అప్పుడప్పుడు అశాంతి కలుగుతుంది. నేను ఏమి చేయాలో నీవే చెప్పు. ప్రతి స్థానం (పాయింట్)లోను యాత్ర జరపటం కంటే ఇంకా మంచి మార్గం ఏదైనా ఉంటుందా? నేను పైకి తీసుకుని వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా యాత్ర జరిపించటం మీదనే దృష్టిపెడతాను. అయితే ప్రతిపాయింట్‌లోను, నిన్ను యాత్ర చేయించాలని ఎందుకు కోరుకుంటున్నానంటే, భగవదానుగ్రహం వలన నీలో అనుభవశక్తి బాగా ఉన్నందువల్లనే ప్రతి అభ్యాసీలోను ఇటువంటి స్థితి కలుగుతుందిగాని అతడు దానిని గ్రహించలేకపోతాడు. నా గురించి నాకు ఏమీ తెలియదు కాని, నేను 'లాలాజీ సాహెబ్' మహాసమాధికి కొద్ది

రోజులముందు 'వారి' దగ్గరకు వెళ్ళినప్పుడు ఆ ఉన్నతస్థితిని అనుగ్రహించారు. ఆ తర్వాత లాలాజీ సాహెబ్ ఏయే పాయింట్లకు నన్ను చేర్చారో, ఏ ఏ స్థానాల్లో నన్ను ప్రయాణింపజేశారో అది భగవంతునికే తెలియాలి, కాని అందుకు 12 సంవత్సరాల వ్యవధి పట్టింది. ఆ తర్వాత ప్రస్తుతస్థితి కలగటానికి ప్రారంభం జరుగుతుండగా 'వారు' రేయింబవళ్ళు 3 నెలల కాలం నా మీద తమ దృష్టిని కేంద్రీకరించారు. రాత్రిళ్ళు వారు నన్ను ఆధ్యాత్మిక శక్తితో నింపుతున్నట్లు నేను అనుభూతి చెందాను. నా తెలివితేటలు పనిచేయకపోతున్నాయి. ఎందుకంటే, నాలో తొందరపాటు స్వభావం కారణంగా, **ఎవ్వరిలోనైతే అభిరుచి, ఉత్సాహం మరియు ప్రేమ ఉన్నాయో అటువంటి వారిని కనీసం 5వ వలయానికి చేర్చివేసి, వారిపట్ల నా బాధ్యతను నిర్వహించి విముక్తుడను కావాలనుకుంటున్నాను. ఆ తర్వాత వారికి సాహసం ఉండి ప్రయిత్నిస్తే ఇంకా ముందుకు నడిపిస్తాను.** మాస్టర్ సాహెబ్‌కు సంబంధించి నా బాధ్యత విషయంలో నిశ్చింతగా ఉన్నాను. అయినప్పటికి అప్పుడప్పుడు దృష్టి సారిస్తూనే ఉంటాను, అది నా బాధ్యత కూడ. వారికి మిషన్‌పట్లగల ప్రేమ, కృషి వారిని ముందుకు నడిపిస్తున్నాయి.

అప్పుడప్పుడు నీ గురించిన ఆలోచన కూడా వస్తూ ఉంటుంది. నిన్ను 5వ వలయానికి చేర్చినట్లయితే నీపట్ల కూడా నా బాధ్యత పూర్తవుతుంది అని. దీనినిబట్టి నేను ఇంక ఎవ్వరినీ దానికిమించి పురోగమింపజేయటానికి సుముఖంగా లేననిమాత్రం భావించవద్దు. **నాకంటె ఎక్కువగా అభ్యాసులు పురోగమించితే అప్పుడు నేను బాగా సంతోషపడతాను.** నా పురోగతి గురించి ఏముంది, అది నిద్రిస్తున్నట్లు ఉండి, ఆ నిద్ర తెలియనట్లు ఉంటుంది. అంతా మంచిదే. ఏది, ఎలా ఉన్నా నేను 'వారి'కి ధన్యవాదాలు అర్పిస్తున్నాను. అంతేకాదు, జనం (అభ్యాసీలు) దీనికిమించి పొందటానికి సాహసించాలని కోరుకుంటున్నాను. అయితే ఎవ్వరైనా పది పన్నెండు మంది అయినా నాలాగ తయారై, దానిని వివరించగల శక్తి సామర్థ్యం కూడా వారికి కలిగినట్లయితే, మిషన్‌యొక్క స్వరూపమే మారిపోతుంది. అందుకు దైవానుగ్రహం కలగాల్సి ఉంది. ఇప్పుడు నీ ఉత్తరానికి సమాధానం వ్రాస్తున్నాను. "దశ ఇంకా లోతుగాను, గంభీరంగాను ఉంది" అని నీవు వ్రాశావు. దాని అర్థం లయ–అవస్థ ఇంకను వృద్ధిచెందినట్లు, అది ఆ స్థానానికి చెందిన అనగా నీవు ఉన్న స్థానానికి చెందిన లయ–అవస్థగా గ్రహించాలి. ఈ స్థానంలో లయ–అవస్థతోపాటు సారూప్యతా స్థితి ఉంటుంది. నేను నిన్ను 'N' పాయింట్‌కు చేర్చాను, మరి ఈ అనుభూతి సవ్యమే.

**మనం ముందుకు సాగిపోతూ ఉంటే, సూక్ష్మత్వం చెందుతూ ఉంటాము. అది ఎంతగానంటే మనమంటూ లేకుండాపోతాం. ఆ విధంగా మనం లేకుండాపోవటమే జరగాలి. ఈ విషయంలో ఇంకా కొంచెం వివరిస్తాను. మనం సూక్ష్మత్వం చెందుతూ ఉన్నప్పుడు, మన హృదయంలో సూక్ష్మమైన అలలు రేకెత్తుతూ ఉంటాయి. ఎప్పుడైతే మనమంటూ లేకుండాపోతామో అప్పుడు హృదయంలో అలలు రేకెత్తడం కూడా నిలిచిపోతుంది. ఆ అలలు ఎంత సూక్ష్మమైనవే అయినప్పటికీ, అది మన శాంతికి భంగం కలిగిస్తూనే ఉంటాయి. అంతేకాదు, మన ఇంద్రియాలు ఎంతోకొంత ఆనందానుభూతిని చెందుతూ ఉంటాయి. మనం ఆ సూక్ష్మత్వం నుంచి విముక్తమైనప్పుడే వాటి నుంచి కూడా విముక్తులమవుతాం.** చాలా సంక్షిప్తంగా వ్రాశాను, ప్రస్తుతానికి ఇదే సరిపోతుంది.

ఈ రోజు అనగా 15.03.1953వ తేదీన ఉదయం గం. 9.20 ని॥లకు నిన్ను 'O' స్థానానికి చేర్చాను.

అమ్మగార్కి ప్రణామం.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 290

లఖీంపుర్,

16.03.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు చేరింది. వాస్తవంగా పాయింట్ 'O' గురించి తమకు ఉత్తరం వ్రాయటానికి సిద్ధపడ్డాను, అయితే ఈ రోజు తమ ఉత్తరం కోసం నిరీక్షిస్తున్నాను. తమకు అనేకానేక ధన్యవాదాలు. ఈశ్వరుని కృపతో పెద్దసోదరుడు నెలకు రూ. 250/- జీతంతో ఎగ్జిబిషన్‌లో పని చేయటానికి ప్రస్తుతం ఒకటి లేదా ఒకటిన్నర నెలలకు ఉద్యోగం పొందారు. అమ్మ, ఇతరులందరూ తమకు ధన్యవాదా లర్పిస్తున్నారు.

"ఉన్నతిమార్గంలో నీవు ఇంకనూ నాకు ఒక బుడగలాగా కనిపిస్తున్నావు" అని తమరు ఇంతకుపూర్వం ఉత్తరంలో వ్రాసారు. అంతేగాక "ఇది నా దృష్టి లోపం కాదు కదా!" అని కూడా వ్రాశారు. దీనిని తమరు బాగా వ్రాశారు. ప్రస్తుతానికి అది నిజమే, ఎందుకంటే నేను 'మాలిక్' కృపతో ఇప్పుడే అర్థం చేసుకోగలుగుతున్నాను. ఏమిటంటే, నా 'మాలిక్' హృదయం అగాధం, దానిని గురించి ఎంత వివరించి చెప్పినా అది చాలా తక్కువగానే ఉంటుంది. దాని లోతులో ఎలా ఉందంటే, "జోయి జోయీా వైరూా, తేయీా ఉబారూం" అనగా ఎంతెంతగా లోతుకు ఈదుకుంటూ వెళ్ళితే అంతంతగా పైకి నెట్టివేయబడుతున్నాను. అయితే 'మాలిక్' కృప కూడా అగాధమని నాకు బాగా తెలుసు. పూజ్య శ్రీ బాబూజీ, 'తమరు' తమ ఈ ఉత్తరంలో "నీ అనుభవం బాగుంది" అని వ్రాశారు. దీనికి బదులుగా అసలు ఇది ఎవరిచేత ఇవ్వబడింది అని నేను అంటాను. కేవలం తమ కృపతో మాత్రమే నాకు ఇది ప్రసాదించబడింది. ఇప్పుడు 'మాలిక్' దయతో ఏర్పడిన దశను గురించి వ్రాస్తున్నాను.

శ్రీ బాబూజీ, ఇప్పుడు నేను నడుం బిగించుకుని తమర్ని అనుసరించటానికి సిద్ధంగా ఉన్నాను. ఎక్కడికి తీసుకువెళ్తారో అక్కడికి వస్తాను, ఏమి చూపిస్తారో దానిని చూస్తాను. అయితే ఈ ఉత్సాహం పెంపొందుతూ పోవాలి. పగలు రాత్రి అనగా 24 గంటలూ 'మాలిక్'ను ఇదే ప్రార్థిస్తున్నాను. 15.03.1953వ తేదీ నుంచి 'మాలిక్' కృపతో కలిగిన దశను గురించి వ్రాస్తున్నాను.

ఆ నమ్రతా (వినయ) సాగరంలో నేను మునిగి ఉంటున్నానని అనిపిస్తోంది. అయితే ఆ నమ్రత రూపం ఇదివరకటిలాంటిది కాదు. కాని ఆ నమ్రత కరిగిపోయింది, అలా కరిగిపోయి ఏర్పడిన నమ్రత సాగరం లోతులోనే నేను కూరుకుపోయి ఉన్నాను. బహుశా ఈ కారణంతోనే నేను చొచ్చుకుపోతున్నట్లు అనిపించలేదు. ఇప్పుడు అన్నివైపులా, అహర్నిశలూ ఆ సాగరమే ఉంది; నేను దానిలో స్థిరపడి ఉన్నాను. అంతేకాదు, ఇంకా ఎలా ఉందంటే, నేను ఆ సాగరాన్ని త్రాగుతూ ఉన్నట్లుగాను, దానిని లోపలకు జుర్రుకుంటున్నట్లుగాను ఉండటంవలన అది నాలో మునిగిపోయినట్లుగాను, పూర్తిగా నాలో ఇమిడిపోయినట్లుగాను అనిపిస్తోంది. అదేమిటోగాని, ఈ సాగరం నాలో ఉందా లేక నేను దానిలో ఉన్నానా అనేది నాకు తెలియటం లేదని అనిపిస్తోంది. వాస్తవానికి ఆ సాగరమే నా పొట్టలో ఇమిడిపోయి ఉండి నా రూపంగా మారిపోయిన మాట యదార్థం. ఇంకొకటి ఏమిటంటే, నేను తరచుగా ఈ విషయాన్ని మరచిపోతూ ఉన్నాను. అందుచేత ఈ సముద్రం నాలో ఉన్నదా లేక నేను దానిలో ఉన్నానా అను విషయం తెలియని అజ్ఞానంలో ఉన్నాను. 'మాలిక్' కృపతో ఎల్లప్పుడూ అమాయక స్థితిలోనే ఉంటున్నాను. ఇంకా ఏమైంది అంటే, ఇప్పుడు నన్ను నేను ఆ అమాయక సాగరంలో నిరంతరం మునిగి ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. నా మానసం ఇప్పుడు ఏమీ తెలియని స్థితిలో ఉంటుంది. దశను గురించి తెలుసుకోవటానికి బాగా ధ్యాస నిలిపినపుడు మాత్రం ప్రతి విషయం తెలుసుకోగలుగుతున్నాను.

నేను ఎల్లప్పుడూ మరపు సాగరంలోనే (Sea of forgetfulness) మునిగి ఉన్నట్లు అనిపిస్తోంది. ఆ మరపు సాగరం (Sea of forgetfulness) యొక్క ఉపరితలం సమంగాను, నిశ్చలంగాను ఉండి, ఆ ఉపరితలంలో నేను కలిసిపోతున్నట్లు అనిపిస్తోంది. కాదు కాదు, నన్ను నేను కోల్పోయాను. ఇంకా ఏమనిపిస్తుంది అంటే, ఆ అమాయక సాగరం (Sea of Innocence) నాలో మునిగిపోతూ మునిగిపోతూ తనను కోల్పోయినట్లు అనిపిస్తోంది. మరపు సాగరం (Sea of forgetfulness) యొక్క పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఇప్పుడింకా ఏమి అనిపిస్తున్నదంటే, నేను ఎంత లోతుకు చొచ్చుకుపోతున్నానో, అంతగా పరిశుద్ధం, నిర్మలం అయిన ముత్యం (అనగా దశ) దొరుకుతూ ఉంది. బాబూజీ, ఇప్పుడు ఆత్మ యొక్క ద్వారాలు తెరచుకుంటున్నట్లుగాను, లేదా దాని నుంచి ఆత్మ యొక్క సన్నని, పలుచని కాంతితో ఆంతరికం ప్రకాశవంతమైనట్లుగాను అనిపిస్తుంది. అది అత్యంత కాంతివంతంగా కాకుండా, పరిశుద్ధం, నిర్మలం, ప్రకాశం లేదా జ్యోతిలాగా ఉంది. అప్పుడు నా ఆంతరికం కూడా దానిలాగానే అయిపోయింది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ ప్రణామం చెప్పమని వ్రాసింది. బిట్టో, చిన్నసోదరుడు ప్రణామాలు తెలియ చెప్తున్నారు. రేపటి నుంచి శెలవులు అని చెప్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 291

షాజహాన్‌పూర్,

20.03.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీవు మార్చి 12 మరియు 16వ తేదీలతో వ్రాసిన ఉత్తరాలు చేరాయి. ప్రస్తుతం నీ ఉత్తరం 12వ తారీఖు దానికి జవాబు వ్రాస్తున్నాను. "నా దృష్టిలో 'మాలిక్' ఉంటున్నాడు. అయినా నేను వారి దృష్టిలో కనుమరుగై ఉన్నాను" అని నీవు వ్రాశావు. నీ ఈ ఉద్దేశ్యాన్ని నీవు సరిగ్గా వివరించలేకపోయావు. దీనినిబట్టి నాకు అర్థమైనదానిని వ్రాస్తున్నాను. ఇది లయ-అవస్థ యొక్క స్థితి. నీవు 'మాలిక్' ధ్యాసలోకి వెళ్ళాలని భావించినపుడు, నీ ఆలోచన తారుమారై అనగా వెనుదిరిగివచ్చి నీ శరీరాన్ని తాకి ఉండవచ్చు. నా అభిప్రాయం సరిగ్గానే ఉందంటావా? అది వాస్తవమైతే నీ శరీరమంతా నీవే 'మాలిక్' అన్నట్లు అనుభూతి కలిగి ఉండేది. దీని ఫలితంగా, ఈ శరీరం వగైరా ఏమైతే ఉన్నాయో, అవన్నీ 'మాలిక్' శరీరంగానే భావించునట్టి దృష్టి మరియు ధ్యాస కలిగి ఉండాలి. కొంచెంసేపు నీవు 'A' పాయింట్ మీద ధ్యానం చేస్తూ ఉన్నావు అనుకుంటె, నా తలంపు సరియైనదే అయి, నీ స్థితి కూడా వాస్తవంగా ఆ విధంగా ఉంటే, నీవు నీ యొక్క ధ్యానాన్ని పైన చెప్పిన విధంగా ప్రారంభించి ఉంటావు. నా అభిప్రాయం ఎంతవరకు సరైనదో తెలియజేయాలి. నీవు పవిత్రత గురించి వ్రాశావు కదా! **నీవు ఎంతగా పురోగమనం చెందుతూ ఉంటావో, అంతంతగా పవిత్రత కలుగుతూ ఉంటుంది.**

ఇప్పుడు మార్చి 16వ తేదీ ఉత్తరానికి సమాధానం ఇస్తున్నాను. **నీకు కలిగిన అనుభవం అంతా నేను వ్రాసిన దానినిబట్టి నా మూలంగానేనని నీవు వ్రాశావు. అది వాస్తవం కాదు. నాకే కనుక అంత సామర్థ్యం ఉంటే నావద్దకు వచ్చే అభ్యాసులందరూ అదే రకమైన అనుభూతి పొందేవారు. నీ విషయంలో అదంతా నీ స్వశక్తియుతమైన శ్రమ, ప్రేమ, దక్షతల యొక్క ప్రభావ ఫలితమే.** అమాయకత్వపు స్థితిని గురించి నీవు వ్రాశావు. అది నీలో స్వతఃసిద్ధంగానే ఉంది. అనగా నీవు పుట్టుకతోనే చాలా పవిత్రంగా జన్మించావు అని అర్థం చేసుకోవాలి. నమ్రత విషయంలో నీవు వ్రాసినది సరైనదే. ఈ నమ్రతను నీవు ఎంతగా అన్వయించుకుంటున్నావు అంటే, దానిలో కూడా నీ లయ-అవస్థ ప్రారంభమైంది. **అభ్యాసీ అయినవారు ప్రతిస్థితిలోను లయం కావలసి ఉంటుంది. అలా జరిగితేనే అతడు (Master**

**minded) స్వామిగా గుర్తించబడతాడు. మన మిషన్‌లో జనం పూజ మరియు ధ్యానం చేస్తూ ఉంటారుగాని ధ్యానం మీద ఎక్కువగా మనసు పెట్టరు. నేను లిఖితపూర్వకంగాను, మాటల్లోను హెచ్చరిస్తూనే ఉన్నాను కాని ఓటమితప్ప ఫలితం ఉండటం లేదు. వారిని నేను పైకి గుంజుకుపోతూ ఉండటమే జరుగుతుంది. ఆ విధంగా చేస్తూనే ఉన్నాను. దీని వలన నాకుగాని, వారికిగాని ఆనందం కలగదు. నా హృదయమైతే అందరికీ ఆనందం కలగాలనే కోరుకుంటుంది. అభ్యాసీలో తృష్ణ ఎంత బాగా ఉంటే, అంత త్వరగా ఈశ్వరుణ్ణి ఆకర్షింపగలుగుతాడు. ఒక నానుడి ఏమిటంటే, శిశువు ఏడ్వకుండా తల్లి పాలు ఇవ్వదు అని.** మిగిలిన విషయాలు నీ జాబు అందిన తర్వాత వ్రాస్తాను.

అమ్మగార్కి నా ప్రణామం అందజేయి.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 292

లఖీంపుర్,
20.03.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు నా ఉత్తరం అందిందని భావిస్తున్నాను. ఇక్కడ అంతా క్షేమం. తమరు కూడా అక్కడ క్షేమమేనని తలుస్తున్నాను. చిన్నసోదరుడు మరియు బిట్టో పరీక్షలు ఈశ్వర కృపతో బాగానే వ్రాస్తున్నారు. కేసర్ ఉత్తరం వచ్చాక ఆమె పరీక్షలు ఎలా వ్రాసిందో తెలియజేస్తాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు అది ఎందుకో తెలియదు కాని, ఒకటి రెండు రోజులుగా అమాయకత్వపు సాగరంలో లేదా దాని దశలో అప్పుడప్పుడు కొంచెం తడబాటు వస్తోంది, చిందరవందరగా ఉంటోంది. ఇప్పుడు నా పరిస్థితి ఇలా ఉంది: ఇంతకుక్రితం నేను తరచుగా 'మాలిక్'లో 16 అణాలు పూర్తిగా (అనగా నూటికి నూరు శాతం) లయమైపోతానని, అదే నా అభీష్టంగా ఉందని చెప్తూతూ ఉండే దానిని. అయితే ఇప్పుడు ఎందుకో తెలియదు, సదా ఈ విషయం 'మాలిక్' అభీష్టానికే వదలిపెట్టాలనే నిశ్చయంతో ఉన్నాను. ఇచ్చిపుచ్చుకోవటమనే భావన ఏమీ ఉండటం లేదు. ఇప్పుడు అందుకోసమే (అనగా 'మాలిక్' నిర్ణయానికే వదలాలి అనే నిర్ణయం) సాహసాన్ని కూడగట్టుకుని ఉన్నాను. అది (సాహసం) ఎంత కావాలో అంత 'అతడే' ఇస్తాడు. బాబూజీ, ఇప్పుడు నూటికి నూరుపాళ్ళు లయావస్థ యొక్క భారం కూడా 'అతడు' తన భుజాలమీదకే ఎత్తుకున్నాడు. ఇంకొక రకంగా చెప్పాలంటే, నా ఈ కోరిక 'మాలిక్' యొక్క అభీష్టంలో కలిసిపోయింది. సాహసం, పురోగతి లేదా ఉన్నతి యొక్క భారం కూడా 'కృపామయుడు' తన బాధ్యతగా తీసుకున్నాడు. 'మాలిక్' తన ఇష్టప్రకారం జరుపుకుంటాడు. నాకు మాత్రం 'అతని'తోనే పని.

'మాలిక్' దయతో ఈ రోజు స్థితి ఇంక ఎక్కువ స్పష్టంగా ఉంది. నా బాబూజీ, ప్రతి దశలోను, (Unawareness) అచేతనం మరియు (Forgetfulness) మరపుదశ వస్తున్నట్లు చూస్తున్నాను. అయితే ఎప్పుడైతే ఒక దశ నుంచి మరొక దశకు చేరుతున్నానో అప్పుడు మాత్రం సచేతన స్థితి (State of awareness) వస్తోంది. ఇప్పుడు ఈ దశ సచేతనంగానే ఉన్నట్లు ఉంది, అయితే చైతన్య స్థితి యొక్క అనుభూతి అతితక్కువగానే ఉంటుంది.

బాబూజీ, 'మాలిక్' దయతో నేను (Sea of humility) నమ్రతాసాగరంలోకి దుమికినట్లు ఉంది. అది ఎలా ఉందంటే, నీటిలో దూకిన ఈతగాడు లోతుగా వెళ్ళి స్పృహలేని స్థితిలో ఉండి, ఆ తర్వాత కాళ్ళు చేతులు ఆడించుకుంటూ పైకి తేలివచ్చి ఈత నారంభిస్తాడు. అదే విధంగా నేను (Sea of humility) నమ్రతాసాగరంలో దూకి లోతుగా వెళ్ళి, స్పృహతప్పినదానిలాగా, ఏమీ తెలియనిదానిలాగా ఉన్నాను. ఇప్పుడు మళ్ళీ తెలివి తెచ్చుకుని, 'మాలిక్' కృపతో

దానిని ఈదుకుంటూ వెళ్ళి విజయం సాధిస్తానని విశ్వసిస్తున్నాను.

బాబూజీ, తమరు ఉత్తరంలో, "నా మనస్సు ఇప్పటికి ఎన్ని పాయింట్లకు చేరావా అని లెక్కించటానికి గాబరపడుతోంది, నేనేమీ చేయాలో నీవు చెప్పు" అని వ్రాశారు. నాకు ఏమీ తెలియదని యదార్థంగా చెప్తున్నాను. తమ అభీష్టం ప్రకారమే చేయండి. తమరు నాయందు దయ ఉంచి నాకు ఆ తపనను కనుక అనుగ్రహిస్తే నేను దానితో 'మాలిక్'ను పొందగలుగుతాను. నాకు కావలసింది 'మాలిక్' మాత్రమే. ఆపైన తమ ఇష్టం.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 293

షాజహాన్‌పూర్,

23.03.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలమగుగాక! నిన్నటి రోజు 22.03.1953వ తేదీ రాత్రి గం. 2.30 ని॥లకు నీవు ఉన్న 'O' పాయింట్ మీద కొంత బలహీనతను గుర్తించాను. వెంటనే నేను ఆ బలహీనతను తొలగించాను. నేడు 23.03.1953న రాత్రి గం.10.15 ని॥లకు నిన్ను పాయింట్ 'P' మీదకు చేర్చాను. ఇదే సమయంలో ఆధ్యాత్మిక యాత్రకు అవసరమైన అణువులను నీలో నింపాను. బహుశా ఈ రోజు రాత్రి 2 లేక 3 గంటలకు నీ ప్రయాణం ప్రారంభం కావచ్చు. అప్పుడు ఉన్న స్థితిని గురించి నీవు వ్రాయాలి. బహుశా 3 లేక 4 రోజుల్లో నీకు పూర్తిగా అనుభవం కలిగినపుడు దైవకృపతో దాని తర్వాత ఉన్న స్థానానికి చేర్చుతాను. నాకు తెలిసినంతలో, అసంఖ్యాకమైన పాయింట్లు ఉన్న కారణంగా వాటిని లెక్కించటం నాకు సాధ్యం కాదు. పాయింట్ 'Z' వరకు చేర్చటం పూర్తయ్యాక, సాధ్యపడితే ప్రతి మూడు రోజులకు లేదా నా వీలునుబట్టి ఒక్కొక్క పాయింట్‌ను దాటిస్తాను. ఇప్పుడు నీ ఉత్తరం 20.03.1953వ తేదీతో ఉన్నది చేరింది. దానికి జవాబు అవసరంలేదు కనుక వ్రాయించటం లేదు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 294

లఖీంపుర్,

24.03.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు అందింది, చదివి చాలా సంతోషించాను. నేను వ్రాసిన ఉత్తరం తమకు పోస్ట్ చేయటానికి నిన్నటి నుండి వేచి ఉన్నాను. ఎందుకంటే, తమ ఉత్తరం చేరితే రెండూ కలిపి వ్రాద్దామనుకున్నాను. అమ్మగారు ఇప్పుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు, నిద్రపోతున్నారు. చింతించాల్సిన పని ఎంతమాత్రం లేదు.

పూజ్యశ్రీ బాబూజీ, తమ ఆరోగ్యం బాగుండలేదని దద్దా ద్వారా తెలిసింది. నాకు చాలా రోజుల నుంచి 'తమరు' జబ్బుగా ఉన్నట్లు కనిపిస్తోంది. అందువల్లనే నేను నా లేఖల్లో తమ ఆరోగ్యం గురించి ప్రస్తావించాను. ఇప్పుడు తమరు డాక్టర్ సూచించిన మందులు వాడండి, దానితో తమరు త్వరగా కోలుకుంటారు. తమరు నా దశను

చూసి ఏదైతే వ్రాశారో అది పూర్తిగా సత్యమే. అది నా డైరీలో 25వ తేదీతో వ్రాసిన దానితో సరిపోలుతోంది. తమరు వ్రాసినంత స్పష్టంగా నేను ఇప్పటికీ వ్రాయలేకపోతున్నాను. అది అలా ఉంచితే నా సమక్షానికి వచ్చినటువంటి దశను గురించి వ్రాస్తున్నాను. మీరు ఏ ధ్యానమైతే చేయమని ఆదేశించారో అది 'మాలిక్' దయతో స్వయంగానే ప్రారంభమైపోయింది. బాబూజీ, నాకు మనస్సు పెట్టాల్సిన అవుసరమే ఉండటం లేదు, ఎందుకంటే, జరగ వలసిందేదో జరిగిపోతోంది. ఆ ధ్యానం దానికి అదే ప్రారంభమైపోతుంది. దయతో తమరు నన్ను 'P' పాయింట్ మీదకు చేర్చారు. అందుకు అనేక ధన్యవాదాలు. దాని అనుభవం నాకు ఒకరోజు తర్వాత వచ్చింది. ఇప్పుడు కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇంతకుపూర్వం **తమరు ఒకసారి –"ఏదైనా పని చేయటానికి ముందు నేను (బాబూజీ) పని చేస్తున్నానని నీ దృష్టిలో ఉంచుకో. 'నా' ఆలోచన మరియు శక్తి మాత్రమే పని చేస్తున్నాయి" అని భావించుకొమ్మని వ్రాశారు.** నేను అలాగే పాటిస్తున్నాను. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, ఇటువంటి ఆలోచన లేకపోయినప్పటికీ దానంతటదే సరళంగా జరుగుతోంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఈ ఆలోచనయే నా స్వంత వస్తువుగా అయిపోయింది. ఇప్పుడు ఏమిటంటే, నేను 'మాలిక్' గురించి ఆలోచనగాని, ధ్యానం చేయాలనిగాని కోరుకుంటున్నపుడు ఆ ఆలోచన తారుమారయిపోతుంది, అది నచ్చటం లేదు. ఇంకా చెప్పాలంటే, శరీరం మీద, హృదయం మీద అప్పుడప్పుడు భారంగా అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడయితే నాకు బదులుగా 'మాలిక్' యొక్క వైభవమే కనిపిస్తోంది, కాదు కాదు, ఇపుడు నా శరీరం యావత్తు 'అతడే' అయిపోయాడు.

బాబూజీ, ఇప్పుడు దశ అనేది నిద్రిస్తున్న జ్ఞాపకంలాగా (అచేతనంగా) ఉంది. ఇంకా ఏమిటంటే, అచేతనంగా మరుపుస్థితిలో ఉంటూనే వాటి జాడ తెలియకుండా ఉంటున్నాను. ఇంకొక రకంగా చెప్పాలంటే, దశను పరిశీలించినప్పటికీ అనుభూతి శూన్యంగానే (ఖాళీగానే) ఉంటోంది. మరో మాటలో చెప్పాలంటే, అనుభూతి యొక్క జోరు తగ్గిపోయి అది కేవలం ఖాళీగానే ఉండిపోయింది. ఈ కారణంగానే ఇప్పుడు తరచుగా అనుభూతి యొక్క అనుభూతులను (Experiences of feelings) గ్రహించలేనిదానిగానే ఉంటున్నాను. ఇప్పుడు అజ్ఞానం (Ignorance) కూడా అనుభవంలోకి రావటం లేదు. అందుచేత అది శూన్యంగా ఉండిపోయింది. అయినా కూడా దశ యొక్క ఆనందాన్ని అనుభూతి చెందుతున్నాను. అయితే అనుభవంలో శూన్యత కూడా తప్పనిసరిగా ఉంటోంది. ఇప్పుడు నేను ఏ దశ యొక్క ఆనందాన్ని అనుభవిస్తున్నానో, అది నిద్రాణమై ఉన్న స్మృతిలో (Sleeping memory) ఆనందం యొక్క ఒక (Vibration) స్పందనలాగ ఉంటోంది. ఇప్పుడు వృత్తులు (Senses, గ్రహణేంద్రియాలు) ఆనందాన్ని ఇంత మాత్రమే అనుభవిస్తున్నాయి. అయితే అనుభూతి అనేది ఆనందం యొక్క అనుభూతుని పొందలేకపోతోంది. బాబూజీ, ఇది నా దశ ఏమిటో నాకు తెలియకున్నది.

తమ ఆరోగ్యం గురించి త్వరగా తెలియజేయండి. ఈశ్వరుడు తమకు కుశలం చేకూర్చుగాక! బహుశా, మాస్టర్ సాహెబ్‌గారు మరియు శుక్లాగారు ఎల్లుండి అక్కడకు వస్తారు. అప్పటికి ఏదైనా దశ అనుభవమైతే వ్రాస్తాను. కేసర్ 1 లేక 2వ తేదీన ఇక్కడకు వస్తుంది. తమకు ప్రణామం చెప్పింది. ఆమె, బిట్టో మరియు చిన్నసోదరుల యొక్క పేపర్లు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 295

లఖీంపుర్,
29.03.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం చేరి ఉండవచ్చునని అనుకుంటు ఉన్నాను. ఇప్పుడు తమ ఆరోగ్యం కుదుటపడిందని భావిస్తున్నాను. అమ్మ ఆరోగ్యంగానే ఉన్నారు. ఈశ్వరుని దయతో కేసర్, బిట్టో మరియు చిన్నసోదరుని పరీక్షలు బాగానే వ్రాస్తున్నారు. కేసర్ పరీక్షలు 25వ తారీఖుతో ముగుస్తాయి. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగినటువంటి ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, ధ్యానం చేస్తున్నాను కాని రసవత్తరంగా లేకుండా శాంతంగా ఉన్నట్లు ఉంది. ఆదేమిటో ధ్యానమైతే చేస్తున్నానుగాని, ధ్యానం గురించిన ధ్యాసయే ఉండటం లేదు. నేనయితే ఏమీ తెలియనిదానిలాగ అయిపోతున్నాను. నా (Ignorance) అజ్ఞానత ఎలా ఉందంటే, (Ignorant) అమాయకత్వం నుంచి కూడా (Ignorance) ఏమీ తెలియనిదానిలాగ ఉంటున్నాను. ఇంకొక విధంగా చెప్పాలంటే, అమాయకత్వంగా అయిపోవటం కూడా నా స్పృహలోకి రావటం లేదు. ఇంకా చెప్పాలంటే, అనుభూతి కూడా మౌనం దాల్చినట్లు ఉంటోంది. బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, నా శరీరం యావత్తు 'అతని' శరీరంలాగానే అనిపిస్తోంది. కాదు, కాదు, కేవలం 'అతని' శరీరాన్ని చూస్తున్నాను, అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడంతా 'అతని' రూపంగానే అయిపోయింది.

ఇప్పుడు ఈ దశ ఎలా ఉంది అంటే, అలలు రేకత్తని విశాలమైన ప్రశాంత సాగరంలో లోతుగా మునిగి ఉంటున్నాను. అయితే స్పందన '(Vibration) మాత్రం ఉంది కాని ఉపరితలం మాత్రం సదా నిశ్చలంగానే ఉంది. ఆ ప్రశాంత సాగరం నా రూపమే అయిపోయిందా అన్నట్లు ఉంది. దానిలో (Vibration) స్పందన అయితే ఉంది కాని, శబ్దం (Sound) కాని (Roaring) హోరుగాని లేవు. ఇప్పటివరకు సాగరంలో (Senses) ఇంద్రియాలు సచైతన్యంగానే ఉంటూ ఉన్నాయి కాని ఇప్పుడు మాత్రం ఆ (Senses) చిత్తవృత్తులలో కొంత (Dead like a corpse) మృతతత్వం చోటుచేసుకుంటున్నట్లు గమనిస్తున్నాను. (Senses) చిత్త వృత్తులలో గ్రహణశక్తి అల్లుకుని ఉంది. ఇంకొక రకంగా చెప్పాలంలే, వాటిమీద నిశ్శబ్ద మావరించిపోతోంది.

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నన్ను నేనే స్వయంగా పూజ చేసుకుంటున్నట్లు ఉంది. నన్నే ధ్యానించుకుంటున్నాను, అర్పించు కుంటున్నాను, నమస్కరించుకుంటున్నాను. ఇప్పుడు ఆంతరికం కూడా స్వయంగా నేనే అయిపోయాను లేదా నా ఆంతరికం నా రూపంగానే అయిపోయింది. అయితే ఇదొకటి ఖరారుగా ఉంది, ఏమిటంటే, ఈ 'నా' మరియు 'నా యొక్క' అడుగున ఇంకా ఎవరో దాగి ఉన్నారు. 'అతడి' దరిజేరాలనే తపన నా ఆంతరికాన్ని మథించింది, ఇంకా మథిస్తూనే ఉంది. బాబూజీ, ఇప్పుడు ఆంతరిక దృష్టి కూడా మౌనం దాల్చింది. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఆంతరికం కూడా బహిర్గతమైపోయింది. అప్పుడింక ఆంతరిక దృష్టి ఎక్కడ ఉంటుంది? ఇంకా ఏమిటంటే, ఇప్పుడు అంతా ఆంతరికమే ఆంతరికంగా అయిపోయింది. ఇంకా చెప్పాలంటే, ఇప్పుడు బాహ్యాంతరాలు రెండూ లేకుండా పోయాయి. కొద్దిపాటి స్పందన (Vibration) మూలంగా, (Senses) మనోవృత్తులలో పూర్తిగా (Dead) మృతతత్వం రాలేదు. ఎందుకంటే, మనోవృత్తులలో స్పందన నుండి కొంత చైతన్యం ఉంటోంది. నాకయితే తెలియదు. ఏదైతే ఇచ్చారో అది 'తమ'కే తెలియాలి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. బిట్టో మరియు చిన్నసోదరుడు ప్రణామం చెబుతున్నారు. ఉత్సవంలో పాల్గొనటానికి ఏప్రియల్ 4వ తేదీకి రావలసినదిగా అమ్మ మరియు మేమంతా ప్రార్థిస్తున్నాము. మాయ, ఛాయ మరియు దీదీలతో కూడా అమ్మ, ఉత్సవానికి రమ్మని ఆహ్వానిస్తున్నారని చెప్పండి. తప్పనిసరిగా తమరు

విచ్చేయండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 296

షాజహాన్‌పూర్,

2.04.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలమగుగాక! నీ ఉత్తరాలు 24, 29 మార్చి 1953వ తేదీలతో వ్రాసినవి అందుకున్నాను. ఇప్పుడు 24వ తేదీకి సంబంధించిన ఉత్తరానికి జవాబు వ్రాస్తున్నాను. లయ-అవస్థ వృద్ధి చెందుతున్నప్పుడు, ఆ పనిని 'మాలిక్' నిర్వహిస్తున్నాడు కనుక దాని గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం ఉండదు. 'మాలిక్'లో లయం కావటం ఎంత ఎక్కువగా ఉంటుందో అంతగా ద్వంద్వం (నీవు, నేను) తగ్గుతుంది. పూజా సమయంలో ద్వంద్వం కలుగుతుంది కనుక హృదయం మీద భారం అనుభవమవుతుంది. ఇటువంటి స్థితిలో స్వాభావికమైన రీతిలో స్వల్పంగా ధ్యానం ఆచరించాల్సి ఉంటుంది. దశ ఎంత తేలికగా లేదా సూక్ష్మంగా అయిపోతూ ఉంటుందో, అప్పుడు దానిని వివరించటానికి మాటలు రావు. దాని తర్వాత ఉన్న ఉన్నత స్థితిలో శూన్యత్వమే పెంపొంది, తర్వాత దాని జాడ కూడా లేకుండాపోతుంది.

నీ ఉత్తరం 29.03.1953వ తేదీతో ఉన్న దానికి జవాబు ఈ విధంగా ఇస్తున్నాను: నేను ఈ స్థితిని చదివి పట్టరాని ఆనందంతో ఉప్పొంగిపోయాను. ఆ స్థితి ఏమిటంటే, "నేను నాపైనే ధ్యానం చేస్తున్నాను. నన్నే పూజిస్తున్నాను, నన్నే ప్రార్థిస్తున్నాను." ఇది మంచి లయ -అవస్థకు చెందిన శుభవార్త వంటిది. దీనిని ఎవరో ఒకరు ఈ విధంగా వర్ణించారు:

**"అపనే సజదే కె శివా గైర్ కా సజడా హై హరామ్"**

**"నిన్నుతప్ప అన్యులను ప్రార్థించటం అపచారం"** అని అర్థం.

నీవు వ్రాసిన 29.03.1953వ తేదీతో ఉన్న ఉత్తరానికి పెద్దదిగా జవాబు వ్రాయాలని తలంచాను కాని ఉత్తరం వ్రాసేవారు దొరకలేదు. ఎలాగైనా, దైవేచ్ఛ కావాలి. నాకుగా నేను వ్రాసినది, చిందర వందరగా ఉండటమేగాక, భావవ్యక్తీకరణ కూడా బాగుండదు. అమ్మగార్కి ప్రణామాలు తెలియపర్చు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 297

లఖీంపుర్,

2.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా పోస్ట్‌కార్డ్ తమకు అందినట్లు భావిస్తున్నాను. తావూజీ వ్రణం ఇప్పుడు బాగా కనిపిస్తోంది. లోపలి వాపు పెరగటం తగ్గిపోయి ఒకవైపు చిట్లటం ప్రారంభమైంది. హోమియోపతి డాక్టర్ ఈ రోజు ఈ విషయం చెప్పారు. వ్రణం పైకి పొక్కింది. జ్వరం కూడా 100 డిగ్రీలు దాటడం లేదు. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా పురోగతి వేగంగా గాని, నిదానంగా గాని ఉండటం లేదనిపిస్తోంది. ఎటువంటి అనుభూతి కలగటం లేదు. అయితే అప్రయత్నంగానే ముందుకు సాగిపోతున్నాను, పురోగతి చెందుతూ ఉన్నాను. నాలో ఇప్పుడు వేగంగాని, నిలకడగాని లేకుండా ముందుకు సాగిపోతున్నాను. ఇలా ఎందుకంటే, అంతర్గత స్థితి ఒకే రకంగా ఉంటున్నది, దశలు మాత్రం వస్తూనే ఉన్నాయి. అవి ఎలా అంటే, ఏ విధంగానైతే ఋతువులు మారుతూ ఉంటాయో, అయినా కాని సంవత్సరం మీద వాటి ప్రభావమేమీ ఎలా ఉండదో అలా. నా శరీరంలోని అణువణువులోనికే నా దృష్టి సారించబడినట్లు అనిపిస్తోంది. ఇంకొకరకంగా చెప్పాలంటే, బాహ్యశరీరం యొక్క తేలికపాటి ప్రతిబింబం లోపల ఏర్పడిందా అన్నట్లు ఉంది. ధ్యానంలో, అణువణువులోను నా 'మాలిక్' అనగా 'మాలిక్'ను మాత్రమే అనుభూతి చెందుతున్నాను. నేను ఇప్పుడు 'మాలిక్'లోనే కలిసిపోతున్నాను. ఇంకా ఏమిటంటే, నా అణువణువులోనూ 'మాలిక్' అంటే 'మాలిక్'యే వ్యాపించిపోతున్నారు. ఇప్పుడు నా ఈ దశలో బాహ్యంగా ఏదీ అనుభవంలోకి రావటం లేదు, ఏమీ కనిపించటం లేదు. నా దృష్టి ఎక్కడ ఉన్నా, అక్కడ 'అతడే' ఉన్నాడు.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతూ ఉన్నారు, కేసర్ మరియు బిట్టో ప్రణామం చెబుతున్నారు. 'మాలిక్' దయతో తావూజీకి ఇప్పుడు కొంత ఉపశమనం కలుగుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 298

లఖీంపుర్,

4.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈరోజు సాయంత్రం అందింది, చదివాక చాలా సంతోషం కలిగింది. తమ ఉత్తరం నేటి సంతోషానికి ఇంకా తోడైంది. 'తమరి' యొక్క కృప మరియు తమ ఉత్తరాలు నేను లక్ష్యం చేరటానికి సోపానాలుగా పని చేస్తున్నాయి. ఇప్పుడు నా ప్రస్తుత ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఏమైందో ఏమోగాని, నాకు ఎప్పుడూ నిద్రవస్తూ ఉన్నట్లు ఉంటోంది కాని, నిద్ర మాత్రం రావటం లేదు. ఎప్పుడైతే ప్రోత్సాహం కల్పించుకుంటున్నానో, శరీరం అప్పుడు కొంతసేపు ఆహ్లాదంగా ఉంటుంది. దానిని మరచిపోయి ఎప్పుడైతే కళ్ళు తెరిచానో, అప్పుడు ఆ దశయే నిలుస్తుంది. అయితే అది సోమరితనం అని చెప్పకూడదు. కుటుంబ సభ్యులందరు ఉల్లాసంగా పనిచేస్తున్నప్పటికి కూడా నాకు మాత్రం నిద్ర వస్తూ ఉన్నట్లు ఉంటుంది. అప్పుడప్పుడు మనస్సు, హృదయం ఉల్లాసంగా ఉంటాయి అయితే కొంతసేపటికి మళ్ళీ ఒక విధమైన మత్తుగా ఉంటాయి. ఏ దశనైతే 'మాలిక్' అనుగ్రహిస్తారో దానిని శిరసావహిస్తాను. కాని దానిని (దశ) అనుభూతి చెందటంలో కొంత అవరోధం కలుగుతున్నట్లు నాకు తెలుస్తోంది. ఎందుకంటే, నేను ఇప్పుడు నా వశంలో లేకుండా ఒక వింతైన పాక్షిక మత్తు స్థితిలో ఉంటున్నాను.

బాబూజీ, అదేమిటో నా మాలిక్‌కే తెలియాలిగాని, ఇప్పుడు నా 'మాలిక్' పేరుకు ముందు 'శ్రీ' అనిగాని, మరైదేనా గాని అనుబంధం చేయాలనే జ్ఞానం నాకు లేకపోతోంది, అది నాకు చెడుగా తోచటం కూడా అనిపించటం లేదు. నేను 'అతడి'ని ఎలా పిలిస్తే అదే బాగున్నట్లు అనిపిస్తుంది. ఇప్పుడైతే బాహ్యాంతరాల మధ్యనున్న తెర తొలగిపోయి రెండూ ఏకమైపోయి సమాన రూపం దాల్చినట్లు ఉంది. ఇదే విధంగా నాకు, 'మాలిక్' మధ్య కూడా ఉన్నదని చెప్తే అదే సరైనది. ఇప్పుడు రాత్రిజాము బాగా అవ్వటంవలన ఉత్తరం ముగిస్తున్నాను. తొందరపాటుతో ఇంతవరకు మాత్రమే వ్రాయగలిగాను. ఇంకా అనుభవం కానున్న దానిని తర్వాత ఉత్తరంలో వ్రాస్తాను.

అమ్మ తమర్ని చిరంజీవిగా వర్ధిల్లాలని శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు. కేసర్ నిన్న వచ్చింది. బిట్టో మరియు చిన్న సోదరుడు తమకు ప్రణామం చెబుతున్నారు. ఈ శుభదినాన బాబూజీకి దీర్ఘాయువు ప్రసాదించబడాలని, మిషన్ బాగా ఉన్నతి చెందాలని శ్రీ లాలాజీ సాహెబ్‌ను ప్రార్థిస్తూ అనేకానేక ధన్యవాదాలర్పిస్తున్నాము.

అమ్మ, తమ రందరికీ మరియు హరిదద్దాకు ప్రసాదం పంపిస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 299

లఖీంపుర్,

5.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది. దానికి కొంత సమాధానం నిన్న లక్నోకు చెందిన సోదరుల ద్వారా పంపించాను. అది తమకు చేరిందనుకుంటాను. బాబూ కరుణా శంకర్‌గారు ఇప్పుడే మాస్టర్ సాహెబ్ వద్దకు వచ్చారు. 'మాలిక్' దయతో కలిగిన దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఆధ్యాత్మికత యొక్క స్వచ్ఛ రూపమే నా దశగా ఎందుకు ఉన్నదనిపిస్తోందో భగవంతునికే తెలియాలి. ఇప్పుడు నిండుగా ఉన్న స్వచ్ఛ ఆధ్యాత్మికత కప్పునే నేను త్రాగుతున్నాను. నా ఆధ్యాత్మిక దశారూపం కలిగిన పూదోట నా నుండియే ఉత్పన్నమవుతూ, స్వచ్ఛమైన ఆధ్యాత్మికతతో తడపబడుతోంది. స్వచ్ఛ ఆధ్యాత్మికతా పరిమళం అనుక్షణం నా నుంచే వెలువడుతున్నట్లు అనిపిస్తోంది లేదా నా నుంచే ఉత్పత్తి జరుగుతున్నట్లు లేదా శుద్ధమైన ఆధ్యాత్మికతయే నా రూపం అయిపోయినట్లు ఉంది. ఇప్పుడు ఆ శుద్ధమైన ఆధ్యాత్మికతయే నాలోకి చొరపడుతున్నట్లు అనిపిస్తోంది.

బాబూజీ, ఇది దృష్టి నిర్మలమైపోయిన దశగా ఉంది. నాకు ఇప్పుడు అంతా స్వచ్ఛాతి స్వచ్ఛంగానే కనిపిస్తోంది. దానిలో నా దర్శనం కల్పించుకుంటున్నాను. దానితోనే నన్ను నేను గుర్తించసాగుతున్నాను. నేను నాలోనే ఉంటూ నాలోనే మనోహరంగా ఉంటున్నాను. ఇప్పుడు నాకు 'మాలిక్' యొక్క తృష్ణ పెరిగిందా లేక నా గురించియే నాకు పెరిగిందా అనేది తెలియడం లేదు. అయితే రెండవదే (తనదేనన్న విషయం) సరియైనది అని చెప్పాల్సి ఉంటుంది. అయినప్పటికీ, 'నా' యొక్క లోతులో ఎవరో దాగి ఉన్నారు. 'అతడు' సూక్ష్మరూపంలో ఉండటం వలన నేను ఆ లోతులో ఉన్న 'వానిని' జ్ఞాపకం ఉంచుకోలేకపోతున్నాను.

బాబూజీ, యదార్థం ఏమిటంటే, నేను ఇప్పుడు "హృదయంలో ప్రియుని (మాలిక్) చిత్రపటం ఉంది. ఎప్పుడు తలవంచి చూసినా అప్పుడు అక్కడ చూస్తాను" అని చెప్పితే సక్రమంగా ఉంటుందనుకుంటాను. ఇప్పుడది తలక్రిందులైంది. బహుశా వాస్తవికత (రియాలిటీ) తన వాస్తవిక రూపంలో కొంత నాలో చూపించ నారంభించింది. ఇది తమకు తెలిసినదే. అదేదో దైవానికే తెలియాలిగాని, ఈ పని 'మాలిక్' చేస్తున్నాడు అని నేను సరిగ్గా గుర్తించలేకపోతున్నాను. అయినప్పటికీ ఈ పని ఎంతో కొంత తప్పనిసరిగా జరుగుతూనే ఉంది. అయితే అది మరోరూపంలోనో, లేక నేను సూక్ష్మరూపంలో నా లోలోపలనే చేస్తున్నానేమో. అయితే, నేను తప్పనిసరిగా చేస్తున్నాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతూ ఉంటే, కేసర్ మరియు బిట్టో ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 300

లఖీంపుర్,

8.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటు ఉన్నాను. తమ ఆరోగ్యం ఎలా ఉంది? పెద్దసోదరుని జీతం నుంచి 100 రూపాయలు ఈ రోజు వచ్చింది. దానిలో నుంచి కేవలం 10 రూపాయలు 'తమరు' కానుకగా స్వీకరించి తీరాలని అమ్మ చెబుతోంది. రేపు ప్రసాదం నివేదించబడుతుంది. తమ (Preface) 'ముందు మాట'ను మాస్టర్ సాహెబ్ సరిచేశారు. నేను, తావూజీ కూడా పరిశీలించాము. 'తమరు' ఒక్కరికే ఈ విషయంలో చాలా శ్రమ కలుగుతుంది. 'మాలిక్' కృపతో కలిగిన దశను వ్రాస్తున్నాను.

బాబూజీ, ప్రస్తుతం నా స్థితి, "అపనే సిజదే కె శివా, గైర్ కౌసిజదా హైహరామ్" అనగా "నాకు నేను తలవంచుకోవటం (నమస్కరించటం) తప్ప ఇతరులు ఎవ్వరికైనా నేను తల వంచటం తగనిపని" అన్నట్లు ఉంది. పలుమార్లు ఇలా చెప్పటమే నాకు చాలా సంతోషంగా ఉంటోంది.

'మాలిక్' దయతో, ఇప్పుడు నాలో ఈ దశయే అద్దంలాగా మెరుస్తోంది. ఇప్పుడు నా స్థితి ఇదే. ఇంకా ఈ దశ ఎలా ఉందంటే, బాహ్యంగా చూస్తే నిద్రమత్తు ఉన్నట్లు ఉంటుంది. ఎప్పుడైతే 'తమకు' ఈ విషయం వ్రాసానో అప్పటి నుంచి కొంతవరకు తగ్గింది. అయితే లోపల మిగిలి ఉన్న కొద్దిపాటి చైతన్యం (స్పృహ) కారణంగానే శారీరిక సోమరితనం, ఏవేళయైనా నిద్రపోవటం నుంచి తప్పించుకుంటున్నాను.

శ్రీ బాబూజీ, అదేమిటోగాని జీవనం, మరణం లేనేలేవని అనిపిస్తోంది. అయితే తరచుగా కేవలం జీవనమంటె జీవనమే ఉందని, మృత్యువు అనే మాటే లేదన్నట్లు ఉంటుంది. ఇటువంటి (Immortal life) అమరత్వ జీవనమే 'మాలిక్' ప్రారంభింప చేశారు. ఇంకా చెప్పాలంటే, (External and Internal tendencies) బాహ్యాంతర వృత్తులు మరియు ఇంద్రియాలు (Faculties) ఇప్పుడు హరించుకుపోయినట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, వాటిలో కూడా జీవనంగాని మరియు మృత్యువుగాని లేని దశ ఇప్పుడు ఏర్పడింది. అదేమిటో భగవంతునికే తెలియాలి.

బాబూజీ, ఈ దశలో శరీరంలోనూ, నరనరాల్లోనూ 'మాలిక్' అంతర్లీనమైపోతున్నట్లు అనిపిస్తోంది. ఈ విధంగా జరుగుతున్న కారణంగానే నమ్రత (అణకువ) కూడా అంతర్భాగంగా అయిపోతున్నది. ఒక రకంగా చెప్పాలంటే, జీర్ణమైపోతున్నట్లు ఉంది. ఇంకొక దశ ఎలా ఉందంటే, బిందువులో సముద్రానికి సముద్రమే ఇమిడిపోయి ఇంకిపోతున్నట్లు ఉంది. అలాకాదు, ఇప్పుడు సింధువు (సముద్రం), బిందువు రెండూ లేకుండా పోయాయి. అవి ఏమై పోయాయో, ఎలా కాకుండా పోయాయో నాకైతే తెలియదు. బాబూజీ, తమరు నన్ను 'Q' పాయింట్‌కు చేర్చి, బహుశా వ్రాయటం మర్చిపోయి ఉంటారు. దయచేసి వ్రాయండి. అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 301

షాజహాన్‌పూర్,

12.04.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

కుశలమగుగాక! నీ ఉత్తరాలు అన్నీ అందుకున్నాను. నాకు 'హిందీ' (భాష) రాదు. వ్రాస్తూ ఉంటే నా చేతులు వణుకుతాయి. ఆలోచనకు వచ్చినా, వాటిని వ్రాయటానికి పూనుకుంటె అవి క్రమబద్ధంగా ఉండవు. మరి

నేను నా లోపాలు ఏమని వ్రాయగలను! ఇతరుల సహకారం తీసుకోవాల్సి వస్తోంది. ఒక్కరే అన్ని పనులు చేయటం సాధ్యపడదు. అందరూ కలిసిమెలిసి సహకరించి, ఎవ్వరికి చేతనైన పని వారు చేస్తే బాగుంటుందని నేను అనుకుంటున్నాను, కాని అభ్యాసుల్లో ఆ అభిలాష, ఉత్సాహం కలగటం లేదు. ఎవ్వరికైతే ఆధ్యాత్మికత, దైవభక్తి విషయంలో శ్రద్ధ కలగదో, వారు మిషన్‌కు సంబంధించిన కార్యక్రమాలలోనైనా అభిలాష కలిగి ఉంటే బాగుంటుంది. అప్పుడు అతడు (Sincerity) క్రమబద్ధంగా ఉండగలిగి నట్లయితే అప్పుడు దైవానికి సంబంధించిన విషయంలో కూడా ఆసక్తి కలుగుతుంది. అది నా పనిగా అనుకుంటున్నందువలన ఎవరు మాత్రం దానికి పూనుకుంటారు! అవును, ఇది అలాగే అనిపిస్తోంది. వాస్తవానికి నేను సంతృప్తిపరచటానికే ప్రయత్నిస్తున్నాను. ఎందుకంటే, ఈ సంతృప్తిపరిచే కల్పనతోనైనా ఎవరో ఒకరికి లబ్ది చేకూరుతుందని నా  నా అభిప్రాయం. ఈ వాక్యాలు ఎవరైనా చదివినట్లయితే నిజంగా నవ్విపోతారు, మరి నేను నా హృదయం గురించి ఏమి చేయగలను? **నేను ఉన్నదంతా (ఆధ్యాత్మికతను) అందరిలోనూ నింపాలనుకుంటున్నాను. బహుశా జనం దీనిని స్వీకరించక పోవటానికి ఇదే కారణమై ఉంటుంది. నేను మాత్రం ఆధ్యాత్మికతను నింపే వెళ్తాను, అందులో కొంత పొర్లిపోయినా సరే. ఎవరిలోనైనా అది నిండి పొర్లిపోవటం జరిగితే, దానిని మరొకరు పొందగలుగుతారు. అందుచేత అందరిలోను నేను దానిని నింపాలనుకుంటున్నాను. ఇప్పుడు ఉన్న పరిస్థితినిబట్టి, అందరిలో కాని, దాని కొరకు తపన ఉన్న వారిలో కాని నిజమైన ఆధ్యాత్మికత నింపబడుతుంది.**

ఇప్పటివరకు నేను ఇతరుల గురించి చెప్పాను. అయితే ఇప్పుడు నా గురించి వివరిస్తాను. నేను ఎంత సోమరిగా, చైతన్యంలేనివానిగా అయిపోయానంటే, ఉదాహరణకు ఇటువంటివారు ఎవరూ కనిపించక పోవచ్చు. శరీరంలో జీవం లేనంత స్థాయిలో ఈ సోమరితనం పాతుకు పోయింది. మంచంమీద పడుకున్నాను అంటే, మళ్ళీ 6 నెలల వరకు లేవకూడదనిపిస్తుంది. ఆహారం సిద్ధంగా ఉంచబడినప్పటికీ, ఎప్పుడైనా తిందాములే, తర్వాత తినవచ్చు అని వాయిదావేసే స్థాయిలో ఈ నీరసం ఉంటోంది. నాకు దాహం వేసినప్పటికీ, లేవలేని పరిస్థితిలో ఉండి లేచినప్పుడు త్రాగవచ్చునులే అని అనిపిస్తోంది. పని చేయాల్సింది ఉంది కాని చేయటానికి మనస్కరించటం లేదు. సరే, దైవమే సానుకూలం చేస్తాడు. ఇటువంటి దుర్బలుడు, సోమరి అయిన మనుషులకు సోమరి, దుర్బలులు అయిన మనష్యులే తారసపడతారు. మన సంస్థలో సోమరితనం, అలసత్వానికి బాధ్యుడను నేనే అని నాకు తెలుసు. జనం నా మాట వినకపోవటానికి కారణం కూడా ఇదే అని అనుకుంటున్నాను. మృతి చెందినవానిలో జీవం ఎవరికి కలుగుతుంది, అలాగే సోమరితనంలో చైతన్యం ఎప్పుడు కలుగుతుంది? అవి రెండూ కూడా పరస్పర విరుద్ధమైనవే.

సరే, ఇప్పుడు అసలు విషయానికి వస్తాను. నేను 'P' స్థానం మీద ఎక్కువ కేంద్రీకరించాను. ఎందుకంటే, నేను దానిని పూర్తిగా అంచనా వేయలేకపోయాను. నా తొందరపాటు యొక్క అలవాటు మూలంగా ఇటువంటి పొరపాటు జరుగుతూ ఉంటుంది. పనిని త్వరగా ముగించాలను ఉద్దేశ్యంతోను, దానిని గురించి మళ్ళీ మళ్ళీ పట్టించుకోనవసరం లేకుండా ఉండాలని ఇటువంటి తొందరపాటు అలవాటు ఏర్పడింది. నేను తరచుగా పని పూర్తిచేయాల్సి వచ్చినప్పుడు విశిష్ట ఇచ్ఛాశక్తిని  (Special will Power) ప్రయోగిస్తాను. ఆ ప్రయోగంలో తొందరపాటు మూలంగా అది ఎంత తీవ్రంగా ఉండాలి అనే విషయంలో సరైనా అంచనా లేకపోవటం జరుగుతుంది. నేను ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఈ అలవాటును సరిదిద్దుకోలేకపోతున్నాను. పాయింట్ 'P' మీద ఎక్కువ ప్రాణాహుతి ఇచ్చిన కారణంగా దానితో ఉత్పన్నమైన అధికశక్తిని నీవు జీర్ణించుకోలేకపోతున్నావు. ఈ విధంగా శక్తిని ఇముడ్చుకోలేకపోవటం చూడగానే మళ్ళీ దానిని జీర్ణింపచేసుకోగలిగేట్లు నేను చేసాను. అదే సమయంలో నీ మనస్సు, చైతన్యతను, నీ ముందు ఉన్న ఉన్నత స్థానానికి నీ అంతట నీవే చేరునట్లు నా దృష్టి నిలిపాను. తత్ఫలితంగా ఈ రోజు ఉదయం గం. 11.45 ని॥లకు నీవు ముందుకు వెళ్ళ నారంభించావు. అందుకు నేను కొంత సహకారం అందించవలసిన అవుసరం వచ్చింది. అలా సహకారం అందించగా నీవు 'Q' స్థానానికి చేరుకున్నావు.

**నీ నుంచి ఆధ్యాత్మిక సుగంధం నిరంతరం వెలువడుతున్నది అనే నీ అభిప్రాయం సరైనదే. అది ఉత్పన్నమవుతూనే ఉంది,** కాని వాస్తవం కాదని నీవు వ్రాశావు. అది అందరిలోను నెలకొని ఉంది. మానవుడు స్వయంగా కల్పించుకున్న ఆవరణల మూలంగా దానిని గ్రహించలేడు. అంతటా పవిత్రతయే నెలకొని ఉన్నట్లు కనిపిస్తోంది అని నీవు వ్రాసిన నీ స్వంత అనుభూతి వాస్తవమే. **మానవుడు ఎప్పుడైతే బాహ్యోన్ముఖుడు కాకుండా అంతర్ముఖుడై ఉంటాడో అప్పుడు అతని ఆంతరిక స్థితియే బాహ్యంగా కనిపిస్తుంది.** దేనితోనైనా అనురాగ బంధం ఉన్నట్లయితే, మన ఆలోచనలో దాని భారం పడకుండా ఉండటానికి వైరాగ్యం అవుసరం అవుతుంది. సంపూర్ణ వైరాగ్యం చెందిన తర్వాత ఆలోచనలో దాని భారం అనుభవానికి రావు సరికదా అది దృష్టి నుంచి తొలగిపోతుంది. ఇటువంటి స్థితి కలిగిన తర్వాత, ఇంక ఎక్కడ చూసినా ఈశ్వరుడే ఈశ్వరుడు ప్రత్యక్షమవుతాడు. అప్పుడింక అడవుల్లో కూర్చుని తప మాచరించాల్సిన అవుసరం ఉండదు. "నేను నన్ను గుర్తించగలుగుతున్నాను" అని నీవు వ్రాసింది నాకు అర్థమవ్వడం లేదు. కనుక నీవు గుర్తించినది ఏమిటో వ్రాయాలి. 'మాలిక్'లో బాగా (లయ) ప్రవేశం కలుగుతున్నప్పుడు 'తన' యొక్క భావం (Self) తరిగిపోతూ ఉంటుంది. అప్పుడు 'తన' అనే భావం 'మాలిక్'ది అయిపోతుంది. అప్పుడు ఈ పని అంతా 'మాలిక్' మాత్రమే చేస్తున్నాడు అను భావం ఏర్పడుతుంది. అయితే ఇది అపరిపక్వ లయ అవస్థ మాత్రమే. ఎవరు చేస్తున్నారు అనే భావం కూడా లేకుండా పోయినప్పుడు, అనగా దాని భారం కూడా లేకుండాపోయినప్పుడు దానిని మంచి లేక పరిపక్వ లయ-అవస్థగా చెప్పవచ్చు. అయినా దీనికిమించి ఇంకా ఉంది. నీవు ఇప్పుడు నీ మీద ధ్యానం చేస్తున్నావన్న విషయం సుస్పష్టం. నాకు తోచినంతలో నీ మాటలకు అర్థం నిన్ను నీవు గుర్తించగలిగినట్లు అయి ఉంటుందని నేను భావిస్తున్నాను.

అమ్మగార్కి వందనాలు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 302

లఖీంపుర్,

13.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. చదివి చాలా సంతోషించాను. నన్ను 'Q' పాయింట్ మీదకు చేర్చినందుకు చాలా ధన్యవాదాలు. నా శరీరం కూడా కొంచెం విసుగు చెందుతున్నట్లు అనిపించింది కాని, అది ఇప్పుడు సర్దుకుంది. బ్రహ్మవిద్యాపిపాసుల సంఖ్య దినదినాభివృద్ధి చెందాలను ఈ దీనురాలి ప్రార్థన ఎప్పుడు ఆలకించ బడుతుందో కదా! 'అతని'కి మన విన్నపం ఎప్పటికి చేరుతుందో, ఎందుకంటే, మనం 'అతని'కి దూరంగానే ఉంటున్నాము, అయితే 'అతడు' మాత్రం మనందరికీ దగ్గరగానే ఉన్నాడు. 'మాలిక్' కృపతో స్వల్పంగా వచ్చిన అనుభూతిని గ్రహించినదానిని తమకు నివేదిస్తున్నాను.

"మరణం నుంచి జీవనం ఎవరికి దక్కిందంటావు?" అని తమరు వ్రాశారు. బాబూజీ, నా అల్పబుద్ధికి తోచినంతలో, అసలైన (నిజమైన) జీవితం మరణం నుంచే లభిస్తుంది, మృతునికే లభిస్తుంది. దీనిని మనం గుర్తించగలగవచ్చు, గుర్తింపలేకపోవచ్చు. మృతుడు మనకు వైరాగ్యం బోధిస్తున్నాడు, దానితో మనం అసత్యమైనది, వినాశకరమైన తళుకుబెళుకులవైపు కళ్ళు మూసుకుని వాస్తవమైన జీవితం అన్వేషిస్తున్నాం. అయితే మనం విలపిస్తూనే ఉండిపోయి, వివేకాన్ని చైతన్యవంతం చేయకపోతే అది 'అతని' దోషం కాదు. ఇంకా చెప్పాలంటే, మరణించిన తర్వాతనే నూతన శరీరం, క్రొత్త జీవితం లభిస్తుంది. తమరు వ్రాసినది ఇంకొకటి ఏమిటంటే, "అలసత్వం నుంచి

చైతన్యం ఎప్పుడు కలుగుతుంది?" అని. అలాగైతే బాబూజీ, దీనినే నేను నేర్చుకుంటున్నాను, గమనిస్తున్నాను. ఏమిటంటే, అలసత్వం /సోమరితనం నుంచి మాత్రమే నిజమైన చైతన్యం కలుగుతుంది అని. 'మాలిక్' కొరకు మనల్ని నిరంతరం హెచ్చరించేది మాత్రమే చైతన్యం అవుతుంది. ఒకవేళ మనం ఆ దిశవైపు చైతన్యం కాకపోయినట్లయితే మనం ఖచ్చితంగా సోమరులమే. మృతునికి కూడా చెవులు ఉంటాయని అంటారు. అప్పుడు చైతన్యం అనేది లేకపోవటం ఎక్కడ? చైతన్యం కోల్పోతూ ఉన్న వానికి మళ్ళీ చైతన్యం పొంద నారంభమవుతుంది. శ్రీ బాబూజీ, తమరు నాకు దీనినే బోధిస్తున్నారు. వాస్తవానికి ఇది తమ దశ కాదు. కేవలం మమ్మల్ని మేమే పూజించుకోవటంలోనే మగ్నమై ఉన్న సోమరులం. తమరు మాకు ప్రతి ఒక్క మాటతో ప్రకాశం కల్పిస్తున్నారు, కాని మేము మాత్రం అంధునిలాగ అయి ఇంకా కళ్ళు మూసుకుంటున్నాం. ఇప్పుడు 'మాలిక్' కృపతో అనుభవమవుతున్న దశను వివరిస్తున్నాను.

బాబూజీ! తమరు, "నీవు స్వయంగా గుర్తించుకుంటున్నావు అంటే, నీవు స్వయంగా ధ్యానం చేసుకుంటున్నావు" అని వ్రాశారు. ఇది నిజమే. ఇప్పుడు నా స్థితి ఈ విధంగా జరుగుతోంది: అహం (సెల్ఫ్)ను అంతరింప జేసుకోవటంలోనే జన్మను కోల్పోయాను. అహమే దైవమని నాకేమి తెలుసు. ఇప్పుడు నా దశ వ్యతిరేకదిశలో (Reverse direction) ఎందుకు ఉందో నాకు తెలియటం లేదు. 'మాలిక్' కృపతో ఈ విధంగా ప్రత్యక్షమవుతోంది. 'మాలిక్' బాగా కరిగిపోయి నా అంగాంగల్లోనూ వ్యాపించిపోతున్నట్లుగాను, నా అణువణువునా కలిసిపోతున్నట్లుగాను అనిపిస్తోంది. బిందువు సింధువును త్రాగేస్తోంది. ఇప్పుడు అణువణువు నుంచి, శ్వాస నుంచి నమ్రతయే ఉట్టిపడుతున్నట్లు అనిపిస్తోంది. నిరంతరం నిద్ర లేదా సోమరితనం వంటి స్థితి మొన్నటి నుంచి మెరుగుపడింది. ఇప్పుడు నా స్థితి ఎలా అయ్యిందంటే, నేను స్వయంగా నాలోనే అంతర్లీనంగా అయినట్లుగాను, దూసుకుపోతున్నట్లుగాను అనిపిస్తోంది. ఈ విధంగా అన్ని లోపల కలిసిపోయి ఏమైపోయాయో అన్నట్లు ఉంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 303

లఖీంపూర్,

16.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా పంపిన ఉత్తరం తమకు అంది ఉంటుందని భావిస్తున్నాను. అక్కడ మాస్టర్ సాహెబ్‌గారు, సోదరుడు శుక్లాజీ మరియు కుక్రా, ముగ్గురికీ బాగా అనందం కలిగి ఉండాలి. బాబూజీ, తాము ఆరాధించేవారితో ఉన్నప్పుడు ఎవరి హృదయం మాత్రం ద్రవించకుండా ఉంటుంది. అయితే 'మాలిక్' కృపతో నేను కూడా ఈ ఆనందాన్ని పంచుకున్నాను. రాత్రి అంతా, కళ్ళు తెరిచి ఉంచినప్పటికీ కూడా అక్కడనే ఉన్నటువంటి దశను పొందాను. ఎలా అంటే, నిద్రపోతూ నేను ఇక్కడనే ఉన్నప్పటికీ, నేను అక్కడ 'తమరి'ని ఏదో ప్రశ్నిస్తున్నట్లు, తమరు సమాధానం ఇస్తున్నట్లు, అందరితోబాటు 'తమ' సమీపంలోనే నేను కూర్చుని ఉన్న అనుభూతి చెందాను. పగటిపూట మాత్రం ఇలా తోచలేదు. అయితే ఇప్పుడు ఎటువంటి దశలో ఉంటున్నానో దానిని వ్రాస్తున్నాను. "రైన్‌భయీ, తబ్ హీ సోజావూం, భోర్ భయె ఉఠ్‌జావూం" అనగా రాత్రి అవగానే నిద్రిస్తాను, వేకువ కాగానే మేల్కొంటూ ఉన్నట్లు నా దశ ఉంది. రాత్రి సమయంలో శరీరంతోపాటుగానే మనస్సు కూడా అమ్ముడైపోయింది. ఇప్పుడు 'మాలిక్' కృపతో ఏర్పడిన దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో నా నరనరంలోను నేను వ్యాపించిపోయాను. నా అణువణువులోనూ నా దివ్య సౌందర్యాన్ని చూస్తున్నాను. ఇప్పుడు ఈ దశలో ఎలా ఉందంటే, ఒక సహజ దృశ్యం (Natural scene) ఏర్పడినట్లుగాను, తర్వాత మారిపోయినట్లుగాను కనిపిస్తోంది. ఏ విధమైన అనుబంధం ఉన్నట్లు లేదు, కాని ఇంకా హృదయం తెరుచుకోలేదన్నట్లు అనిపిస్తోంది. అందుచేత ప్రతిదశ హద్దు దాటకుండా దాని పరిధిలోనే ఉంటూ ఉంటున్నట్లు అనిపిస్తోంది. 'మాలిక్' కృపతో నేను మనస్సు లేక దశ నుంచి తప్పనిసరిగా అధిగమించగలనని, అది సంభవమేనని అనిపిస్తోంది. ఇంకొమాటలో చెప్పాలంటే, దృష్టి ఎప్పుడూ దీనిని దాటియే ఉంటుంది. నేను మాత్రం దాని బంధనంలో ఎంతమాత్రం లేను. 'మాలిక్' సర్వదా స్వతంత్రుడే అయినప్పటికీ, ఈ బంధనంలోకి బహుశా వచ్చాడనుకుంటాను. నాకయితే ఏమీ తెలియదు, 'అతని' సంగతి 'అతని'కే తెలియాలి. పూజ్య శ్రీ బాబూజీ, నాకు నేను తలను వంచి ఉంటున్నాను, ఎందుకంటే ఇతరుల ముందు తల వంచటం తప్పుగా అనిపిస్తుంది. నేనే స్వయంగా 'మాలిక్' అన్నట్లు ఉంది. ఈ దశ కలిగి ఉన్నా కూడా నాకు ఇప్పుడు 'అతని' జ్ఞాపకం ఉండటంగాని, 'అతని' జ్ఞాపకం రావటంగాని జరగటం లేదు. అసలు జ్ఞాపకం ఉందా లేదా అనేది కూడా నాకు తెలియటం లేదు. అంతేకాదు, నా అణువణువులోను నేను వ్యాపించిపోయాను అనే విషయం కూడా నాకు జ్ఞాపకం ఉండటం లేదు. బాబూజీ, ఇంకా ఎలా ఉందంటే, నేను మాలిక్‌తో ఎంత దాపరికం లేకుండా అయిపోయాను అంటే, హృదయపూర్వకంగా నాకు, 'మాలిక్' మధ్య ఎటువంటి పరదా (అడ్డు) లేదు. 'అతని' కృపతో 'సమానత్వం' (ఏకత్వం) యొక్క స్థితి ఏర్పడలేదేమోనని స్వల్పంగా కనబడుతుంది. బాబూజీ, ఈ సంగతి శరీరం మరియు మనస్సుతో ఎన్నటికీ జరగదు. (మాలిక్, కస్తూరీజీ సమానులేననే భావం). ఇది తమకు తెలియనిది కాదు, తమ దయతో ఇటువంటి దశ యొక్క దృశ్యం ఏర్పడి ఉండవచ్చునేమోగాని, తమరు అనుగ్రహించినది తమకే తెలుసు. ఇది అమర్యాదకరమైన విషయం, వ్రాసినందుకు దయతో క్షమించండి. ఆ విధంగా ఆ సమానత్వ దశ కనపడి ఉంటే అది 'తమరు' అనుగ్రహించినదే. బాబూజీ, ఇప్పుడు ఈ దశ ఎలా ఉందంటే, శరీరం యొక్క ప్రతి అణువు అద్దంలాగా అయిపోయిందని అనిపిస్తోంది. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఆధ్యాత్మికతా సాగరం నుండి కూడా 'మాలిక్' వాస్తవికత (రియాలిటీ) యొక్క స్వచ్ఛమైన, అసలైన ముత్యాలు ఏరి నా (కణకణంలోను) అణువణువులోనూ పొదిగి ఉంచారని అనిపిస్తోంది. ఈ అద్భుత దృశ్యమే అప్పుడప్పుడు సాక్షాత్కారం అవుతూ ఉంది. బాబూజీ, ఇంకొక దశలో ఎలా ఉంది అంటే, 'నేను' అన్నప్పుడు నా 'అహం' భావంగాని, 'తమరు' అన్నప్పుడు 'తమ' యొక్క భావనగాని ఉండటం లేదు. ఎందుకంటే, 'తమరు' కూడా నాతో వేర్పాటు భావంగాని, భేదభావంగాని లేకుండాపోయాయి. ఇప్పుడు ఈ దశలో ఆనందమైతే ఉంటోంది, కాని ఆ ఆనందంలో ఆనందం యొక్క భారం తొలగిపోయినటువంటి స్వచ్ఛమైన ఆనందం యొక్క దృశ్యం కనిపిస్తోంది. ఇప్పుడు అంతా స్వచ్ఛతయే ఉండిపోయింది, కాదు కాదు, స్వచ్ఛత ఉందో లేదో, నేను అజ్ఞానురాలిని కనుక అది నాకు తెలియదు. అయితే దశలో మాత్రం ఏదో ఉంది, దానినే నేను ఆనందం అంటున్నాను. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, ఆ దశలో ఏది ఉన్నప్పటికీ దానిని నేను ఆనందం అంటాను కాని నేను మాత్రం దానిలో వాటాదారునిగానే లేదా వేరుగానే ఉంటున్నాను. నాకు ఇది అంతుబట్టడం లేదు, అది ఏమిటంటే, నేను వాటాదారునిగా అనుకున్నట్లయితే అలానే ఉంటున్నాను, కాని వేరుగా అనుకున్నట్లయితే నేను పూర్తిగా వేర్వేరుగా ఉంటున్నాను. అదేమిటో తమకే తెలియాలి. ఒక రకంగా చెప్పాలంటే, నా అనుభవంలో అది ఆనందమే కావచ్చు, ఇంకా ఏదైనా కావచ్చును. నేనయితే దానితో ఎప్పుడూ అంటనట్లు గానే ఉంటున్నాను. అమ్మ తమకు శుభాశీర్వాదాలు, కేసర్, బిట్టో మరియు మున్నీలు నమస్కారాలు తెలియజేస్తున్నారు. మున్నీ ఆరోగ్యం ఇంకా బాగుపడలేదు. తావూజీ కూడా జలుబుగా ఉన్నారు. 3,4 రోజుల్లో అందరూ  ఆరోగ్యవంతులవుతారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 304

షాజహాన్‌పూర్,
22.04.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం ఏప్రియల్ 16వ తేదీతో ఉన్నది అందింది. ఆంతరికంలో (self) 'అహం' విలీనమైపోవటం యోగ మార్గంలో జరుగుతుంది. నీవు "నరనరాలలోను తమరు విలీనమైపోయారు" అని వ్రాశావు. నీవు ఆ విధంగా విలీనమైపోవటమే కాకుండా ఇంకా దూరం ప్రయాణించాల్సి ఉంది. ఇప్పటికి రూపాయిలో ఒకటి లేదా రెండు పైసల వంతు మాత్రమే యాత్ర జరిగింది. నీ యొక్క అణువణువులోను నీ సౌందర్యాన్ని చూస్తున్నట్లు నీవు వ్రాసిన నీ అనుభవం సరైనదే కాని దీని అనుభవం ఇంకా చాలా స్వల్పంగానే ఉంది. మనం ఆరంభం నుంచి అంతం వరకు, కాంతి అంటే కాంతియే నిలిచి ఉండేటట్లుగాను, ఒక కన్ను మరొక కంటిని చూడలేకపోతున్నంత గాఢంగాను మన దృష్టిని నిలపాలి. నీ యొక్క ఈ అనుభవం సరైనదే, నీ హృదయం ఇంకా తెరుచుకోలేదు అని నేను గతంలోనే వ్రాశాను కూడ. మన హృదయం ఎంతగా తెరుచుకుంటుందంటే, దానికి ఇంకా హద్దు అంటూ ఏమీ లేకుండా పోతుంది. నీవు నాకు బాగా జ్ఞాపకం చేశావు. నేను నీ హృదయాన్ని ఇంకా సరిదిద్దవలసి ఉంది. నేను నిన్ను ఉన్నతంగా చేరునట్లు చేసాను కాని హృదయం గురించి పట్టించుకోలేదు. "మాలిక్ స్వతంత్రుడై ఉండి కూడా బంధితుడయ్యాడు" అని నీవు వ్రాశావు. 'అతడి' శక్తి నీలో ఇముడుతోంది అని, ఆ శక్తిలో 'అతడి' (ఉనికి యొక్క) అనుభవం కలుగుతున్నదని దాని అర్థం. నీలో స్వయంగా బంధనం నిలిచి ఉంది కనుక 'అతడు' కూడా బంధితుడు లేదా బంధనం కలిగి ఉన్నవాడుగా అనిపిస్తుంది. స్వయంగా బంధనం కలిగి ఉన్న మనిషిలో దైవం కూడా బంధనమై ఉన్నట్లుగా అనగా పరిమితికి లోబడి ఉన్నట్లుగా అనిపిస్తుంది. దైవాన్ని మనం ఎప్పుడైనా తలచుకున్నప్పుడు, 'అతడు' కూడా మనలాగానే ఉన్నట్లు భావించటం వలన స్థూల పూజలు (విగ్రహారాధన) ఆరంభం కావటానికి కారణమయ్యింది. నీవు సమత్వం గురించి వ్రాశావు. అది బ్రహ్మగతిని తెలుపుతుంది. అనగా నీ యొక్క ఈ స్థితి, నీవు సూటిగా బ్రహ్మత్వంలోకి ప్రవేశిస్తున్నట్లు తెలియజేస్తుంది.

"నా శరీరంలోని ప్రతి అణువు పారదర్శకంగా అయిపోతోంది" అని నీవు వ్రాశావు. ఈ స్థితిని నీవు అర్థం చేసుకోలేకపోయావని అనుకుంటాను. ఈ స్థితినిబట్టి నాకు ఏమి తోస్తున్నదంటే, నీ శరీరం యొక్క ప్రతి అణువులోను 'మాలిక్' యొక్క ఉనికి నీకు అనుభవమవుతూ ఉండి ఉండాలి, అది మంచి స్థితి కూడ. నీకు భగవదనుగ్రహం లభించుగాక! 'నేను' అని పలుకుతున్నప్పుడు 'నా' యొక్క భావం గాని, 'నీవు' అని పలుకుతున్నప్పుడు 'నీవు' అనే భావంగాని కలగటం లేదు అని కూడా నీవు వ్రాశావు. ఇది లయ అవస్థకు చెందిన మంచి స్థితిగా భావించాలి. ఇప్పుడు ఇంకా శరీరం యొక్క స్పృహ (Body consciousness) మిగిలి ఉంది. అది కూడా ముగింపు పొందటానికి మరికొంత సమయం పట్టుంది. నీవు శరీరాన్ని 'మాలిక్' శరీరంగా భావించి ధ్యానం చేస్తూ ఉంటావని అనటానికి నిదర్శనంగా ఉంది. ఇది లయావస్థకు చెందిన రెండవ దశ. నీవు నీ ఉనికి లేదా ఎరుక తెలియనంతవరకు ఇదే పద్ధతిని కొనసాగిస్తూ ఉండాలి. అమ్మగార్కి ప్రణామం.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 305

లఖీంపుర్,

22.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా 'తమ'రందరు కుశలమని సమాచారం అందింది. తమకు ఉదయం, సాయంత్రం ఒక్క గంట తరబడి వ్యాధి కలవరపెట్టున్నట్లు తెలిసింది. ఈశ్వరుడు శీఘ్రంగా దీనిని నివారించుగాక!

ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, నా లోపల, బయట కూడా ప్రతి అణువులోనూ వాస్తవికత (రియాలిటీ) యొక్క ప్రతిబింబం కనిపిస్తోంది. ప్రతి అణువు నుంచి అదే కాంతి విడుదలవుతోంది. దశలో ఒక అద్భుతమైన పారవశ్యంతో కూడిన స్వచ్ఛమైన సుగంధం వంటిది ఉంటోంది. ఈ దశలోనే కాకుండా ప్రతిఅణువు నుంచి ఈ సుగంధం అనుభూతి చెందుతున్నాను. బాబూజీ, ఇప్పుడు ఏమి అనిపిస్తూ ఉందంటే, నేను చెప్పిన వాస్తవికత (రియాలిటీ) అనేది దశకు సంబంధించినంతవరకు సరికాదేమోనని అనిపిస్తోంది. ఈ సంపూర్ణ దృశ్యం నాలోను, ప్రతిచోట ఉంది. అదేమిటో దైవానికే తెలియాలి. అసలు ఈ స్థితిలో ఆ దృశ్యం నానుంచియే ఉత్పన్నమైనట్లు ఉంది. బాబూజీ, నా స్థితి ఎలా ఉందంటే, నాకు జ్ఞానం వగైరాలు ఏమీ లేకుండా పోయాయి. 'నాది', 'తమరిది' అని చెప్పటంలో అర్థం లేకుండా పోయింది. ప్రస్తుతం దశ ఒక విధమైన సువాసనతో నిండిపోయినట్లు ఉంది. ఇప్పుడు ఉన్న దశలోగాని, రానున్న దశలోగాని నాకు అనుబంధం లేనట్లు అనిపిస్తోంది. ఎటువంటి భారం లేదన్నట్లు అనిపిస్తుంది. అంతా ఖాళీగా ఉన్నట్లు ఈ దశ ఉంది.

నాకయితే ఇప్పుడు జ్ఞానమే లేకుండాపోయింది. వింతైన మరపుస్థితి (ఫర్‌గెట్‌ఫుల్‌నెస్) ఉంటోంది. నేను 'మాలిక్'ను కలుసుకున్నానో లేదో కూడా తెలియకుండా ఉన్నాను. ఇప్పుడు ఏమైందో ఏమిటో దైవానికే తెలియాలి. ఇప్పుడు నా మనస్సు, వృత్తులు (Senses) ఏవీ నా వశంలో లేకుండా పోయాయి. ఇప్పుడు 'మాలిక్' (Senses) మానసిక వృత్తుల యొక్క బంధాన్ని కూడా తొలగించివేయటమో లేక నన్ను వాటినుంచి స్వతంత్రురాలినిగా చేశారో అన్నట్లు ఉంది. బాబూజీ ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, ఎవ్వరైనా అనారోగ్యంగా ఉన్నట్లయితే వెంటనే భయపడుతున్నాను, మంచికోసం 'అతడి'ని ప్రార్థిస్తున్నాను. అయినా కూడా భీతి చెందనట్లు చూస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎంత నమ్రతగా ఉందంటే, నా కంటె పెద్దలు, పిన్నలు కూడా పెద్దవారుగానే కనిపిస్తున్నారు. అంతేకాదు పెద్దా చిన్న కూడా సమానంగానే కనిపిస్తున్నారు. నా కంటె చిన్నవారెవరూ ఈ ప్రపంచంలో లేకుండాపోయారు. ఎవరైనా ధ్యానం చేస్తున్నారో లేదో కూడా నాకు పట్టనట్లు ఉంది. ఎవరైనా నా అనార్యోగం గురించికాని, నన్ను ప్రశంసించినగాని నాకు ఏమి తెలియటం లేదు. అది ఎందుకో ఆ దైవానికే తెలియాలి. శ్రీ బాబూజీ, ఇప్పుడు నా అధీనంలో ఏమీ లేకుండాపోయాయి. 'మాలిక్' కృపతో ఇంతకుపూర్వం ప్రతిదీ, అనగా మనస్సు, బుద్ధి, ప్రవర్తన అన్నీ నా వశంలో ఉండేవి. ఇప్పుడు, ఎప్పుడైతే నేను మరుపుస్థితిలో ఉన్నానో, అది 'అది 'అతడి'కి తెలుసు. 'అతడు' ఎలా ఉంచితే అలాగే ఉంటున్నాను. ఇంతేగాకుండా ఈ దశలో ప్రతివ్యక్తి, ఆఖరికి పిల్లవాడు కూడా నాకు అన్నీ నేర్పగలిగినవారుగా కనిపిస్తున్నారు. అవి ప్రాపంచిక విషయాలేకావచ్చు లేదా ఆధ్యాత్మిక విషయాలే కావచ్చు.

నాకు ఇప్పుడు (రియాలిటీ) వాస్తవికతగాని, మరేదైనాగాని, దేనిని గురించిన జ్ఞానం లేదన్నట్లు ఉంది. కాని దీనిని వాస్తవికత (రియాలిటీ) అన్నట్లయితే దశ యొక్క అర్థమే సరిగా లేనిదవుతుంది. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి. బాబూజీ, పరిస్థితి ఏమిటంటే, నేను 'అతడి'ని ఎంతగా సంతరించుకోవాలని అనుకుంటున్నానో అంతగా పొందలేకపోతున్నాను. ఒకవేళ ప్రేమ (Natural) స్వాభావికమైనదైతే అది 'మాలిక్'కే తెలియాలి. నా ఈ దశలో

మాత్రం తెలియటం లేదు. నేను దానిని ఎక్కడ నుండి తీసుకురావాలి. నేనేమీ చేయాలి, మాలిక్‌కే తెలియాలి. నేను మాత్రం 'అతడి'ని తప్పనిసరిగా కోరుకుంటాను.

ఇప్పుడు నా ఈ దశలో నా ప్రతికణంలోను అన్నివైపులనుంచి ఒక వింతైన వైభవం, ఒక విధమైన పారవశ్యం అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు ఆ వైభవం, పారవశ్యం కూడా నా యొక్క నమ్రతా రూపంలాగానే ఉంది. నాలో ప్రేమ అనేది లేదని నేను చెప్పలేను. ఒకవేళ నాతోనే ఉన్నట్లయితే అది ఇతరులకు చెందదు. అవును ప్రేమ, ప్రేమ రూపంలో లేదు కాని 'అతని' రూపంలో ఎల్లప్పుడూ రమ్యంగానే ఉంటోంది.

బాబూజీ, ఇప్పుడు నేనేమీ చెప్పను! నేను స్వతంత్రురాలినీ కాదు, అలాగే ఎవ్వరి బందీనీకాను అన్నట్లు నా స్థితి ఉంది. నేను అవిచ్ఛిన్నురాలిని (అనగా విడదీయరానిదానిని). నేను స్పృహ కలిగి ఉండి లేను, స్పృహ లేకుండాను లేను, ఎందుకంటే, అవన్నీ దశలే. ఇప్పుడు నాకు ఈ దశ ఏదైనాకాని దశయే కాదు, వాటితో సంబంధం లేదు. నేను నిర్గుణురాల నయినాకాని, నిరంజనురాలనైనాగాని, అది ఏమిటో 'అతడి'కి తెలుసు. (అనగా గుణాలు లేకున్నా, అనుభూతి చెందకున్నా, అదేమిటో 'అతడి'కి తెలుసు.) బహుశా నేను ఇవేమీ కాదుకాని ఒక అల్పురాలను, అత్యంత అల్పురాలను. నేను ఏమిటో 'తమకు' తెలుసు, నేను 'తమకు' చెందినదానను, అంతే. నేను అవిచ్ఛిన్నురాలను, కేవలం ఒక్కటిగానే ఉన్నాను. బాబూజీ, అది తమకు తెలుసు. తమరు ఏమి నిర్వచిస్తే అదే సరైనది. కనుక నా అనుభవంలోకి వచ్చిన ఈ దశను గురించి వ్రాశాను.

పుస్తకాలు అందాయి. నిదానంగా అన్నీ సర్దుకుంటాయి. అమ్మ తమకు శుభాశీర్వాదాలు, బిట్టో మరియు చిన్నసోదరుడు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 306

షాజహాన్‌పూర్,
25.04.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం ఏప్రియల్ 22వ తేదీది చేరింది. దానిని చదివి ఆనందంతో పులకించిపోయాను. నేటి కాలాన్నిబట్టి గాజు మరియు వజ్రం ఒకే ధరకు విక్రయించబడుతున్నాయి. దీనిని కాలదోషం అని అనలేము కాని కాలాన్ని భ్రష్టుపట్టించినవారి దోషం అని చెప్పాల్సి ఉంది. ప్రస్తుత కాలంలో సామాన్య విద్యను అభ్యసించి కొంచెం ధార్మిక బుద్ధి కలిగిన వారు 'గురువు'లుగా చలామణి అయిపోతున్నారు. వారికి శిక్షణ ఇచ్చేవారు కూడా చాలామంది అటువంటివారుగానే ఉన్నారు. వారే కనుక, సన్యాసి వేషధారణ (కాషాయ వస్త్రధారణ) దాల్చినట్లయితే 'జగద్గురు'వుగా తయారైపోయి జనులకు ఘనమైన పూజలు నేర్పటం ఆరంభించారు. వారి వేషం అనగా వస్త్రధారణనుబట్టి ప్రజలకు కూడా విశ్వాసం ఏర్పడటం వలన వారు ఈ పూజలు నిర్వహించటం మొదలుపెట్టారు. ఈ పరిస్థితుల్లో ఆ వేషం, రంగులేని నన్ను అనసరించేవారు ఎవరు ఉంటారు! మనం ఎవరికైనా ఏదైనా బోధించినప్పటికీ ఆలకించేది ఎవరు? ఎందుకంటే, సాధువులలో ఉన్న జిమ్మిక్కులు నాలో లేవు గదా మరి! స్వామి వివేకానందాజీ తన ఒకానొక ఉపన్యాసంలో, ఎవరి దృష్టి పూర్తిగా అంతర్ముఖంగా మరలి, తమలోనే తమ ఆత్మ సాక్షాత్కారం పొందగలుగుతారో, అట్టి వారిని కనీసం ఇరవైమందిని తయారుచేయగలిగితే తన పని సఫలీకృతమైనట్లేనని చెప్పారు. వారికి అతికష్టంమీద ఒకరిద్దరు మాత్రమే దొరికారని నేను భావిస్తున్నాను. కాని నేనయితే వందలకొద్దీ అటువంటి వారిని కావాలనుకుంటున్నాను. అయితే ఇది జరగాలంటే 'ఈశ్వరు'ని కృప లేకుండా జరిగే పని కాదు. అది 'అతని'

(ఈశ్వరుడు) ఇచ్ఛానుసారంగానే ఉంటుంది. అందుకు తగినవారు దొరికేంతవరకు మన పని మనం చేసుకుంటూ పోతాం.

మన కరపత్రం 'గురు–సందేశ్' అను దానిలో ఈశ్వర సాక్షాత్కారస్థితి అంటే ఏమిటో నీవు చదివే ఉంటావు. మనకు అటువంటి స్థితియే కావాలి. **శంఖ, చక్ర, గదా, పద్మాలు ధరించి ఉన్న వారినే అసలైన దైవంగాను, దైవాన్ని తమ వంటి దేహదారులుగాను జనం భావిస్తున్నారు. అటువంటి వారికి అభినందలను తెలపాలి. ఈశ్వరుని భౌతికంగా భావించినట్లయితే వారికి కలిగే ఆధ్యాత్మిక లాభం ఏమీ ఉండదని, అలా భావించటం ఈశ్వరుని అవమానించటమేనని వారు (జనం) గ్రహించలేకపోతున్నారు. దీని వలన కలిగే నష్టం ఏమిటంటే, మన దృష్టి భౌతిక పదార్థం మీదనే లగ్నమైపోవటం ఒకటైతే రెండవది ఈశ్వరునికి ఆగ్రహం కలిగించే అవకాశం కల్పించినట్లు కూడా అవుతుంది. ఎవ్వరైనా శుచి శుభ్రత పాటించేవారిని మురికి మనిషిగా చెప్పినట్లయితే అతనికి తప్పనిసరిగా కోపం వస్తుంది.** నీకు ఈశ్వర సాక్షాత్కార స్థితి ఇంతకుపూర్వం కూడా కలిగింది కాని అది ఇప్పటి మాదిరిగా స్పష్టంగా లేకపోయింది. నీవు ఇప్పుడు ఇంకా ముందుకు పోవలసి ఉంది. దానిని పిల్లలకు ఆటబంతిలాగా అర్థం చేసుకో. **మనం మనలోనికి చొచ్చుకుపోయినట్లుగాను, మన సౌందర్యాన్ని మనలోనే దర్శించగలుగునట్లుగాను తయారు కావాలి. మన దృష్టి అంతర్ముఖం కావటం వలన కలిగే ప్రయోజనం ఇదే. అయితే దానితోనే సరిపెట్టుకుని, అక్కడే నిలిచిపోయేటటువంటి స్థితిగా మాత్రం కాదు. ఇది అసలైన బ్రహ్మవిద్యకు ఆరంభం మాత్రమే,** కనుక నీవు ఇంకా ముందుకు పోవాల్సి ఉంది. ఈ దృశ్యం తిలకించిన అనుభవం నిలిచి ఉండకపోతే, అది అసలైన స్థితికి రెండవ మెట్టుగా అవుతుంది. నీవు ఎంతగా పురోగమనం చెందుతూ ఉంటావో, అంతగా దాని స్వరూపం కూడా మార్పు చెందుతూ ఉంటుంది. **అగాధమైన సముద్రంలో మనం ఇంకా మునగవలసిన దూరం మైళ్ళ తరబడి ఉంది.**

"ఇప్పుడు ఉన్న దశలో, ఎటువంటి అనుబంధం కాని, ఎటువంటి భారం (బరువు) కాని లేవు" అని వ్రాశావు. దీని అర్థం ఏమిటంటే, నీ **స్థూలమైన (Self) 'అహం' నశించిపోయింది, ఇప్పుడు నీవు ఏ పనికి కర్తవుకాదు, సంస్కారాలు ఏర్పడవు,** అని. "నా (Senses) 'మనోవృత్తులు' కూడా లేకుండా పోయాయి" అని నీవు వ్రాశావు. ఇది నిజమైనదే. అయితే (senses) వృత్తులలో ఇంకా మందకొడితనం నిలిచి ఉండటం వలన ఇంకా పరిశుద్ధం కాలేదు. లయ–అవస్థ పెరుగుతున్నకొద్దీ ఇవి (Senses) స్వచ్ఛమవుతూ ఉంటాయి. నీవు నెగేషన్ యొక్క పరిపూర్ణ స్థితిని పొందినప్పుడు, ఈ వృత్తులు కూడా పూర్తిగా శుద్ధి చెందుతాయి. **నీవు ఉన్నతి చెందుతూ ఉంటే, నాకు అది ఇంకా ఆరంభస్థితిగానే అనిపిస్తోంది నా దృష్టికి, మరి నేను ఏమి చేయగలను.**

నా దృష్టిలో సాక్షాత్కార స్థితి ఇంకను చాలా ఉన్నతంగా ఉంది. **అభ్యాసీ తనకు తానుగా ఈశ్వరునిలో పూర్తిగా లయం కానంతవరకూ, అతడు పరిపూర్ణ సాక్షాత్కారం పొందిన ఆత్మకలవానిగా (Perfectly Realised soul) నేను చెప్పజాలను.** నా దృష్టికి ఇంతవరకు అటువంటి వ్యక్తి కనిపించటం లేదు. ఒకవేళ మన గురుమహారాజ్ (లాలాజీ సాహెబ్) ఎవరినైన తీర్చిదిద్ది ఉన్నారేమో, అది వారికే తెలియాలి. బిటియా! ఇది నా దృష్టిలోపమై ఉంటుందేమో. ఇప్పుడు నీకు ఒక వృత్తాంతం వివరిస్తాను:

ఒక సందర్భంలో దుర్యోధనుడు, "నేను కూడా నీకు బంధవునే అయినప్పటికి నా కంటె అర్జునుడునే ఎక్కువగా ప్రేమిస్తున్నావు, ఎందుకు?" అని శ్రీకృష్ణునికి ఒక ప్రశ్న సంధించాడు. శ్రీకృష్ణుడు కొంత తడవు వేచి ఉండి తర్వాత సమాధానం ఇచ్చాడు. అది ఏమిటంటే, కృష్ణుడు అర్జునునితో నీ రాజ్యంలో ఎంతమంది చెడు మనుష్యులు ఉన్నారో జాబితా తయారుచేసుకొని రమ్మని, అదే విధంగా దుర్యోదునునితో నీ రాజ్యంలో ఎంత మంది మంచివారు ఉన్నారో జాబితా తయారుచేసుకు రమ్మని ఆజ్ఞాపించాడు. ఇద్దరూ బయలుదేరారు. అర్జునుడు తిరిగి వచ్చిన తర్వాత "జాబితాలో వ్రాయటానికి నాకు చెడ్డవారు ఎవరూ కనిపించలేదు" అని చెప్పగా దుర్యోధనుడు జాబితాలో వ్రాయటానికి తనకు మంచివారు ఎవ్వరూ కనిపించలేదు అని చెప్పాడు. అప్పుడు శ్రీకృష్ణుడు, అర్జునుని

ఎక్కువగా ప్రేమించడానికి ఇదే కారణమని తెలియజేశాడు. "అర్జునుడు చాలా మంచివాడు కనుక అతనికి అందరూ మంచివారుగానే కనిపించారు. నీవు చాలా చెడ్డవాడవు కనుక నీకు ఎవ్వరూ మంచిగా కనిపించలేదు" అని తీర్మానించాడు. అయితే దుర్యోధనుని దృష్టి వంటిది నాలో ఉత్పన్నం కాలేదు కదా అని సంశయిస్తున్నాను. "నా కంటె ఈ ప్రపంచంలో చిన్నవారు ఎవరూ లేరు" అని నీవు వ్రాశావు. ఇది ఒక గతి అనగా బ్రహ్మగతికి సమీపస్థాయిలో ఉంటుంది. దీనికంటె ఉన్నత స్థితి కలుగుతుంది, అయితే అదే ఆఖరి స్థితి అని అనుకోవటానికి వీల్లేదు. దీని తర్వాత కలగబోయే స్థితిని నేను నీకు తెలియజెప్తుతాను. కాని దానిని వివరించటానికి నాకు ఇష్టంగా లేదు, ఎందుకంటే, మొదటనే నీవు దానిపై దృష్టి నిలుపుకుంటావేమో అని. ఈశ్వరేచ్ఛ ఉంటే ఆ స్థితి కూడా కలుగుతుంది. "మొదట మనస్సు, బుద్ధి, ప్రవర్తన అన్నీ నా వశంలోనే ఉండేవి కాని ఇప్పుడు అవి ఏమీ నా స్మృతిపథంలో లేవు" అని నీవు వ్రాశావు. దానినిబట్టి అన్ని రంగులూ సమ్మేళనమవుతున్నాయి అని అర్థం. అయితే అన్ని రంగులూ రంగరించుకొని తెలుపు రంగుగా ఇంకా మారలేదు. ఇది కూడా ఈశ్వర కృపతో జరుగుతుంది. "నా స్వంత అందం, స్వంత ఆనందం, రెండూ కూడా నా యొక్క అద్భుతాలే" అని నీవు వ్రాశావు. దీనినిబట్టి అద్వైతస్థితి ఆరంభమైందని అర్థమవుతుంది. ఈ స్థితి యొక్క పరిపూర్ణత కలిగిన తర్వాత, దాని స్వభావంలో మరికొంత మార్పు ఉంటుంది, కాని దానిని నీకు ఇప్పుడే చెప్పదలచుకోవటం లేదు. ఆ స్థితి ఈశ్వర సాక్షాత్కార స్థితి కంటె కూడా చాలా ఉన్నతమైన స్థితి. అనుకరణ లేదా ఉదాహరణల తర్వాత నీవు ఉత్తరంలో వ్రాసినది ఎంతో ఉంది. అది అద్వైత స్థితికి నీవు చేరబోతున్నావు అనడానికి సంకేతంగా ఉంటుంది. నీ అహంకారం ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. నీవు ఇదే పురోగతి కలిగి ఉంటే దైవకృపతో ఆ స్థితి కూడా కలుగుతుంది.

**యోగమార్గం అనుసరించకుండా ఈ స్థితి కలగడం అసాధ్యం. దానికి ఉన్న షరతు ఏమిటంటే, మన మార్గదర్శకుడు, గురుమహరాజ్ (లాలాజీ సాహెబ్) వంటివారిగా ఉండాలి. మన అందరికీ వారే మార్గదర్శకులు, వారికి వారే సాటి. ఈ స్థితులన్నింటినీ కూడా అందరి ఎదుట సాదృశ్యం చేసినప్పటికీ, ఈ స్థితులు పొందాలి అనే తపన కలిగిన వారు, కోరిక కలిగిన వారు, చాలా తక్కువ మంది మాత్రమే తటస్థపడతారు. ఒకరిద్దరు ఈ విషయమై నాతో సంభాషించినప్పటికీ, ఈ స్థితులు నా ద్వారానే పొందబడతాయి అని వారు విశ్వసించలేకపోయారు. వారి భావనలో ఉన్నటువంటి 'మహాత్ముల'కు తగినట్లు నేను మహాత్ముడుగా తలపించక పోవటమే దీనికి కారణం.** ఇది కూడా సహేతుకమే కావచ్చు. ఎందుకంటే, నేనొక సామాన్య మానవుడను, గురుమహరాజ్ నన్ను ఈ విధంగానే తీర్చిదిద్దారు కూడ. అయితే బిటియా! నీవు మహాత్మురాలివే. నా ఉద్దేశ్యంలో నీవు మహాత్మురాలివి కావటం మంచిదే. ఎందుకంటే, అది విశిష్టమైనది గదా!

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 307

లఖీంపుర్,

25.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. చదివి చాలా సంతోషించాను. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉండవచ్చు. మున్నీ ఆరోగ్యం బాగుపడింది. నిన్నటి నుంచి ఆహారం తీసుకుంటున్నాడు. 'మాలిక్' కృపతో కలిగినటువంటి దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ చీకటి అంటె చీకటిగా ఉంది. ఆ చీకటిలోనే ఈదుకుంటూ లేదా చొచ్చుకుంటూ పోతున్నాను. ఇంకొక స్థితి ఏమిటంటే, నా రూపం చీకటిలాగానే అయిపోయింది. ఇప్పుడు నా కణకణం అద్దంలాగా అయిపోయి, దానిలో 'అతడే' కనిపిస్తున్నాడు. బయట, లోపల కూడా కణకణంలోనూ నా 'మాలిక్' అంటె 'మాలిక్' మాత్రమే కనపడుతున్నాడు. ఈ దశలో ఎలా ఉంది ఉంటే, నా శరీరం 'అతని' శరీరం కాదు కాని, 'అతడు' స్వయంగా నా అణువణువులోను నెలకొని ఉన్నాడు. నా శరీరాన్ని నాదిగా ఇప్పుడు భావించటం లేదు. ఎందుకంటే, ప్రతి అణువులోను 'అతడే' దర్శనమవుతున్నాడు, 'అతడి'నే చూస్తున్నాను. ఇది నావరకే పరిమితం కాదు, బాహ్యప్రపంచపు ప్రతి అణువులోను ఒక్కడుగా 'అతడే' చొచ్చుకుపోతున్నట్లుగాను, అంతర్లీనమైపోతున్నట్లుగాను అనిపిస్తోంది. బాబూజీ, నేనయితే అల్పమైనదానిగాను, పూర్తిగా అవిచ్ఛిన్నమైన (ఛేదించబడనటువంటి) దానిగాను అయిపోయాను.

శరీరం యొక్క ప్రతి అణువూ కరిగిపోయి ప్రవహించి పోతున్నట్లుగాను, అందులో 'మాలిక్' కలిసిపోయినట్లుగాను అనిపిస్తోంది. ఇంకా ఎలా ఉందంటే, అనుభవం, అనుభూతి పొందేవాడు ఏకమైపోయినట్లు అనిపిస్తోంది. ఈ మందగమనమైన అనుభూతియే నాదిగా ఉంది.

ఇది ఏమిటో ఆ దైవానికే తెలియాలి, ఏమిటంటే, నాకు ఇప్పుడు నా ప్రతి అణువులోనూ, రోమాలలోనూ ప్రేమ ఏర్పడింది, అంతేగాక వాటిలో ఒక విధమైన కంపనం లేదా స్పందన (Vibration) స్థిరపడింది. నేను నా రోమ రోమాలతో హత్తుకుని ఉండాలని నా హృదయం కోరుతోంది. **'అతని' దయతో అలా హత్తుకుపోయి ఉండే దశ ప్రారంభమైపోయినట్లు తెలుస్తోంది.** ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, ప్రాపంచికమైన జడచైతన్యాలన్నీ నాకు "దర్ దీవార్ భయె, జిత్ దేఖూ తిత్‌లోయీ" అనగా **"ద్వారాలు, గోడలు అన్నీ అద్దంలాగా అయిపోయి అన్నింటిలోను అతడే దర్శనమవుతున్నాడు"** అన్నట్లు కనిపిస్తోంది. ఇంకొకటి ఏమిటంటే, ప్రతి ఒక్కటీ నాకు ఒకేలాగా ఉన్నట్లు అయిపోయింది. రాతితో హత్తుకుపోయినట్లయితే, నా అస్థిత్వం, దాని అస్థిత్వం ఒకేలాగ ఉన్నట్లు (నీటిని ఏ పాత్రలో పోస్తే ఆ పాత్ర ఆకారమే దాల్చినట్లు) అనిపిస్తోంది. ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, ఏ విధంగానైతే నాలోని అణువణువుతోనూ హత్తుకుపోయి ఉండాలని నా హృదయం కోరుకుంటున్నానో, అదే విధంగా జగతిలోని ప్రతి అణువుతోనూ హత్తుకుపోయి ఉండాలని నా హృదయం కోరుకుంటోంది. ఇంకొకటి ఏమిటంటే, లోపల బయట ఉన్న అన్ని అణువులతోనూ ఇలాగే ఉండాలని హృదయం కోరుకుంటోంది. ఆ విధంగానే అంటిపెట్టుకున్నట్లుగానే తలపిస్తోంది. అణువు అణువూ కరిగిపోయి, ఆ వింతైన ద్రవ పదార్థంలోనే కలిసిపోయి ఉంటోంది. ఇది నాకు సంబంధించినదే కాకుండా ప్రతి అణువులోనూ 'అతడే' దర్శనమవుతున్నాడు. అది ఏమిటో తెలియదు కాని, నవ్వటానికిగాని, విలపించటానికిగాని నాకు ఇష్టం లేదు. లోపల ఏదో వింతగా ఉంటోంది. స్వల్పమైన చలనం, కొద్దిపాటి మెత్తదనం, చల్లని నిట్టూర్పు వంటివి అనుభవమవుతున్నాయి.

బాబూజీ, ఇప్పుడు ఒక వింతైన ఉల్లాసంగాను, ఊగుతున్నట్లుగాను నా దశ అనుభవమవుతోంది. అయితే మధ్యమధ్యలో ఏమీలేని స్థితి తరచుగా కలుగుతోంది. ఆ ఉల్లాసం ఎటువంటిది అంటే అవిచ్ఛన్నం అని నాకు అనిపిస్తోంది. నేను మరణించను, జీవించను, దేనితోనూ ఖండించబడను, దేనిలోనూ మునిగిపోను, ఇంకనూ ఏమీకాదు. నేను ఎలా ఉన్నానో అలాగే ఉంటాను. బాబూజీ, ఇంకా ఎలా ఉందంటే, ప్రతి కణంలోను నేను ఉన్నాను. ఇంకా చెప్పాలంటే, ప్రతికణం నాలో ఉంది. అయితే ఈ తన్మయత్వం బయటకు ఉప్పొంగేది కాదు, సీదాసాదాగా ఉంటుంది. ప్రతికణంలోను ఇదే కనిపిస్తుంది. వాస్తవం ఏమిటంటే, ఇప్పుడింక కణం లేదు, నేను లేను; ఒకే ఒక్కదాని ఉనికి ఉంది. దానికి 'నేను' అని చెప్పినా, 'అతడు' (ఈశ్వరుడు) అని చెప్పినా ఏమీకాదు. ఇటువంటి సాదాసీదా అయినదే నా ఈ స్థితి. నా ప్రతికణం యొక్క జటిలత్వం లేదా గ్రంధి శుద్ధి అవుతూ, కరిగిపోతున్నట్లు అనిపిస్తోంది.

ఈ రోజు నుంచి అనగా ఏప్రియల్ 26వ తారీఖు నుండి నా దృష్టి అంతర్ముఖంగా సారించబడి అక్కడే నిలిచిపోతున్నట్లు అనిపిస్తోంది. అమ్మ తమకు శుభాశీర్వాదాలు, బిట్టో మరియు చిన్నసోదరుడు ప్రణామం తెలుపుతున్నారు. తావూజీ మెడ వెనుక భాగంలో ఒక చిన్నగడ్డ 4,5 రోజులుగా ఉంది. నిన్న అది పగిలి బాధ తగ్గిపోయింది, కనుక విచారించాల్సిన పనిలేదు.

బాబూజీ ఎందుకోగాని, శరీరంలో కొంత అలసత్వం లేదా నిర్లక్ష్యంలాగా అనిపిస్తోంది. అంతకుమించి మరేమీలేదు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 308

లఖీంపుర్,

28.04.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ దయతో వ్రాసిన ఉత్తరం అందింది. చదివి చాలా సంతోషించాను. ఈశ్వరుని కృపతో మున్నీ ఆరోగ్యం పూర్తిగా మెరుగైంది. బలహీనత కూడా కొంతవరకు తగ్గింది. తావూజీ మెడ వెనుక భాగంలో ఉన్న వ్రణం కూడా చిదికింది కాని, చీము ఇంకా కొంచెం వస్తూనే ఉంది. అది ఇబ్బందికరంగానే ఉన్నప్పటికి 'మాలిక్' దయతో 2,3 రోజుల్లోనే గాయం మానుతుంది. చింతించాల్సిన అవుసరం లేదు, అంతా సవ్యంగానే అవుతుంది. 'తమరు' జూన్ నెలలో పూర్తిగా ఒక నెల రోజులు శెలవు తీసుకుని ఉత్తర కాశీ వెళ్ళుతున్నట్లు మాస్టర్ సాహెబ్‌కు ఉత్తరంలో వ్రాశారు. తమరు తిరుగు ప్రయాణంలో ఇక్కడకు వచ్చి 2,3 రోజులు ఉండి విశ్రాంతి పొందవల్సిందిగా అర్థిస్తున్నాం. తమరు తప్పక వస్తారనుకుంటాను. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఎందుకోగాని శరీరంపైన దృష్టి లేకపోగా అసలు శరీరం యొక్క భావనయే లేకుండా పోయింది. ఇప్పటి నా దశ ఎలా ఉందంటే, "నా కణకణంలోను, జగతి యొక్క అణువణువులోనూ 'మాలిక్'నే కనిపిస్తున్నాడు" అని చెప్పినటువంటి దశ అంతులేకుండా పోయింది. ఇప్పుడు ఈ దశను అనుభవంలోకి తెచ్చుకోవాలనుకున్నప్పటికి, ఆ దశ బాగుందని అనిపించటం లేదు, అంతేగాక కొంచెం భారంగా అనిపిస్తోంది. అందువలన దశ పరిశుద్ధంగా ఉన్నట్లు లేదు, 'మాలిక్' అభీష్టానికే వదిలిపెట్టాను. నాకయితే 'అతడు' కావాలనేగాని ఇంకేమీ తెలియదు. బాబూజీ, ఇప్పుడు ఈ దశ నా భావనలోనే లేదు, అది ఎందుకో దైవానికే తెలియాలి. మరోవిధంగా చెప్పాలంటే, 'మాలిక్' నన్ను ఈ దశ యొక్క భారాన్నుంచి నాకు విముక్తి కల్పించారనుకుంటాను.

బాబూజీ, ఈ అనుభూతి కూడా పూర్తిగా ఎందుకు ఖాళీగా ఉంటున్నదో తెలియటం లేదు. అనుభూతి, అనుభూతి చెందుతున్నప్పుడు, అది ఎంత తేలికగా ఉంటుందన్నదంటే, దాని మీద ఎంతమాత్రం భారం పడనివ్వటం లేదు. ఇప్పుడు దశ యొక్క అనుభూతి చెందాల్సిందిపోయి దాని నుంచి విముక్తి పొందినట్లు ఉంది. దశలో భౌతికత ఉన్నట్లయితే ఇంత తేలికదనం అనుభూతి కలగదు అన్నట్లు నా ప్రస్తుత దశ ఉంది. అందుచేత దశ కూడా ఇంత తేలికైనదిగాను, ఖాళీవంటిదిగాను కలుగుతోంది. ఒకవేళ నేను వ్రాద్దామనుకున్నా కూడా, ఈ దశ మారిందా లేక ఇంతకుముందు ఉన్న దశా అనేది తెలియటం లేదు. ఇప్పుడు దశ, అనుభూతి, అనుభూతి చెందేవారు, అంతా సమానంగా ఒకే విధంగా ఉంటున్నది. ఇప్పుడు ఎందుకోగాని, 'మాలిక్' నా అణువణువులోనూ చొచ్చుకోపోయాడా లేదా

అంతర్లీనమైపోయాడా అన్నది తెలియటం లేదు. బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, దశ కలుగుతున్నది, మారిపోతున్నది, అయినా కూడా ఆంతరిక స్థితి ఒకే రకంగా ఉంటున్నది. ఇంకా ఏమిటంటే, ఒకే రకమైన దశలు కలుగుతున్నాయి, అందువలన స్వల్పమైన మార్పులు వస్తున్నాయి. అవి నాకు తెలిసినప్పటికి వాటిని అనుభూతి చెందలేకపోతున్నాను. దశ మారిందా లేదా అదే ఉన్నదా అనేది కూడా తెలియటం లేదు. ఈశ్వర కృపవలన కొంత అవగాహనకు వస్తోంది.

**తారీఖు 29.04.1953:** ఈ రోజు దశలో నిర్మాణంగాని, అలంకారంగాని ఉండటం లేదు. ఎలా వస్తూందో అలాగే ఉంటోంది. నేను ఎంత అల్పురాలుగా అయిపోయానో తెలియదు. నన్ను ఒక దరిద్రురాలిగా చెప్పుకోండి. ఎంతగానంటే, స్వప్నంలో కూడా ధనవంతురాలుగా గాని, బీదరాలిగా గాని భావం రానంతగా. స్థితిలో ఏ కొద్దిపాటి మార్పు వచ్చినా, ప్రయత్నం లేకుండానే తెలుస్తుంది, దానిని వెంటనే వ్రాసేస్తున్నాను. ఆ భగవంతునికే తెలియాలి, నేను ఇప్పుడు ఎందుకు (Sea of humility) నమ్రతా సాగరంలో ఒక్కసారిగా మునిగిపోతూ ఉన్నట్లు అనిపిస్తోందో. ఇంకా చెప్పాలంటే, నా కణకణంలోను అదే జలం ప్రవహిస్తున్నట్లుగాను, నేను దానిలోనే కలిసిపోతున్నట్లుగాను అనిపిస్తోంది. నా 'మాలిక్' ఈ ఆధిపత్యం కేవలం 'తమ'ది మాత్రమే. ఎందుకంటే, ఈ రీతిగా ఎన్నడూ చూడలేదు, వినలేదు. నేను దీనికి కొద్దిసేపటి క్రితం వ్రాసినటువంటిది షుమారు ఉదయం గం. 8.30 ని॥లకు అనుభవమైంది. బాబూజీ, ఇది నా అద్భుతకార్యం కాదు, అసలు ఇది అద్భుతం కాదు, నా ఘనకార్యం కానేకాదు. ఇప్పుడు ఈ దశలో అన్నీ ఒకే రంగు దాల్చాయి, నాకు తెలియకపోయినా తమరు ఇచ్చినట్లే అవుతుంది. పూజ్య శ్రీ బాబూజీ, తమ దృష్టిలో చెరుపులేదు. ఇంకా చెప్పాలంటే, తమరు వ్రాసినట్లు దుర్యోధనుని వంటి కళ్ళు ఆవిర్భవించ లేదు. నాకు తెలిసిందల్లా, తమరు మా స్థూలత్వాన్ని అంతటినీ కరిగించివేసి, అణువు అణువును నిర్మలీకరించి, తమ కృపావశంతో అసలైన రూపాన్ని ప్రసాదించాలని భావిస్తున్నారు. మమ్మల్ని వాస్తవమైన స్వచ్ఛతతో నిలపాలని కోరుతున్నాను. తమరు 'ప్రారంభం' అని వ్రాసిన దానిని నేను నిజంగా స్వతహాగానే అనుభూతి చెందుతున్నాను. **అలాకాదు, ఎందుకంటే, నాకు ఆరంభంతో పనిలేదు, సంపూర్ణత్వంతోను పనిలేదు. నాకల్లా నా 'మాలిక్'ను యధాతధంగా పొందటమే కావాలి.**

మాస్టర్ సాహెబ్‌గారు, ఇప్పుడే తమ పోస్టుకార్డ్ తీసుకువచ్చారు. నన్ను 'R' పాయింట్‌కు చేర్చినందుకు తమకు అనేక ధన్యవాదాలర్పిస్తున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 309

లఖీంపుర్,

5.05.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు పోస్టుకార్డ్‌లో వ్రాసిన విషయాలన్ని మాస్టర్ సాహెబ్ చదివి వినిపించారు. శుక్లాజీ రోమరోమంలోను 'అజప' తెరచినందుకు అనేక ధన్యవాదాలు. తావూజీ వ్రణం కూడా 'మాలిక్' దయతో పగిలిపోయింది. దాని నుంచి చీము పలుచోట్ల నుంచి కాకుండా ఒకే చోటునుంచి వెలువడేటట్లు చేస్తానని డాక్టర్‌గారు చెప్పారు. తర్వాత ఈశ్వరుని దయ. బలహీనత ఉందిగాని క్రమంగా తగ్గుతోంది. 'మాలిక్' కృపతో ఇప్పుడు కలిగిన దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు శరీరం యొక్క రోమరోమంలోను, అణువణువులోను ఈ దశ వ్యాపించిపోయి, ఆనందమయమై పోయింది. దీనిని శరీరం లోపల బయట, ప్రతి కణంలోను ఆధ్యాత్మిక పవిత్రత నెలకొన్నట్లు చెప్పవచ్చు.

బాబూజీ, ఇంకా ఏమనిపిస్తోందంటే, కన్ను, కన్నులో (మాలిక్ కన్నులో) తనను కోల్పోయినట్లు ఉంది. ఆధ్యాత్మిక స్థితిలో దృష్టి స్వయంగా కోల్పోయి, చొచ్చుకుపోయింది. ఇప్పుడు ఎలాంటి స్థితి ఉన్నదనిపిస్తుంది అంటే, బాణం లక్ష్యాన్ని ఛేదించినట్లు ఉంది. స్థితి ఇప్పుడు కళ్ళల్లోనే అంతర్లీనమైపోయింది అన్నట్లు అనిపిస్తోంది. ఇంకా ఏమైందంటే, ఒకే కన్ను, ఒకే రంగుగా నిలిచిపోయాయి. అయితే అదేమిటోగాని దైవానికే తెలియాలి కంటికి రంగుల యొక్క తేడాను కూడా గుర్తించలేకపోతోంది. ఇంకొక మాటలో చెప్పాలంటే, రంగు కూడా కన్నుగానే అయిపోయింది. ఇప్పుడు ఒకే గతిలో అనగా సమాన వేగంతో ఆ మైదానంలో, 'మాలిక్' తనకు తోచినట్లు తీసుకు వెళ్ళుతున్నారు. ఇంకొక రకంగా చెప్పాలంటే, అన్ని గతులు అంతరించిపోయి ఒకే గతి మిగిలి ఉంది, లేదా మొత్తం ఒకే గతిగా అయిపోయింది. ఇప్పుడు ఎటువంటి మైదానంలో సాగిపోతున్నానంటే, దేనిలోనైతే ఒకే కన్ను, ఒకే రంగు ఉన్నాయో, అక్కడ స్థితి లేదు. ఎందుకంటే, బహుశా అది కన్నులో మిళితమైపోయి ఉంటుంది. ఇది కూడా అమాయకత్వపు (అజ్ఞానపు) సారమే. ఎందుకంటే, ఇటువంటి దశలో అసలు ఏమైనా ఉందా లేదా అనే సంశయం కలుగుతోంది. ఈ మైదానంలో ప్రతి యొక్క దాని స్థితి ఇలాగే ఉంది. ప్రతి కణం నాకు ప్రియమైనదే, ప్రతి కణాన్ని నేను ప్రేమిస్తున్నాను అని అనిపిస్తోంది. ప్రతి కణం నుంచి నాకు ఆనందం, కాంతి లభిస్తున్నాయి. ఇంకొక విషయం ఏమిటంటే, ప్రతి కణం, నరనరం ఆ పరమానందంతో పోషించబడుతున్నాయి. ఇటువంటి మైదానంలో నేను సాగిపోతున్నట్లు లేదు అయితే అదే నావైపుకు తరలివస్తోంది.

పూజ్య శ్రీ బాబూజీ, క్రితంలో నేను "అన్నివైపుల నుంచి నాకు ఒకే రకమైన ఉనికి (వ్యక్తితత్వం) కలిగి ఉన్నట్లుగాను, రాతితో హత్తుకుపోయి నట్లయితే నాకు అదే ఉనికి అయినట్లుగాను అనిపిస్తోంది" అని వ్రాశాను. ఇప్పుడైతే ఎటువంటి అస్తిత్వం లేకుండా పోయింది. మరిదేని యొక్క అస్తిత్వం కూడా లేకుండా పోయింది. మైదానం నిర్మలంగా ఉంది, ఎవ్వరి ఉనికి లేదు. అదేమిటో దైవానికే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, బిట్టో మరియు చిన్నసోదరుడు ప్రణామం చెబుతున్నారు. తావూజీ శరీర ఉష్ణోగ్రత 99.4 డిగ్రీలు ఉంటున్నది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 310

లఖీంపుర్,

9.05.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు, తావూజీ మరియు శుక్లాజీని ఉద్దేశించి వ్రాసిన ఉత్తరాలు అందాయి. తావూజీ, వారికి చెందిన తమ పోస్టుకార్డ్‌లోని విషయం విని ఉప్పొంగిపోయారు. మాకయితే 'అతని' కృపయే ఆధారం. మే 7వ తేదీ ఉదయం, మన సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్‌ని ప్రార్థిస్తూ ఉండగా, అకస్మాత్తుగా ఒక్క క్షణంపాటు, నిండైన శరీరం, శ్యామ వర్ణం కలిగిన రూపం, అనగా మన లాలాజీ సాహెబ్‌లాగానే భారీ శరీరం అదే రంగు కలిగిన శరీర రూపం దర్శనమయ్యాయి. అప్పుడే నా పేరు కస్తూరీ అను మాట కూడా వినపడింది. ఆ తర్వాత ఆ వ్యక్తి మాయమై పోయాడు. అప్పటి నుండి ఒక వింతైన ఉల్లాసం లేదా ఉప్పొంగిన ఉత్సాహం, ఒక విధమైన శాంతి, తమ నుంచి నాకు లభించినట్లుగానే, ఆ సుమధుర వాణి, నాకు అంతే ప్రేమ అనుభవమయ్యింది. ఈ విషయమై 'మాలిక్'కు అనేక ధన్యవాదాలు. మరి నా 'సమర్థ' లాలాజీ మహరాజ్‌గారికి ఏమి ఇవ్వాలి, వారితో ఏమని చెప్పాలి? ఇంకేమి ఉంటుంది, మరీ మరీ ప్రణామం చెబుతున్నాను. అయితే నాకు ఇప్పుడు ఏమైందో ఏమో ఆ భగవంతునికే తెలియాలి

కాని, నేను ఏమి ప్రార్థనచేస్తూ ఉన్నానో నాకు జ్ఞాపకం రావటం లేదు. 'మాలిక్' దయతో తావూజీ పరిస్థితి రోజు రోజుకు మెరుగుపడుతోంది. శుక్లాజీకి తమరు వ్రాసిన కార్డు ద్వారా తమ కడుపులో ఎక్కువ బాధ కలిగినట్లు తెలిసి నా హృదయంలో దిగులు వేసింది. నేను, అమ్మగారు తావూజీ వ్రణం నుంచి విషాన్ని త్రాగిన కారణంగా ఇలా జరిగి ఉంటుందా అని అనుకుంటున్నాము. బాబూజీ, తమ శరీరం అందుకు యోగ్యం కాదు. ఒకవేళ తమ మనస్సుకు నచ్చకపోయినట్లయితే, ఆ పని నాకు పురమాయించండి. నాకు ఎటువంటి ఇబ్బంది కలుగదు. తమ బాధ మమ్మల్ని బాధిస్తోంది. ఏమైనా జరగనివ్వండి, జరగకపోనివ్వండి, తమరు బాగుండాలని మేమందరం 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాము. **ఈ జగతిలో నాకు వెలుగు, వసంతం లేదా ఆనందం కేవలం నా 'మాలిక్'తోనే ఉన్నాయి. నేను సదా 'మాలిక్'తోనే ఉంటున్నాను.** 'అతడు' నాలో ఉంటున్నాడు. దయచేసి 'తమ' కడుపునొప్పి గురించిన సమాచారం తప్పక తెలియజేయండి. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, ఏదైనా అనుభవానికి రావటంగాని, ఏదైనా సాదృశ్యమవ్వటంగాని జరగటం లేదు. ఇంక మైదానంగాని, మరేదీగాని లేదు. ఏదో నిర్మానుష్యంగా పాడుపడినదానిలాగా ఉంది. ఇపుడు నా మనస్సుకు ఎలా ఉందంటే, ఏదైనా నిర్మాణంగాని, అలంకారంగాని మనస్కరించటం లేదు. అది ఎంతగానంటే, గది కూడా ఖాళీగా ఉండటమే నచ్చుతోంది. నేను ప్రతిదానికి విరుద్ధంగా ఉన్నాననే భావం కాదు. నాకు ప్రతి వస్తువు కూడా ఖాళీగానే కనిపిస్తోంది. **ప్రపంచం ఇప్పుడు ప్రపంచంలాగా కాకుండా ఒక ఏకాంత ప్రదేశంగా కనిపిస్తోంది. ప్రతి వస్తువు, ప్రతిచోట నాకు ఏకాంతంగానే అనిపిస్తోంది.** నా హృదయానికి ఏమనిపిస్తోందంటే, అశ్రువులు కార్చటానికి ఉద్దేశించినవి కాదని, వాటిని హృదయంలోనే నిక్షిప్తం చేసుకోవటం మంచిదని అనిపిస్తోంది. ఆంతరికం నుంచిగాని, హృదయం నుంచిగాని వచ్చే ప్రతిదీ నాకు మంచిదేనని అనిపిస్తోంది. నా సంబంధం కేవలం ఆంతరికం మరియు మనస్సుతో మాత్రమే ముడిపడి ఉన్నట్లయితే అవయవాలన్నీ కరిగిపోయి ప్రతి వస్తువూ ఖాళీ అయిపోయినట్లు అనిపిస్తోంది. నా ప్రతి అణువు ఖాళీ అయిపోయినట్లు ఉంది. నా బాబూజీ, ఇప్పుడు ఏమిటంటే, బాహ్య సంబంధాలన్నీ పూర్తిగా తెగిపోయినట్లు అనిపిస్తోంది. **అదేమిటోగాని, ఇంకా ప్రతి వస్తువూ, ప్రతి సమయంలోను ఖాళీ అయిపోతున్నట్లు కనిపిస్తోంది.** బాబూజీ, ఇప్పుడు వనంగాని, మైదానంగాని ఏమీ కనిపించటం లేదు, అది దైవానికే తెలియాలి.

నేను గతంలో తమకు, ఒకే నేత్రం, ఒకే రంగుగా అయిపోయింది అని వ్రాశాను. **అయితే ఇప్పుడు నేత్రంగాని, రంగుగాని ఏమీలేనిస్థితిగా ఉంది.**

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టో ప్రణామం తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 311

షాజహాన్‌పూర్,

12.05.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ! నీ ఉత్తరాలు అన్నీ చేరాయి. మే 5వ తేదీ ఉత్తరానికి జవాబు ఇది మాత్రమే. అది ఏమిటంటే, నీ లయ అవస్థ, 'ఫనాయియత్' అని కూడా చెప్పబడునటువంటిది, వృద్ధి చెందుతోంది. అదృష్టవంతులైన అభ్యాసులకు ఈ లయ అవస్థ కలిగి వృద్ధి చెందుతూ ఉంటుంది. దీనికి తీరం (హద్దు) ఇంకా చాలా దూరంలో ఉంది. ఈ స్థితి అంతరంగంలోను, బాహ్యంలోను కూడా అనుభవమవుతూ ఉంటుంది. **వాస్తవానికి తనలోనే తాను లయమైపోతూ**

**తన ఎరుకను స్వయంగా కోల్పోవటమే ఆధ్యాత్మికత అనబడుతుంది.**

నీకు ఒక విషయం వ్రాయటం మరచిపోయాను. నీవు ధార్మిక (ఆధ్యాత్మిక) గ్రంథాలు అధ్యయనం చేస్తూ ఉండు. ప్రతి ఆధ్యాత్మిక గ్రంథాన్ని, ఉపనిషత్తులు మొదలగు వాటిని పరిశీలిస్తూ ఉన్నట్లయితే, భగవదనుగ్రహంతో చాలామంది బడాయికోరులకంటే నీకు ఎక్కువ విషయాలు అవగాహనకు వస్తాయి. నేను కూడా చదవ నారంభించాను కాని, మరచిపోతూ ఉంటాను. విద్యావంతుల ఎదుట నాకు ఒక విధమైన అల్పుడనను భావం కలుగుతుంది. నీవు మాత్రం నీలో ఇటువంటి భావనకు చోటు ఇవ్వవద్దు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 312

లఖీంపుర్,

14.05.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్న అందింది. తమ కడుపునొప్పి పరిస్థితి గురించి తెలిసి అందరికీ బాధగా ఉంది. అతిత్వరగా తమ బాధ తగ్గిపోవాలని ఈశ్వరుని ప్రార్థిస్తున్నాము. సాధ్యమైనంతవరకు తమరు విశ్రాంతి తీసుకున్నట్లయితే కొంత ఫలితం ఉంటుందని అమ్మ కూడా చెబుతున్నారు. తమరు ఇక్కడ, బంగాళాదుంప సూప్ ద్వారా తమ కడుపునొప్పి నుంచి ఉపశమయం కలుగుతుందని చాలాసార్లు చెప్పారు. కనుక మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా బంగాళాదుంప సూప్‌ను తప్పనిసరిగా పంపిస్తాను, తమరు దానిని వెంటనే త్రాగండి. తప్పకుండా ఉపశమనం లభిస్తుంది. మాస్టర్ సాహెబ్‌గారితో కూడా నేరుగా మీవద్దకే వెళ్ళి దానిని అందజేయమని చెబుతాను. దానివలన శీఘ్రంగా తమకు విశ్రాంతి కలుగుతుంది. బాబూజీ, ఏమి చేయను, నేను మీ దగ్గర ఉండి ప్రతిరోజు ఈ సూప్ (రసం) తయారుచేసి త్రాగిస్తూ ఉన్నట్లయితే ఈ కడుపునొప్పి పెరిగి ఉండేది కాదు. తావూజీ వ్రణం చిన్నదిగా అయిపోయింది, బాధపడాల్సిన అవసరం లేదు.

బాబూజీ, "నీవు ధార్మిక గ్రంథాలు అధ్యయనం చేయాలి. ప్రతి పుస్తకం, ఉపనిషత్తులు వంటివి అన్నీ చదవాలి. భగవంతుడు తలచుకుంటే, ఆ విషయాల్లో అగ్రగణ్యులం అని చెప్పుకునే వారికంటె కూడా నీవు ఎక్కువ పరిజ్ఞానం పొందగలుగుతావు" అని తమరు వ్రాశారు. అయితే బాబూజీ, నాకు అన్ని విషయాలు తమలోనే ప్రతిఫలిస్తూ ఉంటాయి. నాకు సమస్త సాహిత్యం తమరు మాత్రమే. సాహిత్యం మినహా నేను ఇతర అనుబంధ విషయాలు ఏవీ ఎంపిక చేసుకోలేదు. అటువంటప్పుడు నేనేమి పరిశోధించ గలను? ఇంకా నేను ఏమి గమనిస్తున్నానంటే, హిందీ నాకు 'మాలిక్' మాత్రమే నేర్పారని అనుభూతి చెందుతున్నాను. నావంటి అల్పగ్రహణశక్తిగలదానికి కూడా అర్థమయ్యే విధంగా నా 'మాలిక్' నాకు క్రమబద్ధంగా శిక్షణ నిస్తున్నారు. నా బాబూజీ, ధార్మిక గ్రంధాలు ఉన్నాయి అని నేను అంగీకరిస్తాను. అయితే ధర్మం అనే దానికి పరిభాషగా తమకు చెప్పిన "తమరిలో (బాబూజీలో) లయమైపోవటమే ధర్మం" అను వాక్యం ఏ గ్రంథంలోను వ్రాయబడలేదు. అయినప్పటికీ నేను ఏమి చెబుతాను అంటే, సూటిగాను, సరళంగాను, నా అవగాహనకు తగినట్లుగాను ఉన్నటువంటి తమ పరిభాషను నాలోపల సరిగా అధ్యయనం చేసుకుంటానో అప్పుడు ఇంక తమరు ఏది చదివిస్తారో దానినే చదువుకుంటాను. వాస్తవం ఏమిటంటే, నాకు విషయానుసారంగానే, 'మాలిక్' నాకు నేర్పుతున్నారు. నేనింక ఏమి చూడాలి, నాకేమీ కనిపించటం లేదు; నేనేమి వినాలి, ఏమీ వినిపించటం

లేదు. ఏదీ గ్రహింపుకు రానప్పుడు ఏం చేయను? తమ అభిలాషను అంగీకరించటం అన్ని విధాలుగా నా కర్తవ్యం, కాని నేను అమ్ముడైపోయాను. ఇంక తమరి ఇష్టం. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మికదశను వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఈ దశలో ఎలా ఉంది అంటే, నా శరీరం యావత్తు నేత్రాలుగానే అయిపోయింది, కాని వాటికి చూసే శక్తి లేకుండా పోయింది. ఏ ఉత్సాహం అయితే కరిగిపోయి నా అణువు అణువులోను, నరనరాల్లోను ప్రవహించిపోయిందో అది కూడా ఇప్పుడు కోల్పోయినట్లు అనిపిస్తోంది. అందుచేతనే అది ఉప్పొంగలేదు. ఇచ్ఛాశక్తి కరిగిపోయి ఏమైపోయిందో తెలియదు. ఇప్పుడు నేనొక సముద్రంలాగా అయిపోయి, అన్నీ కూడా దానిలో కలిసిపోయి మాయమైపోయాయి. ఇంక అంతా నీళ్ళే, కాని దానికి దేనినీ తడిపే శక్తిలేదు. ఇప్పుడు ఎలా ఉందంటే, ఎవ్వరో నాలో ప్రాణం నింపుతున్నట్లుగాను, అదే నా ప్రాణమైపోయినట్లుగాను అనిపిస్తోంది. దేనినైతే నేను సముద్రంలాగ ఉన్నదని వ్రాశానో అది కూడా లోతులేని గుంటలాగ అయిపోయింది.

బాబూజీ, తమరు ఏదైతే ఈశ్వర దర్శనం అని ఒక స్థితిని గురించి వ్రాశారో అది ఇప్పుడు నాలో హరించుకోపోయి, అంతా ఖాళీ ఏర్పడి పోయింది. ఇంకా ఏమిటంటే, దప్పిక ఇప్పుడు అపరిమితమైపోయి, నరనరాల్లోకి చొచ్చుకుపోయిందనిపిస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే, హృదయం యొక్క అణువు అణువూ ఇప్పుడు దప్పికతోనే అలమటిస్తున్నట్లు అనిపిస్తోంది. దప్పిక అనేది కణకణంలోనూ వ్యాపించినప్పటికీ, ఇప్పుడు దాని స్పష్టమైన రూపం ఏమీ లేకుండా పోయింది. దాని మూలంగా అసలు నాలో దాహం ఉందా అని ఆలోచనలోపడ్డాను. నేనైతే ఖాళీగా ఉన్నాను, దాహం నా రూపంగా అయిపోయినట్లు అనిపిస్తోంది. బాబూజీ, హృదయంలో కూడా కరుగుతూ ఉన్నట్లు అనిపిస్తోంది. తిరుగు ప్రయాణంలో తమరు ఇక్కడకు వచ్చి అలసటను తీర్చుకుంటారని భావిస్తాను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు. సూప్ పంపించాలి అని అనుకుంటూ ఉంటే, జనం అది చెడిపోతుందని చెబుతున్నారు. ఏం చేయను మరి! ఇక మాస్టర్ సాహెబ్‌గారు కాని, మాయగాని తమకు ఆ సూప్ ఆరగింపచేస్తారు. కనుక ఫలితం దక్కుతుంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 313

లఖీంపుర్,

19.05.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ఉత్తరం ద్వారా తమరు కడుపునొప్పితో బాధపడుతున్నారని తెలిసి నా హృదయం వ్యధ చెందింది. ఏ రోజునైతే తమరు విషాన్ని లాగివేశాక మాస్టర్ సాహెబ్‌కు వ్రాసిన ఉత్తరంలో తమ కడుపులోని బాధ గురించి వ్రాశారో ఆ రోజు నుంచి నా హృదయం, ఈ బాధ ఆ విషం యొక్క ప్రభావంవల్లనే అని చెబుతోంది. మా భక్తి, ప్రేమలు ఇలాగే ఉంటాయి. యదార్థం ఏమిటంటే, **అసలు ప్రేమను తమరు మాత్రమే మా అభ్యాసులపట్ల కలిగి ఉంటున్నారు.** ప్రేమ మాది కాదు, అది కేవలం నటనయే. తమ బాధ తగ్గుముఖం పట్టాలని ఈశ్వరుని, హృదయ పూర్వకంగా మేము ప్రార్థిస్తున్నాము. 'మాలిక్' దయతో తావూజీ దాదాపు కోలుకున్నారు. వ్రణం యొక్క గాయం కూడా మానిపోతోంది. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఏ విధంగానైతే హృదయం కుంచించుకుపోతూ ఉందో అదే విధంగా అది సూక్ష్మత్వం చెందుతోంది అన్నట్లు ఉంది. ఇప్పుడు ఒకటి రెండు రోజుల నుండి, ప్రతిచోటు (స్థానం), ప్రతి వస్తువు, ప్రతి మనిషి ఏమీలేనట్లు,

అనగా ఉనికి లేనట్లు అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు ఏమిలేదన్న దానిలో ఏదో కొంత ఉండి, బహుశా ఈ ప్రపంచంలో అదే పని చేయిస్తూ ఉంది. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, సమస్తం ఏమీలేనట్లుగానే ఉంది, అయినప్పటికి దీనిలోనే ఒక విధమైన ఆనందం ఉంటోంది. సమస్త వస్తువులేకాదు, చివరకు బాబూజీ, నేను కూడా ఇలాగే ఏమిలేనట్లుగానే అనిపిస్తున్నది. ప్రస్తుతం ఏమిలేనటువంటిదే నా స్థితిగా ఉంది, దీనిలో సమస్త ప్రపంచం, నాతోసహా చేరిపోయాము. ఇలా ఉండి కూడా ఈ దశ పూర్ణరూపం దాల్చినట్లు అనిపించటం లేదు. ఇప్పుడు 'R' పాయింట్ యాత్ర ముగిసినట్లు ఉంది. తమరి దయకోసం నిరీక్షిస్తున్నాను. తమ ఆరోగ్యం ఇంకా బాగుపడాలి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు, కేసర్ మరియు బిట్టో ప్రణామం చెబుతున్నారు. జియా పాదాభివందనం చేస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 314

షాజహాన్‌పూర్,

25.05.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు అన్నీ చేరాయి. మే 19వ తేదీ ఉత్తరానికి జవాబు వ్రాస్తున్నాను. నిన్న పగలు 11 గంటలకు నిన్ను 'R' స్థానం నుంచి తప్పించి 'S' స్థానం మీద నిలిపాను. నీవు నీ కోసం కాకపోయినా ఇతరుల శ్రేయస్సు కొరకైనా అధ్యయనం చేసి తీరాలి. చౌబేజీగారివద్ద తప్పకుండా కొన్ని గ్రంథాలు ఉండి ఉంటాయి. నాలో ఈ లోపాన్ని నేను స్వయంగా అనుభూతి చెందుతున్నాను. నేను నిన్న రాత్రి కొన్ని నియమాలను సరళీకృతం చేశాను కాని పూర్తిగా సడలించలేదు. దీని వలన పుస్తకాల్లోని విషయాలన్నీ బాగా అర్థం చేసుకుంటావు మరియు అర్థం చేసుకొనే శక్తి కూడా కలుగుతుంది. నీవు వ్రాసినటువంటి స్థితి చాలా మంచిది. "ప్రతిస్థలం, ప్రతివస్తువు ఏమీ లేనినట్లుగా అనిపిస్తోంది" అని నీవు వ్రాశావు. నీవు 'అసలు' (రియాలిటీ లేదా సత్యత్వం)లో చొరబడిపోతున్నావని దీని అర్థం. ఈ స్థితి ఇంకా మెరుగుపడుతుంది. మనస్సు కుంచించుకుపోతున్నది అని నీవు వ్రాసిన దానికి అర్థం, దాని ధ్యాస ఊర్ధ్వంగా తగినంత మళ్ళించబడినట్లు భావించవలసి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే, దానిలో ఉండదగని విషయాలు చాలావరకు తొలగిపోయాయి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 315

లఖీంపూర్,

26.05.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి తమరు వ్రాసిన ఉత్తరం ద్వారా తమ కడుపునొప్పి తగ్గిందని తెలిసి అందరం సంతోషించాము. అంతేగాకుండా 'తమరు' ఏదో అత్యవసరమైన పనిమీద ఇటీవల నిమగ్నమై ఉన్నారని తెలిసింది. తమరు అప్పగించి వెళ్ళిన పని తమరు ఆశించినట్లుగానే జరుగుతున్నదని, లోపం ఏమిలేదని, అలా లోపం జరగటం అసంభవం అని తెలిసినప్పటికీ తమకు నివేదించుకుంటున్నాను. అయితే సరైనదో లేదో తమకే తెలియాలి. తావూజీ గాయంలో నిన్న కొంచెం చీము వగైరా వెలువడ్డాయి. రక్తం ఎక్కువగా స్రవించటం వలన

ఇలా జరిగిందని, 2,3 రోజుల్లో బాగవుతుందని, దిగులు చెందాల్సిన అవసరంలేదని డాక్టర్ చెప్పారు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, ప్రతిస్థితి శూన్యంగా అనిపిస్తోంది. ప్రతిదీ అనగా (Animate and Inanimate) జడచైతన్యాలు అన్నింటిలోను, ఆఖరికి నాలోనూ కూడా శూన్యత్వమే కనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు ఎలా ఉందంటే, నేను మాట్లాడుతున్నది, వింటున్నది కూడా శూన్యంగానే అనిపిస్తోంది. ఇంకొక మాటలో చెప్పాలంటే, నా చూపు, వినికిడి అనుభూతి చెందటానికి అవసరమైన శక్తి కూడా శూన్యంగా అయిపోయాయి. ఇంకా చెప్పాలంటే, నన్ను జీవింపజేసే శక్తి కూడా శూన్యమైపోయింది.

బాబూజీ, ప్రస్తుతం ఉన్నది చాలా అమాయక స్థితి. ప్రతిదానిలోను, ప్రతిస్థితిలోను, ఆఖరికి నాలోని అణువణువులోను అమాయకత్వమే కనిపిస్తోంది. బాబూజీ, అదేమిటో దైవానికే తెలియాలి, నేను ఎవరితోనైనా పూజ (ధ్యానం) చేయిస్తున్నా కూడా అదే రకమైన శూన్యత్వం ఉంటోంది. అసలు సిట్టింగ్‌లో ఏమైనా ఉందా అనేది కూడా అనుభూతి చెందలేకపోతూ ఉన్నాను, పూర్తిగా శూన్యత్వమే ఉంటోంది. ఒకవేళ దృష్టి నిలపాలనుకుంటె అది కూడా శూన్యంగానే అయిపోతోంది. అందుచేత దృష్టి నిలపటం లేదు. ఈ విషయాన్ని 'మాలిక్'కే అర్పించి వేస్తున్నాను. ఎందుకంటే, ఎవ్వరైనా ధ్యానం చేసిన అభ్యాసీగాని, నన్ను చూసినవారైనా గాని, ఈ సిట్టింగ్ కేవలం ఏదో బొమ్మలాటగానో, ప్రదర్శనగానో భావించవచ్చు. ఇంకా చెప్పాలంటే, 'మాలిక్' యొక్క కృపతోనే సిట్టింగ్ తీసుకుంటున్నవారి హృదయం లగ్నమై ఉంటోంది.

బాబూజీ, ఇప్పుడు నా హృదయ (తీగె) తంతువులో ఒకే రాగం సర్వదా ధ్వనిస్తున్నట్లు ఉంది. అదేమిటో నాకు అంతుచిక్కటం లేదు. నా ఆంతరికంలోని ప్రతి అణువు 'మాలిక్' యొక్క కలయికతో ఒక అద్భుత ఆనందంతో నింపబడి ఉంది. అయితే **ఇప్పుడు ఏమైంది అంటే, బయట మరియు లోపల ప్రతిఅణువు కూడా ఆ పరమానందంలో మునిగిపోయినట్లు అనిపిస్తోంది.** ఒక అపూర్వ కలయిక యొక్క పరమానందమే ఇప్పుడింక మిగిలిపోయినట్లు ఉంది. అలాకానేకాదు, బహుశా ఈ కలయికలో కేవలం శూన్యత్వమే నిలిచిపోయింది. ఇప్పుడింక ఈ కలయిక యొక్క ఆనందం కూడా ఎక్కడ ఉంది, బయట మరియు లోపల అంతటా కేవలం శూన్యత్వం మాత్రమే ఆవహించి ఉంది.

పూజ్య శ్రీ బాబూజీ, నేనింకా ఏమి చూస్తున్నానంటే, హృదయ తంతువులలో మార్మోగిన రాగం, దాని స్వరం అన్నీ శూన్యంగానే అయి పోతున్నాయి, **శూన్యత్వమే దాని అలలుగా ఉంది. ఇంకా ఏమైందంటే, నా 'మాలిక్' రూపం కూడా శూన్యంగా అయిపోతోంది.** రూపమైతే ఉంది కాని అది శూన్యంగా అనుభవమవుతోంది. ఇప్పుడు నా స్థితి ఎలా అనిపిస్తోందంటే, నా శరీరం యొక్క కణకణం అమాయకంగా అయిపోయింది. అలాగే జగత్తు యొక్క కణకణం కూడా అమాయకంగా అయిపోయి, అంతా శూన్యంగా మారిపోయింది. ఇంకా దృష్టి ఏమైనా ఉన్నా, దాని వ్యాప్తి అంటూ ఏదైనా ఉన్నా అవి కూడా అమాయకంగాను, శూన్యంగాను అయిపోయాయి. ఇంకేమీ లేదు. బహుశా ఇందుకేనేమో **ప్రతి కణంలోనూ కాంతి మెరుపు ఉంది, కాని చూడశక్యం కాదు, అనుభూతికి మాత్రమే చిక్కుతుంది. అయితే ఇప్పుడది కూడా లేదు, అంతా శూన్యమే.**

ఈశ్వరుని కృపతో, పెద్దసోదరుని ఉద్యోగం జూన్ 14 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత భారత యాత్ర (ప్రదర్శన) రైలులో ఉద్యోగంచేసి నవంబరు ఆఖరులోగాని, డిశంబరులోగాని తిరిగివస్తారు. మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఉత్తరం ప్రకారం తమరు తిరుగు ప్రయాణంలో జూన్ 3వ వారంలో ఇక్కడకు వస్తారని తెలిసి సంతోషం కలిగింది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతోంది, కేసర్ మరియు బిట్టొ ప్రణామం చెబుతున్నారు.

అదేమిటో భగవంతునికే తెలియాలిగాని, 'మాలిక్' కృపతో నా మైండ్, అవగాహన శక్తి విస్తరిస్తున్నట్లు కనిపిస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 316

లఖీంపుర్,

27.05.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం అందిందని భావిస్తున్నాను. తమ కడుపునొప్పి తగ్గిపోయినప్పటికీ, ఇంకా బలహీనత ఉంటుంది. అందువలన కొన్ని బలవర్ధక పదార్థాలు, వెచ్చదనాన్ని ఇచ్చే వస్త్రాలు ఉత్తర కాశీ యాత్ర కొరకు సిద్ధం చేసుకోవాల్సిందిగా అమ్మ చెబుతోంది. తావూజీ కూడా నిదానంగా పూర్తిగా కోలుకుంటున్నారు. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు సర్వత్ర జీరో లేక శూన్యతయే రాజ్యమేలుతూ ఉన్నట్లు, అదే అంతటా వ్యాపించి ఉన్నట్లు అనిపిస్తోంది. ప్రతి దశ, ప్రతి వస్తువు, 'శూన్యం'గానే అయిపోయాయి. నాకు అంతటా శూన్యతయే కనిపిస్తోంది, అదే అనుభవమవుతోంది. ఇప్పుడు నా దశ ఏమిటి? అది ఒక మహిమగాని, ఎవ్వరైనా జరిపిన మహిమగాని, మరేదైనాగాని కాదు. అంతా శూన్యమయమే. నాలోని నరనరాల్లోను, కణకణాల్లోను ఇదే స్థితి అంతర్లీనమైపోతోంది. యదార్థం ఏమిటంటే, ఇది పిచ్చితనం వంటి స్థితియే కావచ్చు. ఎందుకంటే, (Animate and Inanimate) జడచైతన్యాలు, **చెట్టు–చేమా కూడా (జీరో) శూన్యంగానే అనుభవమవుతున్నాయి.** ఇంకా చెప్పాలంటే, నాకు ఇదే కనిపిస్తోంది, ఇదే అనుభవమవుతోంది.

బాబూజీ, ఇప్పుడు శక్తిగాని, మరేదైనాగాని లేవనే అనిపిస్తోంది. ఆఖరికి ఈశ్వరీయ శక్తి కూడా లేదు. నేను శూన్యంగా కావటమే కాదు, **ఈశ్వరుడు కూడా శూన్యమే అయిపోయాడు.** ఎందుకంటే, బహుశా నాకు ఏదీ అనుభూతి కావటం లేదనుకుంటాను. నేను పూర్తిగా శక్తిహీనురాలుగా అయిపోయినట్లుగాను, నాకు ఎక్కడి నుండి శక్తి రావటంలేదని అనిపిస్తోంది. అయినాకాని 'మాలిక్' పని అన్ని విధాలా జరిగిపోతూనే ఉంది. ఇప్పుడు నా పరమానంద దశ నడుస్తోంది. ఇప్పుడు పరిశుద్ధత, అమాయకత్వం అన్నీ శూన్యంగా అయిపోయాయి. ఒకే రంగు, ఒకే దృశ్యం, ఒకే దృష్టి ఉండి కూడా అవి కూడా శూన్యమేనని అనిపిస్తోంది. ఈ శూన్యతకు అర్థం లేకుండా ఉంది, కాని ఈ శూన్యత యొక్క ఆనంద ఉద్వేగమే నా దశగా ఉంది. బాబూజీ, శూన్యానందం శబ్దాన్ని వదలి ఆనందంగానే భావించండి.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టోలు ప్రణామం తెలుపుతున్నారు. మాస్టర్ సాహెబ్‌గార్కి మా అందరి ప్రణామాలు మరియు అమ్మగారి శుభాశీర్వాదాలు తెలియజేయండి. మాస్టర్ సాహెబ్‌గారు తరచుగా ఉదర సంబంధమైన బాధలు పడుతుంటారు కనుక తగిన మందులు వెంట ఉంచుకొనమని చెప్పండి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 317

లఖీంపుర్,

29.05.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది, చదివి ఆనందించాను. పాయింట్ 'S'కు చేర్చినందుకు అనేక ధన్యవాదాలర్పిస్తు ఉన్నాను. హద్దు లేదా పరిమితిని తగ్గించిన కారణంగా కలిగిన ప్రభావాన్ని ఇదివరకే వ్రాశాను. నా రెండు ఉత్తరాలు అందాయనుకుంటాను. తమ ఇంగ్లీషు పుస్తకం మరియు ఈశోవాస్యోపనిషత్తులు చదవటం 4,5 రోజుల నుంచి ప్రారంభించాను. నేను పుస్తకాలు చదవటం గురించి ఇదివరకే నా అభిప్రాయం వ్రాశాను, అయితే 'తమరు' పుస్తకాలు చదవమని వ్రాసినపుడు, ఇష్టం లేకున్నా నేను పుస్తకాలు చదవకుండా ఎలా ఉండగలను! తమ కడుపునొప్పి తగ్గిపోయిందని తెలిసి సంతోషించాను. కాని ఈ రోజు మాస్టర్ సాహెబ్‌గారి పోస్టుకార్డ్ ద్వారా తమకు 3,4 రోజులుగా విరోచనాలు అవుతున్నాయి అని, బలహీనంగా ఉన్నారని తెలిసి చాలా బాధ కలిగింది. అయితే నీళ్ళ విరోచనాలు వలన తమ రక్తంలో ప్రవేశించిన విషం తొలగిపోయే మేలు జరిగినట్లయితే ఈశ్వరునికి అనేక ధన్యవాదాలు. బాబూజీ! మన లాలాజీ సాహెబ్ మా వంటి బిడ్డలపట్ల, దీనులపట్ల దయా కారణంగానే తమకు ప్రాణేశ్వర్ మందును తమకు సూచించారు. ప్రాణేశ్వర్ మందు చిన్న సీసాలో ఉంటుంది, శనగ బద్దంత ప్రమాణం సరిపోతుంది. దీనితో తమ బాధ తప్పకుండా తగ్గిపోతుంది. తమ ఉదరం పాడైన కారణంగాను, శ్వాసకు సంబంధించిన ఇబ్బంది ఉన్న కారణంగాను, బలహీనంగా ఉన్న కారణంగాను, అమ్మ, తమ యొక్క ఈ ఉత్తర కాశీ యాత్రను ఈ సంవత్సరం మానివేయమని చెబుతోంది. ఏమి చేయాలో తమకు బాగా తెలుసు. అన్నింటినీ మించి తమ క్షేమాభిలాషి సదా తమ తోడుగానే ఉన్నారు. నేను నా స్థితిని గురించి తమకు వ్రాసి ఉన్నాను. ఇప్పుడు మరికొంత నా ఆధ్యాత్మిక స్థితిని గురించి వివరిస్తున్నాను.

మరో ప్రపంచంలో ఎక్కడైతే నేను ఉన్నట్లు భావిస్తున్నానో, అక్కడి వాయువు నాకు బాగున్నట్లు అనిపిస్తోంది అని నేను తమకు ఇదివరకే వ్రాశాను. కాని ఇప్పటి స్థితి ఎలా ఉందంటే, మరో ప్రపంచంగాని, వాయువుగాని, శ్వాసగాని ఏవీలేవు. దీనిని అంతా చీకటి అని చెప్పాలా, ఇంకేమైనా చెప్పాలా! **అంతా శూన్యమే, అయినా కాని జీవనమే జీవనంగా ఉంది.**

అమ్మ తమకు శుభాశీర్వాదాలు, పూలో జిజ్జీ, కేసర్ మరియు బిట్టోలు ప్రణామం చెబుతున్నారు. లల్లూ, బి.కాం. మూడవ సంవత్సరం ప్యాసయ్యింది. ఆలీగఢ్‌లో సురేంద్ర, బి.ఎ; విమల, ఎం.ఏ ప్యాసయ్యారు. అంతా ఈశ్వర కృప.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 318

లఖీంపుర్,

2.06.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న జియా మరియు విష్ణు ద్వారా అక్కడి సమాచారం తెలిసింది. తమకు శుక్రవారం చాలా విరోచనాలు అయ్యాయని తెలిశాక నాకు ఎందుకోగాని, అప్పటికప్పుడే ఎగిరి ఏదో విధంగా అక్కడకు చేరుకుని, ఆ మందు ఇస్తూ చూడాలనుకున్నాను. అయితే వెంటనే నేను ఒక ఆడపిల్లను కదా అనిపించింది. 'తమరు'

బాగా బలహీనపడిపోయారు. దయచేసి ఉత్తర కాశి చేరిన తర్వాత కూడా తమ ఆరోగ్య పరిస్థితి విపులంగా మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా వ్రాయిస్తూ ఉండండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు తరచుగా అనుభవమవుతున్న స్థితి ఎలా ఉందంటే, నాలోపల, ఆంతరికంగా కూడా ఒక విధమైన తపన, అవిశ్రాంతత నిరంతరం అనుభవమవుతోంది. కొన్నిసార్లు అయితే ఒంటరిగా కూర్చుని గుండె బాదుకోవాలనుకుంటాను, కాని ఆది మంచిది కాదని అనిపిస్తుంది. వాస్తవానికి ఇదే నా ఆనందంగా ఉండి దానిలోనే పరవశం చెందుతున్నాను. దీనినే హృదయంలో పదిలపర్చుకొని కూర్చుండిపోతున్నాను. ఒక భిక్షకురాలైన అనాథ వద్ద ఇంకేమి ఉంటుంది. అంతేగాక నా పేదరికం ఎలాంటిదంటె ఏమి చెప్పను! దానిని కూడా మర్చిపోయాను, అది నాకు చెందనిదానిలాగ. కన్నీరు నాతో ఉండటానికి ఇష్టం లేకుండా ఉన్నట్లు విడిపోతున్నాయి. అవి (కన్నీరు) నాకు బాగున్నాయి. ఇంకా ఎలా ఉందంటే, ఇప్పుడు చల్లని అగ్ని నా లోపల రగులుతున్నట్లుగాను, దానిని నీటితో (అనగా అశ్రువులతో) చల్లార్చటం కూడా సంభవం కాదన్నట్లుగాను ఉంది. అదేమిటో ఆ దైవానికే తెలియాలి. నా ఆంతరికం వేదన చెందుతున్నప్పటికి, నోటితో నిస్పృహను వెల్లడించటం కూడా నాకు నచ్చటం లేదు. ఈ తపన నా హృదయాన్ని వేధిస్తున్నప్పటికీ, అదే నాకు బాగుందనిపిస్తోంది. కాని ఆంతరికంలో కూడా నేను విలపించాలనుకోవటం మంచిది కాదనిపిస్తోంది. ఇంకేం చేయను, హృదయాన్ని అదిమిపట్టుకుని, ఒంటరిగా కూర్చుండిపోతున్నాను.

బాబూజీ, స్థితి ఎలా ఉంది అంటే, ఇప్పుడు శూన్యం లేదు, అశూన్యం లేదు, ఇతరత్రా కూడా ఏమీ లేదు. శూన్యతాస్థితి కూడా నాలోనే జీర్ణించుకుపోయినట్లు ఉంది. ఇంకొక మాటలో చెప్పాలంటే, **శూన్యం కూడా శూన్యమైపోయినట్లు ఉంది.** ఇంకా ఎలా అనిపిస్తోందంటే, నేను పూర్తిగా ఒక సూటియైన సహజమార్గం ద్వారా వేగంగా ప్రయాణించిపోతున్నట్లుగాను, మార్గమధ్యంలో ఎటువంటి అవరోధాలుగాని, ఆగిపోవటంగాని లేనట్లుగాను ఉంది. 2,3 రోజులు అడ్డంకు లేర్పడినపుడు, నేను ముందున్న ఉన్నత స్థితికి చేరలేకపోయినపుడు నాకు చాలా అసహనంగా ఉంటోంది. ఎందుకంటే, ఏదో ఆకర్షణ శక్తి నన్ను బలవంతంగా నన్ను సూటిగా పైకి ఈడ్చుకు వెళ్తోంది. 'మాలిక్' యొక్క గాఢమైన ప్రేమ నన్ను దానివద్దకు గుంజుకుపోతోంది, అదే కాదు, దానిలోకి చేర్చుకుని, హత్తుకుపోతోంది. నేను ఇప్పుడు దానిలోనే హత్తుకుపోయి, దానిలోనే కలిసిపోయాను. ఇప్పుడు అదే నా అసలైన రూపంగా ఉంది. వాస్తవం చెప్పాలంటే, నేను నా 'అసలు' (రియాలిటీ) లోకే వెళ్ళిపోతున్నాను. అనగా ఇప్పుడు 'అసలు'యే నా రూపంగా మారిపోయింది. ఇంకా ఎంతగానంటే, నేను నా స్వంత రూపాన్నే మర్చిపోయి ఆ 'అసలు'నే అనుభూతి చెందుతున్నాను. ప్రతివస్తువు కూడా నాకు 'అసలు'గానే అనిపిస్తోంది. నా నగ్నరూపమే (వాస్తవిక) అసలుకాగా ఇప్పుడు అసలు, అసలులోనే లయమైపోతోంది. 'అసలు'లో ఉన్న ఆకర్షణ కారణంగా నేను వేగంగా దానిలోనే లయమైపోతూ కూడా తపనతో ఉంటున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 319

లఖీంపుర్,

3.06.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఒక ఉత్తరం వ్రాశాను. బహుశా తమకు రేపు చేరవచ్చునని అనుకుంటున్నాను. ఇప్పుడు తమ ఆరోగ్యం ఎలా ఉందో వ్రాయగలరు. 'మాలిక్' యొక్క కృప మరియు ఆశీస్సులతో చిన్నసోదరుడు మరియు రమా ఫస్ట్‌లోను, బిట్టో సెకండ్‌లోను ప్యాసయ్యారు. 'తమకు' ఇంకా అందరికీ మా అందరి తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాము. మాస్టర్ సాహెబ్‌గార్కి కూడా మా అందరి తరఫున ధన్యవాదాలర్పిస్తున్నాము. మున్శీగారి

కుమారుడు కూడా ప్యాసయ్యాడు. అతని తరఫున కూడా తమకు, మాస్టర్ సాహెబ్‌గార్కి మరియు అందరికీ ధన్యవాదాలు. అయితే తమ ఆరోగ్యం ఎలా ఉంది? 'తమ'కు ఏమైనా మేలు చేకూరిందా? తమరు చాలా బలహీనపడిపోయారు. దాదీ బహుశా ఇప్పుడు లక్నో నుంచి తిరిగి వచ్చి ఉండవచ్చు. నా ఆత్మికదశను గురించి నేను వ్రాసేశాను. తమరు వ్రాసినట్లుగానే, నేను చదువుతున్న వాటి నుంచి నోట్స్ తయారుచేసుకుంటున్నాను, తమరు వచ్చినపుడు వినిపిస్తాను.

'మాలిక్' దయతో ఇప్పుడు నా దశలో ఆంతరికం నిర్మలంగా అయిపోతోంది. దశ స్వచ్ఛమవుతున్నట్లుగానే, మనస్సు కూడా స్వచ్ఛంగాను, తేలికగాను, సున్నితంగాను, నిర్మలమైపోతున్నట్లుగాను చూస్తున్నాను. ఏ విధంగానైతే దశ తేలికగా అయిపోతూ ఉందో, అదే విధంగా నా తపన కూడా లోలోపల పెరుగుతూ ఉందని అనిపిస్తోంది. నా జీర్ణక్రియ ఎంత ఆరోగ్యంగా ఉందంటే, ఏదైనాసరే జీర్ణించుకుపోయి అంతా ఖాళీ అయిపోతున్నట్లు అనిపిస్తోంది. **బాబూజీ, నేనయితే ఇదే చెబుతున్నాను: 'మాలిక్' నాపై ఎంతగా దయ చూపుతున్నారో, చెప్పాలంటే, హృదయ పూర్వకంగా నేను అంతగా ప్రేమ చూపలేకపోతున్నాను.** నేనేం చేయను? 'మాలిక్' కోసం నేను ఏమి చేయాలి అని అప్పుడప్పుడు నా మనస్సులో మెదులుతుంది. లోతుగా ఆలోచించిన తర్వాత నన్ను నేను 'అతని'కి పూర్తిగా అర్పించుకోవటానికి నిర్ణయించుకొన్నాను. అప్పుడు 'అతని' ఇష్టప్రకారం, నన్ను ఎలా కావాలంటే అలా 'అతనే' స్వయంగా తన బానిసలాగా భావించి చేయించుకుంటారు. ఇప్పుడు ఉన్న స్థితి ఇదికాగా, అంతా అసలు అంటే **అసలు (రియాలిటీ)** గానే కనిపిస్తోంది. స్వయంగా నేను, నా లోపల, బయట, నరనరం కూడా ఆ **అసలు (రియాలిటీ)**గానే అనుభవమవుతోంది. నా 'మాలిక్'! నేను ఇప్పుడు నా నగ్న (అసలు సిసలు సంస్కార రహిత స్వచ్ఛ వాస్తవిక) రూపాన్ని చూస్తున్నాను, అంతా అర్థం చేసుకుంటున్నాను. అయినప్పటికీ వాస్తవ విషయం ఏమిటంటే, ఇంత స్వచ్ఛమైన, పవిత్రమైన ఈ దశను ఏ మాటల్లో వర్ణించి వ్రాయాలో నాకు అర్థం కావటం లేదు. స్పర్శ ఉంది కాని, మాటలు లేవు. మనం ఎంత స్వచ్ఛంగాను, తేలికగాను అయిపోతూ ఉంటామో, అప్పుడే నడక (గమనం) అదృశ్యరూపంలో వేగవంతమై సాగిపోతూ ఉంటుందని అనిపిస్తోంది. అయితే నేను దానిని గ్రహించలేకపోతున్నాను. కాని 'మాలిక్' కృపతో అప్పుడప్పుడు గ్రహింపుకు వస్తోంది. ఇప్పుడు నాకు శూన్యం కూడా శూన్యంగా అయిపోయినట్లు అనుభవమవుతోంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టో ప్రణామం తెలుపుతున్నారు. మాస్టర్ సాహెబ్ గారికి అమ్మ ఆశీస్సులు, నేను, కేసర్ ప్రణామం తెలుపుతున్నట్లు చెప్పండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 320

షాజహాన్‌పూర్,

06.06.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు క్షేమమగుగాక! నీ ఉత్తరాలన్నీ చేరాయి. నీ అనుభవశక్తి చాలా బాగున్నందువలన నీవు ఏదైనా చదవాలని కోరుకుంటున్నాను. నేను కొన్ని పరిమితులను సరళీకృతం చేశాను. ఈ విధంగా చేయటం వలన వాటంతట అవే త్వరగా అంతమైపోతాయి. అవి తేలిక కావటం ప్రారంభమైపోయాయి. నీ పరిజ్ఞానం అప్రయత్నంగానే పెంపొందటానికి నిదర్శనంగా ఉంది. ఇప్పుడు అవి నాకు చాలా తేలికగా కనిపిస్తున్నాయి. బహుశా రామచంద్ర మిషన్ యొక్క మూలస్తంభాలలో నీవు ఒక్కరిగా అయ్యే అవకాశం ఉంది. నీవు ప్రసంగించే అలవాటును కూడా అలవర్చుకోవాలని నేను తెలుపుతున్నాను. అయితే నీవు శారీరకంగా బలహీనురాలవు కావటంచేతను, ప్రసంగించటానికి నీకు కష్టం కలుగుతుందన్న ఉద్దేశ్యంతో వెనుకాడుతున్నాను.

నీ పుస్తకం “సహజసమాధి” ప్రింటింగ్ పూర్తయ్యింది. నీకు 50 కాపీలు పంపిస్తున్నాను. నీ యొక్క ప్రతి ఉత్తరానికి జవాబు వ్రాయాలని అనుకుంటున్నాను, వ్రాసేవారు ఎవరైనా దొరికితే వ్రాస్తూ ఉంటాను. **నీవు వ్రాసే ఉత్తరాలు, వాటి సమాధానాలు కూడా ఒక పుస్తకంలో నకలుగా నమోదుచేసి ఉంచాలని కోరుతున్నాను. ఏ సమయంలోనైనా వాటిని ముద్రించాలి.**

మే 27వ తేదీతో వచ్చిన ఉత్తరంలో ‘శూన్య’ (Zero) స్థితి గురించి దాదాపు 6 వాక్యాలలో వర్ణించావు, కాని ఆ ‘శూన్య’ స్థితి ఇంకా చాలా దూరంలో ఉంది. అభ్యాసీ అన్నీ పూర్తిగా పొందినప్పుడు, ఇంక పొందవలసిందేమీ లేనప్పుడు, ఆ స్థితిని (Zero) శూన్యస్థితిగా చెప్పవలసి ఉంటుంది. నీవు ఇప్పటికి ప్రయాణించవలసిన దానిలో ఒక వంతు కూడా పురోగమించలేదు; అయితే దైవ నిర్ణయం ఉంటే నీవు తప్పక పురోగమనం చేయగలవు.

**వైరాగ్యస్థితికి సంపూర్ణస్థాయిలో చేరుతున్నట్లు నీ ఉత్తరం ద్వారా శుభసందేశాన్ని ఇస్తోంది.** దైవం మినహా ఇంక దేనిని గురించి గుర్తించలేనటు వంటి పరిస్థితి వచ్చినప్పుడు, అది వైరాగ్యం యొక్క పరిపూర్ణ స్థితి అవుతుంది. నీలో ఇప్పుడు ఆ స్థితి కలుగుతూ ఉండటమేకాక దానికి మించిన స్థితి కూడా కలుగుతుంది. నా స్థితి యొక్క ప్రతిబింబం దానిలో ప్రవేశించటమే అందుకు కారణమవుతుంది.

మే 29వ తేదీ లేఖలో నీవు తెలిపిన శూన్యగతి సరియైనది. **ఇది ఎటువంటి గతి అంటే (రియాలిటీ) ‘అసలు’కు చేరుకోవాలంటే ఈ గతి నుంచి పోవాల్సిందే.** ఇది ఉన్నత స్థితి అని పలక (slate) మీద నీవు వ్రాసుకోవచ్చు. ఈ గతి ఇంకా దూరం వరకు కొనసాగుతూ ఉంటుంది. ఇది కూడా ఏదో ఒక సందర్భంలో మాయమైపోతున్నట్లు తెలుస్తుంది. అయితే అసలైన మకాం చేరేవరకు ఇది (గతి) అంటిపెట్టుకునే ఉంటుంది.

‘S’ స్థానం యొక్క ప్రయాణం ఇంకా ముగింపు కాలేదు. నేను ఉత్తరకాశీ చేరిన తర్వాత ఆ ప్రయాణం పూర్తిగావించటానికి ప్రయత్నం చేస్తాను. దాని తర్వాత ‘T’ స్థానానికి నేను నిన్ను చేర్చుతాను.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 321

లఖీంపుర్,

11.06.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దయతో కూడిన తమ ఉత్తరం ద్వారా సమాచారం తెలిసింది. తమ ఆరోగ్యం బాగుపడినట్లు చదివి ఆనందించాను. ఈశ్వరుడు తన కృపను ఇదే విధంగా చూపాలి. ఇప్పుడు నేను ఆధ్యాత్మిక గ్రంధాలు చదువుతూ నోట్స్ కూడా వ్రాసుకుంటున్నాను. ‘మాలిక్’ కృపతో ఇప్పుడు నా మనస్సు విసుగు చెందటం లేదు సరికదా ‘మాలిక్’ కృపతో అన్నీ అవగాహనకు వస్తున్నాయి. అద్దంలాగా స్పష్టంగా విషయాలు కనిపిస్తున్నాయి. **శ్రీ బాబూజీ, మిషన్ ఇప్పుడు బలిష్టంగాను, మనోహరంగాను అయిపోయింది. గోవర్ధన పర్వతాన్ని బాలగోపాల కృష్ణుడు పైకెత్తినపుడు గోపబాలురు తమ చిన్న చిన్న కర్రముక్కలు కూడా ఊతంగా పాతినట్లు మిషన్‌కు ఎందరో మూలస్తంభాలుగా (నాలాగ) నిలిచారు. మన మిషన్ యొక్క ‘మాలిక్’ (బాబూజీ) ద్వారా ఈ జగతి ప్రకాశవంతమవుతోంది. భవిష్యత్తులో ఇంకా ప్రకాశాన్ని పొందుతూనే ఉంటుంది. కళ్ళు తెరచి చూసినట్లయితే మనం దానిని గుర్తించి చూడగలం.** మీరంతా ఉత్తర కాశీ చేరిపోయి ఉంటారని భావిస్తాను. అది చాలా దూరప్రయాణం. తమరు ఎప్పుడు తిరిగివస్తారు? ‘మాలిక్’ దయతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

బాబూజీ, నేను ఇప్పుడు నా ఆంతరికంలోను, మనస్సులోను మునిగిపోయినట్లుగాను, అలా మునిగిపోయి శూన్యమైపోయినట్లుగాను అనిపిస్తోంది. శూన్యం అంటే నా ఉద్దేశ్యంలో శూన్యస్థితి మాత్రంగా అయినప్పటికీ **ఈ దశ ఇప్పుడు శూన్యం కూడా శూన్యమైపోయినట్లు ఉంది. ఈ దశలో తేలికదనం యొక్క స్థానం కూడా లేకుండాపోయింది.** ఆ తేలికదనం తన హద్దును కూడా దాటి ఎక్కడికోపోయినట్లు ఉంది. అలాకాదు, ఎక్కడికో పోవటం కాదు, అది కూడా శూన్యమైపోయింది. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు త్రాసులో ప్రేమ పళ్ళెం బరువైనట్లుగాను, నా పళ్ళెం శూన్యమై పోయినట్లుగాను అనిపిస్తోంది. ఇప్పుడింక తేలికదనం యొక్క ఊసే లేకుండాపోయింది. ఇప్పుడు ఆ దశగాని, ప్రేమగాని తెలియనపుడు, ఆ దశను గురించి నేను ఏమి వ్రాయాలి? ఇప్పుడు చెప్పాలంటే, నా అణువణువూ పవిత్రతను కూడా త్రాగేసి జీర్ణించుకుంది. ఇప్పుడు ఏ దశ అనుభవమవుతూ ఉంది అంటే, నా అణువణువు నుంచి అశ్రువులు స్రవిస్తున్నట్లుగాను, కాదు కాదు, నా అణువణువు, కణకణం అశ్రువుగా అయిపోయినట్లు అనిపిస్తోంది. కణకణమూ ఈశ్వరునిగా అయిపోయింది. బహుశా ఈ కారణంచేతనే నా అణువణువులోను, కణకణంలోను అగమ్యమైన అంతులేని శక్తి నిండి ఉంది. నా కణకణంలోను అపరిమిత శక్తి నిలిచి ఉంది. ఈ సంగతి ఏమిటో తప్పనిసరిగా నా 'మాలిక్'కే తెలియాలి. బయట, లోపల అంతటా ఈశ్వర మయమైపోయింది. (Animate and Inanimate ) జడ, చేతనాలు, కణకణం అన్నీ ఈశ్వరుడుగానే అనిపిస్తున్నాయి. ఇదితప్ప మరేమీ తెలియటం లేదు. అది దైవానికే తెలియాలిగాని ఈశ్వరుడు కూడా శూన్యమే అయిపోయాడు. ఇంకేమీ లేనేలేదు, పూర్తిగా శూన్యం, ఖాళీగా ఉంది. అంతేగాక సమస్త ప్రపంచం యొక్క కణకణం, జడచైతన్యాలు ఏమైనాగాని నాకు అలాగే (శూన్యం) అనుభవమవుతున్నాయి. వాస్తవం ఏమిటంటే, ఇంతకుమించి ఏ విషయం నాకు తెలియదు.

శ్రీ బాబూజీ, నా హృదయం యొక్క ప్రతి తంతువు (తీగె) 'మాలిక్'లో కలిసిపోతున్నట్లు అనిపిస్తోంది. మనస్సు యొక్క ప్రతి తంతువూ శూన్యత్వపు సాగరంలో తమ అస్థిత్వాన్ని కోల్పోతున్నట్లు అనిపిస్తోంది. మనస్సు యొక్క ద్వారం విరిగిపడిపోయింది. అయితే తీగెల్లేనివార్తా ప్రసారంలాగ ఎటువంటి ఆధారం లేకుండానే ఆలోచన యొక్క ఒక్క తీగ స్వాభావికంగా నిలిచిపోయినట్లుగాను, అదే నాకు జీవనం కల్పిస్తున్నట్లుగాను అనుభవమవుతోంది. ఇప్పుడు హృదయం సంకుచితమైపోతూ, సూక్ష్మత్వం చెందుతున్నట్లు అనిపిస్తోంది. ఇంకా ఏమనిపిస్తోందంటే, **నా అణువు అణువులోనూ అపారశక్తి నిండి ఉన్నట్లుగాను, సమస్త ప్రపంచం ఆ శక్తి యొక్క హస్తగతమై ఉందని అనిపిస్తోంది. అన్ని రకాల శక్తి అయితే ఉంది కాని నాలో దేని గురించిన చింతా లేదు.**

అమ్మ తమకు, మాస్టర్ సాహెబ్‌గార్కి శుభాశీస్సులు తెలుపుతున్నారు, కేసర్ మరియు బిట్టొ ప్రణామం చెబుతున్నారు.

ఇప్పుడు కళ్ళెదుట ఏదో తొలగిపోతూ అనగా శుభ్రపడుతూ ఉన్నట్లుగాను, దానితో అవగాహన పెరుగుతున్నట్లు గాను అనుభవమవుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 322

ఉత్తర కాశి,

13.06.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నేను జూన్ 12వ తేదీన ఇక్కడకు వచ్చాను. ఇక్కడ చలి లేదు. ఇక్కడ 4,5 రోజుల వరకు ఉందామనుకుంటున్నాను. ఇక్కడ వేదాంతులు, హఠయోగులు ఉన్నారు. ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్)

కావాలనుకుంటున్నవారి జాడలేదు. ఇంతవరకు నేను ప్రజలు ఎవరినీ కలుసుకోలేదు. నీవు చదువుతున్న పుస్తకాల నుంచి నోట్స్ వ్రాసుకుంటూ ఉంటే అది ఉపయోగపడుతుంది. ఈ రోజు నిన్ను నేను 'T' స్థానంలోకి తీసుకు వెళ్ళాను. ఇక్కడ ఉన్న వారెవరూ నా వలన ప్రయోజనం పొందాలనుకోకపోయినా, కనీసం మన దగ్గరి బంధుమిత్రులు కొంతమందైనా ప్రయోజనం పొందగలరని భావిస్తున్నాను. మాస్టర్ సాహెబ్‌కు ఈ తీర్థం యొక్క ఫలం లభించింది. ఇంకా నాతోపాటు ఉన్నవారు కూడా ఎంతోకొంత వెలుగును పొందారు.

ఈ ప్రాంతాన్ని ఎలా ఆధ్యాత్మికంగా తయారుచేసి వెళ్ళాలి అనే విషయం గురించి నేను ఇంకా ఏమీ నిర్ణయం తీసుకోలేదు. దీనిని యథాస్థితిలోనే ఉంచటంగాని, లేక ఏ మహాత్ముడు కూడా తన యోగ సిద్ధిని (అద్భుతాలు) ఇక్కడ ప్రదర్శించలేకుండునట్లు చేయాలనిగాని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం బాగానే ఉంది.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 323

లఖీంపుర్,

17.06.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు నేను ఒక లేఖ వ్రాసి ఉన్నాను. మీరంతా ఉత్తరకాశి చేరిపోయి ఉంటారని, అందరు కుశలమేనని భావిస్తున్నాను. చాలా దూరప్రయాణం. ఇప్పటివరకు ఉత్తరం ఏమీరాలేదు, బహుశా తమరు అక్కడ పనుల్లో నిమగ్నమై ఉన్నారనుకుంటాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పటి దశలో 'మాలిక్' ఎదుట హృదయమనే కప్పు ఖాళీగానే ఉంది, ఎన్నటికీ నిండదు అన్నట్లు అనిపిస్తోంది. ఈ దశ ఎలా ఉంది అంటే, **దీనిలో (Zero) 'శూన్యం'కు ప్రవేశం లేదన్నట్లు అనిపిస్తోంది.** ఎందుకోగాని నా కణకణమూ జాగృతి చెంది (Enlivened) సజీవత్వం పొందినట్లు అనిపిస్తోంది. ఇంతేకాదు, నా రోమరోమంలోను అద్భుత శక్తి నిండి ఉన్నట్లుగాను, మమేకమైపోయినట్లుగాను అనిపిస్తోంది. అయితే నా 'మాలిక్' ఆ బాధ్యతను స్వయంగా తన నియంత్రణలోకి తీసుకున్నారు. ఎందుకంటే, నా కణకణం, నరనరమూ అమాయకంగా అయిపోయి, అవన్నీ అశ్రువుల్లాగా తయారైపోయాయి. అలా ఎందుకంటే, కప్పు ఖాళీ అయిపోయింది. దానిని నిర్వహించుకునే సామర్థ్యం నాకు లేకుండాపోయింది. అందువలన అన్నిటికీ 'అతడే' బాధ్యుడు. 15వ తారీఖు సాయంత్రం నుంచి, 'తమరు' తెలికపర్చినటువంటి పరిమితులు ఇప్పుడు ఇంకా స్వచ్ఛతను పొంది, స్వతంత్రమయ్యాయి.

నా బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎంత అమాయకంగా అయిపోయింది అంటే, నేను పూజగాని, మరేమీగాని చేయటం లేదన్నట్లుగాను, ఒకవేళ చేసినప్పటికీ, ఏమిచేయాలి, ఎవరి పూజ చేయాలి అనేది గ్రహింపుకు లేకుండా పోయింది. ఇప్పుడు హృదయం యొక్క ప్రతి తంత్రీ (తీగ) తెగిపోయి, అది (హృదయం) స్వచ్ఛం, స్వతంత్రం అయిపోయినట్లు ఉంది. నేను దానిలో (హృదయంలో) కూరుకుపోయాను. ఇంకా ఏమనిపిస్తోంది అంటే, నేను దాని స్థితిని జీర్ణించుకుంటూ దానిలోకి చొచ్చుకుపోతూ ఉన్నట్లు ఉంది. బాబూజీ, ఇప్పుడు పూజ, ధ్యానం, ఏదీ చేయనటువంటి స్థితి నాది. నా హృదయం సముద్రపు నీరులాగ అయిపోయి నేను ఛేదించుకుని అవతల తీరంవైపు సాగిపోతున్నాను. ఇప్పుడు ఎటువంటి అద్భుత సముద్రతీరం చేరుకున్నాను అంటే, అక్కడ గాలి లేదా దశ స్వచ్ఛంగా ఉన్నాయి అని చెప్పాలి. అంతకుమించి చెప్పటానికి ఇంకేమీ లేదు. హృదయం యొక్క అణువణువు కరిగి ప్రవహించిపోతున్నట్లు ఉంది.

తమరు నాకు, మాట్లాడే అలవాటు కూడా చేసుకొమ్మని ఒకసారి ఉత్తరంలో వ్రాశారు. అయితే నేను ఎవరి సమక్షంలో, ఎక్కడ మాట్లాడాలో నాకు అర్థం కాలేదు. 'మాలిక్' కృపతో నాలో సాహసమైతే ఉంది కాని ఊపిరితిత్తుల బలహీనత ఉంది. అయినప్పటికి రోజంతా ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాను. తమరు ఇంత నిస్వార్థంగా సేవచేస్తూ ఉంటుంటే, ఈ శిక్షణను అవలంబించి మేము కూడా ఎంతో కొంత నేర్చుకోవాల్సి ఉంది. అమ్మ 'తమ'కు, మాస్టర్ సాహెబ్‌కు శుభాశీస్సులు తెలుపుతున్నారు. కేసర్, బిట్టొ మరియు పూలో జిజ్జీ ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 324

లఖీంపుర్,

3.07.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు క్షేమంగా ఉన్నారని భావిస్తాను. ఇక్కడ అమ్మ ఉదరం బాగుండలేని కారణంగా చాలా బలహీనంగా ఉంది. 3,4 రోజుల్లో తేరుకోవచ్చు. పూలో జిజ్జి రేపు వెళ్తుంది, చిన్నసోదరుడు చేర్చి వస్తాడు. కేసర్, బిట్టొ కూడా కలిసి వెళ్తున్నారు. షుమారు వారం పది రోజుల్లో తిరిగివస్తారు. ఆ తర్వాత నేను వెళ్తాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను. ముందుగా 27.06.1953 నుంచి ఇప్పుడు 2,3 తారీఖులవరకు ఉన్న స్థితిని వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఒక వింతైన స్వచ్ఛదశను పొందాను. అది ఎంతగానంటే, అది స్థిరంగాను, ఒక్క క్షణం కూడా ఎటువైపు తలతిప్పని నిలకడ స్థితిగాను ఉంటోంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, చైతన్యం లేకుండా ఉన్న స్థితి ఎల్లప్పుడూ ఉంటోంది. ఇప్పుడు ఒక వింతైన మత్తు దశ వంటిది ఉంటున్నది. నా అణువణువూ చైతన్యవంతమైనట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఈ దశ శూన్యతా దశ నుంచి ఉన్నతంగా ఉండి, దానికంటె స్వచ్ఛమైనదిగా అనిపిస్తోంది. బహుశా ఈ కారణంచేతనే ఇప్పుడు శూన్యత వగైరాల అనుభూతి కూడా నాకు లేకుండా పోయింది. కాని ఈ స్థితి వింతగా చలనం లేకుండా స్థిరంగా ఉన్నటువంటి దశగా ఉంది. 'తమరు' నాకు ఏవేవో నేర్పాలనుకుంటున్నట్లు అనిపిస్తోంది.

బాబూజీ. ఇప్పుడు 2,3 రోజుల నుంచి తరచుగా హృదయం ఉన్నదన్న భావన కూడా ఉండటం లేదు. హృదయంలో కూడా వైరాగ్యం కలిగిందా అన్నట్లు లేదా దానికి ముఖం చాటేస్తున్నట్లు ఈ దశ ఉన్నది. ఇంకొక రకంగా చెప్పాలంటే, నా శరీరం అంతా హృదయమే అయినట్లు లేదా హృదయమే శరీరం అయినట్లు అనిపిస్తోంది. అది దైవానికే తెలియాలి, ఎందుకోగాని, వెన్నెముకలో కూడా కొంత శూన్యత ఆవరిస్తున్నట్లు ఉంది.

అమ్మ తమకు ఆశీస్సులు, మిగతావారు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 325

లఖీంపుర్,
5.07.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. రెండు ఉత్తరాలు కలిపి పంపిస్తున్నాను. జూలై 8వ తేదీ ఉదయానికి తమరు తిరిగి వస్తారని మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తెలిసింది. అమ్మకు ఇంకా బలహీనత ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, హృదయంలోనే నేను నిరంతరం ఉంటున్నట్లు అనిపిస్తోంది. హృదయంలోనే నిద్రిస్తున్నాను, మేల్కొంటున్నాను. ప్రస్తుత స్థితిలో నేను ప్రక్కమీదగాని, నేలమీదగాని పడుకోవటం లేదు, మేల్కొని అటు ఇటు తిరగటం లేదు. కాని అటువంటి దశలోనే నేను స్థిరంగా ఉంటున్నాను. ఈ రోజు ఉదయం నుంచే దశ మార్పు చెందుతూ ఉంది. ఇప్పుడు ఉన్న ఈ దశను గురించి చెప్పాలంటే, కమలం మీద కూర్చున్న తుమ్మెద, సూర్యోదయం కాగానే ముకుళించుకుపోయే దాని దళాలమధ్య బందీ అయిపోయినట్లు ఉంది. అదే విధంగా తమకు వ్రాసినట్లుగానే నేను హృదయంలోనే నిరంతరం ఉంటూ, హృదయం యొక్క దళాలు లేదా పంజాలో నాలుగు దిక్కులా మూసుకుపోతూ నన్ను తనలో బంధించుతున్నట్లు అనిపిస్తోంది. అలాకానేకాదు, నన్ను ఎవరు బంధిస్తారు కనుక, హృదయం యొక్క దళాలు లేదా దళాలు ముకుళించుకుపోతూ, వాటికవే తమ ఉనికిని కోల్పోతూ ఉన్నాయి. ఇక్కడ పంజా లేదా దళాలు అంటే (Tendencies) వృత్తులు నశించిపోయి ఆ హృదయమే నా రూపంగా అయిపోయినట్లు అనిపిస్తోంది. శ్రీ బాబూజీ, ఇప్పుడు హృదయం నా 'మాలిక్' యొక్క స్వరూపం గానే అయిపోతున్నట్లు అనిపిస్తుంది. నా ఆంతరిక స్థానంలో నాకు 'అతని' రూపమే దర్శనమవుతూ ఉంది. హృదయం యొక్క స్థానంలో 'అతని' రూపమే అనుభూతి చెందుతున్నాను. ఆంతరికాన్ని ఆవరించి ఉన్న ముసుగులు ఎందుకోగాని మసకగాను, ప్రకాశవంతం అవుతున్నట్లు అనిపిస్తోంది. అది ఎంతగానంటె, నా మీద దేని భారమూ నామ మాత్రంగానైనా లేకుండా పోయింది. నామీద ఉన్న ప్రభావం నా 'మాలిక్'దిగానే అర్థమవుతోంది. ఇప్పుడు ఉన్న ఈ స్థితిని గురించి చెప్పాలంటే సూరదాస్ మాటల్లో "సూరదాస్ కో కమరీ పర్ చఢై నదుణ రంగ్" అనగా **సూరదాస్ యొక్క నల్లని రగ్గు మరొక రంగును పీల్చుకోవటంగాని, దాల్చటంకాని జరగదు అన్నట్లు ఉంది.** కనుక నేను ఇప్పుడు నల్లని రగ్గుగానే అయిపోయాను. ఇంక దేని రంగుకాని, మరిదేని ప్రభావంగాని నామీద ఉండదు. నా 'మాలిక్' ఇప్పుడు ఎలా అనిపిస్తున్నారంటే, ఆంతరిక రూపం 'మాలిక్' లోపలనే మార్పు చెందుతూ ఉన్నట్లు ఉంది. అనగా నా ఆంతరికం రూపం 'మాలిక్'గానే మారిపోతున్నట్లు ఉంది. నా రోమ రోమమూ, కణకణమూ తెరచుకున్నట్లుగాను, వాటిలో చైతన్యం వంటి కాంతి నిండి ఉన్నట్లుగాను అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, నేను స్పృహలేనిదానిగా గాని, ఏమీ తెలియనిదానిలాగ గాని కాకుండా కణకణంలోనూ చైతన్యం (కదలిక) కలిగి ఉన్నట్లు ఉన్నాను. రోమ రోమమూ జాగృతమయ్యాయి, ఆంతరికం అంతా జాగృతమయ్యింది. అంతా చైతన్యమయమైపోయింది. ఈ చైతన్యం మనోహరంగా ఉంది. ఇప్పుడు ఎలా ఉంది అంటే, నా రూపమే చైతన్యంగా అయిపోయింది అన్నట్లు ఉంది. నా రూపం మారిపోయినట్లుగాను, నేను ఇప్పుడు ఆ రూపంలోనే లేదా దశలోనే స్థిరంగా ఉంటున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు ఆ స్థిరత్వమే నా రూపంగా అయిపోతూ ఉంది.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 326

షాజహాన్‌పూర్,
11.07.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు జూలై 3,5వ తేదీలవి అందాయి. అవి చదివాక చాలా ఆనందం కలిగింది. "ఆంతరిక పరదాలు పలుచనపడిపోయి మసకబారిపోతున్నాయి, ఎందుకో తెలియటం లేదు" అని వ్రాశావు. **ప్రపంచంలోని ప్రజలు కాంతి దర్శనం కొరకు గగ్గోలుపెడుతూ ఉంటారు. కొందరు సూర్యకాంతి, కొందరు చంద్రకాంతి వంటి వాటిని దర్శించుకోవాలని అనుకుంటారు. మరికొందరైతే అక్కడ వేలకొద్దీ సూర్యుల కాంతి తేజస్సు ఉందని, దాని దర్శనం కొరకు ప్రయత్నిస్తున్నట్లు చెప్తూ ఉంటారు. కనీసం ఒక్కసారైనా ఆ కాంతి దర్శనం కలిగినప్పుడే యోగం ప్రారంభమవుతుందనే విషయం నిజమే కాని అదే అసలు (మూలం) అని భావించకూడదు. కాంతి అనేది పదార్థం (Matter). 'అసలు' (రియాలిటీ) అయినటువంటిది వెలుతురు లేక చీకటి, ఏదీ కాదు. దానిని మసకబారిన దానిలాగా చెప్పవచ్చు. ఈ అసలు సిసలైనది అనగా మూలవస్తువు ఇది అయి ఉండగా, ఇక్కడ మన సమస్త ఇంద్రియాలు ఇదే రకంగా మసకబారిపోయి ఉండాలి.**

నీ ఉత్తరంలోని ప్రతి పంక్తికీ జవాబు వ్రాయాలంటే అది చాలా నిడివిగా తయారవుతుంది. కనుక సంక్షిప్తంగా మాత్రమే వ్రాస్తున్నాను. నీ శారీరక స్పృహ ఇప్పుడు పూర్తిగా తొలగిపోయి ఆత్మ చైతన్యం లేదా ఆత్మ జ్ఞానం ఆరంభమైంది. ఇది కూడా పరిసమాప్తం కావటానికి కొంత సమయం పట్టుంది. ఈశ్వరేచ్ఛ ఉంటే అది కూడా ఇదే విధంగా జరిగిపోతుంది.

ఇప్పుడు రాత్రి గం. 3.25 ని॥ల సమయంలో నిన్ను 'T' స్థానం నుంచి తొలగించి 'U' స్థానం మీద నిలిపాను. దీనికి ఒక గంట క్రితం నిన్ను 'T' స్థానం మీద నిలిపి ఉంచాలని భావించాను కాని ఇప్పుడు అది అవసరం లేకపోయింది.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 327

లఖీంపూర్,
11.07.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇప్పుడు అందరూ వివాహ కార్యక్రమం నుంచి తిరిగి వచ్చి ఉంటారనుకుంటాను. నాకు ఇక్కడ ఉత్తరం వ్రాయటానికి అవకాశం లేకుండాపోయింది. ఎందుకంటే, అలహాబాద్ నుంచి, మా పినతండ్రిగారు, విమల వగైరాలు వచ్చారు. నిన్న తిరిగి వెళ్ళిపోయారు. 'మాలిక్' దయతో ఇప్పుడు వారు బ్రహ్మవిద్యను మాత్రమే నేర్చుకొనదలచారని మాతోను, మాస్టర్ సాహెబ్‌గారితోను మా చిన్నాన్నగారు చెప్పి వెళ్ళారు. ఇంకా ఆపైన దైవం ఉన్నాడు. అమ్మ వ్రణం కూడా 3,4 రోజులక్రితం చితికిపోయింది. ఇప్పుడు కూర్చోవటానికి ఇబ్బంది లేదు. కడుపునొప్పి కూడా తగ్గిపోయింది. 'మాలిక్' దయతో ఏర్పడిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను. 8వ తేదీ ఉదయం నుంచి దశలో మార్పు వచ్చినట్లు అనుభవమవుతోంది.

ఇప్పటి నా ఈ స్థితిలో **ప్రతిదీ, ప్రతి ఆహారం ప్రసాదంగానే అనిపిస్తున్నాయి.** ఎటువంటి భావనగాని, మరేదైనా తలంపుగాని లేకుండా అది దానంతటదే కలిగినట్లు అనిపిస్తోంది. **ఇప్పుడు భోజనం యొక్క రుచిలేదు,**

**అంతా ప్రసాదంగానే అనిపిస్తోంది.** అది కల్పితమో, విచక్షణమైనదో నాకు తెలియదు కాని, నాకు ఎవ్వరితోనూ భౌతికంగా, మానసికంగా ఎటువంటి సంబంధం లేకుండా ఉంది. వదినకాని, సోదరికాని, మరెవ్వరు ప్రత్యేకించి లేరు. నా ఎదుటకు ఎవరువస్తే, వారు నావారుగానే అనిపిస్తోంది కాని, భౌతిక బాంధవ్యం ఏమీ లేకుండా ఉంది. **ఈ కారణంగానే ప్రతి ఒక్కరితోను అన్ని విషయాలు మాట్లాడటం వలన మనస్సు నిర్మలంగా అయిపోయింది. ఇందులో కపటంగాని, దాపరికంగాని ఏమీలేవు, ఉన్నదేదో ఉంది బాబూజీ.**

బాబూజీ, ఇప్పుడు ఎలా ఉందంటే, అప్పుడప్పుడు, పల్చని నీలాకాశం రంగు లేదా సముద్రపు రంగుతో కూడిన మెరుపు (కాంతి కిరణాలు) పూర్తిగా నా శరీరం బయట, నాకు నాలుగువైపులా నిర్మలంగా కాంతులీనుతున్నట్లు అనిపిస్తోంది. అది మిరుమిట్లుగొల్పటం లేదు కాని, వాటిలో కొంత చల్లదనం మాత్రం ఉంది. తరచుగా మెడకుపైభాగాన, శిరస్సుకు నాలుగు దిశలా ఇటువంటి ప్రకాశవంతమైన కిరణాలు ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే, నా కళ్ళు ఈ దృశ్యాన్ని దర్శించటానికి బయటకు రావటం లేదు. (అనగా అంతర్ దృష్టికి మాత్రమే దర్శనమవుతున్నాయి) ఎందుకంటే, అవి (కళ్ళు) ఇప్పుడు ఆంతరికానికి హత్తుకుపోయి ఉండటమేకాక, వాటితో లయమైపోతూ ఉన్నాయి. నా ఆంతరికం 'మాలిక్' యొక్క రూపంతోనే పరివర్తనం చెందుతూ ఉండటమే ఇందుకు కారణమై ఉండవచ్చునని నేను అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు ఆంతరిక రూపం లేదా నా స్వరూపం స్థిరత్వం చెందిన్నట్లు అనిపిస్తోంది. ఈ విధంగా జరుగుతూ ఉండి కూడా బాణం (తపన) ఆంతరికాన్ని ఛేదించుకుని అక్కడే తిష్టవేసింది.

అమ్మ తమకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఫూలో జిజ్జి, కేసర్ మరియు బిట్టో తమకు ప్రణామం తెలపమని వ్రాశారు. పెద్ద సోదరుడు యాత్ర చేయటానికి నిన్న రైలులో ప్రయాణించటానికి వెళ్ళి ఉంటారు. మొదట జోధ్‌పూర్ తర్వాత అస్సాం వెళ్తారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 328

లఖీంపుర్,
17.07.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరి నుంచి చాలా రోజులుగా ఉత్తరమేదీ రాకపోవటం వలన సమాచారం తెలియటం లేదు. అమ్మ పూర్తిగా ఆరోగ్యవంతులయ్యారు. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మికదశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఈ స్థితిలో బయట, లోపల ప్రతిదీ సూక్ష్మత్వం చెందినట్లు నా దృష్టికి వస్తోంది. స్థూలత్వమనేది బయట, లోపల ఎక్కడా జాడ లేకుండా పోయింది. ప్రతి ఒక్కదాని స్థూలత్వం తొలగిపోయినట్లు అనిపిస్తోంది. తరచుగా నాలోపల కొంత భారం ఉన్నట్లుగాను, తర్వాత సర్దుకుపోతున్నట్లు గాను అనిపిస్తోంది, అదేమిటో దైవానికే తెలియాలి. నా ఆంతరికం స్థిరత్వం యొక్క రూపాన్నే దాల్చుతున్నట్లు గమనిస్తున్నాను. అది ఎంతగానంటే, ఎవ్వరైనాగాని నిద్రిస్తున్నా, మేల్కొంటున్నా కూడా రూపం చలించకుండా ఉంటోంది. ఏమాత్రం మార్పు కూడా చెందటం లేదు. స్థితులు వస్తున్నాయి, మార్పు చెందుతున్నాయి, కాని అది మాత్రం తన స్వరూపంలోకే స్థిరంగా ఉండిపోతోంది. బాబూజీ, ఇప్పుడు ఆంతరికం తన వాస్తవిక రూపంలోకి మారుతున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు అదేమిటోగాని, జ్ఞాపకశక్తి చాలా బలహీనంగా అయింది. అది ఎంతగానంటే, తరచుగా కూరలో ఉప్పు వేయటం మర్చిపోతున్నాను. సోమరితనం కూడా ఎంతగా ఉంటున్నదంటే, ఎవ్వరికైనా ఉత్తరం వ్రాయటానికి కూడా శరీరం సహకరించటం లేదు, బలవంతంగానే ఏదైనా చేస్తున్నాను. 'తమ'కు ఉత్తరం వ్రాయాలని అనుకుంటూనే 3,4 రోజుల తర్వాత బలవంతంగా వ్రాయటానికి పూనుకుంటున్నాను. ఇప్పుడు ఈ దశలో **గమనం కలగటం లేదు, పైగా సోమరితనం కూడా ఆవహించి ఉంటోంది.**

**శరీరం పనిచేయటానికిగాని, విశ్రాంతి తీసుకోవటానికిగాని ఇష్టపడటం లేదు. శరీరం తరచుగా ఏ కారణం లేకుండానే దిగులుగా ఉంటోంది.** కొద్దిగా విలపించిన తర్వాత విశ్రాంతి కలుగుతోంది. అయితే అదేమిటోగాని నేను కోరుకున్నా విలపించలేకపోతున్నాను. బహుశా అంతర్ నేత్రాలు అశ్రుధారలు ప్రవింపజేస్తూ ఉండవచ్చును కాని, బాహ్య నేత్రాలకు అది స్వల్పంగానే ఉంది. అప్పుడప్పుడు హృదయం మీద తేలికపాటి భారం వంటిది కలిగినా మళ్ళీ మామూలు స్థితికి వస్తోంది.

అమ్మ, పూలోకు ముత్యాలు కావాలని వ్రాసిందని చెబుతోంది. నేను వారి అడ్రస్ వ్రాస్తున్నాను. అవకాశం ఉంటే ఒకటి, రెండు రోజుల్లో పంపించండి. అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 329

లఖీంపుర్,

19.07.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు చేరింది, చదివి ఆనందించాను. నన్ను పాయింట్ 'U'కు చేర్చినందుకు అనేక ధన్యవాదాలు. నేను ఈ విధంగా ఉన్నతినందిన తర్వాత దృఢమైన, సత్యవంతమైన నా నిర్ణయం ఏమిటంటే, **శిక్షకుడు లేకుండా పైకి ఎదగటం అనేది, ఎవరు ఎంతగా ప్రయత్నించినప్పటికి సాధ్యపడదు అని. ఎవరి యొక్క శక్తి సహాయం లేకుండా పైకి అనగా ఆధ్యాత్మిక దశలలోకి ఎవ్వరూ అడుగుపెట్టలేరు. పాయింట్లు దాటించటమనేది ఇప్పుడు ఈ ప్రపంచంలో కేవలం ఒకే ఒక్కరు అయిన 'తమకు' మాత్రమే ఆ శక్తి, సామర్థ్యం ఉందని నేను సత్యప్రమాణంగా శపథం చేసి చెబుతున్నాను. బాబూజీ, ఈ ప్రపంచం ఎప్పుడు గ్రహిస్తుంది, ఎప్పుడు మేల్కొంటుంది? అది దైవానికే తెలుసు. ఎవ్వరైతే మనల్ని జాగృతపర్చారో అతడు మాత్రమే ఈ ప్రపంచాన్ని మేల్కొల్పుతాడు. ప్రకాశం వ్యాపించి ఉంది, చైతన్యం లభిస్తోంది అని మన ఆత్మ ఘోషిస్తోంది. అయితే మనం కళ్ళులేనివాళ్ళలాగ చూడలేకపోతున్నాం, చైతన్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాం. మరి ఏం జరగాలి, ఇటువంటి ప్రాపంచిక జనావళికి చెందినవారిలోనే మన సత్సంగ్ సోదరులు ఉన్నారు. ఆ సమయం కోసం నిరీక్షిద్దాం.**

నావి రెండు ఉత్తరాలు తమకు చేరి ఉంటాయనుకుంటాను. నేను గతంలో వ్రాసిన సోమరితనం అనేది ఇప్పుడు తొలగిపోయింది. ఆత్మోన్నతి నడకలో కూడా గతి వేగంగా ఉంది, అంతా 'మాలిక్' కృపయే. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు సత్యమే నా దశ అయిపోయినట్లు అనిపిస్తోంది. ఆంతరికంగాను, బాహ్యంగాను నాకు కేవలం సత్యమేతప్ప మరేమీ కనిపించటం లేదు. ఇప్పుడు అంతటా సత్యమే కనిపిస్తోంది. నా అణువణువూ సత్యరూపంగా అయిపోయింది. మాట్లాడుతున్నప్పుడు కూడా సత్యత్వం యొక్క దశయే వెలువడి వ్యాపించిపోతున్నట్లు అనిపిస్తోంది. యదార్థంగా నా స్వాభావిక దశయే సత్యత్వం యొక్క రూపంగా ఆయిపోయింది. ఇంకేమి చెప్పను! సత్యత్వం యొక్క స్వచ్ఛ నిర్మల ప్రకాశంతో నేను, అన్ని దిక్కులా అంతటా కూడా దేదీప్యమానంగా అయ్యాను. నా (Natural Condition) స్వాభావిక దశయే అన్ని వైపులా వ్యాపించి ఉంది. 'మాలిక్' ఇప్పుడు నాకు సత్యస్వరూపం చూపించి దాని అనుభవం కల్పించారు. బాబూజీ, ఈ సత్యం ఏమిటో తమకు తెలుసు. నాకు అనుభవమైనదానిని వ్రాశాను.

పూలో జిజ్జీ అడ్రస్ వ్రాసి పంపించాను. చిన్నాన్నగారు (మిశ్రీలాల్‌జీ) వచ్చారు. ఇక్కడ అంతా గందరగోళంగా ఉంది. కలవటానికి వచ్చేవారి రద్దీ, భోజనాలు వగైరా అధికంగా ఏర్పాటవుతున్నాయి. ఒకరోజు రాత్రి 9 గం. నుంచి

12 గం. వరకు సత్‌సంగ్ కూడా జరిగింది. ఆ తర్వాత, తన ఆత్మ కేవలం ఈ పూజ చేయటానికి ప్రేరణ కల్పిస్తున్నట్లుగాను, తన నిశ్చయం కూడా అదే అన్నట్లుగాను ఆయన చెప్పారు. తమకు స్వయంగా ఉత్తరం వ్రాయాలనే అభిప్రాయం ఉన్నట్లు చెప్పారు. అమ్మ తమకు శుభాశీస్సులు, తదితరులు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 330

లఖీంపుర్,

24.07.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమరు, పూజ్య మాస్టర్ సాహెబ్‌కు వ్రాసిన ఉత్తరంలో, మధుర నుంచి తిరిగి వచ్చాక తమ ఆరోగ్యం బాగుండలేదని వ్రాశారు. కనుక ఆరోగ్యం ఎలా ఉందో వ్రాయండి. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పటి ఈ దశలో నా ఆంతరికమంతా మసకబారిపోయినట్లు అనిపిస్తోంది. దానిలో ఏదీ కూడా స్పష్టంగా కనిపించటం లేదు, మసకగానే కనిపిస్తున్నాయి. **"సత్యత్వం నా దశగా అయిపోయింది"** అని నేను గతంలో తమకు వ్రాసి ఉన్నాను. ఇప్పుడు దాని ప్రకాశం కూడా మసకబారిపోయినట్లు అనుభూతమవుతోంది. మరో మాటలో చెప్పాలంటే, ఆ సత్యత్వం యొక్క రూపమే మసకగా అయిపోయింది. ఇప్పుడు ఆ మసకలోనికే నేను దూరిపోతున్నట్లు అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, ఆ మసక యొక్క ప్రభావం కొంత బాహ్యంగా కూడా అనుభవమవుతోంది. ముఖ్యంగా నేత్రాలపై దాని ప్రభావం ఉంది, ఎందుకంటే నా నేత్రాలకు, బయటి వస్తువులు కూడా మసకగానే కనిపిస్తున్నాయి.

నా బాబూజీ, ఒక మసకబారియైన మైదానంలో ఎక్కడా ఏమీ కనిపించనటువంటి దానిలో, దిక్కుతోచకపోయినా కూడా దూసుకుపోతూ ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే నేను ఎవరి ఆకర్షణలో చైతన్యరహితంగా దూసుకుపోతున్నానో తెలియదు. అంతేగాక ఏ శక్తి నన్ను బలవంతంగా తనవైపు లాక్కొనిపోతున్నదో కూడా తెలియటం లేదు. నేను నిరోధించుకోలేక పోతున్నాను. ఎటువైపు చూడాలనుకున్నా కూడా నాకు తీరిక ఎక్కడ ఉంది? అయినా చూద్దునుకదా, మసకబారి ఉండటం తప్ప ఇంకేమీ లేదు. కళ్ళు మూసుకుపోయాయి. అయినా కూడా ఆ మాయదారి శక్తి నన్ను గుంజుకు పోతూనే ఉంది. ఎక్కడికి? దానికి జవాబు నాకు అనుభవమవుతున్న 'అనంతం వైపు' అని మాత్రమే చెప్పగలను. అది నన్ను గుంజుకు వెళ్ళి, అక్కడకు చేర్చిగాని ఊరుకోదు. నన్ను ఒక్క క్షణమైనా ఆపగలిగిన సామర్థ్యం ఉన్న శక్తి ఏదీ లేకపోయింది.

బాబూజీ, నాకు అనుభవమవుతున్న దానితో ఆ శక్తిలో ఎటువంటి శక్తి ఉన్నట్లు లేదని, ఆకర్షణ అంటారా, అది సహజసిద్ధమేగాని, అది అత్యంత సూక్ష్మమైనది కావటం వలన, దానిలో ఆ శక్తి మాత్రం ఎలా ప్రవేశించగలదు అని అర్థం చేసుకుంటున్నాను. ఇంక ఇప్పుడు వెళ్ళవలసే ఉంది, ఆ అనంతం యొక్క ద్వారం నా కోసం తెరచుకుని ఉంది. అంతేకాదు, దానిలో నా ప్రవేశం కూడా జరిగిపోయింది.

నా బాబూజీ, నా అనుభవానికి వచ్చినంతలో అసలు ఆ ఆకర్షణ ఏమిటి? అని ఆలోచిస్తే, ఒక సూదంటురాయి (అయస్కాంతం, Magnet) మరియు సూది వంటిదేకాని ఇంకేమీ కాదనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, 'మాలిక్' కృపతో నా అనుభవానికి వచ్చిన దానినిబట్టి, అనంతం కూడా అచేతనమైనది కాదు అని. దీనిలో ప్రాణం ఉంది, అయితే నా 'మాలిక్' యొక్క సామ్రాజ్యం సరిహద్దుల అసలు (రియల్) కిరణాల జాడ ఇక్కడ ఎక్కడా కనిపించటం లేదు. దీని అర్థం ఏమిటంటే, నేను ఇంకా చాలా దూరం నడవాల్సి ఉంది అని. అయితే 'అతని' కృప సదా నా

శిరస్సుపై ఉంది కనుక అది అంత దూరం లేదు.

బాబూజీ, ఏ విధంగానైతే సూదంటూరాయి (అయస్కాంతం Magnet) లేకుండా సూదికి చలనం ఉండదో, అదే విధంగా 'అతని' కృప లేకుండా ఉంటే, నేను చలనరహితంగా లేదా నిర్జీవంగా ఉండిపోతున్నాను. ప్రస్తుతం ఇది నా స్థితిగా ఉంది. నిజం చెప్పాలంటే, నా స్థితి ఎలా ఉందంటే, బాహ్యేంద్రియాలలో కూడా ఆ మసక వ్యాపించింది. చేతులు, కాళ్ళు పనిచేయటం లేదు. కళ్ళు మసకబారిపోవటం వలన అవి చూడటానికి నిరాకరిస్తున్నాయి. ఇంకేముంది, ఇప్పుడు రోజంతా నా నాలుక మీద నిలిచి ఉన్న ఈ దిగువ పంక్తులనే పఠించాల్సి ఉంది, రోమ రోమం దీనినే జపిస్తున్నాయి.

**"ప్రభు బినా భక్తి తారో, తబ్ తారిబొ తిహరోహై"**

"భక్తి లేకుండానే ముక్తినివ్వు, నీ ఘనత చాటు" అనగా భక్తి, ప్రేమలు లేకున్నా నాకు ముక్తి కలిగించు, అప్పుడు నీ ఘనత వెల్లడవుతుంది ప్రభూ! అని మొరపెట్టుకోవటమన్నమాట.

పూజ్య బాబూజీ, 'మాలిక్' కృపతోనే ఈ విధంగా కనిపిస్తోంది. అది ఏమిటంటే, అనంతానికి ఆవల నుంచి కూడా ఎవరి ఆకర్షణయో నన్ను తనవైపుకు ఈడ్చుకుపోతోంది, ఎవరో నాకు మార్గనిర్దేశం చేస్తున్నారని అనిపిస్తోంది. ఇదంతా నాకు 'అతని'కే చెందినవి, నా 'మాలిక్' యొక్క నేత్రాల వెలుగుతోనే కనిపిస్తోంది.

అమ్మ 'తమ'కు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. మిగిలినవారు తమకు ప్రణామం చెప్పమని వ్రాశారు. తమ ఆరోగ్యం గురించి తెలియజేయండి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 331

లఖీంపుర్,

25.07.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఆరోగ్యం బాగయ్యిందని ఆశిస్తున్నాను. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. శుక్లాగారు వచ్చారు. వారిలో లయావస్థ ప్రారంభమైనట్లు నాకు అనిపిస్తోంది. అదేదో 'తమ'కు తెలుసు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఈ దశలో ఏమనిపిస్తోందంటే, బాహ్య మరియు అంతర్ వృత్తులు (External and Internal Senses) అన్నీ కూడా నిరర్థకమై పోయాయి. (Senses) వృత్తులు పనిచేయటం మానివేశాయి. వృత్తులలో ఎటువంటి క్రియగాని, రక్షణగాని లేకపోయాయని అనిపిస్తోంది. అన్ని వృత్తులు మరుగైపోయి నెమ్మదిగా దేనిలోనో విలీనమైపోయినట్లు అనిపిస్తోంది. అవి ఉండటమే జరిగి ఉంటే, బాగా నిశితంగా పరిశీలించినట్లయితే వాటి మసకబారిన ఛాయను మాత్రం గుర్తించవచ్చు. స్థిరత్వదశ అన్నింటిమీద ఆధిపత్యం చేజిక్కించుకున్నట్లు అనిపిస్తోంది. బాబూజీ నేను ఇంతకుపూర్వం తరచుగా తమకు "నా హృదయం ఇంకా ఖాళీగా అయిపోయినట్లు ఉంది" వ్రాస్తూ ఉండేదాన్ని. కాని ఇప్పుడు అలా ఉండటం లేదు. ఇప్పుడు ఖాళీగా గాని, నిండుగా గాని ఉండటం లేదు. ఒక వింతైన స్థితిలోనే స్థిరంగా ఉంటోంది. ఇంకొక విషయం ఏమిటంటే, అది ఏమిటోగాని, బయటి వ్యక్తుల ముఖాలు ఎవ్వరివైనాగాని నాకు స్పష్టంగా కనిపించటం లేదు. కేవలం ఒక మసకబారిన ఛాయలాగతప్ప మరేమీ కనిపించటం లేదు. అయితే చదవటం, వ్రాయటం అన్నీ చేస్తున్నాను. పనిలో ఎటువంటి ఆటంకం కలగటం లేదు. హృదయంలో ఏదో బాధ కలుగుతోంది. అది ఎటువంటిది అంటే, ఒక ముల్లు లాంటిది గ్రుచ్చుకొన్నట్లుగాను, అప్పుడప్పుడు దాని వలన ఒక

రకమైన బాధ లాంటిది అనుభవమవుతోంది. అదేమిటోగాని, హృదయంలోపల ఏదో (Twisting) నులిమినట్లు ఉంటోంది. శ్రీ బాబూజీ, ఇటీవల హృదయం విలపించాలని కోరుకోంటున్నది కాని విలపించలేకపోతున్నాను. దానిలో అంతర్మథనం వంటిది అనుభవమవుతోంది. అదేమిటో దైవానికే తెలియాలి. 'తమరు', **నా 'మాలిక్', నాయాత్రలో మళ్ళీ వేగం నింపారు. అనగా గమనంలో కలుగుతున్న అలసటవంటిది తొలగిపోయి, మళ్ళీ వేగవంతం అయ్యింది.**

'U' పాయింట్ యాత్ర కూడా 4,5 రోజుల నుండి ప్రారంభమైనట్లు అనిపిస్తోంది. ఇప్పుడు స్థిరత్వం అనేది నా రూపం అనటమే కాదు, అది నాలో విలీనమైపోతూ కనుమరుగైపోతున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నేను వీటన్నింటినీ అతిక్రమించి, స్వయంగా వేరే ప్రపంచంలో ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. నేను సాక్షాత్తూ 'మాలిక్' చెంతకు చేరిపోతున్నాను. గతంలో నేను, "నా ఆంతరికం విలపిస్తోంది" అని వ్రాశాను. అయితే ఇప్పుడు అది విలపించటానికి బదులుగా నీరుకారిపోతోంది.

అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతున్నారు. పూలోజిజ్జి, కేసర్ మరియు బిట్టొలు ప్రణామం చెప్పమని వ్రాశారు. కేసర్ ఉత్తరం ద్వారా పూలో జిజ్జీ, 'మాలిక్' కృప మూలంగా తన మనస్సును పూజలో బాగా లగ్నం చేస్తున్నట్లు తెలిపింది. నేను శనివారం నాడు చిన్నసోదరునితోపాటు కాన్పూర్ వెళ్తాను. తర్వాత బిట్టొ, కేసర్, చిన్నసోదరునితో కలిసి తిరిగి వస్తాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 332

లఖీంపుర్,

3.08.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన 2 పోస్టుకార్డుల్లోని విషయాల్ని మాస్టర్ సాహెబ్‌గారు చదివి వినిపించారు. 'తమ' తలనొప్పి తగ్గిందని తెలిసి సంతోషం కలిగింది. నా శిరస్సులో కూడా చాలా రోజుల వరకు కొంత బాధ కలిగింది, కాని ఈశ్వర కృపతో పూర్తిగా తగ్గిపోయింది. ఎంతమాత్రం బాధపడాల్సిన అవుసరం లేదు. 'తమ'కు శ్రమ అధికమవుతోంది. నారాయణ దద్దాకు షాజహాన్‌పూర్‌కి బదలీ అయ్యిందని విన్నాను. బహుశా ఇప్పుడు తమకు కొంత విశ్రాంతి లభించవచ్చు.

నేను ఇప్పటివరకు కాన్పూర్ వెళ్ళలేకపోయాను. శనివారం ఉదయం 4 గం॥లకు వెళ్తున్నట్లుగా తమకు ఉత్తరం వ్రాశాను. అయితే 29వ తేదీకి, తను వస్తున్నట్లు తావూజీ ఉత్తరం వ్రాశారు. కాని ఈ రోజు అనగా 3వ తేదీవరకు రాలేదు. వారు వచ్చిన తర్వాతనే నేను వెళ్తాను. నేను వెళ్ళటానికి ఏమీ కలిసిరావటం లేదు. 'మాలిక్' కృపతో పెద్దసోదరునికి 3 రోజులు ఎక్కువగా ప్రయాణించినందుకు జీతానికి అదనంగా రూ. 245 లు వస్తుంది. అందుచేత మేము బసంత్ పంచమికే కాకుండా మరొక్కసారి షాజహాన్‌పూర్ రావటానికి తావూజీతో చర్చిస్తాము.

బాబూజీ, ఇప్పుడు దశ పెద్దగా ఏమీ లేనిదిగా నడుస్తోంది. నిరర్థకమైన ఆలోచనలు చాలా వస్తున్నాయి. విశేషించి జ్ఞాపకం ఉంచుకోవాల్సిన విషయాలేవి లేనట్లు అనిపిస్తోంది. నా హృదయం మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. తమరు చెప్పిన ఈ వాక్యం నాకు ప్రత్యక్షమవుతోంది. అది **"బిటియా, మనవద్ద చెడ్డస్థితి అంటూ ఏదీ ఉండదు, ఎందుకంటే, చెడ్డస్థితి అనేది మంచిస్థితిని తెరవటానికి తాళంచెవి వంటిది"** అని. అందువలన 'అతని'కి ధన్యవాదాలు తెలుపుతూనే ఉంటాను. నేత్రాలు కూడా ఆశతో, 'మాలిక్' కృప కొరకు నిరీక్షిస్తూ ఉన్నాయి. కొద్దిగా అనుభవమవుతున్న దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు అదేమిటో తెలియదుగాని, నాకు (Omnipresent) సర్వవ్యాపకత యొక్క అభిప్రాయం కలుగుతోంది. ఏ విధంగానైతే నా 'మాలిక్'ను అనుక్షణం, ప్రతిచోట ఉన్నట్లు సర్వదా అనుభూతి చెందుతున్నానో, అదే విధంగా అలాగే ఉన్నటువంటి దశను 'మాలిక్' నాకు ప్రసాదించారు. ఇంతేకాదు, ప్రతి మానవమాత్రునిలో నేను ఉన్నాను. అయితే ఈ దశ యొక్క జ్ఞానాన్ని 'మాలిక్' వద్దనే ఉంచాను. 'అతడు' ఎప్పుడు కావలసి ఉంటే అప్పుడు ఇస్తాడు. ఎప్పుడైనా ఈ సర్వవ్యాపకత గురించిన ప్రస్తావన వచ్చినపుడు, ఈ దశ నాకు పూర్తిగా స్పష్టంగా దర్శనమవుతుంది. నేను పైన వ్రాసిన ఆలోచనలతో నాకు వచ్చిన ఇబ్బంది ఏమీలేదు. ఎందుకంటే, అది కూడా ఒక దశయే అయి ఉండవచ్చు. 'తమకు' ఈ విషయం వ్రాస్తూ ఉండగానే అది పలచనైపోతూ ఉంది.

ఇప్పుడు లేఖ వ్రాయటం వంటి వాటితో శిరస్సులో కొద్దిగా బాధ కలుగుతోంది. కాని వాటిని ఆపి, లేచి నిల్చున్నట్లయితే ఏమీ ఇబ్బంది లేకుండా ఉంటోంది. ఇక్కడ అమ్మకి బలహీనత బాగా ఎక్కువగా ఉంది, అయితే నిన్నటి నుంచి కొంత మెరుగుపడింది. ఉదర సమస్య మూలంగా ఆమెకు ఆకలి దప్పులు ఏమీ అనిపించటం లేదు. 'మాలిక్' కృపతో నిదానంగా అన్నీ సర్దు కుంటాయి. ఏమీ విచారించాల్సిన పనిలేదు. చాలా రోజులుగా 'తమ' ఉత్తరం ఏదీ రానందుకు తను దిగులుగా ఉన్నట్లు చెబుతున్నారు. కనుక తమ క్షేమం గురించి కనీసం రెండు పంక్తులైనా వ్రాసి ఉత్తరం పోస్ట్ చేయించండి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 333

కాన్పూర్,

14.08.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరి' నుంచి చాలా కాలంగా ఉత్తరాలు ఏమీ రాలేదు. అందుచేత 'తమ' ఆరోగ్యం గురించిన పరిస్థితి ఏమీ తెలియలేదు. ఇంకా ఏమిటంటే, తమ పత్రాల పంక్తుల నుంచి ఎటువంటి స్ఫూర్తి లభిస్తూ ఉండేదో, అది కూడా ప్రాప్తించలేదు. దయచేసి నాపైన తమ కృపా దృష్టిని ప్రసరించండి. ఎందుకంటే, నా దశ ఎందుకోగాని స్వచ్ఛంగా ఉండటం లేదు. ఇక్కడ దంత వైద్యుడిని సంప్రదించాను. ఆయన ఏవో మందులు, ఇంజక్షన్‌లు వ్రాసి ఇచ్చారు. సాధారణ డాక్టర్‌ను కూడా సంప్రదించాను. ఆయన దంతాల విషయం అటుంచి, ఉదరం మరియు బలహీనతలకు తగిన వైద్యం గురించి చెప్పారు. కనీసం నెలలు పట్టేట్లుగా ఉంది. ఏమవుతుందో వేచి చూద్దాం. నా దశలో ఉన్న లోపమేదో దానినే చూడండి. ఇపుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిదశను వ్రాస్తున్నాను.

'మాలిక్'పట్ల నాలో ఎటువంటి అచంచల విశ్వాసం మరియు ధృఢత్వం ఉన్నాయో తదనుగుణంగా 'మాలిక్' శక్తి, 'అతని' కృప తప్పకుండా నాపై ఉంటాయి. అయితే ఇప్పుడు ఈ విషయం కూడా మసకబారినట్లు అయిపోయింది. నా ఆధ్యాత్మిక యాత్రలో వేగంగాని, స్వచ్ఛతగాని పొందలేకపోతున్నాను. ప్రయత్నం కూడా నిష్ఫలమవుతోంది. ఇంతేకాదు, నాలో ఇప్పుడు భక్తి, విశ్వాసం మరియు ప్రేమ వంటివి ఏవీ కూడా ఆ విధంగా లేవు. ఇపుడు అవన్నీ మసకబారి ఛాయా మాత్రంగా అయిపోయినట్లు అనిపిస్తోంది. అన్నీ కూడా బాగా మసకబారిపోయాయి. పూజలో మనస్సు కూడా మసకతో ఆవరించబడినట్లు అనిపిస్తోంది. అది ఎంతగానంటే, ఎంత ప్రయత్నించినప్పటికి 'మాలిక్' రూపం కూడా మసకబారినట్లుగానే నాకు కనిపిస్తోంది. నేనేమి చేయాలి? నేను ఇప్పుడు వేగంగా ముందడుగు వేయలేకపోతున్నాను. ఇప్పుడింక 'తమరు' దానిని సవరించండి. పూలోజిజ్జీ తమకు ప్రణామం చెబుతోంది. కేసర్ మరియు బిట్టో లఖీంపూర్ వెళ్ళి 4,5 రోజులయ్యింది.

అమ్మ 'తమ'కు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. మిగిలినవారు తమకు ప్రణామం చెప్పమని వ్రాశారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 334

షాజహాన్‌పూర్,

07.08.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలు అన్నీ చేరాయి. నేను బాగా ఆరోగ్యంగానే ఉన్నాను. దైవానుగ్రహం వలన నీ స్థితి కూడా బాగానే ఉంది. నీవు ఇప్పుడు 'U' స్థానం మీదనే ఉన్నావు. అది నాకు ఎంత బాగుందని అనిపిస్తున్నదంటే, నిన్ను ఇక్కడి నుంచి ఉన్నత స్థానానికి తరలించటానికి కూడా నా మనస్సు ఎందుకో అంగీకరించటం లేదు. నీవు 'U' స్థానం మీద ఉండటం చూసినప్పుడు నాకు చాలా శాంతి అనుభవమవుతూనే నా స్థితి చాలా శ్రేష్ఠంగా ఉంటుంది.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 335

కాన్పూర్,

19.08.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇంతకుముందు వ్రాసిన ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. ఏమీ సమాచారం లేనందున చింతిస్తున్నాను. నా సాధనలో ఎటువంటి లోపమూ రాలేదనుకుంటాను. ఎందుకంటే, తమరు దయ ఉంచి 8,9 రోజుల్లోనే ఒక్కొక్క పాయింట్ దాటవలసి ఉంటుందని చెప్పారు. అయితే నాకు మాత్రం చాలా ఆలస్యమవుతోంది. ప్రయత్నం చేస్తాను, చేస్తున్నాను కూడా. ఇలా జరుగుతున్నా కూడా 'మాలిక్' పరమ దయాళువు అను ఆసరా (ఆధారం) ఉంది. (అనగా మాలిక్ దయ ఉంచుతాడను విశ్వాసం.) ఏదైనా లోపం ఉన్నా కూడా స్వయంగా 'అతడే' సరిదిద్దుతాడు. ఇదే నా గట్టి నమ్మకంగా ఉంది. ఎందుకంటే, 'తల్లి' వలన ఏ భయమూ లేదు. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఈ దశను శాంతి (శాంతి దశ) అని చెప్పినట్లయితే సక్రమంగా ఉంటుందని చెప్పవచ్చు. ఇది వింతగా ఉంది. మొన్నటి నుంచి దశలో మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు ఈ దశ రంగులేనిదిగా మార్పు చెందుతున్నట్లు అనిపిస్తోంది. రంగుమయంగా ఉన్న దాని బాహ్యతలం కూడా శుభ్రపడుతున్నట్లు అనుభవమవుతోంది. ఒక విధంగా దశ ఎడారిలాగ అనిపిస్తున్నప్పటికి అది మనస్సుకు చెడుగా అనిపించకపోగా మంచిదిగానే అనిపిస్తూ ఉంది. బాబూజీ ఇప్పుడు మనస్సు ద్రవించిపోయి చిన్నదిగా అయిపోయి నా నుంచి దూరమైపోయినట్లుగాను, మసకబారిపోయినట్లుగాను అనుభవమవుతోంది. పరిశుద్ధం, స్వచ్ఛత లేకుండా మసకగా, సూక్ష్మంగా అయిపోయింది. ఎంతగా తేలికైపోయింది అంటే, అప్పుడప్పుడు అసలు అది ఉందా లేదా అనే సందేహం కలుగుతోంది. ఎందుచేతనో, ఇప్పుడు నా హృదయం, వగైరాలు కూడా ఏమీలేకపోయినట్లు అనిపిస్తోంది. ఇంద్రియాల ఛాయ కూడా అంతరించిపోయినట్లు అనిపిస్తోంది. ఎందుకంటే, నిశితంగా దృష్టి సారించినప్పటికీ, వాటి పని దానంతట అదే జరిగిపోతున్నదా, లేదా అనేది కూడా తెలియటం లేదు. ఇంద్రియాలు బలహీనపడిపోయినట్లు అనుభవమవుతోంది. బాబూజీ, 'తమరు' అయితే నా వారే, కాని నేనేమి చేయను? దీనికిమించి నేనేమీ చేయలేకపోతున్నాను.

పూలోజిజ్జీ ప్రణామం చెబుతూ, ముత్యాల గురించి అడుగుతోంది. తప్పకుండా ఉత్తరం వ్రాయండి. ఈ రోజు తమ ఉత్తరం చేరింది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 336

కాన్పూర్,

28.08.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇంతకుపూర్వం నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. చాలా కాలంగా తమ నుంచి ఉత్తరం ఏదీ రాకపోవటం వలన దిగులుగా ఉంది. నాకు కూడా లేఖ వ్రాయటానికి చాలా తక్కువ సమయం మాత్రమే అందుబాటులో ఉంటున్నది. అందుచేత నా లేఖలకు కూడా ఆలస్యమవుతోంది. ఎందుకో తెలియదు కాని, 'తమ' కృపతో నిండిన ఉత్తరం లేకుండా నాకు ధైర్యం కలగటం లేదు. శ్రీకృష్ణ జన్మాష్టమికి నేను మరియు పూలో జిజ్జి తప్పనిసరిగా ఇక్కడ వ్రత మాచరిస్తాము. నా పైదంతాలు మొన్నటిరోజున పెరికివేయబడ్డాయి. ఇప్పుడు మందు వేయించుకోవటానికి వెళ్ళుతున్నాను. పైదంతాలు మెరుగైన తర్వాత బహుశా 1,2వ తారీఖుల్లో క్రింది దంతాలు పెరికివేయబడతాయి. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఒకసారి మీరాబాయి ఎవరితోనో "ఒక్క శ్రీకృష్ణుడు తప్ప వేరొక మనిషి (పురుషుడు) ఉంటాడన్న సంగతి నాకు తెలియదు" అని చెప్పారు. నాకు ఇప్పుడు ఈ దశలో అదే జ్ఞాపకం వస్తోంది. అసలు 'అతడు' లేకుండా స్వయంగా నేను కూడా లేను. నేను ఇంతకుపూర్వం వ్రాసినట్లు "నేను నా ఆంతరికంలోనే మమేకమై ఉంటున్నాను" అన్నది ఇప్పుడు అలాలేదు, నా ఆంతరికం కూడా ఇప్పుడు కనిపించటం లేదు. **బంగారం, మట్టి కూడా నాకు సరిసమానమే అన్నట్లు ఈ దశలో అనుభూతి కలుగుతోంది.** 25వ తేదీ నుంచి దశలో కొంత మార్పు అనుభవమవుతున్నది. ఇది బాగా అమాయకమైనదానిలాగ ఉంది. ఇప్పుడు శూన్యత్వం మొదలైనవి ఎంతమాత్రం లేకుండాపోయినట్లు అనిపిస్తోంది. ఒక రకమైన స్థిరత్వం మరియు దృఢత్వం వంటి స్థితిలో సాగిపోతూ ఉంది. దానికి 'ఆధారం' అంటూ ఏదీలేదు. ఎందుకంటే, ఈ స్థిరత్వం, దృఢత్వం అనేవి దేనికి సంబంధించినవో తెలియటం లేదు. అయినా కాని స్థితిలో స్థిరత్వం మరియు దృఢత్వం వంటివి ఒక అద్భుతమైన రీతివిగా ఉన్నాయి. దయచేసి 'తమరు' తప్పకుండా నా దశను తిలకించి సరిదిద్దండి. ఎందుకంటే, దశలో స్వచ్ఛత లేదనిపిస్తోంది. తప్పకుండా లేఖ వ్రాయండి. మాస్టర్ సాహెబ్‌గారు బహుశా జన్మాష్టమికి అక్కడ ఉంటారు. వారికి, శుక్లాజీకి నా ప్రణామం తెలియజేయండి. దంతాలకు ఏమి జరిగినా కాని భయపడకుండా, ఏమీ పర్వాలేదన్నట్లు ఉంటున్నాను. పూలో జిజ్జీ, తమకు, మాస్టర్ సాహెబ్‌గారికి ప్రణామం చెబుతున్నది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 337

షాజహాన్‌పూర్,

31.08.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నేను ఒక ఉత్తరం కాన్పూర్ అడ్రస్‌తో 17.08.1953వ తేదీన వ్రాసి పంపాను, కాని నీకు అది అందలేదని తెలుస్తోంది. నీ ఉత్తరాలన్నీ చేరాయి. ఈ రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి. నిన్ను 'U' స్థానం నుంచి ఉన్నత

స్థానానికి ఇప్పుడే తీసుకు వెళ్ళటానికి నా మనస్సు అంగీకరించటం లేదు అని నీకు గతంలో వ్రాశాను. ఇప్పుడు కూడా అలాగే అనిపిస్తోంది. ఎందుకంటే, అది ఎంత మంచి స్థానం అంటే దానిని చూస్తూ ఉంటే నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది.

**ఈ రోజు అందిన నీ ఉత్తరాన్నిబట్టి ఆ స్థానానికి చెందిన రహస్యాలు అన్నీ నీకు అనుభూతి కానంతవరకు నిన్ను అక్కడి నుంచి తొలగించకూడదని అనిపిస్తోంది. దైవానుగ్రహం వలన ఆ రహస్యాలు అన్నీ విప్పారటం ఆరంభమైంది కూడా.** అందుకుగాను నేను నీకు ఒకటి రెండు సిట్టింగులు ఇచ్చాను, ఇంకా ఇస్తాను కూడ.

"కనీసం ఆంతరికం కూడా కనిపించటం లేదు" అని నీవు వ్రాశావు. దానికి అర్థం ఏమిటంటే, బాహ్యాంతరాలు రెండూ సమానం కావటానికి ప్రారంభం కావటమే. అది ఇంకా చాలా జరగాల్సి ఉంది.

సంత్ తుకారామ్ భగవంతుడ్ని చాలా బాగా కీర్తించాడు ఈ విధంగా:

**"బెల్లం కంటె తీయన భగవానుడు,**
**బయట–లోన ఒకే రకంగా."**

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 338

కాన్పూర్,
6.09.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చదివి సంతోషించాను. కేసర్ ఉత్తరం ద్వారా తమ ఆరోగ్యం బాగుండలేదని తెలిసింది. తమరు నాకైతే వ్రాయలేదు. దయచేసి తమ ఆరోగ్య స్థితిని గురించి వెంటనే తెలియజేయండి. నా పైదంత చిగుళ్ళు 26వ తేదీకే కత్తిరించబడ్డాయి కాని ఎక్కువగా కత్తిరించటం వలన బాగవటానికి సమయం పట్టుతుంది. **మొన్నటినుంచి 4 క్రింది చిగుళ్ళు రోజూ సరిచేస్తున్నారు కాని పూర్తిగా తొలగించటం లేదు త్వరలో బాగుపడాలని. 'మాలిక్' యొక్క అపారకృప మూలంగా నొప్పి కొంచెం కూడా ఉండటం లేదంటే తమరు నమ్మాలి. ఇప్పుడు నా 'మాలిక్' ఏమిటో నాకు తెలిసింది. అటువంటి విశ్వాసం, భక్తి, ప్రేమ ఉండటంచేతనే భక్త ప్రహ్లాదుడు అగ్నిలో ప్రవేశించాడు. అలాగే పర్వతం మీద నుంచి త్రోసినా కూడా కనీసం మూలగనైనా మూలగలేదు.** ఎందుకంటే, ఆ సమయంలో అతడు భౌతిక శరీరానికి అతీతంగా ఉన్నాడు. శ్రీ బాబూజీ, ఎందుకోగాని ఆ దంత వైద్యుడు మంచి గుణం ఉన్నవాడిగా నాకు కనిపించటం లేదు. అయితే ఎవరి నేత్రాల్లోను, శరీరమంతటిలోను శ్రీ బాబూజీ వ్యాపించి ఉంటారో, ఎవరైతే ఒక్క క్షణకాలం కూడా ప్రయత్నించినప్పటికీ అన్యులెవ్వరినీ అనుభూతి చెందరో, ఎవరైతే కేవలం బాబూజీని చూస్తారో, ఎవరిలోనైతే ప్రాపంచిక నీడలు కూడా కనుమరుగైపోతాయో, అటువంటి వారికి ఇతరులతో పనేముంటుంది. ఎవ్వరితో హాని కలుగుతుంది! అదేమిటో 'తమ'కే తెలుసు. ఒకవేళ 'తమ'కు ఈ విషయంలో నాకు ఏదైనా ఉపాయం చెప్పాలనుకుంటే, డాక్టర్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నాకు మాత్రమే ఆ పరిష్కారం తెలియజేయండి. సెప్టెంబర్ నెలాఖరుకు దంతాల చిగుళ్ళు బాగవుతాయి. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను. సమయం తక్కువగా ఉండటం వలన, కొద్దిగా కష్టం కలగటంవల్లను, స్థితిని గుర్తించి డైరీలో వ్రాయటానికి ఆలస్యమైనందుకు క్షమించగోరుతున్నాను.

ఇప్పుడు లోన, బయట అన్నీ కూడా సమానంగా అయిపోయాయి. అలాకాదు, నా లోన అంటూ ఏదీలేదు, బయట అంటూ లేదు, ఏదీ అనుభూతికి రావటం లేదు అని చెప్పాల్సి ఉంటుంది. ఒక స్వచ్ఛంగా ఉన్న మైదానం, ఎటువంటి గీతలు లేనటువంటిది మాత్రమే కనిపిస్తోంది. మనస్సు అతివినయంగా ఉంటున్నది, ఇంకో రకంగా

చెప్పాలంటే, **వినమ్రతయే నా రూపంగా ఉంది. అలాకాదు, నమ్రత అనేది స్వయంగా నా నుండియే ఉత్పన్నమవుతున్నట్లు అనుభూతి చెందుతున్నాను.** బాబూజీ, ఏం జరిగిందో దైవానికే తెలియాలి. మనస్సు ఏ విషయం గురించైనాగాని ముందు వెనుకలు ఆలోచించటం లేదు, ముందు వెనుకల ఆలోచనలే రావటం లేదు. **దశలో నిబ్బరం, నిశ్చలత్వం, స్థిరత్వం ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి.** అది ఎలాగంటే, ఆ స్థితి యొక్క భారం నా మీద ఉండటం లేదు. మనస్సు నిబ్బరంగా (నిక్కచ్చిగా) ఉంది. అది ఎలా అంటే, ఒక అమాయక బాలికలాగ ఉంది. నా 'మాలిక్', ఒక అసాధారణ విధమైన మరపు స్థితి నడుస్తోంది. అది ఒక వెర్రివాడు తన లోకంలోకి చేరుకుని సమస్తం మర్చిపోయినట్లు ఉంటుంది. అతడు తను పిచ్చివాడు అన్న సంగతి కూడా మర్చిపోయి ఉంటాడు. నా పరిస్థితి ఇలాగే ఉంది. ఈ దశలో సడలని దీక్ష ఉన్నట్లు ఉంది. దానిని ఎలా పోల్చవచ్చు అంటే, 'మాలిక్' పేరు చెప్పి ఎవ్వరైనా నన్ను ఇంటి పైకప్పు నుంచి దూకమని ఆదేశిస్తే ముందు వెనకల (ఫలితం) చూడకుండా అనగా మనసుతో ఆలోచించకుండానే అలాగే జరిగిపోతుంది. అంతేగాక ఆ విధంగా దూకమని చెప్పిన వానిపట్ల మనస్సులో ఎటువంటి పగగాని, చెడు ఆలోచనలుగాని కలగటం లేదు. పైగా అతడు నా వాడుగానే గుర్తించబడతాడు. ఇదొక ఉదాహరణగా తమకు వ్రాశాను. ఇప్పుడు స్థితి ఎలా ఉంది అంటే, నిశ్చలత్వం యొక్క భారం కూడా నాకు తెలియకుండా ఉంది. ఇప్పుడు హృదయంలో ఇంక వేటిపైనా స్థానం లేదన్నట్లు భావన కలుగుతోంది. స్థానం అనేది లోపలగాని, బయటగాని లేదు. ఎందుకంటే, ఇప్పుడు లోపల, బయట అనేది తావులేకుండా పోయింది. నేను మరుపు స్థితిలో ఉన్నానన్న సంగతి కూడా జ్ఞాపకం రావటం లేదు. మనస్సు మామూలుగానే ఉంటున్నది. అదేమిటో దైవానికే తెలియాలి, నా హృదయం ఎందుకు రాయిలాగా అయిపోయింది అయింది అని. అది ఎంత గట్టిగా అయిపోయింది అంటే, దానిమీద ఎటువంటి గీతలు పడనంతగా. కాని రాతికి కూడా నిత్యం నీళ్ళతో నిండిన బకెట్టుకు ఉన్న తాడు రాపిడితో అరిగి కొన్ని గీతలు పడతాయి. కాని ఈ హృదయమనే రాయి మీద అలా కాదు. శ్రీ బాబూజీ, ఇప్పుడు నా స్థితిలో, స్వయంగా నా మనస్సు యొక్క భారం కూడా నా మీద లేకుండా పోయింది. ఇప్పుడు ఎటువంటి బాంధవ్యం లేకుండా నిశ్చింతంగా ఉన్నాను. అయినా కొంత తపనైతే ఉంది.

తమ ఆరోగ్య స్థితిని తెలియజేయండి. లఖీంపూర్ నుంచి కేసర్ వ్రాసిన లేఖ ద్వారా అమ్మగారు కూడా ఇంకా బలహీనంగా ఉన్నట్లు తెలిసింది. పూలో జిజ్జి మరియు జీజాజీ తమకు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 339

షాజహాన్‌పూర్,

16.09.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం చేరింది. నా ఆరోగ్యం ఇప్పుడు బాగుంది. దైవానుగ్రహం వలన నీ స్థితి ఇప్పుడు చాలా బాగుంది. అయితే నిన్ను 'U' స్థానం నుండి ఉన్నతంగా తీసుకువెళ్ళటానికి ఇప్పటికీ నా మనస్సు అంగీకరించటం లేదు. దీనిలో కూడా 'మాలిక్' అభీష్టం ఉండి ఉండవచ్చు. నాకు మాత్రం ఈ స్థానాన్ని చూసి పట్టరాని ఆనందంతో హృదయం పరవశించిపోతోంది. ఇది ఇంకా విచ్చుకుని తద్వారా మంచి శాంతి, సామ్యావస్థ (సమతుల్యత) మరియు నిరాడంబరం అనుభవానికి రాగలవు. దానిని గురించి నాకు తెలియజేయాలి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 340

కాన్పూర్,
17.09.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమరి నుంచి ఉత్తరం ఏమీ రాలేదు. అందుచేత హృదయం చాలా దిగులుగా ఉంది. తమ ఆరోగ్యం బాగానే ఉందని ఆశిస్తున్నాను. కేసర్ ఉత్తరం ద్వారా, ఎవరో పిచ్చిదాని మీద 'మాలిక్' మళ్ళీ తమ దయ చూపినట్లు తెలిసింది. దయచేసి ఆ అదృష్టవంతురాలు ఎవరో, ఎక్కడ నుంచి వచ్చారో వ్రాయండి. తమరు అధికంగా శ్రమించడం వలన బలహీనపడి ఉంటారు. ఈశ్వరుడు 'తమరి'ని శీఘ్రాతి శీఘ్రంగా ఆరోగ్యవంతులుగా చేయాలని కోరుతున్నాను. నా క్రింది దవడ చిగుళ్ళు కూడా పూర్తిగా కత్తిరించబడ్డాయి. ఇప్పుడింక రెండు దవడల చిగుళ్ళు మానటానికి సమయం పడ్తుంది. 10 రోజుల్లో మానవచ్చని డాక్టర్‌గారి అంచనా. ఇతర జబ్బుకు హోమియోపతి వైద్యం ఉంది. దాని ఫలితం బాగా ఉంటుంది. బాబూజీ, తమరు దసరా శెలవులకు లఖీంపూర్ తప్పక దయచేయాలి. తమర్ని చూడటానికి, తమర్ని కలవటానికి హృదయం ఎంతగానో తపన చెందుతోంది. అప్పుడప్పుడు నా మనస్సు చాలా విరక్తి చెందుతుంది. కాని 'ఎవరో' నా తలంపును కట్టడి చేయటం వలన నేను వ్యక్తం చేయలేకపోతున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, నా హృదయం ఇప్పుడు దృఢమైన డాలు (కత్తివాటానికి అడ్డుపెట్టుకునేది)లాగా అయిపోయింది. దానిపైన కత్తితో కొట్టినట్లయితే కత్తియే విరిగిపోతుంది కాని డాలుకు ఏమి నష్టం వాటిల్లదు అన్నట్లు తోస్తోంది. నా హృదయం ఇప్పుడు అంతా స్వచ్ఛంగా, ఏమీ ప్రభావంతంకానిదిగా ఉంది. అయితే హృదయం ప్రభావితం కాకపోవటమా లేక మరేదైనా అనే ఆలోచన నుంచి కూడా నేను నిద్రలోలాగా పట్టించుకోకుండా ఉంటున్నాను. బాబూజీ, జనం త్యాగవంతులుగాను, వైరాగ్యవంతులుగాను ఎప్పుడు, ఎలా అవుతారు అనేది నాకు అర్థం కావటం లేదు. నాకు త్యాగం, వైరాగ్యం అంటే ఏమిటో తెలియదు. ఇదొక స్థితిగా ఉంది. ఇంకొక స్థితి ఎలా ఉందంటే, భక్తి గురించి తెలియదు, ప్రేమను గుర్తించటం తెలియదు. నా హృదయం ఎంత సున్నితంగా అయిపోయింది అంటే, ఇపుడు ఏ విషయమైనాగాని దాని ప్రభావం హృదయం మీద పడనివ్వటం లేదు. నాకు తెలిసినంతలో, ఇపుడు సెయింట్స్, మహాత్ములు, ఫకీర్లు, అందరూ నా అవగాహనకు అంతుచిక్కనివారుగా ఉన్నారు.

బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, నా హృదయం కేవలం ఒక రాయిలాగా అయి ఎటువంటి తడి లేకుండా ఉంది అని చెప్పగలను. దానిపై ఎటువంటి గీతలు గీయలేము అన్నట్లు ఉంది. నేను ఇపుడు గీసిన గీతలో నడిచే ఫకీరును కాను, మరేమిటో తెలియదు. నేను మాత్రం శూన్యంగా ఉన్నాను. నేను ఏ పూజ చేయటం లేదు. ఏ నామ జపమూ చేయటం లేదు. గమ్యం చేర్చటమా, లేదా అనేది నా 'మాలిక్' ఇష్టం. ఈ దశ ఏమిటో నాకు తెలియటం లేదు. దీనిలో అమాయకత్వం లేదు, కేవలం (నిర్లిప్తం) ఖాళీగానే ఉన్నాను, కోరిక కూడా ఏమీ కలగటం లేదు. సహజంగా 'మాలిక్' కృపతో నా శరీరం పట్టుదలతో శక్తివంతం అవుతుంది. కాని తమ నుంచి చాలా కాలంగా ఉత్తరం రాకపోవటం వలన ఆ ఉత్సాహం కలగటం లేదు. పెద్ద సోదరుడు ప్రయాణిస్తున్న రైలు సీతాపూర్ వెళ్ళింది. లఖీంపూర్ నుంచి అమ్మ, తావూజీ వగైరా జనం చూసి వచ్చారు. అలహాబాద్ నుంచి బడెబాబా, విమల మొదలైనవారు అక్కడకు రమ్మని కోరారు. అవకాశం ఉంటే 4,5 రోజులకు వెళ్తాను. వ్రణాలవంటివి పూర్తిగా నయమైపోతే, వారు భాయిసాహెబ్‌ను పంపుతామని వ్రాశారు.

బాబూజీ, ఇప్పుడు ఈ దశ ఎలా ఉందంటే, ఉపరితలం అంతా కూడా (Marble pieces) చలువరాతి పలకలు పరచి ఉన్నట్లు ఉంది. ప్రస్తుతం నా దశ నరసీ అనే సెయింట్ చేతిలో కాగడా పట్టుకుని ఉండగా, అది

పూర్తిగా కాలిపోయాక, ఆఖరికి అతడి హస్తం కూడా సగభాగం దహించుకుపోయింది. అయినా అది అతనికి పట్టలేదు (అనగా అంత పారవశ్యంలో ఉన్నాడు) అన్నట్లు ఉంది. ఇప్పుడు నిరంతరం నాలో ఈ దశయే ఉంటోంది. అయితే నా 'మాలిక్' తన ఈ బిడ్డకు అటువంటి ప్రమాదం జరగనివ్వరు. ఇప్పుడైతే అదేమోగాని అన్నిరకాల మర్యాదలు జరుగుతూనే ఉన్నాయి. అది తమకు తెలిసినదే. ఇప్పుడు తమరు దయచేసి రెండు ఆశీర్వచన వాక్యాలు వ్రాసి పంపండి. ఇప్పుడైతే నేను స్పృహలోగాని, స్పృహ లేకుండాగాని ఉన్నాను. ఇదివరకు ఎలా ఉన్నానో అలానే 'తమరి' ఎదుట ఉన్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 341

కాన్పూర్,

18.09.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ కృపతో వ్రాసిన ఉత్తరం సాయంత్రం అందింది, చాలా ప్రశాంతత, సంతోషం కలిగాయి. పెద్దసోదరుడు (తులసీదాస్) తమవద్దకు వచ్చినట్లు చదివి తృప్తి కలిగింది. నాకు అతడిని చూడాలని కోరిక తీరి సంతృప్తి చెందాను. నేనొక ఉత్తరం వ్రాసి ఉదయమే పోస్టు చేశాను. దానిలో నా స్థితి అంతా వ్రాశాను. శరీరం పూర్తిగా చల్లబడిపోయినట్లు ఉంది. తమ బలహీనత, శ్రమ ఎందుకోగాని తరచుగా నా అనుభవానికి వస్తూ ఉండేవి, అయితే దానికి కారణం ఇప్పుడు తెలిసింది. నిజం చెప్పాలంటే, తమకు వినయం ప్రదర్శించటంలో కొంత కష్టం, శ్రమ తీసుకోవాల్సి ఉంటుంది. ఇటువంటి విషయాలలో తమకు ఎంతమాత్రం మేము కష్టం కలిగించకుండా ఉండాలి. తమ శరీరం యొక్క ప్రతి అణువును నా కనుబొమ్మలమీద నిలుపుకోవాలని నేను కోరుకుంటున్నాను. కాని ఏదో ఒకవైపు నుంచి నిస్సహాయరాలనవుతున్నాను. 'మాలిక్'కు కోరిక కలిగినపుడు 'U' పాయింట్ నుంచి నన్ను కదపగలరు. పురోగమనం చెందాలనేగాని ఇంకేమీ నాకు లేదు. నేను ఫూలో జిజ్జితో ముత్యాలు గురించి అప్పుడే చెప్పాను. ఆమె ఇప్పుడు తీసుకోవద్దు అని చెప్పారు.

నా నాలుగువైపులా 'చక్రం' ఉన్నట్లు నేను శ్రద్ధగా పరిశీలించాను. నా 'మాలిక్' యొక్క కృపతోను మరియు 'అతని' ఆధారంతోనే నేను స్వతంత్రంగా (రాగద్వేషాలు లేకుండా) ఉంటున్నాను. ఈ చక్రాన్ని చూసి నేను నిశ్చింతగా ఉన్నాను. వాని (డాక్టర్) పత్ని మాత్రం చాలా గుణవంతురాలు మరియు ధార్మికురాలు. 'తమరు' అతనికి మానసిక దౌర్బల్యం ఉంది అని వ్రాసిన మాట ఖచ్చితంగా నిజం. అందుకు తగ్గట్లుగానే అతనికి తలనొప్పి కూడా ఉంది. జ్వరం కూడా ఉంది. కాని అతడు వీటిమీద దృష్టి పెట్టడం లేదు. అతని వివేకశక్తి నశించిపోయింది. అయినప్పటికి 'మాలిక్' యొక్క ఈ భక్తురాలి కొరకు అతడు అపవిత్రమైన భావాలు త్యజించాల్సి ఉంటుంది. ఇదే నా విశ్వాసం.

నాకు ఆ వెర్రివాని గురించి బాధ కలుగుతోంది. ఎందుకంటే, అతడు 'మాలిక్' యొక్క శక్తిని ఎంతగానో దుర్వినియోగం చేస్తున్నాడు. తమ బలహీనతను ఈశ్వరుడు శీఘ్రంగా బాగుచేయాలని నేను హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. ఈ పిచ్చివాడు (డాక్టర్) తమరినే కలుసుకోవాలని అనుకుంటున్నాడు. కనుక తమరు దసరాకు లఖీంపుర్ వస్తారనే అనుకుంటున్నాను. వీలుపడితే తావూజీని సంప్రదించి 6,7 రోజులు అలహాబాద్‌లో ఉండి వస్తాను, వారు మరీ మరీ అడుగుతున్నారు కనుక. అక్కడ ఒకరిద్దరు అభ్యాసులు పెరగవచ్చు. అది దైవానికే తెలుసు. నా క్రింది దవడ దంతచిగుళ్ళు అన్నీ కూడా కత్తిరించబడ్డాయి. గాయాలు త్వరగా నయం కాగలందులకు అవి నిర్జీవం చేయబడలేదు. అయితే నాకు ఎటువంటి బాధ కలగలేదు. 'మాలిక్' యొక్క మనోహర రూపం నా కళ్ళలో మెలుగుతూ

ఉన్నందువల్లనే నొప్పి కలగలేదు. చేతులకు రోజూ ఒక ఇంజక్షన్ ఇస్తున్నారు. ఏమీ కష్టమనిపించటం లేదు, కనుక ఏమీ ఆలోచించవద్దు. ఇంకా 8,10 రోజులు పట్టుందని డాక్టర్ చెప్పారు. చిగుళ్ళు అర అంగుళం చొప్పున కత్తిరించబడినప్పటికీ, బాధ కలగటం లేదు. ఇదే ఆశ్చర్యపడాల్సిన విషయం. హృదయంలో సరళత్వం ఉంది, అయితే అది (Vibrationless surface) స్పందనలేని ఉపరితలం ఏర్పడినట్లుగా అనిపిస్తోంది. పూలో జిజ్జి తమకు ప్రణామం చెబుతున్నారు. తప్పకుండా ఉత్తరం వ్రాయండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 342

కాన్పూర్,

25.09.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరాలు చేరాయి. ఇప్పుడు పూజ చాలా తక్కువగా ఉంటోంది. దాదాపు అసలు లేనట్లుగానే ఉంది. నేను మాత్రం 'మాలిక్' కృప మీదనే ఆధారపడి ఉన్నాను. ఇపుడు పురోగతి మధ్యస్థంగా లేక నిదానంగా ఉంది. ఇప్పుడు స్థితి, ఒక నిరర్థకమైన మైదానంలాగ ఉంది. దశలో తళుకు బెళుకుగాని, ఉత్సాహంగాని లేవు. నా శారీరక స్థితి బాగుండ లేదు, కాని నెమ్మది నెమ్మదిగా దారికి వస్తోంది. కనుక చింతించాల్సిన పనిలేదు. దయచేసి నా ఆధ్యాత్మిక దశను గమనించమని కోరుతున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 343

షాజహాన్‌పూర్,

28.09.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు అందాయి. 24.09.1953వ తేదీ ఉదయం గం. 8.30 ని॥లకు నేను నిన్ను 'V' స్థానం మీదకు చేర్చాను. నీవు ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నావు. సాధ్యమైనంతవరకు నీవు అలహాబాద్ వెళ్ళాలి. దాని వలన అక్కడ ఉన్న వారందరికీ లాభం చేకూరుతుంది. జడ్జిగార్కి కూడా సిట్టింగ్ ఇవ్వు. నాకు ఆయన హృదయాన్ని సాలీడు వల లాంటిదిగా క్రమ్మి ఉన్నట్లు అనిపిస్తోంది. ఆయన పూజ ఆదిలోనే తప్పుదారి పట్టడమే ప్రధాన కారణంగా ఉంది. ఆయన పార్వతి (శివుని భార్య) రూపం మీద ధ్యానం చేస్తూ ఉండేవారు.

నీవు **కొద్దిరోజులు వ్యాధి నివారణ కొరకు ధ్యానం చేయటం మంచిది.** నీకు ఒకానొకప్పుడు ఈ విధానం గురించి చెప్పి ఉన్నాను. అది ఏమిటంటే, **పొగ రూపంలో, వెనుక నుంచి వ్యాధులన్నీ తొలగిపోతున్నట్లుగాను, బ్రహ్మాండ మండలం నుంచి శక్తి వస్తూ, అది వ్యాధులన్నిటిని తొలగిస్తున్నట్లుగాను భావన చేయాలి.**

అమ్మగార్కి ప్రణామం.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 344

కాన్పూర్,
30.09.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు చేరింది. చదివి సంతోషించాను. నన్ను 'V' స్థానం మీదకు చేర్చినందుకు తమకు అనేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. అమ్మ వచ్చి 5,6 రోజులు అయ్యింది. నా చక్రాన్ని తేలిక చేశారు. ఇది బాగానే ఉంది. ఎందుకంటే, దాని అవసరం ఈ స్థాయిలోనే ఉండాల్సి ఉంది. 'మాలిక్' యొక్క కృపాబలంతో ఆతని సేవకులు (భక్తులు) స్వతంత్రులుగా, నిర్భయంగా సంచరిస్తుంటారు. నేను నా 'మాలిక్'ను పొంది తృప్తి చెందాను, కాని అది ఇంకా పూర్తిస్థాయిలో కాదు. అయితే నేను 'వారి' దానినే అయిపోయాను. అది తక్కువగానో, ఎక్కువగానో, మాలిక్‌కే తెలుసు. బాలికకు 'తల్లి' కావాలి (అనగా బిడ్డయైన తనకు 'తల్లి' వంటి 'మాలిక్' కావాలి అని అర్థం). అలహాబాద్ వెళ్ళటానికని విమలకు– సోదరునితోపాటు నేను తప్పక అక్కడకు వస్తానని చెప్పి లేఖ వ్రాస్తున్నాను. 'మాలిక్' కృపతో చాచాగారి హృదయం చుట్టూతా వ్యాపించిన సాలీడు వల లాంటిది ఉన్నట్లు, తమరు వ్రాసినది తొలగిపోతుంది. తమరు 'ఈతహ్' వెళ్ళటం మంచిదే. అవకాశం ఉంటే మేము, తమర్ని అక్కడ తప్పక కలుస్తాం. 'మాలిక్' కృపతో ఇప్పుడు ఉన్న పాయింట్‌కు ఆ ముందు ఉన్న ఉన్నత పాయింట్‌కు చేరతానన్న శుభవార్త అందుతుందని ఆశిస్తున్నాను. తమకు ఇప్పటికీ ఆ పాయింట్‌కు చేరే యాత్ర గురించిన చిహ్నాలు నాలో కల్పించలేదా? నా చిగుళ్ళు ఇంకా నింపబడలేదు. డాక్టర్‌గారు బహుశా 5,6 రోజుల్లో వెళ్ళటానికి అనుమతించవచ్చు, అయినా కాని అవకాశం తక్కువే అనిపిస్తోంది. నన్ను డాక్టర్‌గారు 2 నెలలు భోజనం మానివేయమన్నారు. 8 రోజులు గడిచాయి. 'మాలిక్' కృప నన్ను నడిపిస్తోందని, శక్తిని ఇస్తోందని తమరు విశ్వసించండి. అన్నం తినకుండా 8 రోజులు గడిపాను అంటే ఎవరైనా ఆశ్చర్యపడతారు. నాకు జీవన ప్రదానం చేస్తున్న 'మాలిక్' యొక్క ఈ నిరంతర కృప వారికి ఏం తెలుసు. పొట్టవాపు కూడా తగ్గుతూ ఉంది. ఆనందంలో తలమునకలవుతున్నాను. ఎంతమాత్రం చింతించాల్సిన అవసరం లేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మికదశను వివరిస్తున్నాను.

ఇప్పుడు, నేను శూన్యం వంటి ప్రదేశంలో ఉన్నాను. స్థితిలో కూడా శూన్యత ఉంది. ఈ దశలో క్రితం దశలోలాగా పవిత్రత ఎందుకు అనుభవం కావటంలేదో తెలియటం లేదు. దశలో ఇంకా (ఖాళీతనం) శూన్యత్వం ఏర్పడినట్లు అనుభవమవుతోంది. పవిత్రతగాని, అపవిత్రతగాని లేవు. శూన్యతా దశ కూడా శూన్యమైపోయినట్లు ఉంది. దశ అయితే ఇలాగే ఉంది అంటే– **"భక్తి లేకుండానే నాకు ముక్తి కలిగించినట్లయితే నీ శక్తి యొక్క ఘనత ఉంటుంది"** అని. కాని మనస్సు మాత్రం ఈ భావాన్ని స్పర్శించటంలో శూన్యమై పోయింది. ఇంక ఈ శూన్యత ఏమిటంటే, బహుశా అది ఒక బంజరుభూమిలాగా అయిపోతూ ఉంది.

అమ్మ తమకు శుభాశీస్సులు చెబుతున్నారు, మిగిలినవారు ప్రణామం చెబుతున్నారు. తమ ఆరోగ్యం బాగవుతుందని ఆశిస్తాను.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 345

కాన్పూర్,
4.10.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ రెండు పోస్టుకార్డులూ అందాయి. సమాచారం అందింది. హోమియోపతి మందుతో వైద్యం అయిపోయింది. ఎక్కడ ఉన్నాగాని వారానికి ఒకసారి పరిస్థితి తెలుపుతూ ఉత్తరం వ్రాస్తే, మందులు ఇస్తానని డాక్టర్‌గారు చెప్పారు. తమరు ఏమి చేయాలో వ్రాస్తే అలాగే చేస్తాను. ఇక్కడ కొన్ని ఫ్యాక్టరీల తగవుల మూలంగాను, ఇంక ఇతర కలహాలవల్లనూ అప్పుడప్పుడు మనసు వ్యథ చెందుతుంది. వ్రాయాలనే అభిప్రాయం మనసులో ఉన్నప్పటికీ డైరీ కూడా వ్రాయలేకపోతున్నాను. స్థితిని కూడా మరచిపోతున్నాను. 'మాలిక్' ఎలా కావాలనుకుంటే, నేను ఆ విధంగానే చేస్తాను. తమ బలహీనత ఎలా ఉంది? తమరు 'ఈతమ్' వెళ్తారా, లేదా? అక్కడి నుంచి ఆహ్వానం వచ్చిందా, రాలేదా? బహుశా తమరు లఖీంపుర్ రాలేరనుకుంటాను.

నా ఆధ్యాత్మిక దశను గురించి ఏమని వ్రాయను, స్థితిలో పరిశుద్ధత కనిపించటం లేదు. ఆధ్యాత్మిక యాత్ర ఇంకా ప్రారంభం కాలేదనుకుంటాను. దశలో వేగం కూడా ఉన్నట్లు లేదు. బహుశా ఈ కారణం వల్లనే శరీరంలో చురుకుదనం కూడా తక్కువగానే ఉంది. బాబూజీ, తమరు వారం రోజుల తర్వాత నా స్థితిని గురించి అడిగారు, నేను తప్పక వ్రాస్తాను. తమరు అధికంగా శ్రమపడవద్దని నా కోరిక. బలహీనతకు చెందిన త్రుళ్ళిపాట్లు వస్తున్నాయి, అవి తగ్గిపోతాయి. వీటిని గురించి తమరు నిశ్చింతగా ఉండండి. దయచేసి నా ఆధ్యాత్మిక దశల మీద దృష్టి నిలపండి. ఎందుకంటే, ఈ విషయంలో తమరు ఎప్పుడూ శ్రద్ధ, కృప చూపుతూనే ఉన్నారు. **స్థితి సరిగ్గా ఏర్పడనంతవరకు నాకు శాంతి లేదు. ఎందుకంటే, అదే నాకు ఆహారంగా ఉంది కనుక. 'మాలిక్' కృపా రూపమైన అమృతం వంటి పాలు సేవించి ఈ బాలిక (కస్తూరీజీ) పెరిగి పోషించబడుతోంది.** నా జ్ఞాపకంలో ఏదైనా లోపం ఉంటే, తెలియజేయండి. ఎందుకంటే, నాకు ఇపుడు ఈ తెలివి కూడా లేకుండాపోయింది. స్థితి తేలికగానే ఉందని వ్రాసేకంటే, దాదాపుగా లేదు అంటే బాగున్నట్లు అనిపిస్తోంది. ఏది ఏమైనప్పటికీ, నేను ఏ పరిస్థితుల్లో ఉన్నాగాని, ఎక్కడ ఉన్నాగాని, మనసు మరియు హృదయం యొక్క **శాంతి, ఏకాగ్రత, ఆనందం, స్థిరత్వంలో ఏ తేడా లేకుండా ఉండటాన్ని చూస్తున్నాను.** ఇంకా చెప్పాలంటే, అవి వృద్ధి చెందుతున్నట్లుగాని, చెందనట్లుగాని అనిపించటం లేదు. దృఢ నిశ్చయం సడలకుండానే ఉంది. అది ఎలా ఉందో అలాగే ఉంటోంది. దశ కొంచెం మారుతూ ఉంది.

అమ్మ ఆరోగ్యం బాగానే ఉంది కాని, ఎడమవైపు తుంటి ఎముక బాధ తగ్గలేదని చెబుతున్నారు. దయచేసి తమ ఆరోగ్యం గురించి కూడా తప్పకుండా వ్రాయండి. అమ్మ తమకు శుభాశీర్వాదాలు చెబుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 346

కాన్పూర్,
8.10.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందిందని భావిస్తున్నాను. అమ్మగారు ఎల్లుండి లఖీంపుర్ వెళ్తారు. 'మాలిక్' కృపతో నాకు బలహీనత తగ్గింది. పొట్టలో వాపు ప్లిహం, ప్రేగుల్లో స్థితి దాదాపు అలాగే ఉంది. ఉప్పు నీటితో కాపుపెట్టమన్నారు. ఏదైనా పేటెంట్ మందులు డాక్టర్ ఇస్తే నేను కూడా అమ్మగారితోపాటు వెళ్తాను.

ఇంకో విషయం ఏమిటంటే, పూలో జిజ్జి శెలవులయ్యేవరకు నన్ను ఉండమంటోంది. ఎందుకంటే, పిల్లల శ్రద్ధ తీసుకుని చదివిస్తానని, అయితే నా మనస్సు కూడా దిగులుపడుతోంది. టట్టీ కూడా టెస్టులు చేయించింది. 22 రోజులు ఆహారం తీసుకోకపోయి నప్పటికి, 'మాలిక్' కృప మూలంగా విపరీతమైన బలహీనత కలగనివ్వలేదు.

తమరు ఒక వారం రోజుల్లోని పొందిన స్థితులన్నీ పూర్తిగా వ్రాయమని చెప్పారు, కనుక వ్రాశాను. నేను బాగానే తిరుగుతున్నాను, కనుక తమరు చింతించవద్దు. ఇక్కడ డైరీ వ్రాయటానికిగాని, ఉత్తరం వ్రాయటానికిగాని సమయం చిక్కటం లేదు. అందుచేత మనస్సు కొంత సోమరితనంగా ఉంటోంది. 'మాలిక్' కృప ఎలా ఉంటే అలా జరుగుతుంది. నా ఆత్మిక దశ చాలా తేలికగాను, మృదువుగాను, సరళంగాను నడుస్తోంది. పూజ నేను చేస్తున్నానో, లేదో తెలియటం లేదు. ఈ దశ లోపల, బయట అంతా సమానంగానే ఉన్నట్లు తెలుపుతోంది. శ్రీ బాబూజీ, నా స్థితి ఒక (Rock of Marble) చలువరాతి బండలాగా ఉంది. అది మిరుమిట్లుగొల్పని చలువరాయి వంటిదని చెప్పవచ్చు. ఒకసారి తమరు తమ ఉత్తరంలో ఉప్పదనం లేని ఉప్పు వంటిది అని వ్రాశారు. ఇప్పుడు 'మాలిక్' దయతో నేను ఆ దశనే అనుభూతి చెందుతున్నాను. ఆ విధంగా కల్పించేవారు తమరే కనుక అంతా తమకే తెలుసు. ఇంకొకటి నేను స్పష్టంగా చూస్తున్నాను, ఏమిటంటే నేను సర్వత్రా కీర్తించబడుతున్నాను. ఇది 'మాలిక్' యొక్క అభీష్టమే అవ్వటం వలన ఇలా జరుగుతున్నదని భావిస్తున్నాను. దీనిని గురించి నేను అంతగా పట్టించుకోను, ఎందుకంటే **శరీరాన్ని పోషించటానికి ప్రాణం ఎటువంటిదో, అదే విధంగా సేవకురాలికి ఉన్నతిని కల్పించేవాడు ఆ 'స్వామి'యే. ఆ తల్లి యొక్క కృపారూపమైన అమృతం వంటి పాలను సర్వదా సేవిస్తూ ఈ బాలిక (కస్తూరీజీ) పుష్టికరంగా అవుతోంది.** నా జ్వరం ఈరోజు తగ్గిపోయింది, చింతించాల్సిన అవసరం లేదు. **నాకు ఉన్న ఒకే ఒక్క కోరిక ఏమిటంటే, నా 'మాలిక్'ను పొందాలని, అతడినే చూస్తూ ఉండాలి అని.** అంతుకుమించి మరేమీ లేదు. ఇంకా ఏమి చెప్పమంటారు, శెలవులవరకు నా మనసు అక్కడనే ఉంటుంది. ఎందుకంటే, ఆ సందర్భంలో తమరు ఇక్కడకు వస్తూ ఉంటారు కనుక. ఏమైనా కానివ్వండి, నేను సదా 'మాలిక్' దగ్గరనే ఉన్నాను. 'అతడు' నా వద్దనే ఉన్నాడు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 347

కాన్పూర్,

18.10.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన పోస్టుకార్డ్ మొన్న చేరింది. సర్వేష్‌కు టైఫాయిడ్ వచ్చిందని తెలిసి అందరం విచారపడుతున్నాం. ఈ దసరాకు అక్కడకు చాలా మంది వచ్చి ఉంటారు. (పినతండ్రి) బడెబాబాగారి హృదయం మీద, లోగడ తమరు చెప్పిన సాలీడు వల వంటిది ఇప్పుడు లేదు. అక్కడకు (షాజహాన్‌పూర్‌కు) వస్తే లాభానికి లాభం, ఆనందానికి ఆనందం మరియు ఆత్మ సంతోషం సమకూరతాయి. నా ప్రేగుల టి.బి గురించి 8 ఇంజక్షన్‌లు ఇవ్వబడ్డాయి. నిన్నటి నుంచి ఉదరవాపులో తేడా ఉంది. నిన్న అనగా 36 రోజులు తర్వాత నేను పప్పు పదార్థం తీసుకున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న ఈ దశలో సర్వేంద్రియాలు శాంతించి తమ తమ స్థానాల్లో స్థిరంగా ఉన్నాయని అనిపిస్తోంది. వాటి ప్రత్యేకతయే లేకుండా పోతోంది, కేవలం మసకబారిన నీడ మాత్రమే ఉంది. దశ ఇప్పుడు చాలా సౌమ్యంగాను, సరళంగాను నడుస్తోంది. దశ ఇప్పుడు చాలా తేలికగాను, మసకగాను మరియు ఒక పరదా లేక ఉపరితలంగాను అయిపోయింది. బాబూజీ, ఇప్పుడు అన్నివైపులా, అన్నిచోట్ల ఈ దశయే కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు

పాయింట్ 'V' యొక్క విహారం, 'మాలిక్' దయతో ప్రారంభమయ్యింది. కేవలం ధూళి దూసరితమైన, మసకబారిన ఉపరితలం వంటిది మినహా మరేమీ నాకు కనిపించటం లేదు. దశ యొక్క రంగు తెలుపు కాకుండా, స్వచ్ఛంగాను, పారదర్శకంగాను ఉంది. ఇది పవిత్రమైన రంగు లేక ఉపరితలం కావచ్చు. మైండ్, చేయి సరిగ్గా పని చేయలేకపోవటం వలన ఇంతకుమించి వ్రాయలేకపోతున్నాను. చింతించాల్సిన అవుసరం లేదు. 'మాలిక్' దయతో అన్నీ సర్దుకుంటాయి. ఒకవేళ నేను ఉత్తరం వ్రాయటంలో ఆలస్యమైతే ఏమీ చింతించవద్దు. బలహీనత కారణంగా, దశ యొక్క అనుభూతి పొందటం ఆలస్యమవుతోంది. నాకు ఈ నష్టం తప్పనిసరి అవుతోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, పూలో జిజ్జి ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 348

కాన్పూర్,

22.10.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది, చదివి సంతోషించాను. తావూజీకి నిన్న వ్రాసిన ఉత్తరం ద్వారా 'తమరు' బాగున్నారని, సర్వేష్ ఆరోగ్యం కూడా బాగయ్యిందని తెలిసి సంతోష మయ్యింది. నాకు వైద్యం బాగానే జరుగుతున్నది. కనుక, నా గురించి తమరు చింతించవద్దు. మంచం మీద నుంచి లేవరాదన్న కఠిన నియమం కారణంగా, ఇంటి వద్దనే ఇంజక్షన్ తీసుకుంటున్నాను. అంతా ఈశ్వరేచ్ఛ. ఇప్పుడు నా అణువణువూ 'మాలిక్' ఖరీదు చేశారంటే నమ్మండి. నా జీవన్మరణాలు రెండూ 'అతని' కొరకే, రెండూ సమానమే. నేను మాత్రం మిషన్ యొక్క సేవకురాలినే. దాని ప్రతి పనికొరకు సర్వదా సిద్ధంగానే ఉన్నాను, ఉంటాను కూడా. నేను పండుకొని ఉండి కూడా స్వామి వివేకానంద వ్రాసిన జ్ఞాన యోగం అను పుస్తకం చదివించుకుంటున్నాను. ఇంకొకటి ఏమిటంటే, దంత వైద్యుడి కోడలు ద్వారా వివేకానందుని ఉపన్యాస సంకలనాన్ని తెప్పించుకుని చదువుతాను. జ్ఞాన యోగం పుస్తకంలో మన మిషన్ ప్రణాళిక యొక్క మంచి విధానం, ఇంకా అనేక విషయాలు ఉన్నాయి. అది చాలా మంచి పుస్తకం, కొనుక్కుంటాను. నా ఉత్తరం చూశాక, తమ యొక్క ఈ అత్యంత సేవకురాలు, కుమార్తె అయిన నామీద తమరు అత్యంత కృప మరియు దయ కలిగి, నాకు పరిపూర్ణత్వం సిద్ధింపజేయటానికి తమ హృదయం ద్రవించ నారంభమవుతుంది. ఆధ్యాత్మికతలో ఏదైతే ప్రాప్తం కాగలదో, దానిని 'తమరు' నాకు ప్రసాదించకుండా ఉండరు అంటే నన్ను విశ్వసించండి. దీనితోపాటుగానే ఈ మాట కూడా నిలబెట్టుకోవటానికి కూడా ప్రయత్నిస్తాను. అది ఏమిటంటే, ఎప్పుడు, ఎవ్వరు కూడా "ఈమె రామచంద్రా మిషన్ సభ్యురాలు" అని నాకు వ్యతిరేకంగా వేలెత్తి చూపరాదు, అని. ఇటువంటి దృఢ సంకల్పాన్నే 'మాలిక్' నాకు ప్రతి విషయంలోను ప్రదానం చేస్తూ ఉన్నారు. నేను 'మాలిక్' కొరకే మరణిస్తాను, అయినా కాని నోటి నుంచి "ఇదేమీ లేదు, ఇదేమి లేదు" అనే శబ్దం వెలువడుతుంది. నా శారీరిక బలహీనత కూడా నెమ్మదిగా మెరుగుపడుతోంది. తరచుగా ఎప్పుడైతే 'మాధుర్యమూర్తి' (మనోహర రూపాన్ని) దర్శనం కొరకు నా హృదయం తపిస్తుందో, అప్పుడు 'మాలిక్' స్వప్నంలో దర్శనం కల్పిస్తాడు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో, ఆత్మిక దశ అనేది ఎక్కడి నుంచో రావటం లేదని, స్వతహాగానే ఆంతరికం నుంచే స్వయంగా వెలువడుతోందని అనిపిస్తోంది. ఏదైనా రావటం, పోవటం అనేది అనుభవం కావటం లేదు. అలా అనిపించటమే కాదు, వాస్తవంగా దశ రావటం పోవటం అనేదే జరగటం లేదు. శ్రీ బాబూజీ! వాస్తవం చెప్పాలంటే,

నా స్వంత స్వరూపం (ఐడెంటిటీ) లేదని, ఉండకూడదు అని చెబుతామో, ఇప్పుడు దాని శుద్ధరూపం తెరచుకుంటూ పోతోంది అన్నట్లు అనుభవమవుతోంది. ఇప్పుడు సూక్ష్మ శరీరం యొక్క అంగాలు, గుర్తులు (చిహ్నాలు) కనుమరుగైపోతూ ఉన్నట్లు అనిపిస్తోంది. అలాకాదు, అసలు సూక్ష్మ శరీరమే కరిగిపోతున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు కలుగుతున్న దశ ఎటువంటిది అంటే, లోపలి నుంచి బయటకు ప్రేమసాగరం (Ocean of Love) పొంగిపొర్లుతున్నట్లు అనిపిస్తోంది. అయితే అది సాగరం అయినందువలన చిందటం లేదు. ఆంతరికంలో ప్రేమ సాగరం అలలు లేపుతోంది. దానిలో పరమానందం యొక్క అలలు ఎగసిపడుతున్నాయి (అనగా పరమానందంలో పారవశ్యం చెందుతున్నట్లు భావించవచ్చు).

పూజ్య శ్రీ బాబూజీ, (Perfection) పరిపూర్ణత్వం గురించి నాకు కొంచెం కూడా పట్టదు, ఎందుకంటే, ఏ రోజు అయితే పరిపూర్ణుడైన మూర్తిమత్వం యొక్క దర్శనం, తమ దర్శనం కలిగిందో ఆనాడే నాకు పరిపూర్ణత సిద్ధించింది. ఇది నాకే కాదు, ఎవరికైతే తమపట్ల భక్తి కలుగుతుందో, వారికి ఈ (Perfection) పరిపూర్ణతయేగాక సమస్తం లభిస్తుంది అని నేను ఘంటాపదంగా చెప్పగలను.

అమ్మ తమకు శుభాశీర్వాదాలు, పూలో జిజ్జీ ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన<br>కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 349

కాన్పూర్,<br>26.10.1953

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందిందని భావిస్తున్నాను. నాకు నెమ్మది నెమ్మదిగా ఆరోగ్యం మెరుగుపడుతోంది. విచారించకండి. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు **ఈ దశ బ్రహ్మదర్శన దశగా చెప్పవచ్చు.** చాలా పరిశుద్ధమైన రూపంలో ఎల్లప్పుడూ ఉంటున్నది. ఈ **బ్రహ్మదర్శనం** ఎలా ఉంది అంటే, దానిలో అనగా దాని సారంలోనే నిరంతరం మునిగి ఉంటున్నట్లు ఉంది. నా రూపమే బ్రహ్మంగా అయిపోయింది. దశ చాలా స్వచ్ఛంగా ఉంది. బాబూజీ, ఇప్పుడు నా ప్రపంచమే వేరొకటిగా ఉంది. అక్కడ ఏదో ఒకటి మాత్రమే ఉన్నట్లు అనిపిస్తోంది. వాస్తవానికి ఆ ఒకటి కూడా ఏమీ లేనట్లు చూస్తున్నాను. అదేమిటో దైవానికే తెలియాలి. ఇప్పుడు మాటలే స్ఫురించకపోతుంటే ఏమని వ్రాయాలి. బాబూజీ, ఇప్పుడు ఈ దశలో ఎలా ఉందంటే, స్నానానికి ఆలస్యమైనా లేక డాక్టర్ రోజూ స్నానం చేయవద్దని చెప్పినప్పటికీ, నేను స్నానం చేసినా, చేయకపోయినా కూడా నేను మురికిగా గాని లేదా అసహ్యంగా ఉన్నట్లుగాని అనిపించటం లేదు. అంతేకాదు, నేను నిత్యం పరిశుభ్రంగానే ఉంటున్నాను. అందువలన నాకు శారీరక కర్మల ప్రాముఖ్యత ఏమీ లేకుండాపోయింది. వాస్తవంగా చెప్పాలంటే, 'పరమానందం' అంటే ఏమిటి? నేనయితే 'ఏమీ లేదు' అంటాను. అది మూగవాని నోటిలో బెల్లం స్థితి వంటిది (అనగా దాని రుచిని అతడు వ్యక్తం చేయలేడు). వాస్తవానికి, పరమానందం అంటే ఏమీ కాదని, అది ఆత్మకు చెందిన ఒక అనుభూతి వంటిది అని నాకు అనిపిస్తోంది. అదొక విధమైన పరిశుభ్రమైనది, దాని వెనుక దాగి ఉన్న 'శూన్యం' యొక్క నీడ (Shadow of 'Nothingness') మాత్రమే అన్నట్లు ఈ దశ కొనసాగుతోంది. పరమానందం యొక్క మహిమ ఎందుకు అనుభవం కావటం లేదు అంటే, దశ పరమానందం యొక్క పరిధిని (Screen of 'Bilss') ఛేదించుకొని అవతలి తీరం గురించిన అనుభూతి చెందుతోంది. **ఇంకొక రకంగా చెప్పాలంటే, ఆ ఆనందం యొక్క మూలం నాలోనికి పీల్చుకుపోయి, పలుచనైపోయినందు వలన పైనున్న దశ యొక్క దృశ్యం (మెరుపు) నాకు అనుభవమవుతోంది. నేనయితే నిరంతరం బ్రహ్మంలోనే స్థిరంగా ఉంటున్నాను. కాదు కాదు, నా రూపమే బ్రహ్మగా అయిపోయింది. ఇది 'అహం బ్రహ్మాస్మి' దశ అయినా కాని**

**అందులో అహం లేకపోయి శుద్ధంగా ఉంది. (అనగా 'నేనే బ్రహ్మం' అను మాటలో 'నేను' లేకుండాపోయింది అని అర్థం.)**

పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నా నుంచి ఏదో ప్రవహిస్తున్నట్లుగాను, చిందుతున్నట్లుగాను అనుభూతి చెందుతున్నాను. అది పూర్తిగా స్వచ్ఛమైన బ్రహ్మగా అనుభవమవుతోంది. ఇంకా ఏమిటంటే, నా ఆంతరికం, బాహ్యం **అంతా బ్రహ్మజ్యోతితోనే మెరుస్తూ ఉన్నట్లు ఉంది.** ఆ మెరుపు అనేది శుద్ధత్వం, పవిత్రతల యొక్క ప్రతిబింబంగా ఉంది. ఇప్పుడు సూక్ష్మశరీరం కరిగి కరిగి దాని అస్థిత్వాన్నే కోల్పోయిందని అనిపిస్తోంది. ఇప్పుడు ఉన్నదిగాని, లేదా జరుగుతున్నదిగాని అయిన దశ, ఏమీలేదు అను దాని అడుగు (లోతు) నుంచి ప్రతిబింబిస్తున్నట్లు అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు ఏమి అనుభవమవుతున్నదంటే, **బ్రహ్మ కూడా పూర్తిగా శుద్ధమైనది కాదని, దాని అడుగున ఏదో తప్పక ఉండి ఉంటుందని తెలుస్తోంది.** అలా ఉన్నదానిలో ఎంతో కొంత మాధుర్యం ఉన్నట్లు అనిపిస్తోంది కాని అది చెప్పనలవికాదు. **ఇప్పుడు ఇంక బ్రహ్మ అవస్థ యొక్క ప్రవాహం నాలోకి పీల్చుకుపోతున్నది. బాబూజీ నేను (Blotting paper) అద్దుడు కాగితంలాగ అయిపోతున్నాను.** ప్రతిదశ, ప్రతిదీ నాలో పీల్చుకుపోతున్నాయి, ఇంకేం వ్రాయమంటారు. 'మాలిక్' కూడా అణువణువునా, కణకణంలోనూ వ్యాపించిపోయారు. దీనిని నేను అనుభూతి చెందానా, లేదా అని ఇంకెవ్వరైనా ప్రయత్నించినట్లయితే వారికి కూడా ఇదే అనుభవమవుతుంది. నాకు ఇంకా ఏమీ అనుభవం కావటం లేదు, నేను కూడా స్వయంగా నా లోపలకు పీల్చుకుపోయాను.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 350

షాజహాన్‌పూర్,
31.10.1953

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం 26.10.1953వ తేదీగలది ఇప్పుడే చేరింది. నీ ఉత్తరంలోని విషయాలు పరిశీలించిన తరువాత, ఇటువంటి ఉన్నత స్థితులు నా జీవితకాలంలోనే చూడగలిగినందుకు ఆనందంతో నా శరీరం ఉప్పొంగిపోయింది. **ఇక్కడ మిషన్‌లోని అభ్యాసులు, వారు తమ ఆలోచనలతోనే తీరికలేకుండా ఉన్నారు. కొందరైతే నేను ఒక్కసారిగా వారికి అంతా సమకూర్చగలననే ఆశతో పెనవేసుకుని ఉన్నారు. లక్షల జన్మలు గతించినప్పటికీ తమ స్వస్థానానికి (గమ్యానికి) చేరలేకపోయారు సరికదా ఇప్పటికైనా అటువంటి ఆలోచన కలగటం లేదు. అలా వెళ్ళాలని ఎవ్వరూ కోరుకుకొనకపోతే నేను ఏమి చేయగలను!** ఇది అంతా ఈశ్వరుని చేతిలో ఉంది, 'అతడు' తలచుకున్నప్పుడు అది జరుగుతుంది. **నాకు తెలిసిన కొద్దిపాటి ఆధ్యాత్మిక పరిజ్ఞానాన్ని ప్రజలు తెలుసుకోవాలని ఆశిస్తున్నాను.** దీనిని పొందిన తర్వాత కూడా ప్రజలు ఇంకా తెలుసుకోవాలనే తపన ఉండి, అది ఇంకెవ్వరి దగ్గరైనా పొంది, నాకంటె ఆధ్యాత్మిక ఉన్నత శిఖరాలకు చేరినట్లయితే, దానికి నేను ఎంతో సంతోషిస్తానని నిస్సంకోచంగా చెప్తున్నాను. నేను ఎంత, నా ఆధ్యాత్మికత ఎంత? (అల్పం అని భావం) నా గురించి నా గురుమహరాజ్ (లాలాజీ సాహెబ్)కు మాత్రమే తెలుసు. **నేనయితే అనంతంలో ఈదుకుంటూ పోతున్నానని మాత్రం గట్టిగా చెప్పగలను.** దానికి అంతు అంటూ లేదు. కనుక ఆత్మోన్నతి విషయంలో ఇంకా ఎంత దూరం ఈదసాగాలి అనేది నా అంచనాకే అందనపుడు, ఎంతదూరం మిగిలి ఉందని నేను మాత్రం నా అభిప్రాయాన్ని ఏమని చెప్పగలను! నేను ఒక విషయం స్పష్టంగా వ్రాస్తున్నాను. అది ఏమిటంటే, ఎక్కడైనా, ఎవ్వరైనా, ఎప్పుడైనా ఏదో విధంగా దీనిని తెలుసుకోగలిగినవారు తటస్థపడి, దానిని జనం కూడా ముఖ్యంగా మన మిషన్ సభ్యులు తెలుసుకోగలిగినట్లయితే తమ జీవితాంతం పశ్చాత్తాప పడవలసి ఉంటుంది. (అనగా ఈ విషయం తాము ఇంతకుముందుగానే గ్రహించలేకపోయామే అనే వ్యధ.)

బిటియా! కారణం ఏమిటోగాని, నేను బాగా చెబుతూనే ఉన్నాను, అలాగే వ్రాస్తూనే ఉన్నాను, కాని చాలామంది వాటిని శ్రద్ధగా ఆలకించటం లేదు. దీనిని నేను నా బలహీనతగాను, తప్పుగాను భావిస్తున్నాను, బహుశా నేను రాటుతేలకపోవటంవల్లనేమో. నా మాటలు, సిట్టింగ్‌లు వారిపై ప్రభావం చూపటం లేదు. కొందరైతే కులాభిమానం వీడలేక, ఆ కారణంతో ఒక ఉన్నత కులంవాడు, ఒక తక్కువ కులంవాడిని చూసినట్లు నన్ను చూస్తున్నారు. నేను జన్మించిన కులం ఉన్నత కులస్థుల దృష్టిలో తక్కువ కులంగానే భావించబడుతుంది. **వారి దృష్టి అంతా నా దేహం, కులం మీదనేగాని వారికి ఉపయోగపడే ఆధ్యాత్మిక స్థితిమీద కాదు. దీనిని గురించి నాకు ఏమీ బాధలేదు.** నేను వారి కాలి క్రింద త్రొక్కబడిన చీమలాంటి వాడినేకాని, పట్టుకుంటే కుట్టి బాధ కలిగించే కీటకంలాంటి వాడిని కాదు. కులాభిమానం లేదా కులం గొప్ప అనే భావం ఒక పెద్ద అవరోధం. దీనిని ఎవ్వరైనా సరే తొలగించుకోవాల్సిన ప్రథమ అవసరం. ఇటువంటి బలహీనతలు కలిగిన ఉన్నతకులంలో జన్మించకుండా చేసినందుకు దైవానికి వేలకొలది ధన్యవాదాలు అర్పిస్తున్నాను. కబీర్‌సాహెబ్ ఎంతో చక్కగా వివరించాడు:

**నీచ నీచ సబ్ తర్ గయె, సంత్ చరణ్ తవలీన్ ।**

**జాతి కె అభిమాన్‌సె, బూరె సకల్ కులీన్ ॥**

తక్కువ కులం వారు యోగుల చరణ మాశ్రయించి ముక్తి పొంది ఉండగా ఉన్నత జాతి లేదా కులదర్పంతో విర్రవీగినవారు దానిలోనే మునిగిపోయారు- అని భావం.

నీ ఉత్తరానికి జవాబు వ్రాయాడానికి ముందుగా క్లుప్తంగా **జీవుడు, బ్రహ్మం** గురించి వ్రాయాలనుకుంటున్నాను. గ్రంథాలలో ఏమి వ్రాయబడి ఉన్నదో నాకు తెలియదు. నా గ్రహింపులో ఉన్న దానిని వ్రాస్తున్నాను. గ్రంథాలలో ఉన్న దానితో ఎవ్వరైనా సరిపోల్చుకోవాలని అనుకుంటే పోల్చుకోవచ్చు.

**('I' ness) 'తన' ఉనికి యొక్క భావం కలిగినపుడు జీవునకు తన జీవత్వం గురించి, బ్రహ్మత్వం నుంచి వేరుగా ఉన్నట్లు అర్థమైంది.** వేరు లేదా ఇతరము అను స్థానంమీద అది కూర్చుని ఉండటంవలన జీవత్వ భావన అనగా ద్వైత భావం కలిగింది. **ఈ భావం అనగా అహంభావం వలన అతనిలో ఆలోచన పెరిగి పెరిగి అనేక రకాలుగా రూపాంతరం చెందింది. అనగా ఒక అనుభూతి కలిగి అనేక అనుభూతులకు దారి తీసింది. ఏకత్వం నుంచి అనేకత్వం ఆవిర్భవించింది.** దాని ఫలితంగా ఆశ, మోహం, ప్రతి విషయంమీద మోజు కలగసాగాయి. ఇంకా చెప్పాలంటే, బంగారు పక్షి ఒక లోహ పంజరంలో బంధించబడిపోయిన కారణంగా దాని బ్రతుకుతెరువు కోసం అన్నపానాదులు అవసరమయ్యాయి.

ఈ జీవత్వం గురించిన మాటలు ఇంక ఏమని చెప్పమంటావు. ఆ జీవికి ఎవరైనా సందర్భవశాత్తు నీవు అసలు (వాస్తవం) అయి ఉన్నావు అని దృష్టికి తీసుకువస్తే అప్పుడు ఆ జీవి యొక్క బాహ్యావరణలు తొలగిపోసాగుతాయి. మనం జీవులం కనుక మన ఉన్నతస్థితిని గురించిన సమాచారం అనగా 'బ్రహ్మ' గురించి ఆలోచింపచేసింది. వాస్తవానికి ఇవి రెండూ ఒక్కటే. నేను ఇప్పుడు చదువురానివారి భాషలో కొంత వివరిస్తాను. జీవునిలో చలనం ఉంది కనుక ఆ జీవునికి చలనం కలిగి ఉన్న దాని గురించే తెలుస్తుంది. అయితే అది ఎవరు? **అతడు బ్రహ్మ. బ్రహ్మ శబ్దం, 'బ్ర' మరియు 'మననం' నుంచి వెలువడింది. అనగా చలనం మరియు ఆలోచన అని అర్థం.** జీవుని అల్పశరీరంలో ఏ క్రియలు జరుగుతాయో అవి బ్రహ్మ యొక్క భారీ శరీరంలోనే జరుగుతాయి. **బంధనాలు అనేవి జీవునిలోను, బ్రహ్మలోను కూడా ఉంటాయి. ఇంతకీ ఉన్న భేదం ఏమిటంటే, జీవునిలో అవి ఎక్కువగాను, స్థూలంగాను ఉండగా బ్రహ్మలో సూక్ష్మంగా ఉంటాయి. అయితే వారి వారి స్థాయికి తగ్గట్లు ఇద్దరిలోను పరిమితులు ఉంటాయి.** వేదాల ననుసరించి 24 లేక 26 రకాల 'బ్రహ్మ' లుంటాయని వ్రాయబడింది అని ఒక విద్యావంతుడైన సన్యాసి నాకు చెప్పాడు. **దీనిలో ఆఖరి బ్రహ్మను 'భూమా' అంటారు.** దీనికంటె ఉన్నతమైన స్థితిని మహాత్ములు, పరబ్రహ్మ అని

నిర్వచించారు. అయితే ఈ వాస్తవికత (రియాలిటి, అసలు, మూలం) యొక్క స్థితులు ఎన్ని కలిగాయో చెప్పలేము. దాని సంయోగాన్నిబట్టి అది ప్రభావితం కావటం జరిగింది.

మన ఉన్నతిలో ఉన్న అవరోధాలు, ఆటంకాలకు తగ్గట్లు అదే కోవకు చెందిన బ్రహ్మతో మనం ముడిపడి ఉంటాము. నేనయితే ఈ స్థితులు అన్నింటినీ బంధనాలుగానే అంటాను. **మన గమ్యస్థానం 'భూమా' వద్ద గాలికిగాని, వెలుతురుకుగాని ప్రవేశం లేదు. అది ఒక ఆరిపోయిన దీపగృహం వంటిది. అక్కడ ఎటువంటి అద్భుతంగాని, చలనంగాని ఉండదు. అందరూ కాంతి, కాంతి అంటూ గగ్గోలుపెడుతూ ఉంటారు. ఇవి అన్నీ ఆ దివ్య మార్గంలో దర్శనం ఇస్తాయని నేను కూడా అంగీకరిస్తాను కాని ఆ గమ్యం లేదా మాతృస్థానానికి మనం చేరేసరికి ఇవన్నీ అంతరించిపోతాయి. మనం (ప్రకాశం) కాంతినే కోరుకుంటున్నట్లయితే, ఒక మిణుగురు పురుగును మహాత్ముడు అని పిలవటానికి సందేహించవలసిన అవుసరంలేదని నేను భావిస్తాను. ఎందుకంటే, అది తన కాంతితో ఇతరులను ప్రకాశింపజేసినట్లు గాను, దాని దగ్గర కాంతి ఉన్నట్లు ఋజువవుతున్న కారణంగాను.** ఎవరో ఒక చక్కని వర్ణన ఇలా చేశారు –

**"హమ్ జహాఁ హైఁ, వహాఁ సే హమ్‌కో భీ, కుచ్ హమారా ఖబర్ నహీ ఆతీ."**

మనం ఎక్కడ ఉన్నామో, అక్కడి నుంచి మన యొక్క సమాచారం మనకు కూడా తెలియదు– అని అర్థం.

ఇప్పుడు నేను నీ స్థితిని గురించి వ్రాస్తున్నాను. **"బ్రహ్మ కూడా పవిత్రంగా లేదు, అతనిలో కూడా ఏదో కొంత ఉంది"** అని నీవు వ్రాశావు. దీనికి సమాధానం నేను ఇంతకుపూర్వమే వ్రాశాను. "దానిలో ఆకర్షణ మరియు సౌందర్యం ఉన్నాయి" అని కూడా నీవు వ్రాశావు. **ఈ ఆకర్షణ మరియు సౌందర్యం ఉన్నంతవరకు, దానిని అసలైన బ్రహ్మం అని చెప్పటానికి వీలుపడదు. ఎందుకంటే, అక్కడ మాయ యొక్క ప్రభావిత ప్రాంతం సూక్ష్మస్థితిలో ఉంది.** నేను మీ అందరినీ ఇటువంటి శూన్యావరణంలోకి తీసుకువెళ్ళాలని అనుకుంటున్నాను. అక్కడ ఉన్న శూన్యత కూడా వేయిరెట్లు భారంగా ఉంటుంది. వాస్తవానికి మానవునికి సంప్రాప్తం కాగలిగిన పరిపూర్ణత అదే. మన సంస్థలో ఇటువంటి పరిపూర్ణతను పొందాలనుకునేవారు చాలామంది ఉన్నప్పటికీ, అందుకు తగిన శ్రమ (సాధన) మరియు భక్తి కొరకు వారి అలసత్వం కారణంగా ముందడుగు పడటంలేదు. ఒకవేళ ఎటువంటి శ్రమలేకుండానే భగవంతుని దయతో ఈ స్థితి కలగటమే జరిగితే, ఫలితం ఎలా ఉంటుంది? అప్పుడు ఈ స్థితిలో ఆనందంకాని, రుచించతగినది కాని ఏమీ అనుభవం కానందున నన్ను చూడటానికి కూడా ఎవ్వరూ ఇష్టపడరు. ఆనందకర స్థితులను నేను ఇంతకుపూర్వం ఎన్నో చూశాను కాని ప్రస్తుతం ఉన్న స్థితి ఆనందంగా లేనిది. దాని నుంచి ఒక్క సెకను కూడా వేరుపడి ఉండటానికి నేను ఇష్టపడను. ఎవ్వరైనా నన్ను, నీవు నీ ప్రాణాన్నైనా త్యాగం చెయ్యి, లేకుంటే ఈ స్థితి నుంచైనా వెదొలగు అని అన్నట్లయితే అప్పుడు నేను హృదయపూర్వకంగా ప్రాణత్యాగం చేయటానికే సిద్ధపడతాను. ఆ స్థితిని గురించి వర్ణించటం అసాధ్యం. దానిని వర్ణించటానికి మాటలు దొరకవు, నోరు పలకదు.

నీ వర్తమాన స్థితిని బ్రహ్మ–దర్శన స్థితిగా నీవు వ్రాశావు. బ్రహ్మస్థితి ప్రతిస్థానంలోను సూక్ష్మాతి సూక్ష్మంగా కలుగుతూనే ఉంది కనుక నీవు సరిగ్గానే వ్రాశావు. ఇప్పుడు ఉన్న బ్రహ్మ యొక్క అనుభూతి 'V' స్థానానికి సంబంధించినదై ఉండగా దానిలో లయ–అవస్థ ఇంకను ఉత్పన్నం కాలేదు. నీకు కొద్ది కొద్దిగా సూచన ఇస్తూనే ఉన్నాను; నీవు అనారోగ్యంగా ఉండటం వలన ఆ స్థితి నిదానంగా తెరచుకోవాల్సి ఉంది. కనుక నీవు ఇప్పుడు ఆరోగ్యకరంగా ఉండటం నీ విధిగా ఉంది. **"నా రూపం బ్రహ్మ రూపంగా అయిపోయింది"** అని నీవు వ్రాశావు. ఇది బ్రహ్మ రూపమే అని అందరూ చెప్పగలరు కాని నేను ప్రత్యేకించి నీ గురించి వ్రాస్తున్నది ఏమిటంటే, **హిరణ్యగర్భ స్థితి నుంచి నీవు చాలా ఉన్నతంగా ఎదిగిపోయావు.** నీవు ఉన్న స్థానంలో స్వచ్ఛత చాలా అధికంగా ఉంది. ఈ స్థితిని కూడా నేను బంధనస్థితిగానే తెలియజేస్తున్నాను. ఎప్పుడైతే స్వచ్ఛత మరియు అస్వచ్ఛత రెండూ అనుభూతికి రాకుండాపోతాయో అప్పుడు వాస్తవికత

(రియాలిటి) ప్రారంభమవుతుంది. వాస్తవికత స్థితి తర్వాత ఇంకను లెఖ్ఖలేనన్ని స్థితులు ఉంటాయి. ఇప్పుడు స్వచ్ఛత, అస్వచ్ఛత గురించిన ఆలోచన పెట్టుకోకూడదని జ్ఞాపకం ఉంచుకోవాలి. సహజసిద్ధంగా ఏవైతే స్థితులు కలుగుతూ ఉంటాయో వాటి అనుభూతి చెందుతూ ఉండు. క్రమక్రమంగా ఆ స్థితిని కూడా భగవంతుడు అనుగ్రహిస్తాడు. ఇప్పుడు నీ స్థితి **"అహం-బ్రహ్మాస్మి దశగా ఉంది"** అని నీవు వ్రాశావు. ఇది నిజమే కావచ్చు. బిటియా! అయితే ఈ స్థితి ప్రతి స్థానంలోనూ, ప్రతి సందర్భంలోనూ అనుభవమవుతూనే ఉంటుంది. ఎంతగా ఉన్నత స్థితి కలుగుతూ ఉంటుందో దానికి తగ్గట్టుగా మంచి రూపంలో అది దర్శనం అవుతూ ఉంటుంది. దీనిని గురించి నేను ఏమి వ్రాయను? నన్ను విశ్వసించేది ఎవరు? నేను ఏదైనా నోరు విప్పితే దానిని వేదాంతులు తప్పుబడతారు. అది వేద వాక్యాలకు విరుద్ధంగా కూడా ఉండవచ్చు. మనకు **అహం-బ్రహ్మాస్మి** అను భావన కలిగినపుడు, తప్పనిసరిగా మనం దానిని మరొక దానితో పోల్చి వేరుగా ఉన్నట్లు తలుస్తాము. మనకు తెలియనిది ఏదో తప్పకుండా తేడా ఉన్నట్లు భావన కలిగిస్తూ ఉంటుంది. దీనిని తాత్విక దృష్టితో అర్థం చేసుకొనవలసి ఉంటుంది. ఈ భేదభావం ఎప్పుడైతే అంతరించి పోతుందో, అహం-బ్రహ్మాస్మి అనిగాని, దానికి విరుద్ధమైనదిగాని, తలంపుకు రాకుండా ఉంటుందో అక్కడ అసలీయత్ (వాస్తవికత, రియాలిటీ) ఉంటుంది. చూడు బిటియా! చెప్పటానికి అయితే పూర్ణత్వం (Perfection) సిద్ధించింది అని చెప్పవచ్చునేమోకాని, ఇంకా ఏమి మిగిలి ఉన్నాయో చెప్పలేం. అనగా ఈ స్థితికి చేరాక కూడా గమ్యం ఇంకా దూరంగానే ఉంది. బిటియా! నేనింకా ఏమి వ్రాయాలో చెప్పు. దీనికిమించి ఇంకా ఎంతోకొంత వ్రాయవచ్చును కాని అర్థం చేసుకునేవారు, విశ్వసించేవారు ఎవరు ఉన్నారు! అయినప్పటికీ దీనికిమించి ఒక్క విషయం వ్రాస్తున్నాను. అది ఏమిటంటే, **ఆ పూర్ణస్థితిలో ఉన్నత స్థాయికి చేరిన తర్వాత సూక్ష్మత్వం పూర్తిగా నశించిపోతుంది.** అయితే దీనికిమించి వర్ణించటానికి మాటలు లేవు. **నేను ఇంకా చెప్పదల్చుకున్నది ఏమిటంటే, ఈ స్థితికి (సూక్ష్మత్వం నశించిన తర్వాత) చేరిన తర్వాత భూమా పరిసరానికి చేరటానికి వేల సంవత్సరాలు కూడా చాలవు. అనగా ఆ దశ (సూక్ష్మత్వం పూర్తిగా తొలగిపోయే దశ)కు చేరటానికి వేలకొలది సంవత్సరాలు పట్టడమేకాదు, భూమాను చేరటానికి ఇంకా ఎన్ని మెట్లు ఎక్కవలసి ఉంటుందో కూడా తెలియదు. నా గురుమహరాజ్ (లాలాజీ సాహెబ్)కు మించి మరెవ్వరికీ ఈ స్థితులను దాటించగల దివ్యశక్తి లేదని నేను అనుకుంటున్నాను. జీవించి ఉండియే ఈ దశలు అన్నింటినీ దాటగల అవకాశాన్ని అన్వేషించినవారు 'వారు' (లాలాజీ సాహెబ్) మాత్రమే.**

**తమ ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) శక్తితో ఒక్క సెకను కాలంలో ఆ అంతిమస్థితికి చేర్చగలిగిన అనగా అసాధ్యమైన దానిని సుసాధ్యం చేయగలిగిన ఆ మహామనీషికి ఎంతగానో ధన్యవాదాలు తెలపాలసి ఉంది. ఆధ్యాత్మిక చరిత్రలో కనీ వినీ ఎరుగని మహానుభావుణ్ని, అటువంటి మహిమాన్విత కార్యాన్ని చేసి చూపిన వారిని మనం కళ్ళతో చూడలేక మనం నిజంగా అంధులమై ఉన్నాం. ఈశ్వరుడు మనందరికీ ఈ స్థితి (భూమా గమ్యం)ని అనుగ్రహించుగాక!**

**ఇది చాలా మహత్వపూర్ణమైన ఉత్తరం కనుక, నీవు లఖీంపూర్ వెళ్ళేటపుడు దీనిని తీసుకుని వెళ్ళి మాస్టర్ సాహెబ్‌గారి ఫైలులో భద్రపరచేటట్లు చేయాలి.**

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర